
# డా: నా.డి'సోజగారి కథలు

కన్నడ మూలం




తెలుగు అనువాదం

శాఖమూరి రామగోపాల్

# డా: నా.డి'సోజగారి కథలు

కన్నడ మూలం



తెలుగు అనువాదం

## శాఖమూరు రామగోపాల్

# డా: నా.డి'సోజగారి కథలు

కన్నడ మూలం

తెలుగు అనువాదం

శాఖమూరు రామగోపాల్

**"Dr.N.D'SOUZA GAARI KATHALU"**
Original Kannada by
**Dr: N.D'Souza**
15/14, IInd Cross, Nehru Nagara
Sagar-577401 (Shimoga) Karnataka
Ph : 08183 - 227240, 09880635245

Translated into Telugu by
**Sakhamuru Ramagopal**
H.No. 5-10, Road No.21, Deepthisri Nagar
Miyapur Post, Hyderabad-500 049
Telangana State, Cell : 9052563666

| | | |
|---|---|---|
| Size | : | 1/8 Demy |

© Sakhamuru Rama Gopal

| | | |
|---|---|---|
| First Edition | : | 2016 |
| Price | : | Rs.300/- |
| Copies | : | 1000 |
| Paper Used | : | 70 gsm Light weight maplitho |
| Pages | : | 294 + 6 = 300 |
| Cover page | : | Monappa |
| DTP | : | Smt. Kudupudi Varalakshmi/Bhaskar Rao<br>Manu Graphics, Chikkadpally Hyderabad<br>Cell : 93 93 83 40 50 |
| Printing | : | Visalaandhra Printing Press |
| Distribution | : | Visalaandhra Publishing House<br>Chandram Buildings, Chuttugunta<br>Vijayawada-4, Ph : 0866 2430302<br>Andhra Pradesh. |

# అంకితం

కన్నడ భాషా కథా రచనలో
అత్యుత్తమ కథా రచయితగా పేరు గడించిన
**డా. రాజశేఖర నీర్‌మాన్వి** గారికి
భక్తితో ఈ పుస్తకాన్ని అంకితం చేస్తున్నాను.
డా. రాజశేఖర్ గారు రచించిన కథలు పద్దెనిమిది మాత్రమే.
వీరి ఐదు కథలు బాసుచటర్జీ నిర్మాణ దర్శకత్వంలో
హిందీ, బెంగాలి భాషలలో చలన చిత్రాలుగా రూపొందించబడినవి.

**– శాఖమూరు రామగోపాల్**

ಪುಸ್ತಕ ಪ್ರಚುರಣಕು ದೋಹದಪಡಿನವಾರು:

**ಡಾ|| ಅಲ್ಲಮಪ್ರಭು ಬೆಟ್ಟದೂರು, ಕೊಪ್ಪಳ** (ಕೊಪ್ಪಳ ಜಿಲ್ಲಾ)

**ಶ್ರೀಮತಿ ರುಕ್ಮಿಣಿ ಪೆಂಡಕೂರು, ಹಗರಿ ಬೊಮ್ಮನಹಳ್ಳಿ** (ಬಳ್ಳಾರಿ ಜಿಲ್ಲಾ)

# నామాట

ప్రియమైన పాఠకులకు,

మీ ముందున్న ఈ పుస్తకం నా నుంచి ప్రచురించబడిన పదకొండో అనువాద రచనగా ఉంది. డా:నా.డి'సోజగారు షిమోగా (శివమొగ్గ) జిల్లాలోని సాగరపట్టణంలో 06-06-1937న జన్మించారు. చదివింది ఇంటర్ వరకు. గడించింది అపార అనుభవం. టైపిస్ట్‌గా రెవిన్యూ డిపార్ట్‌మెంట్‌లో చేరి తదుపరి పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో ప్రథమశ్రేణి గుమాస్తాగా ఉద్యోగ విరమణ చేశారు. చదివింది తక్కువైనా ఎన్నో విశ్వవిద్యాలయాలనుంచి గౌరవ డాక్టరేట్లను పొందారు. వారు కథకుడిగా నవలా రచయితగా సాహిత్యకృషి చేసారు. వారి కథలు నాటకాలుగా, టి.వి. సీరియళ్ళగా, సినిమాలుగా మారినవి. వారి ఆరు కథలు చలనచిత్రాలుగా రూపొందించబడినవి. ముఖ్యంగా వారి నవల 'ద్వీప' సినిమాగా రూపుదాల్చి జాతీయ స్థాయిలో స్వర్ణకమలం పొందింది. మరెన్నో విభాగాలలో పురస్కారాల్ని పొందింది.

వారి కథలు హింది, ఇంగ్లీషు, మళయాళం, తుళు, కొంకణి భాషలలోకి అనువదించబడినవి. తెలుగులో వారి కథలు నానుంచి రావటం, నా సుకృతంగా భావిస్తున్నాను. వారు పొందిన పురస్కారాల్ని పట్టి రూపంలో పెట్టాలంటే మూడు పుటలు చాలవు. పురస్కారాలన్నీ వారిని వెతుకుతూ వచ్చినవి.

పురోగామి, తిరోగామి, మధ్యేగామిగా విభజించబడిన సాహిత్యలోకంలో వీరు మధ్యేగామిగా గుర్తుంచుకోబడి రచనలు చేశారు.

మడికేరి (2014)లో జరిగిన 80 అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనంలో అధ్యక్షుడిగా కార్యభారం మోసారు. క్రైస్తవకుటుంబంలో జన్మించిన వీరు తమ సమాజంలోని మంచి చెడులు మరియు తన జన్మస్థలం అయిన మలెనాడులోని గ్రామీణ పరిసరాలు,తమ పనిచేసిన పి.డబ్ల్యు.డిలోని నిగూఢ విషయాల్ని కథావస్తువుగా తీసుకొని సహజకథలు అన్నట్లుగా రచనలు కొనసాగించారు.

సుఖ సంతృప్తి జీవితం గడుపుతూ సాగర పట్టణంలో నివసిస్తున్నారు. ఈ పుస్తకం మీముందు ఉండేదానిలో బెంగళూరు నివాసి అయిన పెండెకూరు గురుమూర్తిగారి ప్రోద్బలం ఎంతో ఉంది. నా.డి'సోజగారి రచనల్ని అనువదించమని కోరింది నేను మరువలేను కదా...! నా.డి'సోజగారి రచనల మీద ఎంతోమంది ఎమ్‌ఫిల్, పిహెచ్‌డి చేసారు. వీరి రచనలు (కథలు) డిగ్రీ విద్యార్థులకు కన్నడ విభాగంలో పాఠ్యాంశాలుగా చేరినవి.

ఇంతియే

తమ విశ్వాసి

**శాఖమూరు రామగోపాల్**

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | నీచగోడులోని క్షుద్రులు | 001–13 |
| 2. | సెల్వియా అనే యువతి | 014–21 |
| 3. | వారంతా ఇప్పుడు సుఖంగా ఉన్నారులే | 022–34 |
| 4. | సముద్రంకు నిప్పుపడింది | 035–41 |
| 5. | మైలు(ఫర్లాంగు)రాళ్ళకు రంగులేసేందుకని వచ్చిన యువకుడు | 042–51 |
| 6. | హాల్టింగ్ బస్సు | 052–68 |
| 7. | ఇద్దరు దేశ భక్తులు ఒక రోడ్డు రోలరు | 069–78 |
| 8. | దేవాలయంలోని దేముడికి శిలువ వందనం | 079–88 |
| 9. | దురభిమానులు | 089–97 |
| 10. | వేలిముద్ర ఒత్తేవాడు | 098–109 |
| 11. | మోడల్ హౌస్‌లోని కాపలాదారుడు | 110–115 |
| 12. | బండార (పసుపు ప్రసాదం) | 116–126 |
| 13. | నాయకుడికి వారసుడు జన్మించాడండి! | 127–140 |
| 14. | మంత్రి మహోదయుడు | 141–147 |
| 15. | గోడగడియారాలు అమ్మే అవ్వ | 148–158 |
| 16. | కుర్చీకి చెందిన కథకు ఒక కొత్త మలుపు | 159–164 |
| 17. | అడవిదున్న | 165–176 |
| 18. | ఇక్కేరి గుడిమీద విమానం ఎగిరింది... | 177–185 |
| 19. | ద్వీపం | 186–202 |
| 20. | అలీబాబా గారి మనోవ్యాధి | 203–243 |
| 21. | తారుకు సంబంధించిన కథ | 244–257 |
| 22. | ముగ్గురు ముసలోళ్ళు... ఒక పాత భవనం | 258–275 |
| 23. | దిష్టి అవ్వ – బెణుకు అవ్వ | 276–286 |
| 24. | కాగోడుకు బస్సు వచ్చింది | 287–294 |

# అనువాదకుడి నుంచి ప్రచురితమైన రచనలు

| | |
|---|---|
| 1. వాల్మీకి | 2010 |
| 2. కృష్ణారెడ్డిగారి ఏనుగు | 2011 |
| 3. పర్యావరణ కథలు | 2011 |
| 4. శ్రేష్ఠ కన్నడ కథలు తెలుగులో | 2012 |
| 5. చినరావూరిలోని గయ్యాళులు | 2012 |
| 6. మాటతీరు | 2013 |
| 7. డా.వెలిగండ్ల కుబేరనాథరావు మరియు ఇయాళ | 2013 |
| 8. కువెంపు (వ్యక్తిగా మరియు వ్యక్తిత్వ పరంగా) | 2014 |
| 9. గడీలో దొరల పాలన | 2014 |
| 10. ప్రొఫెసర్‌గారి విశిష్ట యాత్రా కథనాలు | 2015 |
| 11. డా:నా.డి'సోజా గారి కథలు | 2016 |

# నీచగోడులోని క్షుద్రులు

ఆకుపచ్చ శాలువా కప్పుకొన్న ధరుమయ్య మెరకప్రాంతాన్ని ఎక్కి భవంతి చెంతకొచ్చిన పిమ్మట, పారంపరయ్య అప్పుడే భోజనం ముగించి, ఎంగిలాకును ప్రక్కకు విసిరేసి పారుతున్న సెలయేరులో చేతిని కడుక్కొని భవంతి ముందుకొచ్చాడు.

"రండి... రండి ధరుమయ్యహెగ్డెగారు" అంటూ పారంపరయ్య స్వాగతించిందే గాకుండా హడావుడిగా అరుగుమీద గొంగడి పరిచి, ఆకువక్కలు సున్నం ఉన్న కంచుపళ్ళాన్ని దానిమీదపెట్టి, సింహద్వారం వద్ద పాదరక్షలు వదిలి లోపలికి వస్తున్న ధరుమయ్యతో "భోజనం ముగించుకొనే బయల్దేరి ఉండొచ్చేమో?" అని నసుగుతూ, తను అడిగింది పద్ధతిగా లేదేమోనని శంకిస్తూ పలికాడు లౌక్యంగా.

ధరుమయ్య గొంగడిమీద కూలబడి కంచుపళ్ళాన్ని దగ్గరకు లాక్కొంటూ, ఆకులకున్న ఈనెల్ని తొలగిస్తూ "లేదండి... భోజనం భుజించే వచ్చాను... ఎలాగూ ఇక్కడ సువాసనాభరితమైన తాంబూలం దొరికేది గుర్తులే... మీ భోజనం కూడా అయిపోయి ఉండొచ్చని భావించే వచ్చానండి..." అన్నాడు.

"ఔనండి... అపరూపంకని గసగసాల పాయసాన్ని చేయించాను... రండి సుష్టుగా పాయసాన్ని తాగుదురుగాని" అంటూ రాగాన్ని ఆలపించాడు పారంపరయ్య.

"ఉండనీయండి... మరొకరోజు ముందస్తుగా చెప్పి ఆహ్వానించండి... మీ వద్దకు వచ్చేందుకు నేను వెనుకడుగు వేసేదేలేదు కదా..."

ధరుమయ్య వక్కను నోట్లో వేసుకొని కుటుం కుటుం అని కొరుకుతూ లేత తమలపాకుకు సున్నాన్ని పూయసాగాడు. ముఖ్యమైన ఒకవిషయాన్ని అతను పారంపరయ్య జతగా మాట్లాడాలని వచ్చాడు. వచ్చిన సమయం కూడా ప్రశస్థంగానే ఉంది కదా! పారంపరయ్య ఇంట్లోనే ఉన్నాడు, తిండి కూడా ముగించాడు. గొంగడి పరిచి తాంబూల పళ్ళాన్ని ముందు పెట్టుకొన్నాడు అన్నమీదట అతను బయటకెక్కడకూ వెళ్ళే కార్యక్రమం లేదు అన్నట్లుగా కనబడుతుంది. రానీ, అతనూ వచ్చి తాంబూల పళ్ళెంలో చేతిని నిలపనీ... తర్వాత మాటను ప్రారంభించుతాను అని ధరుమయ్య వేచి చూడసాగాడు. నిరీక్షించినట్లుగానే పారంపరయ్య వచ్చి తాంబూలపళ్ళెం మీద చేతిని నిలిపాడు. ఎందుకో ఏమో ఇంటిముందున్న పందిరి అవతల జామచెట్టు

వైపుకు తిరిగి వంగి చూసాడు. కూలబడ్డోడు తక్షణమే లేచాడు. అరుగు చివరున్న అంచుకు వెళ్ళి నిలబడి, వికారంగా ముఖం పెట్టుకొని బిగ్గరగా ధ్వని (స్వరం) పెంచి అరిచాడు.

"నీ పాడుబడ్డ ముఖం ఇకనూ తొలిగిపోలేదుకదా... సూర్యోదయమై వెలుగు కిరణాలు సోకిన తక్షణమే నీ దరిద్ర గొంగడిని కప్పుకొని వచ్చి ఇక్కడ గూటం కొట్టినట్లుగా కూర్చుండి పోయావు కదా... పొద్దు నడినెత్తికి చేరుకొన్నా ఇక్కడ్నుంచి తొలగిపోలేదు అంటే ఏమనేది నేను? ఇంటెనుక డబ్బుల చెట్టును నాటానా... నువ్వు అడిగినప్పుడల్లా పీకి ఇచ్చేందుకు? ఔన్రోయ్...నీకు ఎందుకురా నేను డబ్బు ఇచ్చేదుంది? ఇప్పుడిప్పుడు మీరు ధిమాకుతనం చూపిస్తుంది అసత్యమా?మొన్న ఉదయంలో బర్రె చనిపోయినప్పుడు మీకు కబురు పంపితే మీజనం వచ్చింది మధ్యాహ్నం తరువాతే కదా! క్రితంలో ఉత్తములు...ఉత్తములమాట అంటే మీకు వేదవాక్యంగా ఉంటుండేది... ఇప్పుడు? చూడురో మైల, ఇదే చివరిసారిగా చెప్తున్నా... పనిపాటు చేయకనే రొక్కం బియ్యం మిరియాలు ఉప్పు పప్పూ అంటూ నువ్వు రావద్దు... వచ్చి ఇలా నీ అస్పృశ్య ముఖాన్ని చూపెట్తూ రోజంతా ఇంటిముందు కూర్చోవద్దు. ఉత్తముల ఇంటిముందు ఇలాగున నీచకులపోడు పగలంతా కూలబడేది మంచిదికాదు..."

పారంపరయ్య లొడలొడా మాట్లాడుతూ లోపలికి వెళ్ళాడు. చేతిలో ఒకరూపాయి నోటు పట్టుకొని వచ్చి ప్రాంగణంలోకి దిగాడు. పందిరి చివరివరకూ వెళ్ళి వళ్ళు వంచి చేతిని చాపాడు. జామచెట్టు చాటునుంచి నల్లటిచేయి ఒకటి బయటకు చాపుకొంది.ఆ చాపినచేతి దోసిడిలో రూపాయినోటు విసిరి కాలును బలంగా కొట్తూ అరుగు ఎక్కాడు పారంపరయ్య. మళ్ళా జామచెట్టు వైపుకు తిరిగి... "ఇచ్చాను కదా వెళ్ళిక" అంటూ ఘర్జించాడు. జామచెట్టు క్రిందనుంచి మనిషి నీడ ఒకటి సెలయేరు వైపుకు వెళ్తుంది గమనించి గొంగడి పరిచిన చోటుకు వచ్చాడు.

"...ఈ నీచజనం పీడనుంచి బయటపడేది కష్టం అవుతుంది హెగ్డెగారు" అంటూ లేత తమలపాకుల్ని తీసుకోసాగాడు.

"పొద్దు పొడిచిందంటేచాలు... ఎనిమిదిఅణాలో... బియ్యమో... మిరపకాయలో ...ఉప్పో... చింతపండో.. ఛీఛీఛీ... వీళ్ళ ఉపద్రవం జాస్తి అవుతుందండి..." అన్నాడు.

అంత సమయంకే ధరుమయ్య నాలుగుసార్లు తాంబూలాన్ని నమిలాడు. ధరుమయ్య మరికలేచి ప్రాంగణంలోకి దిగాడు. పందిరి చివర అంచుకువెళ్ళి నోట్లో ఉన్న తాంబూలం పిప్పిని సర్రునే ఊసి మళ్ళా అరుగు ఎక్కాడు.

"... హాం! నేను వచ్చింది ఈ అలగాజనం విషయం మాట్లాడేందుకే" అంటూ ధరుమయ్య మాటను ప్రారంభించేందుకు మంచి లింకే (లింక్) దొరికిందిలే అనే ఉత్సాహంతో ఉన్నాడు.

"ఔనా... నేను వాడితో చెప్పింది, ప్రవర్తించింది తప్పని అంటారా? పైన పారేనీళ్ళు పైనే పారాలి. క్రింద ప్రవహించే నీళ్ళు క్రిందనే ప్రవహించాలి...ఇది దేముడు, ధర్మం, సాంప్రదాయం అని ఒప్పుకొని వస్తున్న ఆచారవిచారం కదా... అయితే ఈ క్షుద్రజనం అని మనం ఎవర్ని దూరంగా నెట్టామో... వాళ్ళిప్పుడు మన ఇళ్ళ తలుపుల చెంతకే వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు... ఔను, మీరే చెప్పండి హెగ్డెగారు... క్రితంలో ఒక శూద్రుడైనా మన దొరల ఇళ్ళముందు పందిరి చెంతకు... వచ్చింది ఉందా?"

"లేదండి...శూద్రులకు ఇంటెనుక ఉండే పశువులకొట్టం చాటున కొంచెం జాగ ఉంటుండేది. అక్కడికివచ్చి నిలబడి దగ్గి, క్యాకరించి, అయ్యా, అమ్మా, పటేలా అంటూ గంటలపాటు విలపిస్తూ నిలబడేవాడు. చూసినా చూడనట్లుగా మన ఇంటి పరివారం వాడ్ని అలక్షించేదుంది. ఎంతో పొద్దు అయిన మీదట ఎవరో మనోళ్ళొకరు... కాళదు వచ్చినట్లుంది చూడమనో,మారడేమో అయ్యుండొచ్చనో... అని చెపుతుండేవారు. వాడు దేనికోసం వచ్చాడనేది కూడా ఇంటిపరివారంకు తెల్సి పోతుండేది. క్రితంలో శూద్రులకు డబ్బుఇచ్చే పరిపాఠి లేదండి... పాతబట్టలో, చిరిగిన గొంగడో, ఇంట్లో పాచిందో, పులిసిందో ఉంటేదాన్ని....ఎప్పుడో ఒకసారి పావుసేరు సన్నబియ్యాన్నో, రెండు మిరపకాయల్నో, నాల్గుగుప్పిళ్ళ ఉప్పునో... దానంగా ఇస్తుండేవాళ్ళం కదా!"

"ఔను కదూ...ఇప్పుడేమో పొద్దైతే చాలు... ఇంటి సింహద్వారం చెంతకే వస్తున్నారు వీళ్ళు. ఉదయమే లేచి మనం సూర్యదర్శనం చేసుకొనేందుకు బదులుగా, శూద్రదర్శనం చేసుకొనే కర్మ దాపురించింది కదా! వీళ్ళకు ఈ రోజు డబ్బు ఇవ్వాలట. చనిపోయిన పశువుల్ని తీసుకెళ్తే డబ్బు ఇచ్చేదుంది. తోటలో పాదులచెంత గడ్డి, ఆకు అలం కప్పితే డబ్బు ఇవ్వాలి. రెండురోజులు తోటలో పనిచేస్తే, ఎరువు మోసుకెళ్తే, కొట్టంను శుచిగా శుభ్రపరిస్తే కూలి..." అంటున్న పారంపరయ్య దేహం కంపించ సాగింది. కోపం నుంచి అతను చింతనిప్పు కణికలన్నట్లుగా నిగనిగగా మండిపోసాగాడు.

"ఆ...వీడు మైలడు...ఉదయం ఏడుగంటలకే ఇంటిముందుకొచ్చి రెండు రూపాయలు ఇవ్వండి అని మొరబెట్టుకొన్నాడు. దేని గురించో మీకు గుర్తా? మొన్న మా బర్రె ఒకటి చనిపోయింది. ఉదయం ఎనిమిది గంటలనుంచి పన్నెండు గంటలదాకా కొట్టంలోనే పడియుంది. గంవ్అని ఈగలమ్రోత. మనం ముట్టుకొనేది లేదు... దాన్ని తొలగించేది లేదు. వీళ్ళుండే పల్లెకు కబురు పంపితే వీళ్ళు శీఘ్రమే రాలేదు. మధ్యాహ్నంకు వచ్చారు. ఈ రోజు ఇతను డబ్బుకని వచ్చాడు. మొదటగా నాలుగురూపాయలు అడిగాడు. అప్పుడు ఆ బర్రెను మోసుకెళ్ళేందుకు వచ్చినోళ్ళు ఇద్దరు కదా! తలా రెండ్రెండు రూపాయలు ఇవ్వండని అడిగారు. చివరికి తలా ఒక

రూపాయి ఇవ్వండని మొక్కారు. మొత్తానికి ఒక రూపాయి ఇచ్చి పంపాను. చనిపోయిన పశువును తీసుకెళ్ళేందుకు ఈ జనం డబ్బు అడిగేది న్యాయమేనా? పశువు నుంచి వచ్చే మాంసం, చర్మం వాళ్ళకే కదా దక్కేది... వాళ్ళకు దాన్లోనూ లాభం ఉండాలి. మోసుకొని వెళ్ళే దాన్లోనూ లాభం దొరకాలి... వారెవ్వా... ఏమి వ్యాపారం ఇదండి...!"

"ఔనౌను పారంపరయ్య... నేను గతం (భూతకాం)లో ఎలాగుండేది అని చెప్పాను ఇంతకు మునుపే. మీరు ఈ రోజు (వర్తమానంలో) ఎదురైన పరిస్థితిని చెపుతున్నారా? రేపు (భవిష్యత్‌లో) ఏమి జరగబోతుందనేది మీకు గుర్తేనా?"

"భవిష్యత్‌ను కల్పించుకొనేది కష్టమేమి కాదులెండి... పేడపెంటను మోసుకెళ్ళే దాన్నుంచి చచ్చిన పశువుల్ని మోసుకెళ్ళే పనుల్ని ఉత్తములే (అగ్రకులస్థులే) చేయాల్సి వస్తది. భవిష్యత్‌లో ఈ శూద్ర ముండాకొడుకులు అగ్రకులాలోళ్ళ పనిపాట్లును చేసేందుకు కచ్చితంగా వచ్చేది లేదండి.."

"మీకు మరొక విషయం గుర్తులేదు పారంపరయ్యా... ఇక ఒక నెలలో మన ఊర్లో ఉండే శూద్రులు, అస్పృశ్యులు, క్షుద్రులు వేరొక మతంలో చేరేదుంది. అలాగైతే వాళ్ళ స్థానమానం అంతా పెరిగిపోతది. అప్పుడిక వాళ్ళు మన తలలమీద కాళ్ళు పెట్టి బతికేందుకు దూసుకు రాగలరు.."

"ఏమంటున్నారు ధరుమయ్యహెగ్డెగారు... మతమార్పిళ్ళ గాలి మన ఊరుకూ వస్తదా..."

"వచ్చేదే కాదండి... బలంగా వీస్తది కూడా... ఆ విషయం చెప్పేందుకే నేను వచ్చింది మీ వద్దకు."

❖ ❖ ❖

శూద్రులు, అస్పృశ్యులు, క్షుద్రులు అని అగ్రకులాలోళ్ళ నుంచి పిలుచుకోబడి బతుకుతున్న జనం వేరొక ఉత్తమ మరియు బలాఢ్యమతంకు పరివర్తితులై వెళ్ళే విషయాన్ని ధరుమయ్యహెగ్డె పారంపరయ్యకు వివరంగా చెప్పసాగాడు.

గ్రామంలో ఉన్న పది అగ్రవర్ణ కుటుంబాలంటే ధరుమయ్య హెగ్డె, పారంపరయ్య, లోలాక్షయ్య, హొంబహెగ్డె, గగనరాయ, సిద్ధరామయ్య, దశరథరామయ్య, మల్లికార్జునయ్య, బలరామయ్య, ఓబులేశయ్య కుటుంబాలు మాత్రమేనండి! వీళ్ళలో కొంతమందికి వక్కతోటలుంటే, మరికొంతమందికి వరిపొలాలు ఉన్నవి. వీళ్ళెవరూ తోటలలోగాని, మాగాణి భూములలోగాని శ్రమించి సేద్యం చేసేవాళ్ళుకారు. శ్రమించి సేద్యం చేసేది కూడా తమ అగ్రవర్ణజాతికి అవమానం అని నమ్మేటోళ్ళు. వక్కచెట్లను ఎక్కేదిగాని, గెలలు తెంచేదిగాని, వక్కల్ని వలిచేదిగాని, మడిలో నారుపోసి, పైరునాటి

పంట తీసేదిగాని తమ ఘన అంతస్థుకు సరికాదని భావించేటోళ్ళు కదా! శ్రమించి ఉత్పత్తిని వెలికితీసేదంతా నిమ్నకులాలోళ్ళ నుంచే అని నమ్ముతుండేవారు. ఇలాగున తోటలలో మాగాణిభూములలో పనులు చేయాలనే ఈ పదికుటుంబాలోళ్ళ తోటలు, పొలాల దిగువున నీచకులాలోళ్ళ ముప్పై కుటుంబాలు ఉండేవి.

ఉచ్చ(అగ్ర) కులస్థులు అని పిలుచుకోబడే జనుల ఇళ్ళు, పొలాలు, తోటలు ఉన్న ప్రదేశం ఉచ్చాపురం అని పిలువబడుతుంటే, నీచకులస్థులైన ముప్పైకుటుంబాలు ఉండే ప్రదేశం నీచగోడు అనే పేరును పొందియుంది కదా! ఉచ్చాపురం లోపలంతా ఎన్నో సెలయేర్లు ఉన్నవి. ప్రతియొక తోట, పొలంఒడ్డున ఒకొక సెలయేరు ప్రవహిస్తున్నందున, ఉచ్చాపురంలోని శ్రీమంతుల ఇళ్ళ వాడకంకు, స్నానపానాదులకు, కాళ్ళుచేతులు ముఖం కడిగేందుకు కూడా ఈ సెలయేర్లనే ఆశ్రయించుకొని ఉంటుండే వారు. ఎల్లప్పుడూ స్వచ్ఛమైన స్ఫటికజలం ఈ సెలయేర్లలో గుడుగుడు అంటూ ప్రవహిస్తుండేది. తోటల చెంత మెరకమీద భారీ భవంతులు, భవంతుల ముందు పెద్దపందిర్లు, భవంతిలో విశాలమైన అరుగులు, అరుగులమీద మడత కుర్చీలు, పరిచిన జంపఖాన, గొంగడి, గోడలమీద సకలదేవదేవతల, ఇంటి పూర్వీకుల పెద్ద చిత్రపటాలు వేలాడుతుండేవి. ఎల్లప్పుడూ నవ్వుతూ తుళ్ళుతూ తళతళగా మెరుస్తూ గజనిమ్మపండు వర్ణంతో శోభిల్లుతూ తిరుగుతుండే మహిళలు పిల్లలూ ఈ భవంతులలో నివసిస్తుండేవారు. తాలూకాస్థాయి పట్టణంలోగాని, జిల్లాకేంద్రంలోగాని ఖుషీకని తిరిగి అప్పుడప్పుడు గ్రామంకు వచ్చి ఇలాగున వచ్చినప్పుడల్లా కబుర్లలోనో, ఇస్పీట్ ఆటలలోనో కాలాన్ని గడిపే పురుషపుంగవులుగా ఉంటుండేవారు. ఇది ఉచ్చాపురంకు సంబంధించిన ప్రపంచం అండి! ఈజనం మూడు కాలాలలో సుఖసంపదలతో నెమ్మదితనంతో హాయిగా ఉంటుండేవారు. దేనికీ కొరత, క్షామం లేదుకదా! కడుపారా తిని, పట్టుపీతాంబరాలు కట్టుకొని సంతోషంగా ఉంటుండేవారు!

నీచగోడు, ఉచ్చాపురంనుంచి ఒక మైలో మైలున్నర దూరానో క్రిందుండే లోయలో రెండు కొండల మాటున ఉండి ఉండనట్లుగా ఉంటుండేది. కూలినగోడలు, గోడలేలేని కొంపలు, రెల్లుగడ్డితోనో వక్కమట్టల నుంచో కప్పిన గుడిసెలు, తడికలతో ఉన్న సింహద్వారం, ఇంటిముందు గజంబారుకు మాత్రమే ఉన్న ప్రాంగణం, దాని అంచున అంట్లుతోమే స్నానం చేసేగది, ప్రాంగణంలో పచ్చిమాంసాన్ని లాగుతూ పీకుతూ కొట్లాడే ఊరకుక్కలు, ఆ నీచగోడులోని ముప్పైకుటుంబాలకు ఒక చెఱువు, దాన్లో అశుచిగా ఉండే ఎరుపునీళ్ళు ప్రతి ఒకదానికి (త్రాగేందుకు, వాడేందుకు) ఉపయోగ పడేటట్లుగా వాడుకోబడుతుండేది. ఆ జనమంతా ఒంటినిండా బట్టలు లేనోళ్ళుగా,

కడుపునిండా తినవోళ్ళుగా ఉండే దుస్థితి ఉంది కదా! వాళ్ళందరికీ చేతినిండా మూడుకాలాలలో పనులు మాత్రం తప్పనిసరిగా ఉంటుండేవి. వీళ్ళకు ఉచ్చాపురంలోని తోటలలో, చేను చెలకలలో, ఆ ఉత్తముల పశువుల్ని కాసేపని, పశువుల కొట్టాల్ని శుభ్రం చేసే కార్యం, ఆయా దిబ్బగుంతలనుంచి ఎరువును పొలాలకు తరలించే కార్యం... ఇలాగున ఒకటా రెండా ఎన్నో పనులు వాళ్ళ చేతులనిండా ఉంటుండేవి. ఈ యమయాతనల పనులకు వాళ్ళకు దొరికే కూలి అత్యల్పం కదా! పని ముగించి తమ పల్లెకు చేరుకొనేముందు దొరల ఇళ్ళలో మిగిలిపోయింది, పాచిపోయింది వీళ్ళకు దొరుకుతుండేది. బియ్యం, ఉప్పు, పప్పు,మిరప, చింతపండు, ఒకటో రెండో రూపాయలు కాళ్ళావేళ్ళాబడి దొరల ఇళ్ళనుంచి తెచ్చుకొంటుండేవారు. ఏదేమైనా వీళ్ళు గొంతెత్తి మాట్లాడేది లేదు. ఎందుకంటే వీళ్ళు క్షుద్రులు, నీచులు కదా! వీళ్ళ నీడ అగ్రవర్ణాలోళ్ళ మీద పడకూడదు. వీళ్ళవైపునుంచి వీచినగాలి ఉత్తముల వైపు వీచకూడదు. వెలుగుకిరణాలు సోకినప్పుడు వీళ్ళ ఆకృతులు వాళ్ళ కళ్ళల్లో పడకూడదు. వాళ్ళ భవంతుల లోపలికి వెళ్ళే,వాళ్ళ గుడి లోపలికి వెళ్ళే(ప్రవేశించే) మాట దూరంగానే ఉండిపోయేది. వాళ్ళ పశువులకొట్టంలో చనిపోయిన జంతువుకు, వాళ్ళ ఇళ్ళలో వయోభారంతో వృద్ధులు చనిపోతే వాళ్ళు కట్టిన బట్ట, పడుకొన్న మంచం(తల్పం)కు వీళ్ళు యజమానులండి!

ఉచ్చాపురం వాళ్ళంటే నీచగోడువాళ్ళకు ఎల్లప్పుడూ భీతి ఉండేది. వాళ్ళ కోపతాపాలకు ఎన్నడూ బలిగాకూడదనే ఎచ్చరిక వీళ్ళలో ఉంటుండేది. ఎందుకంటే అగ్రవర్ణాలోళ్ళకు కోపంవస్తే క్షుద్రుల ప్రాణంకు అపాయం. ఒకసారి డొంకడేమో పశువుల్ని మేపేందుకు తోలుకెళ్ళిన లోలాక్షయ్యగారి గిత్తను అడవిలోనే వదిలి వచ్చినందున లోలాక్షయ్య డొంకడి కాలును సరిగానే విరగగొట్టాడు.మారణ్ణడి కొడుకైన కిరియగాడు పారంపరయ్యగారి తోటలోకి అక్రమంగా ప్రవేశించి అరటిగెలను దొంగిలించాడని అతడ్ని పారంపరయ్య మూడురోజులు తోటలోని వక్కచెట్టుకు కట్టిపడేసాడు. కాళడి అర్ధాంగి దాసి ధరుమయ్య గారి పెద్దకూతురుకు ఏదో భోగలాలస కబుర్లు చెప్పిందని ధరుమయ్య చంద్రాకోలునుంచి ఆమెను కొట్టింది... ఇటువంటి వందలాది ప్రకరణాలు దిన నిత్యం జరుగుతున్నందున నీచగోడులోని క్షుద్రులంతా ఎల్లప్పుడూ ఎచ్చరికల నుంచే బతుకుతుండే వాళ్ళు. అయినా ఉచ్చాపురంలోని అగ్రవర్ణాలోళ్ళు ఏదేదో తప్పును వెతికి, తప్పుల్ని కనుగొని క్షుద్రుల్ని తమ కబంధ హస్తాలలో ఇరికించుకొనేందుకు ప్రయత్నిస్తూ వస్తుండేవారు. ఇంతగా కట్టుబాట్లలో ఉన్నా, ఇప్పుడిప్పుడు క్షుద్రులు కట్టుబాట్లను తొలగించుకొని పోయేందుకు

ప్రయత్నించసాగారు. ఇప్పుడేమో ధరుమయ్యహెగ్డె నుంచి వచ్చిన సమాచారం ఇకనూ భీకరంగా, భయానకంగా ఉంది కదా!

కొన్నిరోజుల క్రితం నీచగోడు వైపుకు వేరొక మతంకు సంబంధించిన జనం (మతప్రచారకులు) ఎక్కువ ఎక్కువగా రాసాగారు. చనిపోయిన బర్రెలు లేకపోతే ఎద్దుల చర్మంకని కొంతమంది బయటోళ్ళు అప్పుడప్పుడు నీచగోడుకు వచ్చేది ఉందికదా! ఈ జనంతో పాటు ఇంకా కొంతమంది రాసాగారు. ఇలాగున వచ్చినోళ్ళు నీచగోడులోని ఇళ్ళలోపలికి వెళ్ళి కూర్చోసాగారు. ప్రీతి విశ్వాసం నుంచి మాట్లాడించారు. నీళ్ళు తాగారు. తిండితిన్నారు. అణ్ణా,తమ్మి, అక్కా, చెల్లి అంటూ పిలవసాగారు. మీరు చేస్తున్న ఊడిగాన్ని వదిలిపెట్టండి. మేము మీకు జమీను ఇప్పిస్తాము. మంచిపనుల్ని కల్పిస్తాము. వెట్టినుంచి విముక్తి కల్గిస్తాము. ధనరూపేణా సహాయం చేస్తాము. ముఖ్యంగా మిమ్మల్ని మనుష్యులని గుర్తిస్తాము అంటూ చెప్పసాగారు. చెప్పటమే కాదు చేసి చూపించారు కూడా! నీచగోడులోని జనం కొత్త వెలుగును చూస్తున్నోళ్ళుగా కళ్ళు తెరిచి అటు ఇటు నిశితంగా చూసేది చేయసాగారు. మొదటిసారిగా వేరొక మతంకు చెందిన జనం వీళ్ళను ఆత్మీయంగా ఆలింగనం చేసుకొన్నారు. మీరూ మాలాగే మనుష్యులే అని బోధించసాగారు. మీరు మాతోపాటు చేరుకొంటే మీకు సరైన రాజ్యాంగ రక్షణనూ మేము ఇప్పిస్తాము అని భరోసా ఇచ్చారు. ఇందుచేత నీచగోడులోని జనం క్రమేణా కొత్త మతం వైపు వాలసాగారు.

"ఇక ఎక్కువరోజులు పట్టేదిలేదు... వాళ్ళంతా వేరే మతంకు చెందినోళ్ళుగా మారిపోతారు" అంటూ ధరుమయ్య పటేల్ శాలువాను తీసి మడిచి పట్టుకొన్నాడు. తోటనుంచి, అడవి నుంచి వీస్తున్నగాలి కొరుకుతున్నా ఎందుకో ధరుమయ్యహెగ్డెకు ఉష్ణంగా అనిపించింది. అంతలో ఉచ్ఛాపురంలోని మరికొంతమంది అక్కడికి వచ్చి కూర్చున్నారు. లోలాక్షయ్య హడావుడిగా తన ఇంట్లో తిండి ముగించి వచ్చి తాంబూల పళ్ళెంలో చేయిపెట్టాడు. హొంబహెగ్డె సిగిరెట్ తాగుతూ కూర్చున్నాడు. గగనరాయుడేమో పొగాకు పొడుం ఉండను చుట్టుతున్నాడు. అందరూ దిగులు నుంచి మాటలలోకి జారారు.

"ఇది అత్యంత అపాయకరమైన మార్పు కదా! నీచగోడులో ఉండే జనమంతా ఆ మతంలో చేరితే మనందరి కథ ముగిసిపోయినట్లే" అన్నాడు గగనరాయుడు.

"ఔను స్వామి... ఈ నీచజాతోళ్ళంతా వేరే మతంకు చేరితే మన పశువులకొట్టాలలో చనిపోయే పశువుల్ని మోసుకెళ్ళేదెవరు? మన తోటలలో ఎరువుల్ని వేసేదెవరు?

తోటలలో పొలాలలో పనులు చేసేదెవరు?" అంటూ అటుఇటు చూసి మెల్లగా పారంపరయ్య చెవిలో లోలాక్షయ్య ఊదాడు.

"ఔనౌను... ఇంకా వేరే ఎన్నో పనులకు దొరికేవాళ్ళు ఎవరు?" అంటూ తల ఆడించాడు గగనరాయుడు. ఆ'ఔనౌను'అనేమాట వ్యంగ్యంగా కనబడింది లోలాక్షయ్యకు. నిజంగానే లోలాక్షయ్యకు ఇప్పుడొక దిగులు ఆరంభమైంది. తోటలో ఉన్న చిన్నచావిడి వద్దకు వెళ్ళినప్పుడల్లా, అక్కడ అతనికని వేచియుండేది గిడ్డడి భార్యైన తిమ్మి. ఆమె శరీరవర్ణం నలుపైనా ఏమి సౌందర్యం ఆమెలో! ఆమె దేహ సౌష్టవాన్ని వర్ణించేది లేదు కదా! అబ్బబ్బా జక్కణాచార్యుడు చెక్కిన శిల్పసుందరి కదా ఆమె! ఆమెలో ఉన్న ఎగుడుదిగుడు సంపద భాగాలన్నిటిమీదా చేతిని ఆడించి పట్టుకొంటుంటే అదొక కాముని పున్నమిపండగే కదా లోలాక్షయ్యకు! ఈ అక్రమ సంబంధం గిడ్డడికీ తెల్సులే! మొదటిసారి తిమ్మిని బలాత్కారం నుంచే గడ్డివామి చెంత సంభోగించాడు కదా మన లోలాక్షయ్యపటేల్. రోదిస్తూ లేచి వెళ్ళింది తిమ్మి. అరగంటలోనే గిడ్డడు వచ్చి లోలాక్షయ్య ఎదురు నిలిచాడు.

"ఏందిరో గిడ్డా... ఇటు వచ్చావు?"

గిడ్డడు కాళనాగులాగ బుసగొట్టాడు.

"ఏందిరో... ఏమైంది నీకు?"

"ఔను పటేలా... నేను మీ మహిళ మీద..."

కాలెత్తి అతని పొట్టమీద తన్నాడు లోలాక్షయ్య. గిడ్డడు ఎంతోదూరంకు ఎగిరెళ్ళి పడ్డాడు.

"క్షుద్రముండాకొడుకా... నువ్వెవరివి? నీ జాతి ఏంటనేది మర్చిపోయావా? నువ్వు నీచకులపోడివిగా పుట్టిందే ఉత్తముల (అగ్రకులస్థుల) సేవచేసేందుకే కదా! మీ జీవనం ఉద్ధారం అయ్యేది, మీకు పుణ్యం దొరికేది... మీరు ఉత్తముల సేవ చేసి వాళ్ళ ఎంగిలికూడు తిన్న తదుపరే కదా... ఔన్రోయ... తిమ్మిని నేను భోగించింది అనేది అది మోక్షంకు దారిరా... ఆమె జీవితం నా కలయిక నుంచి పావనమైంది... అది తప్పు అని ఏ ధర్మశాస్త్రం చెప్పేది లేదులే! అయితే నువ్వు అగ్రవర్ణాలోళ్ళ మహిళను పాడుచేసేది, కోరుకొనేది ఘనఘోరపాపం... ధర్మశాస్త్రంకు విరోధం."

కొంచెంసేపు ఆగి మళ్ళా అన్నాడు ఇలా లోలాక్షయ్య:

"తిమ్మి రేపూ నాకు కావాలి... ఎల్లుండీ కావాలి...శాశ్వతంగా కావాలి... తకరారు చేస్తే పరిణామం వేరేగా ఉంటది... నడువ్ అవతలకి.... విషయం ఆమెకూ తెల్పు...."

గిడ్డడు... తిమ్మి సరిగానే దారిలోకి వచ్చారు. రేపు వీళ్ళు వేరే మతంకు చేరుకొంటే? వీళ్ళ వెనుక బలిష్టమైన, బలాఢ్యమైన గుంపొకటి (మెజారిటిజనం) మద్ధతుగా నిలబడితే? అప్పుడు... ఈ నయనమనోహర శిల్పసుందరి...? తనలోని ఈ వ్యథ విరహాన్ని గగనరాయుడు గమనించే 'ఔనౌను' అని వ్యంగ్యంగా పలికియుండొచ్చేమో కదా! అట్లాగే భావించుకోనీ! దిగులు లేదులే! అయితే క్షుద్రులు వేరొక మతంలోకి చేరేందుకు పట్టు ఇవ్వకూడదు!

"అన్ని దృష్టి కోణాలనుంచి చూసినా ఇది అపాయకరమే కదా! ఈ ప్రదేశంలో మనకు చెందిన నికర కుటుంబాలు పదేలే... వాళ్ళవి ముప్పై కుటుంబాలు. ఇప్పుడైతే నికరంగా మనం అల్పసంఖ్యాకులమే! అయినా మనం అగ్రవర్ణాలోళ్ళం. రేపు తామంతా నీచ కులపోళ్ళు కాదు అనే అభిప్రాయం ఈ బహుసంఖ్యాకుల మనస్సులో నిలబడితే... అప్పుడు... ఓరినాయనో..."

"మనల్ని తొక్కిపడేస్తారు వాళ్ళు"

"తొక్కటమే కాదు... ఉప్పుపాతర వేస్తారు మనల్ని..."

"ఇక మనం బతికి బట్ట కట్టేది కష్టం అవుతది..."

గగనరాయుడు కంపించే స్వరంతో పలికాడు. అతనిదీ ఒక విధమైన వ్యథగా ఉందిలే. నీచగోడులోని క్షుద్రులకందరికీ అతనే పూజారి. మంత్రం తంత్రం తాయెత్తు హోంహీం మొదలైన విద్యను వంశపారంపర్యంగా నేర్చుకొన్న గగనరాయుడు నక్షత్రం జ్యోతిష్యం గణితం... అన్నిట్నీ నేర్చాడు. నీచగోడులోని ఏ ఇంట్లోనైనా బిడ్డకు జ్వరంరానీ, మహిళ జబ్బు పడి మంచం బారిన పడనీ, మగోడు చెట్టునుంచి జారిపడనీ, ఇంటికి అగ్గి తగిలి బూడిదగానీ, వేరే ఏ కష్టమైనా జరగనీ...ఆ జనం పాలుకు అది దెయ్యం, భూతం నుంచి కలిగిన బాధ, చేష్ట కదా... సరిసరి ఇక తాయెత్తు, బూడిద (భస్మం), మంత్రం, కాశిదారం మొదలైన వాటికి నీచగోడులోని జనం హడావుడిగా వచ్చేది గగనరాయుడి చెంతకే! పదెకరాలతోటతో పాటు ఈ నాటు వైద్యవిద్య కూడా అతనిలో చేరియుంది. నీచగోడులోని జనం ఎవరూ గగనరాయుడి భవంతి అరుగువద్దకు చేరేది లేదు. వాళ్ళకుండే జాగ పందిరికి అవతలవైపే. ఇతనే మెడచాపి...

'ఏంటే కెంపి... నీ బిడ్డకు ఉష్ణం పట్టిందంటే... నిన్నసాయంత్రం చౌడమ్మదేవి విగ్రహం ఉండే వనంవైపుకు వెళ్ళాడేమో నీ పుత్రుడు... గాలిచేష్ట కావొచ్చు... తీసుకో ఈ చిటికె భస్మాన్ని... బిడ్డ నోటిలో వేసి నీళ్ళు తాపించు... బాగైపోతది... ఎనిమిది అణాలు అక్కడ ఉంచు దేముడికి..."

భస్మం ఉన్న పొట్లాన్ని విసిరాడు. మరిక ఆమె ముందుకొచ్చి అరుగుమీద ఎనిమిది అణాలు పెట్టి వెనక్కి జరిగింది.

మరుక్షణంలో మరొకడు వచ్చాడు. చౌడడు, డొంకడు, గిడ్డడు. వీళ్ళందరికీ తలోరకమైన వ్యాధి బాధ. వీళ్ళందరికీ ఔషధాన్ని ఇచ్చే గగనరాయుడికి రేపు ఇదంతా ఆగిపోతే, నిల్చిపోతే?

నీచగోడులోని జనుల నమ్మకం, ధార్మిక శ్రద్ధ మార్పుచెంది వాళ్ళంతా వేరొక మతంకు చెందిన దైవాన్ని నమ్మేది ఆరంభించిన తదుపరి మరిక తన వద్దకు వచ్చేవాళ్ళు ఎవరు?

"ధరుమయ్యా... పరిస్థితి ఇట్లా ముందుకు దూసుకెళ్ళేందుకు మనం ఒప్పుకో కూడదు. మనం ఉండే ఉచ్ఛాపురంకు ఒక మైలుదూరంలో వేరొక మతంవాళ్ళు బలిష్ఠులై నివసించేది మనకు మంచిది కాదు... మన ధర్మంకు సంస్కృతికి మంచిది కాదు..."

"ఔనండి... మీరు చెప్పేది నిజమే. అయితే విషయం మన చేయిదాటిపోయింది... ఆ జనం నీచగోడులోని క్షుద్రులకు డబ్బు దస్కం ఇచ్చి, వాళ్ళ ఇళ్ళకు వెళ్ళి ఆలింగనం చేసుకొని, అణ్ణ, అక్కా, తమ్మి, చెల్లి అంటూ ఆలపించి ఆ క్షుద్రులందరన్నీ బుట్టలో వేసుకొన్నారు. క్షుద్రజనం ఆ మతంలోకి జారే విషయంలో ఉత్సుకులై ఉన్నారు... ప్రస్తుతంలోనే ఒక సమావేశం జరిగి ఈ జనం..."

"ఇలాగైతే మనం చేయబోయే ప్రయత్నాన్ని చేయాలి కదా... అనుచానంగా నడుచుకొని వస్తున్న ఒక పద్ధతి... ఇలాగున మనల్ని ముంచేది ఉంటే... ఓరి నాయనోయ్"

"ఈ విషయంలో ప్రభుత్వం మనకి సహాయం చేయదా...?"

"ప్రజా ప్రభుత్వానికి ఈ విషయంలో ఆసక్తిలేదండి... అంతేగాకుండా ఇది వ్యక్తి స్వాతంత్ర్యాన్ని ఆపి ఉంచే ప్రశ్న అయినందున మరిక ప్రభుత్వం దీనంతటిలో తలదూర్చేది లేదు..."

"ఏదైనా రాజకీయ పక్షం (పార్టి)మనకు సహాయం చేయొచ్చేమో..."

"అదీ అనుమానమే. మనకి సహాయం చేసేదుంటే వేరే వాళ్ళను ఎదుర్కొన్నట్లే కదా... ఓటుబ్యాంక్ మీద దృష్టి పెట్టే నాయకులు దీనంతటి మీద మన తరుపున ఉండేది లేదు కదా..."

"నీచగోడులోని జనాన్ని మతమార్పిడిలోకి దించే ప్రయత్నంలో కూడా రాజకీయం దాగియుంది... రాజకీయంగా తాము బలపడాలి అని ఆ జనం ఈ కుట్రను చేస్తున్నారు..."

"అది కూడా నిజమేనండి. అయితే వాళ్ళకు ఈ క్షుద్రులమీద నిజంగా ప్రీతికరుణ లేదండి... ఉన్నట్లుగా కపటనాటకం ఆడుతున్నారండి!"

"వాళ్ళు నాటకం ఆడుతున్నారా...?"

"ఏమైనా కానీయండి... మనం ఇప్పుడు నిదానించితే మనకే కష్టం అండి... మన అగ్రవర్ణం అంతా ఒక చోటచేరి ముందేమి చేయాలి అనే దానిమీద యోచన చేద్దామండి..."

"మనం ఇప్పుడు ఐదుగురం ఉన్నాము ఇక్కడ. మిగిలినోళ్ళూ వస్తే ఇక్కడే సలక్షణమైన తీర్మానం చేయొచ్చండి...."

"అలాగేనండి... నేనే ఖుద్దుగా వెళ్ళి మిగతావాళ్ళను పిల్చుకొని వస్తాను..." అంటూ హొంబహెగ్డె పంచె దులుపుకొని లేచాడు.

హొంబహెగ్డె ఉచ్ఛాపురంలో ఉండే మఠంకు పరిపాలనాధికారిగా ఉన్నాడు. అతనికి ఉండే ఐదుఎకరాల జమీనులో ఫసలు(పంట) అంతగా వచ్చేదిలేదు. పేరుకు అతనూ ఒక భూకామందుగా ఉన్నా, అతని జరుగుబాటు మాత్రం ఈ మఠాధిపత్యం నుంచేనండి! ఉచ్ఛాపురంలో ఉండే ఈ మఠం ఆ ప్రాంతంలో ఉండే అగ్రవర్ణాలో ళ్ళందరకూ పూజనీయమైంది కదా! నీచగోడులోని క్షుద్రులు కూడా ఈ మఠం మీద భయం భక్తితో ఉండేవారు. మఠంకు చెందిన ఇరవై ఎకరాల వక్కతోటలో నీచగోడులోని క్షుద్రులంతా వెట్టిచాకిరి చేసేదుంది. మఠంకు చెందిన పశువుల పాలనను వెట్టిచాకిరి నుంచి మేయించేదుంది. మఠం ముందు పెద్దపందిరి వేసేది, మఠం వెలుపల సమస్త చిల్లర పనుల్ని చేసేది, మఠంకు అవసరపడే వంట చెరకును సేకరించేది... నానాపనులూ నీచగోడులోని క్షుద్రుల పాలుకు సహజసిద్ధమైన పనులుగా ఉంటుండేవి. మఠంకు చెందిన పనులు చేయలేదంటే మరిక శాపం, తిట్లు, జరిమానాలు ఉంటుండేవి.

"మీ వెట్టి జీతగాడు మఠంకు చెందిన వార్షిక పనులు చేయలేదు" అని మరో దొరకు చెప్పి, ఆ మూలకంగా దొరనుంచి శిక్ష ఆ జీతగాడికి తగిలేటట్లుగా చేస్తుండేవాడు హొంబహెగ్డె.

హొంబహెగ్డె నీచగోడులోని జనంపాలుకు యముడేనండి. ఎర్రశాలువా కప్పుకొని మదించిన ఆంబోతులాగ అతను నీచగోడు చెంతనుండే చెఱువు వద్దకొచ్చి నిలబడి..

"ఎవరక్కడ... ఏయ్ మార... కాళ... గిడ్డ... పెంట్యా..." అంటూ అరిచితే నీచగోడులోని పురుషులంతా గడగడ వణుకుతూ వస్తుండేవారు. వచ్చి బారుగా ఒకే వరుసలో నిలబడి చేతులు ముడిచి నమస్కరిస్తుండేవాళ్ళు.

"చూడంగ్రో... జేష్టం పోయి ఆషాఢం వస్తుంది. మీరందరూ చేరి ఒకింతగా కట్టెల్ని కొట్టి మఠంలో చేర్చాలి" అతని అతను చెప్తే చాలు, ఒక నెలంతా వీళ్ళందరికీ ఈ కట్టెలు కొట్టే పని ఉంటుండేది. ఈ పనికి ప్రతిఫలం మఠం బయటుండే స్థలంలో ఒక పూట భోజనం అండి! కొంచెం ఆకు వక్కలండి! అంతేమరి! కట్టెల్ని కొట్టేటప్పుడూ హొంబహెగ్డె డేగకళ్ళు వీళ్ళమీదే! స్నానాలగదిలో ఒక రాశి, వంటింట్లో ఒక రాశి! కట్టెలు మరీ బారుగా లావుగా ఉండకూడదు. ఒకే కొలతలో ఉండాలి. మధ్య మధ్యలో దమ్ము (అలుపు) తీసుకొందామంటే హొంబహెగ్డెనుంచి కొరడా వీస్తుండేది.

"ఎవడ్రా వాడు... దివాన్ బహద్దూర్‌గాడు? మఠంకు చెందిన కూడు ఎక్కువైందా? నిద్రమంపు వస్తుందా...? భాంచోద్... లెగువ్.. పట్టుకో గొడ్డలి..."

... చేసే ఈ పనులన్నిటికీ మున్ముందు అడ్డు అదుపు ఎదురైతే అని భయపడ్డాడు హెగ్డె. ఈ నీచగోడులోని జనమంతా మతమార్పిడిలోకి జారితే, భవిష్యత్‌లో వాళ్ళను వెట్టిచాకిరికి పిల్చేదుంటదా? వస్తారా వాళ్ళు పనులకు? తన మాట వింటారా?

"మన పాలోళ్ళంతా ఇళ్ళలోనే ఉన్నట్లుంది... నేనే పిల్చుకొస్తా... మీరందరూ ఇక్కడే ఉండండి..." అంటూ హొంబహెగ్డె కాళ్ళలో చెప్పుల్ని ఇరికించుకొన్నాడు.

"ఔను! ఇదొక విషయం తీర్మానించుకొందాం తొందరగా... అందర్నీ తోలుకురండి..." అంటూ పారంపరయ్య గోడకు వెన్ను ఆన్చి విరామంగా కూర్చున్నాడు.

❖ ❖ ❖

ఎప్పటిలాగే నీచగోడులో సూర్యోదయం అయ్యింది. ఇళ్ళముందు పడుకొన్న శునకాల సంచారం మొదలైంది. పడుకొన్న పిల్లలు దిశమొలతో మేల్కొని ఇళ్ళముందు కొచ్చి ఏడ్చేందుకో ఆడేందుకో మరేదానికో నిమగ్నమైయ్యారు. చేతగాని శక్తిలేని వృద్ధులు జారిన పంచెను చీరను సరిచేసుకొని గొంగళ్ళు కప్పుకొని ఇళ్ళముందు పడిన సూర్యరశ్మికని మునిగాళ్ళ మీద కూర్చుని దేహానికి వెచ్చదనం చేసుకోసాగారు. పురుషులు మహిళలు ఉచ్చాపురంలోని పనులకని వెళ్ళేందుకు సిద్ధతలలో ఉన్నారు.

అప్పుడు ఉన్న పళంగా ఎవరది ఎవరది అనే ప్రశ్న ఇంటినుంచి మరో ఇంటికి దూసుకొచ్చి పడింది. నీచగోడులోని అన్ని ఇళ్ళనుంచి జనం బయటకొచ్చి తమ ఇళ్ళ ముందు నిలబడి, చెఱువు చెంతనుంచి నీచగోడుకు వస్తుండే దారివైపు చూడసాగారు. పెద్దగుంపొకటి అట్నుంచి పల్లెవైపుకు దిగి వస్తున్నారు. ఎవరు? ఎవరు వాళ్ళు?

వస్తున్నోళ్ళ మధ్యలో ఉచ్చాపురమఠంకు చెందిన శ్రీగురువు. వారికి అటుఇటు హొంబహెగ్డె, ధరుమయ్య, పారంపరయ్య, లోలాక్షయ్య, గగనరాయుడు, మల్లికార్జునయ్య, సిద్ధరామయ్య మరితర అగ్రవర్ణాలోళ్ళు ఉన్నారు. వాళ్ళ వారసులూ

ఉన్నారు. ఉచ్చాపురంలోని తరుణతరుణీయులు ఉన్నారు. అందరి ముఖాలలో నవ్వులు, ప్రీతి, కరుణ, వాత్సల్యం తొణికిసలాడుతుంది. అందరూ చక్కరకేళి అరటిగెలలు, పూలు, మామిడి ఫలాలు, బత్తాయిపండ్లు, దానిమ్మపండ్లు, పుట్టతేనె నింపిన బుట్టల్ని మోసుకొస్తున్నారు. కొంతమంది చేతులలో మైసూరు పట్టుపంచెలు, చీరలు... పిల్లలకని దుస్తులు ఉన్నవి. వచ్చారండి వచ్చారు వారంతా. క్షుద్రుల వారసులంతా (పిల్లలంతా) తల్లుల చాటున అవ్వల చాటున దాగియున్నారు. నీచగోడులోని మహిళలంతా చీర కుచ్చిళ్ళను సరిజేసుకొంటున్నారు. మగోళ్ళు బెదిరి నిలబడియున్నారు. వృద్ధులేమో ఎన్నడూ చూడని కానని ఈ ఘటన ఈరోజు ఎందుకు జరుగుతుందని కంగారైయ్యారు. మూగబోయారు. నోరెళ్ళబెట్టి కంటిరెప్పలు కొట్టకనే నీచగోడులోని క్షుద్రులు, ఉచ్చాపురంలోని అగ్రవర్ణం వాళ్ళు తమ పల్లెకు దిగివస్తుంది చూస్తూ స్థాణువులై నిలబడిపోయారు.

దారికి అడ్డంగా పారుతున్న మురికినీళ్ళు, పిల్లల మలమూత్రాలు, కుక్కలు తెచ్చి పడేసిన గొడ్డుమాంసం మూలిగలు, ఎండేందుకు పరిచిన జంతు కళేబరాల చర్మం, చేపల పొలుసు, ముళ్ళు... వీటన్నిట్నీ దాటుకొంటూ ఉత్తములు (అగ్రవర్ణంవాళ్ళు) భుజాల్ని చాపి, ముఖాన్ని చేటంతగా చేసుకొని క్షుద్రుల, శూద్రుల, అస్పృశ్యుల ఇళ్ళ ముందు నిలబడ్డారు. శ్రీగురువేమో (మఠాధిపతి) 'బంధువులారా, సహోదరులారా (సహ ఉదరంలో జన్మించినోళ్ళారా)' అంటూ చెప్పసాగాడు (ఉద్బోధించసాగాడు).

**మూలకథ రచనా కాలం : 1982**

# సెల్వియా అనే యువతి

**సూ**ర్యోదయం అయిన కొద్దిసేపటికే ఆమె వచ్చింది. "ఇప్పుడే ఎర్నాకుళం నుంచి రైలు దిగి వస్తున్నాను. డివినిటి కాన్వెంట్ వాళ్ళు నన్ను పంపారు" అంటూ ఆమె వరండాలో నిలబడి తన పరిచయాన్ని చెప్పుకొంటూ హ్యాండ్‌బ్యాగు నుంచి ఒక లెటర్‌తీసి నా చేతిలో పెట్టగా, అప్పుడు నాకు అంతా గుర్తుకొచ్చి "ఓ రండి... రండి" అంటూ ఆమెను స్వాగతించాను.

లోపలున్న గది తలుపు వైపుకు తిరిగి "చూడు, నిర్మలా, అమ్మను చూసుకొనేందుకు ఎవరో దాది వస్తారని చెప్పాను కదా వీరే ఆమె, వీరిని అమ్మ ఉండే గదికి తీసుకొని వెళ్ళు" అంటూ వచ్చినామెను సూక్ష్మంగా గమనించాను.

తెల్లటి కాటన్‌చీర, తెల్లటి రవికె, కాళ్ళలో సాదాగా ఉన్న చెప్పులు, చేతికి రబ్బరు గాజులు, మెడలో పల్చటి ఒంటిపేట బంగారుచైను, సుమారుగా ఇరవై ఎనిమిదో ముప్పైసంవత్సరాల వయస్సుతో, రాత్రిఅంతా ప్రయాణంవలన నిద్రలేకనే వచ్చినందున ఆమె కళ్ళు ఉబ్బుకొని ఉన్నవి. ఎత్తుగానూ, కురచగానూ కాని మధ్యస్తం ఎత్తులోని ఆకృతి, చేతిలో పట్టుకొన్న చిన్న లెదర్ సూట్‌కేసు, ముఖంలో కనబడుతున్న భావాల్ని గమనించినప్పుడు ఆమె సౌమ్య సరళ స్వభావురాలిగానే అన్పించింది. ఆమెలో ఎటువంటి గర్వంగాని, గాంభీర్యంగాని లేకనే సరళంగా ఉంది. ఆమె తన కాళ్ళలో ఉన్న చెప్పుల్ని ఒక మూలలో విడుస్తున్నప్పుడు, నిర్మల బయటకొచ్చి 'రండి' అంటూ ఆమెను లోపలికి తీసుకెళ్ళింది. ఆమె లోపలికి వెళ్ళిన మీద, నేను చేతిలో ఉన్న లెటర్‌మీద కళ్ళు ఆడించాను. డివినిటీ కాన్వెంట్ వాళ్ళు, నేను రాసిన ఉత్తరంకు ప్రత్యుత్తరంగా ఈ లెటర్‌ను రాసారు. "మీరు ఆపేక్షించినట్లుగా మేము ఒక సేవాకాంక్షిని మీ అమ్మగారి సేవ చేసేందుకు పంపుతున్నాము. ఆమెకు వసతి, భోజనం మొదలైన వాట్ని ఏర్పాటు చేసేది, ఆమెను మీ కుటుంబంలో ఒక సదస్యురాలుగా చూసుకొనేది, ఆమె సేవాధర్మంలో ఏవైనా లోటుపాట్లు ఉంటే మాకు తెల్పండి" అని ఆ కాన్వెంట్ వాళ్ళు ఆ ఉత్తరంలో రాసారు. అలాగే "ఆమెకు ప్రతినెలా మీరు ఇవ్వాల్సిన సేవా ప్రతిఫలం గురించి దిగువున ఇస్తున్నాము" అని కూడా ఆ ఉత్తరంలో రాయబడింది.

ఏమైనా కానీ, ఈమె రాకనుంచి ఒక సమస్య పరిహారమైందని నేను భావించాను. అమ్మ ఇప్పుడు మాకొక సమస్యగా ఉంది. అమ్మకు తొంబై సంవత్సరాలు దాటినవి. లేచి తిరిగేందుకు, తన పనుల్ని తానే చేసుకొనేందుకు అమ్మనుంచి అవటం లేదు. ఎన్నడూ తన చెంత ఎవరో ఒకరుండాలని ఆమె భావిస్తుండేది. ముఖం కడుక్కొనేదే కానీయండి, స్నానం చేసేదే కానీయండి, చివరికి ఉపాహారం తిండి తినేందుకు కూడా కుదరని స్థితికి చేరుకొంది. కొన్నిసార్లు మలమూత్ర విసర్జనకు కూడా లేచి వెళ్ళేందుకు ఆమె నుంచి కుదరట్లేదు. ఇందుచేత తనే వెళ్ళి తనలోనిఈ పనుల్ని చేసుకోవాలి అనే ప్రజ్ఞ లేకనే పాన్పుమీదే అన్నీ చేసి వదుల్తుంది. ఈ స్థితిలో అమ్మను బాగా చూసుకొని వెళ్ళేది ఎలా అనేది నాకు ఒక సమస్యై ఉంది కదా!

మొదట మొదట్లో నిర్మల అమ్మకు ఎదురైయ్యే అన్ని పనుల్ని ఆసక్తిగానే చేస్తుండేది. అంతేగాకుండా నా అక్కచెల్లెళ్ళు వారి వారి ఊళ్ళనుంచి వచ్చి కొన్నిరోజులు ఇక్కడుండి ఈ పనుల్ని చూసుకొంటుండేవారు. అయితే ఇటువంటి పనుల్ని ఎల్లప్పుడూ చేసేదుంటే ఎవరికైనా అసహ్యం కలిగే విషయం అయినందున, నా అక్కచెల్లెళ్ళు నిదానంగా తమ ఇల్లు, భర్త, పిల్లలు అని చెప్పుకొంటూ తప్పించుకోసాగారు. నిర్మలేమో "మీ అమ్మ, మీ తోడబుట్టినోళ్ళకు అవసరం లేదు, ఆ బరువంతా నా మీదేనా" అని నోరు విప్పి చెప్పకపోయినా తన నడవడికలో దాన్ని వ్యక్తపరచసాగింది. నేనే ఖుద్దుగా కొన్నిరోజులు అమ్మకు ఎదురైయ్యే సేవల్ని చేసాను.

అమ్మ మా అందర్నీ చక్కగా పెంచి పోషించింది. నాయన ఇలాగే పక్షవాత పీడితుడై మంచంలో పడినప్పుడు జాగరూకతతో పెనిమిటి సేవను చేసింది. ఇప్పుడు అమ్మకూ ఈ గతి వచ్చింది కదా అని నా కళ్ళలో నీళ్ళు ఊరినవి. అమ్మ ఏమైనా కానీ మహిళామూర్తి కదా! ఈమె నా నుంచి సేవ పొందేందుకు సిగ్గుపడుతుంది. నాకూ ఇబ్బందిగానే ఉంది. ఏమి చేయాలనేది తోచక నేను విలవిలలాడాను.

రోజునుంచి రోజుకు ఇదే ఒక దిగులై, ఒక రోజు ఆఫీసులో నాకుండే ఒకరిద్దరు ఆత్మీయ స్నేహితులముందు నా కష్టాన్ని తోడుకొన్నాను. అప్పుడు కేరళ రాష్ట్రంకు చెందిన వాసుదేవనాయర్ 'సార్' అంటూ మధ్యలో నోరుపారేసుకొన్నాడు. "మీ మాతృమూర్తిని చూసుకొనేందుకు బయటనుంచి దాది(ఆయమ్మ) వస్తే సరిపోతదా?" అంటూ అడిగాడు."బయటనుంచి ఎవరు వస్తారయ్యా, దగ్గరగా... ఉన్నోళ్ళమే అమ్మను చూసుకునేందుకు కుదరట్లేదు కదా" అన్నాను నేను.

అతను ఒక విళాసం (చిరునామా) ఇచ్చాడు. "మీరు అక్కడికి రాయండి సార్, మీకు అనుకూలం అవుతది" అన్నాడు. అలాగే "ఆ సంస్థలో... మీలాగ ఇళ్ళలో

వయస్సై, ఇంటిపరివారంకు ఒక సమస్యగా మారిన వృద్ధుల్ని చూసుకొనేందుకని కొంతమందికి శిక్షణ ఇచ్చి ఉంచారు... వారి నుంచి మీకు సహాయం తప్పనిసరిగా దొరకగలదు" అన్నాడు. నేను చూద్దాంలే అని అతను ఇచ్చిన విళాసంకు ఒక ఉత్తరం రాశాను. కొన్ని రోజులకే జవాబు వచ్చింది. "వయస్సైనోళ్ళ సేవను చేసేందుకు సిద్ధపడే సేవాకాంక్షులు మా వద్ద ఉన్నారు. మీరు ఒప్పుకొంటే పంపుతాం" అని వాళ్ళు రాసారు. వాళ్ళ షరతులూ సరళంగానే ఉన్నవి. జీతం కేవలం రెండువేలు. తాము పంపేవారిని చక్కగా చూసుకోవాలి. వృద్ధుల సేవ తప్పితే మరే ఇతర ఇంటిపనుల్ని వారి నుంచి చేయించరాదు... మొదలైన షరతులు ఉన్నవి. నాకు సమ్మతమై సరే పంపండి అని రాసాను.

నా ఉత్తరం వారికి చేరిన మూడురోజులకే ఈమె మా ఇంటికి వచ్చింది. అమ్మేమో వచ్చినామెను మొదట్లో దగ్గరకు చేరనీయలేదు. ఆమె చేతిని నెట్టింది. నిర్మలాతో 'ఎవరే ఈమె?' అంటూ ప్రశ్నించింది. ఆమె అమ్మను లేపి వేరే కుర్చీలో కూర్చోబెట్టి దుప్పట్లు మార్చినప్పుడు, అమ్మకు వేరే బట్టలు కట్టినప్పుడు, అమ్మ మూత్రం పోసుకోవాలి అని చెప్పినప్పుడు, ఆ యువతి బెడ్‌ప్యాన్ తెచ్చి ఇచ్చినప్పుడు, అమ్మ ఆ వచ్చిన యువతిని అదొక తరహాలో చూసిందట. ఆ తర్వాత అమ్మ సర్దుకుపోయింది. సెల్వియా అని పిలవబడే ఆ యువతి అమ్మ సేవలో మునిగిపోయింది. ఇప్పుడు అమ్మ చెంతకెళ్ళి మాట్లాడించేది తప్పితే మాకు ఏ ఇతర కష్టకరమైన పనులు లేవు కదా! అమ్మకు జలకం చేయించి కాఫి, తిండి తినిపించి తాపించి చేయి పట్టుకొని ప్రాంగణంలో పది నిమిషాలు వాయువిహారం చేయించేది, అమ్మ బట్టల్ని ఉతికేది...అన్ని పనుల్నీ సెల్వియా క్రమశిక్షణగా చేయసాగింది. అమ్మకు ఆ యువతికి ఒక మధురం సంబంధం ఏర్పడింది. అమ్మతో ఆమె నవ్వుతూ మృదువుగా మాట్లాడేటప్పుడల్లా మాకు ఆశ్చర్యం కలగసాగింది. ఇది మానుంచి సాధ్యంగాకనే ఎక్కడ్నుంచో వచ్చిన, ఏ విధమైన పేగుబంధంలేని ఈ యువతి నుంచి ఎలా సాధ్యమైంది ఈ అనుబంధం అని అన్పించసాగింది.

ఆ సంస్థ వాళ్ళు తెల్పినట్లుగానే సెల్వియా మా ఇంట్లో ఉండే ఏ ఇతర కార్యాలలోనూ చేతిని పెట్టేదిలేదు. అమ్మను చూసుకొనే సమయం తప్పితే ఆమె మరిక తన గదినుంచి బయటకు వచ్చేదిలేదు. అమ్మకు మరియు తనకు భోజనంను ఆమే వంటగదికి వచ్చి తీసుకొని వెళ్తుండేది. ఆమె, అమ్మ కూర్చుని భోజనం చేస్తుండేవారు. తర్వాత తిన్న ఆ రెండు కంచాల్ని కడిగి తెచ్చి అప్పగించి మరిక ఆ యువతి తన గదికి చేరుకొంటే మళ్ళా బయట కనిపించేది లేదు. మా ఇంటోళ్ళతో కూడా ఎక్కువగా

ముచ్చట్లు పెట్టేదిలేదు. అమ్మ వాడుకొనే గదిలోనే ఆమెకూ పడుకొనేందుకు అవకాశం కలిగించాము. అక్కడ మరొక మంచం ఉంచినా, తను నేలమీదే శయనిస్తానని ఆ యువతి చాప పరుచుకొని నిద్రపోతుండేది.

అపరాత్రివేళలో అమ్మ పిల్చినప్పుడల్లా ఆమె మేల్కొని అమ్మమంచం చివర కూర్చుంటుండేది. కొన్నిసార్లు రాత్రులలో నేనే లేచి వెళ్ళి అమ్మ గదివైపుకు తొంగి చూసినప్పుడు సెల్వియా అమ్మ చేతిని తన చేతిలో పెట్టుకొని కూర్చున్న స్థితిని చూసి ఆశ్చర్యపోతుండేవాడ్ని. అమ్మ ఉండే గదికి వేరేదేదో ఒక విన్నూత్న క్రాంతి వచ్చింది. అక్కడ రాశిగా పడియున్న బట్టలన్నిట్నీ ఆమె మడిచి జోడించి పెడుతుండేది. అమ్మ కట్టుకొనే చీరలు, రవికలు, లంగాల్ని ఒక చోట కుదురుగా పెడుతుండేది. గోడమీద దేవుడి పటాన్ని, కాలెండరును చక్కగా వేలాడదీసింది. అక్కడ జరిగిన ఒక మార్పు ఏమిటంటే కిటికీకి ఉండే అడ్డచువ్వ మీద సెల్వియా ఒక చిన్న ఏసుప్రభువు ప్రతిమను వేలాడదీసింది. శిలువ కొట్టబడిన ఏసుప్రభువు ప్రతిమగా అది ఉంది. దాని ముందు ఒక ఇత్తడితో చేసిన మైనం ప్రమిదల్ని ఉంచుకొనే స్ట్యాండ్ ఉంది. సాయంకాలంలో ఆమె ఒక పది నిమిషాలపాటు మైనం ఒత్తిని వెలిగించి, శిలువముందు మోకాళ్ళ మీద కూర్చుని, ఆ ప్రభువు ప్రార్థన చేస్తుండేది. అమ్మ పడుకొంది, లేకపోతే ఏదో దీర్ఘాలోచనలో ఉంది అన్నప్పుడు సెల్వియా బైబిల్ గ్రంథాన్ని ఎదురులో పెట్టుకొని దాని పఠనంలో మునిగి ఉండేది. ఆమెలోని ఈ ప్రవర్తన నుంచి ఇంట్లో మాకేమి కష్టం కాలేదు. నిర్మల, ఒకట్రెండుసార్లు సెల్వియా గదిలో ఏసుబొమ్మను పెట్టుకొంది, ప్రార్థన చేసేదాని గురించి నాతో చెప్పియున్నా నేను ఆ విషయాన్ని తీవ్రంగా పరిగణించుకోలేదు.

"చూడు నిర్మలా, మనకు ఎలాగున ఒక ధర్మం దేవుడు అని నమ్మకం ఉందో... అదేవిధంగా ఆమెకూ ఉంది. బహుశః ఆ నమ్మకం నుంచే ఆమెలో ఎవరూ సాయంకని రాని అమ్మ సేవను చేసేందుకు ప్రేరణ ఇచ్చి యుండొచ్చు... ఆమె అమ్మను చూసుకొనే కార్యాన్ని చక్కగా చేసుకొంటుంది... ఆమెలోని వైయక్తిక ప్రార్థన, బైబిల్ పఠనం నుంచి మనకేమి కష్టనష్టం లేదన్న మీదట మనం ఎందుకు తల చెడగొట్టుకోవాలి" అన్నాను. నిర్మలకు నా మాట సరి అన్పించిందేమో! ఆమె మౌనంగా సమ్మతి సూచించింది. ఇంట్లో ఉండే ఇతరులూ దీని గురించి తల వేడెక్కించుకోలేదు. నా పుత్రికగాని, పుత్రుడుగాని ఈ విషయంలో తల దూర్చలేదు. అమ్మను క్రితంలో సరిగా చూసుకొనేవాళ్ళు లేనందున అమ్మ అప్పుడప్పుడు అరిచేది కేకలుపెట్టేది సెల్వియా వచ్చిన తదుపరి ఆగిపోయింది నా పరివారంకంతా నెమ్మదితనాన్ని తెచ్చిపెట్టింది.

అదే గాకుండా అమ్మ పడుకొన్న చోటే చేస్తున్న మలమూత్ర విసర్జననుంచి ఎప్పుడూ గబ్బుగొట్టుతున్న ఆమె గది ఇప్పుడు సెల్వియా పుణ్యాన డెట్టాల్, ఫినాయిల్ చల్లి చేస్తున్న శుచినుంచి వాసనరహితంగా ఆ గది ఉంటున్నందున నా పరివారం కూడా ఈ మార్పును సంతోషంగా ఒప్పుకొన్నారు. జతగా అమ్మ కూడా మేము గమనించినట్లుగా వెనకటి మనిషిలాగ లేదు. సదా గొణుగుతూ అన్నిట్లో తప్పుల్ని వెతుకుతూ ఉంటుండే అమ్మ సెల్వియా వచ్చిన తర్వాత మార్పు చెందింది. అమ్మ ముఖంలో ప్రసన్నత కనిపించసాగింది. అమ్మ నవ్వుతూ, సంతసం నుంచి కాలాన్ని గడపసాగింది. సెల్వియాను యువతి యువతి అని పిలుస్తూ ఆమెతో చనువుగా ఉండిపోసాగింది. అయితే మా ఇంట్లో పరివారం బాగానే ఉన్నా బయటనుంచి వచ్చి వెళ్ళేవారు ఉంటారు కదా! అమ్మను చూసేందుకు వచ్చే స్నేహితులు, దూరం నుంచి వచ్చే నా అత్తమామలు, బావలు, వాళ్ళ సంబంధీకులు, అక్క, చెల్లి వాళ్ళ పరివారం, వీళ్ళంతా నేరుగా అమ్మ ఉండే గదికి వెళ్ళి, అమ్మ మంచం మీద కూర్చుని, అమ్మ క్షేమసమాచారం అడిగి, నిదానంగా సెల్వియాను చూసి ముఖం మీద ఎన్నో ప్రశ్నల్ని ముద్రించుకొని, అలాగే కిటికీలో ఉన్న అద్దమువ్వల మీద ఉన్న ఏసుప్రభువును, మైనం ఒత్తిని నిలబెట్టుకొనే స్ట్యాండ్‌ని చూసి ముఖాల్ని మరింతగా ముడుచుకొని బయటకు వచ్చి నిర్మల ఎదురో, లేకపోతే నా ఎదురో కొన్ని మాటల్ని పలుకుతుండేవారు.

"అంతా బాగానే ఉందయ్యా... అమ్మను చూసుకొనేందుకు ఇలాగే ఎవరైనా అవసరపడేది ఉందిలే. నువ్వు మంచి పనే చేసావు... అయితే మనలాంటి మడివంతుల ఇంట్లో ఈ శిలువ ఎక్కిన ఏసుక్రీస్తు, ప్రార్థన, మైనం ఒత్తితో ఉన్నస్ట్యాండ్... ఉండేది పద్ధతేనా? కొంచెం జాగ్రత్తగా ఉండు జనార్దనా, ఈ కిరస్తాని జనం ఉన్నారు కదా... వాళ్ళు వేరే ఉద్దేశం పెట్టుకొనే మానవసేవ అంటూ అది ఇది అని చేసేది... ఈ రోజో రేపో చనిపోయే మీతల్లిని వాళ్ళు తమ మతంలోకి చేర్చుగోకపోయినా... మీ ఇంట్లో నీ పుత్రిక, పుత్రుడు ఉన్నారు కదా, వాళ్ళ తల తిరిగించి తిరుమంత్రం వేసి మతాంతీకరణ చేయగలదు ఆ యువతి... హుషారు"

"ఔనయ్యా... నీ చెవిలో ఊదుతున్నానని అనుకోవద్దు... మీ అమ్మను చూసుకొనేందుకు బయట నుంచి దాదిని పిల్చుకొని అట్టి పెట్టుకొన్నావు కదా... ఇది ఎటువంటి సంస్కృతో చెప్పు. అదీ వేరే ఏదో మతంకు చెందిన యువతిని ! దీని బదులుగా నీ అర్ధాంగే ఈ పనిని చేసుకొనేది ఉండదా... నీ భార్య తన తల్లికి ఇలాగున దైన్యస్థితి దాపురించితే, ఆమె సేవను చేయకుండా ఉండేదా? ఇవన్నీ పుణ్య సంపాదన కల్గించే కార్యాలు అయ్యా... ఇప్పుడు ఈ పుణ్యసంపాదన అంతా ఆ కిరస్తాని యువతికి వెళ్ళుతది కాదా...?"

"ఎందుకండి... మీ అక్క చెల్లి ఎంతో దూరాన లేరు కదా! ఆమె వచ్చి ఒక నెల, ఈమె వచ్చి ఒక నెల ఇక్కడ ఉండనీయండి... ఈ ముసల్ది ఏమైనా శాశ్వతంగా ఉంటదా? వేరే వాళ్ళెవరో సేవ చేసేదానికన్నా, మనోళ్ళే చేస్తే కుదరదా? మనలోనే ఎవరైనా దొరకలేదా మీకు... ఇటువంటి పని చేసేవాళ్ళు..."

"ఇప్పుడు అదేంటో వృద్ధాశ్రమం అంటూ అక్కడక్కడ వెలిసినవి కదా... నీకు తెల్వాలి కదా..." అంటున్న ఈ అన్ని మాటలకు నేనేమి జవాబు చెప్పేదుంది? వచ్చినోళ్ళు మాట్లాడి వెళ్ళేవరకూ ఉత్తిగనే ఉండి నేను ఈ మాటలన్నిట్నీ విస్మరించాను. మరిక నాకు వేరే దారిలేదు. మాట్లాడేవారెవరు కూడా నా కష్టాన్ని, బాధను, సంకటాన్ని, దిగులును అర్థం చేసుకొనేది లేదు. అయితే ఈ మాటలు ఇంతకే ఆగిపోలేదు. వాడలో ఉండే బయట జనం కూడా మాట్లాడసాగారు. స్నేహితులు అప్పుడప్పుడు ఈ విషయం మీద ప్రస్తాపం చేస్తున్నారు. పండుగ పబ్బంకని మా వద్ద జరిగే పూజకోసం వస్తుండే భాస్కరభట్టుగారు కూడా ఒక రోజు నన్ను నిలబెట్టి తను విన్నదంతా నిజమేనా అని అడిగారు. "ఔను, వయస్సైనోళ్ళను చూసుకొనేది కష్టమే... నీ కష్టం నాకు అర్థం అవుతదిలే, అలాగని వేరేమతంకు చెందినామెను ఈ దాదితనంకు నియమించేది ఏమి పద్ధతో నువ్వు యోచించి ఉండాల్సింది" అన్నారు.

దీని వెనుకే నాకు అపరిచితులైన కొంతమంది నేనేదో మహాపరాధం చేస్తున్నాను అన్నట్లుగా నన్ను చూడసాగారు. నా ఈ కార్యం మీద అక్కడక్కడ కొన్ని అడ్డమాటలు, సంవాదంలు జరుగుతుంది నా గమనంకు వచ్చినవి.

ఒకరోజు నిర్మల వడిలిపోయిన ముఖంతో "ఇదెందుకో సరి అన్పించటం లేదు" అంది.

"ఇప్పుడు ఏమైంది?"

"ఆ యువతికి స్పష్టంగా చెపుదాం"

"ఏమని?"

"ఆ యువతి మనవద్ద ఉండాలంటే అత్తమ్మ ఉండేగదిలో ఉంచిన ఆ ఏసుప్రభువు ప్రతిమ, ఆ బైబిల్ పుస్తకం అన్నీ తీసేయాలి. అక్కడ ఆమె ప్రార్థన చేయకూడదు..."

"ఆమె ఒప్పుగోకపోతే"

"ఆమె మన ఇంట్లో ఉండేది వద్దు"

"సరే, నువ్వు మా అమ్మను ఆ యువతిలాగ చూసుకోగలవా?"

నిర్మల మరిక మాట్లాడలేదు. "నిర్మలా, ఆ యువతి ఏమైనా చేసుకొని పోనీ, దాన్నుంచి మనకైతే కష్టమేమి లేదు. అమ్మ ఇంకెంతకాలం ఉంటది. అమ్మ జీవించినంతకాలం ఈమె కూడా ఉండనీ..."

"జనం తలొకరీతిగా మాట్లాడుతున్నారు కదా"

"మాట్లాడే జనం వచ్చి అమ్మ విసర్జించే మలమూత్రాల్ని ఎత్తి పడేస్తారా, ఇరవైనాలుగు గంటలూ అమ్మ సేవను చేస్తారా... మనం ఈ యువతి చేసే (చేస్తున్న) పనులకైనా ఒక మంచి మాటను పలకకుంటే, మరిక మనం రాక్షసులుగా మిగిలిపోతాం నిర్మలా" అని నేను అన్నాను.

❖ ❖ ❖

ఆ యువతి సెల్వియా మా ఇంటికొచ్చిన మూడుమాసాల తదుపరి ఒకరోజు ఉదయమే నా గదికి వచ్చింది. "సార్, నేను మీ వద్ద చేస్తున్న ఈ సేవను వదిలి తిరిగి ఎర్నాకులం వెళ్ళిపోతాను... ఈ విషయాన్ని నేను మా మాతృసంస్థకు తెల్పాను" అంది. నాకు ఆకాశమే విరిగి తలమీద పడిన అనుభవం అయ్యింది. నేను దీన్ని నిరీక్షించలేదు. "ఏమైంది తల్లి సెల్వియా?" అని అడిగాను.

నిన్న నేను నా కచేరిలో ఉన్నప్పుడు ధర్మసంస్కృతి మీద అపార మోహం ఉంచుకొన్న మా మామగారు మా ఇంటికి వచ్చారట. వారితోపాటు ఊర్లోని కొంతమంది పెద్దోళ్ళు, కొన్ని సంఘసంస్థల పదాధికారులు కూడా ఉన్నారట.

మా ఇంట్లో వేరొక మతంకు సంబంధపడిన ఆచరణల్ని నడిపేదాన్ని వారు విరోధించారట. ఆమె ఇక్కడ ఉండాలంటే చేస్తున్న ఆ మతంకు చెందిన ఆచరణలన్నీ వదిలేయాలని అన్నారట ఆమెతో. వాళ్ళు ఆమెతో కొంచెం మొరటుగానే ప్రవర్తించారట. ఆమె మనస్సును గాయపర్చారట. వాళ్ళనుంచి వచ్చిన దుందుడుకు మాటల్ని సెల్వియా ఒప్పుకోలేదట. రాత్రంతా యోచించి ఆమె కటునిర్ధారంకు వచ్చింది. "సార్, నేను తిరిగి వెళ్ళిపోయే తీర్మానంకు వచ్చాను... నేను ఈ సేవ చేసేందుకు నాలో శక్తి, స్ఫూర్తి లభించేదే నేను ఏసుప్రభువును ప్రార్థిస్తున్నందునే, బైబిల్‌ను పఠిస్తున్నందునే! దాన్ని ఆపేయండి అని అంటే నేను ఇక ఈ సేవాకార్యాన్ని చేయలేను... మరిక నేను వెళ్తాను నాకు అనుమతి ఇవ్వండి"అంది సెల్వియా. నేను భీతిల్లాను. మూడు మాసాల నుంచి కనుమరుగైన సమస్య (అమ్మను బాగా చూసుకొనేది) మళ్ళా తలెత్తిన దాని పరిణామం నా ఎద(హృదయాన్ని)ను కంపించింది."అలాగున చేయకు తల్లి సెల్వియా" అని ఆమెకు విన్నవించాను. అయితే ఆమె కచ్చితమైన నిర్ణయాన్ని తీసుకొంది. నా నుంచి వస్తున్న ఏ అనునయం మాటా గాయబడిన ఆమె మనస్సును మార్పు చేసేందుకు అసమర్థమైంది. సెల్వియా తన శిలువను, మైనం ఒత్తి పెట్టుకొనే స్ట్యాండ్‌ను, బైబిల్‌ను తన బ్యాగులో వేసుకొని, అమ్మ చేతిని పట్టుకొని తన పెదాలకు తాకించుకొని సుతారంగా ముద్దుపెట్టి బయల్దేరినప్పుడు ఆమె కళ్ళలో నీళ్ళు కన్పించుకొన్నవి. అమ్మకు ఇదేమి అర్థంగాకనే స్థాణువై కూలబడియుంది.

❖ ❖ ❖

సెల్వియా వెళ్ళిపోయి ఇప్పుడు రెండురోజులైంది. నిర్మల గొణుగుతూ సేవ చేస్తుంది. అమ్మ వాడుకొంటున్న గదినుంచి దుర్వాసన వస్తుంది. అమ్మేమో "యువతి యువతి" అంటూ కేక పెట్టుతుంది. సెల్వియా వచ్చిందేమో అన్నట్లుగా తలుపు వైపు తిరిగి తిరిగి చూస్తుంది. నిరాశనుంచి అమ్మ ముఖం వడిలిపోతుంది. అమ్మ నుంచి మళ్ళా అరుపులు, కేకలు ప్రారంభమైనవి. తలుపు చెంత నిలబడి నేను నిట్టూర్చాను. కన్నీళ్ళు తుడుచుకొంటున్నాను. నా వారసుల ముఖాలమీదా కళలేదు. సెల్వియా మైనం ఒత్తిని వెలిగించే జాగాలో మైనం కరిగి ప్రవహించి గట్టిగా ముద్దై ఒక చిత్తరువును సృష్టించింది ఆమె గుర్తుకని!

**మూలకథ రచనా కాలం : 2008**

# వారంతా ఇప్పుడు సుఖంగా ఉన్నారులే

**ఆ** ఊర్లో మరిసంతానబాయి అంటే ఎవరికీ గుర్తెయ్యేది లేదులే! ఆ ఊర్లో వాళ్ళు ఎవరు కూడా ఈ పేరు నుంచి పిలుస్తుండేది లేదులే! ఆ ఊర్లో ఉన్నచర్చి జాతరకని భట్కళ, మురుడేశ్వర, హొన్నావరంలనుంచి వచ్చేవాళ్ళు మరిసంతాన, దుర్గాకేరి గ్రామంకు చెందిన మేరిసంతానబాయి అని నానావిధాల పేర్లనుంచి చెపుతూ ఒక రోజంతా ఈమె ఇంటికని వెతికింది ఉందిలే! చివరికి ఫాదర్‌గారికి వంటచేసి పెట్టే ఆమె అన్నప్పుడు మాత్రం జనం ఓ కుజ్నేరబాయి కదా అని అడిగి ఆమె ఇల్లును చూపిస్తుండేవారు. కొంకణిభాషలో 'కూజ్న' అంటే వంటిల్లు కదా! కుజ్నేర అంటే వంటను చేసేవాడు. ఈ శబ్దంకు బాయి అనే పదం చేరినందున వంట చేసే ఆమె అని చెప్పబడుతుండేది. 'కూజ్న' 'కూజ్నేర' అనేవి పోర్చుగీసు భాషా శబ్దాలై ఉండొచ్చు. గోవానుంచి ఈ వైపుకు వచ్చిన కొంకణి క్రైస్తవులు తెచ్చిన వందలాది శబ్దాలలో ఈ రెండు శబ్దాలు చేరుకొన్నవి.

క్రితంలో అయితే జాతరకని వచ్చే సహ్యాద్రి కనుమల క్రిందుండే క్రైస్తవ భక్తులు తమ మూటల్ని మోసుకొని నేరుగా చర్చి వద్దకు వస్తుండేవారు. చర్చి వెనకుండే ఫాదర్‌గారి బంగళాకు ఆనుకొనే వంటిల్లు ఉండేది. అక్కడికి వచ్చినోళ్ళకు మరి సంతానబాయి నుంచి చక్కటి స్వాగతం దొరుకుతుండేది.

"ఇయా... ఇయా (రండి రండి)" అంటూ వస్తున్నోళ్ళను ఆమె సంభ్రమం నుంచి స్వాగతిస్తుండేది.

"ఇప్పుడే వస్తున్నారా... ఊర్లో అందరూ బాగున్నారా? బాందేహళ్ళలోని తెరెజీనా ఎలా ఉంది? శిరాళికొప్పలోని బేబి ఎలా ఉంది? జోగిమఠంకు చెందన లాద్రు (లూథర్) చిన్నాయన ఎలా ఉన్నారు?" అంటూ ఆయా ఊర్లలో ఉన్నోళ్ళందరినీ జ్ఞాపకంలోకి తెచ్చుకొని ఆమె అడుగుతుండేది. వచ్చినోళ్ళకు కాఫీనో, తిండినో తినబెట్టేందుకు తాపేందుకు హడావుడి చేస్తుండేది. ఇలా అతిథులుగా వచ్చినోళ్ళకు ఆమె ఏమి తక్కువగా తినబెట్టేది లేదు. జాతరకని వేరే పెద్ద గ్రామాలనుంచి ఫాదర్లు వస్తున్నందున వారికని చేసిన వ్యవస్థలోనే కుజ్నేరబాయిగారి బంధువుల, స్నేహితుల వ్యవస్థ కూడా జరిగిపోతుండేది.

ఇలా కొన్ని సంవత్సరాలకే మరిసంతానబాయి కుజ్నేరబాయిగా అయిపోయింది. ఊరిజనం ఆమె మూలనామాన్నే మరిచి, ఆమెను ఈ కొత్తపేరునుంచే గుర్తించుకొన్నారు. చుట్టుప్రక్కలుండే ఏడెనిమిదిగ్రామాల ఫాదర్లకు, బిషప్ గురువులకు, చివరికి బెంగుళూరులో ఉండే కార్డినల్‌కు ఆమె ఇలాగునే పరిచితురాలైంది.

ఈమె ఈ ఊరుకు వచ్చిందే ఒక కథ అండి!

హొన్నావరంలోని దుర్గాబైలుకు చెందిన మార్తీన్ (మార్టిన్)గారి కూతురైన మరి సంతాన, ఈ ఊరి చర్చికి చెందిన కుజ్నేర (బట్లర్)ను వివాహం చేసుకొన్నప్పుడు, ఆ బట్లర్ ఈవంటపనిని ఒప్పుకొని ఏడెనిమిది సంవత్సరాలు అయినవి. తను ఒంటరోడిగా ఘోటక బ్రహ్మచారిగా ఉన్నా, వంటలోడు మాత్రం ఎందుకు తనలాగే ఒంటరివాడుగా ఉండాలి అని విచారించిన ఫాదర్ ఫ్రాన్సిస్‌గారు బట్లర్‌కని వివాహం చేసే యత్నానికి చేతిని నిలిపాడు.

వంటోడికి పద్దెనిమిదో ఇరవై సంవత్సరాలో ఉన్నప్పుడు ఫాదర్ ఫ్రాన్సిస్‌గారు అతణ్ని వంటపనులు చేసేందుకు తమ వద్ద కుదుర్చుకొన్నారు. అతను ఫాదర్‌గారికి వంటచేసి పెట్టూ, చర్చిలో ఉండే సమస్తపనుల్ని చేస్తూ ఫ్రాన్సిస్‌గారికి పరమ విధేయుడిగా ఉన్నాడు. ఫాదర్‌గారి సేవ అంటే చర్చికి సంబంధపడిన సేవే అని అపార భక్తి శ్రద్ధల్ని వృద్ధించుకొన్నాడు. ఫాదర్‌గారి మాటకు శిరస్సువంచి విధేయత చూపిస్తూ వారికి రవ్వంత కష్టం కలగనట్లుగా వారి సేవను చేస్తుండేవాడు.

ఫాదర్ ఫ్రాన్సిస్‌గారు కూడా ఇతని సేవను మెచ్చుకొని కొనియాడేవారు. ఇతనూ అందరిలాగనే బతకనీ అనే విచారం వారి మనస్సులో జొరబడి అతనికొక వివాహాన్ని జరిపించాడు. చర్చిలోని పాలనాధికారి, అకౌంటెంట్ మొదలైనోళ్ళు ముందుండి మరి సంతానను వంటలోడి అర్ధాంగిగా హొన్నావరం నుంచి ఇక్కడికి తీసుకొచ్చారు.

ఇప్పటివరకూ కేవలం వంటపనినుంచి నిమగ్నమైపోయిన వంటిల్లు మరిసంతాన ఆగమనం నుంచి కళ పొందింది. ఆమె గాజుల సవ్వడి, ఆమె సిగలో ముడిచిపెట్టుకొన్న మల్లెమాలల పరిమళం, ఆవిడకట్టే చీరలలోని సరబర శబ్దం ఫాదర్‌గారి వంటిల్లునే కాదు, ఫాదర్‌గారి బంగళాకు కూడా ఏదో ఒక విధమైన సొగసును తెచ్చింది. బట్లర్ సంతసం నుంచి ఊగిపోసాగాడు.

అతనికి పెళ్ళిచేసిన ఫాదర్ ఫ్రాన్సిస్‌గారు కొన్ని నెలలలోనే ఆ ఊరును వదిలేయాల్సి వచ్చింది. వారికి వేరొక ఊరులోని చర్చికి ట్రాన్స్‌ఫర్ అయ్యింది.

“ఫాదర్‌గారు నేనిప్పుడు ఏమి చేయాలి?” అని వారి ఎదురు నిల్చి దుఃఖించాడు బట్లర్.

"నేను ఇప్పుడు వెళ్ళబోయే చర్చిలో ఒక వంటోడు ఉన్నాడు... నువ్వు ఇక్కడే ఉండిపో... వివాహం అయిన తదుపరి నువ్వు మాలాగ ఊరూరు తిరిగేది క్షేమం కాదు" అన్నారు ఫాదర్ ఫ్రాన్సిస్‌గారు.

"ఫాదర్‌గారు... నేను ఎన్నో సంవత్సరాలనుంచి మీ సేవ చేసుకొని వస్తున్నాను" అంటూ కళ్ళలో నీళ్ళు నింపుకొన్నాడు.

"ఛీ ఛీ... ఇదంతా ఇలాగున యోచన చేసే విషయం కాదు... ఇక్కడ నీకేమి కష్టం అవ్వదు...అక్కడ కూడా నాకేమి కష్టం ఉండదు" అంటూ ఫ్రాన్సిస్‌గారు అతడ్ని సముదాయించాడు.

వారు ఊరును వదుల్తుండగానే ఫాదర్ డియాగోగారు చర్చికి కొత్తగా వచ్చారు.

వారు ఇకనూ యువకుడే కదా! వంటోడి వయస్సే వారిది. ఎంతో ఉత్సాహ వంతుడు. మంచి ఊపులోనూ ఉన్నారు. ఫ్రాన్సిస్‌గారు చెప్పినట్లుగానే వంటోడికి ఏమి కష్టాలు ఎదురవ్వలేదు. ఎప్పుడూ ఈ మొగుడు పెళ్ళాన్ని కెలుకుతూ, తమాష చేస్తూ, మరిసంతాన పిరుదుల మీద కొట్టుతూ చిలిపిచేష్టలు తుంటరి పనులు చేస్తూ డియాగోగారు ఉంటుండేవారు. ఈ మొగుడు పెళ్ళాం వారి సేవను చక్కగా చేస్తున్నారు.

ఈ ఊర్లోవారు నాలుగు సంవత్సరాలు ఉన్నారు. ఊరోళ్ళందరికీ అవసరమైయ్యారు. వారు ఇక్కడున్నప్పుడే వంటోడు తండ్రిగా అయ్యాడు. వంటోడి పుత్రుడికి సైంట్ అంతోని అని పేరు పెట్టి జ్ఞానస్నానం చేయించినోడు డియాగోగారు కదా!

వీరి తర్వాత వచ్చినవారు ఫాదర్ రొజారియో

ఆ తర్వాత వారు అగస్టీన్.

తర్వాత ఫాదర్ మిరాండోగారు.

ఫాదర్‌గారి బంగళాకు ఆనుకొన్న ఈ వంటోడి సంసారం మరిక పెరగలేదు. వంటోడు, మరిసంతాన, పుత్రుడు అంతోని... ఈ ముగ్గురే ఆ కుటుంబంలో ఉన్నారు. అయితే వీళ్ళను చూసుకొనేది ఫాదర్‌గారికి కొంచెం కష్టమైంది. బిషప్ గురువుగారు ఇచ్చేజీతం, చర్చికి చెందిన ఉత్పత్తి ఆదాయం సరిపోవట్లేదు. ఈ విషయాన్ని గమనించిన మరిసంతాన ఒకట్రెండు ఇళ్ళలో ఇంటిపనులకు చేరుకొంది. వంటోడికైతే రోజంతా ఫాదర్‌గారిసేవ, చర్చిలోని పనులనుంచి తీరికైతే ఉండేది కాదు. ఉదయం వేళంతా మరిసంతానకు ఒప్పుకొన్న ఇళ్ళలో చాకిరి ఉంటుండేది. ఫాదర్‌గారి ఉపాహారం, తిండి వ్యవస్థ వంటోడి భుజాలమీద ఉండేది. అప్పుడే వంటోడు 'కుజ్నేరమామ' అనే అడ్డపేరును పొందాడు. అలాగే మరిసంతానబాయి కుజ్నేరబాయి (వంటలక్క) అనే బిరుదును పొందింది. వీళ్ళూ ఒప్పుకొన్నారు ఆ కొత్తపేర్లను. బయట ఊర్లనుంచి

వచ్చినోళ్ళు మాత్రమే మరిసంతానగారి మూలపేరును పట్టుకొని పిలుస్తుండేవారు. అయితే ఈ ఊర్లోని జనంకు మాత్రం ఆమె గుర్తుండిపోయింది కుజ్నేరబాయి అనే! ఇప్పుడు అంతోని పెరిగి పెద్దోడై హైస్కూలుకు వెళ్ళసాగాడు.

వంటోడికి ఎలాగున ఫాదర్లగారి మీద అపారగౌరవం భక్తి ఉండేదో అలాగే అంతోనికి కూడా ఫాదర్లంటే పూజ్యభావన ఉండేది.

"ఫాదర్... ఫాదర్" అని అతను ఎల్లప్పుడూ ఫాదర్‌గారి వెనకే ఉంటుండేవాడు.

అయితే మరిసంతానంకు మాత్రం ఫాదర్ అంటే అంతంత మాత్రమే. అతిగా గౌరవాన్నేమి ఆమె ఫాదర్లమీద చూపిస్తుండేది లేదు.

ఎప్పుడూ ఫాదర్‌గారి బంగళాలోనే ఉంటుండే పుత్రుడికి ఆమె బద్ధి చెప్పి చూసింది.

"అదేంటి అక్కడే పడియున్నావు...ఏదైనా పనిఉంటే వెళ్ళిరా... నీ చదువు, రాత చూసుకో మంచిగా..."

వంటోడు ఈ పలుకులకు...

"ఉండనీ... ఏమైంది ఇప్పుడు... దేవుడి ప్రతినిధి అయిన ఫాదర్ గారి సేవను చేస్తే అతనికి మంచే జరుగుతది..."

జగడం వద్దనుకొని మరిసంతాన మరిక తన బోధను ముందుకు సాగించలేదు. అయితే ఎందుకో భర్తమాట ఆమెకు నచ్చలేదు.

పాతఫాదర్ వెళ్ళారు.

కొత్తఫాదర్ వచ్చారు.

హొన్నావరం, మురుడేశ్వర, భట్కళ్ నుంచి మరి సంతానబాయిని వెతుక్కొంటూ జనం వస్తుండేవారు. చర్చికి చెందిన జాతర సంవత్సరానికోసారి వైభవంగా జరుగుతుండేది.

హైస్కూలుకు వెళ్తున్న పుత్రుడు ఒకరోజు ఇంటికి చేరగానే...

"మాయ్(అమ్మా)..." అన్నాడు.

"ఏంటి అంతోని...?"

"టెన్త్‌పాసై నేను ఫాదర్‌గా అవ్వాలని భావిస్తున్నా..."

"ఏంటి ఫాదర్ వృత్తేనా?"

భయపడింది ఆమె.

"ఔను!"

"ఈ విచారం నీ తలలో ఎవరు నింపారురో అంతోని"

ఆమె దిగులులో పడింది.

"ఎవరూ నింపలేదులే... ముందే నేను సెమినరీకి (క్రైస్తవమఠంకు) చేరుకోవాలి అని తీర్మానించుకొన్నాను... ఫాదర్‌గా అయ్యే నిర్ధారం చేసుకొన్నాను..."

మళ్ళా మళ్ళా అవే మాటల్ని విన్న మరిసంతానకు తన రొమ్ముమీద గుద్దినట్లైంది. కొడుకును ఫాదర్‌గా చేయాలని ఆమె ఎన్నడూ యోచించలేదు. భర్తకు తనకు ఎంతోమంది ఫాదర్ల గురుతులు ఉన్నవి. వారంతా మనసు పడితే తన పుత్రుడ్ని బాగా చదివించి పెద్ద ప్రభుత్వ అధికారిగానో మరేదాన్నో చేయాలని ఆమె భావించుకొంది. నిత్యం ఆమె ఇంటిపనులకు వెళ్తుండే చోట్లలో ఇదేవిధమైన మాటల్ని వింటుండేది.

ప్రాదేశిక రవాణా శాఖాధికారైన డెన్నిస్‌గారు ఆమెతో అప్పుడప్పుడు "...బాయి... నీ కొడుకును బాగా చదివించు... మన మతస్తుల ఆధ్వర్యంలో ఎన్నో కలాశాలలు ఉన్నవి. ఎవరైనా సహాయం చేయగలరు" అంటుంటే మరొక ఇంట్లోని సనాఉల్లా సాహెబ్‌గారు "... బాయి... మీకు చెందిన దొడ్డ (పెద్ద) గురువులు మనసు చేసుకొంటే నీ బేటాను డాక్టరుగానో ఇంజనీరుగానో చేయొచ్చు" అని చెపుతుండేవారు. మొదటగా అతను ప్రౌఢశాల(హైస్కూలు) చదువును ముగించనీ అని వేచి చూస్తుంటే... ఇతను (అంతోని) అదేంటో  చెపుతున్నాడు కదా అని ఆమె తల్లడిల్లింది.

"అంతోని.. ఈ ఫాదర్‌గీదర్ వద్దయ్యా... నువ్వు వేరే ఏదైనా చదువు...మాకు ఉన్నదే నువ్వు ఒక్కడివి కదా.... నువ్వు ఇలాగే ఫాదర్ అయితే మాకు ఎవరు గతి?"

ఆమె కళ్ళు నీళ్ళతో నిండిపోయినవి.

అంతోని తల్లి మాటను చెవిలో వేసుగోకనే లేచి వెళ్ళాడు.

సాయంత్రం చర్చిలోని గంటను మ్రోగించి వచ్చిన భర్త జతగా మాటలలో నిమగ్నమైంది మరిసంతాన.

"ఔనండి... అంతోని చెపుతున్న మాటను విన్నారా?"

"ఏమిటంట?"

"అతను ఫాదర్‌గా అవుతాడట"

"అవ్వనీ.. ఇప్పుడు ఫాదర్ అవుతాము అనే వాళ్ళే తక్కువైపోయారు... అలాగే అతను కోరినట్లుగానే కానీ... దాని పుణ్యం మనకూ దొరుకుతదిలే..."

"ఔనా.. మీరూ అలాగే వంతపలుకుతున్నారా? మనకు వృద్ధాప్యంలో ఎవరు గతి? మనం మనమళ్ళ ముఖాలు చూసేది వద్దా?"

“ఓయ్ పిచ్చీ... మనం ఇతడ్ని నమ్ముకొని ఉండేందుకు అవుతదా... దేముడు మనకొక దారి చూపిస్తాడులే... అతను అతనికి తోచిన దారి పట్టుకోనీ... నువ్వు ఉత్తిగనే ఉండు...”

ఇప్పుడామె మళ్ళా మరింతగా పాతళంకు జారింది.

“భర్తా బిడ్డ వైపే చేరుకొన్నాడా?”

ఒకట్రెండు రోజులు తర్వాత ఆమె ఫాదర్‌గారిని కల్సింది.

“నేనే ఖుద్దుగా చెప్పాను బాయి...” అన్నారు వారు.

“ఇప్పుడిప్పుడు మనలో ఫాదర్ అవుతాను అనే వాళ్ళే తగ్గిపోయారు... ఫాదర్‌గా అవ్వు అని చెప్పింది నేనే... అతనిలో దైవభక్తి మెండుగా ఉంది. విధేయతా ఉంది... సేవామనోభావం... త్యాగం... ప్రీతి అని ఫాదర్లకు అవసరమైయే అన్ని గుణాలు అతనిలో మెండుగా ఉన్నవి... అతను కోరినట్లే కానీ... ఆ దేవమాత (మేరిమాత)... ఏసుస్వామి మీకు ఇవ్వాల్సినదంతా ఇస్తారు... మీ కుటుంబం మీద దేవుడి కృపాశీర్వాదం పడుతది...”

“ఫాదర్ మా గతి?”

“అంటే నీ పుత్రుడు ఫాదర్‌గా అవ్వకపోతే అతను మిమ్మల్ని సాకుతాడు అని అంటావా?”

“ఔను ఫాదర్... మేము ఇలాగ ఎన్నిరోజులని పనులు చేసేందుకు సాధ్యం?”

“బాయి... ఇప్పుడు ఆ జూలియస్ పుత్రుడు తన తల్లిదండ్రుల్ని సాకుతున్నాడా? ఎడ్వర్డ్ మొన్న తన తండ్రినే ఇంటినుంచి బయటకు దొబ్బాడు కదా... బస్తు, పెద్రు, లూథర్... ఈ ముగ్గురి తల్లి ఇప్పుడు బస్‌స్ట్యాండ్‌లో భిక్ష అడుక్కొంటుంది కదా... నీకు ఎక్కడో భ్రమ... అతను మంచిదారినే వెతుక్కొన్నాడు. అలాగే కానీ... నేను అతడ్నుంచి సెమినరీకి అర్జి పెట్టించాను... అంతా ఉచితంగా జరిగేటట్లుగా వ్యవస్థ చేయిస్తున్నాను...”

ఉన్న అన్ని దారులు మూసుకుపోయినవి అని భీతిల్లింది మరిసంతాన. పుత్రుడు ఫాదర్ అయ్యేది ఆమెకు ఇష్టం లేదు. ఫాదర్ల జీవనం బయటనుంచి చూసేందుకు చందంగానే ఉంటది. లోపలేమే అది అంతగా సుఖకరమైంది కాదు అనేదంతా ఆమెకు గుర్తేలే! ఇప్పుడామె పదైదో ఇరవై సంవత్సరాలనుంచో ఎంతోమంది ఫాదర్లను చూసియుంది కదా!

వాళ్ళ భక్తి కృతకమే. ఒకవిధమైన బాహ్యనటన. జనం మీద గారడి చేయాలనే వారు తమ భక్తిభావాన్ని చూపిస్తుంటారు తప్పితే అంతరంగంలో వారు వేరేగా ఉంటారు.

ఇక సుఖం సంతోషం డబ్బు అధికారం ప్రమోషన్ అని అందరు సంసారస్థుల లాగనే వారూ కోరుకొంటుంటారు. కొంతమందైతే సంసారస్థులకన్నా మిగులుగా దుష్టులైంది, చెడుగా ఉంది ఆమె కనుగొందిలే!

ఇప్పుడు సౌమ్య స్వభావుడిగానూ, దైవభక్తుడిగానూ అయ్యున్న తన బిడ్డ అంతోని రేపు మార్పు చెందినా ఆశ్చర్యపడేది లేదని అన్పించింది ఆమెకు. ఇలాగున మార్పు చెందిన కొంతమంది ఫాదర్లను ఆమె నిశితంగా చూసియుంది. ఫాదర్ దీక్షపొంది వచ్చినప్పుడు, ఏసుప్రభువు లాగ ఉన్న కొంతమంది ఒకట్రెండు సంవత్సరాల తర్వాత సైతాన్‌లుగా మారి ఉండలేదా?

మరిసంతాన నేరుగా చర్చికి చెందిన పాలనాధికారి వద్దకు వెళ్ళింది. "సార్ మీరూ ఒక మాట చెప్పి చూడరాదా నా పుత్రుడికి"

"ఛిఛిఛీ... ఇటువంటి విషయంలో వద్దని అడ్డుచెప్పకూడదు... అది దేవుడి శాపంకు మనల్ని గురి చేస్తది... నీ పుత్రుడు ఫాదర్‌గాకానీ...ఈ ఊరికీ పేరు... నీ ఇంటికీ మంచిదే అవుతది..."

ఎకౌంటెంట్ కూడా ఇలాగే పలికాడు.

మిగిలిన ఊరి పెద్దలదీ ఇదే అభిప్రాయంగా ఉంది.

మరిసంతాన వద్దు వద్దంటుండగానే రోజులు దొర్లి అంతోని ప్రౌఢశాలా పరీక్షలో పదోతరగతి నుంచి మంచి మార్కులతో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడైంది జరిగింది కదా! అతని అర్జి సెమినరీకి వెళ్ళింది. అతని ఎంపిక కూడా అయ్యింది.

"అంతోనీని గ్రాడ్యుయేట్ చేసి అతనికి ధార్మిక శిక్షణ ఇచ్చి... ఫాదర్ దీక్షను ఇస్తాం... అతడ్ని శీఘ్రమే పంపండి..." అని సెమినరీ నుంచి ఫాదర్‌గారికి లేఖ వచ్చింది.

అంతోనీని సెమినరీకి (క్రైస్తవమఠంకు) పంపేందుకు ఊరికి ఊరే సిద్ధమైంది.

"కుజ్నేరబాయి...ఈ పుణ్యం ఎవరికుందో చెప్పు... మా వద్దా యువకులు ఉన్నారు... ఇప్పటికే పోకిరీలుగా చెలామణి అవుతున్నారు... దేవుడిసేవ చేసేందుకూ పుణ్యం కావాలి కదా... ఏ తల్లిదండ్రులు ఫాదర్లగా, కన్యాస్త్రీలుగా తమవారసుల్ని వదులుతారో ఆ తల్లిదండ్రులు భాగ్యవంతులేనమ్మా...." అంటూ మరిసంతానను, ఆమె భర్తను జనం కొనియాడారు.

ఫాదర్‌గా అయ్యేందుకు బయల్దేరిన అంతోనీని ఊర్లో ఉన్న క్రైస్తవులంతా వైభవంగా వీడ్కోలు చెప్పినప్పుడు ఒక విధమైన సంతసం మరిసంతానబాయికి కలిగినా, ఆమె ముందున్న తమ బతుకు ఎడారిగా మారుతదేమో అన్నట్లుగా బాధపడింది. పుత్రుడు

చక్కగా చదువుతున్నాడు. అతనికొక నౌకరి దొరుకుతది. అతను లగ్నమాడుతాడు. వేరొక ఇల్లు కట్టుకొంటాడు. అతని సంసారం వృద్ధించుతది. దాన్నంతా తను చూడగలను అనేదంతా కేవలం కలగానే మిగిలిపోయింది కదా అని బాధపడింది. ఫాదర్‌గా అవ్వొద్దు అని చివరివరకూ బిడ్డకు చెప్పి చూసింది. ఇలా పలికేది ఒక పాపకార్యమే. దేవుడి ఇచ్ఛకు విరుద్ధంగా వెళ్ళుతుంది గుర్తై ఉన్నా ఆమె "అంతోని ఈ యోచన వదిలేయ్" అని పలుమార్లు చెప్పింది. అయితే అతను ముందుకేసిన అడుగును వెనక్కి తీసుకోలేదు. రైల్వేస్టేషన్ వరకూ వెళ్ళిన జనం, అతడ్ని బెంగళూరుకు వెళ్ళేందుకు వీడ్కోలు ఇచ్చి వచ్చారు.

"దేముడు అందర్నీ ఇటువంటి పవిత్రకార్యానికి ఎంపిక చేసుకొనేదిలేదు. అంతోని తల్లిదండ్రులు భాగ్యవంతులు" అంటూ ఫాదర్‌గారు చర్చిలో చెప్పిన ఘనవాక్యంకు జనం తలలూపారు.

పుత్రుడు వెళ్ళిపోయిన బాధను కుజ్నేర బాయి సహించుకొంది. ఆమె దిననిత్యం చేస్తుండే ఇళ్ళపనుల మధ్య ఈ బాధను మరిచే యత్నాన్ని చేసుకొంది.

ఈ మధ్యలో మరిసంతాన భర్త ఒక ప్రమాదంలో చిక్కుకొన్నాడు. ప్రభాత ఝామున ప్రార్థనా గంటను మోగించేందుకు వెళ్ళిన అతని కాలుమీద వేలాడగట్టిన కంచుగంట గిలక సమేతంగా పడింది. గంటను ఒక కప్పిలో వేలాడదీసి, ఆ కప్పీని రెండు అడ్డకట్టెల ఆధారంమీద రాతిదిమ్మెలపైన కూర్చోబెట్టింది ఉంది కదా! తాడును క్రిందనుంచి లాగినప్పుడు ఆ గిలక (కప్పి) అటుఇటు జరిగి గంటానాదం చేస్తుండేది. ఇలాగున ఊగే వేగంకు అరిగిపోయి పక్కకు జరిగిన గిలక ఆ దుర్దినంలోని ప్రభాత ఝామున లాగిన తాడు(మోకు) సమేతంగా క్రిందకు జారింది. ఏదో కీడు శంకించిన మరిసంతాన భర్త పక్కకు తొలిగాడు. అయినా ఆ కంచుగంట సమేతంగా ఆ గిలక అతని కుడికాలు మీద పడింది. మోకాలు, పాదం, కాలివేళ్ళు నుజ్జుగుజ్జైనవి. ఫాదర్‌గారు అతడ్ని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించాడు. సెమినరీకి కబురు ముట్టగానే అంతోని వచ్చాడు. కుజ్నేరబాయి తన భర్త సేవలో మునిగింది.

ఒకనెల, రెండునెలలు, మూడునెలలు గడిచినవి.

మరిసంతాన భర్తకు నయం కాలేదు.

అతనికి మధుమేహరోగం ఉన్న విషయం బయటపడింది. కాలుకైన గాయం మాసిపోలేదు. కాలును కత్తిరించాలని వైద్యులు చెప్పారు. ఫాదర్‌గారు, ఊరిజనం ఆ అంగవికలుడ్ని చూసి వెళ్ళారు. ఫాదర్‌గారికి వంట చేసేందుకు ఊర్లో ఉన్న ఫ్రాంక్లిన్ అనే వేరొక యువకుడు వచ్చి వంటింట్లోకి చేరుకున్నాడు.

నాలుగు నెలల తర్వాత మరిసంతాన భర్త చనిపోయాడు. కొత్తగా కూర్చోబెట్టిన కంచుగంట ఈ సమాచారాన్ని ఊరికంతా నొక్కిచెప్పింది.

గ్రామంకు వచ్చాడు అంతోని.

"మామ్.... నేను రేపు వెళ్ళిపోవాలి" అన్నాడు.

"అలాగే... వెళ్ళు" అంది కుజ్నేరబాయి

ఇప్పుడైనా కొడుకు తన మనసును మార్పు చేసుకోవచ్చు అని అనుకొంది ఆమె. అయినా కొడుకు మనసు మార్పుచెందలేదు. కానీలే అనుకొంది.

ఆ రాత్రి కొడుకుతో చెప్పింది ఇలాగున...

"అంతోని... నేను ఫాదర్‌గారివద్ద చేసే ఊడిగాన్ని వదలాలి అని యోచన చేసాను..."

"మరి...?"

"ఈ ఫాదర్‌గార్ల వద్ద చేసే వెట్టిచాకిరికన్నా ఒక మూడు ఇళ్ళలో ఇంటిపనులు చేసి ఉదరాన్ని నింపుకొనేదే నాకు సుఖాన్ని ఇస్తది... బస్తీలో ఒక చిన్న బాడుగ ఇల్లు వెతుకుతున్నాను..."

ఆమె మరిక ఎక్కువగా మాట్లాడేది చేయలేదు.

ఈ మాటకూ అంతోని నుంచి వచ్చిన ప్రతిక్రియ సప్పగా అయ్యింది.

"అలాగే చేయమ్మా... దేవుడైతే మన చేతిని వదిలేదులేదు" అన్నాడు అతను జూనియర్ ఫాదర్‌లాగ.

సెమినరీకి చేరిన రెండోసంవత్సరంకే అతని మాట, రీతి, కట్టేదుస్తులు మార్పు చెందినవి. మాటమాటకు జీసస్ అంటూ ఉద్గరిస్తున్నాడు. ఎప్పుడూ చేతిలో బైబిల్ పట్టుకొని తిరుగుతున్నాడు. అతను పలికిన మాటకు కుజ్నేరబాయి మరిక మాట్లాడలేదు.

అంతోని సెమినరీకి వెనుదిరిగి పిమ్మట ఆమె కిరస్తాని బస్తీలో ఉండే డిసోజాగారి ఔట్‌హౌస్‌లో నివసించసాగింది. ఇంత పొద్దుకే ఫాదర్‌గారి బంగళాకు చేరుకొన్న కొత్తవంటోడు ఆమెను బయటకు నెట్టే అన్ని ఏర్పాట్లను చేసుకొన్నాడు. కుజ్నేరబాయికి మళ్ళా ఒకట్రెండు ఇళ్ళలో ఇళ్ళ పనులు దొరికినవి. కూజ్న(వంటచేసేది) మానుకొన్నా కుజ్నేరబాయి అనే అడ్డ(మారు)పేరు ఆమెను వదిలి వెళ్ళలేదు కదా! ఇప్పుడు సహ్యాద్రి కనుమల క్రిందనుంచి అప్పుడప్పుడు వచ్చే జనం ఆమెను వెతుకుతూ వస్తుండేవారు. ముందుగా చర్చికి వెళ్ళి అక్కడ ఇంకెవరో ఆమె ఉండే జాగాను ఆక్రమించుకొన్న దాన్ని చూసి డిసోజాగారి ఇంటికి వచ్చి మరిసంతాన పేరును పలికి ఆమె వద్దకు చేరుతుండేవారు. ఊరిజనంకు తక్షణమే ఆమె ఎవరనేది తెల్సేదిలేదు. ఫాదర్‌గారికి

వంటచేసి పెట్టుండే భార్యాభర్తల జోడి అని చెప్పినప్పుడు మాత్రమే, కుజ్నేర బాయి ఉండే ఔట్‌హౌస్‌ను చూపెట్టుతుండేవారు. అతిథులుగా వచ్చిన జనం ఆమె ఉన్న చిన్న ఇల్లు, ఆమె పరిస్థితి గమనించి బాధపడుతున్నా, ఆ వచ్చినోళ్ళను మరిసంతాన చక్కగానే ఆదరిస్తుండేది.

కొడుకు విషయాన్ని ప్రస్తాపించేవాళ్ళు.

కొడుకు ఫాదర్‌గా అయ్యేందుకు బెంగుళూరుకు చేరుకొన్నాడు అని చెప్పినప్పుడు జనం 'ఔనా' అంటూ విషాదస్వరంతో పలుకుతుండేవారు. వాళ్ళలో కొందరికి ఈమె సుపుత్రుడు తన తల్లి గురించి కొంచమైనా యోచించకూడదా అని అన్పిస్తుండేది. అయితే అలాగని వాళ్ళు నోరు విప్పి అడిగేది లేదు. అంతోనీని దేముడే తన సేవకని ఎంచుకోగా తమలోని విషాదంతో కూడిన మాట దేవుడి ఇష్టంకు విరోధంగా ఉంటదేమో? అని భావించేవారు. జాతర ముగిసి వెళ్ళేటప్పుడు ఆ జనం మరిసంతాన చేతిలో పదో ఇరవైయ్యో నోటును ఆమె వద్దు వద్దంటున్నా ఇచ్చి వెళ్తుండేవారు. జనం ఔదార్యంతో ఇలాగున ఇచ్చే డబ్బు ఒకింతగా ఆమె జీవనోపాయంకు ఒక దారిగా అవుతుండేది!

❖ ❖ ❖

అంతోని సెమినరీలో ఐదు సంవత్సరాల తన ఇంటర్, డిగ్రీ శిక్షణ ముగించాడు. ఇక పోస్ట్‌గ్రాడ్యుయేషన్ స్థాయిలోని ధార్మిక శిక్షణకని అతను సిద్ధమైయ్యాడు. ఇది వెనకటి డిగ్రీస్థాయిలోని శిక్షణలాగ కాదు. తత్వజ్ఞానం, థియాలజి, తర్కశాస్త్ర కోర్సులు గాకనే ఇతర ధర్మాల శాస్త్రాల్ని అతను చదివేదుంది. జతగా కఠినమైన ధార్మిక శిక్షణకు తననుతాను అర్పించుకోవాలి. ఫాదర్‌గారి నిజమైన జీవనం, ఘోటక బ్రహ్మచర్యం, క్రమశిక్షణ, దైవభక్తి, దైవప్రీతి... అంతా ప్రారంభమైయ్యేది ఇక్కడే కదా! ఇక పుట్టినఊరు, ఇల్లు అని తిరిగేది లేదు. ప్రార్థన జపం తపం అని రోజంతా దేవుడి ధ్యానంలోనే నిమగ్నమవ్వాలి! ధార్మిక శిక్షణ అంటే గ్రంథాల అధ్యయనం మాత్రమే కాదు, క్రైస్తవధర్మాన్ని సంపూర్ణంగా బతుకులో అలవరుచుకోవాలి. వెనకటి బతుకులోని అన్ని సంబంధాల్ని సుఖభోగాల్ని త్యజించి ఏసుక్రీస్తులాగ అవ్వాలి.

ఇలాగున ఉండబోయే శిక్షణకు ముందుగా అంతోని తన పుట్టిన గ్రామంకు వచ్చాడు. అతను చదవబోయే పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోర్స్ ఆరంభమైయ్యే ముందు ఎనిమిది రోజులు అతని జన్మస్థలంలో గడిపేందుకు అవకాశం దొరికింది. రాబోయే ముందు నెలలోని మొదటివారంలో అతను తిరిగి బెంగళూరుకు రావాల్సిఉంటదని సెమినరిలోని ముఖ్యస్థులు చెప్పి పంపారు.

ఈసారైతే అంతోని పూర్తిగా మారిపోయాడు. చిన్నదైన గడ్డాన్ని పెంచాడు. రంగురంగుల బట్టలు వదిలి శ్వేతదుస్తుల్ని ధరించాడు. మెడలో శిలువ ఉంది. రోజులో మూడు పూటలూ జపం. లేచేటప్పుడు, భుజించేటప్పుడు, నిద్రించేటప్పుడు దేముడికి స్తోత్రం. ఎప్పుడూ బంగళాలో చర్చి ఫాదర్ జతగా ఉండేవాడు. అమ్మచెంత కొచ్చేదే రోజులో ఒకట్రెండుసార్లే. పరిచితులు స్నేహితులు కల్సినా వాళ్ళ జతగా ఎక్కువ మాటలు లేవు. క్రితంలో లాగ చనువు తమాష లేదు. సాయంత్రం అయిన తక్షణం బంగళాకు పరుగులు పెట్టుతుండేవాడు.

మరిసంతాన ఒకసారి అడిగింది.

"పుత్రా... నువ్వు ఊరుకు వచ్చింది ఎందుకు?"

"నిన్ను చూసి వెళ్ళేందుకు... మామ్"

"మరిక నువ్వు పొద్దస్తమానం ఫాదర్‌గారి బంగళాలో ఉంటే ఎలాగ?"

అతను నవ్వాడు.

"అమ్మా, ఇకముందు నా జాగా ఫాదర్‌గారి బంగళానే. చర్చి చెంతే... ఎల్లప్పుడూ దేవుడి ధ్యానం, ప్రార్థన, జనుల ఆధ్యాత్మికం గురించి మాట్లాడే కార్యం..."

పుత్రుడి మాటల్ని వింటున్న ఆమెకు ఎందుకో గొంతులోని నరాలు బిగుసుకు పోయినవి.

భర్త మరణానంతరం ఆమె బతుకుసాగింది ఎంతో కష్టమైంది. ఒకవైపు తను ఏకాకి అనే వ్యథ, మరొకవైపు తన జానెడుపొట్టకు తనే శ్రమించాల్సి వచ్చిన పరిస్థితి ఆమెను కలచి వేస్తుండేది. పుత్రుడు ఉన్నా లేనట్లుగా పరిస్థితి. అందరి గురించి యోచించే పుత్రుడికి తను భారంగా ఉన్నానేమో అనే బాధ ఆమెలో ఉంది.

"నా వ్యథ మాత్రం దూరం కాలేదు పుత్రా... వదిలేయ్ నన్ను" అంటూ కొడుకు నుంచి రాబోతున్న మాటల్ని నిలువరించి పలికింది.

"నీ వ్యథను మరిచిపో అమ్మా... ఇది దేవుడికని నువ్వు చేస్తున్న త్యాగం అని భావించుకో. దేవుడికని నువ్వు సహించుకొనే కష్టం అని తెల్సుకో...ఈ వ్యథ, త్యాగంకు నీకు ఇక్కడ ప్రతిఫలం దొరకకపోవచ్చు...అయితే నీ కోసం తండ్రైన ఆ దేవుడి పార్శ్వంలో ఒక ఉన్నతస్థానం వేచియుంటది... ఈ అవకాశం వేరే ఎవరికి ఉంటదో చెప్పు..."

వంటిమీద నిప్పుల వర్షం కురిసినట్లుగా మరిసంతాన చివ్వునే లేచి నిలబడింది.

"ఫాదర్‌గార్ల నోళ్ళనుంచి ఇటువంటి మాటల్ని వినివిని నాకు విసుగేసిపోయింది... ఈ బోధనల్ని విని నేనూ వయస్సులో దారితప్పాను... నాలాగే ఎంతోమంది మహిళలు

దారితప్పారు... ఇందుచేత నాకు ఈ విధమైన మాటల మీద విశ్వాసం లేదులే...” అంది.

అదెందుకో తల్లి పలుకుతున్న మాటలలో బిరుసు కాఠిణ్యం చూసిన అంతోనిలోని స్వరం మూగబోయింది. మొత్తం క్రీస్తు సముదాయం ఫాదర్లను గౌరవం నుంచి చూస్తుంటే, తన తల్లి ఒక్కతే ఎందుకు వాళ్ళను ద్వేషిస్తుంది? ప్రతిసారి తను ఇంటికి వచ్చినప్పుడల్లా “నువ్వు ఫాదర్‌గా అవ్వొద్దు”అని ఎందుకు మొరబెట్టుతుంది? ఫాదర్‌గార్లకు వంటచేసి భోజన వ్యవస్థను ఎన్నో సంవత్సరాలనుంచి చేసుకొని వస్తున్న అమ్మలోని ఈ ప్రవర్తనకు కారణం ఏమిటి?

మొట్టమొదటగా అన్నట్లు అతని తలలో ఈ ప్రశ్న పడగ ఎత్తింది. దీని గురించి తల్లిని అడగాలని అనుకొంటున్నప్పుడే మరి సంతాన “పుత్రా...” అంది.

ఆమె ధ్వని తక్షణమే గంభీరమైంది. పాతాళం అంచునున్న నీళ్ళలో చేదతో బిందె దించి నీళ్ళను లాగుతున్నట్లుగా ఆయాసంతో ఆమె అటెటో చూస్తూ చెప్పసాగింది.

“పుత్రా...నాకు వివాహమై నీతండ్రిగారి చేతిని పట్టుకొని ఈ గ్రామంకు వచ్చిన కొత్తలో ఇక్కడ డియాగో అని ఒక ఫాదర్ ఉండేవారు. ఎంతో చలాకిగా ఉత్సాహంగా ఉండే ఫాదర్ కదా! అలాగే జనాన్ని మాయబుచ్చే మంచి మాటకారి కూడా... నువ్విప్పుడు మాట్లాడావు కదా... అటువంటి మాటల్నే పలుకుతుండేవారు. నీ కళ్ళు ముఖం ముక్కు దేహవర్ణం చివరికి స్వరం కూడా వారిదే... వారి వీర్యాణువు ఫలమే నువ్వు...ఆ తర్వాత మేము దైవసమానుడు అని పిలుచుకోబడిన రొజారియో, మిరాండో, అగస్టిన్...లను చూసాం. వారంతా సద్భావునులే... అయితే ఈ డియాగో మంచి మనిషి కాదు. నువ్వు... నువ్వు... ఆ డియాగో ఫాదర్‌లాగ మారి రేపు ఈ ఫాదర్లగారి పరంపరలో ఎక్కడ అనుచితంగా ముందుకు దూసుకెళ్తావో అనే భీతి నాలో ఉంది. నేను... నువ్వు ఫాదర్‌గా కాకూడదు అని ఎందుకు కోరుకొంటున్నానో తెల్సా... ఫాదర్‌గార్ల మాయమాటలకు మోసపోయి యువతులు (మహిళలు) దారి తప్పరాదు... అనే కారణంకే... నీలో కూడా మోసబుచ్చే మాటల్ని ఆడే మాయకళ ఉంది... ఆ డియాగోలో ఉన్న చాకచక్యత నీలో ఉంది...”

ఆమె పట్టిపట్టి ఇంతే చెప్పింది. నిదానంగా ఆమె తల వాల్చింది. దేహం ముదుచుకు పోయింది. గంభీరంగా సాగిన ఆమె ధ్వని నిదానంగా కుంగిపోయింది. లేచి లోపలికి వెళ్ళే స్థితిలో ఉన్న ఆమె తలుపు చెంత నిలబడి మళ్ళా చెప్పసాగింది:

"ఈ విషయాన్ని చెప్పకూడదని అనుకొన్నాను. అయితే ఈ రోజు నా హృదయాన్ని విప్పి గతాన్ని నీ ముందు ఉంచాను... నేను ఒంటరిగా బతికే నిర్ధారం చేసుకొన్నాను... ధైర్యం కూడా నాలో ఉంది... నువ్వు చేసుకొన్న నీ తీర్మానంలాగ ముందుకే సాగొచ్చు... నేను అడ్డుపడేది లేదు ఇక..."

ఆమె గదిలోకి వెళ్ళిపోయింది.

ఒకట్రెండు నిమిషాల తర్వాత చర్చి నుంచి సాయంకాలంలోని ప్రార్థనాగంట నాదం విన్పించింది. మూలలో ఉంచిన కుర్చీలో కూర్చున్న సైంట్అంతోని ఆ గంటారావం తన చెవిలో పడలేదు అన్నట్లుగా కూర్చున్నాడు. మరిక హడావుడిగా లేవలేదు. దేవుడి పఠం మీద మైనం ఒత్తిని వెలిగించలేదు. నుదురు, హృదయం, భుజాల మీద గురుతు పెట్టుకొంటూ శిలువ వందనం చేయలేదు. ఆ రాత్రి అతను ఫాదర్‌గారి బంగళాకు వెళ్ళలేదు.

కొన్నినెలలలోపే మరిసంతానబాయి తన పుత్రుడైన అంతోనికి హొన్నావరంలోని చర్చి చెంత ఉండే వాడనుంచి కైతానసోజగారి పుత్రికను కోడలిగా తెచ్చుకొంది. కోడలు మెట్టినింటికి వస్తుంది అన్నప్పుడు అంతోనీకి ఒక మంచినౌకరి కూడా దొరికింది.

పాత చందమామ కథలలో రాయబడినట్లుగా చెప్పబడినట్లుగా ఇప్పుడు వారంతా సుఖంగా ఉన్నారులే!

**మూలకథ రచనాకాలం : 2007**

# సముద్రంకు నిప్పుపడింది

**కా**య్యికణిగారి జూలియమ్మ ఇంటి స్నానం గది పైనున్న పెంకుల సందునుంచి బయటకొచ్చిన నీలిపొగ నిదానంగా బస్తునాయకగారి ఇంటి ముందున్న పొట్ల పందిరిలో గిరికీలు కొట్టి, ఫెర్నాండెజ్ గారి ఇంటి ముందున్న జామచెట్టు చుట్టూరా తిరిగి, గుస్తీన్ మాష్టారుగారి ఇంటి ప్రాంగణం దాటి, ఫాదర్‌గారుండే బంగళావైపుకు తన పరిధి దాటించినప్పుడు సాయంత్రం ఆరుగంటలైంది. అప్పుడే తన పని ముగించుకొని వచ్చిన డియోగ మేస్త్రీ ఎర్రబియ్యం నూకలోని గంజిని కంచంలో పోయించు కొంటున్నప్పుడు, పొగతోపాటు వీధంతా వ్యాపించుకొన్న ఎండుచేపను కాల్చిన పరిమళం మేస్త్రీ ముక్కుపుటాలకు తాకి, అతను గంజితో పాటు నంజుకొనేందు కని భార్యనుంచి వడ్డించబడిన ఊరగాయి తొక్కును పక్కకునెట్టి "నీ ఊరగాయతొక్కు ఎవరికి కావాలే మహారాణి, ఈ కాల్చిన బంగడె చేపవాసనే సరిపోతదిలే" అంటూ సరసరా గంజిని జుర్రుకోసాగాడు. మునిమాపు చీకటిలో ఆ వీధికంతా ఈ ఎండు బంగడె చేపవాసన వెళ్ళి ముట్టినందున, అదెవరో మహానుభావుడు "ఓ సముద్రంకు నిప్పుపడింది" అని అంటుండగా, మరెవరో "నంజుకొనేందుకు కాల్చిన ఎండుచేపలు లేనోళ్ళు తొందరగా తిండి ముగించండి... వాసన మరెటో వెళ్ళగలదు" అన్నాడు. వీధికి వెనకుండే చర్చిలోని సాయంకాలంకు చెందిన ప్రార్థన ఘంటారావంను విని వచ్చి, తన అరుగుమీద కూర్చుని మసకమసక వెలుతురులో చదువుకొంటున్న రైమండ్‌సోజ, "మా ఊర్లోని కిరస్తానివాడలో సాయంత్రం అయ్యిందంటే రెండు మాత్రం అనివార్యం: ఒకటి చర్చిలోని ఘంటారావం,మరొకటి బంగడెచేపల్ని కాల్చిన వాసన కదా" అని తన మనసులో చెప్పుకొని తన మాటకు తనే నవ్వాడు.

ఇలాగున కిరస్తానుల(క్రైస్తవుల)వాడలో ఉండే పదిఇళ్ళకు బంగడె చేపను కాల్చిన వాసన వ్యాపిస్తున్నందున కాయ్యికణిగారి జూలియమ్మ ఇంటికి పక్కనుండే రోజియమ్మ ఇంటిముందున్న అరుగుమీదనుంచి ఒక ఫిరంగి మోగింది. రోజియమ్మ అప్పుడే సాయంత్రవేళలో చేస్తుండే శిరస్నానాన్ని ముగించి వచ్చింది. తడిసిన తన శిరోజాల్ని భుజాల మీద పరుచుకొని, ఒక చేతిలో పాతదైన చెక్కదువ్వెన పట్టుకొని, పరుచుకొన్న కేశాల్ని దువ్వుకొంటూ...

"ఉదయంలో ఎండబెట్టిన బంగడె చేపల్నుంచి నాలుగు చేపలు దొంగిలించబడినవి అని నేను చెప్పినందుకు మా ఇంటిప్రక్క అటుఇటు ఉండే ముండలందరూ మేము చూడలేదు, మేము దొంగిలించలేదు అంటూ సైంట్అంతోని మీద ప్రమాణం చేసారు కదా...ఇప్పుడు కాలబెట్టిన చేపలోని వాసన ఎవరింటినుంచి అది బయటకు వస్తుంది? సత్యం కూడుకూ ఒక చిన్న చేపలేదని చెప్పినోళ్ళు, ఇప్పుడు వాళ్ళకు ఎండుబంగడె చేపలు ఎక్కడ్నుంచి వచ్చినవో చెప్పమనండి? దేవుడా... ఉదయం వేళలో ప్రాంగణంలో సూర్యకిరణాలు పడేదిలేదు... నీ వద్ద ఉండనీ అని మొన్న నా పుత్రిక మురుడేశ్వరం నుంచి పంపిన ఏభై బంగడె చేపల్ని ఎండవేడికని ఆరబెట్టిందే ఆలశ్యం, పదినిమిషాలలోనే నాలుగు చేపలు మాయమైనవి అంటే ఏమి అనాలి ఇప్పుడు... బస్తీకంతా ఇప్పుడు చేపల పరిమళాన్ని వెదజల్లి మేము సంపన్నులమే అని చూపించుకొనేందుకు బయల్దేరినోళ్ళు మరిక నాకు జవాబు చెప్పేదుంది. లేదంటే నేను గోవాలో ఉండే సైంట్ అంతోని స్వామికి పోస్ట్కార్డురాసి న్యాయం అడిగేనా..."

రోజియమ్మ ఉదయంలో తన ఇంటిముందున్న ప్రాంగణంలో వరుస వరుసలుగా మురుడేశ్వరం నుంచి పుత్రిక పంపిన బంగడె చేపల్ని ఎండబెట్టింది నిజమేనండి! పది పది చేపల్ని ఐదు వరుసలలో ఎండబెట్టి ఆమె అక్కడే ఉండి వాట్ని కాపలా కాసింది కూడా నిజమేనండి! అయితే మధ్యలో సంతియాబిడ్డ మునగకాయలు కావాలి అని అడుగుతూ వచ్చినప్పుడు కాపలా కాసేదాన్ని వదిలి ఇంటివెనుకకు పోయి మునగకాయలు కోసి ఇచ్చింది. ఈ పని ముగించి మళ్ళా ప్రాంగణంలోకి వచ్చినప్పుడు చివరి వరుస తక్కువైపోయి అక్కడ నాలుగు బంగడె చేపలు మాయమైనవి. అప్పుడు అక్కడే ఆమె నిలబడి అరిచింది. గోవాలో ఉండే దేముడికి విషయం ఇలాగుంది, తప్పుచేసినోళ్ళకు సరైన శిక్ష విధించండి అని లేఖరాస్తే, అతను అటువంటి జనంకు శిక్ష వేస్తాడు అనేది ఒక నమ్మకంగా ఈ ప్రాంతంలో చెలామణి అవుతున్నందున, ఆ బెదిరింపునూ ఆమె చేసింది కదా! అంతేగాకుండా ఆమె అక్కడే నిలబడి శాపనార్థాలు పెట్టింది.

"దేముడా... ఇంటెనుకకు వెళ్ళి వచ్చేలోపే వాళ్ళెవరు వచ్చారయ్యా.. బంగడె చేపల్ని దొంగిలించేందుకు... వాళ్ళ చేతులు విరిగిపోనీ, వాళ్ళ నాలికమీద పురుగులు పడనీ, దొంగిలించేందుకు వీళ్ళకు నా చేపలే కావాల్సి వచ్చినవా..."

ఆమె తిట్లు ఆ వీధికంతా విన్పించగా కొంతమంది అక్కడక్కడ ఈమెకు విన్పించేటట్లుగా, అలాగే ఈమెను ఉద్దేశించికాదన్నట్లుగా...

"అయ్యయ్యో... మేమేమి బంగడె చేపల్ని చూసినోళ్ళం కామా? ఒక రూపాయి ఇస్తే ఒకటికాదు రెండు చేపల్ని ఖార్వీగారు ఇస్తాడు కదా, వాట్ని ఇక్కడ దొంగిలించాలా?"

"ఈ దొంగిలించి తినే బుద్ధి మాకు సైంట్‌అంతోని దయనుంచి రాలేదులే... కావాలంటే నేను ప్రమాణం చేసి చెపుతాను."

"మా ఇంటికి వందబంగడె చేపల్ని ఖరీదించి తెచ్చింది మొన్ననే కదా, ఇప్పుడు దొంగిలించి తెచ్చి తినే ఆవశ్యకం మాకు లేదులే"

"మేము ఎండు చేపల్ని తెచ్చేదేలేదు. పత్యం కూడుకు కావాలి అని అడిగినా, మా ఇంట్లో బంగడె చేప దొరకదు" అంటూ కొంతమంది అన్నారు. రోజియమ్మ ఈ అన్నిమాటల్ని విన్పించుకొన్నా ఉదయంలో ఆమె జగడాన్ని కొనసాగించలేదు. అయితే ఇప్పుడు సాయంత్రమై, చర్చి ఘంటారావం విన్పించిరాగా, వీధంతా బంగడె చేపల్ని కాల్చిన వాసన ప్రసరించి ఆమె కడుపులో కారం కల్పినట్లుగా అయ్యి, మరిక ఆమె అరుగు వద్దకొచ్చి నిలబడింది.

రోజియమ్మ గొంతును విన్పించుకొన్న కొన్ని ఇళ్ళలో ఉండేవాళ్ళు ఏదో నెపాన్ని వెతుకుతూ వాళ్ళ వాళ్ళ ఇళ్ళ ప్రాంగణాలలో కనబడుతూ రోజియమ్మ నుంచి వస్తున్న ఈ మాటలకు ఎవరెవరు ఏమేమి జవాబు ఇస్తారు, ఈ మాటలు ఎక్కడికి వెళ్ళి ముట్టుతవి అనే నిరీక్షణలో వేచియున్నప్పుడు, స్వయంగా కాయ్కిణిగారి జూలియమ్మ తన ఇంటిముందుభాగంలో ప్రతిష్ఠాపితురాలై ఉండగా, చుట్టూ ఉన్న ఇళ్ళలో ఆసక్తి, కుతూహలం, కౌతుకాన్ని రేగించినవి.

జనం నిరీక్షించినట్లుగానే జూలియమ్మ చీరను ఎత్తికట్టి కథనంలోకి దూకింది ప్రప్రథమంగా!

"మా ఇంటి పొయ్యిలో మా ఇంటి బంగడె చేపల్ని కాల్చేందుకు నీ ఇంటినుంచి పర్మిషన్ కావాలా... నువ్వు ఎండబెట్టిన చేపల్ని నేను దొంగిలించానని నువ్వు ఎలాగున అనగలవు? దేవుడి ముందు మైనం ఒత్తి వెలిగించి నేను ప్రమాణం చేస్తాను కావాలంటే! ఇంత్రువంశం వాళ్ళు ఒక బంగడె చేపకు గతిలేనోళ్ళు అని నువ్వు భావించుకోవద్దు. నువ్వు ఎండబెట్టిన చేపల్ని గుస్తీన్ మాష్టారుగారి కుక్క ఎత్తుకుపోయి ఉండొచ్చు. నువ్వు మమ్మల్ని ఎందుకు అపరాధంకు గురిచేస్తావు? చేపల్ని ఎండబెట్టినోళ్ళు వాట్ని కాపలా కాస్తూ కూర్చునేదుంది... ఇప్పుడు వీధిలో నిలబడి నోరుపారేసుకొంటే అది పద్ధతేనా? వాడలో చేపల్ని పొయ్యిలో వేసింది నేను మాత్రమే కాదు... వేరేవాళ్ళూ చేపల్ని కాల్చుతున్నారు... వారికీ చెప్పు..."

జూలియమ్మ ఇంత్రుమేస్త్రి వంశంవారి మనిషి. ఇంత్రుగారి కోడలు. ఈ వంశంకు ఆ ఊర్లో ఏదో గౌరవం ఉండేది. ఒకానొక కాలంలో ఎద్దులబండి ఉంచుకొని దర్బారు చేసినోళ్ళు ఈ ఫ్యామిలివారే కదా! మాటమాటకు తన ఫ్యామిలి పేరును

ముందుకు తెచ్చుకొనేది కూడా ఆమెకొక హవ్యాసం(హ్యాబిగా)గా మారిందిలే! ఇందుచేత జూలియమ్మ తన మెట్టినింటి ఘనతను ముందుకు తెచ్చింది.

అయితే ఇది ఆ రెండిళ్ళ నడుమ జగడంగా ఆగిపోలేదు. ఇక్కడ ఇప్పుడు గుస్తీన్ మాష్టారుగారి శునక ప్రస్తాపం కూడా వచ్చింది కదా! సాయంత్రం అయిన తక్షణం ఇళ్ళలో చేపల్ని కాల్చే ఇతరులూ వచ్చి చేరారు.

"అరెరే... దేవుడా... మా జిమ్మి ఏనాడైనా ఏదాన్నైనా దొంగిలించింది ఉందా? మా ఇంట్లో ఒక వస్తువుకు నోరు చాపేది లేదు... దాని మీదా ఈ ఆపాదన? మాతో పాటు దిననిత్యం ప్రార్థనకు కూర్చుండే దీనిమీద ఆపాదన మోపేవాళ్ళను మేరిమాత ఉత్తిగనే వదిలేదిలేదు, గుర్తుంచుకోండి" అంటూ గుస్తీన్ మాష్టారుగారు అప్పటికే అఖాడంలోకి దిగారు. వారితోపాటే మూడో ఇంటికి చెందిన ముంతునాయక్ గారి సతీమణి కార్మిలీనా తన ప్రాంగణం వదిలి రోడ్డుమీదకు వచ్చింది. "ఏంటి రోజిబాయి... ఈ వీధిలో ఎవరూ చేపను కాల్చరాదు అంటే ఎలా? మురుదేశ్వరంలోని నీ బిడ్డకు తప్పితే ఎవరికీ బంగడె చేపలు దొరకవా? చేప (మీను)అంటే ఏంటి మాణిక్యమా... లేకపోతే ముత్యమా... ఒక ఎండుచేపను దొంగిలించి తెచ్చి కాల్చుకు తినేగతి ఈ వాడలో ఎవరికైనా వచ్చేది ఉందా? ఇప్పుడు నేను నా ఇంట్లో చేపల్ని నిప్పులకుంపట్లో వేసాను. అది కూడా నువ్వు ఉదయంలో బయట ఎండబెట్టిన చేపలే అని అంటే ఎలా?"

కార్మిలీనా నుంచి వస్తున్న మాటల్ని మధ్యలోనే ఆపి చెప్పింది జూలియమ్మ ఇలాగున: "విను విను మంచిగా... ఊర్లో ఉన్న బంగడె చేపలన్నీ నావే అన్నట్లుగా మాట్లాడుతుంది కదా రోజియమ్మ... ఈమెను దులిపేవాళ్ళెవరూ లేరా? చేపలంటే కుక్కా దొంగిలించొచ్చు, పిల్లీ దొంగిలించొచ్చు... జనమే దొంగిలించారని చెప్పేది సబబేనా?"

జూలియమ్మ చేపల్ని దొంగిలించింది పిల్లై ఉండొచ్చు అనిచెప్పి మరొక మూగప్రాణిని ఈ జగడంలోకి తెచ్చి నిలబెట్టింది. వీధిలో పిల్లి పెంపకం ఉంది పూర్వాశ్రమంలో మంగళూరుకు చెందిన డిసోజగారి ఇంట్లో మాత్రమే! వీధిలో ఉన్న మిగిలిన క్రైస్తవుల కన్నా తామే శ్రేష్ఠులం అని విర్రవీగుతుండే డిసోజ మరియు వారి ఫ్యామిలి మీద మిగిలినోళ్ళకు అంతగా ప్రీతిలేదు. ఇందుచేత ఈ వాడలో ఉండేవారు ఏదేదో నెపాన్ని పెట్టుకొని డిసోజగారి ఫ్యామిలిని తిట్టేదుంది. ఈ ఫ్యామిలీవారు కూడా వీళ్ళ విమర్శకు అంతగా గమనం నిల్పకనే తమ పాటికి తాము అన్నట్లుగా ఉండేదాన్ని రూపొందించుకొన్నారు. అయితే ఇప్పుడు ప్రారంభమైన జగడం ఇకనూ ప్రాథమిక స్థాయిలోనే ఉండగా, అప్పుడే ఆఫీసు ముగించుకొని ఇంటికి వస్తున్న డిసోజగారు,

చేరినోళ్ళ చివరి పలుకులన్నట్లుగా చేప, పిల్లి, దొంగతనం అనే శబ్దాల్ని విన్పించుకొని ఇంటి ప్రాంగణంలో కాలు పెట్టి "ఎవరది మా పుస్సిక్యాట్ గురించి మాట్లాడుతుంది? మా పుస్సీకి చేపలు మాంసం అంటే జుగుప్సతో ఆమడ దూరంకు పారిపోతది... మూగప్రాణుల మీద మాట్లాడేవారు సరిగా యోచించాలి... ఎముకే లేని నాలుక ఉంది కదా అని ఎడాపెడా మాట్లాడేది పద్ధతి కాదు..."

డిసోజగారి మాటకు, అలాగే ఇప్పటికే మాట ఆపిన గుస్తీన్ మాష్టారుగారి మాటకు తను బదులుమాటను పలకకపోతే తప్పు అవుతది అని భావించిన రోజియమ్మ కొంచెం ధ్వనితగ్గించి...

"నేను పిల్లిగురించి మాట్లాడలేదు డిసోజ మామా, మీ జిమ్మి కూడా నా గమనంకు రాలేదు గుస్తీన్ మామా... ఒక కుక్క ఒక పిల్లి చేపను తింటే మాకు అయ్యే నష్టం స్వల్పంగానే ఉంటది... అయితే ఈ రెండుకాళ్ళ కుక్కలు, పిల్లులు ఉన్నవి కదా... వీటినుంచి మాత్రం మాకు అపాయమే! ఈ రోజు ఎండబెట్టిన చేపల్ని దొంగిలించారు... రేపు ఎండలో ఆరేసే పిల్లల మేజోళ్ళనూ కాజేస్తారు..." అంటూ రోజియమ్మ డిసోజా గారికి అలాగే గుస్తీన్ మాష్టారుగారికి సంజాయిషి చెప్పేందుకు వెళ్ళింది. అయితే తక్షణమే మాట చేపల్నుంచి జారి పిల్లల కాలి మేజోళ్ళవైపుకు వెళ్ళి ముట్టింది. ఇంటి అరుగుమీద కూర్చుని మసక వెలుతురులో చదువుకొంటున్న రైమండ్ డిసోజ పుస్తకాన్ని పక్కకు జరిపి ఇక్కడ నడుస్తున్న జగడాన్ని వినసాగాడు. అతనికి రేపే పరీక్ష ఉంది. అతను ఈ రోజు పాతపాఠాల్ని చదివేది ముఖ్యమై ఉందిలే! అయితే వాడలోని ఘనమహిళలు తను మంచిగా చదువుకొనేందుకు అవకాశాన్ని నిశ్శబ్దాన్ని ఇవ్వట్లేదు కదా అని అతను పేచీలో పడ్డాడు.

రోజియమ్మ పుత్రిక, ఇప్పటికి రెండు మాసాలక్రితం దుబాయినుంచి వచ్చింది. దుబాయి అంటే మరిక చెప్పాలా? ఆమె కట్టుకొన్న చీరలు, కళ్ళకు అద్దాలజోడు, కాలుకు ఎత్తుచెప్పులు అన్నీ ఇక్కడుండే అందరి చూపుల్ని తన వైపుకు లాక్కొంది. ఈ మధ్యలో ఆమె తన పుత్రిక కాలి మేజోళ్ళను ఉతికి బయట ఆరబెట్టింది. సాయంత్రం అయినప్పుడు అవి అక్కడ లేవు కదా! ఎక్కడ ఎక్కడున్నవి అని రోజియమ్మ, ఆమె పుత్రిక ఇంటిముందు వెనక వెతికి, మరిక ఎప్పటిలాగే నోరు పారేసుకొని తర్వాత దాని గురించి మర్చిపోయారు. రోజియమ్మ పుత్రిక సెలవుల్ని గడిపి దుబాయికి వెళ్ళిపోయింది. అయితే కొన్నిరోజుల తర్వాత ఈ మేజోళ్ళు రోజియమ్మ ఇంటి ఎదురున్న ఇనాసమ్మగారి మనుమరాలు కాళ్ళలో కన్పించుకోగా, మరిక రోజియమ్మ ఇనాసమ్మ జతగా జగడం ఆడకుండా ఉండిపోలేదు.

ఈ విషయం అప్పుడప్పుడు మాటలమధ్య కన్పించుకొని ఆ రెండు కుటుంబాల నడుమ కొట్లాటకు కారణం అవుతుండేది. ఇప్పుడు మళ్ళా ఎండబెట్టిన బంగడె చేపలు దొంగిలించపడిన జతగా ఇదీ దూసుకొచ్చి తన ఇంటిముందు ఉడకబెట్టిన వరిధాన్యాన్ని ఎండబెడుతూ నెరుపుతున్న ఇనాసమ్మ చెవిని కొరికింది. వంగి తన పాటుకు తను అన్నట్లుగా వరిధాన్యాన్ని నెరుపుతున్న ఇనాసమ్మ మరిక నిటారుగా నిల్చేందుకు ఒక ట్రెండు నిమిషాలు తీసుకొంది.

"ఎండబెట్టినప్పుడు పోగొట్టుకొన్న చేపలమీదున్న కోపాన్ని నువ్వు మరిక కాలిమేజోళ్ళ మీదకు తీసుకురావొద్దు... ఎలాగున డబ్బు ఇచ్చినోళ్ళకు ఎండుబంగడె చేపలు దొరుకుతవో అలాగే డబ్బు కుమ్మరించినోళ్ళకు కాలి మేజోళ్ళు దొరుకుతవిలే... చూసిన వాటన్నిట్నీ నా ఇంటికే చెందినవి, నా ఇంటినుంచి దొంగిలించబడినవి అని వాగొద్దు... రేపు నీ ఇంట్లో ఉన్న వస్తువుకు విలువ దొరకకనే పోతది..." అంటూ ఇనాసమ్మ గురిపెట్టి మాటల రాయిని విసిరింది. అది గురి తలుపింది.

రోజియమ్మ చివరి పుత్రికకు వయస్సు ముప్పై దాటుతున్నా పెళ్ళిగాకనే ఇంట్లోనే ఉంది. ఆమెకు పదహారో పద్దెనిమిదో సంవత్సరాల ప్రాయంలో ఉన్నప్పుడు తను సిస్టర్ అవుతాను అని చెప్పి బెంగళూరులో ఉండే ఒక సెమినరీ కళాశాలలో చేరింది. తమ కుటుంబంనుంచి ఒకర్ని దేవమాతసేవకని ప్రత్యేకంగా వదిలాం అని రోజియమ్మ, ఆమె భర్త చెప్పుకొంటూ ఘనంగా తిరుగుతుండగా, ఊరి జనం కూడా ఇదే భావన నుంచి చూడసాగారు. అరకొరగా డిగ్రి చదువుతూ ఇంటికి తిరిగి వచ్చింది ఆ యువతి. ఇలాగున ఇంటికి తిరిగి వచ్చిన ఆ యువతి మళ్ళా సెమినరీకి వెళ్ళలేదు. సెమినరీలో కూడా ఈమె నడత సరిగా లేదని అక్కడున్నోళ్ళు భావించారు. బయటేమో ఏదో గడబిడ చేసుకొంది అన్నారు ఊరిజనం. సెమినరి నుంచి బయటకొచ్చిన ఈమె మరిక అక్కడికి వెళ్ళలేదు.

ఇక్కడ ఆ యువతి పుట్టింట్లో వివాహ సంబంధం కని ప్రయత్నించారు. ఎవరెవరో వచ్చి చూసి వెళ్ళారు. ఒకటి సరిగా కుదరలేదు. ఇలాగున వచ్చినోళ్ళకు ఆ బస్తీలో జనం ఏవేవో చెప్పి చెవులు కొరికి సంబంధం కుదరనట్లుగా చేసారు. ఈ యువతికి మళ్ళా ఎవరెవరితోనో అక్రమ సంబంధం జోడించి జనం మాట్లాడేది కొనసాగింది. సుందరమైన ఒక వస్తువును ఇంటిలో ఉంచుకొన్నా దానికి విలువరాకనే ఆగినందుకు కృశించిపోయింది రోజియమ్మ. ఆమె భర్త వంటలోడు. ఇందుచేత ఇనాసమ్మ పలికిన మాట రోజియమ్మ మర్మంకు తాకింది. బుద్ధికి తాకింది. రోజియమ్మ చేతిలో ఉన్న చెక్క దువ్వెనను అరుగుమీద రాచి, "నా ఇంటి వస్తువు మీద మాట్లాడే నువ్వు, మొదటగా నీ ఇంట్లో ఉన్న వస్తువు గురించి యోచన చేయి... నా పుత్రికైతే దుబాయి

మస్కట్ అంటూ వాళ్ళ వీళ్ళ జతగా పడుకొని పారిపోలేదు. నా బిడ్డ వివాహం ఈ రోజు గాకపోతే రేపు అవుతది... దాని చింత నీకు వద్దు... నీ బిడ్డ ఆమె మొగుడ్ని ఏనాడైనా ఇక్కడికి తోలుకొని వచ్చిందా? ఎందుకని? మనకులపోడు ఒకడూ ఆమెకు దొరకలేదా? ఆమెకు దుబాయి మిండగాడే కావాల్సివచ్చాడా?" అంటూ రోజియమ్మ ఘాటుగానే ఇనాసమ్మ ముఖం మీద మాటలతో గుద్దింది. ఇనాసమ్మ బిడ్డ దుబాయికి వెళ్ళినప్పుడు ఒంటరిగానే వెళ్ళింది నిజం. అయితే అక్కడ ఆమె కులానికి ధర్మానికి చెందని ఒక యువకుడ్ని లగ్నమైంది ఉందికదా! ఊరుకు వచ్చినప్పుడు అతడేమి ఈమె జతగా వచ్చేదిలేదు. "నీ మొగుడ్ని ఒకసారి చూపించవే తల్లి" అని అడిగితే "అయ్యో వారికి సెలవు దొరకనంతగా నౌకరి పని ఉంది" అంటుండేది ఆమె. ఈ విషయం గుర్తున్న రోజియమ్మ ఇనాసమ్మకు గట్టిగానే ప్రతిమాట పలికింది.

మరిక జగడం ఆ ఇరువురు నడుమ తారాస్థాయికి ఎగబాకింది. తనకుక్క తరుపున మాట్లాడేందుకు వచ్చిన గుస్తీన మాష్టారుగారు కుక్క గురించి మర్చిపోగా, డిసోజగారు తమ పుస్సీగురించి మరిచారు. గుస్తీన్ మాష్టారుకు, డిసోజగారికి కొంచెం నిరాశ అయ్యింది. ఒక ఎండు బంగడె చేపను ముందు పెట్టుకొని జగడం చేసుకొంటున్న తమ జనుల సంస్కృతిని చక్కగానే వెతికి వేరే జాతోళ్ళ ఎదురు మర్యాదనుంచి బతికేదాన్ని నేర్వండి అని హితం చెపుదామనుకొన్న ఆ ఇద్దరికీ మాట్లాడేందుకు సరైన అవకాశమే లభించ లేదు. మిగిలినోళ్ళు కూడా ఎండుబంగడె చేపను మర్చి అక్కడ నడుస్తున్న జగడాన్ని వినసాగారు, వీక్షించసాగారు. ఎవరికీ ఆ జగడాన్ని ఆపాలనిగాని, దాన్ని నిలువరించాలని గాని తోచలేదు. పుస్తకాల్ని మూసేసి కూర్చున్న రైమండ్ సోజకూ ఏమి చేయాలనేది తెల్వట్లేదుకదా!

ప్రతి ఇంట్లో పిల్లలు దేవుడి పీఠముందు మైనంఒత్తి వెలిగించి సాయంత్రంలోని ప్రార్థనకు సిద్ధమౌతున్నప్పుడు... రోజియమ్మ మొగుడికి తల మీద వేటుపడి అతను ఆస్పత్రికి చేరుకొన్నాడు. ఇనాసమ్మ భర్తకు కడుపులో గాయమై, అతను కూడా వైద్యకీయ శుశ్రూష పొందుతున్నాడు. ప్రాంగణంలోకి దిగి వచ్చి నిలబడి జగడంకు సాక్షిభూతులైన వారందర్ని పోలీసులు సాక్షులుగా నమోదు చేసుకొని, వాళ్ళ నుంచి సంతకాలు కూడా పెట్టించుకొన్నారు.

మరిక అక్కడేమి జరిగింది అని చెప్పేది ఇప్పుడు మనకు సబ్‌జుడిస్‌గా అవ్వగలదు. ఎందుకంటే ముఖ్యంగా ఈ జగడం విచారణ ఇప్పుడు కోర్ట్ పరిధిలో ఉందండి.

**మూలకథ రచనాకాలం : 2010**

# మైలు (ఫర్లాంగు) రాళ్ళకు రంగులేసేందుకని వచ్చిన యువకుడు

కోగారులోని ఘాట్ రోడ్డులో వాహనాలు వెళ్ళేదంటే కళ్ళకు బట్టకట్టుకొని వెళ్ళినట్లే కదా! సూర్యుడు నడినెత్తికి చేరినా వెలుగు కిరణం భూమి మీదకు దిగనట్లుగా ఉండే ఈ ఘోరారణ్యంలో పయనించేందుకు ధైర్యమే ఉండాలండి ఎంతోళ్ళకైనా! వెనకెన్నడో బండ్లు తిరిగేందుకని బ్రిటీషోళ్ళ నుంచి వేయబడిన రోడ్డులో ఇప్పుడూ ఎక్కువగా ఎద్దుల బండ్లే తిరుగుతున్నా ఉదయం సాయంత్రం అన్నట్లుగా రెండు బస్సులు మాత్రం ఈ రోడ్డులో తిరుగుతుండేవి. ఒకసారి ఒక బస్సు వెళ్ళిందంటే మరిక పైకిలేచిన దుమ్ము సరిదిద్దుకొనేందుకు అరగంట పట్టేదుందిలే! ఇలాపైకి లేచిన దుమ్ము దూళి, ఆకులమీద, కొమ్మలమీద పడి ఆకులన్నీ తమ మూల వర్ణాన్నే పోగొట్టుకొని ఉంటుండేవి. కేవలం చెట్లు వృక్షాల ఆకుల మీద మాత్రమే కాదు, రోడ్డుకు అటు ఇటు ఉన్న ప్రాంతమంతా దుమ్ము, దూళుమయమై అదే ఒక విశేష దృశ్యావళిని సృష్టిస్తుందిలే! దట్టమైన ఆ ఘోరారణ్యంలోని కటిక చీకటి జతగా ఈ దుమ్ముదూళు కప్పుకొని నిండిన దృశ్యం కూడా అక్కడుండే భీకరత్వానికి తన పాలును చేర్చుతుండేది.

రోడ్డుకు ఎడంప్రక్కన పాతిన మైలురాళ్ళు ఈ దుమ్ము నుంచి, అక్కడ పెరిగిన చెట్ల తీగలనుంచి అల్లుకుపోయి తమ అస్తిత్వాన్ని పోగొట్టుకొన్నవి. ఇటువంటి మైలురాళ్ళకు నూతనంగా రంగులు వేయించాలనే కొత్తజ్ఞానం పి.డబ్ల్యు.డి ఇంజనీర్ గారికి వచ్చినా, అక్కడికి వెళ్ళి ఆ అడవిలో కనబడకుండా ఉన్న మైలురాళ్ళను వెతికి వాటికి రంగులేసేందుకు ఏపైంటరూ రానందున ఇదొక కార్యం అలాగే బాకిపడి ఉంది. అంతేగాకుండా దారి పొడవునా ఉండే ఫర్లాంగు రాళ్ళు మైలురాళ్ళకు రంగులేసేది అదంత సులభసాధ్యమైన పనికాదు. ఆ రోడ్డులో వాహనాలు, జనుల తిరుగాట ఎంతో తక్కువ. అక్కడ ఎన్నో గ్రామాలు లేవు. దట్టమైన ఘోరారణ్యంకదా! అడవి జంతువుల సంచారం కూడా ఎక్కువే. ఇందుచేత ఈ కార్యం ఎన్నో సంవత్సరాల నుంచి మూలనపడియుంది. అయితే ఇక్కడ మైలురాళ్ళే లేవు అన్నట్లుగా ఒక ఆపాదన డిపార్ట్‌మెంట్ మీద మోపబడి ఉన్నందున ఈ రంగులేసేదాన్ని చేయించేందుకు

ఇంజినీర్‌గారు వేగిరపడసాగారు. చివరికి వారు ఒక పైంటర్‌ను ఈ కార్యంకని వెతికి సఫలమైయ్యారు. సాగర పట్టణంలో ఒక పైంటర్ వద్ద సహాయకుడిగా పనిచేస్తున్న మాలింగను ఉత్సాహపరిచి ఈ రంగులద్దే దానికని తోలుకొచ్చాడు.

ఒక సుదినంలో ఆ నిగూఢ ఘోరారణ్యం మధ్య ఎరుపుమట్టినుంచి నిండియున్న రోడ్డులో టిణ్‌టిణ్ అని చప్పుడు చేస్తూ ఒక సైకిల్ సవారి ఎక్కుతూ దిగుతూ తొక్కుతూ వస్తుండగా, అపరూపంగా ఎదురైయ్యే ఒంటరి ఇంటిలోని జనం ఏదో సంభ్రమాశ్చర్యాన్ని చూసినోళ్ళలాగ ఇంటినుంచి బయటకొచ్చి నివ్వెరపోయి చూడసాగారు. కొంచెం పాతదైన సైకిల్, దాని వెనకుండే క్యారేజ్ మీద ఒక సంచి, కొన్ని డబ్బాలు ఉన్నవి. ఆ సైకిల్ మీద మధ్య వయస్కుడైన ఒక యువకుడు ఉన్నాడు. అతను తొడిగిన బట్టల మీద రంగు మరకలున్నవి. అతని చేతికి రంగు అంటుకొని ఉంది. ఆ ఘోరారణ్యంలోని ఘాట్‌రోడ్డులోని బిగుమానం తననేమి చేయదన్నట్లుగా అతను సైకిల్ తొక్కుతున్నాడు. గంట (బెల్) కొట్టూ, ఫెడల్ తొక్కుతూ బృహదాకారంలో ఉన్న వృక్షాల్ని, అవి ఉన్న ఎత్తైన గిరి శిఖరాల్ని లోయల్ని చూస్తూ ఈలవేస్తూ హుషారుగా సాగిపోతున్నాడు.

ఒకట్రెండు బస్సులు, కొన్ని ఎడ్ల బండ్లు మాత్రమే తిరుగుతుండే ఆ రోడ్డు మీద ఉన్నపళంగా సైకిల్ ఒకటి వస్తున్నందున చెట్లమీదున్న కోతులు పక్షులు పొదలలో దాగి కూర్చున్న ఇతర ప్రాణులు గలిబిలి చెంది కోలాహలం చేయసాగినవి. ఈ మార్పు నుంచి సంతసపడిన పైంటర్ మాలింగ గర్వంగా సైకిల్‌ఫెడల్‌ను తొక్కసాగాడు. తనకు ఎదురైన మైలురాయికి తెల్లరంగు వేసి ముందొచ్చే మైలురాయిని వెతుక్కొంటూ వస్తున్న అతను అటుఇటు చూస్తూ సైకిల్‌ను తొక్కుతున్నాడు. కొంచెంసేపు అయిన తర్వాత సైకిల్ తొక్కుతున్న మాలింగకు అలుపు వేయసాగింది. తాగేందుకు తినేందుకు ఏదైనా దొరుకుతదేమోనని అతను కోరుకోసాగాడు. అతని కోరిక నెరవేరుతది అన్నట్లుగా, ఒక దాన్ని మరొకటి ఆలింగనం చేసుకొని నిల్చిన రెండు వృక్షాల మధ్య చాయ్ హోటల్ ఒకటి కనబడగా అతని ముఖం విప్పారింది.

తన చాయ్ హోటెల్‌కు ముందున్న అడ్డ బెంచి మీద కూర్చున్న పరమయ్య భట్టుకు ఆ రోడ్డులో ఇదే మొదటిసారిగా సైకిల్ ఒకటి వచ్చినందున..."ఓయ్ ఓయ్ రండి, చాయ్ తాగి వెళుదురుగానీ" అంటూ సైకిల్ మీద ఉన్నోడ్ని ఘనంగా స్వాగతించాడు. పరమయ్య గారి చాయ్‌హోటల్‌కు గిరాకీలు తక్కువే. ఉదయం సాయంత్రం వేళలలో వచ్చే బస్సులు అక్కడ ఆగేది తప్పితే, వక్కల్ని నింపుకొని వెళ్ళే బండ్లు మాత్రం అక్కడ జమ అయ్యేవి. ఇక జనం అంటే కోగారు, నాగవళ్ళి, హాడువళ్ళి,

మల్లినమడుగు.... గ్రామాలోళ్ళేకదా! కొంతమంది ఫారెస్ట్ గార్డులూ అప్పుడప్పుడు విచ్చేస్తుండేవారు ఆ హోటల్‌కు. ఇంతేనండీ! లేకపోతే ఎప్పుడూ కూతపెట్టుండే ఉత్తిత్త పిట్ట ధ్వనినీ వినేదుంది. ఇందుచేత ఎవరైన కొత్తమనిషిని కోగారులోని రోడ్డు మీద చూస్తే, తక్షణమే పరమయ్య మెదడు చురుకైయ్యేది. "రండి... రండి" అంటూ పరమయ్య కొత్తగా వస్తున్న ఈ సైకిల్ వ్యక్తికి స్వాగతం కోరింది జరిగింది కదా!

"ఏమి అడవి, ఏమి అరణ్యం ఇదండి", అంటూ ఆ హోటెల్ ముందు సైకిల్ నిలబెట్టి అతను లోపలికి వచ్చాడు. "దార్లో ఒక చాయ్ హోటెల్ అయినా ఉండకూడదా అని మొక్కుకొని వచ్చానండి... అబ్బా ఇక్కడే ఒక చాయ్ హోటెల్ ఉంది కదా... ఒక చాయ్ ఇవ్వండి... ఇస్పెసల్ చాయ్ ఇవ్వండి" అంటూ ఆ యువకుడు చేతికి వేళ్ళకు అంటుకొన్న తెల్లరంగును పాత బట్ట ముక్క నుంచి తుడుచుకోసాగాడు.

"ఔను, ఇదేమి వేషం మీది... వళ్ళంతా రంగే... ఏంటి తుమ్రి గ్రామంలో ఏదైనా రంగులు పూసే చల్లే జాతరా..." అంటూ ఆ వచ్చినోడు తనకు సుపరిచితుడే అన్నట్లుగా మాటలలోకి దిగాడు.

"నా దేహం మీద గులాం(రంగులు)చల్లే వారుంటారా? నేనే రంగులేసే మాలింగను... మైలురాళ్ళకు రంగు లేసేందుకు వచ్చినోడ్ని... సర్కారుద్యూటి నాది... అలాగని సోమరి కార్యం కాదండి... ఒకవైపు అరలగోడు నుంచి మైలురాళ్ళన్నింటికీ రంగులేసి వస్తున్నాను" అంటూ ఆ యువకుడు, పరమయ్య మేజాబల్ల మీద ఉంచిన పాత్ర నుంచి ముఖం కడుక్కొని లోపలికి వస్తూ పలికాడు.

"మీ కార్యం అదే అయితే అలాగే కానీయండి" అన్నాడు తేలికగా పరమయ్య.

"ఔనండి... నా కార్యం గట్టిదికాదని అనేందుకు ఒక కారణం ఉండాలికదా... ఎందుకు నా ఈ కార్యం గట్టిది కాదని మీరు పలికారు?" అంటూ తిరిగి ప్రశ్న వేసాడు మాలింగ.

"ఔనయ్యా, వెనకటి నుంచి నేను చూస్తూ వచ్చింది ఉందిలే. ఇక్కడ మైలురాళ్ళకు రంగులేసేందుకని ఎవరైనా వచ్చింది ఉందా... ఇన్ని సంవత్సరాలకు నువ్వొక్కడివే వచ్చావని తేలికగా చెప్పానులే" అని తను ముందు పలికిన మాటకు సంజాయిషి ఇచ్చాడు పరమయ్య.

"ఎవరూ వచ్చేదిలేదు. ఒంటరి భూతంలాగ అడవిలోపల దాగియుండే రాళ్ళను వెతికి వాట్ని క్లీన్‌గా చేసి, చుట్టూ పెరిగిన పొదల్ని తీగల్ని పీకిపారేయాలి. తెలుపురంగు ఆ తర్వాత నలుపురంగు అని వాటికి పైంట్ వేయాలి. చెట్లచాటునున్న ముంగీసులు, కోతులన్నీ నన్ను చూసి అరవాలి, నక్కో తోడేలో అక్కడ్నుంచి పారిపోవాలి. ఈ పనికి

ఎవరూ వచ్చేదిలేదు... నేనైతే వచ్చాను. వచ్చిన తప్పుకు సరిగానే కార్యాన్ని చేసి వెళ్తాను...” అంటూ మాలింగ తన కష్టాన్నంతట్నీ కొన్ని శబ్దాలలోనే చెప్పుకొనే ప్రయత్నాన్ని చేసాడు.

పరమయ్య అవిర్లుపెట్టున్న చాయ్ చేసి దాన్ని నాలుగు సార్లు పైకిక్రిందకు దారపోసి గ్లాసులో నింపి తెచ్చి మేజా మీద పెట్టూ మాలింగను అడిగాడు... “ఎన్ని రోజులు కార్యం?” అని.

ఇలాగున హాడువళ్ళిదాకా రంగులేసేది... ఒక రోజు తెల్లరంగు వేసేది, మరునాడు నలుపురంగు... తొక్కినదారినే మళ్ళా తొక్కేదుంది... పట్టుకొన్న బ్రష్‌నే మళ్ళా పట్టుకొనేది...రంగువేరే... రాళ్ళు వేరే” అంటూ సుర్‌సుర్ అని చప్పుడు చేస్తూ అతను చాయ్ తాగసాగాడు.

“హుం... డబ్బెంత? చాయ్, బాగుందండి”

“ఉండనీ, ఉండనీ నువ్వు ఇప్పుడే కదా ఫస్ట్‌టైమ్ మా హోటల్‌కు వచ్చింది. మళ్ళా రండి అప్పుడు ఇద్దరు గానీ”.

“ఇంకొక నాలుగు రోజులు... ఇక్కడుండే ఐదారు మైళ్ళరాళ్ళకు రంగులద్దేదాక మాత్రమేనండి... తర్వాత ముందుకే సాగిపోయేదుంది” అంటూ అతను నవ్వాడు.

“అలాగే కానీయండి. ఈ నా చాయ్ దుకాణంకు పర్మనెంట్ గిరాకీలు ఎక్కువగా లేవు. ఉదయంలో వచ్చే గజానన సర్వీస్ బస్సుకు చెందిన రొజారియో ఒకడే నాకు పర్మనెంట్ గిరాకి. అయితే అతను డబ్బు ఇచ్చేదిలేదు... బస్సును ఇక్కడికి తెచ్చి నిల్పి జనాన్ని నా దుకాణం వైపుకు మళ్ళిస్తాడు. మంచోడు... అతని సహకారం లేదంటే ఈ అడవిలో నేను చాయ్‌హోటెల్ నడిపేదుంటదా?”

“సరేనండి నేను వెళ్ళివస్తాను.”

మాలింగడి సైకిల్ మట్టిరోడ్డులో దిగింది. టిణ్‌టిణ్ చప్పుడు చేస్తూ వెళ్ళిన ఆ సైకిల్ కొంచెం దూరంలో దఢాల్నే ఆగినప్పుడు పరమయ్య తొంగిచూసాడు. మాలింగ రోడ్డు అంచున పడియున్న కూసడ్ని కూతూహలం నుంచి చూస్తూ నిలబడ్డాడు. ఇది కూసడి నుంచి వచ్చే ఎప్పటిలాంటి దృశ్యమే. ఉదయమే దొరతోటలో పనిచేసేందుకని సిద్ధమైవచ్చే ముందే తనియడి సారా అంగడికి వెళ్ళి కంఠం పూర్తిగా తాగి ఇక్కడే రోడ్డు అంచున పడిపోగా అతడ్ని మోసుకెళ్ళేందుకు అతని పుత్రిక శంక్రి రావాల్సి ఉంటది. అప్పటిదాకా కూసడు ఇక్కడే పడియుంటాడు.

పరమయ్య రెండు అడుగులు ముందుకు వేసివచ్చి మాలింగకు చెప్పాడు ఇలా: “ఆ జనం అలాగేనయ్యా నువ్వు వెళ్ళు, దీన్ని విచారించేందుకు వేరే వాళ్ళు వస్తారులే”

"ఔనండి, ఎవరోపాపం...'

"అది అలాగే... నాకు నీకు పాపం. అతనికి పాపం గీపం ఏమి లేదులే... నడవండి మీరిక ముందుకే!"

మాలింగ కొంచెం సేపు కూసడి చెంత నిలబడి కనికరంతో చూసి నిదానంగా అక్కడ్నుంచి వెళ్ళేందుకు సిద్ధమైనప్పుడు దూరంలో కూసడి పుత్రికైన శంక్రి... "దేముడా ఇంత పొద్దుకే తాగి పడ్డాడు కదా" అని విలపిస్తూ వస్తున్న దాన్ని పరమయ్యా చూసాడు, మాలింగ కూడా చూసాడు.

తన ముందుండే రోడ్డు, మలుపు తిరిగే దృశ్యాన్ని దాటేందుకని మాలింగ మరిక వెనకకు చూడకుండా సైకిల్ తొక్కసాగాడు.

❖ ❖ ❖

మాలింగ సాయంత్రం దాకా ఆ రోడ్డు బారుకూ కార్యాన్ని నిర్వహించాడు. ఇంకేంటి భట్కళ-సాగరం బస్సు వస్తదని అన్పించినప్పుడు సైకిల్‌ను తెచ్చి పరమయ్యా హోటెల్‌లో నిలబెట్టి... "భట్టుగారు దీన్ని ఇక్కడే ఉండనీయండి. నేను రేపు ఉదయం వస్తాను. ఇక్కడ దీన్ని ఉంచినందుకు మీకేమైనా ఇబ్బంది ఉంటదా?" అని అడిగాడు.

"అయ్యో... మీసైకిల్ మాత్రమే కాదు, ఇక్కడ లారీని బస్సును సైతం వదిలివెళ్ళింది ఉంది. అవి చెడిపోయి ఆగినప్పుడు వాట్ని ముట్టేందుకు ఇతరులెవ్వరూ వచ్చేదిలేదు" అన్నాడు పరమయ్య.

మాలింగ బస్సు ఎక్కేందుకు సిద్ధమైయ్యాడు. తన షర్ట్ ప్యాంటు సరిచేసుకొన్నాడు. తన కేశసంపదను హోటల్‌లో ఉన్న అద్దంముందు ఒకసారి చూసుకొన్నాడు. అతను అక్కడ నిలబడినప్పుడు కూసడి పుత్రిక పరమయ్య హోటెల్‌కు వచ్చి... "భట్టుగారు, మా నాయనను ఇక్కడెక్కడైనా చూసారా?" అని అడిగింది.

"నాయన ఎక్కడ పడిపోయాడో?" అంటూ చెదిరిన తల కేశాల్ని గోక్కొంటూ మళ్ళా రోడ్డు దిగి వేరొక దిక్కులో నడిచింది. మాలింగ కుతూహలంగా పరమయ్యను అడిగాడు ఇలా: "ఎవరు వీళ్ళు?"

"వీరిదొక భాగవతం. ఆమె తండ్రి ఇక్కడ బిడారం వేసుకొని మొదట్లో మంచిగానే ఉండేవాడు. కళత్రం(భార్య) గతించిన తదుపరి అతనికి తాగుడు వ్యసనంగా మారింది. పుత్రిక వాళ్ళ వీళ్ళ ఇళ్ళలో చాకిరి చేసి ఇద్దరి కడుపుల్ని నింపుతుంది...."

దూరంలో బస్సు వస్తున్న చప్పుడు దగ్గర పడుతుండగా మాలింగ చాయ్ దుకాణం వదిలిరోడ్డు అంచుకొచ్చి నిలబడ్డాడు. ఘాట్ ఎక్కి వచ్చిన బస్సు పరమయ్య హోటెల్ ముందు ఎదురురొప్పులు పెడ్తూ ఆగినప్పుడు, ఒకరిద్దరు దిగగా, మరిక

మాలింగను ఎక్కించుకొని మళ్ళా ప్రయాణాన్ని ముందుకు సాగించింది. బస్సులో ఒకఖాళి సీటు మీద కూర్చున్న మాలింగ బస్సుకిటికి మూలకంగా దృష్టి బయటకు పెట్టినప్పుడు ఒకసారి శంక్రి రూపాన్ని తన కళ్ళలో నింపుకొన్నాడు.

❖ ❖ ❖

అరలగోడు నుంచి హాడువళ్ళి వరకూ మైలు రాళ్ళకు రంగులేసే కార్యం ముందుకు సాగింది సాఫీగానే. మాలింగ పరమయ్య గారి హోటల్‌లో ఒక అర్థంలో పర్మనెంట్ గిరాకిగా మారాడు. ఉదయంలో సాగరం నుంచి బస్సులో వచ్చే అతను పరమయ్య హోటెల్‌లో ఉంచిన సైకిల్‌ను తీసుకొని పనికని వెళ్ళేవాడు. సాయంత్రం మళ్ళా ఆ సైకిల్‌ను అక్కడే ఉంచి బస్సు ఎక్కేవాడు. ఈ మధ్యలో చాయ్ తాగేందుకో లేకపోతే పరమయ్య చేసే వంటను తినేందుకో అతను వచ్చేదుంది. పరమయ్య వండే కుచలక్కి అన్నం, అప్పడం, సాంబారు, ఊరగాయ తొక్కుకు అతను తృప్తిపడి భుజిస్తుండేవాడు.

పరమయ్య హోటెల్ నుంచి సరైనంతదూరంకు అతను పనిచేయాల్సిన మైలురాళ్ళ వరుస ఉంది. అక్కడి వరకూ వెళ్ళి మైలు మరియు ఫర్లాంగు రాళ్ళకు రంగులు వేసి అతను తిరిగి పరమయ్య హోటెల్‌కు వస్తుండేవాడు. ఎందుకంటే ఆ దారి మధ్యలో మరిక ఏ ఇల్లు, హోటెల్ అతనికి కనబడేది లేదు. దారికి అటుఇటు అలుముకొన్న ఆ ఘోరాణ్యంలో అతను ఒకడే పనిచేసేదుంది.

ఈ మధ్యలో ఒక ఘటన జరిగింది. మొన్న అతను తిరిగి వస్తున్నాడు. పరమయ్య హోటెల్‌కు ముట్టి అక్కడ సైకిల్ ఉంచి రాబోయే బస్సు ఎక్కి పట్టణంకు వెళ్ళే హడావుడిలో అతను ఉన్నాడు. అతని తలను ఆనుకొనే మబ్బులు తేలిపోతున్నవి. అప్పుడప్పుడు ఉరుములు ఉరుమిరిమి గర్జించసాగినవి.

రోడ్డు పక్కనున్న వృక్షాలన్నీ భోరంటూ తలలూపుతూ అట్టహాసం చేస్తుండగా ఇతని మీద గాలి వేగంతో పాటు వర్షం కూడా దాడిచేసింది. గోలీల పరిమాణంలో ఉన్న వానబొట్లు అతని దేహాన్ని దండించసాగినవి. గాలి ఇతని సైకిల్ వేగాన్ని వెనక్కి నెట్టుతుంది. రోడ్డులో అడవి మీదున్న రాలిన ఆకులు, మన్ను పైకిలేచి ఇతని ముఖం మీదకొచ్చి పడుతున్నవి. ఇక ముందుకు సాగేది సాధ్యం కాదు అన్నప్పుడు రోడ్డు ప్రక్కనున్న ఒక భారి వృక్షం చాటుకు పరిగెత్తాడు. అప్పటికే కారునలుపు నేపధ్యంతో ఉన్న ఆకాశం తన వళ్ళు విరుచుకొన్నట్లుగా ఉరుము మెరుపులతో అట్టహాసం చేస్తూ నేల అదిరేటట్లుగా పిడుగు శబ్దాన్ని చేసింది. ఇలాగున ఉరుములు మెరుపులు మెరుస్తుండగా వృక్షం క్రింద మరిక నిలబడేది అపాయమని అతను భావించి రోడ్డు

నుంచి కొంచెం దూరంలో ఉన్న గుడిసె వైపుకు పరుగుదీసాడు. అక్కడున్న అరుగుమీద ఆశ్రయం పొందాడు. ఇతను తలొంచి ఆ గుడిసెకున్న చూరు క్రింద తన తలను పెట్టేందుకు ప్రయత్నిస్తుండగా లోపలి నుంచి శంక్రి... "వానరభసగా ఉంది, లోపలికి రండి" అని పిల్చింది. మాలింగ మసకబట్టి వెలుగుతున్న దీపంబుడ్డిలో ఇంటి లోపలికి ఒకసారి దృష్టి నిల్పి గుడిసెకున్న తడిక చెంతే మునిగాళ్ళ మీద కూర్చున్నాడు.

"వాన జోరు ఇప్పుడే మొదలైంది" అంది శంక్రి.

లోపలున్న వెలుగుకు అతని కంటి చూపులు సర్దుకుంటుండగా ఆ గుడిసె మూలన ముడుచుకొని పడుకొన్న శంక్రి నాయనైన కూసడు అతనికి కన్పించాడు. కూసడికి వంటి మీద ప్రజ్ఞలేదు. అతను అస్తవ్యస్తంగా ఒక ఈతాకుల చాపమీద పడియున్నాడు.

"వాన పడేముందే మీ నాయన గుడిసెకు చేరుకొన్నాడా?" అడిగాడు మాలింగ.

"ముందే రాలేదు... నేనే వెతికి తోలుకొచ్చాను. తాగిరోడ్డు అంచునున్న మైలు రాయి వద్ద పడియున్నాడు" అంది శంక్రి.

ఇది మాలింగకు తెల్సియున్న విషయమే. అతనికే కాదు... మొత్తం ఆ ప్రాంతం కంతా ఇది తెల్సియున్న విషయమే. మొదట్లో కూసడు మంచి పనోడే. వక్కచెట్లు ఎక్కటమేకాదు, వ్యవసాయంకు చెందిన సకల కార్యాల్ని అతను సమర్థుడిగానే చేస్తుండేవాడు. అయితే శ్రమించి తెచ్చిన దాన్నుంచి ఒక చిల్లిదమ్మిడీ ఇంటికి తెచ్చేటోడు కాదు. దొరల వద్ద డబ్బు పొంది నేరుగా తనియడి సారాయి అంగడికి వెళ్ళి వాట్ని ఖర్చుచేసి ఎక్కడెక్కడో తాగిపడుతుండేవాడు. శంక్రి అతడ్ని వెతికి గుడిసెకు చేర్చేదుంది. ఇటువంటి పరిస్థితి ఉన్నందున, శంక్రి ఒకట్రెండు ఇళ్ళలో పాచిపనులు చేసేది, వరినాటు, వరికోత, వక్కల్ని వలిచేది మొదలైన పనుల్ని వెతుక్కొంది. ఈ పనుల జతగా ఆమె తన నాయనను సుభద్రంగా చూసుకొనేస్థితి కూడా ఉంది. సాయంత్రం అయిన తక్షణం నాయన ఎక్కడ పడిపోయాడో అనేదాన్ని వెతికి అతడ్ని గుడిసెకు తోలుకొచ్చేది ఆమెకు మోయలేని అదనపు భారంగా ఉండేది. ఈ వ్యవహారం ఇక్కడికి వచ్చినరోజే మాలింగకు తెల్సింది. ఈ ఒక మాసంలో ఎన్నో సార్లు మాలింగ దీన్ని గమనించాడు.

శంక్రి తల్లి జీవించి యున్నప్పుడు ఆ కుటుంబం కొంచెం సుఖశాంతులతోనే ఉండేది. ఆమె ఒక సంవత్సరం క్రితం ఏదో జబ్బు చేసి చనిపోయింది. అప్పట్నుంచి కూసడు తాగుడుకు బానిసఅయ్యాడు. శంక్రి అనాథ అయ్యింది. పరమయ్యలాంటోళ్ళు ఆమె స్థితి చూసి జాలిపడ్డారు. అయితే జాలిపడుతుండేవాళ్ళ జాబితాలో కొత్తగా మాలింగ చేరుకొన్నాడు ఇప్పుడు.

మాలింగ గుడిసెలో కూర్చున్నప్పుడు శంక్రిలోపలికి వెళ్ళింది. పాత్రల్ని ఎత్తి బోర్లించింది. ఏదో పశ్చాత్తాపంనుంచి నిట్టూర్పులు వదిలింది. బయటకొచ్చి తలుపు చెంత నిలబడి వర్షాన్ని చూసింది.

"ఏంటీ? ఎందుకు దిగులుగా ఉన్నావు?" అంటూ అడిగాడు మాలింగ.

"ఈ నా బీదకొంపలో ఒక బొట్టు పాలూ లేవుకదా. పొయ్యిలో నిప్పు రాజేసేందుకూ అగ్గిపెట్టె కూడా లేదు" అంటూ కన్నీరు తుడుచుకొంది శంక్రి.

"శంక్రీ దీనికంతా నువ్వు దుఃఖించకు. వాన ఆగితే నేను పరమయ్య గారి హోటెల్‌కు వెళ్తాను" అంటూ మాలింగ ఎంతో బాధపడుతూ పలికాడు.

"ఈ రోజు వాన ఆగేది లేదు. చాయ్‌హోటెల్ బంద్రై అక్కడ అడవిదున్నలు వచ్చి పడుకొంటవి... మీరు ఇక్కడే కూర్చోండి" అంటూ గుడిసె చూరులో వేలాడదీసిన గొంగడ్ని తలమీద పెట్టుకొని గుడిసె బయటకొచ్చింది.

"శంక్రి నిలబడు, నిలబడు" అంటున్నా ఆమె చెవిలో పడలేదు మాలింగ నుంచి వచ్చిన పలుకులు. గాలి బోర్‌మంటూ రభసగా వీసి, దానితోపాటే పిడుగుల శబ్దం కూడా విన్పించింది.

శంక్రి వక్కతోటలో మెరకమీదున్న దొర ఇంటికి వెళ్ళి పాలు, చాయ్‌పొడి, బెల్లం, అగ్గిపెట్టె, చింతతొక్కు... మొదలైన వాట్ని ఒడిలో భద్రంగా దాబెట్టుకొని తీసుకొచ్చింది. పొయ్యి ముందు కూర్చుని మంటను రాజేస్తున్నప్పుడు మాలింగ మళ్ళా మళ్ళా చెప్పాడు ఇలా: "చాయ్ హోటెల్ ముందు నేను సైకిల్ ఉంచాను. వాన ఆగితే నేను అరలగోడుకు వెళ్తాను".

"వాన ఆగేది లేదు. పొద్దుగూకిన తదుపరి వచ్చిన చుట్టం, అదే వేళలో వచ్చిన వాన వెళ్ళవని అంటారు కదా మన పెద్దలు" అంటూ శంక్రి అతని ముందు వేడి వేడి చాయ్‌ను కంచుగ్లాసులో పోసి తెచ్చి ఇచ్చింది.

మాలింగ బయట జోరుగా రభసగా కురుస్తున్న వానలోని ధ్వనిని వింటూ, అప్పుడప్పుడు ఆర్భాటంగా మోగుతున్న పిడుగుల శబ్దాల్ని వింటూ, లోపల పొయ్యి ముందు కూర్చున్న శంక్రి దేహం మీద పడుతున్న అగ్ని కీళల్ని చూడసాగాడు.

శంక్రి సలక్షణంగా ఉంది. అప్పుడే విచ్చుకొంటున్న కమల దళాలుగా రూపు దాల్చిన ఆమె అంగాంగాలు, ఆకర్షణీయంగా ఉన్న కోల ముఖం, ఎరుపు వర్ణంతో ఉన్న ఆమె దేహకాంతి... వాట్ని మునుపెన్నడో చూసి మెచ్చిన మాలింగకు ఇప్పుడామె ఎంతో దగ్గరగా ఉన్నందున, ఆమె సంపూర్ణ రూపాన్ని మరో మారు కనులలో నింపుకొని కూర్చున్నాడు.

మాలింగకు మరో మానవీయ కోణం నుంచి శంక్రి నచ్చింది. ఆమె తండ్రికని పడే శ్రమ, ఇంటికి చేరకనేఉన్న తండ్రిని ఆ ఘోరారణ్యంలో వెతుకుతూ తిరుగుతుండేది, అతడ్ని లేపి పట్టుకొని గుడిసెకు తీసుకొచ్చేది, తాగివచ్చి అతను చేస్తుండే గలాటను సహించుకొనేది, అతను కోరినప్పుడు కాస్తోకూస్తో డబ్బు ఇచ్చేది, మత్తు నుంచి అతను కొట్టేదాన్నంతా భూదేవిలాగ ఓర్చుకొనేది... మాలింగ మాత్రమేకాదు, ఆ ప్రదేశంలో ఉన్న జనం అందరూ గమనించే విషయంగా అది అయ్యింది. దీనంతట్నీ మాలింగ నెమరేసుకోసాగాడు. అప్పుడు శంక్రి వంట చేసి ముగించుతున్నప్పుడు కూసడు చాపమీద పొర్లాడుతూ...'పుత్రీ, ఎవరే అతను?"అని అడుగుతూ లేచి కూర్చున్నాడు.

❖ ❖ ❖

భట్కళ–సాగర బస్సు వెళ్ళిన ఎంతో పొద్దు తర్వాత, ఇంకేంటి పరమయ్య తన హోటెల్ బంద్ చేయాలనుకొంటున్నప్పుడు అక్కడికి మాలింగ సైకిల్ తొక్కుతూ వచ్చాడు.

"బస్సు వెళ్ళిపోయింది కదా... ఈరోజు ఎందుకు ఆలశ్యం అయ్యింది?" అడిగాడు పరమయ్య.

"ఈ రోజుతో మైలురాళ్ళకు రంగులేసేది అయిపోయింది, ఇక మున్నందు ఈ బస్సు సైకిల్ నాకు అవసరమైయ్యేది లేదులే" అంటూ అతను వంటి మీదున్న భారాన్ని దింపుకొన్నోడిలాగ పలికాడు.

పరమయ్య ఆశ్చర్యంతో అతని ముఖం చూసాడు.

మాలింగ విరామంగా పరమయ్య హోటెల్‌లోని అడ్డబెంచి మీద కూర్చుని గతాన్నంతా జ్ఞాపకంలోకి తెచ్చుకొంటున్నోడిలాగ... "నేను సైకిల్ నెట్టుకొంటూ తొక్కుకొంటూ వచ్చింది గుర్తుందా మీకు?" అంటూ అడిగాడు. పరమయ్య ఆ గుర్తేలే అన్నట్లుగా తలూపుతుండగా మాలింగ....

"రెండు నెలలు అయ్యింది నేను ఇక్కడికి వచ్చి" అంటూ మాటలలోకి జారాడు. సాగరపట్టణంలో ఏదో పైంట్ షాపులో బోర్డుల్ని రాస్తుండే తనకు ఈపని అప్పగించిన ఇంజినీర్‌కు కృతజ్ఞత తెల్పాడు. ఎంతో కఠిణమైన ఈ వర్క్‌ను తను చేసి ముగించిన దాని మీద తృప్తి వ్యక్తపరిచాడు. రెండు నెలలు ఇక్కడ గడిపిందే తెల్వట్లేదు అన్నాడు. ఈ ఘోరారణ్యం, ఈ గిరి శిఖరాలు, లోయలు, ఇక్కడిజనం...అంతా తనకు సంతసం కలిగించినదాన్ని చెపుతూ... "మీరు ఏమైనా అనండి పరమయ్యభట్టుగారు, నేను నా సాగర పట్టణంలో ఇంత ఘనంగా నెమ్మదితనం నుంచి గడిపిందిలేదు" అన్నాడతను.

అతని ముఖం చూస్తూ పరమయ్య "మరిక ముందేమి చేస్తారు మీరు? ఊరికి వెళ్ళిన తదుపరి?" అని అడిగాడు.

"ఎందుకు, ఇక్కడే నాకు ఒక పని దొరకదని అంటారా మీరు?" అంటూ మాలింగ భట్టు ముఖాన్ని చూసి అడిగాడు. "తక్షణమే దొరకపోయినా, నేనే ఖుద్దుగా వెతుకుకొంటానులే" అంటూ మాలింగ కిసుక్కునే నవ్వాడు.

"పనా? ఇక్కడే చేస్తానంటే పనిదొరుకుతదిలే... మేమంతా బతకట్లేదా ఇక్కడ... ముఖ్యంగా ఇక్కడే ఉంటాం అనే పట్టుదల ఉండాలయ్యా" అన్నాడు పరమయ్య.

"సరేనండి అలాగైతే" అంటూ మాలింగ తన సైకిల్ మీదున్న రంగు డబ్బాలు మరితర వాట్ని సరిగా జోడించి పెట్టుకొని అక్కడ్నుంచి కదులుతున్నప్పుడు పరమయ్య అడిగాడు ఇలా:"ఇప్పుడు ఎక్కడికి వెళ్తున్నారు... బస్సు వెళ్ళిపోయింది కదా... చీకటి ముసురుతుంది."

కూసడి ఇంటికి అండి. ఇక నా బిడారం అక్కడే... కూసడు ఈరోజో రేపో స్వర్గస్థుడైయ్యేది కచితం... అతని పుత్రిక శంక్రీకి ఒక ఆసరా కావాలికదా?"

మాలింగడి సైకిల్ రోడ్డుకు దిగి టిణ్ టిణ్ అంటూ చప్పుడు చేసింది. ఈ చప్పుడు ఆ ఘోరారణ్యంలో కమ్మిన విచిత్ర మౌనం నడుమ హితకరంగా విన్పించింది పరమయ్యకు.

"ఏమైనా కానీ... ఈ పట్టణ యువకుడు కూసడి పుత్రికకు ఆసరా ఇచ్చాడు" అని పరమయ్య పరమ సంతోషంతో మనస్సులో అనుకోసాగాడు.

**మూలకథ రచనాకాలం : 2008**

# హాల్టింగ్ బస్సు

తీర్థహళ్ళి పట్టణం నుంచి సాయంత్రం స్వగ్రామంకు వచ్చిన పటేల్ కొత్త సంగతి ఒకదాన్ని మోసుకొచ్చారు. ఆ సంగతి ఏమిటంటే రేపట్నుంచి రాత్రివేళ విఠల్ సర్వీసు (ప్రైవేట్) బస్సు గ్రామంకు వచ్చి మరిక హాల్ట్‌చేసి మరునాడు ఉదయం శివమొగ్గ (షిమోగా)కు వెళ్ళే సుద్దిగా వారు గ్రామస్తులకు తెలియజేసారు.

“ఔనా రాత్రి ఎంత పొద్దుకు వస్తది?” అంటూ అంగడి నాగప్పయ్య అడిగాడు. గ్రామంకు ఒక బస్సు వస్తదంటే ఊరోళ్ళందరికీ సంతోషమే కదా! అయితే ఎక్కువగా సంతోషపడినోడు నాగప్పయ్యే. అంగడికి దిననిత్య సామానులు సరుకులు తెచ్చే అనుకూలంతో పాటు తను చేయించే కాఫి చాయ్ చిరుతిండ్లను తినేందుకు తాగేందుకు నలుగురు ఎక్కువగా దొరకొచ్చు అనేది అతని ఆలోచనగా ఉంది.

“ఆ బస్సు సాయంత్రం ఆరుకు శివమొగ్గ వదుల్తది. ఏడున్నరకు తీర్థహళ్ళికి చేరుతది. అక్కడ్నుంచి ఇక్కడికి ఎనిమిదిన్నరకు చేరుకోవచ్చు. మరునాడు ఉదయం ఏడుగంటలకు బయల్దేరుతది” అన్నాడు పటేల్.

పటేల్, నాగప్పయ్య అంగడి ముందున్న కట్టమీద నిలబడి బస్సు విషయం బిగ్గరగా చెపుతున్నప్పుడు జనం బాగానే పోగైయ్యారు. నాగప్పయ్యకు రెండో అర్ధాంగైన కామాక్షి; అంగడినుంచి సరుకులు కొనేందుకు వచ్చిన కొలిమితిత్తి ఉండే ఇమామ్ భార్య అమీనాబి, బరవహెగ్డెగారి జీతగాడైన దీవ్రనింగ, అంగడికి ప్రక్కన, ఎదురులో ఉన్న ఇంటోళ్ళు...ఇలా ఏడెనిమిది జనం అక్కడ పోగై సమాచారం విని సంతోషించారు.

ఆకు వక్కల్ని చకచకా నముల్తూ “ఔనా... మంచిదౌతదిలే. పేటకు వెళ్ళేందుకని ఆరు మైళ్ళు నడిచేది తప్పి పోతదికదా” అన్నాడు దీవ్రనింగడు. ఇప్పటివరకూ బస్సు ఎక్కేదుంటే కోణందూరు దాకా నడిచి వెళ్ళేదుంది. ఇక ముమ్మందు అంతదూరం నడిచి వెళ్ళే రగడ ఉండదు కదా అని అందరూ సమాధానపడ్డారు.

“మంచిగా మన బతుకులు మారుతవిలే” అంటూ నాగప్పయ్య అమీనాబీకి పదితులాల బెల్లం తూచే దాన్లో మునిగాడు.

వాకిలి అంచున నిలబడిన కామాక్షి కళ్ళలో మెరుపులు కన్పించసాగినవి. ఈ ఊరికొక బస్సు వచ్చి వెళ్ళేదుంటే ఎంతో అసహనం తొలిగిపోయినట్లే... ఈ ఊరు

ఎన్నో కార్యాలకు కేంద్రబిందువు అవుతది. పదిమంది వచ్చి వెళ్తారు అని అనుకొందామె. మిగిలినోళ్ళకూ సంతోషం అయ్యింది.

పటేల్ రెండు నిమిషాలు నిలబడి అలుపు తీర్చుకొన్నారు. ఒక చేతిలో మోకులకట్ట, భుజంకు వేలాడుతున్న సరుకుల సంచి, మరొక చేతిలో ఏదో మూట పట్టుకొని వారు తీర్థహళ్ళిలో బస్సు ఎక్కి కోణందూరు వరకూ వచ్చి అక్కడ బస్సు దిగి తన గ్రామంకు నడిచి వచ్చారు. బస్సుకు చెందిన సుద్ది లేనట్లైతే వారు నాగప్పయ్య అంగడి వరకూ వచ్చేదిలేదు. కొలిమితిత్తి ఉండే చోట కాలిబాటలో వారు మలుపు తిరిగి తమ ఇంటికి నేరుగా నడుస్తూ చేరుకొనేవారు. అయితే తను విన్న ఘన సమాచారాన్ని ఎవరికైనా తెల్పాలనే ఆత్రం నుంచి వారు ఈవైపు నుండే సెంటర్‌కు వచ్చారు.

ఐదుగంటలప్పుడు తీర్థహళ్ళిలోని ఉప బస్టాండ్‌కు వెళ్ళినప్పుడు "ఎవరండి అరగ, కోణందూరు, బసవన కట్ట, హుమ్జకు వెళ్ళే ప్రయాణికులు" అంటూ కేకలు పెట్టున్న ఏజెంట్ షెట్టిగారు..."ఓయ్...ఓయ్... పటేలా... రేపట్నుంచి మీ గ్రామంలోనే బస్సును హోల్టింగ్ (విడిది) చేయిస్తాం" అన్నాడు.

మొదటగా పటేల్‌కు విషయం ఏమిటనేది అర్థంకాలేదు. గుడ్లు తేలేసి వెర్రిగా షెట్టిగారి ముఖాన్ని చూసాడు. షెట్టిగారు టికెట్లు చింపుతూ డబ్బు లెక్కిస్తూ చెప్పాడిలా: "మాకు చెందిన శివమొగ్గ బస్సుఉంది కదా మహాశయ... అది రేపట్నుంచి మీ ఊరైన బసవనకట్ట వరకూ వెళ్ళి అక్కడే హాల్ట్ చేస్తది. ఈ సంగతిని ఊరోళ్ళందరికీ చెప్పండి..."

"అరెరే ఔనా?"

"ఔనండి! మీరిక ఏడుగంటలదాకా తీర్థహళ్ళిలో మీమీ పనుల్ని చేసుకోవచ్చు... ఇంటి ముంగిటే ముట్టి దిగొచ్చు. నడిచేది... వేరేబస్సు పట్టుకొనేది... ఈ తంటాలు ఏవి ఉండవు..." అన్నాడు షెట్టి. పటేలేమో మళ్ళా మళ్ళా అదే మాటను అతడ్నుంచి విని కచితం చేసుకొన్నాడు. వారికి ఎంతో సంతోషమైంది. శివమొగ్గకు (జిల్లా కేంద్రంకు) వెళ్ళేందుకు కూడా ముమ్మందు అనుకూలమే. శివమొగ్గలో బస్సు ఎక్కితే నేరుగా అంగడి నాగప్పయ్య ఇంటి ద్వారం చెంత దిగొచ్చుకదా!

బస్సు ఎక్కిన తర్వాత ఒకరిద్దరు ప్రయాణికులకు విషయాన్ని చెప్పాడు. కోణందూరులో బస్సు దిగి నడకదారి పట్టుకొన్నప్పుడు అమటెకొప్ప, అగళుగుండి, అంబారగోడులలో నిలబడి ఇలాగిలాగ అని చెప్పి కబురు ముట్టించాడు. గ్రామంకు చేరుతున్నప్పుడు నాగప్పయ్య అంగడి గుర్తుకొచ్చి ఈ వైపుకు తిరిగాడు.

“వస్తాను... నాగప్పయ్య” అంటూ చెప్పి మోకులకట్టను, భుజం మీద సంచి, గంటుకట్టిన మూటను పట్టుకొని అరుగు దిగాడు. నాగప్పయ్య దీపంకున్న గాజును తుడుస్తూ... “వెళ్ళిరండి... పటేలా” అన్నాడు.

తీర్థహళ్ళి నుంచి హమ్మ వైపుకు వెళ్ళే పెద్ద రహదారిలో వచ్చే కోణందూరులోని ఆస్పత్రి చెంత ఆ రహదారిని వదిలి కుడిపక్కనున్న మలుపుతిరిగే చోట ఒక మట్టి రోడ్డు వస్తది. నునుపైన ఎర్రమట్టి అంతా పొడి పొడిగా కుప్పపోసినట్లుగా పడియుంటది ఆ దారి. ఆ దారి వెళ్ళేది బసవనకట్టకు మాత్రమే. ఈ రోడ్డు మీద కొన్ని ఎడ్లబండ్లు మాత్రమే తిరుగుతుంటవి. ఆయా గ్రామాలకు చేపలు, చిల్లర సరుకుల్ని మోసుకెళ్ళి అమ్మే మళయాళ వ్యాపారస్థుల సైకిళ్ళు మాత్రమే తిరుగుతుంటవి. కోణందూరులో ఉండే డాక్టరైన ఇంద్రప్పగారి జావామోటర్ సైకిల్‌లోని డుబుడుబు చప్పుడు, ఫారెస్ట్ డిపార్ట్‌మెంటోళ్ళ జీపులు మాత్రం అప్పుడప్పుడు ఈ రోడ్డులో తిరుగుతుండే విశేష వాహనాలు కదా! ఈ దారి కోణందూరు నుంచి బసవనకట్టకు, అక్కడ్నుంచి అంబుతీర్థ వరకూ మలుపులు తిరుగుతూ వెళ్ళేదున్నా ఈ రోడ్డు మూడు కాలాలలో వాహన సంచారంకు యోగ్యమైనదిగా లేదు. ఇందుచేత బసవనకట్టకు చుట్టు ప్రక్కలుండే పదో పదిహేనోపల్లెల జనం పట్నంకు వెళ్ళేందుకు బస్సు సౌకర్యంలేక పడరాని పాట్లు పడుతుండేవారు. అయితే ఇప్పుడిక ప్రైవేట్ బస్సు సర్వీసువాళ్ళు తీర్థహళ్ళిలో హాల్టింగ్ చేసే బస్సు మరిక వెళ్ళేందుకు దారి సుగమంగా ఉన్న బసవనకట్ట వరకూ ముందుకు సాగదీసినందున సమాచారం ఆయా పల్లెల జనంకంతా తెల్సి సంతోషపడే సంగతిగా మారింది.

బసవనకట్టకు బస్సు ప్రారంభమైన సమాచారం ఆ చుట్టు ప్రక్కల ఉండే పల్లె జనంకు మరుదినమే తెల్సిపోయింది. తీర్థహళ్ళికి వెళ్ళిన ఈ వైపునుండే జనం మరిక చివరి బస్సుకని వేచియున్నారు. ఉప(దిగువ) బస్స్టాండ్‌లో, ఏజెంట్ షెట్టిగారు మొదటిసారి అన్నట్లుగా బసవనకట్టకు మాత్రమే గాకుండా మధ్యలో వచ్చే అమటెకొప్ప, అగళుగుండి, అంబారగోడు, మల్లినమడుగు గ్రామాలోళ్ళకూ టికెట్లు చింపి గేట్‌పాస్ రాసి ఎవరెవరికి చిల్లర పైసలు ఇవ్వాలి అని నాలుగుసార్లు అరిచి రైట్‌రైట్ చెప్పాడు. శివమొగ్గ, తీర్థహళ్ళి, కోణందూరు మార్గంగా బసవనకట్టకు వెళ్ళే బస్సు తీర్థహళ్ళిని వదిలినప్పుడు నలభైమంది ప్రయాణికులు ఆ బస్సులో ఉన్నారు.

కోణందూరు వద్ద తారురోడ్డు వదిలి బస్సు మట్టిరోడ్డుకు మళ్ళింది. బస్సు వెనుక దూళు నిండిన మబ్బులు ముసిరినవి. రోడ్డు ప్రక్కనుండే మామిడి, పనస, వెదురుపొదల్ని రాసుకొంటూ బస్సు ఎగిరెగిరి పడుతూ లేస్తూ బసవనకట్ట వైపుకు

దూసుకెళ్తుంది. ప్రయాణికులు తమ తమ పల్లెలకు బస్సు వచ్చి చేరుతుంది కదా అని మురిసి పోతున్నారు. దారిలో ఎదురైన పల్లె పోరలు చేతులు ఊపుతున్నారు. అమటెకొప్ప, అగళుగుండి జనం గంటు మూటల సమేతంగా తమ ఇళ్ళ ముందు దిగి ఎంతో సునాయాసంగా వచ్చాం కదా అని సంతోషపడుతుండగా, బస్సు వాళ్ళ మీద దుమ్ము లేపి మరిక బసవనకట్ట వైపుకు పరుగులుపెట్టింది.

అంగడి నాగప్పయ్య అరుగు వద్దకు చేరుకొని నిల్చిన పటేల్, కొలిమి నడుపుతుండే ఇమామ్, దీవ్రనింగడు, ఇమామ్ కొడుకైన ఇద్రూస్, బరవహెగ్డె, బసవనకట్టలోని లింగాయితుల గుంపుకు చేరిన విరుపాక్ష, లింగణ్ణ, గ్రామంలో చివరి ఇంటోడైన రంగప్ప, బాణం రుద్రయ్య, చిక్కప్పయ్య, కొంకణి జాతోడైన కామత్, ఇమామ్‌కు భార్యైన అమీనాబి, నాగప్పయ్యకు అర్ధాంగైన కామాక్షి... ఇలా ఎంతో మంది నాగప్పయ్య అంగడి ఎదురు జమైనప్పుడు దూరం నుంచి చప్పుడు వినబడింది. బస్సు నుంచి వచ్చే వెలుగు, చెట్లు పొదల మీద కాంతుల్ని విరజిమ్మింది. వచ్చిందయ్యా వచ్చింది అంటూ జనం సంభ్రమం నుంచి బెదిరి నిలబడినప్పుడు వెలుగు రేఖలు దగ్గర దగ్గరకొచ్చి చప్పుడు మరింత స్పష్టమై విఠల సర్వీసుబస్సు గిడ్డేగౌడగారి ఇంటెదురు నిలబడిన ఎద్దులబండిని దాటి, ఈరణ్ణగారి కుక్క వెనకకు జరిగి మొరుగుతుండగా ముందుకు ముందుకే దూసుకొచ్చి అందరూ ఎదురుచూసినట్లుగా నాగప్పయ్య అంగడి ఎదురులో రోడ్డు పక్కనున్న విశాలమైన స్థలంలో గబక్కనే నిలబడిపోయింది. దాన్లోని పోం పోం చప్పుడుకు అరకొరగా ఇళ్ళలో ఉన్న పోరలు మహిళలు బయటకొచ్చి చూడసాగారు. ఊరకుక్కలు సామూహికంగా హో అని మొరుగుతున్నవి. బస్సు ఒకసారి భోర్‌మని చప్పుడు చేసి దఢాల్నే ధ్వని తగ్గించగా లోపల వెలుగుతున్న బల్బు నుంచి జనం క్రిందకు దిగుతున్నారు. డ్రైవర్ బస్సు దిగి నాగప్పయ్య అంగడి ముందున్న అరుగు ఎక్కి చూస్తుండగా పోగైన జనం అతడ్ని స్వాగతించారు. దిగుతున్నోళ్ళనూ నగుమోముతో స్వాగతించారు. వారి తర్వాత దిగిన బస్సు కండక్టరుకూ ఇదే విధమైన సామూహిక స్వాగతం దొరికింది. బసవనకట్టకు చెంతనుండే గుబ్బిగ, చిలుమె, కడస, లింగాపుర, సాత్నళ్ళి, మల్లినమడుగు... మొదలైన ఊర్లజనం బస్సు నుంచి దిగిన పది నిమిషాల వరకూ నాగప్పయ్య అంగడి చెంత నిలబడి డ్రైవర్‌కు కండక్టర్‌కు గౌరవ నమస్కారాలు చేసి తమ తమ పల్లెల దారి పట్టుకొని చీకటిలో కనుమరుగైయ్యారు.

తలుపు చాటున నించొన్న కామాక్షి బస్సు నుంచి క్రిందకు దిగుతున్న డ్రైవర్‌ను చూసింది. బస్సుకున్న తళతళ మెరుస్తున్న బాడీని చూసి ముట్టి ముట్టి ఖుషి పడ్డాడు ఇద్రూస్. అమీనాబి అయితే చంకలో చర్మంబ్యాగును ఇరికించుకొని దిగుతున్న

కండక్టర్‌ను నిశితంగా చూసింది. ఇంతలో నాగప్పయ్య రెండు ప్లేట్లలో బిస్కట్లను, మైసూరు బొండాబజ్జీల్ని నింపి తెచ్చి మేజాబల్ల మీద పెట్టి డ్రైవర్‌ను కండక్టరునూ ఆహ్వానించాడు. వారు మేజాబల్ల చెంతనున్న కుర్చీలలో కూలబడి ప్లేటులో చేతిని నిల్పారు.

క్రితంలో ఎనిమిది గంటలకే బసవనకట్ట నిర్జనమైయ్యేది. నాగప్పయ్య అంగడి తలుపులు మూసి ఇంట్లోకి చేరుకొనేవాడు. కుక్కల నుంచి మొరుగులు తప్పితే మరిక ఏ ఇతర అడవి జంతువుల చప్పుడు వినబడేది లేదు. గిడ్డేగౌడ గారి తండ్రి ఉబ్బసం నుంచి క్యాకరించి ఉమ్మే చప్పుడు, కొంకణి కామత్‌గారి భార్య నుంచి వచ్చే కలవరింత శబ్దాలు, కొలిమి నడిపే ఇమామ్ తాగింది జాస్తి అయినప్పుడు పాడుతుండే శోకగీతమైన "ఘర్ ఘర్ మే దివాలిహై, మెరా ఘర్ మె అంధేరా... మెరా ఘర్ మే అంధేరా" మొదలైన చప్పుళ్ళు మాత్రమే వినబడుతుండేవి. జతగా రుద్రప్ప కుమారుడు కీచుధ్వని నుంచి ఏడ్చేది, లింగాయిత విరూపాక్ష భార్య సంభోగంకని మొగుడ్ని తిట్టుతుండేది, కొలిమి తిత్తిని ఊదే ఇమామ్ పుత్రికైన నూరి కలవరించేది ఉంది కదా! ఆ వేళలో మొత్తానికి బసవనకట్ట రాత్రి ఎనిమిది అయితే నిర్జీవంగా ఉంటుండేది. చీకటిలో గ్రామమంతా గొంగళ్ళు కప్పుకొని ముడుచుకుపోయి పడియుండేది అచేతనంగా!

అయితే హోల్టింగ్ బస్సు వచ్చిందే తడవుగా బసవనకట్టలోని రూపం మార్పు చెందింది. నాగప్పయ్య అంగడే లాస్ట్ బస్‌స్టాపుగా అయ్యింది. కొల్లూరులోని మూకాంబికాదేవి కృపనుంచి అతని వ్యాపారం అధికమైంది. డ్రైవర్ శేషగిరి శివమొగ్గ నుంచి తెచ్చి ఇచ్చిన పెట్రోమాక్స్ లైట్ వచ్చిన తర్వాత నాగప్పయ్య తన చెంతనుండే పాత హరికెన్‌లాంతుర్ను తీసి లోపల బెట్టాడు. పెట్రోమాక్స్ లైట్ నుంచి విరజిమ్ముతున్న వెలుగు సగం ఊరినే వెలుగులో నింపింది. తలుపు చెంత నిలబడే కామాక్షి అయితే ఇప్పుడు ఈ కాంతుల పుణ్యంగా మరింత సుందరంగా కన్పించసాగింది. బస్సు ఎనిమిదిన్నరకు సరిగా వస్తున్నందున నాగప్పయ్య తొమ్మిది గంటల వరకూ తలుపులు తెరిచి ఉంచాల్సిన పరిస్థితి ఒదిగివచ్చింది.

బస్సు రాబోతుందని కొంతమంది ముందుగానే అంగడి ముందున్న అరుగు మీదకొచ్చి కూర్చునేది సామాన్య విషయంగా అయ్యింది. కొంతమంది తమ అర్ధాంగులు, పిల్లలు, బంధువులు శివమొగ్గ, తీర్థహళ్ళి నుంచి వచ్చేదుందని, మరికొందరు డ్రైవర్ శేషగిరి వద్ద లేకపోతే కండక్టర్ బాషా వద్ద ముందస్తుగా డబ్బు ఇచ్చి ఏవేవో సామాన్లను తెమ్మని చెపుతుండేది మరికొంత మంది నిత్యం బస్సురాకను వేచియుండి చూసేది ఒక పనిగా పడింది. ఎందుకంటే బస్సును ఆపి కిందకు దిగి వచ్చిన శేషగిరి అంగడి ముందున్న అడ్డబెంచి మీద కూర్చుని శివమొగ్గ, తీర్థహళ్ళిలోని

పట్నం వార్తల్ని స్వారస్యంగా తెల్పుతుండేవాడు. ఒక అరగంట ఈ కబుర్లు విని నవ్వుకొంటూ ఇళ్ళకు వెనుదిరిగే దాన్ని కొంతమంది అభ్యాసంగా చేసుకొన్నారు. వీటన్నిట్నుంచి నాగప్పయ్యకు వ్యాపారం బాగా జరుగుతున్నందున అతనేమి దీనికి అడ్డుపడేదిలేదు.

ఉదయం మళ్ళా ఏడు గంటలకే కోలాహలం గడబిడ చప్పుడుతో "ఎవరండి కోణందూరు, అరగ, తీర్థహళ్ళి, మండగద్దె, గాజనూరు, శివమొగ్గ శివమొగ్గ శివమొగ్గ" అంటూ పది పదిహేను ఊళ్ళకు వినబడేటట్లుగా బిగ్గరగా బాషా కేక పెట్టేది జరుగుతుండేది. బస్సు స్టార్ట్ అయ్యేది, హార్న్ మోగించేది, ఆ తర్వాత బయల్దేరేదుంది. జనం పరుగులు పెట్తూ వచ్చి చాయ్ తాగి బస్సు ఎక్కేది చేస్తుండేవారు. లేకపోతే ఆయుర్వేద ఔషధంకో, స్టీల్ వస్తువుకో, పుస్తకంకో, ఎద్దుల మెడలో వేసే మువ్వల పట్టీలకో, బట్టలకో... మరే ఇతర వాటినో తెప్పించుకొనేందుకని ముందస్తుగా డ్రైవర్‌కు కండక్టర్‌కూ డబ్బులిచ్చేందుకు జనం వస్తుండేవారు. వీటన్నిటి నుంచి బసవన కట్ట ఏడుగంటలకే గిజగిజలాడుతుండేది. ఆ విరల్ సర్వీసు బస్సుకు కలెక్షన్ ఏమి తక్కువగా వచ్చేదిలేదు. ఉదయం రాత్రిలో ఎంతో మంది ప్రయాణికులు ఉండేవారు. బస్సు ఇంటి ముంగిటనుంచే ఆరంభమైనందున తిరుగాడే జనం కూడా ఎక్కువైయ్యారు. మాటెత్తితే తీర్థహళ్ళి, శివమొగ్గకు వెళ్ళి వస్తున్నారు. శివమొగ్గ లాంటి జిల్లా పట్టణంతో నేరుగా సంపర్కాన్ని వృద్ధించుకొన్న బసవనకట్ట ఎంతో తొందరగానే మార్పు చెందింది.

ఎప్పటిలాగే ఎనిమిదిన్నరకే చీకటిని చీల్చుకొని బస్సు వచ్చి ఆగింది. జనం దిగిపోయిన పిమ్మట శేషగిరి బస్సును మరొక దిక్కులో నిలబెట్టాడు. వెనక నిలబడిన బాషా "రైట్ అణ్ణ రైట్ అణ్ణ" అంటూ చెప్పసాగాడు. బస్సు వెనక్కి జరిగి కొంకణి కామత్ గారి ఇంటి ముందున్న స్థలంలోకి దిగి మళ్ళా తనమూతిని కోణందూరు వైపుకు పెట్టుకొని నిలబడినప్పుడు శేషగిరి క్రిందకు దిగి దఢాల్నే దాని తలుపును మూసాడు. అక్కడెక్కడో ఉన్న ఇద్రూస్ ఆక్షణంలో ప్రత్యక్షమై బస్సులో ఉంచిన బకెట్ ఎత్తుకొని పరుగుపెట్టాడు. ఇద్రూస్‌కు కొత్తగా దొరికిన డ్యూటి ఇది. బస్సును క్లీన్ చేసేది, లోపలున్న కసువును ఊడ్చి, బయటుండే గాజుల్ని తుడిచి, బానెట్‌ను ఎత్తి శుభ్రపరిస్తే అతనికి బాషా ఇస్తుండేది ఆ రాత్రికి ఎనిమిది అణాలు మాత్రమే (రచనా కాలం : 1987) నండి! కావాలంటే ఇద్రూస్ కోణందూరు, తీర్థహళ్ళి వరకూ బస్సులో ఉచితంగా వెళ్ళిరావచ్చు. ఇద్రూస్‌కు బస్సులో ఎక్కువ స్వాతంత్ర్యం. అదొక గొప్ప విషయంగా అతనిలో ఉండేది. ఇద్రూస్ తన కార్యాన్ని ఆరంభిస్తుంటే, మరోవైపు భాషా గేటుపాసు, టికెట్ పుస్తకం ఎదురులో పెట్టుకొని కలెక్షన్ డబ్బును లెక్కిస్తుండేవాడు.

డ్రైవర్ శేషగిరి పెట్రోమాక్స్ లైటు వెలుగులో నించొన్న కామాక్షి వైపు చూసి నవ్వుతూ నాగప్పయ్య అంగడి మెట్లను ఎక్కాడు... "చూసారా పెట్రోమాక్స్ లైట్‌లోని కాంతిని... ఎలాగుంది" అంటూ మెప్పుదల సూచించాడు

"రండి.... రండి, వచ్చి ఇస్పెశల్ చాయ్ తాగండి" అన్నాడు నాగప్పయ్య.

"వద్దండి... కోణందూరులో తాగేవచ్చాను" అన్నాడు శేషగిరి. అంతలో పటేల్ మెట్లు ఎక్కిపైకి వచ్చారు.

"రండి... రండి" అంటూ లేచాడు శేషగిరి. మళ్ళా బస్సు చెంతకెళ్ళిడోర్ తెరిచి బారుగా ఉన్న కాగితం పొట్లాన్ని తీసి పటేల్ చేతికి ఇచ్చాడు."ఇంటికి వెళ్దాంరండి" అన్నాడు పటేల్.

"వద్దు...వద్దండి"

"ఛీ... అంతా రెడి చేసిపెట్టించాను, రండిఇక"

"మరొక రోజు చూద్దాంలే"

"మరొక రోజునా ఉంటదిలే... ఈ రోజు మీరు రండి"

శేషగిరి బ్యాటరిలైట్ చేతిలోకి తీసుకొన్నాడు. నాగప్పయ్య వైపుకు తిరిగి..... "నాగప్పయ్యా... తలుపుకు బోల్ట్ వేయొద్దు, భోజనంకని ఎదురు చూడొద్దు... అంటుండగా తలుపు చెంతనున్న కామాక్షి తలూపింది.

శేషగిరి మరియు బాషాకు రాత్రిపూట భోజన వ్యవస్థను నాగప్పయ్యే ఏర్పాటు చేసాడు. శేషగిరి రాత్రి వేళ పడుకొనేది కూడా నాగప్పయ్య అంగడిలోనే. బాషా మాత్రం బస్సులో పడుకొనేవాడు. ఇప్పుడు పటేల్‌కు శేషగిరికీ స్నేహమైంది. ఇంతకు మునుపు ఒకట్రెండు సార్లు పటేల్ గారి ఇంటి కెళ్ళినప్పుడు అతను మరిక భోజనం కని నాగప్పయ్య వద్దకు రాలేదు. ఇలాగున్నందున సరే అని కామాక్షి తలూపింది.

బ్యాట్రిలైట్ వెలుగు నుంచి ఇమామ్‌కున్న కొలిమి చెంత మలుపు తీసుకొన్నాడు శేషగిరి.

"బస్సు ఊరుకు వస్తుంది మంచిదైందిలే" అంటూ శేషగిరి పటేల్ గృహంలోకి ప్రవేశిస్తూ చేతిలో ఉన్న మద్యం సీసాను మేజాబల్ల మీద పెట్టాడు. అక్కడ అప్పటికే సోడా బాటిళ్ళు, ఖాళి గ్లాసులు సిద్ధమై ఉన్నవి. లోపల్నుంచి ఘుమఘుమలు పెట్తున్న మాంసంకూరలోని వంట వాసన ముక్కుకు తాకింది.

"నాకు ఈ బ్రాండ్ తప్పితే వేరేదేది నచ్చదు... నువ్వు తెస్తున్నందున నాకెంతో అనుకూలమైంది. లేకపోతే"

"అయ్యో తెచ్చేదేమంత ఘనకార్యం...ఇదేమి గొప్పకార్యం కాదులేండి...."

జీతగాడు లోపలినుంచి కంచాల్ని తెచ్చాడు. పటేల్ గారు సీసాకున్న బిరడా తీస్తూ... "రండి, రండి" అన్నాడు. శేషగిరి భుజాలు మడిచి కూర్చున్నాడు.

❖ ❖ ❖

చలాన్ ఫారమ్ నింపి బాషా లేచాడు. రేపు తీర్థహళ్ళిలో ఉండే ఆఫీసుకు వెళ్ళి చలాన్ మరియు డబ్బును ముట్టచెప్పితే సరిపోతుంది. చర్మం బ్యాగులో ఉన్న నోట్లను భద్రంగా దాచి, మిగిలిన చిల్లరను లెక్కించాడు. అక్కడక్కడ కొంత మందికి టికెట్ చించనందున సుమారుగా పదోపదైదో రూపాయలు మిగిలినవి. వాట్ని సరిగా లెక్కించాడు. ఈ రోజు ఇద్రూస్‌కు ఒక రూపాయి ఇవ్వాలని అనుకొన్నాడు. ఇద్రూస్ తన పనిని ముగించాడు.

ఇద్రూస్‌కని లేచి నిలబడినప్పుడు అమీనాబి కన్పించింది.

"భోజనం అయ్యిందా?"

"నహీ మా (కాలేదమ్మా)"

ఆమె కొంచెం ఆగి చెప్పింది ఇలా : "మా ఇంటికిరా... నా యజమాని (భర్త) నిన్ను తోలుకొని రమ్మన్నాడు..." అంది.

అతనికెంతో ఉత్సాహం అయ్యింది ఆమె మాట విని. అయినా "వద్దమ్మా... నాగప్పయ్య వద్ద భోజనం ఉందిలే" అంటూ నవ్వాడు.

"అది ఎప్పటికీ ఉంటదిలే... ఈ రోజు రా..."అంది ఆమె. ఆమెతో బయల్దేరుతూ నాగప్పయ్య అంగడి వైపుకు ఒకసారి చూసి "ఏముంది ఈ దరిద్రపు అంగడిలో! తౌడురంగులో ఉన్న బిస్కట్లను అతను గాజు సీసాలో నింపాడు. థూత్" అని తిట్టాడు. తక్షణమే ఒకటి గుర్తుకొచ్చింది. అంబారగోడులో ఉండే ఫారెస్ట్‌గార్డు శివయ్య ఒక కేజి ద్రాక్ష తెమ్మని డబ్బు ఇచ్చాడు. మరవకనే బాషా తీసుకొచ్చాడు. అయితే అంబారగోడులో శివయ్య ముఖం కనబడక దాన్ని ఇవ్వలేదు. దాని సంగతి ఇప్పుడు గుర్తుకొచ్చింది. బస్సులోకి మళ్ళా చొరబడి ద్రాక్ష పొట్లాన్ని పట్టుకొని బయటికొచ్చాడు. నాగప్పయ్యతో భోజనంకు రావట్లేదని చెప్పాడు. ఇద్రూస్ బస్సును శుభ్రపరిచి డోర్ వేసి కిటికీలకు ఉన్న తాడపత్రి (టార్పాలు) దించి వెనుకనుంచి వచ్చినప్పుడు అతని చేతిలో రూపాయి పెట్టాడు. కొలిమి అంచునున్న ఇంటి చెంత నూరి అటు ఇటు తిరుగుతూ మాయ లేడిలాగ మాయమైనప్పుడు బాషా గాలిలో తేలిపోసాగాడు.

దీపంబుడ్డి వెలుగులో నూరి ఓణి కప్పుకొని భోజనంకని పీఠముందు వస్త్రం పరిచింది. ఆ తెల్ల వస్త్రంలోని నాలుగు మూలలలో చేతినుంచి కుట్టిన చేతికుట్ల పూలమాలలు ఉన్నవి. బాషా మెచ్చుకొంటూ చూసాడు. కంచాలు వచ్చినవి. ఇమామ్

కూడా వచ్చి కూర్చున్నాడు. అమీనాబి తలుపు చెంత నిలబడి అది తీసుకురా ఇది పట్టుకురా అని చెప్తుంది. బాషా దొంగతనంగా కొంటెగా చూస్తున్నాడు నూరిని. ముసిముసిగా నవ్వుతూ పరుగులు పెట్టూ నూరి వండిన వంటను అందిస్తుంది. కప్పుకొన్న ఓణి చాటున గుండ్రంగా రూపుదిద్దుకొన్న ఆమె వక్షోజసంపదను చూసి బాషా పరవశుడైయ్యాడు. చూసేందుకు నూరి పసందుగా ఉంది. ఎర్రటి ముఖంలో కాటుక కళ్ళు ప్రస్ఫుటంగా కనబడుతున్నవి. నూరి నవ్వుతుంటే ఆమె దేహ భంగిమలు పౌర్ణమినాటి చంద్రుడి నుంచి సాగరంలోని అలలు ఎగిసెగిసి పడుతూ నాట్యమాడుతున్నట్లుగా ఉంది అతనికి.

బాషా, ఇమామ్ ఇంటికి వచ్చింది ఇది మూడోసారి. క్రితంలో ఒకసారి ఉదయంలో కాఫికని వచ్చాడు. ఒకరాత్రి భోజనంకూ వచ్చాడు. అప్పుడు అమీనాబి బాషాకు చెందిన కుటుంబ విషయాల్ని అడిగింది. కొప్ప పట్టణంలో బాషా తండ్రికి ఇల్లు ఉంది. అతని తండ్రి కూడా శంకర్ సర్వీసు (ప్రైవేట్) బస్సు కంపెనీలో డ్రైవర్‌గా ఉన్నాడు. బాషా ఒకడే సంతానం. అతని తల్లి కూడా సభ్యురాలే! అమీనాబి ఏదో దూరంలోని ఆశ ఉంచుకొని దీన్నంతా అడిగి తెల్సుకుంది. బాషా నూరిని తదేకంగా చూస్తుండగా, దాన్ని గమనించి అల్లాకు మొరబెట్టింది సంబంధం కుదర్చమని.

ఈ రోజు విశేషంగా కోడి పలావ్ చేసి అమీనాబి వెళ్ళి బాషాను పిల్చుకొచ్చింది. ఈ ఎనిమిది రోజుల నుంచి మొగుడ్ని సతాయించింది. కొప్పపట్టణంకు వెళ్ళిరండి లేకపోతే ఎవరినుంచైనా బాషా తండ్రికి ఒక మాట చెప్పించండి. పోరడు మంచోడే. నూరికి ఒక మంచి వరుడు దొరికినట్లు అవుతది అంది ఆమె. ఇమామ్ చూద్దాంలే అన్నాడు. నా అంతట నేనే దూసుకెళ్ళేది ఎలాగున అని అన్నాడు. బాషా ఏమో కండక్టర్. అతని జనకుడు బస్సు డ్రైవర్. సరైనంత అనుకూలం ఉన్నోళ్ళువారు. తామేమో అంతగొప్పగా చెప్పుకొనే జనంకాదు. ఈ విషయంలో బాషా అభిప్రాయం ముఖ్యం. అతను మనసుపడితే మన పని సులువు అని అతను చెప్పాడు భార్యకు. భర్త నుంచి వచ్చిన ఈ పలుకులు సమంజసంగానే ఉన్నవని అన్పించింది అమీనాబీకి. ఆ సాయంత్రం కోడిపుంజు ఒకదాన్ని మసీదుకు తీసుకెళ్ళి ముల్లాసాబ్ నుంచి బిస్మిల్లా చేయించి తీసుకొచ్చింది. నాగప్పయ్య అంగడివద్దకెళ్ళి బాషాను ప్రీతిగా తోలుకొచ్చింది భవ్యమైన భోజనం తినబెట్టేందుకని.

ఇమామ్ పిచ్చాపాటి మాట్లాడాడు. నూరి తనే ముందుండి కొసరి కొసరి బాషాకు వడ్డించింది. బాషా వద్దు వద్దంటూనే సగంకోడిని తిని త్రేపాడు. నాలుగు ముద్దలు ఎక్కువగానే తిన్నాడు. మధ్యలో అమీనాబి... "ఇద్రూస్‌కు ఒక నౌకరి

ఇప్పించు" అని అడిగింది. "అతనికొక నౌకరి, ఈమెకొక వరుడు దొరికితే తన కుటుంబం గెల్చినట్లే" అనుకొంది అమీనాబి.

"నౌకరి ఇప్పించే విషయం నాకు వదిలేయండి" అన్నాడు బాషా. ఇమామ్ అమీనాబి ఇద్రూస్ నూరి అందరికీ సంతోషం కలిగింది. నూరి లోపల్నుంచి గసగసాలతో చేసిన గోదుమ పాయసం తెచ్చి బాషా చేతికి ఇచ్చింది.

❖ ❖ ❖

నాగప్పయ్య గురకపెట్టుతున్నాడు. అడవి పంది గుంతను తోడినట్లుగా అతని గురక ఉంది. పెళ్ళైనప్పటి నుంచి అది గంటు మూటలాగ పడింది కామాక్షి మీద. ఏమి పాడునిద్రో తిండి తిని నారాయణా అంటూ తలదిండు మీద తలవాల్చితే చాలు అతనికి గాఢ నిద్రపట్టుతది. అయితే తనకు? రాత్రంతా సంభోగ రతిక్రీడలేక పొర్లాట, విరహంతో కూడిన విధిరాత. ఇతని మొదటి భార్యకు సంతానం కలగక పదిహేను సంవత్సరాలు ఇతనితో కాపురం చేసి చనిపోయింది. ఇతనికి రెండో భార్యగా వచ్చింది తను. తనుకూడా ఇప్పుడు అర్ధ శవంగా మారింది. బతుకు ఇకచాలు అని అన్పిస్తుంది ఆమెకు. ఏమి సుఖం ఇతడ్నుంచి ఏమి బతుకు ఇతడ్నుంచి అనుకోసాగింది. పగలంతా పొయ్యిముందు ఉడికిపోవాలి. కాఫి చాయ్ మైసూరు బొండా బజ్జీలు చక్రాలు కజ్జికాయలు అటుకుల ఉప్మా... వీట్ని చేసేపని జాస్తిగా ఉంటదిలే. వీటితోపాటు అన్నం, సాంబారు... ఒక క్షణమూ విశ్రాంతి లేదుకదా!

"ఏమేయ్...స్ట్రాంగ్‌గా కాఫీ కాయి"

"పటేల్‌కు చాయ్ పెట్టు"

"అటుకుల ఉప్మా ఎందుకో రుచికరంగా లేదు"

"చక్రాలు గట్టిగా ఉన్నవెందుకు?"

ఇలాగున ఉదయం నుంచి రాత్రి వరకూ భర్త నుంచి మాటలు. రాత్రి భుజించిన తర్వాత పాడు గురక. తనకేమో నిద్రరాకనే కుతకుతలాడే స్థితి.

"తగలబడిపోనీ ఈ నా బతుకును" అని తనను తనే దూషించుకొంది కామాక్షి. మరిక సెగలు అన్పించి రవికముడి విప్పి విసిరేసింది. చీరకుచ్చిళ్ళను సడిలించి అంగాంతగా పడుకొంది. మన్మథజ్వాల దేహంలోని నలుమూలలకు తాకి ఆమె ఉసూరంటున్నప్పుడు... తన తల్లేమో నాగప్పయ్యకు తనను కుదిర్చేది వద్దు వద్దని వాదించింది. రెండో సంబంధం వద్దు, వేరేచోట కుదురుగా చూద్దాం అని మొగుడితో మొరబెట్టింది. అయితే నాయన వినలేదు. నాగప్పయ్యకు అబ్బబ్బా అంటే ముప్పై సంవత్సరాలు ఉండొచ్చు. గట్టిగా పిడిరాయిలాగ ఉన్నాడని చెప్పి పెండ్లి జరిపించాడు.

సోమేశ్వరం నుంచి సహ్యాద్రికనుమలు ఎక్కి తను బసవనకట్ట గ్రామంకు చేరుకొంది. ఇప్పుడు భర్త నుంచి సుఖంకానక చిరవిరహిణి లాగ అయ్యింది. సంగమం కోసం తహతహ లాడుతుంది. పరాయిపురుషుడి నుంచి సంభోగంకైనా సరే అని భావించి, మరో మారు భర్త వైపుకు చూసింది. నాగప్పయ్యలో బానకడుపు, వంగిపోయిన నడుం, పీలగా బలహీనంగా ఉన్న తొడలు కాళ్ళు చేతులు, సొట్టలు పడిన బుగ్గలు, నెత్తిమీద రాలిన కేశసంపద... థూ అని ఉమ్మేయాలని ఆమె అనుకోసాగింది. అలాగే విరహంతో పొర్లి పడుకొంది. అప్పుడు... తలుపుకున్న చెక్కను ఎత్తిన చప్పుడు విన్పించింది. శేషగిరి లోపలికి వచ్చాడు. మళ్ళా తలుపు చెక్కల్ని మూసాడు. ఆ చప్పుడుకు మేల్కొంది కామాక్షి. వచ్చినోడు ఎవరని ఆమె కచితం చేసుకొనేది అవసరం లేదు. పడక మీద నుంచి లేచి లోపలున్న తలుపు తెరిచి అంగడిలోకి వెళ్ళింది. వేలాడదీసిన చక్కెరకేళి అరటి గెల వద్ద కొచ్చి నిలబడి చూసింది. శేషగిరి ప్యాంటు-షర్ట్ విప్పి అండర్‌వేర్‌తో బారుచెక్కల్ని జోడించి పాన్పుగా చేసుకొని పడుకొనే సిద్ధతలో ఉండి దీపం వెలుగులో కామాక్షిని చూసాడు. అరెరే ఎవరు? నువ్వా అని అన్నాడు. కామాక్షి కదలకనే నిలబడి అతడి నగ్న దేహాన్ని సంపదను చూసింది. శేషగిరి బాహువుల్ని చాపాడు. వేలాడదీసిన అరటిగెల ఊగింది. లోపల నాగప్పయ్య గురక పెట్టుతున్నాడు అడవి పందిలాగ. కామాక్షి శేషగిరికి చెందిన సంపదను కదిలిస్తుండగా శేషగిరి నుంచి గునపం (పలుగు) దిగి అమ్మా అని గోముగా అరిచింది.

❖ ❖ ❖

ఎనిమిది రోజుల తర్వాత బస్సు నుంచి మరో సేవకుడు దిగాడు. లైన్ ఏజెంట్ జనార్ధన అని బాషా అతడ్ని ప్రయాణికులకు పరిచయం చేసాడు. బస్సు నిండిపోయి తిరుగుతున్నా నిరీక్షించినట్లుగా కలెక్షన్ డబ్బు రావట్లేదని కంపెనివాళ్ళు ఇతడ్ని ఇక్కడికి పంపారు. ఇప్పుడు బాషా చంకలో ఉన్న తోలుసంచి జనార్ధన చేతికి వచ్చింది. టికెట్ ఇచ్చేది గేట్‌పాస్ రాసేది చలాన్ నింపేది... సకల పనులు జనార్ధన నుంచే జరిగేదుంది. బాషా ఇప్పుడు కేవలం కండక్టర్ మాత్రమే. బస్సును ఆపేది రైట్ చెప్పేది లగేజ్ వేసేది దించేది మాత్రం ఇతని పనిగా ఉంది. నాగప్పయ్యకు భోజనంకని మరొక గిరాకి దొరికినట్లైంది. జనార్ధన వచ్చింది బరవెహెగ్డెగారికి, లింగాయితుల విరుపాక్షకు, గ్రామంలో చివరి ఇంటివాడైన రంగప్పకు అనుకూలంగా ఉంది. జనార్ధన మొదటిరోజే తిండి తిని నాగప్పయ్యను అడిగాడు ఇలా: "ఔనండి... ఇక్కడ, ఈ గ్రామంలో భజన జరిగేదిలేదా".

"లేదండి...లింగాపురంలోని హనుమంతుడి గుడిలో జరుగుతుంటదండి"

మధ్యలోనే అతని నుంచి వస్తున్న మాటను ఆపి జనార్ధన "అదికాదండి, ఇది" అంటూ చేతి నుంచి విసిరేదాన్ని చూపించాడు.

"ఓ...అదా...హెగ్డె గారికి గుర్తు...వేరే వాళ్ళు ఎవరున్నారో నాకు తెల్వదు" అన్నాడు నాగప్పయ్య.

జనార్ధన మరునాడే బరవెహెగ్డెగారిని పరిచయం చేసుకొన్నాడు.

"సమయం గడపాలి కదా మహాశయ... ఒక ఆట ఆడితే..." అంటూ పీఠిక వేసాడు. హెగ్డెగారిలోనూ అదే కోరిక ఉంది. వారు జనార్ధనను తమ తోటలో ఉండే విశ్రాంత గృహంకు ఆహ్వానించాడు. అతని వెనకే విరూపాక్ష రంగప్ప మొదలైనోళ్ళు బయల్దేరారు. శివమొగ్గనుంచి వస్తున్నప్పుడే కొత్త చీట్లపేక పాకెట్ తెచ్చాడు జనార్ధన.

❖ ❖ ❖

పటేల్ నిత్యం శేషగిరిని పిల్వట్లేదు. శేషగిరికి కూడా అందులో అంతగా ఆసక్తి లేదు. ఇక్కడ నాగప్పయ్య రాత్రి పదిగంటలకే గురక పెట్టుతున్నందున పటేల్‌గారి ఇంటికి వెళ్ళి పన్నెండు గంటల దాకా వారి సోది పురాణం విని తర్వాత నాగప్పయ్య అంగడికి వచ్చేది సరైంది కాదని అతను నిర్ణయించుకున్నాడు. అయితే పటేల్‌కు జతగా పార్టీలో ఎవరైనా ఉండేదుంది. ఎవరూ లేకుంటే మందుమజా దొరకదని వారి అభిప్రాయంగా ఉంది. వారు మందు బాబుల్ని వెతుకుతున్నప్పుడు దొరికినోడు ఎవరంటే కొంకణి కామత్ గారు కదా! బసవనకట్ట చెంతనుండే లోయవద్ద వారికి ఒక పెద్ద వక్కతోట ఉంది. కామత్ గారి సంతానం బెంగళూరులో చదువుతున్నారు. ఇక్కడ భార్యా భర్త ఇద్దరేనండి. కామత్ గారి భార్యకు కొంచెం పిచ్చి ఉంది. ఎప్పుడూ ఆమె ఏదాన్నో వటవటగా మాట్లాడుతుండేది. రాత్రంతా పిచ్చి పిచ్చిగా కలవరింతలు. ఈ కలవరింతల్ని తప్పించుకొనేందుకు దారి వెతుకుతున్న కామత్‌గార్ని పటేల్ ఒక రోజు తన ఇంటికి తోలుకెళ్ళాడు.

"కామత్‌గారు...ఇది కంత్రి సరుకు కాదు... దీన్నుంచి మైకం అంతగా కమ్మేదిలేదు" అంటూ పీఠికవేసి కామత్‌గారి చేతికి గాజుగ్లాసు అందించాడు పటేల్. కామత్ గారికి ముందు నుంచీ అబ్యాసం ఉందేమో...వారైతే గాజు గ్లాసును నాజూకుగానే పట్టుకొన్నారు. వారు కూడా ఉదయమే బస్సు బయల్దేరబోయే ముందు వచ్చి శేషగిరికి డబ్బు ఇచ్చేది రాత్రి వేచియుండి బారుప్యాకెట్‌ను తీసుకెళ్ళేది ఆరంభించారు. ఒక రోజు పటేల్‌గారు మరొక రోజు కామత్‌గారు... ఇలా వంతుల వారి శివమొగ్గనుంచి మాలును తెప్పించుకొనే ఒప్పందం చేసుకొన్నారు. శేషగిరి కూడా అలాగే తెచ్చి అప్పగిస్తుండేవాడు.

❖ ❖ ❖

రాత్రి భోజనంకు కూర్చున్నప్పుడు జనార్దనకూ బాషాకు జగడం అయ్యింది. బాషా ఏదో మాటకు "బస్సు కంపెని దివాలా అయినట్లే" అని అన్నాడు.

"ఎందుకు.... ఈ మాట నీ నోటి నుంచి వచ్చింది?" అని అడిగాడు జనార్దన.

"బస్సులో జాస్తిగానే జనం ఉన్నారు... అయితే గేట్‌పాస్ ఖాళీగా ఉంది... ఇలాగైతే కంపెని ఎలాగున ఉద్ధారం అవుతది?" అంటూ పలికాడు బాషా. ఈ మాట నుంచి జనార్దన రేగి పడ్డాడు.

"దమ్ముంటే... నేరుగా మాట్లాడురో సూకరం (పంది) కొడుకా" అన్నాడు జనార్దన.

"నేరుగానే మాట్లాడుతున్నాను. నీదేంటి నామీద జోరు. అరగనుంచి కోణందూరుకు ఆరుగురు వచ్చి దిగారు కదా... వాళ్ళకు టికెట్టు ఇచ్చావా?" అంటూ అడిగాడు బాషా.

"నువ్వెవడివిరా అడిగేందుకు?" అంటూ మాటకుమాట పెరిగి ఇద్దరూ ఎంగిలిపడిన చేతుల నుంచే కొట్లాటకు నిలబడినప్పుడు శేషగిరి నాగప్పయ్య మధ్యలో ప్రవేశించాల్సి వచ్చింది. జగడం తొందరగానే పరిసమాప్తమైంది. ఎందుకంటే ఇద్దరిలోనూ నిజంగా కలహం అవసరంలేదు. బాషా ఎందుకు కలహంచేసాడు అనేది జనార్దనకు అర్థమైందిలే. మరుసటి రోజునుంచి జనార్దన గేట్‌పాస్ టికెట్లు చింపి చలాన్ నింపేది ముగిసిపోతే మరిక బాషాను శేగిరిని చక్కగా చూసుకోసాగాడు. జనార్దన కూడా ప్రతిరోజు నడుస్తుండే భజనాకార్యక్రమంకు ఎంతో ఉత్సాహంగా పాల్గొనేందుకు రాజీసంధానం సహాయపడింది. జనార్దన పేకాటలో ఓడేది అపరూపమైనా ఆట ఆడేందుకు డబ్బు కావాలి కదా? దిననిత్యం కొన్ని టిక్కెట్లు చించకనే మిగిల్చేడబ్బు ఆటకని వినియోగించబడేది.

❖ ❖ ❖

చలానునింపి డబ్బు కట్టే పని తప్పిన తర్వాత చేతిలో డబ్బు గలగల లాడుతుండగా బాషాకు సంతోష విషయంగానే అయ్యింది. బారుకూ టికెట్లు ఇచ్చేది, చిల్లర వసూలు చేసేది, జనం చెంత డబ్బు విషయంలో గొడవ పడే పని ఇకలేదు. రాత్రి నాగప్పయ్య అంగడి ముందు కూర్చుని అణాపైసల లెక్కాచారం చేసేదిలేదు. ఇదంతా జనార్దన మీద మోపబడిన కార్యంగా ఉంది. అయినా తనచేతికి ఐదారు రూపాయలు తప్పకుండా వస్తుంది. ఈ సంతోషం నుంచి భోజనం ముగించిన తక్షణమే ఇమామ్ ఇంటికి వెళ్ళసాగాడు. అక్కడ ఇమామ్ అమీనాబి నూరి ఇతని రాకకని ఎదురు చూస్తుండేవారు.

బాషా చంకనుంచి తోలుసంచి మాయమైంది అమీనాబీకి నిరాశ కల్గించింది.

“అతడ్ని ఎందుకు నియమించారు?” అని అడిగింది అమీనాబి.

“నేనే అతడ్ని సహాయకుడిగా పంపండని అని కోరాను...నా ఒక్కడ్నుంచి అన్ని కార్యాలు జరిగేదిలేదు...” అన్నాడు బాషా. ఇద్రూస్‌కు నౌకరి ఇప్పించే విషయం వచ్చింది. కొప్ప పట్టణంలో ఉండే కంపెనీ గ్యారేజ్‌లో నౌకరి ఉంది. అతడ్ని అక్కడికి పంపండి అన్నాడతను. కొంచెం సేపు ఆగి ఇంట్లో తన వివాహం గురించి చర్చిస్తున్నారు.... తనే వద్దని చెపుతున్నాను అంటూ నూరికని వెతికాడు. ఆమె ఓణి చెంగులు కనబడగా... “మా అమ్మా అయ్య ఏదో కోతి ముఖందాన్ని చూపించి లగ్నమాడు అంటే నేను ఒప్పేదిలేదు. నేను స్వతహా మెచ్చి చెప్పిన యువతినే నన్ను పెంచి పోషించిన పోషకులు ఒప్పుకోవాలి” అంటూ కట్టె విరిచినట్లుగా మాట్లాడినప్పుడు ఇమామ్ అమీనాబీలకు స్వర్గం అంచునున్న ద్వారం వద్దకే వెళ్ళి నిల్చినట్లైంది. నూరి గుండ్రంగా బలంగా పెరిగిన తన వక్షోజసంపద మీద సిగ్గుతో కులుకుతూ ఓణిని మళ్ళా మళ్ళా కప్పుకొని సంతోషపడింది.

❖ ❖ ❖

“మీరెప్పుడూ ఈలైను బస్సుకే వస్తారా” అంటూ కామాక్షి అడిగింది శేషగిరి రొమ్ము మీద ఒరిగి.

“ఔను...నేను కోరి అడిగితే వేరే వైపుకు పంపుతారు... నిన్ను, నీ సంపదను, నీ దిగుడుబావిని వదిలి నేను ఏ దరిద్రరూట్ (మార్గం)కు వెళ్తాను” అంటూ అతను ఆమెలోని ఎగుడుదిగుడు భాగాలలో చేతుల్ని జొనిపి ఆడించసాగాడు.

❖ ❖ ❖

పేకాట ప్రియుడైన (వ్యసనుడైన) విరూపాక్షకు అర్ధాంగైన శివమ్మ అడ్డుపడి “మీ వ్యసనం విపరీతంగా అయ్యింది కదా...రాత్రంతా ఏంటి మీ ఆటలు...మీకేమి బుద్ధిగిద్ధి ఉందాలేదా”

“తొలగు అటు” గర్జించాడు విరూపాక్ష. “మహిళవు నువ్వు... పడియుండు ఒకమూల. మగోళ్ళ విషయం నీకెందుకు...”

ఆమె మళ్ళా భర్తను నిలువరించే యత్నాన్ని చేసింది. విరూపాక్ష ఆమె మెడ మీద చేయి వేసినెట్టాడు. ఆమె తల తలుపు బంధంకు కొట్టుకొని రక్తం చిమ్మింది. విరూపాక్ష ప్రాంగణంలోకి దిగి బరవెహెగ్డెగారి తోటలో ఉన్న విశ్రాంతి గృహం ఉన్న దారిని పట్టాడు. బస్సు అప్పటికే వచ్చింది. జనార్దన తిండితిని, లెక్కాచారం ముగించి విరూపాక్ష ఇంటెదురు నుంచి పోతుండగా శివమ్మ ప్రాంగణంలోకి వచ్చి

నిలబడి "నీ కొంప నాశనంగాను... నీ ఇల్లు కూలిపోను...నీ వంశం నిర్వంశంగాను... ఇంట్లో ఉన్న డబ్బంతా నా మొగుడు మూడు ముక్కల ఇస్పేట్ ఆటలో పెట్టి దివాళ అవుతున్నాడు కదా... నా భర్తకు ఆటలోని వ్యసనాన్ని పట్టించినోడివి నువ్వే... నీకు నా పిల్లల ఉసురు తగుల్తదిలే..."

జనార్ధన ఆమె మాటల్ని విన్నా విననట్లుగా నటిస్తూ వడివడిగా అడుగులు వేసాడు. ఈరణ్ణ గారి పెంపుడు శునకం మొదటగా మొరిగి తర్వాత వాసన పట్టుకొని దిననిత్యం కనబడే మనిషే అని భావించి ఊరకుండిపోయింది. ఎంతో దూరం వరకూ శివమ్మ నుంచి వస్తున్న శాపనార్థాల ధ్వని అతడ్ని వెంబడించింది. అయినా వేగం వేగంగా నడవసాగాడు జనార్ధన.

❖ ❖ ❖

అమీనాబి మంచి చీరకట్టుకొని బస్సు ఎక్కినప్పుడు బాషాకు ఆశ్చర్యం కలిగింది.

"ఎక్కడికి అమ్మా?"

"తీర్థహళ్ళికి...నా అన్న కూతురు పెళ్ళికి. నాలుగు రోజులు అక్కడే ఉండి పెళ్ళి ముగిసిన తర్వాత వస్తాను..."

"ఔనా" అంటూ బాషా రాగం తీసాడు. దారి బారుకూ ఆమెను మాట్లాడిస్తూ వెళ్ళాడు. కోణందూరులో ఒక తీపి సోడాను తెచ్చి తాపించాడు. తీర్థహళ్ళిలో రెండు బిస్కట్ ప్యాకెట్లను కొనిపెట్టాడు. ఆమెను కొప్ప సర్కిల్‌లో దింపి "ఇంట్లో ఏమైనా చెప్పేదుందా నేను?" అని అడిగాడు.

ఆ రాత్రి శివమొగ్గ నుంచి బసవనకట్టకు బస్సు వెనుదిరిగి వస్తున్నప్పుడు బాషా ఎంతో అసహనం చెందాడు. దిగుతున్న ఎక్కుతున్న జనాన్ని తొందరతొందరగా అని గదిరించాడు. ఎవరిదోమూట వేసేందుకు ఒప్పుగోకుండా రైట్‌రైట్ అని చెప్పాడు. కోణందూరులో శేషగిరి కాఫి తాగేందుకు వెళ్ళినప్పుడు బాషా... తొందరగా రా అణ్ణా వెళ్ళిపోదాం అని పలికి శేషగిరి నుంచి చివాట్లు తిన్నాడు. నాగప్పయ్య అంగడి ఎదురుకు బస్సు వచ్చి ఆగినప్పుడు తిండి కూడా తినకనే శివమొగ్గ నుంచి కట్టించుకొని తెచ్చిన మిఠాయి పొట్లాన్ని పూల పొట్లాన్ని పట్టుకొని కొలిమి వైపు నుంచి ఇమామ్ ఇంటికి పరుగుదీసాడు. దార్లో ఎదురైన ఇద్రూస్‌కు... చక్కగా బస్సును క్లీన్ చేసిరా... అని చెప్పేది మరవలేదు.

అమీనాబి ఊర్లో లేనందున ఇమామ్ ఫుల్‌గా తాగివచ్చాడు. అతడ్నుంచి "ఘర్ మే దివాలి" పాట పాడేది ముగిసిపోయి మరిక అతను అరుగు మీద ఒరిగి పోయాడు. నూరి భుజించేందుకు కూర్చుంది.

బాషా వెళ్ళి ఆమె ఎదురు నిలబడ్డాడు ఠీవిగా. పొట్లం విప్పి మిఠాయి తినిపించాడు. అలాగే పూలమాలల్ని ఆమె సిగలో ముడిచాడు. "నేను పెళ్ళాడితే నిన్నే... నిన్నే... నిన్నే" అన్నాడు మురిపంగా. నూరి ముఖాన్ని చేతులలోకి తీసుకొని ఆమె కళ్ళలో కళ్ళు పెట్టి చూసాడు. అలాగే అతని నుంచి కంపిస్తున్న చేతులు నూరి దేహం మీదున్న గుప్త భాగాలలో దాడి చేసినవి.

ఇద్రూస్ బస్సును శుభ్రపరుస్తున్నాడు. ఇక్కడేమో బాషా నూరిని మన్మథ సామ్రాజ్యంలో మునిగించి మరిక గోడకు ఒరిగి కూర్చున్నాడు. ఇద్రూస్ ఇంటికి చేరుకొంటున్నప్పుడు నూరి లోపల ఆరిపోయిన పొయ్యి ఎదురు తల తగ్గించి కూర్చుంది.

❖ ❖ ❖

హాల్టింగ్ బస్సు బసవనకట్టకు వచ్చేది ప్రారంభమై ఒక నెల గడిచి పోయి ఉండొచ్చు. కంపెని లాభనష్టాల లెక్కల్ని కట్టింది. లాభం రాకనే నష్టమే ఎక్కువైనందున సర్వీసు (ప్రైవేట్) కంపెని తక్షణమే ఒక నిర్ణయం తీసుకొంది. ఆ రోజు శివమొగ్గ నుంచి సాయంత్రం వచ్చిన బస్సు తీర్థహళ్ళి బస్టాండ్‌లోనే నిలబడిపోయింది. ఈ రోజు నుంచి బసవనకట్టకు హాల్టింగ్ లేదు అని ఏజెంట్ కంపెని నుంచి వచ్చిన మెమో కాగితాన్ని చూపెట్టినప్పుడు శేషగిరి బాషా జనార్దన పరస్పరంగా ఒకరి ముఖాల్ని మరొకరు చూసుకొన్నారు. బసవనకట్ట మరియు దాని చుట్టు ప్రక్కలున్న పల్లెలోళ్ళు తమ ఊరికి వెళ్ళాలని దిగువ (ఉప) బస్టాండ్‌లో మైన్ (ముఖ్య) బస్టాండులో వేచియున్నోళ్ళు మరిక బస్సు వెళ్ళేది లేదనే సమాచారం తెల్సుకొని హైరాణా పడ్డారు.

నాగప్పయ్య పెట్రోమాక్స్ లైట్‌కుండే గాజు గ్లాసును తుడిచి, కిరోసిన్ నింపి, గాలికొట్టి, అగ్గి పుల్ల నుంచి వెలిగించినప్పుడు, మంట భగభగగా మండుతూ పైకి లేచి, ఫిలమెంట్ మండి, మరిక వెండి కాంతుల్ని విరజిమ్మి చుట్టు ప్రక్కల వ్యాపించినప్పుడు దాన్ని కొక్కెంకు వేలాడదీసాడు. కామాక్షి పొద్దస్తమానం వంట నుంచి పడిన జిడ్డు, చెమట వాసనను పోగొట్టుకొనేందుకని కుంకుడు రసం నుంచి తలస్నానం చేసి, శేషగిరి ఎంతో ఇష్టపడే ఆకు పచ్చచీర కట్టుకొని మల్లెమాలల్ని ముడిచి తలలో పెట్టుకొని బయటలోపల తిరుగుతూ దూరం నుంచి వినబడే బస్సు చప్పుడుకని చెవి రిక్కబొడుచుకొని వేచియుంది. పటేల్‌గారి జీతగాడు అప్పటికే వచ్చి బస్సురాకకని ఎదురు చూస్తూ నాగప్పయ్య అంగడి ముందున్న చెక్క బల్ల మీద చతికిల పడ్డాడు. ఇపుడిప్పుడు పటేల్ గారు కొంకణి కామత్ గారు తీర్థంకని బస్సు చెంతకొచ్చి సరుకు తీసుకెళ్ళేదాన్ని నిల్పేసారు. జీతగాడు మూలకంగానే

తెప్పించుకోసాగారు. ఇద్రూస్ చిరిగిన చడ్డి, మురికి బట్టిన షర్ట్ ధరించి అంగడి ఎదురు రాబోయే బస్సును క్లీన్ చేయాలని సమాయత్తమై ఉన్నాడు. విరూపాక్ష తన ఇంటి వెనుక వానాకాలంలో పశువుల గ్రాసం కొరకు అవసరపడుతదని పోగుపెట్టిన ఎండుగడ్డి వామిని అమ్మి పదిరూపాయలు జేబులో వేసుకొని ఇస్పేట్ ఆటలో దోస్తైన జనార్దన వచ్చే దారి వైపు ముఖంపెట్టి నిలబడ్డాడు. అమీనాబి ఈ రోజు బాషా చెంత స్పష్టంగా మాట్లాడాలి అని నిర్ణయించుకొంది. నూరి ఓణి కప్పుకొంటూ, తన చేతులు దేహంలోని గుప్తభాగాలకు తాకినప్పుడు తనకు తనే రోమాంచితురాలై, రాబోయే బాషా చెవిలో ఏమేమి సుఖ పలుకులు ఊదాలి అని సిగ్గుపడుతూ కొలిమిలోని తిత్తిని ఒత్తుతూ బస్సు నుంచి వచ్చే హారన్ చప్పుడు చెవిలో పడుతదేమో అని నిరీక్షించసాగింది.

**మూలకథ రచనాకాలం : 1987**

# ఇద్దరు దేశ భక్తులు ఒక రోడ్డు రోలరు

సాగరపట్టణం నుంచి తమ స్వగ్రామమైన మంకాళెకు వచ్చే తారు రోడ్డు మొదట్లో అస్తవ్యస్తంగా గుంతలమయమై ఉన్నా, మరిక ఇప్పుడు చక్కగా రోడ్డంతా బాగుపడి ఆరు నెలలు గడిచినా, అక్కడికి వచ్చి కార్యాన్ని చక్కగా నిర్వహించిన రోడ్డు రోలరు ఇకనూ అక్కడే ఉన్న దాన్ని గమనించిన అనంతరాయరు గారు కొంచెం విచలితుడైయ్యారు. తమ ఇంటి నుంచి సుమారుగా ఒక కిలోమీటరు దూరంలో మేడిచెట్టు క్రింద ఈ యంత్రం వారసుదార్లు లేకనే రోడ్డు మీద నిలబడినదాన్ని వారు ఆరు మాసాల నుంచి చూస్తూ వస్తున్నారు. రోడ్డు పని జరుగుతున్నప్పుడు రోడ్డు మీద పరిచిన దొడ్డకంకర మీద ఇది తిరిగి ఆ కంకరను నేల మీద సరిగానే తొక్కింది. దాని మీద తారు, సన్న కంకర పొడి వేసి రోలరును అటు ఇటు తిప్పి మరిక రోడ్డు ఏ విధమైన గుంతలు ఎత్తు పల్లాలు లేకుండా లెవల్ చేసిందాన్ని చూసి అందరికీ అయినట్లుగానే వీరికి పరమ సంతోషం కల్గింది. ఈ రోడ్డు ఇంత తొందరగా చక్కగా అయ్యేందుకు రావ్‌గారు కూడా కారణ కర్త అయ్యారు. వారు పలుమార్లు సంబంధపడిన కఛేరికి వెళ్ళి కల్వాల్సినోళ్ళను కల్సి చెప్పాల్సిన రీతిలో చెప్పిన పిమ్మట ఈ రోడ్డు రిపేరు పని ప్రారంభమైంది. అలాగే ముగిసింది కూడా! క్రితంలో పడుతూ లేస్తూ ఎగురుతూ తిరుగుతుండే వాహనాలన్నీ ఇప్పుడు కుదురుగా ఉన్న నీళ్ళ మీద నావ వెళ్ళినట్లుగా రోడ్డు మీద హాయిగా తిరగసాగినవి.

మంకాళె గ్రామంకు వచ్చే రోడ్డు బాగుపడింది కదా అని అనంతరావ్ గారు చివరికి నిట్టూర్పులు వదిలారు. అలాగే అక్కడికి వచ్చి పనిని పర్యవేక్షించిన ఇంజనీర్ గారికి తమ కృతజ్ఞతల్ని తెల్పారు. కొన్ని రోజులలోనే అక్కడ బారుగా పడేసిన ఖాళి తారు డ్రమ్ములు, మిగిలిన కంకర, తారు కరిగించిన పొయ్యిలోని ఆనవాళ్ళు, తారు రోడ్డు వేసేందుకని వచ్చిన తమిళజనం గుడిసెలు అన్నీ కనుమరుగై, రోడ్డు శుభ్రపడినా ఇదొక రోడ్డు రోలరు మాత్రం ఉండి పోయింది కదా అని వారు దిగులు చెందారు. ఈ రోజో రేపో దీనికి సంబంధించినోళ్ళు వచ్చి తీసుకెళ్తారులే అని రావ్ గారు వేచి చూడసాగారు.

ఈ యంత్రం మీద కూర్చొని నడుపుతుండే డ్రైవర్ సింజావ పరిచయం వారికి ఉంది. ఇది పూర్వం నుంచి వచ్చిన పరిచయం కాదు. ఇక్కడ రోడ్డు పని ప్రారంభమైనప్పుడు కలిగిన పరిచయం కదా అది! ఇతను రోడ్డు మీద కంకర పరుస్తున్నప్పుడు, తారు చల్లుతున్నప్పుడు, సన్న కంకరపొడి చల్లుతున్నప్పుడు రావ్ గారి ఇంటి ముందున్న పందిరి వద్దకు వచ్చి కూర్చునేవాడు. ఇలాగున వచ్చి కూర్చునేముందు రావ్ గారి ఇంటికి వస్తుండే దినపత్రిక చదివి ముగించిన తదుపరి రావ్ గారి జతగా అది ఇది మాట్లాడుతుండేవాడు.

రావ్ గారికి సింజావకు కొన్ని విషయాలలో పొత్తు కుదిరింది. రావ్‌గారు తమస్వాతంత్ర్య పోరాటంలోని విషయాల్ని అతని ముందు వివరిస్తే, అతను తను సైనికుడిగా దేశ సరిహద్దులలో పని చేసిన విషయాన్ని చెపుతుండేవాడు.

అనంతరాయరు (రావ్)గారు ఈ జిల్లాలో జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో ఎంతో ఉత్సాహంగా భాగస్థుడైయ్యారు. అప్పుడు వారికి యౌవనంలోని ఉడుకు రక్తం ఉండేది. గాంధీజి ఇచ్చిన పిలుపును తూచ తప్పకనే పాటిస్తుండేవారు. అది విదేశివస్త్ర దహనం కాని, పన్నులు చెల్లించే సహాయ నిరాకరణంగాని కావొచ్చండి. ఖాది దుస్తులు తొడిగేది, చరకా నుంచి నూలు వడికేది కూడా ఉండేదండి. వీటన్నిటినీ తప్పని సరిగా పాటిస్తూ, సామాన్య జనంలో పోరాట పటిమను నింపుతుండేవారు. ఇందుచేత కొన్ని సార్లు వారు చెరసాలకు వెళ్ళి వచ్చారు. కాంగ్రెస్ పార్టీలో వీరికెంతో గౌరవం లభిస్తుండేది. ఈ గౌరవం ఇప్పుడూ వారికి దొరుకుతుంది. పాతతరం వాళ్ళు వీరి పోరాట పటిమను గుర్తుకు తెచ్చుకొని వారివద్ద సలహాలు తీసుకొని వెళ్ళుతుండే వారు. తమ గ్రామంకు వచ్చే రోడ్డు సరిగా ఉండాలని వారు కోరుతుంది ప్రజోపకారం లోని కారణం నుంచేనండి! అంతేగాకుండా పి.డబ్ల్యు.డి. వాళ్ళు ఈ రోడ్డును సరి చేయించేందుకు వీరి మీదున్న గౌరవం కూడాను!

అనంతరావ్ గారిలాగనే రోడ్డు రోలరుకు డ్రైవరైన సింజావకూ ఒక ఇతిహాసం ఉందిలే! ఇప్పుడు ఇక్కడ పనికని వచ్చే ముందు, దేశ సరిహద్దులలో సైనికుడిగా అతను పనిచేసాడు. ఈ దేశంకు స్వాతంత్ర్యం లభించినప్పుడు అతను మనదేశ సరిహద్దును కాపలాకాసే కార్యాన్ని చేస్తుండేవాడు. సుమారు పదిసంవత్సరాలు మిలిటరీ సేవ చేసిన తర్వాత అతను తిరిగి గ్రామంకు వచ్చి మిలటరి కోటాలో మాజి సైనిక ఉద్యోగులకు ఇచ్చే సర్కారు సేవలో పునఃనియామకం పొందాడు.

ఇందుచేత రావ్ గారికి సింజావకు ఒక అర్థంలో మధుర సంబంధం ఏర్పడింది. వీరు తమ అనుభవాల్ని అతనికి, అతను తన అనుభవాల్ని వీరికి పరస్పరంగా వినిమయం చేసుకోసాగారు.

“సింజావ, మనం దేశం వేరు మన బతుకు వేరు అని భావించుకొన్నోళ్ళం కాము. దేశంకని మనం ఏమి చేసాం... అదంతా మన కుటుంబంకే అని భావించేవాళ్ళం మనం కదా... దేశంకు మంచిదైతే మన కుటుంబంకూ మంచిదౌతదిలే అని మనం నమ్మాం... ఈ నమ్మకం ఇప్పటి తరం వాళ్ళలో తగ్గిపోతుంది...” అంటూ రావు గారు చెపుతుంటే, సింజావ కూడా “మేము సిపాయిలుగానూ అంతేనండి... ఇక్కడ మాకు తల్లి, తండ్రి, చివరికి భార్య జబ్బుపడినా మేము బోర్డర్ (సరిహద్దు) వదిలి వచ్చేదిలేదు... మాకు ఊరు మీద వ్యామోహం ఉండేది లేదు. ఏదున్నా దేశం, సరిహద్దు అని పగలు రాత్రి సురక్షితంగా కాపలా కాస్తుండేవాళ్ళం...” అని చెపుతుండేవాడు. మళ్ళా “మేము ఏమి చేసినా అందునుంచి దేశంకు ఏమి ఉపయోగం అవుతది, ఏమి నష్టం అవుతది అని యోచన చేస్తుండేవాళ్ళం” అంటూ చెప్పేవాడు. “ఇలాగే ఉండాలి కదా... మన నడత ఏకారణంకూ దేశం మీద దుష్ట పరిణామం కలుగజేయరాదు” అని నొక్కి వక్కాణిస్తుండేవాడు.

ఈ సింజావ మాటనుంచి మాత్రమే ఘనతను చెప్పేదిలేదు. అతనెన్నడూ తన డ్యూటీలో సోమరితనం చూపించేదిలేదు. సరైన సమయంకు వచ్చిపని నిర్వహించి సరైన సమయంకే తిరిగి ఇంటికి వెళ్తుండేవాడు. ఖర్చులకు డబ్బు ఇవ్వండి అని రోడ్డు పనిపట్టుకొన్న గుత్తేదారును సతాయించేది లేదు అతనిలో. రోడ్డు పనిలో నాణ్యత లేనట్లైతే దాన్ని గమనించి మిన్నకుండిపోయే వర్క్ ఇన్స్‌పెక్టరును సరైన దారిలో నడిపేందుకు యత్నిస్తుండేవాడు.

రావ్‌గారు, పి.డబ్ల్యు.డి.లో ఒక నౌకరుగా ఉండే సింజావులో అటువంటి ప్రామాణికత్వంను, సమయనిష్ఠ, కష్ట సహిష్ణుత... మొదలైనవాట్ని చూసి ఆశ్చర్యపడు తుండగా; సింజావ కూడా రావ్‌గారిలోని అప్పటి దేశ ప్రేమ, తత్వాదర్శాలకు మూగబోయేవాడు.

ఈ కారణం నుంచే ఏమో రావ్‌గారికి సింజావ నడుపుతుండే రోడ్డు రోలరు మీద ఏదో ఒక చెప్పలేని సదభిప్రాయం ఏర్పడింది.

రోడ్డు పని ముగించబడి అక్కడ్నుంచి వెళ్ళిపోయే ఒకట్రెండు రోజుల ముందు సింజావ, రావ్ గారి వద్ద కొచ్చి “సార్, ఇక్కడ నేను చేసే కార్యం ముగించబడింది. రేపట్నుంచి వేరే చోట పనిచేసేదుంటది” అని చెప్పాడు.

“వేరే చోట అంటే ఎక్కడ?”

“అది తెల్వదు సార్. రోడ్డు రిపేరు, మెటల్ అస్ఫాల్టింగ్, తారు వేయటం... మొదలైన పనులు ఉండనే ఉంటవి. పనులు లేవు అని అనుకొన్నా, మా ఇంజినీర్లు

ఏవేవో చోట్ల కొత్త కొత్త పనుల్ని సృష్టిస్తారు... నాకైతే ఈ రోడ్డు రోలరును తిప్పేకార్యం తప్పిపోదు. బోర్డరులో తుపాకి పట్టుకున్నట్లుగానే ఇక్కడ రోడ్డు రోలరు స్టీరింగ్‌ను సదా పట్టుకొని తిప్పేదుంది" అన్నాడతను.

సింజావ చెప్పినట్లుగానే రోడ్డు నిర్మాణం ముగిసింది. అప్పటి వరకూ జరుగుతున్న అన్ని కార్యక్రమాలు బంద్రై రోడ్డు తన పాటికి పెళ్ళైన నవ వధువుగా ఉంది. మేడి చెట్టు క్రింద నిలబడిన ఈ రోలర్ ఈ రోజు వెళ్తది, రేపు వెళ్తది అని రావ్‌గారు నిరీక్షించారు. ఈ నిరీక్షనుంచైనా సింజావ వస్తాడనేది వారిలో అభిప్రాయంగా ఉంది. అయితే వారు ఊహించినట్లుగా సింజావ రాలేదు. రోడ్డు రోలరు అక్కడ్నుంచి కదలలేదు.

మలెనాడులో నేల మీద గడ్డి గ్రాసం చెట్లు పొదలు లతలు పెరిగేందుకు ఎన్ని రోజులు కావాలి? రావ్ గారు, ఈ రోడ్డులో తిరుగుతున్న జనం చూస్తుండగానే రోలరులోని ముందు చక్రం క్రింద గడ్డి పెరిగింది. వెనకున్న రెండు చక్రాల ప్రక్కన చెట్లు తలెత్తినవి. పైనుండే టార్పాలిన్ చిరిగి పోయింది. రోలర్ పై భాగాన మేడిచెట్టు నుంచి జారిన ఒక తీగ నిదానంగా రోడ్డు రోలరు మీద తన అస్తిత్వాన్ని చాపి తనలో ఉన్న ఆకుల్ని కప్పింది. రోడ్డు ప్రక్కనున్న దుమ్ము ధూళు ఆకు అలం కసువు మొదలైనవన్నీ రోలరు మీద పవళించగా, ఈ రోలరు ఈ కాలంది కాదు అనే కల్పన చూస్తున్నోళ్ళకు కలిగేటట్లుగా పరిస్థితిని నిర్మించింది.

అప్పుడు రావ్ గారు ఈ విషయాన్ని తీవ్రంగా తీసుకొన్నాడు.

ఆ రోడ్డులో తిరుగుతుండే ఒకరిద్దర్ని ఆపి "ఔనండి, రోడ్డు నిర్మాణం అయ్యింది. అయితే ఈ రోడ్డు రోలరు ఇక్కడ స్థాపనమై పోయిందికదా" అంటూ వాళ్ళ గమనాన్ని రోలరు వైపుకు లాగారు. వాళ్ళలో ఒకరిద్దరు తలొక రీతిగా జవాబిచ్చారు...

"చెడిపోయి ఉండొచ్చు"

"ఎక్కడా కార్యం నిర్వహించేది లేనట్లుగా దాన్లో ఉందేమో"

"సంబంధించిన ఇంజినీరు గారు దాని గురించి మరిచినట్లుగా కనబడుతుంది"

"డ్రైవరు సెలవు పెట్టి ఉండొచ్చేమో"

"అయ్యో, ప్రభుత్వానికి ఒక జవాబ్దారితనం అంటూ ఉండేదుంది కదా..."

అంటూ తలొక రీతిలో జవాబు వస్తుండగా, రావ్‌గారికి వీటిలో ఏది సరైంది అనేది తెల్వక పేచీలో పడ్డారు. అయినా ఇదంతా ఇలా జరగకూడదని అనుకొన్నారు.

నీటుగా నవీనత్వాన్ని పొందిన రోడ్డు చెంత ఇలా ఒక యంత్రం నిలబడి యుంది సరికాదని, రావ్ గారు దాన్ని అక్కడ్నుంచి తీయించాలని భావించారు. అదే గాకుండా వారిలో మళ్ళా మరొక దిగులు మొదలైంది ఏమిటంటే ఒక ప్రభుత్వ యంత్రం ఇక్కడ నిష్క్రియాపరంగా ఖాళీగా నిలబడిపోతే ఏమి అర్థం కలుగుతది

జనంలో? రావ్ గారు తమ కుండే ఖాదీ వస్త్రాల్ని ధరించి ఊత కర్రను ఊతంగా వేసుకొంటూ లోకోపయోగి (పి.డబ్ల్యు.డి.) కఛేరికి వెళ్ళారు.

కఛేరి చెంత వారికి రోడ్డు నిర్మాణ కార్యాన్ని చేసిన ఇంజినీర్ గారి దర్శనం అయ్యింది. అతను వీరిని తమ గదికి తీసుకెళ్ళి కుర్చీలో కూర్చోబెట్టి... "ఎందుకు సార్ ఇంత దూరంకు వచ్చారు?" అని అడిగాడు.

"ఔనండి, మా రోడ్డు నిర్మాణ కార్యం అయితే బాగానే అయ్యింది. అయితే మీ రోడ్డు రోలర్ ఇకనూ అక్కడే ఉంది కదా" అన్నారు రావ్‌గారు.

"అక్కడే అది ఉండేది సాధ్యంకాదు" అంటూ తన ఫైళ్ళున్న ర్యాక్ నుంచి ఒక ఫైలు బయటకు తీసి చూసిన పిమ్మట 'ఓ' అని ఘోషపెట్టాడు. "సర్.. మా వద్ద స్పేర్ రోడ్డు రోలరు లేనందున దాన్ని సొరబ (శివమొగ్గలోని తాలూకాక్షేత్రం) నుంచి తెప్పించాం... డ్రైవర్‌కు హుషారుగా లేదు అని దాన్ని అక్కడే వదిలి వెళ్ళాడు... ఉపవిభాగం వాళ్ళు దాన్ని తమ వద్దకు తెప్పించుకోవాలి... వాళ్ళు మరిచినట్లున్నారు... ఛి ఛి ఛీ" అంటూ అతను హైరాణా పడ్డాడు.

"రోడ్డు రోలర్లు, లారీలు, మిక్సర్లు...అన్నీ మెకానికల్ ఇంజనీర్‌గారి వశంలో ఉంటవి. వారికి ఇవన్నీ ఎక్కడెక్కడ ఉన్నవనేది గుర్తు ఉండాలి... ఇలా ఒక రోడ్డు రోలరు ఆరు నెలల నుంచి అక్కడే పడియుంది అంటే ఈ ఇంజినీర్ ఏమి చేయగలడు? అతనికి జవాబ్దారి లేదా?" అంటూ అతను కటువుగా పలికిన తర్వాత, "నేను ఈ రోజే లెటర్ రాస్తాను" అని మళ్ళా అన్నాడు.

"ఔనండి... డ్రైవర్ సెలవు మీద వెళ్ళాడు అనే కారణం నుంచి ఇలా కాకూడదు కదండి" అంటూ రావ్ గారు మరిక బయల్దేరుతూ "డ్రైవర్ హుషారుగా లేదని అంటున్నారు కదా, అతను ఇప్పుడెక్కడున్నాడు?" అని అడిగారు. వారికి డ్రైవర్ సింజావ మీద ఏదో అవ్యక్తమైన ఆసక్తి నిలుపుకొన్నందున అతని గురించి ఆరా తీసారు.

"అది నాకు తెల్వదండీ... రోడ్డు నిర్మాణం ముగిసిన రోజు అతను నా ఆఫీసుకు వచ్చి తనకు వంట్లో బాగా లేదని, తక్షణమే ఊరికి వెళ్తానని... రోడ్డు రోలర్‌ను నడుపుకొని వెళ్ళేందుకు తన డిపార్ట్‌మెంటోళ్ళకు చెపుతానని అన్నాడతను. అతను ఇకనూ స్వస్థత చెందలేదని అన్పిస్తుంది నాకు. ఇందుచేత రోడ్డు రోలర్ అక్కడే ఉండిపోయింది. కానీయండి, నేను దాన్ని సొరబ పట్టణంకు పంపే కార్యాన్ని చేయిస్తాను శీఘ్రమే" అంటూ మళ్ళా భరోసా ఇచ్చాడు అతను.

రావ్‌గారు ఊతకర్రను ఆలంభనంగా చేసుకొని ఇంటికి చేరారు. అయితే సింజావ ఆరోగ్యస్థితి సరిగాలేదనే విషయం వారి మనస్సును కలిచింది. సొరబ పట్టణంకు వెళ్ళి అతడ్ని చూసి రావాలని భావించారు.

మరునాడే రావ్ గారు బస్సు ఎక్కి సొరబపట్టణంకు వెళ్ళారు. బస్టాండులో దిగి అక్కడ్నుంచి పి.డబ్ల్యు.డి. కఛేరికి వెళ్ళినప్పుడు అక్కడ డ్రైవర్ సింజావ ఇంతకు ముందు ఆస్పత్రిలో ఉన్నాడు, ఇప్పుడు ఇంటికి చేరుకొన్నాడు అనే విషయం తెల్సి, మరిక కఛేరికి వెనకున్న క్వార్టర్స్‌లలో అతను ఉండే ఇల్లు వెతుకుతూ వెళ్ళారు.

తలకు మఫ్లర్ చుట్టుకొని ప్రాంగణంలో కూర్చున్న సింజావ రావుగారు తన ఇంటి ద్వారంకు చేరుకొనేది నిరీక్షించలేదు. అతను వీరిని చూసిందే తడవుగా "స్వామి" అని సంబోధించి లేచినిలబడ్డాడు.

"కూర్చోండి, మీరు కూర్చోండి" అన్నారు రావ్ గారు.

రావ్ గారి ఇంటెదురులో ఉన్న రోడ్డు కార్యం ముగించబడి ఇక వెళ్ళాలని నిర్ణయించుకొన్నప్పుడు సింజావకు గుండెలోనొప్పి కలుగగా అతను ఆరోజు శివమొగ్గలో ఉండే ప్రభుత్వాస్పత్రికి వెళ్ళాడు. అక్కడ్నుంచి మరింత వైద్యంకని దావణగెరెకు అతను వెళ్ళాల్సి వచ్చింది. అక్కడుండే ప్రత్యేక ఆస్పత్రి విభాగంలో మూడు నెలలు గడిపిన తర్వాత సొరబకు వచ్చి విశ్రాంతి పొందుతున్నాడు.

"రోడ్డు రోలరును అక్కడ్నుంచి తెప్పించుకోండి అని సార్‌కు చెప్పాను. అది ఇంకా అక్కడే ఉందా?" అంటూ బాధపడ్డాడు సింజావ. "మా ఉప విభాగంలో నేను గాక మరిక ముగ్గురు చాలకులు (డ్రైవర్లు) ఉన్నారు. ఒకరు ఇంజనీర్ గారి జీపు నడిపేందుకు సదా వెళ్తాడు. మరిద్దరు లారీలకు వెళ్తారు. వీళ్ళెవరూ రోడ్డు రోలర్ నడిపేందుకు ఇష్టపడరు. రోడ్డు రోలరును చాలన చేసేది అవమానంగా భావిస్తారు... నేను కొంచెం బాగుపడిన పిమ్మట, ఖుద్దుగా అక్కడికి వచ్చి దాన్ని తీసుకొస్తాను..." అని వివరంగా మాట్లాడేందుకు ఆయాసపడుతూ చెప్పాడు సింజావ.

"ఔను సింజావ... ఒక సర్కారి యంత్రం ఇలా కార్యం నిర్వహించకనే మూలబడిపోతే సర్కారుకు నష్టం కాదా?" అంటూ రావ్ గారు అడిగారు.

"నష్టమే స్వామి నష్టమే. గుత్తేదారుకు బాడుగకని ఇస్తే నెలకు లక్షలలో ఆదాయం వస్తది... అంతేగాకుండా డిపార్ట్‌మెంట్ అక్కడిక్కడని... డాంబరీకరణ (తారు వేయటం) చేస్తది. అక్కడ రోలరు నుంచి కార్యాన్ని చేయించొచ్చు. అయితే ఈ సార్లు ఏమి చేస్తారో తెల్సా... ఇంజిన్ సరిగాలేదు, డ్రైవర్ లేడు అని చెప్పి వేరే చోటునుంచి బాడుగ చెల్లించి మరొక రోలరును తెప్పించుకొంటారు... తమ చెంత రోలరు బాగానే ఉన్నా వేరే చోట నుంచి తెప్పించి పనులు చేసేది తప్పుకదా! అదేగాకుండా ప్రభుత్వ బొక్కసంకూ నష్టమే కదా స్వామి"

రావ్ గారి తల చెడిపోసాగింది. ఒక అరగంట సింజావ వద్ద కూర్చుని మరిక రావ్‌గారు బయల్దేరారు. కఛేరి ఆవరణ నుంచి బయటపడేముందు ఒకసారి అక్కడుండే ఇంజనీర్‌ను చూద్దామని అన్పించి వారి ఛేంబరుకు వెళ్ళారు.

ఆ ఇంజనీర్ గారు వీరిదుస్తులు ఆకృతి చూసి గౌరవం నుంచే మాట్లాడారు. వీరి విన్నపం విన్న తర్వాత "ఇదంతా నాకు గుర్తులేదండి. నేను రేపే వేరొక డ్రైవర్‌ను పంపి దాన్ని మా విభాగంకు తెప్పించుకొంటాను... మీరు ఇంతగా ఆసక్తి వహించిన దానికి థ్యాంక్స్" అన్నాడు.

అతని నుంచి వచ్చిన థ్యాంక్స్ పదాన్ని అతనికే అప్పగించి రావ్‌గారు తన గ్రామంకు వెళ్ళే బస్సు ఎక్కారు. దారి పొడవునా వారి తలలో నిండియుంది ప్రభుత్వ ఇలాఖాలోని బేజవాబ్దారితనం కదా! సర్కారి నౌకర్ల నడతకు 'ఛి ఛీ' అనుకొంటూ వారు తమ ఊరుకు వెనుదిరిగారు. వారు తమ రోడ్డుకు ముట్టుతుండగా, ఆ రోడ్డు రోలర్ అక్కడ తపస్సుకని కూర్చున్న వృద్ధ సన్యాసిలాగ కనబడింది. నిదానంగా చుట్టు పక్కలున్న చెట్లు లతలు దాన్ని తమ వశంలోకి తీసుకోసాగినవి. మేడిచెట్టు మీదున్న ఒకట్రెండు కోతులు రోలర్ మీద ఎక్కి తమ కుచేష్టల్ని ఆరంభించినవి. ఈ కోతులకు జతగా కొంతమంది ఊరిపోరలు నిల్చి కోతి చేష్టల్ని చేయసాగారు.

దిన నిత్యం ఉదయంలో వాయు విహారంకని వెళ్తుండే రావ్ గారు అనివార్యంగా ఆ రోడ్డు రోలరును చూసేదుంది. దాన్ని చూసినప్పుడల్లా వీరి మనస్సులో సూది గుచ్చినట్లై బాధకలుగుతుండేది. ప్రస్తుతమే దాన్ని తెప్పించుకొంటానని చెప్పిన సొరబలోని అధికారి ఆడిన మాటను నిలబెట్టుకోలేదు. ఆ యంత్రం మునుపెక్కడుందో అక్కడే అదే జాగాలో బలంగా పాతుకుపోయి నిలబడియుంది. అడవి దాన్ని మరింతగా ఆక్రమించుకొంది.

మరిక ఒక రోజు శివమొగ్గకు వెళ్ళిన రావ్ గారు అక్కడుండే జిల్లా స్థాయిలోని కచేరికి వెళ్ళారు. అక్కడద్వారం వద్ద నిలబడిన జవానుకు తమ గురుతు పత్రాన్ని ఇచ్చి లోపలికి చేరుకొంటుండగా కచేరిలో ఉన్న పెద్ద ఇంజనీరుగారు వారిని సాదరంగా ఆహ్వానించారు.

"ఔను స్వామి, మీ డిపార్ట్‌మెంట్ ఒక పని చేయించాలని తీసుకొచ్చిన హెవి వెహికల్‌ను రోడ్డు మీదే పడేసి వెళ్ళిపోయే పరిపాటి ఉందా? ఎవరైనా ప్రైవేటోళ్ళు ఇలా చేస్తున్నదాన్ని మీరు ఎక్కడైనా చూసారా? సర్కారి వస్తువంటే ఇంత నిర్లక్ష్యం చూపేది సరైనదేనా?" అంటూ కొంచెం కారంగానే పీఠిక వేసిన రావ్ గారి పలుకు ఏమి అర్థం గాకనే వెర్రిమోముతో చూస్తూ కూర్చున్న ఆ పెద్ద ఇంజినీర్ గారికి ఉన్న జరిగిన విషయమంతా చెప్పారు. జతగా "సర్కారి నౌకర్లు శ్రద్ధగా పనులు చేయకనే కూర్చుండిపోయేది ఎలాగున అపరాధమో, అలాగే సరిగా ఉన్నయంత్రం ఇలాగున కార్యం నిర్వహించకనే ఒక చోట అచేతనంగా నిలబడిపోయింది తప్పుకాదా? ఈ యంత్రం అక్కడ కార్యం చేయకనే తుక్కుపట్టి పడియుంది, దాన్లోని విడి భాగాల్ని

ఎవరో విప్పుకొని పోయింది, దీన్నుంచి అయ్యే నష్టాన్ని ఎవరు భర్తీచేస్తారు? దీనంతట్ని మీరు యోచన చేసారా?" అని కటువుగా పలికారు రావ్ గారు.

ఆ ఇంజనీర్ వీరి నుంచి సమాచారమంతా విని పొందిన పిమ్మట "సార్, నేను దీన్ని పరిష్కరిస్తాను...ఇక ఒకట్రెండు రోజులలో ఆ రోడ్డు రోలరు అక్కడ ఉండేది లేదని మీరు భావించుకోండి" అనే భరోసా మాట పలికాడు. తనకన్నా వయస్సులో చిన్నోడిగానూ, కొంచెం ఆసక్తి ఉత్సాహం ఉన్నోడిలాగ కనబడుతున్న అతని భరోసాను నమ్మి రావ్ గారు అక్కడి నుంచి లేచి తన గ్రామంకు ముట్టారు.

ఇదైన తర్వాత రావ్‌గారు ఎవరైనా వచ్చి ఆ రోడ్డు రోలరును అక్కడ్నుంచి తీసుకొని వెళ్ళేది, ఆ మేడిచెట్టు క్రిందున్న జాగా ఖాళీ అయ్యేది... అని అటువైపుకు వాయు విహారంకు వెళ్ళినప్పుడల్లా చూస్తుండేవారు. అయితే మళ్ళా రెండు నెలలు గడిచినా ఆ యంత్రం అక్కడే పడియుంది. మొత్తం సర్కారు వ్యవస్థే జడత్వం చెందిందేమో అన్నట్లుగా అది అక్కడ నిలబడి పోయింది. కర్నాటక సర్కారు అని దాని మీదున్న రాతకూడా మాసినట్లై, ఆ రోడ్డు రోలర్ అడవిపాలైంది.

ఈ మధ్యలో పి.డబ్ల్యు.డి.కి, కర్నాటక ప్రభుత్వ మొత్తంకు ముఖ్యస్థుడైన ఇంజనీర్ గారు బెంగళూరు నుంచి శివమొగ్గ జిల్లాలో ఉండే జోగ జలపాతం వద్దకు వస్తారనే విషయం రావ్‌గారి చెవిన పడింది. రావ్‌గారు మళ్ళా తయారైయ్యారు యువకుడిలాగ. బస్సులో కూర్చుని జోగజలపాతం వరకు వెళ్ళారు. అక్కడున్న ప్రవాసి మందిరంలో విడిది చేసిన ముఖ్య (ఛీఫ్) ఇంజనీర్ గారిని కల్సారు.

"స్వామి, ఇలాగున ఒక రోడ్డు రోలర్ మా ఇంటి ముందుండే రహదారిలో పోయిన సంవత్సరం నుంచి అనాధగా నిలబడి ఉంది" అంటూ ఎప్పటిలాగే తమ పురాణాన్ని విప్పారు. ముఖ్య ఇంజినీర్ గారు "ఔనా, ఔనా" అంటూ బాధపడి "నేను దాన్ని అక్కడ్నుంచి తీయించేందుకు క్రమపద్ధతిని చేస్తాను" అని భరోసా ఇచ్చారు. జతగా... "సర్కారి ప్రాపర్టీ మీద మీకున్న ఆసక్తి నన్ను ముగ్ధుడ్ని చేసింది, ఇది సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారు జన్మించిన రాష్ట్రం" అని కూడా పలికాడు. ఇకనైనా ఆ రోడ్డు రోలర్ అక్కడ్నుంచి వెళ్ళిపోతదనే ఆశాభావం పెట్టుకొని రావ్ గారు తమ ఇంటికి చేరుకొన్నారు.

అయితే ఆ రోడ్డు రోలర్‌ను అక్కడనుంచి తీసుకెళ్ళేందుకు ఎవరూ రాలేదు.

రావ్‌గారి తాళ్మె, సహనం, దేశాభిమానం... అన్నిట్నీ పందెంకు ఒడ్డినట్లుగా అయ్యి మరిక రావ్ గారికి నిద్రరాకనే, తిండితినే భోజనం సహించకనే, శాంతి సహనంను పోగొట్టుకొన్నోడిలా వారు రోజుల్ని గడుపుతున్నారు.

ఇదే సమయంలో వారి మీద ప్రీతి అభిమానం ఉంచుకొన్న పి.డబ్ల్యు.డి. మంత్రైన బసవణ్యప్పగారు శివమొగ్గకు వచ్చే సందర్భం ఒకటి వచ్చింది. తక్షణమే

రావ్‌గారు సన్నద్ధులైయ్యారు. వారి ఖాది జుబ్బా, పంచె బీరువానుంచి బయటకొచ్చినవి. వాట్ని ధరించి రావ్ గారు శివమొగ్గలో ఉన్న సర్క్యూట్ హౌస్‌కు వెళ్ళారు. ఉండనీ తన చెంత అని ఆ రోడ్డు రోలర్ దుస్థితి కథను ఒక తెల్లకాగితంలో రాసుకొని చేతిలో భద్రంగా పెట్టుకొని వెళ్ళారు.

బసవణ్యప్ప గారు వీరిని చూసి భారి గౌరవం నుంచి స్వాగతించారు.

"ఏంటి రాయరు (రావ్) గారు ఇంత దూరంకు వచ్చారు, ఏమి జరిగేదుంది స్వకార్యం నానుంచి?" అంటూ చెంత కూర్చోబెట్టుకొని అడిగారు వినయంగా.

రావ్‌గారు తను వచ్చిన కారణం చెప్పి, రాసుకొని వెళ్ళిన కాగితాన్ని వారి చేతిలో పెట్టారు.

"ఒక సంవత్సరం నుంచి ఆ రోలర్ అక్కడ స్తబ్దుగా నిలబడియుంది బసవణ్యప్పా. సర్కారుకు ఒక బాధ్యతలేదా, ఒక జవాబ్దారిలేదా, మంచిగా నడుస్తుండే ఒక యంత్రాన్ని ఇలా అడవిపాలు చేస్తుంటే మీ డిపార్ట్‌మెంట్‌లోని ఇంజినీర్లు ఎలాగున ఈ దేశాన్ని ప్రగతిపథంలో ఉంచుతారయ్యా" అని కొంచెం కఠిణంగానే చెప్పారు రావ్ గారు.

"ఔనా, ఔనా, మా ఆఫీసర్ల గమనంకు నేను దీన్ని తెస్తాను. మీరిక యోచన చేయకండి" అన్నాడు మంత్రి మహోదయుడు. మంత్రి గారు మరిక ఒక ట్రెండు లోకహిత వాక్యాలు పలికిన పిమ్మట రావ్ గారు అక్కడ్నుంచి లేచి తమ గ్రామంకు చేరారు.

మళ్ళా ఒక నెల గడిచింది. రోడ్డు రోలర్ కన్పించదన్నట్లుగా అడవి తీగలు దాన్ని అలముకొన్నవి.

ఒక రోజు ఉదయంలో ఆ యంత్రం నిలబడిన దిక్కు నుంచి ఏదో డుబు డుబు శబ్దంరాగా, రావ్‌గారు వాకింగ్‌కని వెళ్ళినోళ్ళు కొంచెం ముందుగానే దాని చెంతకొచ్చి నిలిచారు.

సింజావ యంత్రం మీద కూర్చున్నాడు. దానిమీద పెరిగిన లతల్ని పీకిపారేసాడు. యంత్రం చుట్టూ అలుముకొన్న అడవి ముళ్ళ వంకాయ చెట్లను, పోరలు ఆటాడుకొనే తుత్తూరి మొక్కల్ని పీకి పారేసాడు. పుట్టగా పెరిగిన మట్టి తొలిగించాడు. రావ్‌గారు అతని వద్దకొచ్చి 'సింజావ' అని ఆప్యాయంగా పలకరించారు.

"నమస్కారం స్వామి" అంటూ సింజావ చేతులు ముడిచాడు.

"అబ్బబ్బా, చివరికి ప్రభుత్వం కన్ను దీని మీద పడిందికదా" అన్నారు రావ్‌గారు.

"అబ్బే లేదండి స్వామి. డిపార్ట్‌మెంటోళ్ళు నన్ను పంపలేదు. నేనే వచ్చాను. నాకింకా హుషారుగా లేదు వంట్లో. డాక్టరుగారు ఇప్పుడూ విశ్రాంతి తీసుకోమని అంటున్నారు. అయినా నేను వచ్చాను... ఎల్లవేళలా కార్యం నిర్వహించే బ్రిటిష్ కాలం నాటి వెహికల్ కదా ఇది. ఇది ఇలాగున అడవిపాలు కాకూడదని భావించి

వచ్చాను. నేనే స్వయంగా నా డబ్బుతో ఆయిల్, ప్యూయల్ తెచ్చి స్టార్ట్ చేసాను. దీన్ని సొరబకు తీసుకెళ్ళి ఉపవిభాగంలోని కచేరి ముందు నిల్పుతాను".

అతను యంత్రాన్ని స్టార్ట్ చేసాడు. సుమారు ఒక సంవత్సరం నుంచి బంద్ అయిన అది తక్షణమే మొరిగేందుకు ఒప్పుకోలేదు. అయినా సింజావ తన ప్రయత్నాన్ని మానలేదు.

చివరికి రోలరుకు ముందున్న పొగగొట్టంలో నీలి పొగ బయటకు వచ్చిన తర్వాత అది తన కార్యాన్ని ప్రారంభించింది.

సింజావ రావ్‌గారింటికి వచ్చి ఉపాహారం తిని వారితో మాట్లాడి తన యంత్రం వద్దకు చేరాడు.

ఆ రోజు సూర్యుడు నడినెత్తికి ఎగబ్రాకినప్పుడు పల్లె దారిలో నిలబడి పోయిన ఆ రోడ్డురోలరు చివరికి అక్కడ్నుంచి కదిలి సొరబపట్టణంకు ఉండేదారిని పట్టుకొన్నప్పుడు పల్లెలో ఉండే పోరలంతా కొంచెం దూరం దాని వెనకే పరుగుపెట్టారు.

అనంతరాయరు (రావ్) గారితో పాటు రోడ్డు రోలరు వెళ్ళేదాన్ని చూసేందుకు వచ్చినోళ్ళు సింజావ వైపుకు తిరిగి చేతులు ఊపారు. అతని ఆరోగ్యం ఇకనూ సరికాలేదు. అతను అంతగా హుషారులో లేక ఆశక్తుడిగానే ఉన్నాడు.

"సింజావ, నీ ఆరోగ్యం మీద గమనం పెట్టుకో" అని అరిచి చెప్పారు రావ్‌గారు. అతను అక్కడ్నుంచే తలూపాడు.

రోడ్డు రోలరు గడగడ చప్పుడు చేస్తూ వెళ్తున్న దాన్ని గమనిస్తూ కొంచెంసేపు నిలబడి మరిక తన ఇంటి వైపుకు తిరిగారు రావ్‌గారు. తమలోని పట్టుసడలని పోరాటం నుంచి, సింజావలోని కార్యతత్పరత నుంచి ఇది సఫలం అయ్యింది కదా అని వారికి సమాధానమైంది.

రోడ్డు రోలరు నిల్చిన జాగాలో గడ్డి, చెట్లు, లతలు ఒణిగిపోయి అక్కడొక గురుతును ఆ యంత్రం వదిలిపెట్టి వెళ్ళింది. ఈ గుర్తు వాయువిహారంకని తిరుగుతుండే రావ్‌గార్ని ఎన్నో రోజుల వరకూ వెంబడించింది.

**మూలకథ రచనాకాలం : 2008**

# దేవాలయంలోని దేముడికి శిలువ వందనం

తూర్పు (మూడణ) దిక్కులో కెంపువర్ణం ఏర్పడే ముందే దేవస్థానం నుంచి సుప్రభాతం మ్రోగుతది. మేలుకో వెంకటరమణా నుంచి ఆరంభమై కొల్లూరు పురవాసిని అయిన మూకాంబికా దేవి వరకూ... సకల దేవదేవతలకు, చిన్న చిన్న గ్రామ దేవతలకూ మేలుకోండి మేలుకోండి అని పాడి స్తుతించే కార్యం ముగుస్తుండగా, ఆయా దేవాలయాలలోని ద్రావిడ శైలిలోని గోపురాలకు అవతల మండుతూ పైకిలేచి వస్తున్న సూర్యనారాయణుడి కెంపుకాంతులు ఊర్లో ఉండే అన్ని ఇళ్ళకు, గుడిసెలకు, బంగళాలకు తాకుతున్నప్పుడు ధ్వనివర్ధకం (మైకు) నుంచి వస్తున్న ధ్వని తగ్గిపోయి దేవాలయం బయట ఇతర చప్పుళ్ళ మధ్య మునిగి అదృశ్యమౌతది. జనం దేముడ్ని దేవాలయంను మరిచి తమ దైనందిక ప్రాపంచిక కార్యక్రమాలలో నిమగ్నులౌతారు. సాంకేతికంగా అన్నట్లు దేవాలయంలోని సుప్రభాతసేవ ముగిసి దృఢమైన చెక్క తలుపులు ధర్ అని చప్పుడు చేసి మూసుకొంటుండగా, దాన్లోని ఇనపగొళ్ళెంకు పురాతనకాలంలోని పెద్ద సైజులో ఉండే ఇత్తడి తాళం అలంకృతమై మరిక దేముడికి బయటుండే మానవ ప్రపంచంకు నడుమ ఉండే సంబంధం తాత్కాలికంగా నిలబడి పోయింది అనే అర్థం అవుతదిలే!

రథవీధిలో సాగిపోతుండే జనం, వాహనాలలో వెళ్తున్నోళ్ళు గుడివైపు ముఖం పెట్టి, మూసిన ద్వారంకు హడావుడిగా ఒక దీర్ఘ నమస్కారం చేసి తమ పనులను గుర్తుకు తెచ్చుకొంటూ వెళ్ళిపోతుంటారు. దేవాలయం లోపలికి వేకువఝామునే వచ్చి, చేతులు ముడిచి నిలబడి పూజ జరిపించి పూలు ఫలాలు అర్పించి మంగళారతి పొంది తీర్థప్రసాదం స్వీకరించి తమలో ఉన్నదాన్ని ముగ్ధభక్తితో సమర్పించే కైంకర్యంలో ఒకటో ఒకటిన్నర శాతం భక్తి ఇప్పుడు ఈ నవతరం వాళ్ళకు ఉండేది లేదని అందరికీ గుర్తుంటదిలే. అయినా దేవాలయం ముందు నుంచి వెళ్తుండేటప్పుడు ఇలాగున ఒక నమస్కారం చేసేది రూఢిగా అయినందున ఈ పద్ధతిని మీరి వెళ్ళేందుకు ఎవరూ మనస్సు పడుతుండేది లేదు. ఇందుచేత ఈ మొక్కుబడి నమస్కారం కొనసాగుతుందిలే!

దేవాలయంలోని తలుపులకు తాళంపడి జనం దూరం నుంచి నమస్కరిస్తున్నప్పుడు, దేవాలయం చెంత డబ్బాపెట్టె లాంటి గూడు అంగడిలో ఒకొక

చెక్కతలుపును జోడించి మూసి, అంగడి యజమానైన ఫరాస్క చేతిలో బిన్ని కంపెనీ బట్ట నుంచి కుట్టించబడిన పెద్ద సంచి వేలాడుతుండగా మరిక అతను అంగడి దిగి బయట కొచ్చాడు. ఇలా బయటకొచ్చే ముందు ఒకసారి అతను తన అంగడి అంతకూ దృష్టిపారించేది మరవలేదు.

కొబ్బరి కాయలు అయిపోయినందున ఏబైకాయల్ని పంపమని టెంకాయల వ్యాపారంలో హోల్‌సేల్ అంగడికి యజమానైన శ్రీ శంకరషెట్టిగారికి చెప్పాలని అతను అనుకొన్నాడు. అలాగే ఊదుకడ్డీలు, కర్పూరం, అరటి గెలలు, పసుపు కుంకుమ ప్యాకెట్లు, పటిక బెల్లం... ఇలాగున ఉండే పూజా సామాగ్రిని ఎంతెంతగా తీసుకురావాలి అనే దాన్ని జ్ఞాపకంలో పెట్టుకొని అంగడి ముందున్న రథవీధిలోకి దిగిన అతను గుడివైపుకు తిరిగి నుదురు భుజం హృదయం మీద ముట్టుకొని శిలువవందనం చేసి పేటకు బయల్దేరాడు.

గుడికి అటుఇటు ఉన్న రథంవీధిలోని అంగడి వాళ్ళు, హోటెల్‌వారు... "ఫరాస్క షావుకారుగారు... వ్యాపారం మంచిగా అయ్యిందా".

"ఉదయం డ్యూటి ముగిసిందా"

"ఏంటి...? పేటకు బయల్దేరుతున్నారా?"

"సామాన్లు తెచ్చేదుందా...." అని అడుగుతుండగా ఫరాస్క వారందరికీ సరైన జవాబు చెప్పి చేతిలో బట్ట నుంచి కుట్టించబడిన సంచి ఊపుతూ నడవసాగాడు.

పదిగంటలకు దేవస్థానంలోని తలుపులు మూసుకొంటే ఫరాస్కకు విరామం దొరుకుతది. మళ్ళా దేవస్థానంలో పూజ, మంగళారతికని జనం వచ్చేది సాయంత్రం ఐదుతర్వాతే! దేవస్థానంలోని వాకిలి తెరిచేది కూడా అప్పుడే. అంత పొద్దుకు కొంచెం ముందే ఫరాస్క తన అంగడి తెరిచి కూర్చుంటే భక్తులు ఒకరి వెనుక ఒకరు పూజాసామాగ్రిని అడిగి కొనుగోలు చేసి వెళ్తారు.

"పూజా సామాగ్రి ఇవ్వండి" అని అడిగిన తక్షణమే ఏమేమి ఇవ్వాలి అనేదంతా ఫరాస్కకు తెల్సులే! ఒక వెదురు బుట్టలో టెంకాయ, పూలు, అరటిపండ్లు, కర్పూరం, ఊదుకడ్డీలు, పటికబెల్లం మొదలైన వాట్నిపెట్టి అతను ఇస్తుండేవాడు. గిరాకీల నుంచి అతను సరైన రేటునే పొందేవాడు. ఫరాస్క ఈ అంగడి జవాబ్దారి ఎత్తుకొని ఇప్పటికే పదిహేను సంవత్సరాలు దొర్లినవి.

క్రితంలో రామనాథపై గారు ఈ అంగడికి యజమానిగా ఉండేవారు. క్రమేణా ఊరు పెరిగి పెద్దదై దేవస్థానంకు వచ్చే జనం ఎక్కువవ్వగా పైగారు తన సహాయంకు

దోహదపడుతాడని ముక్కు మోహం తెల్వని ఈ కిరస్తాని పోరడ్ని పనికని కుదుర్చుకొన్నారు.

ఇతను గుమాస్తాగా చేరి పది సంవత్సరాలు అయినప్పుడు రామనాథపై గారికి పక్షవాతం వచ్చింది. వారి కుడికాలు స్వాధీనం తప్పిపోయినప్పుడు వారు ఆ దురవస్థలోనూ అంగడిలో కూర్చుని ఉండగా మిగిలిన పనులన్నిట్నీ ఫరాస్కదే చూసుకొంటూ వెళ్తుండేవాడు.

పూజాసామాగ్రి ఇవ్వండని అడుగుతున్నోళ్ళకు ఏమేమి ఇవ్వాలనేదాన్ని ఫరాస్క తెల్సుకొన్నదే అప్పుడు కదా! పైగారి జతగా పేట నుంచి హోల్‌సేల్‌గా సామాన్లు కొని తెచ్చుకొని అంగడిలో పెట్టి అమ్మేదాన్ని తెల్సుకొంది మరి అప్పుడే కదా!

మరిక ఐదు సంవత్సరాల తర్వాత రామనాథపై గారి జబ్బు ఉల్బణించింది. వారు ఫరాస్కమీద అంగడి బాధ్యతల్ని పూర్తిగా అప్పగించి స్వగృహంలోనే ఉండిపోసాగారు.

ఈ అంగడి అటు దేవస్థానంకు చెందిందికాదు; ఇటు ప్రక్క వేరేదెవరిది కాదు. పురసభకు చెందిన ఒకింతజాగా మొదట్లో ఖాళీగా పడియుంది గమనించిన రామనాథపై గారు అక్కడొక దుకాణం కట్టుకొన్నారు. భూమిశిస్తు, వ్యాపార శిస్తు అని కొన్ని రూపాయల్ని మొదట్నుంచి క్రమం తప్పకుండా పురసభకు కట్టుతూ వచ్చారు పై గారు.

సుమారు 10×12 అడుగుల బారు వెడల్పుతో ఉన్న ఈ జాగాను పురసభవారు ఖాళీగా ఉంచకనే శాశ్వతకౌలుగా రామనాథపై గారికి ఇచ్చారు. పైగారు డబ్బాలాంటి అంగడిని దుకాణంగా మార్చారు. అంగడిలోపల అడ్డపలకలు ఏర్పాటు చేసి టెంకాయలు, ఊదుకడ్డీ ప్యాకెట్లు, పూలు పండ్లు, అరటి గెలల్ని వేలాడదీసేది, పటికబెల్లం ఉంచేది... మొదలైన వాటికని సువ్యవస్థ చేసారు.

అంగడిలో దీన్నంతా నవీకరిస్తున్నప్పుడు వారికి పక్షవాతం వచ్చింది. అయినా వారు గల్లాపెట్టె ముందు కూర్చుని డబ్బు లెక్కిస్తుండేవారు. ఫరాస్క వారి జతగా వినయంగా సర్దుకు పోయాడు. ప్రామాణికంగానే గుమస్తా కార్యాన్ని చేస్తుండేవాడు.

మరిక కొన్ని సంవత్సరాల తర్వాత రామనాథపైగారు వైకుంఠవాసి అయ్యారు (చనిపోయారు). అప్పుడు ఈ అంగడిని ఏమి చేయాలనేది ఒక సమస్యగా తలెత్తింది. పైగారికి ముగ్గురు సంతానం. ఈ ముగ్గురూ బాగా చదివినందున బయటున్న నగరాలలో మంచి మంచి నౌకరీలలో ఉన్నారు. ఇక్కడ పైగారు వారి శ్రీమతి నెమ్మదితనం నుంచే కాలంగడుపుతుండేవారు.

పైగారి కుటుంబం కొంచెం సిరిసంపదతోనే తులతూగుతుండేది. ఊరిబయట మూడు ఎకరాలతోట జమీను, ఊరిలోపల బాడుగ వచ్చే రెండు ఇళ్ళు, దూరానున్న సంతానం పంపుతుండే డబ్బు వారి వద్ద ఉంటుండేది. గుడి ముందున్న అంగడిని దేముడి సేవకని నడుపుతుండేవారు. పూజాసామాగ్రిని ఒక వెదురు బుట్టలోనింపి గిరాకీలకు ఇస్తే వారికి లభిస్తుండే లాభం రూపాయిన్నర మాత్రమే. ఇదే సామాగ్రిని వేరే అంగడి నుంచి కొనుగోలు చేస్తే గిరాకిదార్లు నాల్గైదు రూపాయలు ఎక్కువగా ఇచ్చేదుంటది.

"ఇంత లాభం చాలు ఫరాస్క" అని చెపుతున్నందున ఫరాస్కకు అదే అలవాటు అయ్యి గిరాకీల నుంచి ఎక్కువ డబ్బు గుంజేది లేదు. పండుగ పబ్బం రోజులలో జనం పూజ చేయించేందుకని అధిక సంఖ్యలో వస్తుండేవారు. ఇటువంటి సుదినాలలో నూరో నూట ఏభై వరకో లాభం వస్తుండేది. మిగిలిన సాధారణ రోజులలో నలభైయ్యో ఏభైయ్యో వస్తుండేది.

పైగారు చనిపోయిన తర్వాత ఈ అంగడ్ని ఏమి చేయాలనే ప్రశ్న ఆ కుటుంబంకు ఎదురైంది.

బయట నగరాలలో ఉండే ముగ్గురు పిల్లలు తండ్రి అంత్యక్రియలకని గ్రామంకు వచ్చారు.

"ఇదొక జటిల సమస్యను పరిష్కరించుకొందాం" అనివారు మాట్లాడుకోసాగారు.

వారంత వారే ఈ విషయాన్ని ప్రస్తావించారు అనే దానికన్నా వారికి దగ్గరుండే రక్త సంబంధీకులే ఈ విషయాన్ని ముందస్తుగా ప్రస్తావించారు.

"రేపు మీరంతా మీ మీ ఉద్యోగాలు చేస్తుండే నగరాలకు చేరుకొంటారుకదా... ఈ అంగడి కతమీద ఏదో ఒక తీర్మానం చేయండి" అని పైగారి అర్ధాంగికి తమ్ముడైన జనార్ధన చెప్పాడు.

"ఔను ఇప్పటిదాకా పైగారు అంగడిలో ఆరోగ్యరీత్యా లేకున్నా వారి పేరు మీద పరోక్షంగా అంగడి నడుస్తుండేది. ఇక ముమ్మందు అలాగే జరుగుతదా" అంటూ అతను రాగం ఎత్తినప్పుడు పైగారికి పెద్ద కుమారుడైన పురుషోత్తమ "ఏంటి మీరు అనేది" అని ప్రశ్నించాడు.

"ఇప్పుడు అంగడ్ని చూసుకొంటున్నోడు ఎవరో గుర్తా మీకు?" అంటూ జనార్ధన మార్మికంగా ప్రశ్నవేసాడు.

"గుర్తేనండి... అయితే ఆ గుమాస్తానుంచి వ్యాపారంకేమి కష్టనష్టం కలగట్లేదు కదా" అన్నాడు రెండో పుత్రుడైన రఘోత్తమ.

"ఆ యువకుడి మీద నాయనకు ఎంతో నమ్మకం ఉందికదా" అన్నాడు పైగారికి మూడోపుత్రుడైన కులోత్తముడు.

"ఆ విషయాన్నంతా ఇప్పుడు కెలికేది వద్దు. పైగారు స్వర్గస్థులవ్వగానే వారి సుపుత్రులు ఏమేమో మార్పులు చేసారని జనం మాట్లాడుకొనేదానికి మనం అస్పదం (అవకాశం) ఇవ్వకూడదు... ప్రస్తుతం ఆ గుమాస్తానే అంగడ్ని చూసుకోనీయండి. మరిక దాని ఫలితం ముందు కాలంలో చూద్దాం..." అన్నాడు పురుషోత్తముడు.

ఈమాట మిగిలినోళ్ళకూ సమంజసంగానే అన్పించింది. నాయన అంగడి ప్రారంభించింది, కిరస్తాని పోరడొకడ్ని గుమాస్తాగా ఉంచుకొంది ఆ సంతానంకు గుర్తే! ఈ పోరడు కూడా ఎంతో నిష్ఠ నుంచి పనిచేసుకొంటూ వెళ్తున్నాడు. పైగారు మంచంబారిన పడినప్పుడు నిత్యం ఇంటికొచ్చి అణా పైసలతో సహా లెక్క అప్పగిస్తుండేవాడు. అంగడికి తెచ్చిన సామాను పట్టి ఇస్తుండేవాడు. అమ్ముడైన వస్తువుల వివరాల్ని ఇస్తుండేవాడు. మిగిలిన లాభం డబ్బును లెక్కించి ఇస్తుండేవాడు. నెల అయినప్పుడు పైగారు అతనికి ఒక వేయి రూపాయల్ని జీతంగా ఇస్తుండేవారు. ఈ పద్ధతి పైగారు పక్షవాత పీడితులై ఇంట్లో పడియున్నా అనుచానంగా ముందుకే సాగిపోయింది.

ఈ అన్ని విషయాలు గుర్తున్నా కొత్తగా దీన్నంతా కెలికి తీర్మానం చేసేందుకు పైగారి సంతానం, అర్ధాంగి ఒప్పుకోలేదు. జనార్దనకు కొంచెం నిరాశ అవ్వనట్లుగా వారంతా "మరిక ముందు చూద్దాంలే" అని తేలగొట్టారు. అయితే అదే రోజు సాయంత్రం ఫరాస్క రామనాథపై గారి ఇంటికొచ్చి ఆరోజు జరిగిన వ్యాపారలావాదేవి వివరం ఇచ్చి ఏదో చెప్పేదుందన్నట్లుగా నిలబడ్డాడు.

ఇంటి ప్రాంగణంలో నిల్చి అతను "రావు గారు..." అంటూ పురుషోత్తమ ముందు తలవాల్చి నిలబడి నేల చూపుల్ని పెట్టినప్పుడు, పురుషోత్తముడే "ఏంటి ఫరాస్క?" అని అడిగాడు.

"పురుషోత్తమణ్ణా" అంటూ కంపిస్తున్న ధ్వనితో పలికాడు ఫరాస్క.

నిజంగానే అతని ధ్వని కంపిస్తుంది. గొంతునరాలు ఉబ్బినవి. పైగారు చనిపోయి మూడు నాలుగు రోజులైనా అతని బాధ తగ్గిపోలేదు. ఆ బాధలోని భారాన్ని మోసుకొన్న అతను కుంగిపోయి ఉన్నాడు.

"ఏంటి ఫరాస్క?" అంటూ మళ్ళా పురుషోత్తమ అతని ముఖాన్ని నిశితంగా చూసి అడిగాడు.

"యజమాని నాకొక దారి చూపెట్టారు. ఇప్పుడు వారు భౌతికంగా లేరుకదా..."

అతని మాటలో ఏదో అతంకం (బాధ) ఉంది. నిత్యం నదిని దాటే కట్టెల వంతెన విరిగిపోయి, ఒక ఒడ్డున నిలబడి అటువైపు నుండే ఒడ్డుకు ఎలా ముట్టాలి అనే దిగులులో ఉన్నోడిలాగ అతను కనబడుతున్నాడు.

"నువ్వేమి యోచనచేయకు ఫరాస్క. అంగడ్ని చక్కగా చూసుకొంటూ వెళ్ళు... అమ్మ మాతోపాటే నగరంకు వస్తది... నువ్వు ఎప్పటిలాగే లెక్కను సరిగా పెట్టుకొని ఉంచు... అంతేచాలు" అనే భరోసా మాటల్ని పలికాడు పురుషోత్తముడు.

"అతడ్నే చూసుకోనీయండి" అని మిగిలిన అన్నదమ్ములు మాట్లాడారు.

ఫరాస్క నుంచి అంగడ్ని గుంజుకొనేందుకు ఏ ఒక కారణం వారికి దొరకలేదు. అతను కిరస్తాని యువకుడనేది తప్పితే వేరే నెపం ఏది అతని నుంచి లేదు.

ఒకసారి రామనాథ పైగారు సంతానం జతగా కూర్చుని భోజనం చేస్తున్నారు. మాటల మధ్య ఫరాస్క ప్రస్థాపం వచ్చింది. పురుషోత్తముడు... "నాయనా... ఫరాస్క గుడి ముందు నిలబడి అదేంటో అలాగున చేస్తుంటాడు కదా...?" అని అడిగాడు.

"అది శిలువవందనం పుత్రా. ఇగర్జి (చర్చి) ముందు నిలబడి నుదురు, రొమ్ము, భుజాల్ని ముట్టుకొని శిలువ వందనం చేస్తారు కిరస్తాని జనం. దాన్ని అతను మన గుడి ముందు నిలబడి చేస్తుంటాడు... ఏంటయ్యా నువ్వు చేస్తుంది ఇలాగున అని నేను ఒకసారి అడుగగా... దేవుళ్ళంతా ఒకటేనండి... మీరు చేతులు ముడిచి వందనం చేస్తారు...నేను శిలువ వందనం చేస్తున్నాను..." అని రామనాథ పైగారు చెపుతున్న మాటలకు వారంతా ముగ్ధతనంతో పడి పడీ నవ్వారు.

రామనాథ పైగారు వైకుంఠవాసి అయిన పిమ్మటా ఫరాస్క ఈ అంగడిలోనే ఉండిపోయాడు.

అంగడికి చెందిన లెక్క అప్పగించేదాన్ని అతను ఆపలేదు. మనియార్డరు ఫారంలో ఉండే చిన్న జాగాలో అతను డబ్బు వివరాల్ని రాసి పైగారి సతీమణికి పంపుతుండేవాడు.

ఒకసారి నగరం నుంచి గ్రామంకు వచ్చిన పైగారి అర్ధాంగి ఫరాస్కకు కబురు పెట్టింది.

"ఫరాస్క.. అంగడి మొత్తాన్ని చూసుకొంటుంది నువ్వు మాత్రమే. నాకెందుకు మనియార్డరు పంపుతున్నావు?" అని అడిగింది ఆమె.

"అంగడి మీదేకదా అమ్మా..."

"ఇక నుంచి అంగడి నీదే ఫరాస్క. నాకు డబ్బు పంపేదాన్ని ఆపు. అంగడ్ని చక్కగా నడుపుకొనివెళ్ళు..." అంది ఆమె.

ఫరాస్క అంగడ్ని చక్కగానే నడుపుతూ వెళ్తున్నాడు. అంగడిలో పుజాసామాగ్రి కొనేందుకని వచ్చే జనంకు ఫరాస్కడి మూలం ఏంటనేది తెల్వదు.అది వారికి ముఖ్యమైందిగానూ అయ్యుండలేదు కదా!

❖ ❖ ❖

గుడి తలుపుల్ని మూస్తున్నప్పుడు ఫరాస్క తన అంగడికి బీగంవేసి పేటవైపుకు నడవసాగాడు.

టెంకాయలు అమ్మే హోల్‌సేల్ అంగడికి వెళ్ళి నూటఏబై టెంకాయల్ని బండిలో వేసి పంపండి అని చెప్పి మరిక కర్పూరం, ఊదుకడ్డీలు, పట్టిక బెల్లం అమ్మే అంగళ్ళ వద్దకు వెళ్ళాడు. అలాగే అరటిగెలల్ని అమ్మే గోవిందణ్ణ వద్దకెళ్ళి నాలుగు అరటి గెలలకు ఆర్డర్ ఇచ్చాడు.

పేటలో వ్యాపారం ముగించుకొని ఇంటి వైపుకు తిరిగినప్పుడు రామనాథపైగారి బావమరిది జనార్దన అతనికి ఎదురుబడ్డాడు.

"నిన్నే వెతుకుతూ బయల్దేరానయ్యా" అన్నాడు జనార్దన.

"ఏంటి రాయరు గారు సంగతి?" అని అడిగాడు ఫరాస్క.

"రోడ్డు మీద ఏంటి మాటలు... కాఫి తాగుదాం రా" అన్నాడు జనార్దన.

ఇద్దరూ హోటెల్‌లోకి చేరారు. జనార్దన తనే ముందుగా రెండు పకోడి ప్లేట్లకు ఆర్డర్ ఇచ్చి మాటలలోకి జారాడు.

"నేను మొన్న పురుషోత్తమను చూసి వచ్చానయ్యా" అంటూ జనార్దన పకోడి ఒకదాన్ని నోట్లో వేసుకొని నములుతూ చెప్పాడు.

అతని మాటలో ఏదో అపాయంలోని ముందు సూచనను గమనించిన ఫరాస్క జనార్దన నోటినుంచి బయటపడబోయే ముందు మాటకని వేచియున్నాడు.

ఫరాస్క భయపడినట్లే ఒక విషయాన్ని చెప్పాడు జనార్దన ఇలా: "నేనిప్పుడు రిటైర్ అయ్యాను ఫరాస్క... ఇప్పుడు నాకు చేసేందుకు ఒక పని కావాల్సి ఉంది... అందుకనే పురుషోత్తముడ్ని కల్సి వచ్చాను".

ఇప్పటిదాకా ఊరులో ఉండే పురసభలో బిల్ కలెక్టరుగా ఉండి, మూడు నాలుగు పురసభ వార్డుల నుంచి కుళాయి (నల్లా) పన్ను, ఇంటిపన్ను వసూలు చేసేది అతని డ్యూటిగా ఉంది. పదే పదే గృహస్తుల చెంతకెళ్ళి శిస్తు వసూలును గుర్తు చేస్తుండేది, రేపురండి ఎల్లుండి రండి అని వాళ్ళు అంటుంటే అలాగే పదే పదేవాళ్ళ గడప తొక్కేది, పన్ను చెల్లించనివాళ్ళకు మళ్ళా మళ్ళా గుర్తు చేస్తుండేది అతని కార్యంగా ఉండేది. పన్నులు వసూలు చేసే దాన్లో అతను పండి పోయినోడిలాగ ఉండేవాడు.

"హరిశ్చంద్ర కావ్యంలో నక్షత్రకుడి లాంటోడు ఇతను" అని జనం ఆడిపోసుకునేవారు. "మీరు నన్ను ఏమైనా అనండి... శిస్తులు మాత్రం చెల్లించండి" అంటూ పీడించేవాడు జనార్దన.

రిటైర్‌మెంట్ (నివృత్తి) అయ్యే దినం దగ్గర పడుతుండగా అతనికి ఒక దిగులు పట్టుకొంది. రిటైర్ అయిన తర్వాత ఏమి చేయాలి? కాలాన్ని గడిపేది ఎలా? ఈ విచారం మనస్సులో జనించినప్పుడు అతనికి గుర్తుకొచ్చింది రామనాథపై గారి అంగడి.

తన బావ అయితే లేదు. ఎవడో కిరస్తాని యువకుడు అంగడి బాధ్యతను నిర్వహిస్తున్నాడు. ఆ పనిని తనే ఎందుకు చేయకూడదు అని యోచించాడు. అయితే తన మేనల్లుళ్ళు దీన్నెందుకో తీవ్రంగా తీసుకొన్నట్లు లేదు. బావ చనిపోయిన తర్వాత ఆ కిరస్తాని యువకుడు అక్కడే కార్యాన్ని చేస్తున్నాడు కదా!

జనార్దన మరిక స్తబ్దుగా అయ్యుండలేదు.

పురసభలోని నౌకర్లసంఘం వాళ్ళు పూలదండవేసి శాలువా కప్పి పూలు ఫలాలు ఇచ్చి వీడ్కోలు పలికిన మూడో రోజే జనార్దన బెంగళూరుకు దౌడుపెట్టాడు.

కొంకణి భాష నుంచి "పురుషోత్తమ మక్క రిటైర్ జాలనావె (పురుషోత్తమ... నేను రిటైర్ అయ్యాను కదా)" అని అతనే ముందుగా మాటలలోకి దిగాడు. పొద్దస్తమానం శిస్తు వసూళ్ళు వసూళ్ళు అని తిరుగుతుండే తను ఇక ముందు ఏమి చేయాలని పురుషోత్తముడ్ని అడిగాడు.

"ఒక అంగడి తెరుద్దాం అంటే పెట్టుబడికావాలి.. మంచిజాగా దొరకాలి... కొత్తగా వ్యాపారం చేసేది కొంచెం కష్టమేసుమీ" అని పీఠిక వేసి... "మీ నాయన అంగడ్ని నాకు ఇప్పిస్తే అనుకూలం అవుతది" అంటూ మాట ముగించాడు. పురుషోత్తమకు మేనమామ మాటలు సుతరాం సమంజసమని అన్పించలేదు.

"ఫరాస్క నుంచి ఇంత వరకూ ఏమి కష్టం ఎదురవ్వలేదు. జనం కూడా అతని విరుద్ధంగా ఏమి పిర్యాదు చేయలేదు. దీని బదులుగా మంచి యువకుడతను... మొన్న శివరాత్రినాడు రాత్రంతా అంగడి తలుపులు తెరిచేకూర్చున్నాడు అని చెప్పింది ఉంది కదా మామా... ఇటువంటి సత్కర్ముడ్ని అంగడి నుంచి తొలగించేది ఎలా?" అంటూ పురుషోత్తముడు పేచీలో పడ్డాడు. అటేమో కిరస్తాని యువకుడైన ఫరాస్కొ, ఇటేమో మేనమామైన జనార్దన. నాయన మమత కరుణ వాత్సల్యం నుంచి ఫరాస్కను అంగడిలో దీర్ఘకాలం ఉంచుకొన్నాడు. మరిక ఏమి చేయాలి? చివరికి ఒక మాట చెప్పాడు ఇలా: "మామా... ఫరాస్క ఒప్పుకొంటే నా అభ్యంతరం లేదు. అతనికి

కష్టం కాకూడదు అంతే!" ఇంత మట్టంకే చెప్పింది చాలు అన్పించింది జనార్దనకు. అతను స్వస్థలంకు తిరిగి చేరుకొన్నాడు.

పురుషోత్తముడితో జరిగిన సంభాషణను తెల్పాడు. అయితే పురుషోత్తముడు పలికిన చివరి మాటను చెప్పలేదతను. దాని బదులుగా "నువ్వు మరిక వేరే ఒక పనిని చూసుకో" అనే ఉచిత సలహాను ఇచ్చాడు. "నీకు ఎలాగూ అనుభవం ఉంది... నువ్వు ఎక్కడైనా అంగడి తెరిచి వ్యాపారం నడుపుకోగల సమర్థుడివి..." అంటూ ఫరాస్కుడి వెన్ను తట్టాడు.

"నేను పురుషోత్తముడి మనస్సులో ఏముందనేదాన్ని చెప్పాను... నువ్వు అతని వద్దకెళ్ళి ఈ విషయాన్ని ప్రస్తాపంచేయకు" అంటూ వేరే ఒక వాక్యాన్ని చేర్చాడు.

కాఫి పకోడా ముగించి హోటెల్ నుంచి బయటకొచ్చిన ఫరాస్క ఎప్పటిలాగే లేడు కదా! రామనాథ పైగారి అర్ధాంగి "ఈ అంగడి నీదే... అంగడ్ని చక్కగా నడుపుకొని వెళ్ళు" అని చెప్పింది అతని జ్ఞాపకంకు వచ్చింది. అమ్మ ఈ మాటను చెప్పిన మీదట అతను అంగడ్ని మరింతగా పెంచాడు. ఈ అంగడి తన కుటుంబాన్ని సంరక్షిస్తూ వస్తుంది.

ఈ మధ్యలో పురుషోత్తమణ్ణ తన నుంచి అంగడ్ని ఎందుకు తప్పించే విచారం చేసాడు అని ఫరాస్క యోచన చేయసాగాడు. తన నుంచి ఏమి తప్పు జరిగింది? తన మీద ఎవరైనా పిర్యాదు చేసారా? ఈ అంగడ్ని వదిల్తే తర్వాత తను ఏమి చేయాలి? తన సంసారం గతి ఏమిటి? వేరోచోట కొత్త అంగడి తెరిచేది సులభమా? సాధ్యమా? అనే వాటి నుంచి ఫరాస్క అయోమయంలో పడ్డాడు.

ఇతను ఈ విషయాన్ని అదెంతగా తీవ్రంగా తీసుకొన్నాడంటే ఆదివారం చర్చికి వెళ్ళినప్పుడు ఫాదర్ డయాస్ గారు "ఏంటి ఫరాస్క... ఎందుకు డల్‌గా ఉన్నావు?" అని అడిగారు.

స్థిమిత మనస్సు నుంచే ఫరాస్క విషయాన్ని చెప్పాడు. తను అంగడ్ని వదిల్తే తన సంసారం అనాథగా అవుతదని అన్నాడు. ఇతని మాట విన్న ఫాదర్ డయాస్ గారు... "నన్ను అడిగితే, నువ్వు ఆ అంగడ్ని వదిలేది శ్రేయస్కరం" అని అన్నారు వారు.

"ఎందుకు శ్రేయస్కరం ఫాదర్?"

"ఇది నిజమైన క్రైస్తవుడు వేరే మతంకు చెందిన పూజాకార్యక్రమాలలో తోడ్పడేది మంచిదికాదు... మన చర్చి ముందే ఒక మైనం ఒత్తుల అంగడి పెట్టుకో అని నేను నీకు చెప్పగలను. అయితే అక్కడ వ్యాపారం ఎక్కువగా జరగదేమో" అంటూ వారే సంజాయిషి ఇచ్చారు.

"ఈ రకమైన మతపరంగా ఉన్న మాటల్ని ఎంతో మంది క్రైస్తవ ఫాదర్ల నుంచి అనేక సార్లు విని రోసిపోయిన ఫరాస్క ఇప్పుడు కొత్తగా వస్తున్న ఫాదర్‌గారి మాటల్ని తేలికగానే తీసుకొన్నాడు. అయితే ఇక ముందు అంగడికి తనకు ఉన్న గాఢ సంబంధం తెగిపోతదని అనుకొన్నప్పుడు అతను అసహనంగానే ఆ అంగడి పనులలో మునిగాడు. ఇలాగని గిరాకిదార్లకు పూజాసామాగ్రి అందించేటప్పుడు అతని ముఖం వడలిపోలేదు. ఎప్పటి లాగే తన మృదుమాటను నవ్వును తక్కువ చేయలేదు.

❖ ❖ ❖

జనార్దన బేటి అయ్యి ఐదారు రోజులు గడిచినవి.

ఫరాస్క గుడి వైపుకు తిరిగి శిలువ వందనం చేసి వచ్చి అంగడి తలుపులు తెరిచాడు. సాయంత్రం వేళలో పూజ చేయించేందుకని భక్తులు రాసాగారు. ఇలా వస్తున్నోళ్ళ మధ్య ఫరాస్క రామనాథపై గారి అర్ధాంగి రమాబాయమ్మను చూసాడు.

"అమ్మా... మీరు..." అంటూ ఆశ్చర్యపడి పలికాడు.

"దేముడికి పూజ చేయించాలని వచ్చాను" అని ఆమె అంటుండగా ఫరాస్క ఆమె చేతిలో పూజా సామాగ్రి ఉన్న బుట్టను పెట్టాడు.

వెదురుబుట్టను చేతిలో పెట్టుకొన్న రమాబాయమ్మ "ఈ పూజాసామాగ్రికి నేను ఇచ్చే డబ్బును దేముడి హుండీలో నీ పేరున వేస్తానులే" అంది ఆ మాతృమూర్తి. మళ్ళా "నా సోదరుడైన జనార్దనకు దేముడు మంచి బుద్ధిని ప్రసాదించనీ... నేను అతనికి సరిగానే మంగళారతి ఎత్తి వచ్చాను... నువ్వు మరిక వేరే యోచన చేయకు... దేముడు నీ చేతిని వదిలేది లేదు" అంటూ రమాబాయమ్మ దేవాలయం వైపుకు తిరిగింది.

ఆమె మాట నుంచి నిప్పుల కుంపటిగా రొమ్ము మీదకూర్చున్న భారం దిగిపోయినట్లె ఫరాస్క తేలికబడ్డాడు. శిలువ వందనం చేసి దేవాలయంలో ఉన్న మూలవిరాట్‌కు వందించాడు నమ్రతగా!

**మూలకథ రచనాకాలం : 2008**

# దురభిమానులు

జీపుస్టార్టై కొంచెం దూరంకు వెళ్ళినప్పుడు, జీపు వెనకే రహీమ్ పరిగెత్తుకొంటూ వస్తున్నాడు. దాన్ని చూసిన డ్రైవర్ జీపు ఆపాడు. రహీమ్ హడావుడిగా వచ్చి నా చేతిలో రెండు రూపాయల ఒక నోటుకుక్కుతూ... “మేకు (మొళ) కొట్టి గోడకు వేలాడ దీస్తారు కదా సార్ అక్షరం... దాన్ని తీసుకురండి” అన్నాడు. నేను తబ్బిబ్బై ఏంటి ఏంటి అని వివరం అడుగుతుండగా జీపు బయల్దేరింది మ్రోతతో. రహీమ్ ఆఫీసు లోపలికి మాయమైయ్యాడు. ఏంటిది మొళ (మేకు) గోడ అక్షరం అని తలగోక్కొన్నాను, ఏమి తీసుకురావాలి అనేది తెల్వక. నోటును ప్యాంట్ జేబులోకి నొక్కాను. ఈ ఫ్యూన్ రహీమ్ ఎప్పుడూ ఇంతే! ఏదో ఒక నెత్తి నొప్పి కల్గిస్తుంటాడు. మొన్నస్ట్యాంపులు అతికించి కవర్ను పోస్ట్ డబ్బాలో వేసిరా అని డబ్బిచ్చి పంపితే, కవర్ను డబ్బాలో వేసి స్ట్యాంపుల్ని భద్రంగా చేతిలో పెట్టుకొని వచ్చి నాటేబిల్ మీద పెట్టాడు. జోరుగా తిట్టినప్పుడు తెల్వలేదు సార్ అంటూ అదొక రకంగా నవ్వాడు. ఎనిమిది రోజుల క్రితం పార్శెల్ తెచ్చేందుకని జీపు సాగర పట్టణంకు వెళ్ళింది. జీపులో వెళ్తున్న రహీమ్ చేతికి మా పెద్ద సార్ డబ్బు ఇచ్చి నందిని బ్రాండ్ వెన్నప్యాకెట్ తెమ్మని చెప్పాడు. సాగర పట్టణంలో రహీమ్ వెన్నప్యాకెట్ కొని దాన్ని జీపు ముందున్న స్టీరింగ్‌కు పక్కనుండే బాక్స్‌లో పడేసాడు. జీపు మా ప్రాజెక్ట్ స్థలంకు చేరుకొన్నప్పుడు వెన్న పాకెట్ నేయిగా మారింది. ఇలా ప్రతినిత్యం ఒకటికాదు ఏదో ఒక రగడకు కారణకర్తగా అవుతుండేవాడు రహీమ్. ఇందుచేత రహీమ్ ఆఫీసులో ఉన్నోళ్ళందరకూ ఒక తమాషా మనిషే గాకుండా శిరోవేదన కల్గించే వ్యక్తిగానూ అయ్యాడు. అతనితో వ్యవహరిస్తుండేటప్పుడు, అతనికి ఏదైనా అర్జెంట్ పని అప్పగించేటప్పుడు మేమంతా ఎక్కువగా ఎచ్చరికల్ని పాటిస్తుండేవాళ్ళం.

ఇప్పుడూ ఇలాగే అయ్యింది. పరిగెత్తుకొంటూ వచ్చినోడు తక్షణమే నా చేతిలో నోటు కుక్కి గోడ మేకు అక్షరం పటం అని ఏంటేంటో పలికి అలాగే వెళ్ళి పోయాడు... తన మనస్సులో ఉంది నాకు తెల్సిపోయిందిలే అని అతను నిర్ధారించుకొన్నాడో ఏమో అనేది నాకు తెల్వట్లేదు. ఏదో వాడి తల అనుకొని మిన్నకుండి పోయాను. అంతలో నా ప్రక్కన కూర్చున్న అకౌంటెంట్ డికాస్టగారు డ్రైవర్ చేతిని పట్టుకొన్నారు.

డికాస్టగారి క్వార్టర్ అక్కడే ఆ హైవే రోడ్డు ప్రక్కనే ఉన్నందున జీపు రహదారి వదిలి పక్కకు జరిగి నిలబడింది.

"రంగప్పా, వెళ్ళి ఇంట్లో నుంచి ఒక బ్యాగు పట్టుకొని రా" అంటూ డికాస్ట గారు డ్రైవరుకు చెప్పినప్పుడు అతను క్రిందకు దిగి డికాస్టగారి క్వార్టర్ వైపుకు నడిచాడు. నేను కౌతుకంగా డికాస్ట గారి ఇంటి వైపుకు దృష్టి పారించాను. చుట్టూ కంచె ఉంది. కంచె ముందు క్రోటన్ చెట్లు, పూల చెట్లు, పోర్టికో ముందు పెట్టిన గ్రిల్ మీద అలుముకొన్న మనిప్లాంటు సొగసుగా ఉన్నవి. తలుపువద్ద డికాస్టాగారి పుత్రుడు కన్పించగా "అరెరె... హెన్రి వచ్చాడు కదా..." అన్నాను జీపులో నుంచి చూస్తూ. బెంగళూరులో ఉండే పుత్రుడు ఇంటికి వచ్చిన విషయాన్ని తెలుపుతూ "వచ్చి రెండు రోజులు అయినవిలే" అంటూ డికాస్ట గారు అన్యమనస్కుడిగా ఉన్నారు. క్రితంలో అయితే పుత్రుడు వస్తున్నదాన్ని పత్రం మూలకంగా తండ్రికి రాసి ముందస్తుగా తెల్పుతుండేది, కొడుకు క్షేమంగా ఇంటికి చేరింది మొదలైన సమాచారంను తప్పని సరిగా తనకు చెపుతుండే డికాస్ట గారు ఈసారి ఎందుకో నాకు చెప్పలేదు కదా అని ఆశ్చర్యపడ్డాను.

"ఎప్పుడు వచ్చాడు హెన్రి" అని అడిగినప్పుడు డికాస్ట గారు ముఖం సొట్టగా చేసుకొని "వచ్చి చేరుకొంది ఒక ట్రెండు రోజులు అయ్యిందిలే" అన్నారు. "అరెరే, నాకు తెల్వలేదు కదా... మీరూ చెప్పలేదుకదా" అన్నాను నిష్ఠూరంగా! అంతలో రంగప్ప బ్యాగు సమేతంగా వచ్చి జీపు ఎక్కి స్టార్ట్ చేసాడు. రహదారిలోకి జీపు మరలి వేగాన్ని వృద్ధించుకొంది. డికాస్ట గారు ముఖాన్ని బిరుసుగా పెట్టుకొనే కూర్చున్నారు. ఒకట్రెండు నిమిషాల తర్వాత నిట్టూర్పులు వదుల్తూ పూర్వపు మనిషిలాగ కనబడలేదు నాకు. ఈ రోజే కాదు నిన్న మొన్నట్నుంచి ఏదో ఒక తరహాలో వారు ఉంది నా గమనంకు వచ్చింది.

దొడ్డేగౌడగారి భవ్యమైన మహల్ చెంతనుండే మలుపులో జీపు సాగర పట్టణం వైపుండే దారిని పట్టుకొన్నప్పుడు డికాస్టగారు ఇంగ్లిపీసు(ఇంగ్లీషు)లో మాటల్ని ప్రారంభించారు; మేము మాట్లాడుకొనేది రంగప్పకు తెల్వకూడదని.

"ఈ ఇడియెట్ చేయగూడని పని చేసాడు" అన్నారు మొదలే మొరటోడైన డికాస్ట గారు. వారికి కోపం వచ్చిందంటే మరింత క్రూరుడిగా అవుతాడు. ఇప్పుడు డికాస్ట గారు నాగుపాములాగ బుసగొట్టు తున్నప్పుడు వారి ముఖాన్ని చూసాను. వారి నుంచి మాటలు ముందుకే సాగి పోతున్నవి.

"ఔను మిస్టర్ రామచంద్రా... హెన్రి ఒక యువతిని వెంటేసుకొని వచ్చాడు ఇక్కడికి"

నేను గాబరా పడ్డాను. హెన్రీని మూడు నాలుగు సంవత్సరాల్నుంచి చూస్తున్నాను. నేను ఇక్కడుండే ప్రాజెక్ట్‌కు ట్రాన్స్‌ఫరై వచ్చినప్పుడు, అతను జాబ్‌లో చేరేందుకు ఎక్కడెక్కడికో ఆర్జీలు పెట్టేదాన్లో మునిగాడు. నేను కూడా ఒక రెండు చోట్లకు ఆర్జి పెట్టమని అతనికి చెప్పాను. ఇప్పుడు మూడు సంవత్సరాల క్రితమే హెన్రీకి బెంగళూరులో ఉండే ఒక కంపెనీలో జాబ్ దొరికింది. ఎనిమిది వందల రూపాయల జీతంతో ఉన్న నౌకరి అతనికి లభించింది. హెన్రి నెలకొకసారి మేము పని చేస్తున్న నీటి పారుదల ఆనకట్ట వద్దకు వచ్చి వెళ్తుండేవాడు. అతను ఇప్పుడు నౌకరి చేస్తున్నందున మునుపట్లో ఉన్న సిగ్గు బిడియం వదిలి మాట్లాడుతున్నాడు విజ్ఞుడిలాగ. బెంగళూరులో నగర జీవితం గడుపుతున్న హెన్రి పోకిరిగా దురలవాట్లలో లేడు. అదే మునుపటి సరళ సౌమ్య స్వభావం అతనిలో ఉంది. ఇప్పుడతను ఒక యువతిని వెంటేసుకొచ్చాడు అని డికాస్ట గారు అన్నప్పుడు నాకు ఆశ్చర్యం వేసింది. “సిగిరెట్ కూడా పీల్చని ముగ్గ స్వభావుడైన హెన్రి ఒక యువతి విసిరిన ప్రేమపాశంలో పడ్డాడా? ఈ యువతి అయినా ఎవరు? ఇక్కడకు చేరుకొన్న యువతి ఎవరు? ఇతని వెనుక ఎందుకు వచ్చింది?” అడిగాను నేను.

“మూడు రోజుల్నుంచి దీన్నే ఆలోచిస్తున్నాను. హెన్రి తన నుంచి ఏదాన్ని దాబెట్టలేదు. హెన్రి బెంగళూరులో ఒక బాడుగ గదిలో ఉంటున్నాడు. ఆ ఇంటి యజమాని పుత్రిక ఈ యువతి! అక్కడ గదిలో చేరినప్పట్నుంచి ఆమె పరిచయం ఇతనికి ఉన్నదట. ఇప్పుడు ఆమెనే లగ్నం చేసుకొంటానని హఠం చేస్తున్నాడు”.

డికాస్ట ఒకొక వాక్యంకు ఉగ్రుడైపోతున్నాడు. నా తలలో కొన్ని ప్రశ్నెలు ఉద్భవించినవి. ఒక పరిహారమూ కనబడింది. యువతి చక్కగా ఉందా, ఏకులం? అన్నీ అనుకూలంగా ఉంటే లగ్నంకు సమ్మతించొచ్చుకదా అని నామనస్సులో అనుకొంటుండగా, డికాస్ట గారే… “మిస్టర్ రామచంద్రా, యువతి బాగా చదివింది, చూసేందుకు సలక్షణంగానే ఉంది… అయితే ఆమె… మా మతంకు కులంకు చెందిందికాదు… యువతి కులం” అంటూ డికాస్ట గారు నా చెవి వద్ద తన పెదవులు ఆనించి మెల్లగా చెప్పాడు. “ఆ కులం పేరును పలికితే మలం ముట్టినట్లుగానే హేయంగా ఉంటది” అంటూ అసహనపడ్డారు. “ఈ దరిద్ర కులం యువతిని వివాహమాడేందుకు నా కొడుకుకు ఏమైనా కుష్టా? మొర్రా (గ్రహణమా)? పాండు రోగమా? హెన్రి బోళాస్వభావం వాడు. యువతి తల్లిదండ్రులే ఏదో ప్లానువేసి ఇతడ్ని తమ వలలో పడేసుకొన్నారు. లేకపోతే మా మాట అంటే నిప్పులోకి దూకేందుకు వెనుకంజవేయని హెన్రి ఈమెనే వివాహం చేసుకొంటానని హఠం చేస్తున్నాడంటే పరిస్థితిని మీరే అర్థం చేసుకోండి.”

"ఔనండి మిస్టర్ డికాస్ట గారు... యువతి చక్కగా చదివిందని, సలక్షణంగా ఉందని అంటున్నారు కదా... ఆమెను మీ మతంలోకి మతాంతీకరణ చేసుకోవచ్చుకదా..." అన్నాను నేను మిడిమిడి జ్ఞానంతో...

"నో, నో (కాదు, కాదు)... మా మతంలోని వనితను తెచ్చుకొనేటప్పుడు మేము కులగోత్రాల్ని పరిశీలిస్తాం...." అన్నారు డికాస్ట గారు.

క్రైస్తవులంతా ఒకటే అనుకొన్న నేను ఆశ్చర్యపడుతూ డికాస్ట గారి మోమును తిలకించాను.

"మీలో కూడా కులం గోత్రం అనే పట్టింపులు ఉన్నవా?" అని అడిగాను.

"ఔనండి మేము మంగళూరుకు చెందిన హిందూ అగ్రకులం నుంచి క్రైస్తవ ధర్మంలోకి కన్‌వర్ట్ అయిన బామణ్ వర్గం వాళ్ళం. హొన్నావర, కుందాపుర వైపునుండే జారోడి, నెందర్, కూళి అనే వర్గాలు మాకున్నా దిగువ స్థాయిలోని క్రైస్తవులు అండి. మేము యువతిని ఇంటికోడలిగా తెచ్చేదుంటే, మా జాతికి చెందిన బామణ్ కులం నుంచే తెచ్చుకొంటాం. మా ధర్మంకు చెందిన యువతి గురించే ఇలా కులం గోత్రం అని నిశితంగా పరిశీలన చేస్తుంటే... ఇప్పుడు వేరే మతంకు చెందిన వనితను అవసరంకని మతమార్పిడి చేసి ఇంటిని నింపుకొనేది ఎలాగండి?"

నేను అస్పష్టంలో పడ్డాను. ఈ ఉపకులాల భేదం నాకు కొత్తగా ఉంది.

"విషయం సూక్ష్మంగా ఉంది మిస్టర్ డికాస్ట గారు... హెన్రి ఆ యువతి పరస్పరం ప్రీతిసాగరంలో మునిగి ఉన్నారంటే దీని మీద మనం దుందుడుకు చర్యలు చేయరాదు."

"తొందరపడరాదు అని వీళ్ళు (ప్రేమికులు) చెప్పినట్లుగా తైతెక్క అంటూ నాట్యమాడేందుకు కుదరదు రామచంద్రా...ఏదో అల్కా (అలగా) జనంకుచెందిన వనిత ఇతని వెనకే వచ్చిందని బెదిరి ఇతనికి పెళ్ళి చేసేది ఆమెతో సాధ్యమా మా నుంచి? మా రక్తం, మా సంస్కారం, మా ఇంటి గౌరవ మర్యాద కాపాడుకొనేది నా కర్తవ్యం... నాకు ఉన్నదే ఒక పుత్రుడు. మంచి ఇంటి నుంచి యువతిని తెచ్చి అతనికి పెండ్లి చేయాలనేది నాలో ఆశగా ఉంది. ఏదో బేవార్సి యువతిని నేను కోడలిగా చేసుకొని ఇంటిని నింపుకోలేను" అన్నాడు డికాస్ట పళ్ళు పటపట కొరుకుతూ. సాగర పట్టణం దగ్గర పడుతుండగా మాటలు అక్కడికే ఆగిపోయి నేను మరిక మిన్న కుండిపోయాను. పని ముగించుకొని వెనుదిరుగుతున్నప్పుడు అంగడికి వెళ్ళి అది ఇది కొనేదుంది. అప్పుడు దఢాల్నే జ్ఞాపకంకు రహీమ్ చెప్పిన వస్తువు గుర్తుకొచ్చింది. అయితే అదేంటనేది నా మనస్సుకు స్పష్టంకాలేదు. రహీమ్ మొన్న తన కొడుకును స్కూల్‌కు తీసుకెళ్తున్నాడు. మొదటి తరగతిలో పుత్రుడ్ని చేర్పించానని చెప్పాడు.

గోడకు మొళ (మేకు) కొట్టి వేలాడ దీసే అక్షరం అంటే, మరిక అది అక్షరమాల పటం (కాలెండర్) కావొచ్చని ఊహించి పుస్తకాలు అమ్మే అంగడికి వెళ్ళి ఒక అక్షరమాల పటం ఖరీదించాను. జీపు ప్రాజెక్ట్ వైపు బయల్దేరినప్పుడు సాయంకాలం అయ్యింది.

❖ ❖ ❖

హెన్రి మా ఇంటికొచ్చాడు. దుఃఖం నుంచి అతని మోము ఉబ్బి పోయిఉంది. కళ్ళు ఎర్రగా ఉన్నవి. ఐదారు రోజుల నుంచి అతని ఇల్లు రణరంగమైంది. మా ఇల్లు డికాస్టగారి ఇంటికి దూరంగానే ఉన్నా అక్కడ జరిగేదంతా నాకు తెలుస్తుంది. నాకు, డికాస్ట గారి మధ్య స్నేహ సంపర్కం ఎక్కువగా ఉన్నందున, వారు నా దగ్గర ఏదాన్ని దాచిపెట్టేది లేదు.

"రావయ్యా హెన్రి... వచ్చి సుఖంగా కూర్చో" అన్నాను. హెన్రి నా వద్ద కొచ్చే హిందూ పేపర్ (ఆంగ్ల దినపత్రిక) తిరగేస్తూ కూర్చున్నాడు. నేను బట్టలకు కరెంటు ఇస్త్రీ పెట్టె నుంచి చదును చేస్తున్నాను.

"డ్యాడి విషయాన్నంతా మీకు చెప్పియుండొచ్చు కదా అంకుల్"

"ఔను హెన్రి... అయితే మీ సమస్య రోజులు గడుస్తుంటే సమసి పోకనే బిగువుగా అవుతుంది కాదా?"

"ఔను అంకుల్... డ్యాడి విషయం మీకు గుర్తే కదా వారు పంతంబట్టి యున్నారు. నేను మాదేవిని ఎలా పెళ్ళి చేసుకొంటానో చూస్తా అని వదురుతున్నారు డ్యాడి."

"యువతి ఎక్కడుంది ఇప్పుడు?"

"మా ఇంట్లోనే ఉంది. ఆమె ధీర స్వభావురాలే! ఆమె తల్లిదండ్రి కూడా అంతే! నాకు కులమతాల మీద నమ్మకం లేదు. డ్యాడికి మమ్మీకి గుర్తుకాకుండా నేను రిజిస్టర్ మ్యారేజ్ చేసుకోగలను... అయితే నా పోషకుల ఒప్పుదల పొందుదాం అని ఆమెను వెంటేసుకొని వచ్చాను. డ్యాడీ సాధ్యమేకాదు మా పెళ్ళి అని మొండి పట్టులో ఉన్నారు".

"ఇక ముందు?"

"డ్యాడి నా కోసమని మా మతంలో ఉన్న స్వకుల యువతిని వెతుకుతాను అని అంటున్నాడు. నేను పెళ్ళి అంటూ చేసుకొంటే ఈమెనే సై అని చెపుతున్నాను."

"ఔను, ఇలా మీ ఇద్దరు హఠంతో కూర్చుంటే ఏమి ఉపయోగం? ఇద్దరిలో ఎవరైనా ఒకరు పరాజితులౌవ్వాలి కదా..." అన్నాను నేను.

"నేనైతే నా నిర్ధారం నుంచి వెనక్కి జరిగేది లేదు అంకుల్. మాదేవిని నేను ఎంతగానో ప్రేమించాను. ఆమెకు వాగ్దానం చేసాను. ఎంతో గాఢంగా పెనవేసుకొని పెరిగి వృద్ధించిన మా ప్రీతిని ఏ కారణంకని నేను బలిచేస్తాను...?"

"యోచించుహెన్రి" అంటూ అతనితో డికాస్టలోని వర్తనను అర్థం చేసే యత్నాన్ని చేసాను. డికాస్టలో మతాభిమానం ఎంతో ఉంది. దేముడు మతం కులం వంశం గోత్రం సాంప్రదాయం మొదలైన వాటి మీద అతనిలో అతిగా ఉన్న వ్యామోహం ఉంది. ప్రతిదినం ముంజాములోని పూజ నుంచి మొదలై సాయంకాలం, రాత్రి వరకూ ప్రార్థనలలో డికాస్ట మునిగి తేలుతుండేవాడు. ఏ సందర్భం వచ్చినా ఆదివారం నాడు చర్చి(ఇగర్జి)కి వెళ్ళకుండా ఉందేది లేదు. ఇటువంటి వ్యక్తి తన పుత్రుడు వేరొక మతంకు చెందిన సంస్కారం నిండని యువతిని వివాహం చేసుకొనేందుకు ఉద్యుక్తుడైయ్యాడు అనే సమాచారం విని ఉగ్రమూర్తిగా అయినదాన్లో ఆశ్చర్యపడేది ఏమిలేదు. కఠిణ మనస్కుడిగానూ హఠమారిగానూ అయ్యున్న డికాస్ట, కొడుకు నుంచి వచ్చిన తీర్మానంకు ఒప్పే సాధ్యతలేదు... ఇలాగున అనే నేను హెన్రితో దీని మీద మళ్ళా యోచించు... తారుణ్యంలో సహజమైన ఆవేశంనుంచి విపరీతమైన తీర్మానం చేసుకోవద్దు అని సూచించాను. అయితే హెన్రి కూడా తండ్రిలాగే దృఢనిశ్చయంతో ఉన్నాడు. నేనెంతగా నచ్చ చెప్పాలని ప్రయత్నించినా హెన్రి తన నిర్ధారంకే అంటుకొనియుంది నా గమనంకు వచ్చి మరిక నేను మూగబోయాను.

ఆఫీసుకు వేళ అవుతున్నందున దుస్తులు ధరించి వెళ్ళిపోయే సిద్ధతలలో ఉండగా పేపర్‌లోని పుటలు తిరగేస్తూ కూర్చున్న హెన్రి కూడా లేచి నిలబడ్డాడు.

❖ ❖ ❖

ఆఫీసుకు వెళ్ళిన పిమ్మట టేబుల్ మీద అక్షర మాల కాలెండర్ చుట్ట చుట్టి పెట్టి ఉంది. దాన్ని సాగరం నుంచి తెచ్చిన రోజే రహీమ్‌కు ఇచ్చాను. తను కోరింది అదే అని అతను చెప్పాడు. అయితే ఇప్పుడు మళ్ళా ఎందుకు ఆ కాలెండర్‌ను చుట్ట చుట్టి తెచ్చి ఇక్కడ పెట్టాడు అనే యోచన చేస్తుండగా రహీమ్ గది లోపలికి వచ్చాడు. "సార్" అన్నాడు కొంచెం భయపడుతూ.

"సాగరపట్టణంకు మీరిక ముందు ఎన్నడైనా వెళ్ళినప్పుడు వేరే అక్షరాలున్న పటాన్ని తెచ్చి ఇవ్వండి సార్... ఇదైతే వద్దు...." అంటూ అంగలార్చాడు.

"అరెరే... దీనికి ఏమైందయ్యా? చిరిగి పోయిందా? ముద్రణ సరిగాలేదా?" అంటూ నేను మడిచి చుట్టిన ఆ అక్షరమాలను విప్పాను. అ...అంటే అమ్మ నుంచి య... అంటే యజ్ఞం వరకూ కళ్ళు ఆడించాను. చక్కగానే ఉంది. రహీమ్ ముఖం చూస్తూ "ఏమైందయ్యా దీన్లో లోపం?" అని అడిగాను.

రహీమ్ ఓర కంటి నుంచి అక్షరమాల చూసి "దీన్ని మేము ఇంట్లో వేలాడదీసేది కుదరదు సార్" అన్నాడు.

"ఎందుకయ్యా? ఏముంది దీన్లో?"

"దీన్లో... దీన్లో" అంటూ వేలును యరలవవైపు చూపి ఏదో చెప్పేందుకు ప్రయత్నించాడు. నేను 'య' అంటే యముడు, 'ర' అంటే రవి (సూర్యుడు), 'ల' అంటే లక్ష్మీదేవి అంటూ చదివి ముందున్న అక్షరం వైపు కళ్ళు నిల్పగా రహీమ్ 'వ' అక్షరంకు చెందిన బొమ్మ మా ఇంట్లో ఉండకూడదు సార్... ఇది మా మతంకు విరుద్ధం" అని పలికాడు. నేను అక్షరమాలలో ఉన్న 'వ' వరాహం బొమ్మను దిట్టించి చూసినప్పుడు అతను... "ఈ సువ్వర్ (సూకరం) బొమ్మ ఉండని అక్షరమాల ఉంటది కదా సార్... దాన్ని తెచ్చి ఇవ్వండి" అని మొత్తుకొన్నాడు.

"సువ్వర్ (సూకరం) బొమ్మలేని అక్షరమాల ఉండొచ్చులే! అయితే సూకరం లేని ప్రపంచం ఉండదు కదా..." అన్నాను. నా నుంచి వచ్చిన వివరాణత్మక మాటను అతను అర్థం చేసుకోలేదు.

"ఇది నీ వద్దే ఉండనీయి... మరోమారు సాగరంకు వెళ్ళేటప్పుడు ఇవ్వు..." అంటూ అక్షరమాల పటంను చుట్టి అతని చేతికి ఇచ్చాను. అతను దాన్ని తీసుకెళ్ళి ఆఫీసు బీరువాపైన పెట్టాడు.

రహీమ్ తన మతం మీద గట్టి అభిమానం ఉన్నోడు. దేముడు ధర్మం జాతి సాంప్రదాయాల మీద డికాస్ట గారికి ఉన్నట్లుగానే అతనిలోనూ అతి అయిన వ్యామోహం ఉంది. రోజూ ఐదు సార్లు వేళ తప్పకుండా నమాజు చేస్తాడు. శుక్రవారమైతే మసీదుకు వెళ్తాడు. ఇటువంటి రహీమ్ అక్షరమాలలో ఉన్న వరాహం బొమ్మను చూసి సహించలేనిది మనకేమి ఆశ్చర్యంకలగదు. వారి వారి జాతి మతం వాళ్ళకు సరి అనుకొంటూ నేను మిన్నకుండి పోయాను.

❖ ❖ ❖

క్యాంటీనుకు వెళ్తున్నప్పుడు డికాస్ట కూడా నా జతగా వచ్చాడు.

"ఏమి తీర్మానించుకొన్నారు డికాస్టగారు?" అని అడిగాను. మరిచిన విషయాన్ని మళ్ళా గుర్తుకు తెచ్చినందుకో ఏమో వారి ముఖం కర్రిగా అయ్యింది. ముష్టి బిగించి వారు అన్నారు ఇలా: "నేను గట్టిగానే నిర్ణయం చేసింది అయ్యింది. హెన్రి ఆ యువతిని వివాహ మాడేదిలేదు. ఆ యువతి యువకుల ప్రేమ ప్రణయం అంతా క్షణికమైందే! అయితే మనం మన వంశం కులగౌరవం భవిష్యత్ మీద ప్రణాళికలు చేసుకోవాలి కదా! రేపు హెన్రీకి పుట్టే సంతానం మంచి సంస్కృతి సంస్కారం ఉండే వాళ్ళుగా అవ్వాలి కదా... పులి కడుపున పంది పిల్లలు పుట్టకూడదు కదా" అంటూ డికాస్ట చెపుతున్నప్పుడు నేను ఈ విషయం ఎత్తకుండా ఉండాల్సిందని పేచీలో పడ్డాను. అయితే డికాస్టగారు ఏమేమో నాకు రుచించేటట్లుగా చెప్పసాగారు ఇలా: "నేను దేన్నైనా సహించుకోగలను రామచంద్రరావ్... అయితే మా మతంలోని కుల

కట్టుబాట్లకు రీతి రివాజులకు అన్యాయం ద్రోహం అయితే నేను సహించేది లేదు" అన్నాడు. అంతలో కాఫి గ్లాసులు రాగా, నేను ఒక కాఫి గ్లాసు ఎత్తుకొన్నాను.

❖ ❖ ❖

ఇదైన మూడు నాలుగు రోజుల తర్వాత మా ప్రాజెక్ట్‌లో ఒక దుర్ఘటన జరిగింది. ప్రతినిత్యం ఇరుకైన దారిలో వాహనాల యాక్సిడెంట్లు, వేసిన స్లాబులు కూలేది, కాజ్‌వే నీటి ఉధృతికి కొట్టుకుపోయే సంగతులు విని విని ఇటువంటి దుర్ఘటనలు సంభవించినప్పుడు జనం చనిపోతుండేది మామూలు సంగతిగా ఉన్నందున మేమంతా ఎక్కువగా స్పందించే సందర్భం లేకున్నా, మరిక ఇప్పుడు జరిగిన దుర్ఘటన ప్రాజెక్ట్ నిర్మాణంలో ఉన్న మా అందరి మనస్సులను కలిచి వేసింది.

డికాస్ట గారి సతీమణి, కుమారుడు, బెంగళూరు నుంచి వచ్చిన ఆ వనిత సగం మాత్రమే నిర్మాణమైన ఆనకట్ట (కన్నడంలో ఆనె అంటే ఏనుగు; ఆనెకట్ట అంటే ఐరావతం అంత పరిమాణంలో ఉండే కట్ట) పై నుంచి జల సంపదను వంగి వంగి చూస్తున్నప్పుడు ఆ యువతి లయ (పట్టు) తప్పి నీళ్ళలో పడిపోయింది. ఆనకట్టలో పనులు చేస్తున్నోళ్ళలో కొంత మంది గజఈతగాళ్ళు జలాశయంలోకి దూకి ఆమెను బతికించే ప్రయత్నం చేసినా ఆమె ప్రాణం నిలవలేదు. ఆమె శవం కూడా దొరకలేదు. నూరు అడుగుల లోతులో ఉన్న ఆ జలాశయం మడుగులో ఆమె ఎక్కడో ఇరుక్కు పోయి ఉండొచ్చని మా జనం తీర్మానించారు.

నేను దికాస్టగారి ఇంటికి దౌడు పెట్టాను.

హెన్రి తల బాదుకొంటూ రోదిస్తున్నాడు. డికాస్ట ప్రాంగణంలో దీనంగా కూలబడి... "ఎటువంటి అనాహుతం జరిగిందో చూడండి మిస్టర్ రామచంద్రా" అంటూ కన్నీరు కార్చుతున్నాడు.

❖ ❖ ❖

మరునాడు శవం నీళ్ళ నుంచి పైకితేలింది. బెంగళూరు నుంచి ఆ యువతి తల్లిదండ్రులు వచ్చారు. శవాన్ని ప్రాజెక్ట్ చెంతే దహనం చేసారు. కాలనిలోని ప్రతి ఇంట్లో నిట్టూర్పులు బాధ కన్నీళ్ళకు కారణమైన ఆ దుర్ఘటన జరిగి రెండు రోజులు గడిచినవి.

డికాస్టగారు ఆఫీసుకు వచ్చారు. నేను వెళ్ళి వారి ముందున్న కుర్చీ లాగి కూర్చున్నాను.

"హెన్రి ఏమి చేస్తున్నాడు?"

"ఏమి చేస్తాడు... రెండు రోజులు రోదించాడు. ఇప్పుడు మళ్ళా వెనకటిలాగ మామూలు మనిషైయ్యాడు. అతని నుంచి మరిక ఏమి దిగులు నాకు ఉండదు.

అతను మళ్ళా సరైన స్థితికే చేరుకొంటాడు. అతను ఈ ప్రేమ సాగరంలో పడినందున నాకు రెండు వేలు ఖర్చు అయ్యింది. పోలీసులకు డబ్బు ముట్ట జెప్పి నేను కృశించాను" అంటున్న డికాస్ట ముఖం ప్రసన్నమైంది. జేబునుంచి ఒక కవర్ తీసాడు. దాన్నుంచి ఒక ఫోటో బయటపడింది. దాన్ని నా ఎదురులో పెట్టి చెప్పాడు ఇలా: "చూడండి రాయరుగారు, యువతి ఎలాగుంది?"

చూసాను ఆమెను. "ఎంతో చక్కగా ఉంది" అని చెప్పాను.

ఇది వజ్రంలాంటి సంబంధం. మంగుళూరుకు చెందిన మా కులం యువతే! మా బంధువులు హెన్రీని తోలుకెళ్ళి యువతిని చూపెట్టి అతడ్నుంచి ఆమోదం పొంది వివాహ ముహూర్తం కుదుర్చుకొనే వచ్చారు" అంటూ డికాస్ట తన గుబురు మీసాల మీద చేతిని నిల్పాడు.

"శుభస్య శీఘ్రం" అంటూ లేచాను.

నేను నాసీటు వద్ద కొచ్చినప్పుడు రహీమ్ నా ముందుండే టేబుల్ పైన ఏదో చేస్తున్నాడు. అక్షరమాల పటాన్ని విప్పి సాపు చేసి దాని మీద ఏదో బొమ్మ ఉన్న చిన్న కాగితాన్ని అంటిస్తున్నాడు.

"అరెరే ఏమి చేస్తున్నావయ్యా?"

"నేనే ఖుద్దుగా రిపేరు చేసిపెట్టాను సార్. మీరు వేరే దాన్ని తెచ్చి ఇవ్వలేదుకదా... అందుకే"

"దానికి ఏమి రిపేరు చేసావయ్యా?"

అక్షరమాల కాలెండర్‌ను ఎత్తి అతను నా చేతికి ఇచ్చాడు. య.ర.ల అలాగే ఉంది. 'వ'... వరాహం బొమ్మ మాయమైంది. బ్లేడు నుంచి ఆ బొమ్మ ఉన్న వృత్తాన్ని కోసి అక్కడ ఒక 'వ' అంటే వజ్రం బొమ్మను అంటించాడు. 'వ' అంటే వజ్రం అని అరకొర అక్షరాలనుంచి రాసాడు.

"ఎలా ఉంది సార్ నా పిలేను (ప్లాను)?" అంటూ అడిగాడు. నేను జవాబు ఏమి చెప్పాలి అని యోచిస్తూ కూర్చున్నప్పుడు ఇతర సహోద్యోగులు నా చెంత కొచ్చి అక్షరమాల కాలెండర్ చుట్టూ చేరి అసహ్యంగా కత్తిరించబడియుంది, మరలా అంటించిన వజ్రం బొమ్మ గురించి, రహీమ్‌లోని ప్లాను గురించి తలొక రీతిలో మాట్లాడుతూ నవ్వు కోసాగారు. వాళ్ళ మాటలు నవ్వులలో నేనూ పాలు పంచుకొన్నాను.

అయితే రహీమ్, డికాస్ట గారు గంభీరులై ఆ మాటల్ని వింటూ పట్టీపట్టనట్లుగా కూర్చున్నారు కదా!

**మూలకథ రచనా కాలం : 1981**

# వేలిముద్ర ఒత్తేవాడు

మూడు అంచెల పంచాయత్ వ్యవస్థ అస్తిత్వంలోకి వచ్చినప్పుడు, రెవిన్యూ డిపార్ట్‌మెంట్‌లో నౌకరుగా ఉన్న నన్ను ఎత్తి పి.డబ్ల్యు.డి. ఇలాఖలోని ఒక ఉప విభాగంకు చెందిన ఆఫీసుకు ట్రాన్స్‌ఫర్ చేసారు. కొత్త కఛేరికి వెళ్ళిన మూడు నాలుగు రోజుల వరకూ అతని పరిచయం కాలేదు. నిత్యం అతను వచ్చేది, వెళ్ళేది... వాళ్ళ వీళ్ళ వద్ద నిలబడి మాట్లాడుతుండేది నేను చూసాను. అయితే మిగిలిన సిబ్బందితో పరిచయం అయినట్లుగా ఇతని పరిచయం నాకు కలగలేదు. కఛేరిలోని గుమాస్తాలు మరి ఇతరులు నా వద్దకు వచ్చి మేము ఇలాగ ఇలాగ అని చెప్పుకొంటూ నా చేతిని కులుకించారు. మరి కొంత మంది పై స్థాయి అధికార్ల వద్దకు నేనే వెళ్ళి మాట్లాడిరాగా, ఇతనెవరో గుత్తేదారు కావొచ్చని అనుకొన్నాను. ఎందుకంటే హాజరు పుస్తకంలో సంతకం చేసేందుకు ఇతను మాత్రం వస్తుండేది లేదు.

అయితే కఛేరి లోపలున్న గదిలో ఒక మూల ఇతనికని ఒక కుర్చీ ఉన్న దాన్ని గమనించాను. ఒక కాలు విరిగి మూడు కాళ్ళతో ఉన్న కుర్చీ అది. దాన్నే రిపేరు చేయించాడట ఇతను. ఇది క్రిందపడనట్లుగా బ్యాలెన్స్‌తో ఇతను దానిమీద కూర్చునేవాడు. ఇతని కుర్చీకి ముందున్న బల్ల కూడా విరిగిందే కదా! దానికీ మూడు కాళ్ళే ఉన్నవి. విరిగిపోయిన నాలుగోకాలుకు ఒక మట్టంలో ఎత్తున్న చెక్కకు మేకుకొట్టి అది నేలమీద నిలబడి ఉండేటట్లుగా ఆ బల్లను ఇతను వాడుకొంటుండేవాడు. ఇతను కఛేరి సిబ్బంది వర్గంలో ఒకడై ఉన్నాడు అనేది నాకు కచితమైనప్పుడు మరిక ఇతను చేస్తుండే డ్యూటి ఏమిటని యోచించాను. ఇతని ముందు ఏ విధమైన ఫైళ్ళు, కాగితాలు లేవు. ఇతని ముందు ఉంది ఒకే ఒక ఇంక్‌ప్యాడ్. రబ్బరు స్టాంపులు కూడా లేవు.

ఇతని వ్యక్తిత్వం కూడా విచిత్రంగా అన్పించింది నాకు. ఇతను ఎప్పుడూ ఏదో పరలోకంలో ఉంటుండేవాడు. తన చుట్టూ జరుగుతున్న మాటలలో ఘటనలలో ఇతనికేమి ఆసక్తి ఉన్నట్లుగా లేదు. గది పై నుండే పెంకుల్ని లెక్కిస్తూ విరిగిన మేజాబల్లకుండే కాలు చూస్తూ, లేకపోతే తన ముందున్న ఇంక్‌ప్యాడ్ చూస్తూ ఇతను కూర్చుండి పోతున్నాడు. ఎవరైనా ఇతడ్ని కేకపెట్టి పిల్చి మాట్లాడిస్తే అప్పుడు ఇతను మన ప్రపంచంలోకి వస్తాడు. ఏదైనా పిలుపు విని పరిగెత్తే ముందు చిత్రంగా బెదురుతుండేవాడు. ఎవరితోనూ కబుర్లు ముచ్చట్లు చనువు లేదుకదా!

కఛేరికి వెళ్ళిన ఐదోరోజు ఇతనితో నేను మాట్లాడాలని భావించాను. ఇంకా పెద్దసారు రాలేదు. కొంతమంది దిగువస్థాయి సిబ్బంది మాత్రమే వచ్చి ఆఫీసు కార్యంలో నిమగ్నులైయ్యారు. నేను అల్మారాలో తాళంచెవి పెట్టి ఫైళ్ళను తీసుకొని టేబిల్ మీద పెట్టి కఛేరికి సంబంధించిన ఏదో లేఖకు జవాబు రాయాలని తెల్లకాగితం తీసుకొని క్రమసంఖ్య వేసి తలెత్తినప్పుడు ఇతను కఛేరి లోపలికి వచ్చి చేరుకొంటున్నాడు. నా ముందే నడుస్తూ లోపలికి వెళ్తున్నప్పుడు నేను "రావయ్యా... ఇక్కడికి నా చెంతకు" అని పిల్చాను. నా కన్నా ఎక్కువ వయస్సు అతనిది. అయితే నా నుంచి బహువచనంలో పిల్పించుకొనే స్థాయిలోని వ్యక్తి అతను కాదు అని తోచినందున ఏకవచనం నుంచే అతడ్ని సంబోధించాను.

అతను వచ్చి నా ఎదురు నిల్చాడు.

"ఏంటయ్యా నీ పేరు?"

"అయ్యో సార్, నాకు ఒకటి కాదు వేలకొలది పేర్లున్నవి" అని చెప్తూ విచిత్రంగా నవ్వాడు. ఏంటి ఇతను నా తల తింటున్నాడా అని అతని ముఖాన్ని దిట్టించి చూసాను. సహజంగానే అన్నట్లుగా నవ్వుతున్నాడు. కొంటెతనం, వ్యంగ్యం... ఏవీ అతని ముఖంలో కనబడక, ఒక విధమైన వేదాంత ధోరణిలో ఉన్న బావముద్ర అతనిలో ఉంది కదా! తక్కువ స్థాయి వాడితో ఏమి మాటలు పలికేది అని నాలో అన్పించినా, అంత మట్టంకే అతడ్ని వదిలేది సరికాదని అన్పించి "ఈ ఆఫీసులో ఏమి చేస్తున్నావయ్యా నువ్వు" అని అడిగాను.

అతను తక్షణమే తన పిరుదుల వెనక ఉంచుకొన్న చేతుల్ని నా ముందుకు చాపాడు. రెండు చేతులలో ఉన్న బొటన వేళ్ళకు మందంగా ఇంక్ జాడలు పులుముకొని ఉన్నవి. ఈ ఇంక్ రంగు ఎంత మందంగా ఉందంటే బొటనవేళ్ళలోని రేఖలన్నీ మాయమై ఈ సిరా జాడే ప్రధానంగా ప్రస్ఫుటమై కనబడుతుంది. అంతే గాకుండా సిరా మెత్తుకుపోయి రెండు చేతులలోని బొటనవేళ్ళను ఎక్కడెక్కడో ఒత్తినందున వేళ్ళమీద చర్మం తేలికబడిపోయి మరిక ఆ బొటన వేళ్ళు నునుపుగా మెరుస్తున్నవి. బొటనవేళ్ళు వెడల్పుగా సాగి ఉన్నవి.

నేను రెండు నిమిషాలు మౌనంగా కూర్చుని అతనిలో ఉన్న చేతి బొటన వేళ్ళనే చూడసాగాను. మరిక ఏమి అడగాలి ఏమి వినాలి అనేదాన్ని మర్చిపోయి నేను స్తబ్దుగా కూర్చున్నప్పుడు అతడు నిల్చున్న చోటునుంచి కదిలి తన గదికి వెళ్ళిపోయాడు. నేను ఇకనూ కొన్ని నిమిషాలు అలాగే కూర్చుండి పోయాను. అంతలో నా టేబిల్ మీద ఫోను చప్పుడు చేస్తుండగా అటువైపు దృష్టి పెట్టి అతడ్ని మరిచాను.

మళ్ళా ఒకట్రెండు రోజులు గడిచినవి.

కఛేరిలో కాస్తంత విరామం కూడా దొరకని పని ఎంతగానో నా ముందు ఉంది. ప్రవాస మందిరం (ట్రావలర్స్ బంగళా)లో ముందస్తుగా గది కావాలని వచ్చేటోళ్ళు, రహదారికి చెందిన వివరాలు కావాలి అని కోరే పెద్ద ఇంజినీర్లు, నది ప్రవాహంలోని డేంజర్ లెవల్ అడిగే తహశీల్దారు, ఎస్సిఎస్టి జనాభా వివరాల్ని అడిగే సంక్షేమశాఖవారు... వీటి నడుమ పనిలో మునిగి ఆ వ్యక్తిని మరిచాను నేను. అయితే ఒక ట్రెండుసార్లు ప్రాజెక్ట్ పనులు నిర్వహిస్తుండే బ్రాంచి ఆఫీసుకు వెళ్ళినప్పుడు అచానక్‌గా ఇతను నా కళ్ళలో పడ్డాడు. వేరే ఒకట్రెండు డిపార్ట్‌మెంట్స్‌లోని నౌకర్లు ఇతని వద్ద కొచ్చి నిల్చొని ఏదో పని చేయించుకొంటున్నారు హడావుడిగా!

ఐదారు రోజుల తర్వాత ఒక ఆదివారం నేను ఇంట్లోనే ఉన్నాను. నాకైతే నేనుండే ఇంటి ముందున్న జాగాలో చెట్లను పూలకుండీల్ని పెంచే అభ్యాసంలోని పిచ్చి ఒకటుంది. నేను ఎక్కడెక్కడికి ట్రాన్స్‌ఫర్ అయ్యివెళ్తుంటే నా జతగా చెట్లు పూలకుండీలు రావాల్సేఉందికదా! పూలకుండీలలో నీళ్ళు పోస్తున్నప్పుడు చెట్లను ఒకటొకటిగా నిమిరి సవరిస్తూ వాటి యోగక్షేమం గురించి యోచిస్తున్నప్పుడు, గేట్ రణ్ అంటూ చప్పుడు చేయగా నేను అటువైపుకు తలతిప్పి చూసాను. బొటన వేళ్ళకు సిరా పులుముకొన్న అతడు గేట్ బయట ఉన్నాడు.

ఈసారైతే అతను ఈ లోకంలోనే ఉన్నాడు. ముఖం ఉబ్బిపోయింది. ఏడ్చి ఏడ్చి కళ్ళను తుడుచుకొని వచ్చినోడిలాగ కన్పించాడు. ఎవరికీ రాకూడని కష్టం తనకు మాత్రమే వచ్చింది అన్నట్లుగా వ్యాకులంగా అతను నిలబడ్డాడు. నన్ను చూసిందే ఆలశ్యం అన్నట్లుగా 'సార్' అన్నాడు. తక్షణమే ముందుకు దూసుకొచ్చి నా కాళ్ళ మీద పడ్డాడు.

నేను గాబరాపడి వెనక్కి జరిగాను. అతనిలోని ఈ ప్రవర్తన నా పాలుకు అదెంతగా అఘాతకారిగా అయ్యిందంటే వెనక్కి జరిగిన రభసకు ఒక పూలకుండి మీద నా కాలు బలంగా పడి అదిక పగిలిపోయింది.

"లెగువ్...లెగువ్, ఏమైందయ్యా నీకు?" అంటూ అరిచాను.

అతను లేచి నిలబడ్డాడు. అయితే అతని ముఖం మీద దైన్యభావం మాయమై పోలేదు! కళ్ళలో ఇంకేంటి నీళ్ళు తొణికిసలాడుతవేమో అన్నట్లుగా కనబడింది అతని మోము.

"సార్...నాకడుపు మీద కొట్టకండి" అంటూ మొత్తుకొంటున్నాడు.

"నీకష్టం ఏమిటో మొదట చెప్పు" అన్నాను. ఎందుకంటే నేను ఎవరి పొట్ట మీద కొట్టింది నాకు గుర్తులేదు. అంతగానేమి దొడ్డ స్థానంలో నేను ఉండలేదు కదా!

నేను పి.డబ్ల్యు.డి. కచేరిలో ఉండే ఒక ఉపవిభాగంలో ప్రథమ శ్రేణి గుమాస్తాగా ఉన్నాను. నేను ఇతని మీద ఆసక్తి చూపెట్టింది ఉంది. ఇతని విరుద్ధంగా నేను వేరే ఏ పితూరి చేయలేదు!

"ఆఫీసులో నాకంతా చెప్పారు సార్" అన్నాడు కంపిస్తున్న ధ్వనినుంచి.

"ఏంటి, ఏమి చెప్పారు?"

"మీరు పేపర్లలో అంతా రాస్తారట... కతగిత రాస్తారట"

నేను నవ్వాను. విషయం అయితే అసత్యం కాదు. సర్కారు డ్యూటి నా వృత్తిగా ఉంటే, సాహిత్య కృషి నా హవ్యాసం (హాబి)గా ఉంది. నేను పిచ్చాపాటి రాస్తుంటాను అనేది కన్నడనాడులో బహుళంగా జనంకు గుర్తుంది. నేనుండే డిపార్ట్‌మెంట్‌లోని సిబ్బందికి ఇనుము సిమెంట్ తారు కంకర నీళ్ళ పైపులు రోడ్డు రోలర్లు లెక్కల పుస్తకం మొదలైనవి తప్పితే మరిక బయటుండే ఇతర విషయాలలో ఆసక్తి లేకున్నా, నాలో ఉన్న రచనా ప్రవృత్తి మాత్రం వాళ్ళకు గుర్తుందిలే! కొంత మంది ఈ కారణం నుంచే నన్ను గౌరవంగా చూస్తుంటే, మరికొంత మంది నా వెనకే కొంకిరి మాటలు పలికి కుహకంగా నవ్వుకొంటుండేవారు. ఒక అధికారి అయితే "ఏమిటండి, ఆఫీసులో కూర్చుని కతలు రాస్తారట నిజమా?" అని నన్ను పొడిచినట్లుగా కుమ్మినట్లుగా అడిగింది ఉంది కదా! అయితే నా పాటికి నేను రాసుకొంటూ వస్తున్నాను. అయితే ఇప్పుడు దీన్నుంచి ఈ వ్యక్తికి అయిన కష్టం ఏమిటి?

"నేను కతలు గితలు రాస్తున్నందున ఎవరికీ కష్టం అయ్యేది లేదయ్యా... నీకైతే ఏమి అయ్యేది లేదు. నువ్వు భయపడుతుంది ఎందుకు?"

అతను కొంచెం సమాధాన చిత్తంతో నా ముఖాన్ని చూసాడు.

"మీరు ఏదాన్నైనా రాయండి సార్... ఈ వేలిముద్రోడి కతను మాత్రం రాయకండి. నా భార్యా బిడ్డల్ని వీధి పాలు చేయకండి."

నాలో ఇప్పుడు ఒక రీతిలో కుతూహలం ఏర్పడింది. నాలో ఉండే కథా రచయిత మేల్కొన్నాడు. కొత్త దొక వస్తువు దొరకిందని మనస్సు పుళకితమైంది నాలోని రచయితకు. నేనిక పూలకుండీల్ని చూసే నా కార్యక్రమాన్ని సగంలోనే ఆపి ఇంట్లోకి తిరిగాను.

"రా..." అంటూ అతడ్ని ఆహ్వానించాను.

అతను వెంబడించాడు నన్ను.

అరుగు మీదున్న కుర్చీలో కూర్చుని అతడ్ని కూడా మరో కుర్చీలో కూర్చోమని చెప్పాను. లోపలికి ముఖం పెట్టి రెండు గ్లాసులలో కమ్మటి చిక్కటి కాఫీ పంపమని ఇంటిదానికి చెప్పాను.

"అదేంటయ్యా నీలో ఉన్న బొటన వేలు కత?"అంటూ నేరుగా అతని కళ్ళ లోపలికి గురిపెట్టి చూసి అడిగాను.

అతనిలో తన గురించి చెప్పుకొనే మనస్సు లేదు. అయితే నా ధ్వనిలోని కోమలత్వంకు, మార్దవంకు, మరిక నేను చాపిన స్నేహహస్తంకు, అతని మీద చూపెట్టిన ఆత్మీయతకు కట్టుబడిపోయి మరిక అతను తన పురాణంను చెప్పసాగాడు. ఎంతో పాత కత! సుమారుగా ఇరవై సంవత్సరాల పాత కత అది!

❖ ❖ ❖

చిమ్మణ్ణకట్టలో ఉండే ఈరభద్ర కుమారుడైన వీరప్ప నుంచి బాగా గొడ్డు చాకిరి చేయించుకొని, కొన్ని సంవత్సరాల తర్వాత మొండి చేతులనుంచే తన ఇంటి నుంచి గెంటేసాడు అతడ్ని షావుకారుగారు. ఈరభద్ర షావుకారు వద్ద చేసిన ఋణం తీర్చాలని షావుకారు ఇంట్లో చాకిరికని చేరాడు వీరప్ప. ఈ మధ్యలో వీరప్ప తల్లిదండ్రి ఇద్దరూ చనిపోయారు. వీరప్ప పెరిగి పెద్దోడౌతుంటే ఎక్కువ ఎక్కువగా ఆంబోతులాగ కూడు తింటుంది షావుకారు గమనంకు వచ్చింది. అంతేగాకుండా షావుకారు పుత్రుడు కూడా పెద్దోడైనందున మరిక అతడి బాగోగులు చూసుకొనేందుకు మరొక పోరడి అవసరం ఇకలేదు అని ఒక శుభదినం చూసి షావుకారు వీరప్పను పిల్చి "ఓయ్ పోరడా... ఇదిగో పదిరూపాయలు నీ ఖాతాలో ఉంది. ఇక నీ దారి నువ్వే చూసుకో" అంటూ వెళ్ళ గొట్టాడు.

ఈ వీరప్ప తిక్కలోడు. చదువు రాత నేర్వలేదు. ప్రాపంచిక జ్ఞానం లేదు. జతగా ఛీ ఛూ అని తిట్టించుకొన్నాడు. కాలి నుంచి తన్నించుకొన్నాడు. సగం కడుపు ఖాళీగా పెట్టుకొని తిని పెరిగినోడు. అతని దేహం మనస్సు బుద్ధి హృదయం... ఇవేవి ఒక పద్ధతిగా పెరగలేదు. ఇతనిక ఏమి చేయగలడు?

పల్లెనుంచి పట్నంకు వెళ్ళే దారి పట్టుకొని నడిచాడు. పట్నంకు చేరుకొన్నాడు. ఎక్కడో పడుకొని సెనగలు పూరి తింటూ కాలం గడిపాడు. నీళ్ళు తాగి పొట్ట నింపుకొన్నాడు. చివరికి ఏదో హోటెల్‌లో కంచాలు గ్లాసులు కడిగాడు. సరుకుల అంగడిలో బియ్యం, ఉప్పు, పప్పు, చింతపండు, మిరపకాయలు, బెల్లం, మినుపగుళ్ళు మొదలైన వాటిని తూకం తూసాడు. ఐదారు సంవత్సరాలు ఇలా గడిచినవి. ముఖం మీద మొటిమలు ఏర్పడినవి. పెదాలమీద మీసం చిగురించింది. దేహ సౌష్టవం మీద వేరే ఏవేవో మార్పులు కలిగి రక్తం ఉడుకైంది. అయితే వీరప్ప వెనకటి వీరప్ప లాగే ఉన్నాడు. తిక్కలోడు మూర్ఖుడు అంటూ జనం పిల్చేవారు. కావొచ్చు అని అనుకొన్నాడు అతను.

"ఎవరండి శెట్టిగారు... ఇతను"? అంటూ సిద్దరామయ్య అంగడికి వచ్చి సరుకులు కొంటూ శెట్టిని అడిగాడు.

"ఇతనొక తిక్కలోడు సార్... దేముడు ఒకటి తప్పితే ఇతని దేహం కంతా సరిగానే ఇచ్చాడు. ఇతని తలలో మెదడు నింపలేదు దేముడు. ఒకటి చెప్తే మరొకటి చేస్తాడు. మీరు ఇతనికి ఒక పని చూపించండి" అన్నాడు శెట్టి.

"పంపండి నాతో, రహదారులలో పనులు చేసేందుకు మాకు జనం కావాలి. సర్కారి జీతం ఇస్తాను" అన్నాడు సిద్దరామయ్య.

"తోలుకెళ్ళండి సార్ శీఘ్రమే" అన్నాడు శెట్టి.

వీరప్ప ఇంజినీర్ సిద్దరామయ్య ఇంటికి చేరాడు. మొదట ఎనిమిది రోజులు రోడ్డు కుండే గ్యాంగ్ మెన్ల జతగా ఇతనూ రోడ్డు పనికి వెళ్ళి వచ్చిన తర్వాత ఒక రోజు సిద్దరామయ్య చెప్పాడు ఇలా : "నువ్వు రోడ్డు గిద్దుకు వెళ్ళొద్దు. ఇంట్లోనే ఉండు. నేనే నీకు జీతం ఇస్తాను" అని.

తలూపాడు వీరప్ప. ఇదంతా అతనికి అర్థమైయ్యే అవసరం లేదు.

ఇంజినీర్ గారి ఇంట్లో పనులు, వంట చెఱకు తెచ్చేది, కుక్కను కక్కస్సుకూ వాయువిహారంకు తీసుకెళ్ళేది, కూరగాయలు తెచ్చేది, పుత్రుడ్ని ఆడించేది అతడి దిననిత్య కార్యంగా ఉంది. ఇంటి ముందుండే అరుగులో పడుకొనేది అతనికి అభ్యాసంగా అయ్యింది.

ఒకరోజు సిద్దరామయ్య బారుగా అడ్డంగా రాసిన పెద్దకాగితాల కట్ట పట్టుకొని వచ్చి 'వీరప్పా' అని కేకపెట్టాడు.

ఇతను వెళ్ళి సార్ ఎదురు నిల్చాడు.

ఇంజినీర్‌గారు కాగితాల కట్ట తెరిచాడు. వాటి చివర సాలుసాలుగా రశీదులలో రెవెన్యూ స్టాంపులు అంటించబడియున్నవి. ఇంజినీర్‌గారు ఇంక్‌ప్యాడును ముందు పెట్టుకొని "ఇవ్వు బొటనవేలును" అని అన్నాడు.

ఇతను బొటన వేలు చాపాడు.

ఇంజినీర్ ఇతని బొటనవేలు పట్టుకొని ఇంక్ ప్యాడ్‌లో ఒత్తి స్ట్యాంపుల మీద బలంగా ముద్ర వేయించాడు. ఇది బారుగా సాగింది. ఒక బొటన వేలు చాలదని మరొక చేతిలో ఉన్న బొటన వేలు గురుతు కూడా స్ట్యాంపుల మీద పడింది.

"ఇక ముందు నువ్వే బొటన వేలు నొక్కేదాన్ని నేర్చుకోవాలి" అని మళ్ళానొక్కి చెప్పాడు ఇంజినీర్.

అన్ని రశీదు స్ట్యాంపులు నేరేడు వర్ణంతో బొటనవేలు ముద్ర నుంచి గుండ్రంగా నిండి పోయినవి. వీరప్పడి వేలు నొప్పి నుంచి విలవిలలాడింది. వీరప్ప దూరంగా

నిలబడినప్పుడు సిద్ధరామయ్య అ కాగితాలను ముందు పెట్టుకొని రశీదులలో స్ట్యాంపు లంటించి ముద్రపడిన వాటి మీద జోరుగా "బొటనవేలు గుర్తు కిట్టప్పది, రామాచారిది, బుడన్‌సాబిది, అంతోని డికాస్టాది" అని చెప్పుకొంటూ రాసుకొంటూ పోయాడు.

వీరప్ప జరుగుతున్న దాన్నంతా నిలబడి చూస్తూ తననుంచి బొటన వేలు ఒత్తించుకొన్న కాగితాలు మీద అసిస్టెంట్ ఇంజినీర్ సుబ్రాయగారు "గోవిందప్ప, నంజుండప్ప, కిట్టప్ప, పొన్నుస్వామి, నబీసాబ్, షరీఫ్, రోజారియో, అనంద, గాబ్రియెల్, రంగప్ప" అనే పేర్లను రాసుకొంటూ వెళ్ళాడు. తన పేరు మాత్రం ఎక్కడా రాయలేదు వినబడలేదు కదా అని అన్పించింది వీరప్పకు.

ఈ ఘనకార్యాన్ని ముగించి ఇంజినీర్ సుబ్రాయగారు వీరప్ప ఒత్తిన కాగితాల్ని లెక్కించాడు. జేబు నుంచి ఇరవై రూపాయలు తీసి "పుచ్చుకో ఈ రొక్కాన్ని" అన్నాడు. వీరప్ప చేయిచాపాడు ఆ రొక్కంకు.

ఇంజినీర్ సిద్ధరామయ్యకు సంతోషమైంది. ఒక కట్టడంలోని వర్క్‌ను డిపార్ట్‌మెంట్ నుంచే అతను చేయిస్తున్నాడు. కావాల్సిన సిమెంట్ స్టీలు ఇసుకను ప్రభుత్వమే సరఫరా చేస్తుంది. మిగతా సామానును అంగళ్ళ నుంచి కొనుగోలు చేసి బిల్లులను పొందేవాడు. పనులను దినకూలీల నుంచి చేయిస్తుండేవాడు. వాళ్ళకు రోజుకింత కూలి ఉండేది. ఈ కూలీలదే ఈ పట్టి. అయితే నికరంగా అక్కడ పనులు చేస్తుంది పదిమంది కూలీలే! పట్టిలో ఉండోటోళ్ళు ముప్పైమంది కదా! ఇంతకు మునుపు హాజరు పట్టి తీసుకొని ఇంజినీరు గారు కాగితం మిల్ వద్దకు వెళ్తుండేవాడు. అక్కడ గేటు బయట తచ్చాడుతున్న కూలీల నుంచి బొటన వేలు ముద్ర వేయించుకొని తలా రెండ్రెండు రూపాయలు ఇస్తుండేవాడు. ఇది కొన్ని రోజులు బాగానే జరిగి, ఆతర్వాత అక్కడిక్కడ విమర్శకు గురైంది. అటు తర్వాత ఆఫీసులో గుత్తేదారు మూలకంగా చేయించాడు. అక్కడా కష్టమే ఎదురైంది. చివరికిక ఈ వీరప్ప నుంచి ఒత్తించే ఉపాయం మెరిసింది వారి మెదడులో. ముప్పైమంది బొటన వేలి ముద్రల్ని వీరప్ప ఒకడే ఒత్తుతుండేవాడు. అరవై రూపాయలు ఇవ్వాల్సిన చోట ఇరవై రూపాయలే ఖర్చు అవుతుంది. విషయం గోప్యంగా ఉంది. కార్యం కూడా తక్షణమే ముగించబడుతుంది. ఇతను తిక్కలోడు; బయట చెపుతాడు అనే అనుమానం కూడా లేదు!

అలాగో ఇలాగో వీరప్పకైతే ఖాయంగా ఒక పని దొరికింది. ఇంజినీర్‌గారి ఇంటి మూల ఒక మేజాబల్ల, బల్ల మీద ఇంక్ ప్యాడు జమైనవి. రెండు బొటన వేళ్ళను ప్యాడ్ మీద అద్ది స్ట్యాంపుల మీద సటసటా ఒత్తుతూ వెళ్తుండేదాన్లో వీరప్ప పండిపోయాడు. హాజరుపట్టీలో ముప్పైమంది ఉండనీ, నూరుమంది ఉండనీ పనైతే

చకచకా జరిగి పోతుండేది. ఇతని ఎదురే నిస్సిగ్గుగా కూర్చుని ఆ ఇంజినీర్ల బృందం రాసుకొంటుండేవారు.

"ఈ బొటన వేలు ముద్ర బరమప్పది, సోమప్పది, లింగప్పది, సావిత్రమ్మది, రాజమ్మది" అని చెప్పుకొంటుండేవారు. అంతట్నీ చూస్తూ వింటూ కూర్చునేవాడు వీరప్ప.

ఇంజినీరు సిద్దరామయ్యకు ట్రాన్స్‌ఫర్ అయ్యింది. వారితో పాటే ఇతనూ బయల్దేరాడు. తుమకూరు, తరీకెరె, శివమొగ్గ, కడూరు, హాసన్, బేలూరు... ఎక్కడెక్కడికి వెళ్ళినా ఇతనికి ఇదేపని ఇంక్‌ప్యాడ్ స్టాంపులతో. రెండు బొటన వేళ్ళను ఎంతగా రుద్ది రుద్ది కడిగినా నేరేడు వర్ణంతో ఉండేరంగు తొలగిపోలేదు కదా!

వీరప్ప సుఖంగానే ఉన్నాడు. ఇతనికి వివాహంకూడా అయ్యింది. పిల్లలూ కలిగారు. అదెందుకో వీరప్ప క్రమేణా తన పేరునే మరిచాడు. తనకొక పేరు ఖాయంగా ఉండాలని అతనికి అన్పించలేదు. దాని అవసరం కూడా అతనిలో కలగలేదు. జీతంగీతం తీసుకొనేందుకు ఒకపేరు ఉండాలి. సర్కారి సేవలో ఉండేదుంటే ఒక పేరు కచితంగా కావాలి. బ్యాంక్‌లో తపాలా కార్యాలయంలో పొదుపు చేయాలంటే పేరు తప్పనిసరి. ఇవేవి వీరప్పకు లేనందున మరి పేరు ఎందుకు ఖాయంగా!

సిద్దరామయ్యకు ప్రమోషన్ లభించింది. అతను ఎక్సిక్యూటివ్ ఇంజినీర్ అయ్యాడు. సూపరింటెండింగ్ ఇంజినీర్‌గా అయ్యాడు. ఇప్పుడతను కర్నాటక రాష్ట్రం మొత్తంకు ఛీఫ్ ఇంజినీర్‌గా ప్రమోట్ అయ్యి బెంగుళూరుకు చేరాడు.

సిద్దరామయ్య వెళ్ళిపోయిన తర్వాతా వేల కొద్ది మారు పేర్లతో ఉన్న వీరప్ప కొత్తగా వచ్చిన ఇంజినీర్ల జతగా ఊరూరు తిరిగాడు. సిద్దరామయ్య ఇప్పుడు పెద్ద అధికారిగా ఉన్నందున తన క్రింద ఉన్నోళ్ళకు ఈ విధంగా చెపుతుండేవాడు: "చూడండి, ఇతడ్ని మీ వద్ద ఉంచుకోండి. మస్టర్ రోల్‌కు బొటనవేలు నుంచి ఒత్తించే కార్యం ఒకటి ఉంటది కదా! ఉత్తిగనే గుత్తేదారు మూలకంగా చేయించి వాళ్ళకు పర్సంటేజ్ ఎందుకు ఇవ్వాలి? ఇతను సటసటా స్టాంపుల మీద థంబ్ ఇంప్రెషన్ వేసి ఇస్తాడు. ఎవరికీ తెల్సేది లేదు. ఎవరికీ ఇతను చెప్పేది లేదు. ఒక మస్టర్ రోల్‌కు ఏబైయ్యో అరవైయ్యో ఇవ్వండి."

వింటున్నోళ్ళకూ ఇది మంచి వ్యవస్థే అన్పించింది. కేవలం హాజరు పట్టీకేకాదు, కొన్ని దొంగ బిల్లులనూ వారు చేస్తుండేవారు. ఒక రోజు పనికని పదిసార్లు వెదురు బుట్టలు (పలికెలు) కొన్నట్లుగానూ, పార పలుగు పికాశల్ని కొలిమిలో కాల్పించి పదును చేయించినట్లుగానూ, చెట్ల కొమ్మల్ని నరికినట్లుగానూ... ఇలా పలు రకాలుగా

దొంగ దొంగ చేతి రశీదుల్ని చేయించి కాళప్పనుంచో బోళప్పనుంచో సంతకాలు పెట్టించుకొనే బదులుగా వీరప్ప నుంచి బొటన వేలి ముద్ర ఒత్తించుకొని వెళ్ళేది సులభం కదా అని వారు భావించుకొంటుండేవారు.

"ఇతడ్ని మా వద్దే ఉంచుకొంటాం సార్" అన్నారు వాళ్ళు.

ఇందుచేత ఇతను అహోబలరాయరు జతగా ఒక సంవత్సరం, క్రిస్టోఫర్‌సాబ్ జతగా ఒక సంవత్సరం గడిపాడు. అయితే ఊరూరు తిరిగేది ఇతనికి కష్టంగా అన్పించింది. మొహిద్దీన్ సాహెబ్ జతగా ఈ ఊరుకు వచ్చాడు. ఈ ఇంజినీర్ అయితే వేలిముద్రల్ని ఒత్తించుకొనే దాన్లో నిస్సీముడు. ఈ ఊరుకు వచ్చిన పిమ్మట వారికున్న ఐదుగురు ఆడపిల్లల పెళ్ళిళ్ళు అయినవి. వీరప్ప మీద వారికెంతో ప్రీతి ఉంది. ఆఫీసువెనుక ఖాళీగా పడియున్న ఒక షెడ్డును ఇతనికి ఇప్పించాడు. తర్వాత వారికి ఇక్కడ్నుంచి వేరే చోటుకు ట్రాన్స్‌ఫర్ అయినప్పుడు "వీరప్పా... నువ్వా బయల్దేరు, నువ్వు కాదంటే మా చేతిని కట్టిపడేసినట్లే" అన్నాడు.

ఇతను "సార్... నేను ఇక్కడే ఉంటాను" అంటూ అంగలార్చాడు.

మరిక ఇతను ఇక్కడే ఉండి పోయాడు. ఆఫీసులో ఇతని పనికని ఒక వ్యవస్థ చేసి పెట్టారు. ఆఫీసులోని ఇంజినీర్లకైతే ఇతను బొటన వేలు ఒత్తి ఇచ్చేది ఉండనే ఉంది. జతగా నీటిపారుదలశాఖ, జిల్లా పరిషత్ విభాగం, స్లమ్‌బోర్డ్, డ్రైనేజ్ మండలి... ఇంకా కొన్ని ఆఫీసోళ్ళు వేలిముద్రల్ని ఒత్తించుకొని వెళ్ళేందుకు ఇతని వద్దకు వస్తుండేవారు. ఎవరైనారానీ, ఎంత మందైనా రానీ, తక్షణమే ఇతను ఈ ఆఫీసునుంచే పని చేసి పెట్టుంటాడు. ఈ పని ఎవరికీ గుర్తుకాకూడదు అని అంటారు ఆ సార్లు. వేరే వాళ్ళకు చెప్పకు అని కూడా ఉద్బోధిస్తుంటారు. అతను గుట్టుగా చేస్తాడు. ఎవరికీ చెప్పేది లేదుకదా!

మస్టర్ రోల్‌లో పేర్ల ముందు అంటించిన రశీదు స్ట్యాంపు మీద బొటన వేలు ముద్ర ఒత్తుతాడు. కుడిచేయి బొటన వేలు నెప్పి పెట్టుంటే ఎడంచేతిలోని బొటనవేలు వాడుతాడు. రెండు చేతులలో బొటనవేళ్ళకు గాఢంగా నీలిరంగు ఇంక్ మెత్తుకొని ఉంటది. ఈ ఇంక్ రాగిముద్ద జొన్న రొట్టె తినేటప్పుడు అతని కడుపులోకి వెళ్తుంది. రెండు బొటన వేళ్ళు సర్వీసులో వేలసార్లు ఒత్తినందున చపాతిలాగ సాగియున్నవి. బలహీనమై ఉన్నవి. అయినా అతని నుంచి కార్యం ముందుకే సాగుతుంది.

వేలకొద్ది పేర్లున్న ఈ సర్దారు క్రమేణా ఒక విషయాన్ని గమనిస్తూ వచ్చాడు. ఈ జనం తన చేతివేళ్ళ నుంచి చేయించుకొనేదంతా దగుల్బాజి వేలిముద్రలే అనేది అతనికి కచితమై పోసాగింది. రోడ్డు రిపేరుకు, కట్టడంలోని ఆధునీకరణకు, వంతెన

నిర్మాణంకు, చెఱువులు, బావులు తవ్వేందుకు వీళ్ళు నిజంగా ఖర్చు పెట్టుంది ఇరవై ముప్పై నలభైవేలు మాత్రమే. అయితే పొందుతుండే మొత్తం మాత్రం అరవై, ఎనభై, ఒక లక్ష, ఒకటిన్నర లక్షకదా! తనకు నలభై రూపాయలు ఇచ్చి వేలలో లక్షలలో డబ్బు అన్యాయంగా గడించుతున్నారు. చిన్న పెద్ద ఇంజినీర్లు తమ స్థాయిని బట్టి పంచుకొంటారు ఆ అక్రమ సంపాదనను!

వీళ్ళ అర్ధాంగుల వంటి మీద కిలోల కొద్ది బంగారం. వీరికి ఒకొక ఊరులో రెండ్రెండు ఇళ్ళు. బావలు మామల పేర్ల మీద కార్లు. అణ్ణ కుమారుడి పేరు మీద మద్యపాన అంగడి (బార్). మామపేరు మీద లారి. వీళ్ళకు రోజూ ఖరీదైన మద్యం కావాలి. తినేందుకు వేటకూర రొయ్యల వేపుడు సమృద్ధిగా ఉండాలి. వీళ్ళు కొన్ని సార్లు ఎం.ఎల్.ఎ.ల్ని, మంత్రుల్ని సాకుకొంటుంటారు.

వేలిముద్ర ఒత్తే తనకు షెడ్డు, పిల్లలకు గంజికూడు, భార్యకు చిరుగులు పడిన చీర...

❖ ❖ ❖

వీరప్ప తన కతను ఆపి దూరంలో తేలిపోతున్న మేఘాల్ని చూస్తూ కూర్చున్నాడు.

"ఎందుకు ఆపావు... కొనసాగించు" అన్నాను.

"సార్ పెద్దోళ్ళు ఏమైనా చేయించనీ... వాళ్ళు చేయించినదానికి వాళ్ళే బాధ్యులు! నేనైతే పెద్దోడ్ని కాదుసార్. నేను తిక్కలోడ్ని, మూర్ఖుడ్ని, శుంఠను! నేనూ తప్పు చేస్తున్నానుకదా..."

అతను మళ్ళా చెప్పబోయే మాటను మర్చిపోయి కూర్చున్నాడు.

"వీరప్పా... నీ తప్పు నీకు తెల్సిందికదా... అది చాలు మరిక" అన్నాను.

"సార్"

"ఏంటి?"

"మీరు ఈ ఆఫీసుకు వచ్చేదాకా నేను దీన్నంతా యోచించలేదు. ఆఫీసులో ఉండేవాళ్ళు మీరు కతలు రాస్తారనే విషయాన్ని చెప్పారు. నామీద కూడా రాయగలరు అని అన్నప్పుడు నాలో దిగులైంది. మీ వద్దకు పరిగెత్తుకొంటూ వచ్చాను సార్! మీరు నా మీద రాస్తారా? ఈ వేలిముద్ర ఒత్తే వాడి కత రాస్తారా?"

"ఏమి జవాబు చెప్పేది నేను?" మౌనంగా కూర్చున్నాను.

"సార్"

"ఏంటి వీరప్ప"

"మీరు కత రాస్తే సర్కారోళ్ళు నన్ను జైలులో పడేస్తారు. నా భార్యా బిడ్డలు వీధిపాలౌతారు. మళ్ళా...మళ్ళా నేను ఇటువంటోడ్ని... ఇలాగ ఇలాగ బతికాను

అనేది ఊరికంతా గుర్తొతది. సార్... పెద్ద పెద్దోళ్ళంతా ఘనంగానే బతుకుతున్నారు, నేను మాత్రం...?"

మరిక నేను మధ్యలో నోరు విప్పి

"లేదు వీరప్ప... నేను నీ మీద కత రాసేది లేదులే! నా మాటను విశ్వసించు" అన్నాను.

అతనులేచాడు.

కాఫి గ్లాసు కడిగి తెచ్చాడు.

"వస్తాను సార్" అంటూగేట్ వద్దకు వెళ్ళినోడు తిరిగి నిలబడి "సార్" అన్నాడు మళ్ళా.

"ఏంటి వీరప్ప?"

"సార్, ఇటువంటి వేలిముద్ర ఒత్తే తిక్కలోడు మూర్ఖుడు ఒకడున్నాడనేది ఈ రాష్ట్రంకంతా తెల్సేది మంచిదని నాకు అన్పిస్తుందిసార్. అందుకని మీరు నా కత రాస్తే రాయండి. అయితే ఒక విన్నపం. నేను చనిపోయిన పిమ్మట రాయండి... ఇంత మట్టంలో ఉపకారం చేయండి" అంటూ అతను చేతులు ముడిచాడు.

"అలాగే... వెళ్ళిరా మళ్ళా" అన్నాను నేను. అతను బయటకు వెళ్ళి గేటు మూసాడు.

పైన చెప్పిన అన్ని ఘటనలు జరిగి ఇప్పుడు ఐదారు సంవత్సరాలు అయినవి. నేను ఇప్పుడు రిటైరై నా స్వగ్రామంకు తిరిగి వచ్చి శేషజీవితాన్ని గడుపుతున్నాను. ఎన్నో సార్లు నాలో నేను నా సేవలోని అంత్యభాగంలో గడిపిన సర్కారి కొలువులోని రోజుల్ని గుర్తు చేసుకొంటున్నాను. విశేషంగా ఆకాశాన్ని చూస్తూ విరిగిన టేబిల్‌లోని నాలుగో కాలును చూస్తూ, వేరే ఏదో లోకంలో ఎల్లప్పుడు ఉంటుండే ఆ వేలి ముద్ర ఒత్తే వ్యక్తి పదే పదే గుర్తుకొస్తున్నాడు. దొంగ వేలిముద్రల్ని ఒత్తే అతని కార్యం నిరంతరంగా జరుగుతుండేది. ఈ కార్యం అతడ్నుంచి ఎక్కువ ఎక్కువగా జరిగి యుండొచ్చు. పాపం, ఈ కార్యం చేస్తూ అతను అదెంతగా కొరిగిపోయాడో (కృశించాడో) అని విచారం చేస్తున్నాను ఇప్పుడు. ఇతని మీద ఒక శ్రేష్ఠ కత రాయాలనే కాంక్ష మనస్సులో ఉన్నా అతనికి ఇచ్చిన మాట జ్ఞాపకంకు వచ్చి మిన్నకుండి పోయాను.

ఇలా ఉండగా మొన్న ఏదో పని నిమిత్తం ఆ ఊరుకు వెళ్ళాను. పని ముగించుకోగా, ఖాళి సమయం ఉన్నందున నా పాతకఛేరికి వెళ్ళాను. ఎంతో మార్పు చెందింది. పాతోళ్ళు ట్రాన్స్‌ఫర్ అయ్యి వాళ్ళ స్థానాలలో కొత్తోళ్ళు చేరుకొన్నారు.

డ్రైవర్లలో ఒకరిద్దరు పాతోళ్ళు ఉన్నారు. నేను కచేరి లోపలికి వెళ్ళినోడ్ని నేరుగా మైన్‌గది వైపుకు వెళ్ళి ఆ మూలను చూసాను. అక్కడ ఆ విరిగిన కుర్చీ మేజాబల్ల ఇంక్ ప్యాడ్ లేవు. ఆ వేలి ముద్రోడు చనిపోయి ఒక సంవత్సరం అయ్యిందని డ్రైవర్ తంగవేలు చెప్పాడు.

"తంగవేలు... ఏమైంది అతనికి?" అని అడిగాను.

"ఏదో మనోవ్యాధి నుంచి కృశించి చనిపోయాడు సార్. చివరచివరిలో వేలిముద్ర ఒత్తించుకొనేందుకని తెచ్చి ఇచ్చిన హాజరు పట్టీని చింపేది చేయసాగాడు సార్. ఇంజినీర్లందర్నీ దూషించేది, మానసికంగా ఏదో ఒక తరహాగా అయ్యాడు సార్! అతను చనిపోయి ఇప్పటికే ఒక సంవత్సరం అయ్యింది. పాపం, భార్యా బిడ్డలు కష్టంలో ఉన్నారు సార్" అని చెప్పాడు తంగవేలు.

నేను నిజంగానే తంగవేలును అడిగాను ఇలా:"అలాగైతే ఇప్పుడు వేలిముద్రలకని ఏమి చేస్తున్నారు మన డిపార్ట్‌మెంటోళ్ళు?"

నా ప్రశ్న విని తంగవేలు కిసుక్కునే నవ్వాడు.

"ఈ జిల్లాను నూటికి నూరుపాళ్ళు అక్షరాస్యత సాధించిన జిల్లా అని మన రాష్ట్ర ప్రభుత్వం ఘోషించిందికదా సార్! ఇక ఎవరూ వేలిముద్ర ఒత్తేదిలేదు సార్!

"మరి?"

"ఇంజినీర్లే స్ట్యాంపులున్న రశీదుల మీద తమంతతామే నూరారు పేర్ల నుంచి దొంగసంతకాలు పెట్టున్నారు. కుడిచేతి నుంచి దొంగ సంతకం చేసింది చాలదన్నట్లుగా ఎడం చేతినుంచి చేస్తున్నారు. పాపం వాళ్ళైనా ఏమి చేయగలరో చెప్పండి సార్? పైన ఉన్నోళ్ళను మేపాలి కదా సార్" అన్నాడు తంగవేలు.

"సరి సరి వదిలేయ్" అంటూ అతనికి చెప్పి మరిక అక్కడ్నుంచి కదిలాను నేను.

వీరప్ప కొరగికొరగి (కృశించి కృశించి) చనిపోయాడనేది నాకు బాధగా అయ్యింది.

ఊరికి వచ్చి చేరిన తర్వాత నేను ఈ కతను రాసాను. వీరప్పకు ఇచ్చిన మాట నిలబెట్టుకొన్నాను. అయితే వీరప్ప నుంచి ఇలా చేయించుకొన్న ఇంజినీర్లు మాత్రం నన్ను పదే పదే శపిస్తున్నారనేది నాకు తెల్సి వచ్చింది.

**మూలకథ రచనాకాలం : 1995**

# మోడల్ హౌస్‌లోని కాపలాదారుడు

## ఒకటి

జడ్డిగద్దెకు చెందిన సుబ్బారాయరు గారు బ్యాకోడు సీమకంతా పేరు గడించారు. ఆ సీమలోని ఇళ్ళ మధ్య సుబ్బారాయరిగారి ఇల్లులాగ ఎత్తైన పెద్ద భవంతి ఏది ఎలాగున లేదో అలాగే సుబ్బారాయరిగారి వ్యక్తిత్వంకు సరిపోయే మరొక వ్యక్తి ఎవరూ ఈ సీమలో లేరనే చెప్పొచ్చు!

వారిది రెండు అంతస్తులతో ఉన్న ఇల్లు. విశాలమైన వరండా, దాని ముందు అంతే ప్రమాణంలో వక్కమట్టలతో వేసిన పందిరి ఉంది. బర్మాటేకుకు చెందిన బృహదాకారమైన సింహద్వారం ఆ ఇంటికి ఉంది. ఆ సింహద్వారాన్ని సొరబపట్టణంలో ఉండే వడ్రంగులు జడ్డిగద్దెకు వచ్చి అక్కడే ఉండి అద్భుతంగా నగిషీలతో చెక్కి కూర్చో బెట్టారు. ఇంట్లోకి ఆ సింహద్వారం నుంచి వెళ్ళేందుకు మరొక చిన్న ద్వారం కూడా ఉంది. ఇంటిలోపల కూడా ఒక ప్రాంగణం ఉంది. ముఖ్య గదులతోపాటు ఎన్నెన్నో ఉపగదులు ఉన్నవి. భోజనాలగది, దేముడిగది, వంటగది, స్నానంగది, సూతకం గది, బాలింతల గది, అతిథులకని గది... ఇలా ఎన్నో గదులున్నవి. కొన్ని గదుల లోపల పగటి పూటా దీపం పట్టుకొనే వెళ్ళే పరిస్థితి ఉంది. ఇంటి ముందున్న వరండాలో కూర్చుంటే వక్కతోట కన్పిస్తది. ఐదు ఎకరాల తోట ఒకే చోట రమణీయంగా కంటిచూపుకు దొరుకుతది. గాలికి నిదానంగా తలూపే వక్కచెట్లలోని నిండైన గెలలు, వాటిలో కాసిన పచ్చి వక్కల్ని చూస్తూ కూర్చునేదే ఒక ఆనంద సాగరంగా ఉంటది సుబ్బారాయరు గారికి. ఈ ఆనందాన్ని వారిలాగే వారి నాయన వారి తాత వారి ముతాత్తలు అనుభవించారులే! ఈ ఇల్లు ఈ తోట ఎన్నో తరాలనుంచి అనుభవించు కొంటూ వచ్చింది ఆ కుటుంబం.

సుబ్బారాయరు గారు కూడా ఈ సంపదకు తగినట్లుగా తమ వ్యక్తిత్వాన్ని రూపొందించుకొన్నారు. ఎత్తుగా ఉండే వారి దేహ ఆకృతి, వారు తొడుగుతుండే బట్టలు, ధరిస్తుండే ఆకు పచ్చకోటు, కాళ్ళకు తొడుగుతుండే కిర్రుకిర్రు అనే పాదరక్షలు, తలమీద తెల్లటి తలపాగా, చెవిలో మందమైన కర్ణాభరణాలు (పోగులు), ఎప్పుడూ నోట్లో ఉండే తాంబూలం, వారి మాటలోని ధాటి... ఇవన్నీ ఈ సీమలో వారిని

ప్రత్యేక మనిషి అన్నట్లుగా చేసింది. వారి నడత వారికొక గౌరవాన్ని తెచ్చి పెట్టింది.

ఆ సీమలో సమస్య ఏదైనా ఉండనీ, జనం వారి చెంతకొచ్చి కష్ట సుఖాల్ని చెప్పుకొనేవారు.

"హెగ్డెగారు విషయం ఇలాగుంది... దీనికొక పరిష్కారం చూపించిపెట్టండి" అంటూ వస్తున్న జనాల్ని మంచిగా కూర్చోబెట్టుకొని సూక్ష్మంగా వారు అంతట్నీ తెల్సుకొని దానికొక పరిష్కారం కనుగొనేదాన్ని ప్రయత్నించేవారు.

వారు కొద్దిగా చదివింది ఉంది. పట్టణంలో పలువురి స్నేహ సంపర్కం వారికి ఉంది... దినపత్రికల్ని తెప్పించుకొని చదువుతున్నందున ప్రభుత్వం నుంచి ఎదురైయ్యే జటిల సమస్యల్ని పరిష్కరిస్తుండేది వారికి సాధ్యమౌతుండేది. ఇందుచేత ఆ సీమలోని జనం వీరి మీద ఒక గౌరవ భావం నిల్పుకొన్నారు.

అయితే ఈ సీమలోని జనంకు నిరాశ అయ్యింది మాత్రం ఒక విషయంలో నండి!

కర్నాటక ప్రభుత్వం లింగనమక్కివద్ద ఒక భారి విద్యుత్ ఉత్పాదన చేసే ఆనకట్టను కట్టేందుకు సిద్ధమైనప్పుడు, దాని నుంచి తుమ్రి, బ్యాకోడు సీమలోని వందలాది గ్రామాల భూమి నీట మునుగుతది అన్నప్పుడు జనం సుబ్బారాయర మీద ఎంతో భరోసా పెట్టుకొన్నారు. సుబ్బారాయరుగారు ఏదైనా చేస్తారులే.. ఎన్నో తరాలనుంచి తాము అనుభవిస్తూ వస్తున్న తోట, ఇంటిని నిల్పుకొంటారులే అనే నిరీక్షలో జనం ఉన్నారు. సుబ్బారాయరు కూడా ఈ విషయం మీద బాగానే తిరిగారు. సాగర, శివమొగ్గ, బెంగళూరుకు వెళ్ళివచ్చారు. జనం జతగా కొన్ని సభల్ని సమావేశాల్ని జరిపారు. అయితే ఫలితం మాత్రం సున్నాగా అయినప్పుడు జనంకు నిరాశ అయ్యింది. సుబ్బారాయరిగారి తోట, ఇల్లు ఇక ఉండేది లేదు అనే సమాచారం బయటకు పొక్కినప్పుడు అది జనం పాలుకు దిగులుతో నిండిన సమాచారంగా అయ్యింది. తొందరగానే ప్రభుత్వ అధికార్లు వచ్చి గ్రామాల్ని తోటలుండే జమీన్లకు గుర్తులు పెట్టిపోతున్న తర్వాత, దూరానెక్కడో ఉన్న ముంపు భూతం ఇంటి ద్వారం చెంతకు వచ్చినట్లై జనం భీతిల్లారు.

సుబ్బారాయరుగారు దీని మీద కలవాల్సినోళ్ళను చూడాల్సినోళ్ళను చూడకనే కలవకనే ఉండి పోలేదు. అయితే పైనున్నోళ్ళంతా "సుబ్బారాయరుగారు... దేశం కోసం మీరు త్యాగం చేయాలి, గవర్నమెంట్ మీకు పరిహారం అందిస్తది. పోగొట్టుకొంటున్న తోటకు ఇంత జాగా అని వేరేచోట ఇస్తది. దాన్ని వృద్ధి పరిచేందుకూ మీకు డబ్బు ఇస్తది, ఇక్కడ్నుంచి కొత్త చోటుకు వెళ్ళేందుకు వాహన సౌకర్యం కల్పిస్తది...

దేశం కోసం మీరు త్యాగం చేసేందుకు ముందుకురావాలి" అని బోధిస్తున్నప్పుడు రాయరుగారు జనం పక్షాన చెప్పాలనుకొన్న మాటనే మరిచి కూర్చుండిపోయారు.

నిదానంగా రాయరుగారిలో వచ్చి నిలబడిన నిరుత్సాహం, సప్పముఖం, ఓడిపోయిన వ్యక్తిత్వాన్ని గమనించిన జనం "ముంపుకు గురైయ్యేది నిజమే" అనే తీర్మానంకు వచ్చి ప్రభుత్వాన్ని శపించసాగారు. దేశంలో వెలుగులు నింపేందుకని మా బతుకుల్నే చీకటిమయం చేస్తుంది కదా ఈ ప్రభుత్వం అని నిట్టూర్పులు విడిచారు.

చివరికి నీటి ముంపు ఇంటి ద్వారం చెంతకే వచ్చి నిలబడింది. రెవెన్యూ డిపార్ట్‌మెంటోళ్ళు ఇల్లుతోట లెక్కించి వీటికింత బిల్లు అనే వాట్ని చేస్తున్నప్పుడు సుబ్బారాయరు గారు ఆ సిబ్బంది జతగా ఉన్నారు. అయితే క్రమేణ వారు దీని మీద ఆసక్తి పోగొట్టుకొన్నారు. ఒకసారి పుత్రుడ్ని పిల్చి..."పుత్రా ఇకముందు నువ్వే దీన్నంతా చూసుకో, నాకు ఎందుకో దేహంలో స్వస్థత సరిగాలేదు! ముందిక కొత్త ఇల్లు కొత్త జమీను (తోట) ఎక్కడ చేయాలి, నిర్మించాలి అనేదంతా తీర్మానం చేసుకో... మనం ఎన్నో తరాల నుంచి వక్కతోట వృద్ధించి బతికిన రైతులం; రేపు ప్రభుత్వం ఇచ్చే జమీనులో కూడా వక్కతోట వేయి" అని చెప్పారు. వారి మాటలో అంతగా ఉత్సాహం లేదు. బహుశః దీని గురించి వారు పలికిన మాట ఇదే చివరిదిగా ఉంది. ఇల్లు, జమీనుకు చెందిన పరిహారంలోని చెక్కు మొత్తం చేతికి వచ్చినప్పుడు సుబ్బారాయరు గారు లేరుకదా! వారు ఇంత తొందరగా స్వర్గస్థులౌతారని ఎవరూ అనుకోలేదు.

## రెండు

సుబ్బారాయరుగారు వక్కతోట పెంచే విషయం మీద ఏమేమి చెప్పియున్నా, వారి పుత్రుడు తనదే అయిన ఒక తీర్మానంకు వచ్చాడు. గ్రామం వదలాలి అనేది అతనిలో ఎన్నో రోజుల్నుంచి ఆశగా ఉంది. ఆ ఆశ ఇలాగున నెరవేరింది. జతగా తోటలోని కృషి పనులు కూడా అతనికి అక్కరైయ్యేదిలేదు. వక్కతోటల్ని పెంచే రైతులు ఎన్నో కష్టనష్టాలలో ఉన్న దాన్ని గమనించి అతను రోసిపోయాడు. క్రితంలో తన తండ్రి గాని తాత ముత్తాతలకు గాని సేద్యం తప్పితే వేరే దారి లేదు. అప్పట్లో ఈ వ్యవసాయ వృత్తికి ఘనత ఉండేది. ఇప్పుడు ఈ గౌరవం ఘనత సమాజంలో లేదు. అంతేగాకుండా చేసేందుకు ఎగబాకేందుకు పట్టణంలో వేరే పనులు ఎన్నో ఉన్నవి. ఇలాగున్నప్పుడు ఈ వక్కతోట కృషికే ఎందుకు వేలాడాలి అని అతను యోచన చేసాడు. అతని దోస్తులు కూడా అతనికి ఇదే విధమైన సలహాలు ఇచ్చేందుకు ముందుకొచ్చారు.

అతను, సుబ్బరాయరు గారి పుత్రుడైన నాగరాజుకదా! అతను మొదటగా సాగర పట్టణంలో ఒక ఇల్లు కొన్నాడు. తన పాత ఇంటిని విప్పి దాన్లోని కలప

పెంకులు మొదలైన వాట్ని అమ్మాడు. అతని పూర్వపు ఊరైన జడ్డిగద్దెలో ఉండే ఆ ఇంటి సింహద్వారాన్ని కేరళ రాష్ట్రంకు చెందిన ఒకడు ఏభైవేలకు కొన్నప్పుడు ఇతను మాత్రమేకాదు, ఆ రెండు సీమలలోని జనం విస్తుపోయారు. మరిక నాగరాజు తన ముందున్న బతుకు మీద యోచించసాగాడు.

తోట, వరి మాగాణి అని కాళ్ళు చేతులు దేహాన్ని బురదమయం చేసుకొనేది వద్దని నిర్ధరించుకొన్న నాగరాజు సాగర పట్టణంలోని మారికాంబ రోడ్డులో బాడుగ నుంచి ఒక అంగడి తీసుకొని ఎలక్ట్రానిక్స్ వస్తువులు అమ్మే దుకాణం తెరిచాడు. టి.వీలు, టేపురికార్డర్లు మొదలైన అత్యాధునిక ఉపకరణాలు ఏవేవి జగత్తులోకి ప్రవేశించినవో వాటికి చెందిన దుకాణం సాగర పట్టణంలో లేనందున, ఇటువంటి సామాన్లకు ఎక్కువ గిరాకి ఉంటదని అతను వైభవంగా షోరూం తెరిచి దానికి 'జడ్డి గద్దె సుబ్బారావ్ ఎలక్ట్రానిక్ షోరూం' అని పేరు పెట్టాడు. సుబ్బారాయర పేరుకు సాగరంలో మంచి గౌరవమే ఉన్నందున అందరూ దాన్ని స్వాగతించారు.

పట్నంకు వచ్చిన నాగరాజుకు అనుకూలమే అయ్యింది. పట్నంలోని జనుల సంపర్కం, పరిచయం, తిరుగాట, కొన్ని సేవా సంస్థలనబడే పేకాట క్లబ్బులలో సభ్యత్వం, పురసభలో ఉండే రాజకీయాలోళ్ళ స్నేహం... ఇలా అతను కొత్త ప్రపంచంలో విహరించసాగాడు. అతని భార్యాపిల్లలకు కొత్త ప్రపంచం నచ్చింది. సాగర పట్టణం నుంచి దూరానుండే కొంపలో నివసిస్తూ ఎప్పుడో సంవత్సరంకు ఒకసారి సాగరంకు వచ్చి వెళ్ళి సంబురం పడేదాని కన్నా సాగరంలోనే ఉండేది ఎంతో సౌఖ్యంగా ఖుషితో ఉండే విషయం కదా అని వారు కనుగొన్నారు. ముఖ్యంగా పిల్లలకు ఇంగ్లీష్ శిక్షణ సాధ్యమైంది అనే సంతోషం ఆ భార్యాపిల్లలకు లభించింది.

## మూడు

ముందుకే దూసుకెళ్తున్న ఈ దుకాణంలోని లావాదేవి ఒక రోజు అవనతి (దుర్గతి) పొందింది. ఖర్చులు పెరిగి అంగడి ఖాళి అయ్యింది. జనం వచ్చే దాన్ని నిల్పేసారు. కొత్తమాలు రానట్లైంది. అంగడిలో వ్యాపారం లేక నాగరాజు ఉత్తిగనే కూర్చోవాల్సి వచ్చింది. ఏమైనా సరే వ్యాపారాన్ని మరింతగా నిలబెట్టుకోవాలి అని నాగరాజు ఇంటిని బ్యాంకు వారికి కుదువపెట్టి ఋణం పొంది ఆ మొత్తాన్ని అంగడిలో వస్తు రూపేణా పెట్టాడు. ఆ సరకు అమ్ముడు పోలేదు. బ్యాంక్ సిబ్బంది ఇంటిని తమ వశంలోకి తీసుకొన్నారు. అంగడికి చెందిన ఇంటి యజమాని అద్దె కని తగాదా పడ్డాడు. నాగరాజు ఒక రోజున అంగడ్ని బంద్ చేసాడు. వేరొక చిన్న ఇల్లును బాడుగరూపంలో పొంది అందులో తన సంసారాన్ని మార్చాడు. ఈ దిగులు

సంతాపం నుంచి అతని తల్లైన పార్వతమ్మ చనిపోయింది. అంత్యకాలంలో ఆమె ఎంతో నొచ్చుకొంది. కొడుకు తోటవేసి ఉంటే కచితంగా తమకు ఈ గతిపట్టేదికాదని ఊపిరి పోయే వరకూ చెప్పుకొంటూ ఏడ్చి, కృశించి చనిపోయింది ఆ మాతృమూర్తి.

ఒకసారి నాగరాజు చెంత కొచ్చిన పాతమిత్రుడు "నాగరాజు... నీ కొడుకు ఏమి చేస్తున్నాడు" అని అడిగాడు.

"చేసేదేముంది, హైస్కూలు విద్య ముగించి ఇంట్లోనే ఉన్నాడు" అన్నాడు నాగరాజు.

"మీరు ముంపుకు గురై వచ్చినోళ్ళుకాదా?"

"ఔను, ఎందుకు అడుగుతున్నారు?"

"గవర్నమెంట్ ముంపుకు గురైన కుటుంబాలలో ఒకరికి నౌకరి ఇస్తుంది. నువ్వు నీ కుమారుడి చేతి నుంచి ఒక అర్జీ పెట్టించు. నౌకరి దొరకొచ్చు."

నాగరాజు ఏదో ఆశాభావం పెట్టుకొని ప్రయత్నం చేసాడు.

లింగనమక్కి ఆనకట్ట దిగువనుండే భాగంలో ఒక మోడల్ హౌస్ ఉంది. శరావతి నది మీద నిర్మించిన ఈ ఆనకట్టను ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నుంచి ఒక మోడల్ హౌస్‌గా చేసి ఒక భవనంలో ఉంచారు. ఆ మోడల్‌హౌస్‌కు ఒక వాచెమన్ ఉన్నాడు. అతనే సుబ్బారాయరిగారి మనమడు. జడ్డిగద్దె నాగరాజుకు కుమారుడైన సుబ్బారావ్.

ఆనకట్టను చూసేందుకు వచ్చినోళ్ళను అతను "రండిసార్, రండి" అంటూ ఆహ్వానిస్తున్నాడు. మోడల్ హౌస్ భవనం లోపలున్న దీపాల్ని వెలిగించాడు. అక్కడుండే పౌంటెన్లకు, జలపాతంకు నీరు పారేందుకని మోటార్‌స్టార్ట్ చేసాడు. రోడ్డులుగా తీర్చిదిద్దిన నమూనామార్గాలకు వీధిలైట్లను వెలిగించాడు. చేతిలో బారైన బెత్తం పట్టుకొని "ఇది లింగనమక్కి ఆనకట్ట. మీరు ఇప్పుడు ఇక్కడ నించొని ఉన్నారు. ఇది శరావతి నదికి అడ్డుగా కట్టబడింది. దిగంతంకు తాకేటట్లుగా నిలబడిన ఈ ఆనకట్టలో 1,56,000 ఎం.సి.ఎఫ్.టి. నీరు సంగ్రహించబడియుంది. ఈ నీళ్ళ నుంచి 126 చదరపు మైళ్ళ భూభాగం మునిగిపోయింది. అంటే 154 గ్రామాలు, 79000 ఎకరాలు నీటి నుంచి జలార్పణం అయినవి. 12,000 జనం ఇక్కడ్నుంచి వేరే చోట్లకు తరలించబడ్డారు. దీన్నుంచి జోగలో ఉండే మహాత్మాగాంధి విద్యుత్ ఉత్పాదనం కేంద్రం నుంచి; ఎ.బి. సైట్ల విద్యుత్ ఉత్పాదన కేంద్రం నుంచి; మళ్ళా లింగనమక్కి విద్యుత్ ఉత్పాదన కేంద్రం నుంచి మొత్తంగా 1210 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన జరుగుతుంది. ఈ బృహత్‌కార్యంలోని ప్రణాళిక భారతదేశంకు గర్వకారణం అని, కర్నాటకకు వెలుగు కేంద్రం అని కొనియాడబడుతుంది. మన దేశ ప్రగతికి ఈ ప్రాజెక్ట్ నుంచి వచ్చిన కానుక ఎంతో గొప్పది. ఈ ఆనకట్టను నిర్మించినోళ్ళు మన

ఇంజినీర్లే అనే దానికి మనమంతా గర్వించాల్సిన విషయం. దీనికి అవసరమైన రాళ్ళు ఇసుక సున్నం సిమెంట్ ఐరన్ మన రాష్ట్రం నుంచే సరఫరా అయ్యింది. అప్పటికాలంలోనే ఇక్కడ సుమారుగా డెబ్బై వేల మంది కూలీలు పనులు చేసారు...."

సుబ్బారావ్ కంఠపాఠంగా చేసుకొన్న దాన్ని చెప్పుకొంటూ పోతున్నాడు. ఇలా గడగడా చెపుతున్నప్పుడు అతను తనను తనే మర్చిపోతున్నాడు. రోమాంచితుడైయ్యాడు. అక్కడక్కడ నిలబడి కాలువల్ని, విద్యుత్ ఉత్పాదనాకేంద్రాన్ని తన చేతిలో ఉన్న బారు బెత్తంకర్ర నుంచి చూపిస్తున్నాడు. నీళ్ళు ఎలాఎలా పారి ఎ.బి. సైట్లలో ఉన్న జనరేటర్లను తిరిగించేదాన్ని వర్ణిస్తున్నాడు. సాగర, హొసనగర రెండు తాలుకాలో వ్యాపించి ఉన్న ఈ ఆనకట్టలోని నీళ్ళు విద్యుత్‌గా పరివర్తన చెందింది ఒక చోద్యం అన్నట్లుగా చెపుతున్నాడు.

ఇతని కామెంటరి వింటూ నిలబడినోళ్ళు తిరిగి వెళ్తున్నప్పుడు ఐదో పదో రూపాయల్ని ఇతని చేతిలో పడేస్తుండగా వినమ్రంగా ఇతను చేయిచాపి తీసుకొంటున్నాడు ఆ డబ్బును.

మోడల్ హౌస్ మ్యూజియం నుంచి బయటకొచ్చి నిలబడి వస్తుండే కొత్త జనంకని ఎదురు చూస్తున్నాడండి ఘనతవెత్త హెగ్డె సుబ్బరాయరిగారి మనమడైన ఈ కాపలాదారుడు!

**మూలకథ రచనాకాలం : 2007**

# బండార (పసుపు ప్రసాదం)

బ్యాంక్ మేనేజర్‌గా ఈ పట్టణంకు వచ్చిన తదుపరి, బ్యాంక్ ఖాతాదారుల పరిచయం కలగసాగింది. బ్యాంక్‌లోని మా సిబ్బంది పాత ఖాతాదార్లను... 'వీరు ఇలా వీరుఇలా' అని పరిచయించారు. షాపుల్ని నడిపేటోళ్ళు, హోల్‌సేల్ వ్యాపారస్థులు, గవర్నమెంట్ అధికార్లు, చిన్న స్థాయిలోని ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంక్‌లో డబ్బు జమ చేస్తుండే రిటైర్డ్ వ్యక్తులు, బ్యాంక్‌తో సతతం లావాదేవీలు నిర్వహిస్తుండే పరిశ్రమల యజమానులు... ఇలా అందరి పరిచయం అయ్యింది. దీనితో పాటే బ్యాంకుకు సమీపానుండే షాపులు, హోటెల్ వాళ్ళ పరిచయాన్ని నేనే చేసుకొన్నాను. నా ఛేంబరులో కూర్చుంటే ఎంతో జన సందడితో ఉండే ముఖ్య వీధిలోని దృశ్యం కనబడుతుండేది. వేగంగా తిరుగుతున్న వాహనాలు, వాటి చప్పుడు, షాపులకు వచ్చే పోయే జనం, దారిలో వెళ్తుండే పాదచారులు, రోడ్డు అంచున తోపుడుబళ్ళ నుంచి వ్యాపారం చేస్తుండే సామాన్య వ్యక్తుల ఆకర్షణీయమైన అరుపులు, కోలాహలం... ఎవరు ఎవరినో అరిచి పిలుస్తుండేది మరిక ఎవరో జగడం చేసుకొంటుంది మొదలైన వాట్నుంచి నాకు దిన నిత్యం కొందరి పరిచయం అవుతుందిలే!

హమాలోళ్ళ ముఖభంగిమలు, వారి ధ్వని, వారు మూటలు మోస్తూ భారంగా తిరుగుతుండేది ఇప్పటికే సామాన్య దృశ్యంగా అయ్యింది. రోడ్డు అంచున నాలుగు చక్రాల బండి నుంచి అరటి పండ్లను అమ్ముతుండేవాడ్ని నేను గుర్తించుకోగలను. పూలదుకాణాలలో పూజకని పూలమాలలు చుట్టి అమ్మేటోడ్ని, షాపులలో నిర్ణీత వేళ కాఫి చాయ్‌లను సరఫరాచేసే హోటెల్ పోరడ్ని, పేపర్లు పంచేవాడ్ని, పోస్ట్‌మ్యాన్, పోలీసుకానిస్టేబిల్‌ను, కచితమైన వేళలలో ఏదో కఛేరికి వెళ్ళే నౌకర్లను, స్కూలుకు సమవస్త్రం ధరించి వెళ్తుండే విద్యార్థి విద్యార్థిణులను... వీరందరినీ నేను ఇప్పటికే నా మనస్సులో నమూదించుకొన్నాను. వీళ్ళెవరు ఏమిటి ఎక్కడుంటారు అనేది నాకు తెల్వకపోయినా వీళ్ళరాకపోకలు నాకు గుర్తేలే! వీళ్ళలాగనే కొంతమంది భిక్షుకులు కూడా ఈ పట్టణంలోని గడిబిడి ప్రపంచంకు అనివార్యమై ఉన్నారు కదా! వీళ్ళు బ్యాంక్‌కు వచ్చేది లేకపోయినా షాపులు హోటెళ్ళు ఇస్కూలు ముందు కొచ్చి కాళ్ళావేళ్ళాపడి నిలబడి అడుక్కొనే దాన్ని నేను గమనించాను కదా!

వీళ్ళెవరూ బ్యాంకుకు ఖాతాదార్లుకాదు. ఎక్కడో కొంత మంది నౌకర్లు, అధికారులు, వ్యాపారులు బ్యాంక్‌కు వచ్చి వెళ్తుంటారు అనేది నిజమై ఉన్నా, పట్టణంలోని ప్రవాహంలో తేలిపోయే ఈ సమస్త జనం బ్యాంకుకైతే సరైనంతగా ఖాతాదార్లు కారండి! ఇందుచేత నాకూ ఖాతాదార్లుకాని వీళ్ళకు ఏ విధమైన సంబంధ సంపర్కం లేదు కదా! నా పాటికి నేను వారి పాటికి వారు ఉన్నారు.

ఈ జనంలో ఉద్భృతంగా నా మనస్సును లాగిపడేసింది ఒక జోగిని కదా! శిరోజాల్ని దువ్వి అదెన్ని రోజులైనవో ఆమెకు? ఆకుపచ్చ చీర మీద ఎరుపురంగు రవికతో ఆమె ఉంది. చేతిలో మెడలో ఒకట్రెండు నగలు గాజులు ఉన్నవి. నోట్లో ఎల్లప్పుడూ ఆకు వక్క తంబాకు మిశ్రమాన్ని నములుతున్నందున ఆమె దంతాలు కర్రిగా గారపట్టి ఉన్నవి. చెదిరి అస్తవ్యస్తమై తలలో ఉన్న కేశసంపదమీద ఒకట్రెండు ముద్దమందారపూలను పెట్టుకొంది. ముఖంమీద కొద్దిగా ముడతలుపడి ఆమె వయస్సును, జీవనంలో ఆమె పొందిఉన్న అనుభవాల్ని వెళ్ళడిస్తున్నవి. ఎంతో ముఖ్యంగా ఆమె మెడలో ఒక చిన్న సంచి వేలాడుతుంది. ఆ సంచిలో రేణుక ఎల్లమ్మ తల్లికి చెందిన బండార (పసుపు పరసాదం)ను ఆమె నింపుకొంది. ఈ బండార (పసుపు) ఆమె చీర మీదా పడియుంది. ఆమె చేతులలోనూ పసుపు మెత్తుకొని ఉంది. రోడ్డు మీద తిరుగుతుండేవాళ్ళకు, షాపులలో ఉన్న యజమానులకు, వీధి వ్యాపారం చేస్తున్నోళ్ళకు, ఏదో కొనాలని మార్కెట్‌కు వస్తుండేవాళ్ళకు, కార్లు స్కూటర్ల మీద ఆగి ఉన్నోళ్ళకు, స్కూలు పోరలకు, చివరికి పోస్ట్‌మ్యాన్ పోలీస్ కానిస్టేబిల్‌కు ఇలా పలురకాల జనంకు ఆమె పసుపు తీసుకొని కొంతమంది నుదురుల మీద పూస్తది; కొంతమంది తలలమీద ముట్టిస్తది; కొంతమంది దోసిళ్ళలో పడేస్తది; మహిళల మంగళసూత్రాలకు, జుట్టు ముడికి, వాళ్ళ చెంపలకు పసుపు పులుముతది.

"శ్రేష్ఠంగా ఉంది తీసుకో"

"తల్లి మంచినే చేస్తది పుచ్చుకో"

"పట్టుకో భద్రంగా పసుపును... సవదత్తిలో ఉండే రేణుక ఎల్లమ్మ దేవి పరసాదం (ప్రసాదం)" అని ఒత్తిడి చేస్తది.

ఎవరు కోరినా కోరకపోయినా ఆమె తన పని తను చేసుకెళ్తది. ఆమె ఆ ముఖ్య వీధికి వచ్చిందంటే ఎక్కడెక్కడో పసుపు ఇచ్చిన జాడలు కనబడుతవి. మొత్తం ఆ పరిసరం, రోడ్డు, కట్టడాలు, లైటుస్తంభాలు, వాకిళ్ళు కిటికీలు, తిరుగుతుండే జనం పసుపుమయమై పోతారు. ఎల్లమ్మ దేవి ప్రసాదంలోని ఆ పసుపు వర్ణం అంతట్నీ ఆవరించుకొని పసుపుమయంగా చేస్తది. రభసగా వీసిన గాలి తన వశంకు

కసుపుగాసం తీసుకొన్నట్లే ఆ మహిళ కూడా అక్కడ ప్రధానవ్యక్తిగా మారి గుర్తించుకోబడుతుంది కదా!

ఇది నాకు వింతగా అన్పించింది. జతగా ఆమెలోని జోగిని వ్యక్తిత్వం, ఆమె ప్రవర్తన, అందరికీ ప్రసాదం ఇచ్చే క్రియ నాకు చిత్రంగా ఉంది.

"యల్లమ్మతల్లి... నీ పాదాలకు దండాలు తల్లో దండాలు" అంటూ అరిచే ఆమె స్వభావం నాకు సంతసాన్ని కలుగజేయలేదు. బ్యాంకు ఛేంబరులో నేను సురక్షితంగా ఉన్నందున మరిక నేను బ్యాంక్‌కు వచ్చేటప్పుడు, పని ముగించి వెళ్ళేటప్పుడు ఆమె రోడ్డు మీద కనబడనందున నేను దీని గురించి ఎక్కువగా తలచెదుపుకోలేదు. భిక్షవేడుకొంటున్నప్పుడు దేముడ్ని ముందు పెట్టుకొని భక్తుల నుంచి దోచుకొనే క్రియలలో ఇదీ ఒకటైయుండొచ్చని నేను మిన్నకుండి పోయానులే! ఆ జోగిని నిత్యం నాకు కనబడుతుంది ఏదోఒక వేళలో. అయితే నాకూ ఆమెకు నడుమ ఒక గోడ ఉంది. ప్రస్తుతానికి నేను సురక్షితం అనుకొన్నాను.

నేను, నా బ్యాంక్‌కు చేరుకొన్న ఎనిమిదో రోజు ఒక ఘటన జరిగింది. "దండాలు దండాలు తల్లో ఎల్లమ్మదేవి" అని రాగబద్ధంగా పాడుతూ ఆ మహిళ సునామిలాగ బ్యాంక్ లోపలికి దూసుకొచ్చింది. నేరుగా నా ఛేంబరు తలుపు నెట్టి నా ఎదురుకే వచ్చి నిలబడింది. నిలబడిన ఆ మహిళ తలెత్తకనే తన నడుం నుంచి, చీరకొంగున ముడేసిన గంటు నుంచి, మెడలో ఉన్న పసుపు సంచి నుంచి, ఇంకా మరెక్కడ్నుంచో నోట్లు నాణాల్ని తీసి తీసి నా టేబిల్ మీద కుమ్మరించింది. నోట్ల జతగా బండార (పసుపు పరసాదం) కూడా టేబిల్ మీద చెల్లా చెదురై పడింది.

"తీసుకోండి సార్... ఎంతుందో లెక్కచూసి నా ఖాతాలో జమ చేయండి." అంది ఆమె. అలా చెపుతూ తలెత్తి నా ముఖంచూసింది.

"అరెరె శంకర ఉళ్ళాగడ్డి సార్ ఇక్కడ లేరా... పొరపాటైంది నానుంచి... మీరు కొత్తగా వచ్చారా?" అని అడిగింది. శంకర ఉళ్ళాగడ్డిగారు నేను ఇక్కడికి వచ్చి మేనేజర్‌గా బాధ్యతలు తీసుకొనేముందు ఉన్న సార్ కదా! వారు ట్రాన్స్‌ఫరై నేను ఇక్కడికి వచ్చింది ఈ మహిళకు తెల్సి ఉండలేదు. వారు మరోపట్టణంకు వెళ్ళారు. నేను కొత్తగా వచ్చాను అనేదాన్ని చెపుదామనుకొన్నా, ఆమె నా ఛేంబరుకు వచ్చిందే ఒకింత కోపాన్ని అసహనాన్ని కలిగించింది. నోట్లను నాణాల్ని కుప్పగా కుమ్మరించింది. సుందరమైన నా ఛేంబరు పసుపు మయమై, దాని వాసన వ్యాపించుకొంటదేమో అని నేను గాబరాపడ్డాను.

అంతలో ఒక గుమాస్తా పరిగెత్తుకొంటూ వచ్చాడు.

"సార్... ఈమె దాసవ్వజోగిని అండి... ఈమె పొదుపు ఖాతా మన బ్యాంక్‌లో ఉందండి" అంటూ ఆమె వివరాలు తెల్పాడు.

"అలాగా... అలాగైతే ఈ రొక్కాన్ని లెక్కించి ఈమె ఖాతాలో జమచేయండి" అన్నాను నేను ప్రస్తుతం ఆమె ఇక్కడ్నుంచి తొలగిపోతే చాలు అన్నట్లుగా.

"మీరు కొత్తగా వచ్చిన సార్ అని నాకు గుర్తుకాలేదండి! వారంలో ఒక రోజు వస్తాను నేను. నా చేతిలో ఎంత రొక్కం ఉందో దాన్నంతా నా ఖాతాలో జమ చేస్తుంటాను. చూడు తమ్ముడా... రొక్కాన్ని మంచిగా లెక్కించు... అప్పటిదాకా నేను ఇక్కడే కూర్చుంటాను" అంది ఆమె.

ఆమె మరిక నా ముందున్న గాడ్రేజ్ కుర్చీని లాగి కూర్చుంది. నా ఛేంబరులోని శోభ అంతా పాడై పోయింది కదా అని నేను పేచీలో పడ్డాను. ఆమె మెడలో ఉన్న సంచి నుంచి పసుపు పొడి జారి నా టేబిల్ మీదంతా పడింది. బహుశః వెనకటి మేనేజర్ ఈ అభ్యాసాన్ని సహించుకొన్నాడేమో అని నేను భావించాను. లేకపోతే ఈమె ఇంత చనువుగా ప్రవర్తిస్తుదా?

గుమాస్తా డబ్బు లెక్కించాడు. నూట పదిహేను రూపాయలు ఉన్నవి. చలాను నింపి డబ్బు జమ చేసేందుకు అతను వెళ్తుండగా ఈ మహిళ లేచింది.

"వస్తాను సార్" అంది.

"చలానా తీసుకొని వెళ్ళు"

"అవసరం లేదండి... మీరు మోసం చేస్తారా నాకు?" అంది.

నిలబడిన ఆమె చేయి మెడలో వేలాడుతున్న పసుపు సంచి వైపుకు జొరబడినప్పుడు నేను తల్లడిల్లిపోయాను. ఏసుక్రీస్తు తప్పితే వేరొక దైవాన్ని నమ్మని ఒప్పుకోని నా మనస్సు గలిబిలి అయ్యింది. ఆమె దీన్నేమి తెల్సుగోకనే చేతి వేళ్ళ నుంచి పసుపు పరసాదం పట్టుకొని "పుచ్చుకోండి సార్... యల్లమ్మ తల్లి బండార" (పసుపు) అంది.

"వద్దు... నేను దీన్ని పుచ్చుకొనేది లేదు" అంటూ ఖడాఖండితంగా నిరాకరించాను. ఆమె నేత్రాలు ఆశ్చర్యం నుంచి విప్పారినవి. ఇస్తున్న పసుపును నిరాకరించిన మొట్టమొదటి వ్యక్తిగా నేను ఆమెకు కనబడియుండొచ్చు. ఇందుచేత ఆమె "వద్దనకూడదు సార్... ఆ జగన్మాత రేణుక ఎల్లమ్మదేవి మిమ్మల్ని సదాకాపాడుతది... పుచ్చుకోండి" అంటూ రెండోసారి తన చేతిని ముందుకు చాపింది.

"వద్దని చెప్పానుకదా...!" అని నేను కొంచెం కటువుగా పలికాను.

ఆమెకు అవమానం అయ్యిందేమో! ఒక క్షణం అటు ఇటు తేరిపారా చూసింది.

నేను నా కుడి వైపున్న స్ట్యాండ్ మీద ఏసుప్రభువుకు చెందిన పటం ఒకదాన్ని ఉంచుకొన్నాను. అది నా ఛేంబరులో నా ప్రక్కనుండే పటంగా ఉంది. ప్రభువు నాకు శక్తిని ఇస్తూ వచ్చాడు. ఆ పటం ఆమె కంట్లో పడిన తక్షణం మరిక ఆమె చేతి వేళ్ళలో ఉంచుకొన్న పసుపును తన సంచిలో వేసుకొంది.

"అలాగేతే సరేనండి..." అంది ఆమె. అలాగున అంటూ ఆమె పటం వైపుకు తిరిగి నిలబడి "నా స్వామి ఇక్కడ కూడా ఉన్నాడు కదా" అంటూ చేతులు ముడిచింది.

"అయ్యగారు నాకు అంతా బోధించారు; ఈ స్వామి కత నాకు బాగానే గుర్తుంది..." అంటూ ఆమె ఎంతో మమత నుంచి పలికింది.

శుంఠలాగ నిలబడిపోయే స్థితి ఇప్పుడు నాకు అయ్యింది. నా ప్రవర్తనకు తద్విరుద్ధ రీతిలో ఈ మహిళ ప్రవర్తించింది కదా! రేణుక ఎల్లమ్మ గురించి నాకు ఏమి తెల్వదు. తెల్సుకోవాలనే ఆసక్తి లేదు. దాని బదులుగా ఈ మహిళలోని ధర్మ ఆచరణ విషయంలో ఒక విధమైన జుగుప్స మొదట్లో నాకు ఉండేది. అయితే ఇప్పుడు ఈ జోగిని చూపించిన ప్రతిక్రియ నన్ను అగాధంలోకి నెట్టింది.

అయ్యగారు అని ఆమె చెప్పింది మాకు గురువుగా ఉన్న చర్చిలోని బోధకుడు గురించి కదా! దీని మీద ఆమె నుంచి మరింత సమాచారం తెల్సుకోవాలి అని అనుకొంటున్నప్పుడు ఆమె "వస్తాను సార్" అంటూ నా ఛేంబరు నుంచి బయటకు వెళ్ళిపోయింది. కిటికి మూలకంగా ఆమె రోడ్డులోకి దిగుతుంది చూసాను. అలాగే ఆమె రోడ్డులో పోతున్న జనంకు బండార ఇస్తూ "తల్లో తల్లో రేణుకమ్మ" అంటూ చెపుతున్నదాన్ని విన్నాను. ఇలాగున పసుపు ఇస్తూ పూస్తూ తల్లో తల్లో రేణుకమ్మో అంటూ రోడ్డుకు ఉన్న ఆ చివరి అంచులో ఆమె కనుమరుగైంది.

మరిక ఆ రోజు నా అభ్యాస పనుల్ని ముందుకే సాగించేందుకు కొంచెం సమయం పట్టింది. పెద్ద కొండ ముందు నిలబడి ఏదో ఒక పిచ్చుకేక బిగ్గరగా పెట్టి అరిచినప్పుడు, అదే కేక ప్రతిధ్వని చేస్తూ మళ్ళా మళ్ళా నా చెవిలో పిడుగు మ్రోతలాగ పడినట్లై అయోమయ స్థితి ఎదురైంది కదా నాకు ఇప్పుడు.

ఆదివారం చర్చికి వెళ్ళాను నేను. పట్టణంకు కొత్తోడినైనందున అందరూ నన్ను కుతూహలంగా చూస్తున్నారు. కొంత మంది మాట్లాడారు కూడా! నేను నా స్వపరిచయం చెప్పుకొన్నాను. ప్రార్థనకని బోధకుడు నన్ను స్వాగతించారు. నా గురించి సభలో (హాలులో) జమైన జనంకు చెప్పారు. ప్రార్థన ముగసిన తదుపరి జనం చెదిరిపోగా నేను మతాచార్యుడి దగ్గరకు వెళ్ళాను.

మతాచార్యుడికి వయస్సైంది. కొంచెం నిదానంగా ఉన్నారు. దైవభక్తినుంచో దైవ భీతి నుంచో వంగిపోయిన దేహంతో ఉన్న వారి కనులలో ఎంతో ప్రీతి ఉంది. నా గురించి మరోమారు వివరంగా అడిగారు.

"ప్రస్తుతం ఒకడ్నే ఉన్నాను... ముందు భార్యా బిడ్డల్ని తీసుకొని రావాలి... పాత మేనేజర్ ఇంకా ఇల్లు ఖాళి చేయలేదు... అప్పటిదాకా హోటెల్‌లోనే నివాసం... భోజనం కూడా అక్కడే..." అన్నాను నేను! మాటల మధ్యలో "మీ గురించి మూడు రోజుల క్రితం విన్నాను" అని చెప్పాను.

"ఎవరు చెప్పారు నా గురించి?"

"ఆ జోగిని"

"ఓ!" అంటూ వారు ఉద్గరించారు.

"ఏసుప్రభువు గురించి మీరు ఆమెకు అంతా బోధించారట" అన్నాను.

"ఆమె మరిక ఏమి చెప్పలేదా?" మతాచార్యుడు నన్ను ప్రశ్నించారు.

"మరింకేమి చెప్పలేదండి...ఏసుస్వామి విషయం నాకంతా తెల్సిందిలే" అని చెప్పిందంతేనండి!

"ఆమె... అసామాన్య మహిళ. మనం ఆమె నుంచి నేర్చుకొనేది ఎంతో ఉంది" అన్నారు గంభీరంగా బోధకుడు.

"సేవ... ప్రీతి... ప్రేమ... త్యాగం... కరుణ... జాలి... ఇదంతా మనకు మాత్రమే తెల్సి ఉంటదనే భ్రమలో మనం ఉంటాము. అయితే ఇవి ఎంతో మంది పాలుకు వారి జన్మజాత గుణంగా అయ్యుంటది. ఎవరి ప్రభావంకు లోబడకనే కొంతమంది మానవ సేవ చేస్తారు... పక్కనున్నోళ్ళను ప్రీతించుతారు... ఎంతో మట్టంలో త్యాగం చేస్తారు... ఈ నా పలుకులకు ఆమె మంచి ఉదాహరణ..." అంటూ వారు మాటల్ని కొనసాగించారు.

❖ ❖ ❖

ఏబై సంవత్సరాలు అయినవని భావించినప్పుడు వారి అర్ధాంగైన ప్రేమాబాయమ్మ మోకాళ్ళ నొప్పుల నుంచి బాధపడసాగిందట. ఏమేమి ఆయుర్వేదం అలోపతి ఔషధం ఇప్పించినా ఆమె వ్యాధి నయంకాలేదు. ఇదే సందర్భంలో ఒకనాడు ఇంటి అల్మారాలో పైన పేర్చిపెట్టిన డబ్బా ఒకదాన్ని తీసి తెచ్చేందుకు ప్రయత్నించిన ప్రేమాబాయమ్మ క్రిందపడి పోయారు. కుడికాలులోని ఎముక చిట్లింది. నిలబడేది తిరిగేది ఆమె నుంచి కావట్లేదు. ఆమె చేస్తుండే అన్ని పనులకు ఎవరైనా ఒకరి సహాయం తప్పని సరిగా కావాల్సిఉంది. ఇటువంటి దుస్థితి వచ్చింది బోధకుడిగారి

అర్ధాంగికి. ఇలాగైందని కొందరు ఆమెకు సహాయపడాలని వచ్చారు. ఈ సహాయం ఒకట్రెండు రోజులు దొరికింది. మూడో రోజునా రాగలరని భావించినోళ్ళు రానేలేదు కదా! వాళ్ళకూ వాళ్ళ వాళ్ళ పనులు ఉంటవికదా! మతాచార్యుడు నలిగిపోయారు. ఇంటి పనుల్ని చేసుకొని పోయే సామర్థ్యం వారిలో ఉంది. అయితే ప్రేమాబాయమ్మ దేహసేవ చేసేవారు ఎవరు? దానికని అవసరపడే శక్తి వారిలో లేదు.

"ప్రభూ ఇదేంటి ఇలాగైంది" అంటూ వారు కొరగుతున్నప్పుడు ఈ జోగిని వచ్చింది.

"నేను వచ్చాను కదా... వదిలేయండి దుఃఖాన్ని" అంది ఆమె.

ఆ మహిళలో ఆమెకు చెందిన వ్యక్తిగత పనులే ఎన్నో ఉన్నవి. సూర్యోదయమై వెలుగు కిరణాలు విచ్చుకొంటున్నవి అని అనుకొంటున్నప్పుడే ఆమె మతాచార్యుడి ఇంటిద్వారంకు వచ్చి చేరుతుండేది కనబడుతుందికదా!

"బాయమ్మా... నేను వచ్చానులే" అంటూ ప్రేమాబాయమ్మను స్నానం గదికి మోసుకెళ్ళి ముఖమార్జనం, దంతమార్జనం చేయించి ఆమె బట్టల్ని మార్చుచేసి లోపలికి తీసుకొచ్చి కూర్చుండబెట్టి టిఫిన్, కాఫి తినబెట్టి తాపి ఆ తర్వాత "నేను ఇక వెళ్ళి మళ్ళా వస్తాను బాయమ్మా" అని చెప్పి వెళ్తుండేది.

"పట్టణంలో ఒక చుట్టు(రౌండు) తిరిగి వచ్చాను బాయమ్మా" అంటూ మెడలో ఉన్న పసుపు ప్రసాదం సంచిని తీసి గోడకున్న మేకులో వేలాడదీసి "జలకం ఆడుతారా (స్నానం చేస్తారా) బాయమ్మా... నేను చేయించుతాను" అంటూ చీరను కొంచెం పైకెత్తి నడుంలో దోపుకొని సిద్ధమైయ్యేది ఆ జోగిని.

"నీళ్ళు మరింత వేడిగా ఉన్నవా... కొంచెం చన్నీళ్ళు కలపనా? మీరేమి సిగ్గుగిగ్గుపడకండి... ఈ పనంతా చేస్తుండేది నాకు అభ్యాసమే..." అంటూ ఆమె ప్రేమాబాయమ్మను ముక్కాలు పీఠ మీద కూర్చోబెట్టి నలుగు పెట్టి స్నానం (జలకం) చేయిస్తుండేది. దేహాన్ని మంచిగా రుద్దేది. వీపు భాగాన్ని తోమితోమి రుద్ది నీళ్ళు పోస్తుండేది.

"మీరేమి సిగ్గుపడొద్దు... ఏమేమి చేయాలో చెప్పండి... నేను మీ తల్లిలాగ సేవచేస్తాను" అని అంటుండేది.

ప్రేమాబాయమ్మకు ఒక విధమైన లజ్జ ఉండేది. తన జాతికి చెందిన సంబంధీకురాలు కాదు, ఇంటి పనులు చేసే పని మనిషికాదు. అయితే తనకు చెందిన సమస్త దేహపనుల్ని చేస్తుంది కదా అనే భావం లజ్జ ఆమెలో ఉంది.

అయ్యగారికి (బోధకుడికి) అంతేనండి!

వారికి స్నేహితులు ఉన్నారు. బంధు బలగం ఉంది. వారంతా వచ్చి చూసి జాలిపడి వెళ్ళారంతే! అయ్యగారైతే ఎవరైనా పని మనిషి దొరికొచ్చేమో అని ఎదురు చూసారు. రోజంతా ఆమె సేవలో ఉండేది మా నుంచి కాదని కొంతమంది చెప్పారు. ఇదే ఒక జ్వలంత సమస్యగా అయినప్పుడు దేవమాతలాగ జోగిని వచ్చి బాయమ్మ సేవకని నిలబడింది.

ఆమె నుంచి సేవ ఆరు నెలల పాటు కొనసాగింది.

అయ్యగారు వేకువనే ఇంటికి వస్తుండే జోగినికని కాఫి చేసి ఇస్తుండేవారు.

"జొన్నరొట్టెలు... అలసందకూర చేసాను... భోజనం భుజించి వెళ్ళు" అని అభ్యర్థించేవారు.

"కాఫి ఇవ్వండిచాలు... భోజన విషయం ప్రస్తావించకండి! నా భోజనం ఎక్కడైనా అవుతది..." అని చెప్తూ నవ్వుతుండేది జోగిని.

ఈ సేవా సందర్భంలోనే ఆమె ఏసుక్రీస్తు మీద ఆసక్తి చూపెట్టింది.

అయ్యగారు (మతాచార్యుడు) ఇంటిలోపల నిలువెత్తు క్రీస్తు పటాన్ని వేలాడ దీసారు. ఏసుక్రీస్తు గొర్రె పిల్లను భుజంమీద పెట్టుకొన్న దృశ్య పటంగా అది ఉంది. ఒకరోజు ఈ మహిళ ఆ పటంను తదేకదృష్టి నుంచి చూసింది.

"ఏసుప్రభువు...మనందరికీ రక్షకుడు" అన్నాడు మతాచార్యుడు భావపరవశుడై.

"అయ్యగారు... ఆ స్వామి కురుబ (కురి అంటే గొర్రె; కురిలను పోషించేవారు కురుబ కులస్థులు) కులస్థుడా?" అని ముగ్ధతనుంచి అడిగింది ఆ జోగిని.

"కాదమ్మా... ఇతను యహోది... అది ఇజ్రేల్ దేశంలో ఒక జాతి..." అన్నారు వారు.

గొర్రెను (కురిని) ఎత్తుకొన్నాడు అనిన మీదట కురుబ కులస్థుడేనండి... అంటే మా జాతోడే" అంటూ ఆమె ఆకు వక్క జతగా తంబాకు పొడిని నోట్లో వేసుకొంది.

ప్రతిరోజు ఏసు గురించి కొద్ది కొద్దిగా చెప్పసాగారు అయ్యగారు. ఏసు ప్రభువు పుట్టుక, అతనినుంచి జరిగిన అద్భుతాలు, అతను చెప్పిన నీతి కథలు, అతని బతుకులోని పలు ఘట్టాలు, మానవాళికి అతను చేసిన బోధన... ఇలా ఏసుక్రీస్తులోని చరిత్రను ఆమె ముందు విశదీకరించారు.

"దొడ్డ(గొప్ప) మనిషండి వారు... ఎటువంటి నీతి వాక్యాల్ని చెప్పాడో కదా..." అంది ఆమె ఆశ్చర్యపడుతూ.

ఏసుక్రీస్తుకు చెందిన కథల్ని విని ఆమె తలూపుతుండేది.

"మా అమ్మకూడా ఇలాగేనండి... ఎన్నో నీతి కథల్ని చెప్తుండేది సార్" అంది ఒకరోజు.

"ఏసుక్రీస్తులోని చివరి దినాల మీద ఆమెలో అపారమైన కరుణ రసం ఉప్పొంగింది.

"నేను అనుకొంటుంది ఇలాగేనండి... మంచోళ్ళకు ఈ దుష్టజనం సుఖాన్ని కల్గించేదిలేదు... ఇలాగున ఏదేదో చేసి వారిని సంహరిస్తారు..." అంటూ విలవిలలాడింది.

"మళ్ళా నేనొక మాట చెప్పనా సార్" అంటూ అయ్యగారినే అడిగింది.

"చెప్పుతల్లి"

మీరు తప్పుగా అనుకోనంటే చెప్తాను సార్"

"నేనేమి అనుకోను, చెప్పమ్మా..."

"నేనేమి ఎక్కువగా తెల్సుగోక పోయినా నాకు అన్పిస్తుంది చెప్తాను సార్... ఒక మనిషి గొప్పోడిగా అవ్వాలంటే... అతను బతికి యున్నప్పుడు మాత్రమే గొప్పోడిగా అయ్యేది చాలదు... మరణంలోనూ అతను గొప్పోడిగా అవ్వాలి... కాదా చెప్పండి సార్..."

అయ్యగారు ఆమె నుంచి వచ్చిన మాటకు తలూపారు. ప్రేమాబాయమ్మ కూడా తలూపింది.

ఎన్నోసార్లు అయ్యగారు జోగినికి డబ్బు ఇచ్చేందుకు సిద్ధమైయ్యారు. వంద రూపాయల మూడు నోట్లను ఆమె ముందు ఉంచి "నువ్వు ఈ డబ్బు పుచ్చుకో తల్లి" అన్నారు.

"నేను చేసిన పనికి డబ్బు ఇచ్చేందుకు సిద్ధమైయ్యారా సార్? నాకు డబ్బు వస్తదని ఈ సేవ చేయలేదండి... మానవసేవే మాధవసేవ అని భావించి చేసానండి..." అంటూ మేకులో వేలాడదీసిన పసుపు ప్రసాదం నింపిన సంచి తీసుకొని మెడలో వేసుకొని బయటకు వెళ్ళిపోయింది ఆ ఘన మహిళ (జోగిని).

ఆరు నెలల తర్వాత ప్రేమా బాయమ్మ ఆరోగ్యం కుదుటబడింది.

"నేనిక నా పనుల్ని చేసుకోగలను" అంది ప్రేమాబాయమ్మ జోగిని ముందు.

"అంటే నేనిక మీ ఇంటికి వచ్చే అవసరం లేదా?" కిసుక్కున నవ్వి అడిగింది ఆమె.

"అలాకాదమ్మా... నువ్వు ఎప్పుడు అనుకొంటే అప్పుడు రా... ఈ ఇల్లు నీదే" అంది ప్రేమాబాయమ్మ.

“ఇప్పుడూ వస్తుంటది ఆమె... ఒకగంట గడిపి వెళ్తది... క్రీస్తు ప్రభువు కథ వింటది” అని అయ్యగారు మాట ముగిస్తూ లేచారు.

“మనం ఊకదంచినట్లు మాట్లాడుతాం... ఆమె చేతలలోనే మాటల్ని మీరి పరోపకార సేవాకార్యం చేస్తది... ఆమె సేవ అనంతం...” అంటూ ఆమె కత గురించి చెప్పారు మతాచార్యుడు.

నేనిక మతాచార్యుడికి నమస్కరించి బయల్దేరాను నా హోటెల్‌కు.

❖ ❖ ❖

సోమవారం నుంచి మళ్ళా యథాలాపంగా బ్యాంక్‌లోని కార్యకలాపాలు నా అదుపాజ్ఞలలో నడవసాగినవి. అదేసేవ, అదే కోలాహలం, వాహనాల జోరు, జనం, పిల్లలు వీళ్ళ నడుమ పరసాదం పంచే జోగిని.

“సవదత్తి (బెళ్గాం జిల్లాలో ఉండే తాలుకా పట్టణం, ప్రముఖ పుణ్యక్షేత్రం) రేణుక ఎల్లమ్మ తల్లీ... నీ పాదాలకు దండాలు తల్లో దండాలు”.

“మంచి అవుతది... పుచ్చుకోండి”

“ఆ తల్లి మీకు మంచే చేస్తది, తీసుకోండి”

“పట్టుకోండి మంచిగా బండార (పసుపు)... సవదత్తి ఎల్లమ్మ తల్లి పరసాదం (ప్రసాదం)”

నేను ఛేంబర్‌లో కూర్చుని చూస్తున్నాను ఆమె క్రియను. ఆమె వచ్చిందంటే వాతావరణం మార్పుచెందుతది. అయితే ఆమె బ్యాంక్ లోపలకు వచ్చేదిలేదు. ఆమెలోని భక్తితో నిండిన మాటవ్యవహారం అంతా బయట ప్రపంచంకే వినియోగించబడుతుంది.

అయినా వారంలోని చివరి రోజు శనివారంనాడు ఆమె బ్యాంక్‌లోపలికి వచ్చింది. నేరుగా వాకిలి నెట్టుకొని నా ఛేంబరుకు వచ్చింది.

“రా అమ్మా... రా” అన్నాను.

నడుంనుంచి, చీర కొంగు ముడి నుంచి, పుసుపు ఉన్న సంచినుంచి నోట్లు నాణాల్ని తీసి టేబిల్ మీద కుప్పగా కుమ్మరించింది.

“తీసుకోండి సార్... ఎంతుందో లెక్కించి చూసి నా ఖాతాలో జమ చేయండి” అంది.

నేనే ఖుద్దుగా డబ్బు లెక్కిస్తుంటే గుమాస్తా పరుగుపెట్టూ వచ్చాడు. అతను తన పనిని నిర్వహిస్తున్నప్పుడు ఈమె నా ముందున్న కుర్చీ లాక్కొని కూర్చుంది. నేను సంతోషంగా ఆమె ముఖం చూడసాగాను. చేతికి గాజులు, మెడలో అభరణాలు, నుదుటి మీద పెద్ద కుంకుమ బొట్టు, పెదాలలో తాంబూలం నమిలిన ఎరుపురంగు,

ముఖం మీద ముడతలు, చెదిరిన తలకేశాలు... ఈసారి ఎందుకో ఆమె రూపం నాకు దేవి మాతలాగ ఆకర్షణీయంగా కనబడింది. ఆమె మీద నాకు పుజ్యభావం కలిగింది.

"నూట ఏభై రూపాయలు" అన్నాడు గుమాస్తా.

"అలాగైతే నేను వెళ్ళివస్తాను" అంటూ లేచి మళ్ళా "వెళ్ళి వస్తాను సార్" అంది. ఇలా చెపుతున్నప్పుడు ఆమె నా కుడిపక్కనున్న ఏసుప్రభువు పటం చూసి చేతులు జోడించింది. నావైపుకు వెన్నుపెట్టి బయల్దేరుతుండగా, అమ్మా అంటూ కేక పెట్టి పిల్చాను నేను.

"బండార (పసుపు ప్రసాదం) ఇచ్చేది లేదా నాకు?" అంటూ వినీతుడ్నై చేయి చాపాను.

**మూలకథ రచనాకాలం : 2000**

# నాయకుడికి వారసుడు జన్మించాడండి!

ఆస్పత్రికి చేరుకొని కొన్ని గంటలే అయినవి. తీవ్రంగా కలిగిన నొప్పి అప్పటికప్పుడే ప్రసవం అవుతదో కాదో అన్నట్లుగా నడుంలో బాధ కలిగించింది. అబ్బబ్బా ఆ బాధ... ఇప్పుడు తలుచుకొంటే భయం వేస్తుంది. చుట్టూ వైద్యులు నర్సులు ఉన్నారనే సమాధానం మధ్యా ఆ బాధ గుర్తుకొస్తుంటే నుదుటి మీద స్వేద బిందువులు ఏర్పడుతున్నవి కదా!

నగరంలోని సుసజ్జిత ఆస్పత్రిలో ఉండే విశేషవార్డు; ముఖ్య వైద్యులే అరగంటకొకసారి వచ్చి చూసుకొని వెళ్తున్నారు. పరదా ప్రక్కన తనకోసం సేవ చేసేందుకు నర్స్ ఒకామె కూర్చుని ఉంది. ఎమెర్జెన్సి చికిత్సకని పలు పరికరాల్ని తెచ్చి వార్డులో జోడించి పెట్టారు.

అప్పుడప్పుడు ఆయమ్మ వచ్చి పరదా తొలగించి మెడ చాపి తనను ముసిముసిగా చూసి నవ్వి మాయమౌతుంది. సగం చదివి ముగించిన నవలను చేతిలో పట్టుకొని వస్తున్న నర్స్ నా మంచం నుంచి కొంచెం దూరంలో నిలబడి ఐదు పది నిమిషాలు మాట్లాడి వెళ్ళింది.

“నొప్పి కొంచెం తగ్గింది కదా! అది ఇలాగే ఉంటది. మళ్ళా నొప్పులు వస్తే కాన్పు అవుతదిలే! భీతిల్లకండి”

“అయ్యయమ్మో... మీకన్నా మీ ఇంటి యజమానే (భర్తే) బెదురుగొడ్డుగా ఉన్నారు. వారిని సమాధాన పరిచి పంపేందుకు పెద్ద డాక్టరు గారికే అలుపేసి పోయింది...”

“ఇప్పుడే ఫోన్ వచ్చింది... పార్టి ఆఫీసునుంచి!... ఐదు గంటల దాకా వారు అక్కడే ఉంటారట”

“తాగేందుకు ఏమైనా పండ్ల రసం ఇవ్వనా?”

“ఏదైనా వారపత్రిక చదువుతారా?”

“కిటికి చెంత కుర్చీ వేయనా... బయటున్న సుందర దృశ్యాల్ని చూడొచ్చు... మంచిగాలి వస్తది”

ఈమె దిండుకు ఒరిగి కూర్చుని సౌజన్యంకు అన్నట్లుగా నవ్వింది. నర్స్ అటువెళ్ళిన పిమ్మట ఈమె ముఖం మళ్ళా నల్లబడింది. చేతిని బారుగా చాపి

మృదువుగా తన నడుం గర్భం పై నుంచి తొడల వరకూ స్పర్శించుకొంది. గర్భంలో ఉన్న శిశువులోని కులుకు ఆట, తన్నులు కొన్ని రోజుల నుంచి అధికమైంది. వైద్యుల ప్రకారం ఈ రోజు రాత్రి పురుడు అయ్యేదుంది. ఈ రోజు రాత్రి...

వారి (నాథుడి)లో ఎన్నో సంవత్సరాల కల ఇది....

తనది కూడా...

అయితే ఈ కల వెనుక ఏదో ఉంది కదా! దాన్ని గుర్తుకు తెచ్చుకొంటే తనువు కుంచించుకుపోతది. తలవాల్చాలని అన్పిస్తది. ఈ కలకు ఏమి విలువలేదని అన్పిస్తది. వీరి జతగా గడిపిన ఈ పది సంవత్సరాలు వ్యర్థమైనవేమో అని అనుకొంటున్నా నేనిప్పుడు.

తలుపు చప్పుడైంది.

నవ్వుతూ లేడి డాక్టరమ్మ లోపలికి వస్తుంది. ఆమె చేతిలో ఒక కాగితం.

"మేడం... ఇప్పుడు నాకు ఫోన్ కాల్ వచ్చింది. ప్రెసిడెంట్‌గారు ఫోన్ చేసారు"

ఈమె తలెత్తి చూసింది. ముఖం మీద తెచ్చిపెట్టుకొన్న కృతకమైన నవ్వు ఆ డాక్టరమ్మలో ఉంది.

"చూడండి మేడం...వారు ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు వెనుకబడిన తరగతుల మండలికి చెందిన ఆఫీసు మీటింగ్‌లో గడుపుతారట. ఏడు నుంచి ఎనిమిది గంటల దాకా సి.ఎం.గారి ఇంట్లోనట. తొమ్మిదిగంటల దాకా మళ్ళా పార్టీ ఆఫీసులో, పది గంటలన్నప్పుడు షుగర్ ఫ్యాక్టరీలో జరిగే లేబర్ మీటింగ్... ఆ లోపు ప్రసవం కాకపోతే పదకొండు గంటలన్నప్పుడు ఇక్కడికి వస్తారట".

కులుకుతూ నవ్వుతూ డాక్టరమ్మ తన పతిరాయుడితో చెప్పిందేమిటంటే "మీరు మీ మీటింగ్‌లన్ని ముగించుకొని నిశ్చింతతో ఇక్కడికే రండి... మా అనుభవసార ప్రకారం కాన్పు కచితంగా పదకొండు గంటలకు అవుతది" అని చెప్పిందట.

"ఇక మీరేమి చెప్పుతారు" అని మరో మారు అడిగింది ఆ డాక్టరమ్మను ఈమె!

నవ్వే ప్రయత్నం చేస్తూ ఆ డాక్టరమ్మా "నేను ఇక్కడ ఎంతోమంది ప్రముఖ రాజకీయ నాయకుల అర్ధాంగులకు కాన్పు చేసాను. అయితే వారెవరూ మీ ఆయన (భర్త) లాగ అంత ఆత్రంగా గడిబిడి చేయలేదు. మిమ్మల్ని ఎంతో లైక్ చేస్తారు కదా... గుడ్... గుడ్" అంటూ ఆమె చెంతకొచ్చి బుగ్గలు నిమిరింది.

"భయపడేది ఏమి లేదు. కొంచెం నిద్రపోండి. పుట్టబోయే బాలుడు ఎంతో తుంటరి. అతను ఉత్తిగనే ఈ లోకంలోకి వచ్చేది లేదు. సిస్టర్ అక్కడుంది, ఆయమ్మ బయట ఉంది. నేను డ్యూటి మీదే ఉన్నాను. అవసరమైతే బెల్ నొక్కండి. శీఘ్రంగా మేము వస్తాం. విశ్రాంతి చేసుకోండి" అంది డాక్టరమ్మ.

తలూపాను.

డాక్టరమ్మ నవ్వుతూ వైయ్యారంగా హంస నడకతో వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిన పిమ్మట ఈమె భారంగా నిట్టూర్పులు వదిలింది.

❖ ❖ ❖

డాక్టరమ్మ ఏదేదో చెప్పివెళ్ళింది.

ప్రసవం అయిన తక్షణం తనకు కబురు ముట్టించేందుకని తను ఎక్కడెక్కడ ఎంత పొద్దుకు ఉంటాను అనే దాన్నంతా వివరంగా తెల్పారట మా వారు?

ఔను! వారికి ఎంతో ఆత్రం... ఈ ఆత్రం హడావుడిలో దాగిన మనోభావాన్ని డాక్టరమ్మా తప్పుగా అర్థం చేసుకొంది. "ప్రెసిడెంట్ గారు... మిమ్మల్ని ఎంతో గాఢంగా లైక్ చేస్తున్నారు కదా" అని "గుడ్ గుడ్ వెరీ గుడ్" అనే దాన్ని చేర్చింది.

రాజకీయ నాయకులు తమ జీవనంలో ఒకే ఒకదాన్ని ఎప్పుడూ లైక్ చేస్తుండేది అధికారంనే కదా! ఈ అధికారంకు సంబంధపడిన వేరే ఏదైనా ఉంటే దాన్ని వారు లైక్ చేస్తారు. వారి పరమోచ్ఛ గురి అధికార పీఠమే! దీన్ని ముట్టేందుకు మిగిలిన వాటినన్నిట్నీ ఉపయోగించుకొంటారు. డాక్టరమ్మ మాత్రమే కాదు మిగిలిన జనం కూడా రాజకీయనాయకుల్ని అపార్థం చేసుకొనేది ఇక్కడే! మహిళను వశం చేసుకొనే ప్రయత్నంలో మునిగి, ఆ మహిళ సాకిన శునకాన్ని ముద్దించుతాడు. అతనూ శునకాన్ని ప్రీతిస్తున్నాడు అనేది అందులో దాగిన అర్థం కాదా?

తను ఇతడ్ని అర్థం చేసుకొంది ఇలాగేనా? కాదు కాదు, మొదట్లో ఇతను సభ్యమనిషిగా అయ్యున్నాడనేది సరే! అయితే క్రమేణ ఇతను మారాడు. ఒక మనిషి రాక్షసుడిగా మారగలడు అనే దానికి ఇతని కన్నా సూక్తమైన వేరొక ఉదాహరణ దొరకదేమోకదా!

తన నాయన సమాజవాది (సోషలిస్ట్) శ్యామరాయరు అంటే ఈ సీమకంతా ప్రఖ్యాతులైనవారు. వెనకటి తరంలోని సోషలిస్ట్ నాయకుడు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని తర్వాత సమసమాజ సిద్ధాంతాన్ని నమ్మిన వ్యక్తి. ఈ దేశంకు, ఈ సమాజ ఉన్నతికి సోషలిజం ఒకటే సరైన దారి అనేది వారి వాదంగా ఆదర్శంగా ఉండేది. ఈ ఆదర్శాన్ని ఏ కారణంకూ బలిచేయని నిష్ఠుర వ్యక్తి. ఉదర పోషణకని జీవితం చివరి వరకూ వకీలు వృత్తి చేస్తూ, హవ్యాసం (హాబి) అన్నట్లుగా రాజకీయంకు అంటుకు పోయారు. ఎక్కడ అన్యాయం జరగనీ, అనుచితమైంది ఘటించనీ శ్యామరాయరు ధ్వని ఎత్తేవారు. శ్యామరాయర నిర్భీతి, నిష్ఠుర వ్యక్తిత్వం, పరిచయంగా ఉన్నోళ్ళందరూ వారిని గౌరవంగా చూస్తుండేవారు. కొంతమంది అక్రమార్కులు భయపడుతుండేవారు.

శ్యామరాయరుకు పూర్వీకుల నుంచి వచ్చిన ఒక ఇల్లు ఉంది. సాధారణమైన ఇల్లు అది. వకీలుతనం నుంచి అతిగా సంపాదన వారికి లేదు. ఇంతగా ఆదాయం కావాలని వారు కక్షిదారుల నుంచి కోరేది లేదు. వారు, వారి అర్ధాంగి, పుత్రిక జీవనం ఎలాగోలా సాగిపోతుంది. కాళ్ళలో హవాయి చెప్పులు, పంచె షర్ట్, భుజం మీద కండువా, కళ్ళజోడు ఇవే వారి వేషధారణ. ఇంట్లో ఎల్లప్పుడూ పరిచిన జంపఖాన. గోడకు ఒరిగించి పెట్టిన ఏడెనిమిది దిండ్లు. గది బయట వారు సమాలోచన చేసేది లేదు. అయితే వారి వెనక ఎప్పుడూ జనం, విశేషంగా నవయువకులు ఉండేవారు. శ్యామరాయరి తీక్షణ మాటలకు, పరిస్థితిని విడమర్చి చెప్పే చాకచక్యంకు, అన్యాయం అవినీతిలను ఖండించే ధైర్యంకు, తెరచాటున జరిగిన కపటాన్ని బయటపెట్టే కుశలత్వంకు ఈ తరుణులు వారి అనుయాయులుగా ఉండేవారు. ఎక్కడెక్కడా రాజకీయం పేరు మీద స్వార్థం, కులతత్వం, స్వజన పక్షపాతం, వంచన, మోసం వ్యాపిస్తుండగా వీటికి బలిగాకనే ఉన్న ఈ వ్యక్తిని అరాధిస్తుండేవారు తరుణులు. ఈ యువకుల నడుమ శ్యామరాయరి విశ్వాసంకు పాత్రుడైనోడు దురగోజి శివశంకరయ్య. దురగా అని అతడ్ని ప్రీతిగా పిలుస్తుండేవారు శ్యామరాయరు. తన తర్వాత దురగోజి తన స్థానాన్ని నిలబెట్టుతాడు అనేదొక ఆశ వారిలో ఉంది. తరం నుంచి మరో తరంకు ప్రవహించి వచ్చే వంశావళిలోని వారసత్వం మీద గాని, గురుశిష్య పరంపర మీద గాని ఆసక్తి లేని వారు శ్యామరాయరుగారు కదా! ప్రజా ప్రభుత్వంలో సమయ సందర్భంకు అనుగుణంగా ప్రతియొకడు నిర్ణయాత్మక స్థానంలో నిలబడి తన వంతు బాధ్యతను నిర్వహించాలి అని అంటుండేవారు రాయరుగారు. అయినా తను నమ్మిన ఈ యువకుడు పర్వాలేదు. తన జతగా ఉండేవారిలో ఎక్కువగా తీక్షణమతి, సూక్ష్మమతి దురుగోజినే అని నోరు విప్పి చెపుతుండేవారు.

దురగోజి శ్యామరాయరు వద్ద వకీలుతనంలోని మెలకువులు నేర్చుకోవాలని వచ్చి చేరినోడు. అయితే రాజకీయ పార్టీ పనులు, దేశంలోని సమస్యలు, సామాజిక కష్టాలు అధికమైనప్పుడు వీటి మీద చూపు నిల్పేందుకని శ్యామరాయరు దురగోజికి తర్ఫీదు ఇచ్చారు. ఇందునుంచి దురగోజీకి జనప్రియం అధికంగా లభించింది. అతను మంచి వక్త కూడా! ఏఏ అస్పష్ట గందరగోళం నడుమునా దూసుకెళ్ళి కార్యాన్ని సాధించగల వ్యక్తిగా అయ్యాడు. బయటేకాదు శ్యామరాయరి ఇంట్లోనూ దురగోజి అనివార్యమైన వ్యక్తిగా మారాడు.

సమాజవాది (సోషలిస్ట్) నాయకుడైన శ్యామరాయరి అన్ని విషయాలనూ అనుసరించే వ్యక్తి, శ్యామరాయర పుత్రిక మెప్పు పొందింది మరొక ఘటనగా ఉంది.

శ్యామరాయరు తమ పుత్రికకు ప్రజా అని పేరు పెట్టారు.

"పేరు వింతగా ఉంది కదా!" అని చుట్టు ప్రక్కల ఉన్నోళ్ళ ముఖంచూసి నవ్వుతుండేవారు రాయరు. తర్వాత వారే చెపుతుండే వారు ఇలా : "చూడండి, ఈ దేశంలోని జనం... అంటే ప్రజలు ఎన్నడూ ప్రముఖులుగా కన్పించుకోలేదు (గుర్తుంచుకోబడలేదు). మన రాజులు మహారాజులు చక్రవర్తులు చివరికి పండితులు కూడా ఈ ప్రజల గురించి యోచించలేదు. ఈ ప్రజలలో ఒక వ్యక్తిత్వం, అభిప్రాయం, విచార మంథనం లేని మూగ సమూహం. అయితే స్వాతంత్ర్య వచ్చిన పిమ్మట ఈ దైన్యస్థితి మారింది. మారాలి కూడా. మన ప్రజలకు ఎక్కువ గౌరవం, స్థానమానం దొరకాలి. ఈ కారణంకనే నా పుత్రికకు ప్రజా అనే పేరు పెట్టాను."

వారి చుట్టూ కూర్చున్నోళ్ళు తలూపారు.

ప్రజా, నాయనలో ఉన్న సరళతకు ముగ్ధురాలైంది. వారి ఆదర్శాల్ని, విచారాల్ని, జీవన విధాన్ని ఒంట బట్టించుకొంది. రాజకీయతత్వాలు, సిద్ధాంతాలు ఆమెకు అర్థంకావట్లేదు. అయితే నాయన చెపుతుంది చేస్తుంది సరైందే అనే నిర్ధారం ఆమెలో ఉంది. అయితే తీసుకొనే చేసుకొనే అభిప్రాయం ఎన్నడూ ఆమెదే అయ్యింది. దురగోజీది తండ్రి అడుగు జాడలే అయినందున ఆమె అతడ్ని మెచ్చుకొంది.

పుత్రిక వివాహ సమస్య ఎదురైనప్పుడు శ్యామరాయరు... "ఔను సుమీ, దీని మీద తల వేడెక్కించుకొనేది ఎందుకు? మన దురగోజి ఉన్నాడు కదా" అన్నారు భార్యతో.

"చూడండి నిశితంగా, ఆ యువకుడికి ఖాయంగా ఒక నౌకరి, ఇల్లు, ఆస్తి... ఏమి లేవు కదా..." అంది ఆమె.

శ్యామరాయర చేయి పట్టుకొని వచ్చిన ఆ ఇల్లాలు కొంచెం అతృప్తురాలైఉంది. శ్రీమంతతనం, నగలు, పీతాంబరాలు అనే వాట్ని కోరి అవి తీరక ఆమె లోలోపల కొరగుతూ వచ్చింది. పుత్రిక అవస్థ తనలాగే అవుతదా? దురగోజికి అతని తండ్రి నుంచి ఏమి లేదు. ఇల్లు పొలం అని ఒకింత ఆస్తి లేదు. అతను శ్రమించేది లేదు. రాజకీయపార్టి, సంఘటన, సభ, ధర్నాలు, ఘోరావులు అని తిరుగుతుంటాడు. ఇతనికా పుత్రికను కట్టబెట్టేది?

శ్యామరాయరు నవ్వారు.

"దురగోజీకి ప్రజల సంక్షేమంకని చేసే పనులు ఎన్నో ఉన్నవి. మన ఇల్లే అతనిది. నేను ఆస్తి పాస్తి సంపాదించలేదు. అతనూ సంపాదించేది లేదు. సంపదంతా కాళ్ళకు సంకేళ్ళు వేసినట్లుగానే ఉంటది. మన స్వాతంత్ర్య స్ఫూర్తికి అడ్డుగా ఆ

సంపద నిలుస్తది. ఇప్పుడు ప్రజా నుంచి ఒక మాట అడుగుదాం. పుత్రిక హుం అంటే... జరిపించుదాం అతనితో వివాహాన్ని".

ప్రజా హుం అంది.

ఎంతో సరళంగా ప్రజా – దురగోజిల వివాహం జరిగింది.

ఒకటో ఒకటిన్నర సంవత్సరం దొర్లింది అన్నప్పుడు విశేషమేమి జరగలేదు. తర్వాత అనంతరాయరగారి అర్ధాంగి చనిపోయింది. దేశంలో రాజకీయం తన రంగు మార్చుకొని వెనకటి కాలంలోని ఒకట్రెండు పార్టీలు చీలిపోయి నాలుగైదు పార్టీలుగా మారినవి. రాజకీయాలలో సత్యం, నిష్ఠ, ప్రామాణికత్వం, దేశ ప్రేమ మొదలైనవి క్రమేణ మాయమై పోగా శ్యామరాయరు వేరే ఏదోగా అవ్వసాగారు. ఏంటో అశాంతి, అతృప్తి వారిని వేధించసాగింది. వారు ఏకాంతాన్ని కోరుకోసాగారు. తన మాటకు విలువలేదు, తన ఆదర్శాలు నవ్వులాటకు గురౌతున్నవి అనేది వారికి తెల్సివచ్చింది.

"ప్రజా... ఈ దేశంకు ఏమైంది?" అంటూ వారు పుత్రిక ఎదుట ఎన్నోసార్లు తన బాధ తోడుకొన్నారు. ఈ బాధ ఎక్కువ రోజులు కనబడకూడదనో ఏమో వారు కొన్ని రోజులు అస్వస్థత తదుపరి కాలధర్మం చెందారు.

❖ ❖ ❖

ప్రజా తను ఇక అనాథురాలైందని అనుకొంది. అది అలాగే అయ్యింది కూడా!

ప్రజా, తండ్రి మరణానంతరం భర్త ప్రవర్తనకు తండ్రి ప్రవర్తనకు ఎంత భారీ వ్యత్యాసం ఉందనేదాన్ని కనుగొంది.

❖ ❖ ❖

దురగోజి అధికార పీఠం అధిష్ఠించిన పార్టిలోకి ఫిరాయించాడు. ఈ పార్టీకి సంబంధించిన జిల్లా మట్టంలో అధ్యక్షుడిగా అవ్వాలని ప్రయత్నాన్ని చేయసాగాడు. ఈ ప్రయత్నంకు నాంది అన్నట్లుగా ఇంట్లో పగలు రాత్రి గుప్త సమావేశాల్ని నడిపాడు. వద్దనుకొన్నా ఈ సమావేశాలలోని వార్తలు ప్రజా చెవిన పడి మార్మోగుతుండేవి.

కులాన్ని ఎత్తికట్టేది, మత విద్వేషాన్ని రగిలించేది, జనంకు డబ్బు పంచేది, బజారు ముండల్ని (వేశ్యల్ని) వశం చేసుకొని ఎవరిమీదో మానహాని చేసేది, ఎవరి ఇంటికో నిప్పుపెట్టేది, మరిక ఎవరి ఇంటినో లూటి చేసేది, ప్రభుత్వ యంత్రాంగం మూలకంగా ఎవరికో బెదిరింపులు చేసేది, ఎవరినో హత్య చేసేది, కాళ్ళు చేతులు విరిచేది... వీటన్నిటి వెనుక దురగోజి హస్తం ఉన్నదాన్ని గమనించి ప్రజా భీతిల్లింది.

ఇంతకు మునుపు నాయన (శ్యామరాయరు) ఉన్నప్పుడూ ఇంట్లో రాజకీయాల మీద చర్చలు జరుగుతుండేవి. అయితే ఇప్పుడు జరుగుతున్న ఈ విధమైన మాటలు ఏనాడూ వినబడేవికాదు శ్యామరాయరు (నాయన) ఉన్నప్పుడు అని అనుకొంది ప్రజా. ఇలాగున భావించి ప్రజా ఒక రోజు దురగోజి చెంత ఈ విషయాన్ని ప్రస్తావించింది.

"ఇది రాజకీయమే ప్రియా! నీకు అర్థమైయ్యేది లేదులే" అన్నాడు దురగోజి. దీనిమీద వాదం చేసేందుకు ప్రజా ఉద్యుక్తురాలైనప్పుడు దురగోజి ధ్వని గడుసైంది కరుకైంది.

"చెప్పాను కదా... నీకు అర్థమైయ్యేదిలేదని... ఉత్తిగనే పడియుండు... అధికారంకని, దొడ్డస్థానం పొందేందుకని ఇదంతా చేసేదుంది" అన్నాడతను.

శ్యామరాయర జీవనంలో అర్థం కానిది, గుట్టుగోప్యం... ఇవేవి ఉండలేదు. అయితే దురగోజి జీవనంలో అన్నీ గోప్యమైనవి, భయానకమైనవి, వైభవోపేతమైనవి ఉన్నవి కదా!

ఔను వైభవోపేతమైనవి.

సర్కారి అధికార్లు నోట్ల కట్టల్ని పట్టుకుని వస్తుండేవారు. ట్రాన్సఫర్లు ప్రమోషన్లు మొదలైన వాటికని వేడుకొంటుండేవారు. తాము అవినీతి నిరోధక శాఖ విసిరిన వలలో దొరికిపోయి సస్పెండు అయిన దురంతం నుంచి రక్షించండని కోరుతుండేవారు.

హోల్‌సేల్ వర్తకులు, గుత్తేదార్లు, పరిశ్రమల యజమానులు బ్రీఫ్‌కేసులలో డబ్బు నింపి తెస్తుండేవారు. నగరంలోని పుండాకోర్లు పోకిరీలు ఫోర్‌ట్వెంటి గాళ్ళు వస్తుండేవారు.

దురగోజిలోని మాటల ధాటి అలాగే ఉండేది. దేశం, జనం, ప్రగతి, అభివృద్ధి అని మాట్లాడేవాడు. జతగా ఏదో ఠీంకారం, అహకారం, పెద్దతరం వచ్చి చేరుకొంది. విలువైన పొందూరు, మల్లినమడుగు, మాధవరం ఖాదిదుస్తుల్ని అతను తొడగసాగాడు. మెడలో చిటికెన వేలు మందంతో ఉన్న చైను, అన్ని వేళ్ళకూ ఉంగరాలు, కారు లేకుండా బయటకు అడుగుపెట్టని స్థితి అతనిలో ఉంది. శ్యామరాయర ఇంటి ముందు ఉండే ఖాళీ స్థలంలో బహ్మాండమైన ఇల్లు నిర్మించబడింది. ఊరిబయట ఒక తోట ఖరీదించాడు. ఇటువంటి కొన్ని మార్పులు చేర్పులు ఆ ఇంట్లో కనబడినవి. దీన్నంతా మొగుడు దేశం జనం పదాల్నే చెప్పుకొంటూ గడించాడు సంపదనంతా!

మళ్ళా మరొకదాన్ని ఆమె గమనించింది. భర్తకు అధికారంలోని మహాత్వాకాంక్ష అధికమైపోసాగింది.

తను మెచ్చిన, ఒప్పుకొన్నవ్యక్తి ఇతనిలాగ అయ్యేది కుదరదని భావించి ఒకరోజున ప్రజా తన భర్తను నిలదీసి అడిగింది ఇలా: "ఔనండి... మీరు చేస్తున్న

దంతా సరైనదేనా? మీగురువుగారు మీ ఇప్పటి ప్రవర్తనను ఒప్పేవారా?"

"ఒప్పేందుకు, ఒప్పుగోకుండా ఉండేందుకు వారైతే ఇప్పుడు లేరుకదా"

"అయినా నాయన విచారం, ఆదర్శం మీకు గుర్తేకదా... మీరూ ఒక కాలంలో నాయనకు ముఖ్య అనుచరుడిగా ఉన్నారుకదా..."

"అప్పట్లో వారి ఆదర్శం సరైనదిగా ఉండేది... ఇప్పుడు నేను పట్టిన ఈ దారి సరిగా ఉంది. నేను ఈ దేశంకు, ఈ జనంకు ఏదైనా చేయాలనుకొంటే... అధికారపీఠం అధిరోహించాలి... ఒకొక మెట్టు ఎగబ్రాకి పెద్ద పెద్ద అధికారం... తాలూకా బోర్డులోని అధ్యక్షపదవి... జిల్లా స్థాయిలోని అధ్యక్షపీఠం... స్టేట్ ప్రెసిడెంట్... సి.ఎం. పదవి... ఇలా అంచెలంచెలుగా నేను ప్రజలకు సేవ చేయలేదు. వేరేవాళ్ళు చేస్తున్నారు. వారే ఎందుకు చేయాలి? అందుకే నా నుంచి ఈ తిరుగుబాటు. హత్య, జగడం, నిప్పుపెట్టేది, ఎదుటి వారిని పార్టీలో చేర్చుకొనేది, ప్రభుత్వాని అస్థిరపరిచి కూలదోసేది... ప్రజా ఇవేవి నీకు అర్థం అయ్యేదిలేదు. ఉత్తిగనే నువ్వు చూస్తుండు వాట్ని"

ప్రజా మరిక మౌనంగా పోరాటం చేయాలనే నిర్ధారంకు వచ్చింది. అయితే అందుకు అవకాశం ఒదిగిరాలేదు. దురగోజి ఓక రోజు బాటిల్ ఎదురుగా పెట్టుకొని అడిగాడు ఇలా:

"ప్రజా మన పెళ్ళై ఎన్ని సంవత్సరాలు అయినవి?"

"మీకు గుర్తుండాలి కదా?"

"దేశంలోని రాజకీయాలలో నిమగ్నమైనోళ్ళకు ఇంటి విషయాలు గుర్తైయ్యేది లేదు ప్రజా... నువ్వే చెప్పు"

"ఐదు సంవత్సరాలు అయినవి"

"ఐదు సంవత్సరాలా..."

"ఔను... ఎందుకు అడుగుతున్నారు?"

"రామకృష్ణ జ్యోతిషిగారు ఏమి చెప్పారో గుర్తా?"

"ఏమి చెప్పారు?"

"నా నుంచి మొదలై నాల్గైదు తరాల వరకూ... మన వంశం వారికి ఈ దేశాన్ని ఏలే యోగం భాగ్యం ఉందట... అయితే నువ్వు దౌర్భాగ్యురాలివి... ఐదు సంవత్సరాల నుంచి ఇలాగే ఉన్నావు... ఇలాగే..."

మొదటిసారిగా ప్రజా దేహం భీతి నుంచి కంపించింది.

ఈ కంపన ఎక్కువై పోసాగింది.

దురగోజి రోజులు దొర్లిపోతుంటే దేశం పేరు జనం పేరు చెప్పుకొంటూ బలాఢ్యుడై పోసాగాడు. అలాగే దుష్టుడిగానూ క్రూరుడిగానూ అయ్యాడు. ఇది ఆమె పాలుకు చీకటి రోజుల్ని తెచ్చి పడేసింది.

ప్రజాకు ఒక ఆశ ఉంది. తను మాతృమూర్తిగా అవ్వాలనే ఆకాంక్ష ఆమెలో మెండుగా ఉంది. స్త్రీ జాతిలో ఎవరికైనా ఈ కోరిక ఉంటదికదా! స్త్రీ ఒకొకకాలంలో, దశలో వయస్సుకు వచ్చినప్పుడు ఇటువంటి వాటన్నిట్నీ కోరుకొంటది. పెళ్ళై ఐదు సంవత్సరాలు గడిచినా తను మాతృమూర్తి కాలేదనే వ్యథ అమెలో ఉంది. ఇప్పుడు గాకపోయినా మున్ముందు ఈ అవకాశం వస్తదని ఆమె ఎదురు చూసింది. ఇప్పుడేమో భర్త ఈ విషయాన్ని ప్రస్తాపించి కటువుగా మాట్లాడేది ఆరంభించిన పిమ్మట ఆమెలోని వ్యథకు జతగా కొత్త భీతికూడా చేరుకొని మరింతగా పరితపించసాగింది ప్రజా!

దురగోజి జిల్లాస్థాయిలో, రాష్ట్రస్థాయిలో ప్రభావశీల వ్యక్తిగా పెరిగి పోసాగాడు. అతని ముందు వెనుక తిరుగుతుండేవాళ్ళు అతని తాళం రాగంకు తగినట్లుగా నాట్యమాడే అనుమాయులుగా మారి అతడ్ని కీర్తిస్తున్నారు. అతను తాగుబోతోడని, లఫంగి అని, మోసగాడు అని అనుకొనే జనం కూడా ఉన్నారు. వీటి గురించి రాసే పత్రికలు దిననిత్యం ఇంటి అడ్రెస్సుకు వచ్చి పడుతుండేవి.

దురగోజి ఒక ఆఫీసు తెరిచాడు. ఆఫీసులో పనులు చేసేందుకని ఉద్యోగులు వచ్చి చేరారు.

సిద్రామ అనే యువకుడొకరు ఇతనికి ఆప్తకార్యదర్శిగా అయ్యాడు.

సరైన పనే మొదట్లో లేని దురగోజి రాజకీయాల పుణ్యంగా శ్రీమంత బతుకు గడుపుతున్నాడు. అయినా అతనిలో ఒక వ్యథ ఉంది. తనకు పుత్రసంతానం లేదనే కొరగు ఒకటుంది.

రాజకీయనాయకులు కొన్ని మౌఢ్యాలకు లోబడి పోతుంటారు.

సంతానం కని యాత్ర చేసేందుకు దురగోజి భార్యజతగా మొక్కు మొక్కాడు. మొక్కిన మొక్కు తీర్చాడు. దేవుడి ప్రతిష్ఠాపన చేసాడు. గోదానం భూదానం సువర్ణదానం అంటూ భూసురుల పూజచేసాడు. చివరికి ఇంటి వైద్యుడి జతగా సమాలోచన చేసాడు.

“దానికేంటి వ్యథ... నిశితంగా చూద్దాం... మొదటగా మీరిద్దరు వైద్యకీయ పరీక్షకు రండి” అన్నారు ఆ భిషక్ (డాక్టరు) గారు.

“నాకేమి అయ్యింది డాక్టరు గారు... నేను ఆంబోతులాగ సరిగానే ఉన్నాను... ఆమెనొక సారి పరీక్షించండి... డిఫెక్ట్ ఆమెలోనే ఉంటంది...?” అన్నాడు దురగోజి.

అదీ అయ్యింది. ప్రజాలో ఏ విధమైన డిఫెక్ట్ లేదు! మరి డిఫెక్ట్ ఉండేది ఎవరిలో?

ఉన్న వాస్తవ విషయాన్ని చెప్పేది డాక్టరు గారి ధర్మం కదా!

"సార్... మీరొకసారి రండి... డిఫెక్ట్ ఏముందో తెల్సుకొందా..."

"ఛీఛీ... ఏంటి మీరు అనేది... మా ఫ్యామిలి విషయం మీకు తెల్వదు... మీరు ఆమెకే ట్రీట్‌మెంట్ చేయండి..." అంటూ ఖడాఖండితంగా నిరాకరించాడు దురగోజి. అతనికి తన ఆంబోతుతనం మీద దృఢ నమ్మకం ఉంది. తన వంశం మీద కూడా!

ఈ మధ్యలో ఎన్నో రోజుల ఆశ ఒకటి అతని చేతిలో వాలింది. అతను జిల్లా స్థాయిలో పార్టీకి అధ్యక్షుడైయ్యాడు. జ్యోతిష్కుడి మాట నిజమైంది. ఒకొక మెట్టునుంచి పైకి ఎగబ్రాకుతాను. ఎలెక్షన్లు ఒకటి రెండు సంవత్సరాలలో రాగలదు. అప్పుడు తను శాసన సభ్యుడిగానో లేకపోతే లోకసభ సభ్యుడిగానో అవుతాను. అయితే... అయితే జ్యోతిష్కుడి మరొక మాటా నిజం అవ్వాలికదా...

"ప్రజా..."

బాటిల్ ఖాళి చేస్తూ నత్తినత్తిగా పలికాడు.

ఇప్పుడతను ఇంట్లో ఉండేది తక్కువ. ఇంటికొచ్చే జనంకు జవాబుచెప్పేది, వచ్చిన పత్రా(లేఖ)లకు మరు జవాబు రాసేది, దూరవాణి నుంచి పిలుపువినేది, వాటికి సమాధానం చెప్పేది... అంతా సిద్రామ పనిగా ఉంది. భర్తకేమో తిరుగాట. ఏదేదో ప్రవాసిమందిరంలో దేశం గురించి సభ, సమావేశం. అపరూపంగా ఇంట్లో ఉంటే అప్పుడు అతని ఎదురు బాటిల్ ఉంటది.

"ప్రజా..."

ఆమె హడావుడిగా వచ్చింది.

క్రితంలో అయితే ధైర్యం దిట్టతనం ఆమెలో ఉండేది. ప్రశ్నించే ఛాతి ఉంది. ఇప్పుడు అదంతా పలాయన మంత్రం పఠించింది.

"నేనొక నిర్ధారంకు వచ్చాను..."

"ఏంటది?" అన్నట్లుగా అతని ముఖం చూసింది.

"మరొక పెళ్ళి చేసుకొనేది... లీగల్ మ్యారేజ్... నీకొక దారి చూపించుతా... దారిచూపించేదంటే నీకు తెల్సుకదా... మాకు (రాజకీయాలోళ్ళకు) ఇదంతా సులభమే..." అంటూ అతను రాక్షసుడిలాగ నవ్వాడు.

"ప్రెసిడెంట్ పదవికోసం ఇంకొకడు గుంటకాడ నక్కలాగ కాచుకొని కూర్చున్నాడు... హొరగోడె తుక్రప్ప అనే మహాశయుడు...! ఎలెక్షన్లు వస్తవంటే

ముందస్తుగానే ప్రత్యర్థుల్ని తుకడా... తుకడాగా చేయాలి...” అంటూ గ్లాసులో మళ్ళా నింపుకొన్నాడు ఖరీదైన మద్యాన్ని.

“నిన్ను వదిలేస్తాను ప్రియా... ఎందుకంటే నా గురుపుత్రికను నేను ఇలా చేయలేను... అందుకని నువ్వే దారి చూపించు...నాకు రాబోయే మాసాలలో మంచి భవిష్యత్ ఉంది. ఈ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేది, ఈ జనుల బతుకును ఉద్ధరించేది... రెండిట్లోనూ నా పాత్ర మహత్వమై ఉండగలదు. నేను ఈ దేశంలోని రాజకీయాలలో ప్రబలశక్తిగా నిలవాలంటే నా పిల్లలు ముమ్మందు రాజకీయ క్షేత్రంలోకి దిగాలి... లేదంటే ఈ దేశంకు భవిష్యత్ లేదనే లెక్క. నా సంతానం ఇలా రాజకీయాలకు దిగాలంటే మొదటగా నువ్వు సంతానాన్ని కను... లేకపోతే, నువ్వే అవకాశం కల్పించి సంతాన భాగ్యం ఇచ్చే మరోస్త్రీని ఈ ఇంటికి వచ్చేటట్లుగా మార్గాన్ని సుగమం చేసిపెట్టు”.

దురగోజి ఎంతగానో తాగాడు. అయితే అతను ఒదురుట్లేదు. అర్థవంతంగానే మాట్లాడుతున్నాడు. భార్యకు అర్థమైయ్యే రీతిలోనే చెప్పాడు.

“ఏమి చేయాలనే దాన్ని నీకు వదులుతాను... ఎలాగోలా సంతానాన్ని కను... లేకపోతే నువ్వే ఏదో బావో చెఱువునో చూసుకో...” అన్నాడు. మళ్ళా చివరగా... “దేశ హితంకని మేము ఏమైనా చేయగలం” అంటూ నిర్లజ్జగా నవ్వాడు.

తాగింది అతిగా అయ్యి అతను అక్కడే పడిపోయాడు. ఈమె కూర్చునే ఉంది.

భర్త పలికిన ఆ దుష్ట మాటల్ని మళ్ళా మళ్ళా గుర్తుకు తెచ్చుకొంటూ ఆమె దిగ్భ్రాంతురాలైంది. సమాజవాది (సోషిలిస్ట్) సిద్ధాంతకర్తైన శ్యామరాయరు గారి ప్రీతి పుత్రిక ప్రజా ఇప్పుడు తండ్రి నుంచి నేర్చిన అన్ని గుణాల్ని పోగొట్టుకొంది. ఇప్పుడు ఆమెకు తన జీవం ఒకటే ముఖ్యమని అన్పించింది. భర్తకు ప్రతిస్పర్థిగా ఉండి హతుడైన హొరగోడె తుక్రప్ప కథ ఆమెకు గుర్తుంది. తోటకు వెళ్ళి తిరిగి వస్తున్నప్పుడు అతను హత్యగావింపబడ్డాడు. కత్తుల నుంచి అతడ్ని తునకలు తునకలుగా చేసి పారేసారు. హంతకుల జాడ ఇకనూ దొరకలేదు. తనూ అలాగే...

ఆమె లేచి నిలబడింది.

సిద్రామ లోపలికి వచ్చి “మేడం నేను వెళ్ళి వస్తాను. తలుపులు బిగించుకోండి” అని అంటుండగా ప్రజా ముందుకే అడుగులు వేసి అతడ్ని ఆపి ఆ రాత్రంతా రతికేళిలో గడిపి అతడి నుంచి వీర్య దానం పొందింది.

❖ ❖ ❖

దురగోజి తన జీవనంలో మహత్తర మార్పులు సంభవిస్తున్నవి చూసి విర్రవీగాడు. జిల్లాధ్యక్షుడైన కొన్ని రోజులకే అతనికి దేశరాజధాని నుంచి పిలుపు

వచ్చింది. మొదటిసారిగా అతను దేశ రాజధానికి వెళ్ళి అక్కడుండే పార్టీ పెద్దల్ని చూసి కల్సి వచ్చాడు. ఇదైన కొన్ని రోజులకే ఒక కంపెని డిస్ట్రిబ్యూటర్ ఇతనికి ఒక లక్షురి కారును బహుమతిగా ఇచ్చాడు. ఇంటికి కారు వచ్చి చేరుతుండగా ప్రజా ఒక శుభ సమాచారాన్ని తెల్పింది. అదే కారులో ఆమెను కూర్చోబెట్టుకొని ఇతను ప్రమీళా నర్సింగ్‌హోమ్‌కు తీసుకెళ్ళి వైద్య పరీక్షల్ని చేయించాడు. ఫలితాంశం హర్షదాయకమై ఉంది.

ప్రజాకు నాలుగు నెలలు.

దురగోజి గుబురు మీసాల్ని మెలిబెట్టాడు.

రాష్ట్రస్థాయి నుంచి దేశ స్థాయి వరకూ రాజకీయ నాయకులందర్నీ దగ్గర నుంచి చూస్తూ వచ్చాడు ఇతను. ప్రతియొకడు తన చుట్టూ తన కులం, బంధుబాంధవ్యుల వృత్తం ఒక దాన్ని నిర్మించుకొని తమ స్థానాన్ని భద్రంగా చేసుకొంటూ ముందుకెళ్తున్నారు. దురగోజికి కులం మద్దతు ఉంది. దగ్గర సంబంధీకులూ ఉన్నారు మద్దతుకని. అయితే ముఖ్యంగా తన సోదరుడు, కొడుకు కూతురు, వియ్యంకుడు... ఇలాగని నిక్కచ్చైన వృత్తం అతని వద్ద లేదు. ఇక ఆ కొరత కూడా తీరిపోతదిలే అని అతను ఉప్పొంగాడు. రాజకీయం అనేది ఎంతో నిదానంగా పోవాల్సిన ఉన్న వైకుంఠపాళి ఆటగా ఉంటది. ఇప్పుడు తను ఈ స్థాయి ముట్టేందుకు పదోపదిహేను సంవత్సరాలనో వ్యయం చేయాల్సి వచ్చింది. మొన్న మొదటిసారిగా దేశ రాజధానికి వెళ్ళివచ్చాను. ఇక తన నడక ఊర్ధ్వముఖమే. రాబోయే పదిహేనో ఇరవై సంవత్సరాలలో తను ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా కాగలను. అప్పుడు తన వారసులకూ చేయి ఎత్తేది సాధ్యమౌతది; సులభమౌతది.

అర్థాంగి గురించి సకల జాగ్రత్తలను అతను మోపుకొన్నాడు. ఆమె ఆహార నియమాలకు ఉపచారంకు కొరత రానీయలేదు. వారం కొకసారి ఆమె ఆరోగ్యపరీక్ష జరుగుతుంది.

ఈ మధ్యలో ఆమెకు అఘాతమైయ్యేటట్లుగా ఒక ఘటన జరిగింది. ఒక రాత్రి సిద్రామ దురుగోజి ఇంటి నుంచి వెళ్ళేటప్పుడు అతని స్కూటరు ఏదో వాహనంకు ఢీకొట్టుకొని సిద్రామ రోడ్డులోనే ప్రాణాలు కోల్పోయాడు. వాహనం ఏదనేది తెల్వలేదు. ఈ విషయాన్ని రాత్రి వేళ వస్తుండే దురగోజీనే ప్రజాకు తెల్పాడు.

ప్రజాముఖం కళతప్పి ఉబ్బి కళ్ళలో నీళ్ళపొర ఏర్పడి కుర్చీలో కూలబడి పోయిందాన్ని చూస్తూ దురగోజి నిదానంగా ఆమె చెంతకొచ్చి, ఆమె భుజంమీద చేయి ఆనించి "ఇదంతా మనమంచికే అని తెల్సుకో... భవిష్యత్‌లో సిద్రామ మన

కుటుంబంకు ఒక ముల్లుకాకూడదు కదా... మన దారి రహదారి లాగ సుగమంగా ఉండాలికదా...” అన్నాడు.

ప్రజాకు అప్పుడు తన మొగుడి మీద కోపం, అసహ్యం, తిరస్కారం పెరగసాగింది. దేశం, ప్రజలు, హితం, ఉద్ధారం... మొదలైన పదాల్ని పలుకుతూ ఇతను ఏమేమి చేస్తున్నాడనేది సమీపం నుంచి చూసిన ఈమె రోసి పోయింది. ఇదే కారణంకో ఏమో సిద్రామ ఈమెకు దగ్గరైయ్యాడు. అతనిలోనూ దురగోజి గుణాలు చిగురించసాగినవి. అయినా తాత్కాలికంగా సిద్రామ ఈమె మనస్సుకు, మాతృత్వానికి వీర్యదానం దైహిక కలయిక నుంచి చేసి నెమ్మది శాంతి తెచ్చి ఇచ్చాడు. ఇప్పుడు అది దూరమైంది కదా!

ప్రజా తన గర్భంలో శిశువు చేస్తున్న చేష్టల్ని పరోక్షంగా గమనిస్తూ కాలం గడిపింది.

జనించబోయే ఈ శిశువు మీదా ఈమెకు కోపం ఉంది. దురగోజిలోని బెదిరింపుకు కుతంత్రంకు దుష్టతనంకు బలై మరిక తను ఈ శిశువుకు తల్లిగా అయ్యే సందర్భాన్ని జ్ఞాపకం చేసుకొంటూ, ఆమె తన చిత్తం (మైండ్)లోని స్వస్థతను పోగొట్టుకొంటుంది. తను చేసింది సరైందే అనేదాన్ని సమర్థించు కొనేందుకు ఆమెలో ఏ ప్రబల సాక్ష్యం లేదు కదా ఇప్పుడు. ఇప్పటిదాకా దురగోజిలోని అన్ని కపట చేష్టలకు అడుగులు వేస్తూ తను నాట్యమాడింది. మున్ముందు ఈ శిశువు నాట్యమాడు తది తనలాగే. క్రమేణ తండ్రిని (దురగోజిని) మీరే వ్యక్తిగా అవుతాడు. ఈ శనిసంతానంకు తను కారణకర్తగా అవుతుంది.

ప్రజా ఇలా జరగరాదు అనే విచారాన్ని చేసింది. భ్రూణహత్యేకాదు, ఆత్మహత్యనూ చేసుకోవాలని యోచించింది. పెరుగుతున్న భ్రూణం మీద ఉన్న మమత కరుణలనే దౌర్బల్యం ఆమెను కట్టిపడేసినవి.

ఆమెకు ఇప్పుడు నవమాసాలు నిండి, తొమ్మిదిరోజులూ అయిపోగా పుట్టబోయే శిశువు ఆగమనం కని నిరీక్షలో ఉంది. సంతోషం, కుతూహలం ఏమి లేదు ఆమెలో. అయితే దైహిక బాధ ఉంది. మానసిక కల్లోలం ఉంది.

❖ ❖ ❖

ప్రెసిడెంట్ దురగోజి వెనుకబడిన తరగతుల సంక్షేమ మండలిలో మీటింగ్ ముగించుకొని, సి.ఎం. ఇంటికి వెళ్ళాడు. అక్కడ సి.ఎం. జతగా కొన్ని ముఖ్య విషయాలకు సంబంధించిన విచార వినిమయం చేసాడు. అటు తర్వాత నేరుగా పార్టి ఆఫీసుకు చేరుకొన్నాడు. కొన్ని కాగితాల్ని పరిశీలించి, కొన్ని ప్రత్యుత్తరాలు

రాసి, చక్కెర కర్మాగారంలోని లేబర్ మీటింగ్‌లో పాల్గొన్నాడు. ఈ సభలు సమావేశాల తిరుగాట నడుమ ఇటు (ఆస్పత్రి) వైపు చిత్తం (మైండ్) నిల్పుకొన్నాడు. ఫోన్‌వస్తే చెప్పు అని అక్కడున్న అటెండర్‌కు చెప్పాడు. ఫోన్ వచ్చిందా అని అడిగాడు. అన్ని సభలు, సమావేశాలు, కలయికలు ముగిసినప్పుడు రాత్రి పదకొండు గంటలైంది. నేరుగా కారును అస్పత్రి వైపుకు మళ్ళించాడు.

తక్షణమే పురిటినొప్పులు కలగగా ప్రజా లేచి కూర్చుని కాలింగ్ బెల్ ఒత్తింది. నర్సమ్మ, ఆయమ్మ, డాక్టరమ్మ అందరూ పరిగెత్తుకొని వచ్చారు. కారుకుండే ముందు లైట్ల వెలుగు ఆస్పత్రిలోని గేటు స్తంభాలు గోడల మీద పడుతుండగానే ఇక్కడ సుఖ ప్రసవం జరిగింది. ఈ దేశాన్ని ఉద్ధరించేందుకు జనాల్ని ప్రగతి పథంలో నడిపేందుకు మరొక ప్రాణి అవతరించాడు. అయితే ప్రజా?

**మూలకథ రచనాకాలం : 1991**

# మంత్రి మహోదయుడు

వీరు మంత్రిగా అయ్యిందే ఆలశ్యం, జన సందడి నడుమ జనప్రియ వ్యక్తిగా మారాడు. ఎక్కడెక్కడికో ఇతను వెళ్తే అక్కడ జనం మస్తుగా జమైయ్యేవారు. ఇంటి వద్దైతే ప్రభాతఝాములో కోడి కూత కూసే మునుపే జనం వచ్చి పోగైయ్యేవారు వీరిని కల్సేందుకని. వెలుగు కిరణాలు పుడమి మీద పడుతుండగా, వీరి ఇంటి చుట్టూరా చిన్నపాటి జన జాతర రూపుదిద్దుకొనేది. ఇక వీరి సెక్రటేరియట్ వద్దా ఇలాగే జనసందడి ఉండేది. వీరు తన ఛేంబర్‌లోపలికి ప్రవేశించేందుకు తక్కువంటే అరగంట సమయం పట్టేదుంది. వీరికి చెందిన ఆప్త రక్షక దళం జనాల్ని అటు ఇటు పక్కకు నెట్టి వీరికి దారి చేయాల్సి వస్తుండేది. అక్కడే జనం వీరిని మాట్లాడించేందుకు, వీరి కృపాకటాక్షంకు గురైయ్యేందుకు, వీరి కనుసన్నలలో పడేందుకు ప్రయత్నిస్తుండేవారు. ఇక వీరు వేరొక పట్టణంకో గ్రామంకో ఏదైనా కార్యక్రమ శంకుస్థాపనకో ప్రారంభోత్సవంకో సన్మాన సమారంభంకో వెళ్ళి ఉంటే జనం తిండి నిద్ర విశ్రాంతి మరిచి పోగైయ్యేవారు వీరి చుట్టూ.

అటు సభ జరుగుతుంటే ఇటువైపు జనం వేదిక వెనకనుంచి ఎక్కి వచ్చి వీరి ముందు మోకరిల్లి దండాలు పెట్టుండేవారు. చేతిలో ఉన్న కాగితాల కట్టను వీరి చేతికి ముట్టిస్తుండేవారు. ఇదొక పని జరగాలని మొరపెట్టుకొనేవారు. సభ అయిపోయిన పిమ్మటా జనం నుంచి తప్పించుకొని వచ్చేది వీరికి అసాధ్యమౌతుండేది.

తను జనంకు ఎంతగా అవసరమైయ్యాను అనేదాన్ని మొదటిసారిగా వీరు కనుగొన్నారు. తనమీద జనం ఉంచుకొన్న నిల్పుకొన్న ప్రియతలోని లోతువెడల్పులను కనులారా చూసి ఉబ్బి పోయాడు. జనం తననుంచి ఏమేమి పనులు కార్యాలు జరగాలి అని కోరుతున్నదాన్ని గ్రహించి భావ పరవశుడైయ్యాడు.

తన వద్ద కొచ్చే జనాలందర్నీ విడివిడిగా చేసి చూడసాగాడు. జతగా వారు తన నుంచి ఏయే పనులు కార్యాల్ని చేయించుకొనేందుకు వస్తారనేది వీరు త్వరగానే గ్రహించారు.

తన కులంకు చెందిన జనం, ఊరులోని జనం, వీధిలోని జనమే కాదు మొత్తం రాష్ట్రంలోని జనం తన వద్దకు వస్తున్నారు. సంబంధీకుల జతగా ఆడిపాడి తిరిగి చదివినోళ్ళు, క్రితంలో తనను విరోధించినోళ్ళు గోళ్ళు గిల్లుకొంటూ వస్తున్నారు. పాఠాల్ని బోధించిన మాష్టారు, వివాహ బంధం చేసిన శాస్త్రి గారు, తన ఇంటి

పశువుల కొట్టంలో పేడ ఎత్తే రంగప్ప, తన ఇల్లు కట్టించిన మేస్త్రి, తనుండే వీధికి చెందిన వయోవృద్ధుడైన అజ్జప్ప... మరిక తన ఊరులోని సమస్త జనం, జతగా సురాపానం చేసినోళ్ళు, ఇస్పీట్ ఆట ఆడినోళ్ళు, చేయరాని ఆకృత్యపని చేసినప్పుడు తోడుగా ఉన్నోళ్ళు అందరూ వస్తున్నారు. సామాన్యులు అటుండనీ, పెద్ద పెద్దోళ్ళూ వస్తున్నారు. వారిలో లాయర్లు, వైద్యులు, లెక్చరర్లు, ప్రాంశుపాలుడు (ప్రిన్స్‌పాల్), ఇంజనీర్లు చేతులు పిసుక్కొంటూ వస్తున్నారు. మిల్లుల యజమానులు, గుత్తేదార్లు, షాపు ఓనర్లు, హోల్‌సేల్ వ్యాపారం చేస్తుండే షావుకార్లు, లక్షాధిపతులు వస్తున్నారు దేని దేనికోసమో! పత్రికా సంపాదకులు, కత కవిత నవలల్ని రాసే సాహితీలు, శిల్పాల్ని చెక్కేటోళ్ళు, రంగులు వేసేవారు, చెట్ల మొద్దుల్ని కట్టెలుగా చీల్చేవారు, చేతి వృత్తుల వారు వస్తున్నారు. రైతులు రైతుకూలీల గురించి చెప్పేది వద్దు.

కొంత మంది ఏదో ప్రారంభోత్సవమని సమావేశం ఏర్పాటు చేసి ఆ మూలకంగా తనను కల్సుకొంటున్నారు. కొంత మంది విందుల్ని ఏర్పాటు చేస్తున్నారు తన కోసమని. ఇంట్లో బారసాలకు ఆహ్వానిస్తున్నారు. ఇలా ఇలా జనం తనను చూసేందుకు తహతహలాడుతున్నారు. ఇలా తనను కల్సి చూసిన జనం తనెదురు చేతులు ముడిచి వినమ్రంగా తలతగ్గించి నడువంచి మోకాలు నేలకు ఆన్చి నుదురును మన్నుకు తాకించి అడ్డంగా పడుకొని నేల మీద పొర్లుదండాలు పెడ్తూ ఏమేమో వేడుకొంటున్నారు; విన్న వించుకొంటున్నారు అని విచార మంథనం చేస్తుంటే వారిలో వారికే ఆశ్చర్యమౌతుంది.

జనంకు...

పనులు వేగంగా జరగాలి. ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లు, డబ్బు సహాయం, లోన్లు ఇప్పించేది, పిల్లలకు నౌకరి, బంజరు భూమి పంపకం, ఇళ్ళ నిర్మాణం, గొర్రెలు బర్రెలు ఎద్దులు కోళ్ళకని బ్యాంకుల నుంచి లోన్లు, వ్యవసాయ పనిముట్లుకని ఋణ సదుపాయం, ఇంజినీరింగ్, మెడికల్ సీట్లు, ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యేందుకు, ఉగాదినాడు ఇచ్చే రాజ్య ప్రశస్తి పురస్కారంకని, నెలవారి పించెన్లు, రోడ్డు పనులు, కొత్తగా ఇంగ్లీష్ కాన్వెంట్ తెరిచేందుకు పర్మిషన్లు, శీఘ్రంగా డ్రైవింగ్ లైసెన్సు పొందేందుకు, టూరింగ్ టాకీసు నడిపేందుకని లైసెన్సు, సారా అంగడి తెరిచేందుకు అనుమతి పత్రం, అవినీతి నిరోధక శాఖ నుంచి దొరికి పోయిన తప్పిదం నుంచి బయట పడేందుకు సహాయం, స్మరణసంచికకని ఒక లక్ష రూపంలో అడ్వర్‌టైజ్‌మెంట్‌కని కొందరికి ఫోన్ చేయమనే వినతి, నర్సరి స్కూలులో కుమారుడ్ని చేర్పించేందుకని ఒక రికమెండేషన్ లెటరుకోసం... హో హో హో హో ... ఎన్నెన్ని పనులు! ఎంతెంత కార్యాలు తన నుంచి జరగాలి.

ఎవరినీ కాదు అనలేదు; వెళ్ళండి అటు అనలేదు... ముఖం మాడ్చుకోలేదు, చేతిని నెట్టేయలేదు. జనం అందరికీ తను పని చేసి పెట్టున్నాను. జనం వస్తుంది ఎక్కువో, తను చేస్తుంది ఎక్కువో! తను ఉండేదే జన సేవకని కాదా? జనతా జనార్ధనుడి సేవకుడ్ని తను! ఈ శరీరం ఉందే జనులు సేవకని! రానీ, జనం ఎంతగానైనా రానీ, తను వారందరి సేవచేసి పెట్తాను అంటూ, మళ్ళా శపథం చేసుకొంటున్నాడు. జనప్రియమంత్రి అనే బిరుదు వీరికి సార్థకమైంది.

ఇలాగుండగా ఒక రోజు వీరికి తన ఊరులో తన వీధిలో తన ఇంటి ప్రక్కన ఉండే ఒక శ్రీసామాన్యుడి జ్ఞాపకం వచ్చింది. ఔను తను అతడ్ని చూడకనే ఎన్నో సంవత్సరాలు అయినవి కదా అనే విచారం చేసాడు. క్రితంలో తను మంత్రిగాకనే ఉన్నప్పుడు, సామాన్య వ్యక్తిలాగనే ఉన్నప్పుడు అతను తప్పనిసరిగా తన ఇంటికి ప్రతిరాత్రి భోజనం అయిన పిమ్మట వస్తుండేవాడు. ప్రాంగణంలో కూర్చుని అది ఇది మాట్లాడి వెళ్తుండేవాడు. ఎన్నో విషయాల మీద చర్చిస్తుండేవాడు. పలు విషయాల్ని సహేతుకంగా విమర్శించేవాడు. అలాకాదు ఇలా అని చెపుతుండే అతనొక్కడే ఇప్పటి వరకూ తన చెంతకు రాలేదు. ఔను ఔను... తను మంత్రి అయిన మీద అతను రానేలేదు.

ఎవరెవరో వస్తున్నారు. గురుతు పరిచయం లేనోళ్ళు, దూరపు సంబంధీకులు, నానా జాతోళ్ళు...ఇలా వేల కొద్ది జనం వచ్చారు. తమకు చెందిన పనుల్ని, కార్యాల్ని చేయించుకొని వెళ్ళారు. అయితే అతనొక్కడే ఇప్పటిదాకా తన వద్దకు రాలేదు. ఛీ, తన వద్ద ఏమీ లేనప్పుడు, తను కేవలం ఒక సామాన్య వక్తిగా అయ్యున్నప్పుడు ఎవరూ తనను ఏమి అని అడిగి మాట్లాడించని రోజులలో తన వద్దకు వచ్చి భోజనం అయ్యిందా? ఏంటి వార్తలు? అంటూ మాటలలో దిగి ఒకటికాదు రెండు మూడు గంటల వరకూ శివమొగ్గలో రైలు వచ్చేదాకా, రాత్రి రెండో ఆట ముగిసే దాకా మాట్లాడేవాడు. తన మాటల మూలకంగా నాలోని అనుభవాన్ని, విచారధారను విస్తరిస్తుండేవాడు. ఒకే ఒకసారి తను మంత్రైనమీద తన వద్దకు రాలేదంటే ఎంతో చెడుపుగా అన్పించింది వీరికి! ఎవరెవరో పుటగోచిగాళ్ళు వచ్చి వెళ్ళారు. అయితే ఇతను రానేలేదు!

అతనికి అవ్వాల్సిన పనులు లేవేమో అని సమాధానపడేందుకు ప్రయత్నించారు వీరు. అయితే మనస్సు ఒప్పుకోవట్లేదు. అతను కష్టాలలో ఉన్నాడు. మూడొందలో నాలుగు వందల రూపాయలకో నౌకరి చేస్తున్నాడు. అతను కొడుకు కోసం నౌకరి వెతుకుతున్నప్పుడు ఏవేవో తాపత్రయాల నడుమ ఇరుక్కొని పోయాడు. అతను

శ్రీమంతుడుకాదు. సుఖంగానూ ఉండే వాడుకాదు. పొలంపుట్రా ఉన్నోడు కాదు. లంచంతిని కొవ్వు బలిసినోడు కాదు. నల్లడబ్బు పోగేసుకొన్న ఖదీముడూకాదు. అతను ఏదో పనికని తన వద్దకు వస్తే ఇంత పొద్దుకే ఆపని తను చేసిపెట్టి పంపేవాడ్ని, అయితే అతను ఇంతవరకూ రాలేదు కచితంగా!

తన ఎదురు పళ్ళు ఇకిలిస్తూ, తలగోక్కుంటూ, జొల్లు కార్చుతూ, కాలునాకుతూ, పాదాల్ని వదలకనే తనను పొగిడి ఆకాశం అంత ఎత్తుకు నిలబెట్టిన అందరి ముఖాల్ని గుర్తుకు తెచ్చుకోసాడు. ఈ వేల ముఖాల నడుమ అతని ముఖం కన్పించలేదుకదా! నేను మంత్రిగా అయ్యి జనసేవకని నిల్చిన పిమ్మట ఆ మనిషి నాచెంతకే రాలేదుకదా!

ఇతనికి చెడుగా అన్పించింది అతని వర్తనం. తన జనప్రియత మీద అనుమానమూ ఆరంభమైంది. మనస్సులో ఏదో కొరత కన్పించుకొంది. బాధ నుంచి దుఃఖపడ్డాడు. అతనొకడే రాలేదు కదా తన వద్దకు అనే దాన్నే తలలో పడేసుకొని విచారించసాగాడు. పలువిధాలుగా యోచించసాగాడు.

ఈ విషయం మంత్రి తలను కొరుకుతున్న రోజులలోనే మరొక ఘటన జరిగిపోయింది. తన స్వగ్రామంకు మంచినీళ్ళ సరపరా పథకంకని దాన్ని ప్రారంభించేందుకు మంత్రి రాసాగాడు. ఇంకేంటి ఊరు దగ్గరకు వచ్చింది. నాలుగు గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం ఉన్నా సాంప్రదాయం అన్నట్లుగా కేవలం రెండు గంటలు ఆలస్యంగా ఊరు వైపుకు రాసాగాడు. ముందేమో అంగరక్షక దళం వారి కారు. తర్వాత జిల్లా పోలీస్ అధికారి జీపు, దాని వెనుక పటపటా కొట్టుతూ దేశ పతాకం ఉన్న మంత్రి గారి కారు; తర్వాత వెనుక అధికారులు, అభిమానుల వాహనాలు. వేగం అంటే యమ వేగం. గాలిలో తేలిపోతూ వాహనాలు రాసాగినవి.

మంత్రి తన కారులో వెనక్కి వాలి కళ్ళు మూసాడు. దేశ సేవాకార్యక్రమం నుంచి ముఖంలో సంతృప్తి. జన ప్రియత నుంచి అన్ని చోట్లా దొరుకుతున్న హార్థిక స్వాగతం నుంచి వచ్చిన సంతృప్తి. ముఖం మీద దేహం మీద ఇదేరీతిలో తృప్తిని నింపుకొని కారులోని మెత్తటి ఆసనం మీద సుఖంగా పవళించినట్లు కూర్చున్నాడు. మంత్రి ఎందుకో దడాల్నే కళ్ళు తెరిచాడు. రోడ్డు ప్రక్కన మోరి ఉంది. అతను అక్కడ కూర్చుని ఉన్నాడు. అతనే అతనే కచితంగా అదే ముఖం అవేకళ్ళు. అయితే ఎంతో కృశించి ఉన్నాడు. ఆపండి అని ఆజ్ఞ చేయగా మంత్రి గారి కారు గబక్కనే ఆగింది. మోరిదాటి పదిగజాలు ముందుకెళ్ళింది. మంత్రి గారు కారుకున్న డోరు తెరిచి క్రిందకు దిగారు. వెనక వస్తున్న వాహనాలు ఆగినవి.

మంత్రి మోరి వైపు వడివడిగా అడుగులేస్తూ అరిచాడు... "ఏంటి... ఏంటి మీరు ఇక్కడ?"

మొదట అతను తబ్బిబ్బైయ్యాడు. తర్వాత స్థిమితంలోకి వచ్చిలేచి నిలబడి చేతులు ముడిచి

"నమస్కారం... వాకింగ్‌కని ఇటు వచ్చాను..."

"మరిక నువ్వు కలవలేదు... ఎలాగున్నావు? నీకు ప్రమోషన్ లభించిందా? కొడుకుకు నౌకరి దొరికిందా?"

అతను మంత్రి పలుకులకు జవాబు ఇవ్వలేదు. మౌనంగా ఏదో ఒక రీతిలో నవ్వాడు.

మంత్రికి నిరాశ అయ్యింది.

"రాజధానికి వస్తే మా ఇంటికి రండి.. వస్తారుకదా" అంటూ అడిగిన మంత్రి తన నీడ కనబడితే చాలు, జనం ఏదేదో చేస్తారు. తను స్వయంగా కారు ఆపి దిగి వెళ్ళి మాట్లాడిస్తే, అతని ధిమాకు చూడండి... సరే సరే అంటూ కోపంగా తక్షణమే వెనుదిరిగాడు. మరుక్షణం కారు తారు రోడ్డు మీద యమస్పీడుతో వెళ్ళసాగింది.

మంత్రికి అసహనమైంది. అతనికి ప్రమోషన్ దొరకలేదు. అతని పుత్రుడికీ ఉద్యోగం సద్యోగం దొరకలేదు. అలాగని ఒక మాట చెప్పి యుండొచ్చుకదా! "అయ్యా స్వామి, దేవుడే దిగివచ్చినట్లుగా వచ్చారు కదా! నాకొక ప్రమోషన్ ఇప్పించండి, కొడుకుకు ఒక నౌకరి ఇప్పించండి" అని అతను అడిగితే సరిపోయేది. అయితే ఆ పాడుబడ్డ శ్రీసామాన్యుడు గాంధీజి గారు నవ్వినట్లుగా నవ్వాడు. ఇంటికిరండి అని ఆహ్వానిస్తే సమయం కల్సి రావాలట అతనికి! ఛూత్ వాడికి వాడి తాత ముత్తాలకు పిండం కూడు పెట్ట...

"మంత్రిగారికి"

"జయం అవ్వాలి"

"మంత్రిగారికి"

"జయం అవ్వాలి"

మహా జనస్తోమంను చూడగానే, వారి జైకారాన్ని వినగానే ఇంతకు మునుపు ఆ శ్రీసామాన్యుడి నుంచి జరిగిన దాన్ని మరిచాడు మంత్రి. వారి ముఖం వికసించింది, దేహం ఉప్పొంగింది.

కొన్ని రోజుల తరువాయి రాష్ట్రంలో మహత్తరమైన మార్పులు సంభవించినవి. రాష్ట్రాన్ని ఏలుతున్న పార్టి విశ్వాసాన్ని కోల్పోయింది. మరొక పార్టి నుంచి ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. అదికూడా ఏడెనిమిది రోజులు పరిపాలన చేసి మళ్ళా అవిశ్వాసంకు బలైంది. రాజకీయ తంత్రంలోని అన్ని దాగుడుమూతలు పీతూరీలు

గోడదూకటాలు ఆయారాం గయారాం మొదలైనవి జరిగి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన జారి అయ్యింది. మంత్రులు, ఎం.ఎల్.ఎ.లు హాంహుం అంటుండగానే మాజీలుగా మారారు. ఆ మాజీల నడుమ మన కథానాయకుడూ (మంత్రి మహోదయుడూ) ఉన్నాడనేది పాఠకులకు మరోమారు చెప్పాల్సిన అవసరం లేదులే!

ఈ మన మాజి మంత్రి మహోదయుడు రాజధాని నుంచి స్వగ్రామంకు చేరుకొన్నాడు. అక్కడిక్కడ ఆస్తి పొలం ఇల్లు చేసుకొన్నాడనే గుప్త సమాచారం ఉన్నా పూర్వీకుల నుంచి వచ్చిన ఇల్లును అతను పోగొట్టుకోలేదు. స్వగ్రామంలోని ఇంటికి చేరాడు. అతనితోపాటు అతని అర్ధాంగి పిల్లలు కుక్క పిల్లి రంగు చేపలతో నిండిన గాజుతొట్టె... ఇవన్నీ వచ్చినవి. ఆరునెలలలో మళ్ళా ఎలెక్షన్ వచ్చే సంభవం ఉన్నా మన మాజీ గారికి పార్టీ నుంచి టికెట్ ఇవ్వరాదని పెద్దలు నిర్ధారం చేసుకొన్నారు. ఎందుకంటే రాష్ట్రంలో పార్టీ నుంచి ప్రభుత్వ అధికార పగ్గాలు చేజారినందుకు మన కథానాయకుడు చేసిన జరిపిన ఛీప్ జిమ్మిక్కుల (గారడీలి) జనప్రియకార్యాలే ముఖ్య కారణంగా పార్టీ పెద్దలకు కనబడినవి. ఇక మన మాజిగార్ని అందరూ దూరంకేనెట్టి నిలబెట్టారు. మన మాజి మంత్రి మహోదయుడు చిల్లులుపడిన పడవలాగ తీరంకు లాగబడి ఎవరికీ అక్కరకు రాని వస్తువై నిలబడ్డాడు.

మన మాజిగారు గడ్డంకు చేతులు ఆనించి కూర్చుండి పోయాడు. ఇనపగేట్ కిర్ అంటూ చప్పుడు చేయట్లేదు. ఆటోలు, కార్లు, మోటార్ సైకిళ్ళు, సువేగా బండ్లు (మోపెడ్లు) ఆ వీధిలో రావట్లేదు. వచ్చినా ఇంటి ముందు నిలబడట్లేదు. వీధిలో తిరుగుతుండే జనం మన మాజి సార్ ఇంటి వైపు తలతిప్పి చూడట్లేదు. ఫోన్‌మీద రెండు అంగుళాల మందంగా ధూళు, అలాగే కుర్చీలు సోఫాల మీద కూడా!

కుర్చీలో అటు ఇటు పిరుదలు కదిలిస్తూ, జనం రాకూడదా నా చెంతకు అని కోరుకొంటూ లేచి బయటకు వచ్చి ప్రాంగణంలో ఉన్న క్రోటన్ మొక్కల చాటున తలపెట్టి రోడ్డుకున్న రెండు వైపులా మెడ బారుగా చాపి చూడసాగాడు. రాకూడదా జనం? బొటన వేలిముద్ర ఒత్తించుకొని కాగితాలు పట్టుకొన్న జనం, టైప్ చేయించుకొని అర్జీల్ని పట్టుకొన్న జనం, తన విళాసం (చిరునామా) రాసిన కవర్లను పట్టుకొన్న జనం... ఇప్పుడూ రాకూడదా? తహతహలాడుతూ ఆకలిగొన్న ఈనిన కుక్కలాగ, దాహంతో వెతుకుతున్న పశువులాగ మారి మళ్ళా లోపలికి చేరాడు. కూర్చుని పడుకొని లేచి ఏమేమో చేస్తూ చివరగా ఆల్బమ్ పట్టుకొని మంత్రిగా ఆ కాలంలో మెరిసిపోయిన ఫోటోల్ని చూడసాగాడు. వాట్ని చూస్తూ చూస్తుండగా ఇతనిలోని అధికార పిచ్చి ఎక్కువైపోసాగింది. తలగోక్కున్నాడు. పరపరా గజ్జి పట్టినోడి లాగ ఒళ్ళుగోక్కున్నాడు, తొడిగిన బట్టల్ని చింపుకొన్నాడు... బోడిముండా కొడుకులు,

లంజముండా కొడుకులు... ఇప్పుడు ఎక్కడికి వెళ్ళిపోయారో? ఫ్లోర్‌మిల్‌కు కరెంట్ కనెక్షన్ ఇప్పించండి అనివస్తుండే తౌడప్ప ఇప్పుడు ఎక్కడ చచ్చాడో? కొడుకుకు ఇంజినీరింగ్ సీటు ఇప్పించండని మొరబెట్టేటోడివి కదా దుర్గోజి... ఇప్పుడు ఎక్కడికి వెళ్ళావు? లైసెన్సులు, కాంట్రాక్ట్‌లు, ఋణం, ఇల్లు, బర్రెలు, గొర్రెలు, కోళ్ళు ఇప్పించండి అని మొక్కుతూ వస్తుండేవారు కదా బేవార్సి కొడుకుల్లారా... ఇప్పుడు ఎక్కడున్నారురో? పించెన్లకని, రాష్ట్ర ప్రశస్తకని వస్తుండేవారుకదా దొంగ నాకొడుకుల్లారా... ఇప్పుడు ఎక్కడచచ్చార్రో? ఎక్కడికి... ఎక్కడికి... పోయారురో...? అంటూ నెత్తి నోరు కొట్టుకో సాగాడు మన మాజి మంత్రి మహోదయుడు. ఆల్బమ్ తీసి దూరంకు విసిరాడు. గాజుతొట్టెలో చేయిపెట్టి సుందరంగా తిరుగుతున్న చేపను పట్టుకొని టేబిల్ మీద పడేసి, దానితోక ఎత్తి పట్టుకోగా ఆ చేప మొప్పలు తెరిచి ఊపిరి కని హైరాణాపడుతున్న స్థితి చూసి ఖుషీపడి... మరిక ఇలాగ ఏమేమో చేస్తూ కాలం గడపసాగాడు.

తిండి తినలేదు, నీళ్ళూ తాగలేదు. భోజనంకని పిల్చేందుకు వచ్చిన శ్రీమతిని గదిరించి నెట్టాడు. ఇలా ఉన్నప్పుడు చీకటి ముసిరి రాత్రి అయ్యింది. గదిలో దీపం కూడా వెలిగించకనే మన మాజీ గారు ఒక మూల కూలబడియున్నాడు. మళ్ళా కిటికి చెంతకు చేరి కూర్చుని బయట కమ్మిన కటిక చీకటిని దిట్టించి చూస్తూ తనకు ఒదిగి వచ్చిన దుస్థితికి పరితపించసాగాడు. అప్పుడు ఉదయం నుంచి మూసుకొని ఉన్న గేట్ ఠణ్ అంటూ శబ్దం చేసింది. హోహో జనం వచ్చిచేరారు. తన జనప్రియత తగ్గిపోలేదు. తను ఇకనూ జనుల అనురాగం పొందే ఉన్నాను అనే సంతసం ఉన్మాదం నుంచి లేచి హడావుడిగా బయటకొచ్చి, వెనకటి గజగాంభీర్యాన్ని ఛాతిని ప్రదర్శిస్తూనే గేట్‌వైపు చూసాడు.

"భోజనం అయ్యిందా స్వామి... ఏంటి విశేషాలు?" వచ్చినోడు ఇంటి ప్రక్కనుండే శ్రీసామాన్యుడు.

"రండి... లోనికే"

"సమయంరానీ... వస్తానని ఆనాడే చెప్పానుకదా..."

మన మాజి మంత్రి మహోదయుడు రెండు అడుగులు ముందుకు వేసి, కృశించి గడ్డిపోచలాగ అయిన ఆ ప్రక్కింటి వ్యక్తిని వాటేసుకొని బోరున విలపించసాగాడు.

❖ ❖ ❖

(బుద్ధుడికి చెందిన జాతక కథ ఒక దాని నుంచి స్ఫూర్తి ప్రేరణ పొంది రచించబడిన కది ఇది అని నా. డి'సోజ గారు చెపుతున్నారు.)

**మూలకథ రచనాకాలం : 1982**

# గోడగడియారాలు అమ్మే అవ్వ

రాత్రి నిద్రపోయిన జనం ఉదయంలో మేల్కొనే ముందే, వీధులలో ప్రభాతవేళ ఏవేవో వాట్ని అమ్మేవాళ్ళు కన్పించుకొంటారు. పాలు పండ్లు కూరగాయలు చేపలు కావాలా అని దిన నిత్యం అవసరపడేవాట్ని జనం ముందు ఉంచుతారు. ఎండపైకి ఎగబాకుతుంటే ఇంకా మరికొందరు చేతిబండ్లను నెట్టుకొంటూనో లేకపోతే వేరే మూటల్ని మోస్తూనో ఇళ్ళ ముందు కన్పించుకొంటారు. సత్తుపాత్రల్ని అమ్మే సిద్దమ్మ, స్టీల్ పాత్రల్ని అమ్మే మునివేలు, చీరల్ని అమ్మే జనార్దన, మరమరాలు, అటుకులు, చింతపండు, మిరపకాయలు, కందిపప్పు, నేయి మొదలైన వాట్ని అమ్మేటోళ్ళు వీధులలో కన్పించుకొని తమదే అయిన విశిష్ట ధ్వనితో కేకలు పెట్టి తమ రాక తెలియపర్చి ఆ వీధి దాటి మరో వీధికి చేరుకొంటారు. ఒక అరగంట ఒక వీధిలో గడిపి అక్కడ బేరం చేసి పరిచిత గిరాకీల జతగా పిచ్చాపాటి మాట్లాడి, కొన్నిసార్లు గిరాకీల నుంచి గీసిగీసి బేరం చేస్తున్నదానికి విసుగెత్తి "మాకు దొరికేదే ఎనిమిది అణాలు, అందులోంచి మీకేమి ఇవ్వగలం" అంటూ కోపంగా మాట విసిరి అక్కడ్నుంచి మాయమౌతారు. వీధులలో నివసిస్తున్న జనం ఏమైనాకానీ వీరి రాక కోసం ఎదురు చూస్తుంటారు. ఆ ప్రభాత ఝామున అమ్ముతున్నోళ్ళ నుంచి వీధి జనంకు అనుకూలంగా ఉంటున్నందున మరిక ఈ అమ్మేటోళ్ళను పూర్తిగా తిరస్కరించేందుకు ఎవరు కూడా సిద్ధంగా ఉండరండి! ఇందుచేత వీధి మొదట్లో బేరగాడికేక వినగానే "చూడుబిడ్డా, ఏమి వచ్చినవో" అంటూ మాతృమూర్తులు ఇంటిలోపల నుంచి తమ వారసులకు (పిల్లలకు) అరిచి చెపుతుంటారు. పిల్లలు బయటకొచ్చి తొంగి వంగి చూసి "పాలు... పాలు" అనో "పూలు అమ్మే హూవమ్మా" అనో లోపలికి వచ్చి తమ మాతాశ్రీలకు వరధి అప్పగించుతారు.

మొన్న కొత్తదైన స్వరం ఒకటి వినబడింది. చెవులకు తీరా అపరిచితమైన ధ్వని. ఆమె కేకపెట్టుంది ఏమిటనేది స్పష్టంగా తెల్వట్లేదు. ఇందుచేత తల్లులు తమ పిల్లల్ని పిల్చి "అదేంటో చూసి రండర్రో" అని చెప్పగా పిల్లలు కూడా కుతూహలం నుంచి ఇంటి అరుగు లేదా ప్రాంగణం, ఇంటి ముందున్న మెట్ల వద్దకొచ్చి నిలబడి చూసారు, విన్నారు అ కేక పెట్టిన మనిషిని.

ఆ వీధికి అంతవరకూ రాని ఒక అవ్వ తలమీద పెద్ద వెదురు బుట్ట ఉంది. అందులో ఏడెనిమిది గోడగడియారాలు పెద్దవిగా చిన్నవిగా గుండ్రంగా చౌకాకారంగా ఉన్న ఆకృతులతో నిండియున్నవి. గాజుముఖం, ఆకర్షణీయమైన బొమ్మలతో ఆ గడియారాలు ఉన్నవి. ఆ పోరలు విస్తుబోయి చూస్తుండగా అవ్వ పెదాలు తెరిచి కేక పెట్టింది. గడియారాలు అండి, గోడ గడియారాలు…కావాలా…క్వార్ట్జ గడియారాలు, అలారం గడియారాలు, గంటకొట్టే గోడ గడియారాలు… కావాలా మీకు అంటున్న ఆమె కేకలు విన్న పోరలకు తమాషగా అన్పించింది. గుండ్రంగా ఉన్న వెదురుబుట్టలో ఒకదాని మీద మరొకటిగా, ఒకదాని ప్రక్కన మరొకటిగా సుభద్రంగా పేర్చి పెట్టిన ఆ అవ్వ, బొంగురు ధ్వనినుంచి కేకలు పెట్తున్న దృశ్యం పూర్తిగా కొత్తదైనందున పోరలు బయట్నుంచే లోపలున్న తలుపుకు ముఖం చూపి “అమ్మా గడియారాలు అంట, గోడ గడియారాలు అంట, గంటలుకొట్టే గడియారాలు అంట, అలారం మోగించే గడియారాలు అంట” అని అవ్వ పలికినదాన్నే ఆ పోరలు పునఃఉచ్చరించారు. లోపల ఎక్కడో ఇంటి పనుల్ని చేస్తున్న మహిళలు, దిన పత్రికను చదువుతున్న ఇళ్ళయజమానులు ఆసక్తిగా బయటకు వచ్చారు.

ఇంత పొద్దుకే అవ్వ ఒకట్రెండు ఇళ్ళుదాటి ముందుకే సాగుతుంది. అప్పుడు మూడో ఇంటోడైన లింగణ్ణ అవ్వను పిలిచాడు. అవ్వ తల మీదున్న బుట్టను కిందకు దింపుకొని, బుట్ట కిందున్న తలచుట్టును చేతిలోకి తీసుకొని దాన్నుంచి గొంతును ముఖాన్ని తుడుచుకొంటూ లింగణ్ణ ఇంటి ముందున్న ప్రాంగణంలో హుష్ అంటూ రాగం పలికికూర్చుంది. అప్పుడు వీధిలోని కొంతమంది పోరలు, లింగణ్ణగారి అర్ధాంగైన మూకమ్మ, ఎదురింటికి చెందిన బాయమ్మ, పక్కనుండే ఇంటికి చెందిన సరస్వతమ్మ, లింగణ్ణ ఇంటికి కొంచెం దూరానుండే బూబమ్మ… ఇలాగున కొంతమంది మహిళలు, కుతూహలంగా పురుషులు అక్కడ జమై అవ్వకు చెందిన గడియారాల బుట్టలోకి వంగి తొంగి చూడసాగారు.

అందరి మోములలో కుతూహలం ఉంది అనేదాన్లో సందేహం లేదు. ఎందుకంటే వారంతా పూలు, కూరగాయలు, చేపలు, అటుకులు, మరమరాలు, చింతపండు, కందిపప్పు, నువ్వులు ఇత్యాది వాట్ని అమ్మేవాళ్ళను చూసారు గాని, గోడగడియారాల్ని అమ్మేందుకు వచ్చినోళ్ళను ఇంతకు మునుపు చూసి ఉండలేదు. గడియారాలన్నిట్లో ముళ్ళు టిక్ టిక్ టిక్ సప్పుడు చేస్తూ తిరుగుతుండగా, ఒకరొకరు ఒకొక గడియారం పట్టుకొని దాన్లోని ఆకారం, దాని మీదున్న బొమ్మలు, దాన్లోని డిజైన్ మొదలైన వాట్ని చూస్తుండగా, అవ్వ తనను పిల్చిన లింగణ్ణ వైపు దృష్టినిల్పి

"చూడు తమ్ముడు, మొదటిసారిగా ఈ వీధికి వచ్చా... బోణి చేసి పంపు, సరసమైన రేటుకే ఇస్తాను" అంది.

లింగణ్ణకు అర్ధాంగైన మూకమ్మ ఎప్పట్నుంచో ఒక గోడగడియారం కొనండని చెపుతుంది. వారి ఇంట్లో బ్రిటీష్ కాలంనాటి ఒక స్టీల్ గడియారం ఉంది. అది లింగణ్ణ నాయనకాలం నాటిది. ఒకానొక కాలంలో అది ఆకర్షణీయంగానే ఉండేది. సెకండ్ల ముల్లు మీద కూర్చున్న కోడి ఒకటి భ్రమతో ఎల్లప్పుడూ క్రింద ఉండని గింజల్ని కుక్కికుక్కి తింటుండేది. అయితే ఈ కోడి తను తినేదాన్ని నిల్పేసి ఇప్పటికే ఎన్నో సంవత్సరాలు గడిచిపోయినవి. అది అలారం కొట్టట్లేదు. అంతేగాకుండా సరిగా గంటల్ని (టైమ్) చూపించట్లేదు. చుట్టుప్రక్కలుండే ఇళ్ళలో కొత్త రకాల గడియారాలు వచ్చి గోడ మీద కూర్చుండగా తమ ఇంట్లో ఉన్న ఈ గడియారం మీద వాళ్ళకు జుగుప్స ఉంది. భార్యాపిల్లలనుంచి శాపనార్థాలు పెట్టించుకొన్న లింగణ్ణ రోసిపోయాడు. ఇంటి చెంతకే గడియారాల్ని అమ్మేందుకు అవ్వ వచ్చినందున మరిక అది కొంచెం తక్కువ ధరకే దొరకొచ్చని అతని భావనగా ఉంది. ఇందుచేత అవ్వ ఆ వీధిలోకి వచ్చి తొలికేక పెట్టినప్పుడు తక్షణమే ఇంటి బయటకొచ్చాడు. అలాగే "రామ్మాఇటు" అంటూ ఆమెను పిల్చాడు.

లింగణ్ణ ఒకట్రెండు గడియారాల్ని చేతిలో పెట్టుకొని చూస్తుండగా, అవ్వే ముందుకొచ్చి ఒక గడియారం వెతికి లింగణ్ణ చేతిలో పెట్టి "చూడు తమ్ముడా... దీన్ని తీసుకో, కొత్తరకం గడియారం ఇది... ధరకూడా జాస్తిగా లేదు" అంది.

లింగణ్ణ దాన్ని చేతిలోకి తీసుకొన్నాడు. కొండలు వృక్షాలు చెట్లు లతలతో, ఒకచోట బర్రెలు ఆవులు మేస్తున్నవి. వీటి నడుమ గోళాకారంలో గడియారం. రెండు ముళ్ళూ సంబరంగా తిరుగుతున్నవి.

లింగణ్ణ అర్ధాంగైన మూకమ్మ " ఇది ఎంతో పసందుగా ఉంది, దీన్నే తీసుకోండి" అంది. ఆమెకు ఏదోదిగులు. భర్త గడియారం కొనకనే ఏదో నెపం చెప్పి ఈ అవ్వను పంపేస్తే...

లింగణ్ణ గోడగడియారాల మీద తనకంతా తెల్సు అన్నట్లుగా గడియారాన్ని అటు ఇటు తిప్పి పరిశీలనగా చూసి "ఇది ఏ కంపెనీది" అని అడిగాడు.

"దాని మీద ఇంగ్లిపీసులో రాసారు చూడు సిటిజన్ అని..." అంది అవ్వ కొంచెం సహనం కోల్పోయి.

"గ్యారెంటి ఏమైనా ఉందా?"

"ఎంథ గ్యారెంటి ఉంటది. దేముడు నాకు నీకు గ్యారెంటి ఇవ్వలేదు. ఇక ఈ డెబ్బైరూపాయల గడియారంకు ఎంథ గ్యారెంటి ఉంటది... గడియారం చక్కగా ఉంది... ఒక పది సంవత్సరాలు చింత ఉండదు..."

"సరే... రేటు ఎంతో చెప్పు"

"ఈ గడియారాల వ్యాపారంలో గీసిగీసి బేరం చేసేది లేదు. ఒకే ఒక రేటు డెబ్బైఐదురూపాయలు" అంది అవ్వ కట్టె విరిచినట్లుగా. అలాగే ముందుకెళ్తూ "నా కమీషనులో కొంచెం తగ్గించుకొని ఇస్తాను... డెబ్బై రూపాయలు ఇవ్వు" అంటూ అవ్వ నిదానంగా తలచుట్టను తలలో పెట్టుకొని అక్కడ్నుంచి బయల్దేరేందుకు సిద్ధమైంది.

"బూబమ్మా నీ ఇంట్లో ఉండేది ఇదే కదా... నువ్వెంతకు కొన్నావు?" అని అడిగింది మూకమ్మ.

"మా గడియారాన్ని పట్నంలో నూరురూపాయలు కుమ్మరించి కొన్నాం" అంది బూబమ్మ. మళ్ళా "మాది దీనికన్నా కొంచెం నాజూకైంది" అంటూ మరోమాట చేర్చింది. లింగణ్ణేమో గడియారాల్ని చూసేందుకని వచ్చిన ఇంకా ఒకరిద్దర్ని అడిగి గడియారం కొనాలో వద్దో అన్నట్లుగా మీమాంస చేస్తుండగా, ఎదురింటి సరస్వతమ్మ "అవ్వా... నువ్వు క్రితంలో సత్తుపాత్రల్ని అమ్మేదానివి కదా?" అంటూ అవ్వను వేరొక విషయంలోకి లాగింది.

"నేను సత్తుపాత్రల్ని అమ్ముతుండేదాన్ని నువ్వెక్కడ చూసావు తల్లీ?" అంటూ ప్రశ్నించింది అవ్వ.

"నెహ్రూ నగరంలో మేము ఉన్నప్పుడు అక్కడనువ్వే కదా సత్తుపాత్రల్ని అమ్ముతుండేదానివి?"

"ఔనౌను తల్లి... నేను చేయని వ్యాపారం లేదు... ఇప్పుడు దీన్ని చేస్తున్నాను..."

"ఆ వ్యాపారంలో ఏమి గిట్టలేదా నీకు?"

"చూడు తల్లి... నేను పూర్వంలో పూలు అమ్మేదాన్ని. పూలగంగమ్మ పూలగంగమ్మ అంటూ నన్ను పిలుస్తుండే వాళ్ళు. ఆ తర్వాత కూరగాయలు అమ్ముతూ తిరిగాను... ఆ తర్వాత చీరల వ్యాపారం చేసాను... సత్తుగిన్నెల వ్యాపారం చేసాను... ఇదుగో ఇప్పుడు ఇది...! తమ్ముడూ నీకు గడియారం కావాలా వద్దా?" అంటూ లింగణ్ణ వైపుకు తిరిగి అడిగి అలాగే సరస్వతమ్మకు తన గురించి చెప్పింది అవ్వ.

"వ్యాపారంలో గిట్టే లాభనష్టం అంతింతగా కచితంగా ఉండదు... అన్ని వ్యాపారాలలోనూ లాభం ఉంటది, నష్టమూ ఉంటది... జీవనం సాగించేందుకు వ్యాపారం ఒక తోడ్పాటు ఇస్తది... వ్యాపారం అంటే దేముడి మీదభారం వేసి చేసే

దందా... లాభం వచ్చినా అతడి దయే; నష్టం వచ్చినా అతడి దయే..."అంది అవ్వ.

"అలాగైతే ఒకటే మాటా నీది" అంటూ లింగణ్ణ నోరు పారేసాడు.

"ఔను తమ్ముడు... ఒకేమాట నాది..." అంటూ లింగణ్ణ చేతినుంచి ఆ గడియారాన్ని తీసుకొనేందుకు అవ్వ చేయి చాపినప్పుడు లింగణ్ణ లోపలికి వెళ్ళి డబ్బు తెచ్చి అవ్వ చేతిలో పెట్టాడు. అవ్వ అతని ముఖం చూస్తూ "గడియారంలో ఏదైనా మిస్టేకు ఉంటే... గణపతి దేవస్థానం చెంతనుండే కామత్‌గారి గడియారాల షాపుకు దీన్ని తీసుకెళ్ళండి... వారు రిపేరు చేసి ఇస్తారు... ఈ గడియారాన్ని అవ్వ వద్ద కొన్నాను అని చెప్పండి" అంటూ లింగణ్ణ ఇచ్చిన డబ్బును తన మెడలో ఉన్న సంచిలో వేసుకొని అవ్వ లేచింది మరో వీధిలోకి వెళ్ళేందుకని.

మరో వీధికి వెళ్ళిన అవ్వ "గడియారాలు కావాలా...మంచి గోడ గడియారాలు" అని కేక పెట్టూ ముందున్న దారి పట్టుకొంది. లింగణ్ణ ఇంట్లో గోడగడియారంను ఎక్కడ వేలాడదీయాలి అనే సంబురంతో కూడిన సమాలోచనలు జరుగుతుండగా మరిక అతని ఇంటి ముందు పోగైన జనం చెల్లాచెదురైయ్యారు.

ఆ వీధికి వచ్చినందున అవ్వకు మంచి బోణి అయ్యింది. దాంతోపాటే ఎవరో ఒకామె తను నెహ్రూకాలనీలో సత్తుపాత్రల్ని అమ్ముతున్న విషయాన్ని ప్రస్తావించి తలతింది కదా!

బస్టాపు నీడలో కూర్చుని గడియారాలు ఉన్న బుట్టను దించింది. అలాగే ఒకసారి బుట్టలో దృష్టి పెట్టింది. ఉదయంలో వ్యాపారం కని బయల్దేరినప్పుడు తెచ్చుకొన్న సరుకులో రెండు గడియారాలు అమ్ముడైనవి. మిగిలిన గడియారాలకూ సాయంత్రం లోపల గిరాకీలు దొరకొచ్చు. గడియారాలు చక్కగా ఉన్నవి. అందంగా ఉన్నవి. అన్ని గడియారాలకూ బ్యాటరీలు వేసి, వాటి సమయాన్ని కరెక్ట్‌గా పెట్టినందున కచితంగా సమయాన్ని తెల్పుతూ తిరుగుతున్నవి.

అవ్వ తన చీర చెరగునుంచి గడియారాలన్నిట్నీ నాజూకుగా తుడిచింది. వాటి మీద ఉన్న చిత్రాల్ని, మెరుస్తున్న అంకెల్ని, తిరిగే ముళ్ళను చూసింది. గడియారాలలోని టిక్ టిక్ టిక్ చప్పుడు ఆమెకు ఆప్యాయమానంగా విన్పించింది. అన్ని గడియారాల్ని మరోమారు బుట్టలో చక్కగా జోడించి పెట్టుకొంది. అవి కదలనట్లుగా ఒకదాని పక్కన మరొకదాన్ని పేర్చి పెట్టుకొంది.

అలాగే బుట్టలో ఉన్న ఆకు వక్కల సంచి తీసుకొంది. దానికి ముడేసినతాడు విప్పినోట్లో వక్క వేసుకొని నములుతూ ఆకులకు సున్నం రాస్తున్నప్పుడు ఆమె మనస్సులోకి గతకాలం ప్రవేశించింది. అరకెరెలో పూల వ్యాపారం చేస్తుండేది ఆమె

జనని. ఐదారు ఇళ్ళలో పూసిన పూలు తెచ్చి మాలలుగా వాట్ని కట్టి బుట్టలో పెట్టుకొని వీధి వీధికి తీసుకెళ్ళి అమ్ముతుండేది. పూలు అమ్మే మల్లమ్మగా ఆమె పిలవబడుతుండేది. గంగమ్మకు (అవ్వకు) బుద్ధి వచ్చినప్పుడు తండ్రి ఎవరు అనేది గుర్తులేకపోయినా తల్లి (మల్లమ్మ) ఎవరనేది బాగానే తెల్సు. అరకెరెలోని గానుగ ఆడించే వీధిలో చిన్న ఇల్లు కట్టుకొని తల్లిబిడ్డ బతుకుతుండేవారు. నిదానంగా గంగమ్మ తన మాతృమూర్తికి పూలమాలలు కట్టేదాన్లో సహాయపడసాగింది. మల్లమ్మ వీధులలో తిరిగి పూలమాలలు అమ్మి వస్తుండగా, గంగమ్మ ఇంట్లో ఉండి మాలలు కట్టుతుండేది. మల్లెలు, కనకాంబరాలు, చేమంతులు, బంతిపూలు, జాజిపూలు, సుగంధరాజ పూలు... వీటి జతగా దవనం చేర్చి మాలలు కట్టేది. వివిధరకాల పూల మాలలు, దండలు కట్టేదంతా స్వయంగానే నేర్చింది గంగమ్మ.

మల్లమ్మకు మోకాళ్ళనొప్పి నడుంనొప్పి అధికం అన్నప్పుడు గంగమ్మే వెళ్ళి పూలమాలల్ని అమ్మి వస్తుండేది. క్రమేణ ఈ పనే ఆమెకు కచితమైపోయింది. "పుత్రీ, నువ్వే మాలలు కట్టి అమ్మి రా తల్లి" అని ఒకరోజు మంచంలో పడిన మల్లమ్మ ఎనిమిది రోజుల తర్వాత మరిక పైకి లేచి తిరిగే స్థితికి రానట్టైంది. గంగమ్మ అప్పుడు నికరంగా పూలమాలలు కట్టి అమ్మే పనుల్ని ఒప్పుకొంది. కొన్ని రోజులకే తల్లి మల్లమ్మ చనిపోయింది. పూలు అమ్ముతుండగా గంగమ్మకు నంజనగూడు పట్నంకు చెందిన ఒకడు పరిచయమైయ్యాడు. అతను అరకెరెకు వచ్చి గంగమ్మ వద్ద పూలు పట్టుకెళ్తుండేవాడు. అతనే ఒకరోజు గంగమ్మకు చెప్పాడు ఇలా: "నువ్వు పూలమాలలు కట్టి వీధి వీధి తిరుగుతూ అమ్మేది ఎందుకు? పూలమాలల దండలు కట్టిఉంచు, నేనే రోజూ వచ్చి పట్టు కెళ్తాను... నీకు కూర్చున్న చోటే డబ్బు వస్తది. తిరుగాట ఎందుకు?"

అతని మాట సరిగానే ఉందని అన్పించింది గంగమ్మకు. అలాగే చేయసాగింది. ఎవరెవరు మల్లెలు, కనకాంబరాలు, చేమంతులు, బంతిపూలు, జాజిపూలు పెంచుతున్నారో వాళ్ళ వద్దకువెళ్ళి పూలుకొని తెచ్చి వాట్ని మాలలుగా దండలుగా కట్టేది. అతను వచ్చినప్పుడు వాట్ని అతనికి ఇస్తుండేది. అతను వాట్ని నంజనగూడుకు పట్టుకెళ్ళి, అక్కడుండే దేవస్థానం ముందున్న అంగళ్ళలో అమ్మేది జరగసాగింది. ఇలాగున గంగమ్మ పనులు సాగుతున్నవి. పూల మాలల్ని దండల్ని కొనేందుకు వస్తుండే అతను క్రమేణ గంగమ్మకు దగ్గరైయ్యాడు. ఒక రోజు అతనే నోరు తెరిచి అడిగాడు.

"గంగా నువ్వు నంజనగూడుకు వస్తావా?"

"అక్కడికి వచ్చి నేను ఏమి చేసేదుంటది?"

"నీకు గుడిముందే ఒక పూల అంగడి తెరిచి ఇస్తాను, రా"

"మరి నేను ఉండేది ఎక్కడ?"

"అక్కడ నాకు ఇల్లు ఉంది కదా" అంటుండగా గంగమ్మకు అంతాఅర్థమైంది. ఆమె ముఖం కనకాంబరాలు అన్నట్లుగా ఎరుపెక్కింది. నాలుగు రోజులు గడిచిన తర్వాత గంగమ్మ హుం అంది.

నంజుండేశ్వరస్వామి గుడిముందు పూల అంగడి ఒకటి తలెత్తింది. నాలుగు బారుకట్టెల్ని నిలువుగా నాటి, పైన వెదురు తడికలు కప్పి ఆ నాలుగు బారు కట్టెల నడుమ చెక్కపలకల్ని పరిచి వాటి మీద పూల తట్టలు నిల్పి, క్రింద ఒక మేజా బల్ల ఉంచి అక్కడ కూర్చుంది గంగమ్మ. ఆమె భర్త చుట్టు ప్రక్కల ఉండే గ్రామాల నుంచి పూలుతెచ్చి అంగడిలో రాశిగా పోస్తుండేవాడు. గంగమ్మకు వ్యాపారం మంచిగానే ఉంది. మొగుడు పెళ్ళాం సుఖంగానే ఉన్నారు.

గంగమ్మ గర్భం దాల్చి కాన్పుకని మూడు మాసాలు ఇంట్లోనే గడిపింది. పాపచేతులలో కూర్చోగలదు అని భావించి పాపను ఎత్తుకొని గుడి ఉండే వీధికి వచ్చినప్పుడు, ఆమె అంగడిలో మరెవతో సోకులాడి కూర్చుని ఉంది.

"ఎవరమ్మా నువ్వు?" అంటూ నిదానంగానే ప్రశ్నించింది గంగమ్మ.

"నన్నే అడుగుతున్నావా; ఈ అంగడ్ని నాకు అప్పగించాడు కదా ఆ మగోడు, అతడ్నే అడుగు" అంది ఆమె గడుసుగా.

ఇతర అంగళ్ళలో పూలు ఇచ్చి వచ్చిన భర్తను అడిగినప్పుడు అతను "ఇన్ని రోజులు నువ్వు కూర్చున్నావు కదా, ఇక ముందు ఈమెనూ కూర్చోనీ" అని తేలికగా పలికాడు.

చంకలో ఉన్న పాపను బెంచీలో పడుకోబెట్టి శివంగిలా గంగమ్మ కొత్తామె సిగముడి మీద చేయి వేసి ఆమెను కిందకు లాగిపడేసి, తనే అంగడిలో కూర్చుంది. "మరిక ఏమైనా తకరారు చేస్తే మీ ఇద్దరి తిథి చేస్తాను" అంది ఉగ్రంగా.

వారేమి గలాటా చేయలేదు. అయితే మరుసటిరోజే ఆ మహిళ ఈమె అంగడి పక్కన వేరొక అంగడి తెరిచింది.

"నా సవతి ముండ నా జతగా పైపోటీకి నిలిచింది... నిలవనీ" అంటూ పళ్ళు పటపటా కొరికింది.

ఐదారు సంవత్సరాలు అక్కడే పూల వ్యాపారాన్ని కొనసాగించింది. తర్వాత ఏమి అన్పించిందో ఆమె అంగడ్ని వదిలేసింది. వీధి వీధికి ఇంటింటికి పూలమాలలు పట్టుకెళ్ళి అమ్మకం చేసింది. ఆ ఊరంతా పూలగంగమ్మగా పేర్గాంచింది.

ఈమె గర్భంలో ఒక ఫలం పడేసిన ఆ మూర్ఖుడు ఒకరోజు ఇంటిలో గుండెనెప్పికి బలై చనిపోగా, గంగవ్వ తన సిగలో ముడిచిపెట్టుకొన్న పూలమాలను లాగి విసిరేసింది. అదెందుకో ఆరోజు నుంచి ఆమె పూలమాలల్ని దండల్ని కట్టి అమ్మేదాన్ని ఆపేసింది. కూరగాయలు, అరటి పండ్లు కొని వీధి వీధి తిరిగి అమ్మేది చేయసాగింది.

ఆ వ్యాపారం ఆమెకొక ఆసరా ఇచ్చింది. రూపాయి పెట్టుబడికి రూపాయి లాభమన్నట్లుగా ఆమె సరైనంత డబ్బు గడించింది. పెరుగుతున్న కూతురుకు వివాహం చేయాలనే కోరిక పెరగగా, కూతురుకు ఒకింత బంగారు నగలు చేయించి, కూరగాయలు అమ్మే బసప్పకొడుకైన నంజణ్ణకు పుత్రికను కట్టబెట్టి వివాహం జరిపించింది. కూతురును ఆమె మెట్టినింటికి పంపి ఒంటరిగా మారి తన ఇంట్లో కూర్చుని చీర చెరగును ముఖంకు అడ్డుగా పెట్టుకొని ఏడ్చింది.

అదెందుకో ఈ పండ్లు కూరగాయల వ్యాపారం విసుగు అన్పించింది ఆమెకు. దాన్ని వదిలి చీరల వ్యాపారంలోకి దిగింది. చిన్న మూటలో పదే పదైదో చీరల్ని పెట్టుకొని శ్రీమంతుల ఇళ్ళను వెతుకుతూ వెళ్ళింది ఆమె. "అమ్మా... చీరలు చూస్తారా... మంచి చీరలు... దావణగెరె కాటన్‌చీరలు, మైసూరు పట్టు చీరలు... కట్టి నచ్చిన తర్వాతే డబ్బు ఇవ్వండి" అంటూ గంగమ్మ మాటలతో వాళ్ళను మెప్పించింది. చీరల వ్యాపారం బాగానే జరిగింది. పట్టణంలో ఉండే పెద్ద షాపుల వాళ్ళు ఆమెకు చీరల్ని సరఫరా చేస్తుండేవారు. ఈమె కమీషన్‌కని కొన్ని రూపాయలు తగ్గించి ఇస్తుండేవారు. గంగమ్మ చీరల్ని మారు బేరంగా అమ్మి తన వ్యాపారాన్ని కుదురుగా చేసుకొంది. అయితే పెద్ద షాపుల వాళ్ళు అసూయతో మోసం చేసినందున ఈమె వ్యాపారం చేజారింది. రానురాను ఈమె అమ్ముతుండే చీరల రంగు వెలిసిపోతుండేది. చీర ఉతికిన తక్షణం ముడతలు ముడతలుగా ముడుచుకుపోతుండేవి. ఆరు గజాల చీర ఐదు గజాలుగా కుచించుకుపోతుంది అని ఆ శ్రీమంత మహిళలు చెప్పసాగినందున ఋజువు చూపినందున మరిక గంగమ్మ చీరల వ్యాపారాన్ని నిల్పేసింది.

ఇక ఆమె పట్టుకొంది సత్తుపాత్రల వ్యాపారాన్ని.

పట్నంలో ఉన్న హోల్‌సేల్ అంగడిలో పాత్రల్నికొని, వాట్ని పెద్ద బుట్టలో నింపుకొని వీధి వీధి తిరుగుతూ "అమ్మా సత్తు పాత్రలు" అంటూ కేక బెట్టేది. ఈ వ్యాపారం కూడా ఆమె చేతికి ఒప్పింది. అయితే గంగమ్మ తను మొదట్లో పూలమాలలు అమ్మేందుకు వెళ్ళిన వీధులలో పాత్రలు అమ్మేందుకు వెళ్ళేది లేదు. ఇలా వెళ్తే "నువ్వు ఇప్పుడు ఈ సత్తుగిన్నెల్ని అమ్ముతున్నావా?" అని హీనంగా అడుగుతుండేవారు. ఈ

రగడ, ఈచిన్న చూపు ఎందుకని ఆమె వేరే కాలనీలకు వెళ్తుండేది. రానురాను ఈ వ్యాపారం కూడా వద్దని అన్పించింది ఆమెకు. "ఏందమ్మా... అందరూ స్టేన్‌లెస్ స్టీలు పాత్రల్ని వాడుతుండగా, నువ్వు ఈ సత్తుగిన్నెల్ని అమ్మేది సరైనదేనా?" అని ఎవరో అన్నప్పుడు ఆమె ఆ వ్యాపారాన్ని వదిలేసింది.

ఇప్పుడు గంగమ్మ వయస్సు భారం నుంచి గంగవ్వగా మారి సత్తుగిన్నెలు బదులుగా గోడ గడియారాల వ్యాపారంలోకి దిగింది.

ఇదీ ఒక కతే నండి! వీధులలో వ్యాపారం చేసే వాళ్ళ సంఖ్య ఎక్కువైంది. అది ఇది అని అంతట్ని తెచ్చి జనం వీధులలో వ్యాపారంకు దిగారు. జతగా పై పోటి విపరీతంగా ఉంది. కూరగాయలు అమ్మేటోళ్ళు, పాత్రల్ని అమ్మేటోళ్ళు జాస్తిగానే ఉన్నారు. తనకు వయస్సు పై బడినందున మరిక వాళ్ళతో పైపోటీకి నిలవలేను అని భావించి ఒక రోజు ఆమె గణపతి దేవస్థానం చెంతనుండే కామత్ గారి వాచీల షాపుకు వెళ్ళింది. "స్వామి, నాదొక పిలాను (ప్లాన్). నేను రోజూ పది గోడగడియారాల్ని అమ్మి పెట్తాను. గడియారంకు ఇంత లాభం అని ఇవ్వండి. మీకు మోసం చేయను..." అంటూ వివరంగా తన పిలాను కామత్ గారి ముందు ఉంచింది గంగవ్వ. అప్పుడే క్వార్ట్జ్ గడియారాలు మార్కెట్టులో ప్రవేశించినవి. రేటు తక్కువ. వాటి మీద జనంలో ఆసక్తి కలిగింది. సరే అన్నారు కామత్ గారు. ఇక అవ్వ గడియారాల బిజినెస్‌లో దిగింది.

మేదర్ల బస్తీకి వెళ్ళి పెద్ద బుట్ట ఒకటి కావాలి అని అడిగినప్పుడు మేదర లక్ష్మణ్ణ "అవ్వా బుట్ట ఎందుకు? కూరగాయలు నింపేందుకా?" అని ప్రశ్నించాడు.

"కాదు లక్ష్మణ్ణా... గడియారాల్ని నింపుకొనేందుకు, గోడ గడియారాల్ని."

"గోడ గడియారాలా?" ఆశ్చర్యపోతూ అడిగాడు అతను.

"ఔను నాయనా, ఇక ముందు గోడగడియారాల వ్యాపారం చేయాలని అనుకొంటున్నా"

"ఓ మైసూరు నగరంలో పెద్ద గోడగడియార గోపురం ఉంది... ఊరికంతా టైమ్ చూపిస్తది. అలాగే నువ్వు గడియారాల్ని తల మీద పెట్టుకొని ఊరుకంతా టైమ్ తెల్పే కార్యాన్ని చేస్తావా" అంటూ వెడల్పైన, లోతైన, గట్టిదైన, తేలికగా ఉండే ఒక వెదురు బుట్టను వెతికి ఇచ్చాడు. ఆ మరునాడే అవ్వలోని కొత్త వ్యాపారం షురువైంది (ప్రారంభమైంది).

తనుండే పట్నంలోని నాలుగు రోడ్ల కూడలిలో కొన్ని సార్లు గడియారాలు నింపిన బుట్టను ఉంచుకొని కూర్చునేది. అక్కడ అంతో ఇంతో వ్యాపారం చేసి తర్వాత

వీధి వీధికి గడియారాల్ని కేకబెట్టి అమ్ముతూ వెళ్తుండేది. కొంతమంది నవ్వసాగారు. కొంత మంది "ఓ గడియారాల అవ్వా" అని పిలవసాగారు. ఇంకా కొంతమంది తుంటరి పోరగాళ్ళు "అవ్వా టైమ్ ఎంతైంది?" అంటూ తమాష చేసారు. అవ్వ తల చెడుపుకోలేదు. గడియారాలు ఆమె చేతికి ఆసరా ఇచ్చినవి. చక్కగా తక్కువ ధరతో ఉన్న గడియారాల్ని జనం ఎంపిక చేసుకొంటున్నందున, ఆమె అలాంటి మేలు రకాల గడియారాల్ని కామత్‌గారి అంగడి నుంచి ఎంపిక చేసుకొని వాట్ని అమ్ముతుండేది.

గోడ గడియారాల్ని నింపి పెట్టుకొన్న వెదురు బుట్ట మోస్తూ వీధి వీధి తిరిగేది అమెకు కష్టమైన పనిగా అన్పించలేదు. అలాగే అవ్వ పట్నం చెంత ఉండే గ్రామాలకు వెళ్ళింది. అక్కడా మంచి వ్యాపారమే అయ్యింది. చేతికి డబ్బూ ఒనగూడింది.

ఇక్కడ ఈ వ్యాపారంలో కొన్ని అనుకూలాలు ఉన్నవి. గడియారాలు వాడిపోయేదిలేదు పూలులాగ. కుళ్ళిపాడైయ్యేది లేదు కూరగాయలు లాగ. గడియారాలకు పురుగు పట్టేది లేదు. నుసిపీడలేదు. గడియారాలు ఒణిగిపోయి బెండుగా అయ్యేదిలేదు. రేపు ఈ సరకును కొనేది ఎవరూ లేరనే మాట లేదు. ఇలా ఎన్నో అనుకూలాల నుంచి ఆమె వ్యాపారం మంచిగా సాగిపోతుంది.

నెలకొకసారి ఆమె కూతురు, అల్లుడు తమ పిల్లోడి జతగా వచ్చి ఈమె ఇంట్లో గడిపి వెళ్తున్నారు. కూతురు అల్లుడు సుఖంగానే స్థిరంగానే ఉన్నారు. ఇలా తల్లి చెంత కొచ్చిన కూతురు ఒక రోజు "అమ్మా... ఇక ఈ పనులు చేసేది చాలు, మాతో వచ్చి ఉండు... నువ్వేమి మాకు భారంకాదు" అని మొక్కింది. కూతురు పలుకుతున్న పలుకులకు అల్లుడు కూడా ధ్వనికల్పాడు. మనమడు కూడా "అవ్వా మా ఇంటికిరావే" అంటున్నాడు.

"లేదు పుత్రి... నా బతుకు నాకు ఉండనీ" అంటూ నవ్వుతుండేది. అలాగే "ఈ గోడ గడియారంలో చిన్న ముల్లు ఉందికదా... దానికి దారి చూపించేది పెద్దముల్లు కదా... నేనూ అలాగే... అక్కడ అతను (దేముడు) ఉన్నాడు కదా పైన, అతను చూపించిన దారి పట్టుకొనే వెళ్తున్నాను... అలాగే అలారం గంట వినబడింది అంటే లేచి వెళ్ళి పోతాను అతని పాదాల చెంతకు" అని చెప్పి నవ్వుతుండేది. ఈ తాత్విక మాటలకు ఆ పుత్రిక, అల్లుడు ఏమి జవాబు చెప్పగలరు?

అవ్వకైతే ఈ వ్యాపారం ఎంతో ఒప్పింది. క్రితంలో పూలు, కూరగాయలు, చీరలు, సత్తుపాత్రలు అమ్మేటప్పుడు కలగని తృప్తి, నెమ్మది ఇప్పుడామెకు దొరికింది. అప్పట్లో డబ్బుకేమి కొరతలేదు. అయితే మనస్సుకు ఏమి సంతృప్తి ఉండేదిలేదు. ఈ

కారణంనుంచే ఆమె తన వ్యాపారాల్ని మార్పుచేసుకొంది. అయితే ఇప్పుడు అలాకాదు... ఒకొక గడియారాన్ని ఒక్కొక్కరికి అమ్మేటప్పుడు ఏదోఒక విధమైన తాత్విక భావన ఆమెలో ఉంది.

"ఇల్లు అన్న తర్వాత ఒక గడియారం ఉండాలి తమ్ముడూ... ఇది నీ ఇంట్లో ఉండనీ... టిక్‌టిక్‌టిక్ అంటూ సప్పుడు చేస్తూ... గంటకొకసారి గంట మ్రోగుతుంటే ఎవరో జతగా ఉన్నట్లుగా అవుతది... గడియారం అంటే జతగా ఉండే నమ్మకమైన స్నేహితుడిలాగ... మనకు సమయపాలన గురించి ఎచ్చరించే స్నేహితుడిలాగ... తీసుకో..." అంటూ గడియారాల్ని అమ్ముతుండేది అవ్వ.

అవ్వ కొత్త కాలనీలను, కొత్త వీధుల్ని వెతుకుతూ పోతుండేది.

ఇప్పుడూ గోడగడియారాల్ని అమ్మే అవ్వకేక వినబడుతుంది గట్టిగానే. "గోడ గడియారం కావాలా, కార్ట్జ్ గడియారం, గంటలు మోగించే గడియారం, అలారం గడియారం... గడియారం కావాలా..." అంటూ కేకపెట్టి ముందుకే వెళ్తుంది మన అవ్వ.

**మూలకథ రచనాకాలం : 2008**

# కుర్చీకి చెందిన కథకు ఒక కొత్త మలుపు

కణసేజట్యప్ప ముఖం చేటంతగా అయినందుకు ఒక కారణం ఉంది. అతను ఎంతోకాలంగా ఎన్నో సంవత్సరాలనుంచి ఎదురుచూస్తూ వచ్చిన ఒక కార్యాన్ని తన జాతికే చెందిన తరుణుడొకడు ముందుకే కొనసాగించేందుకు ప్రయత్నం చేసాడు కదా! అది ఆ కార్యం జట్యప్ప చామనచాయ ముఖం మీద తేలికైన నవ్వుగా అయ్యి బయటకు వచ్చేందుకు అవకాశం కల్పించింది.

"అరెరే ఔనా? దొరముందు మన పోరడు ఆ పనిచేసాడా?" అనే ఈ వార్తను తెలుపుతున్నోళ్ళందరి నుంచి విని కచితం చేసుకొని మరిక ఆ యువకుడ్ని చూసేందుకు భుజం మీద గొంగడి వేసుకొని బయల్దేరాడు.

కణసేజట్యప్ప కౌలుదారు రైతు. దొర జమీనును కౌలుకు చేస్తూ తన బీద కుటుంబానికి ఒక దారి కనుగొన్నాడు. అతనికి చుట్టుపక్కలున్న గ్రామాలలో ఉండే వాళ్ళంతా ఇతని లాగే కౌలుదారులుగా బతుకును కట్టుకొన్నోళ్ళే కదా! వీళ్ళు ఎవరి పొలంకు కౌలుదార్లుగా అవుతారో, ఆ భూస్వామిని ఇలాగిలా చూసుకోవాలి, గౌరవించుకోవాలి అనేది ఒక నియమంగా ఉంది. భూస్వామి ముందు తగ్గి వంగి నడవాలి. వారిని వారి సంతానంను మర్యాదనుంచి గౌరవించాలి పూజించాలి. వారి ఇంటిముందు చెప్పులు తొడిగి వెళ్ళకూడదు. కట్టుకొన్న చొక్కా విప్పి మడిచి చంకలో ఇరికించుకుని వెళ్ళాలి. వారి ఇంటికి ఏదో పనిబడి వెళ్ళినా, వారి ఇంటెనుక పశువుల కొట్టంచెంత దొరవారికని వారి అర్ధాంగికని వేచి నిలబడి వారి నుంచి కావాల్ని ఉన్న దాన్ని పొందాలి వినయంగా అనే ఎన్నో నియమాలు ఉండగా, ఈ నియమాలు నిబంధనల్ని అక్కడక్కడ మీరి ఉల్లంఘించి ముందుకే వెళ్ళే యత్నాల్ని చేసినోళ్ళు ఎవరూ లేరు కదా!

ఇలాగున్నా కణసేజట్యప్ప ఈ నియమ నిబంధనల్ని మీరినట్లుగా ప్రవర్తిస్తుంది నిజం అండి. తన ప్రవర్తనలో కొంచెం గట్టిగా (మొరటుగా) అయ్యున్న జట్యప్ప దొరవార్ని ఎదురుగా చేసుకొంది ఉంది కదా!

ఈ మొరటు ప్రవర్తన కారణంగా అతను దొరవారి రౌద్ర నేత్రాలకు గురైనా, వారికి ఇతను మింగేందుకు కక్కేందుకు వీల్లేని వేడివేడి నేయిలాగ అయ్యాడు.

దీనితోపాటు జట్యప్పలోని ఒక ప్రవర్తన దొరవారి పాలుకు అసహనాన్ని కల్గించింది. కౌలుదార్లందరి ఎదురు ఇతను ఎక్కడో ఒకచోట అవమానంచేస్తున్నాడు అనేది అన్పించింది కూడా నిజం. అయితే ఇతడ్ని వేరే రీతిలో అణిచేయలేక దొరవారు నోరు కట్టుకొని ఉన్నారు. ఇతనిలోని మొరటు ప్రవర్తనను అనుసరించి మిగిలిన కౌలుదార్లు చేస్తే ఏంటి గతి అనే భీతి వారిలో ముల్లులాగ గుచ్చుతుంది అనేది అసత్యం కాదు. ఇటువంటి సందర్భంలోనే ఒక ఘటన జరిగిపోయింది.

కణసేజట్యప్ప పల్లెలోని దుర్గాచారిని పట్టుకొని ఒక కుర్చీ తనకని చేయించుకొన్నాడు. ఈ కుర్చీ కొత్తదేమి కాదు. గ్రామంలోని పాఠశాలలో ఉద్యోగం చేస్తుండే మిరాంద మాష్టారుగారు ఇక్కడ్నుంచి ట్రాన్స్‌ఫరై సాగర పట్టణంకు వెళ్ళేటప్పుడు వారి ఇంటి సామాన్లను బండిలో నింపుకొని జట్యప్ప సాగరంకు బయల్దేరుతుండగా, మాష్టారుగారు ఖాళీచేసిన ఇంటెనుక ఉండే కంచె ప్రక్కన వద్దనుకొని విసిరేసిన నల్లకర్రతో ఉన్న మడతకుర్చీచూసి "మాష్టారుగారు, ఈ మడతకుర్చీ ఇక్కడే పడియుంది కదా" అన్నాడు జట్యప్ప.

"అది వద్దు మహాశయా, విరిగిపడిన ఆ పాతకుర్చీని ఎందుకు పట్టుకెళ్ళేది?" అన్నారు మిరాందగారు.

"అలాగైతే అది నాకు ఉండనీయండి" అంటూ దాన్ని బండిలో వేసుకొని తన ఇంటివద్ద దింపుకొన్నాడు జట్యప్ప.

సాగరపట్టణంనుంచి సామాన్లు దించి వచ్చిన తక్షణమే అతను చేసిన మొదటిపని ఏమిటంటే, ఆ మడత కుర్చీని దుర్గాచారి వద్దకు తీసుకెళ్ళాడు.

"ఆచారిగారు, ఈ కుర్చీని బాగు చేసి ఇవ్వండి" అంటూ ఆచారి వద్దమొక్కాడు జట్యప్ప.

"బాంబ్రుగౌడగారి దౌలత్తు (స్తోమతు) నీకూ వచ్చిందా జట్యప్ప? కుర్చీని మోసుకెళ్ళి ఇంట్లో వేసుకొని దానిమీద కూర్చోవాలనే పిలాన్ (ప్లాన్) నీదా" అంటూ నవ్వాడు ఆచారి. ఆ పల్లెలో ఈడిగలు, రజకులు, ఉప్పరోళ్ళు, వడ్రంగులు మరితర వెనుకబడిన తరగతులజనం ఎవరూ కూడా కుర్చీ పర్చీ వేసుకొని కూర్చుండే రోజులు కావు ఆ కాలంలో. ఇలా వీళ్ళు కూర్చునేదాన్ని వాళ్ళలో వాళ్ళే ఒప్పుకొనేది లేదు. "పైన పారే నీళ్ళు పైనే పారాలి. క్రిందపారే నీళ్ళు క్రిందే పారాలి" అనే ఒక నుడికారం నిల్పుకొన్న ఈ జనం ఇటువంటి ఆచరణలోని పద్ధతుల్ని ఒప్పుకొనేది లేదు. మంచి బట్టల్ని కట్టరాదు, ఎంతగానో వినీతులై దొరవారి ముందు నడుచుకోవాలి అనేవాట్ని ప్రబలంగా నమ్ముకొన్న జనం ఇక కుర్చీ వేసుకొని ఠీవిగా కాలుమీద కాలు పెట్టుకొని కూర్చునేది ఉంటదా? ఇలా అనే దుర్గాచారి జట్యప్పను తమాషా పట్టించాడు.

"అదంతా అటుండనీయండి ఆచారిగారు, ముందు మీరు రిపేరు చేసి ఇవ్వండి" అంటూ మొరబెట్టాడు.

తనకుండే అనుకూలం చూసుకొని దుర్గాచారి కుర్చీకి ఒక కొత్తకాలు, మేకులతో కొట్టి బిగించి దానికి ఒక ఆకారం వచ్చేటట్లుగా చేసాడు. తదుపరి పాలిష్ వేసి కుర్చీ మిలమిల మెరిసేటట్లుగా చేసాడు.

జట్యప్ప కుర్చీని ఇంటికైతే తెచ్చుకొన్నాడు. అయితే దాన్ని ఇంటిముందున్న ప్రాంగణంలో ఉంచలేదు. అరుగుమీదా పెట్టలేదు. దాన్ని జాగ్రత్తగా మడిచి ఇంట్లో ఉన్న అటకమీద దించిపెట్టాడు భద్రంగా.

అతని భార్యైన్న చిన్నమ్మ "మంచి ఘనకార్యాన్నే చేసావుకదా" అంది. మొగుడిగుణం తెల్సిన ఆమెలో మరిక ఈ కుర్చీని ముందు పెట్టుకొని నాథుడు మరింకేమి ఉపద్రవం చేస్తాడో అనే భీతి ఉంది. ప్రస్తుతం ఇది పైనున్న అటకమీదకు చేరింది కదా అని ఆమె నిశ్చింతరాలైంది.

గ్రామంకు అప్పుడప్పుడు యక్షగానాలు వస్తుండేవి. గ్రామంలో ఉన్న యువకులు శనిమహాత్మ్యం, భక్తప్రహ్లాద, సదారమ మొదలైన నాటకాల్ని ఆడుతుండేవారు. ఊరి దేవస్థానం ముందు అది ఇది అని సభలు, సమారంభాలు జరుగుతుండేవి. అప్పుడప్పుడు వేరే వేరే రాజకీయ పార్టీల సభలూ జరుగుతుండేవి. అప్పుడంతా గ్రామంకు దొరైన బాంబ్రుగౌడగారు సభకు తప్పనిసరిగా వచ్చి భాగస్తుడైయ్యేవారు. ఇలాగున గౌడగారు సభకు వచ్చేదుంటే వారు వచ్చే మునుపే ఒక కుర్చీ వారి ఇంటి నుంచి సభ, యక్షగానం జరుగుతుండే స్థలంకు ముందస్తుగానే వచ్చి సరైన జాగాలో ప్రతిష్ఠాపనై ఉంటుండేది. కుర్చీ వచ్చింది అంటే గౌడగారే వచ్చారేమో అన్నట్లుగా కోలాహలం, గొడవ, చప్పుడు చేయకనే ప్రేక్షకులంతా పెదాలు బిగబట్టి మౌనం దాల్చేవారు.

మొన్న ఇలాగే అయ్యింది. ఊరులో ఉండే రామేశ్వర యువక సంఘంవారు 'శని మహాత్మ్యం' యక్షగానాన్ని అభ్యాసం చేసి ప్రదర్శనాన్ని ఏర్పాటు చేసారు. ఈ ఊరే గాకుండా చుట్టుపక్కలుండే పదిగ్రామాలకు ఆహ్వాన పత్రం ఇచ్చి వచ్చారు. గౌడగారికి స్వయంగా ఆహ్వానపత్రం అందజేసారు. నాటకం ప్రదర్శించబడేరోజు వచ్చింది. ఊరి దేవస్థానం పక్కనుండే మైదానంలో మలకయ్యస్వామి ఆచారే ఖుద్దుగా నిలబడి నిర్మించిన రమ్యమైన రంగమందిరం భవ్యంగా లేచి నిలబడింది ఆకాశం అంత ఎత్తుకు అన్నట్లుగా. జనమంతా పోరలు పోరీల సమేతంగా ఎంతో నిరీక్షనుంచి నాటకం మొదలైయ్యే ఒకట్రెండు గంటల ముందే చేరుకొని నాటకంకని ఎదురు చూడసాగారు.

జనం కిక్కిరిసి పోయారు. అక్కడక్కడ ఈలలు, కేకలు వినబడుతున్నవి. జనం చాప గొంగడి పట్టుకొని వచ్చి జాగాను వెతుకుతున్నారు. ఒక గంటో రెండు గంటలో అయ్యిందన్నప్పుడు గౌడగారి జీతగాడైన నింగడు ఒక కుర్చిమోసుకొని తెచ్చి రంగమందిరం ముందు కొంచెం దూరంలో ఉంచాడు. అప్పుడు జనం అంతా గప్‌చిప్ అయ్యి గౌడగారి రాకనే ఎదురుచూస్తున్నారు. కొన్ని నిమిషాలలోనే గౌడగారు విచ్చేసారు. ఎప్పటిలాగే తమ దర్పాన్ని చూపెడుతూ గౌడగారు కుర్చీమీద సుయోధన సార్వభౌముడిలాగ ఆసీనులైయ్యారు. అటుఇటు చూసారు. ఇంకేంటి యక్షగానం ప్రారంభమౌతదని అనుకొంటున్నప్పుడు కణసేజట్యప్ప అక్కడ ప్రత్యక్షమైయ్యాడు. అతని భుజంమీద మిలమిల ళకళక మెరుస్తున్న ఒక మడతకుర్చీ ఉంది. అతను రాగానే గౌడగారికి అనతి (కొంచెం) దూరంలో అన్నట్లుగా తన కుర్చీ వేసుకొని కూర్చున్నాడు. జనం ఒక నిమిషం మౌనంగా ఉన్నారు. తర్వాత ఎవడో ఈల వేసాడు. మళ్ళా ఎవడో కేక బెట్టాడు. మరింక ఎవడో నవ్వాడు. గౌడగారు ఇదంతా తన గమనంకు రాలేదు అన్నట్లుగా నాటకాన్ని చూడసాగారు. అయితే ఎప్పుడూ పూర్తిగా యక్షగానాన్ని చూస్తుండే దొరవారు ఈసారి ఆసాంతం దాన్ని చూసే చపలాన్ని తొందరగానే ఆపేసి ఇంటికి బయల్దేరారు.

గౌడగారు వెళ్ళిపోయారు. జట్యప్ప గర్వంగా, రాజసూయ యాగం జరిపి సింహాసనం మీద కూర్చున్న ధర్మరాజులాగ కుర్చీలో కూర్చుని యక్షగానాన్ని చూస్తూనే ఉన్నాడు.

మరునాడు ఇది గ్రామంలో చర్చకు కారణమైంది. జట్యప్ప ఇలా చేసి ఉండాల్సింది కాదు అన్నారు కొందరు. గౌడగారికి అవమానం అయ్యిందనే మాటా వచ్చింది. గౌడగారు ఏదో ఒక రీతిలో దీనిమీద ప్రతీకారం చేయొచ్చని అన్నారు కొంతమంది. జట్యప్పకు భార్యైన చిన్నమ్మ కూడా ఇది మీకెందుకు కావాలి అంటూ సణిగింది. ఈ అన్ని మాటలకు జట్యప్ప ఒకే ఒక జవాబు ఇచ్చాడు ఇలా: "పోండి అటు, కుర్చినాది, నేను కూర్చున్న జాగా గ్రామకంఠం... మనం రైతుబిడ్డలం. కుర్చీమీద కూర్చుని నాటకం చూడకూడదు అని ఏదైనా గవర్నమెంట్ శాసనం ఉందా?"

ఈ మాటకు ఆమెతో పాటు వేరెవరూ బదులు మాట పలకలేదు. అయితే వెనుకనుంచి కొంతమంది జట్యప్ప చేసిన పనిని మెచ్చుకొన్నారు. అతనిలో వాదం సరళంగా ఉంది. రైతులు ఎండు వరి గడ్డి, ఈతాకుల చాప, గొంగడి పరుచుకొని కూర్చోవాలి అనే నియమం ఎక్కడుంది?తాము ఎందుకు కుర్చీ వేసుకొని కూర్చోకూడదు? జమీను అయితే జమీందారుదే అనే మాట నిజం. అయితే ఆరుగాలం కౌలుదారుగా జమీనులో తలక్రిందకు వాల్చి భూదేవిని చూస్తూ గుదం పైకిపెట్టి కలుపుతీసి వరిపంట

పండించేటోళ్ళం మేము కాదా? మాకూ గౌరవం మర్యాదా ఉండకూడదా? అని జట్యప్పలో ఉండేది. అతనిలోని ఈ తర్కం దొరకు సమ్మతం కాలేదు. వారు ఇతడి వాదాన్ని ఖండించారు. అయితే జట్యప్ప ప్రవర్తన మీద వేరే ఏదాన్ని చేసేందుకు వారి నుంచి కాలేదు. మరిక జట్యప్పలోని ఈ కుర్చీ ఉదంతం ముందుకే కొనసాగింది.

అయితే జట్యప్పలో మహత్తరమైన ఆశ ఒకటుంది. తనలాగే ఇతర రైతులు ఒకొక కుర్చీ సిద్ధం చేసుకొని నదురుబెదురు లేకుండా వచ్చి కూర్చుంటారు అనే కలగన్నాడు. అయితే ఇప్పటిదాక తన తర్వాత అటువంటి రైతుబిడ్డ ఈ గ్రామంలో పుట్టలేదా? 'కుర్చి కణసేజట్య' అనే పేరు తనకే శాశ్వతమై నిలుస్తదా అనేది కలగా మారి అతనిలో అశాంతిని కలిగించింది.

ఇటువంటి సందర్భంలోనే ఒక వార్త విని అతని ముఖం చేటంత అయ్యింది.

"ఔనా, ఆ యువకుడు దొరముందు ఈ పని చేసాడా?" అని కనబడుతున్నోళ్ళను అడుగుతూ అతను గొంగడ్ని భుజం మీద వేసుకొని బయల్దేరాడు. అతనికి ఎంతో సంతసమైంది. అతను సంబరపడ్డాడు. ఎన్నో సంవత్సరాల క్రితం తను ప్రారంభించిన ఒక కార్యాన్ని ముందుకే కొనసాగించేందుకు ఒకడైనా తన కులంలో పుట్టాడు కదా అని ఉబ్బి తబ్బిబ్బైయ్యాడు ఇప్పుడు.

మొండికాళ్ళనుంచి, నెత్తి మాడుతున్నా ఆ ఎండలో నడుచుకొంటూ ఆ యువకుడు ఉండే ఇంటికెళ్ళి ముట్టిన జట్యప్ప "బిడ్డా ఉన్నావా ఇంట్లో?" అంటూ ఇంటి తలుపు చెంత నిలబడి కేకపెట్టాడు.

ఆ యువకుడు బయటకొచ్చి జట్యప్పను గుర్తించి "రా.. తాతా... రా లోపలికి" అంటుండగా జట్యప్ప "లోపలికి వచ్చేది అటుండనీ, అక్కడ ఏమి జరిగిందో ముందు చెప్పు" అన్నాడు ఆత్రంగా.

ఆ యువకుడు అక్కడ జరిగినదంతా యధావత్తుగా చెప్పాడు.

అతను తన తండ్రైన బీరనాయక్ జతగా దొరవారి (బాంబ్రుగౌడ) ఇంటికి వెళ్ళాడు. అదేంటో గ్రామంకు చెందిన విషయం గురించి మాట్లాడేది ఉంది, నా వద్దకు వచ్చి వెళ్ళు అని బీరానాయకకు కబురు పెట్టారు దొరవారు. తను ఎక్కడికైనా వెళ్ళేదుంటే చదువు నేర్చిన తన కొడుకును వెంటబెట్టుకొని వెళ్ళేది అతనిలో ఒక పద్ధతిగా ఉంది. అలాగున బీరడు తన కొడుకుతో 'బిడ్డా... దొరవారు కబురుపెట్టారు... వెళ్ళి వద్దాం రా!" అన్నాడు.

ఈడిగ కులంలో ఆ గ్రామంనుంచి చదువు రాతకోతల్ని నేర్చుకొంటున్న మొదటి పోరడు ఇతను అని పేరు గడించాడు. చదివి నేర్చేదాన్లో ఇతను తెలివైనోడిగా ముందు వరుసలో ఉన్నాడు.

బీరడు దొర ఇంటికి వెళ్ళినప్పుడు వారు పడక కుర్చీలో కూర్చుని ఆ రోజు దినపత్రికను చదువుతున్నారు. ఆ టేకు కుర్చీలో పైన క్రింద తలదిండ్లను వేసుకొని కూర్చున్న దొరవారు బీరడు వస్తున్నదాన్ని గమనించి “రారో బీరా, రా... ఏంటి నీ బిడ్డడూ వచ్చాడే” అంటూ యువకుడ్ని ఓర చూపునుంచి చూసాడు.

బీరడికి ఈ ఇంట్లో కొంచెం చనువు ఉన్నందున, మరి అతను అరుగు ఎక్కి ఒక మూల చేతులు కట్టుకొని పరమ విధేయుడిగా నిలబడియున్నాడు. అతని పుత్రుడు నిదానంగా చుట్టూ చూసాడు. బాంబ్రుగౌడ గారి ముందు మూడునాలుగు టేకు కుర్చీలు ఖాళీగా నిలబడియున్నవి. శుభ్రంగా తుడిచి ఉంచిన ఈ నల్లకుర్చీలు ళకళకగా మెరుస్తున్నవి. చదువు నేర్చిన ఈ యువకుడు, తండ్రిలాగ చేతులు కట్టుకొని మూలలో నిలబడేందుకు అతని మనస్సు ఒప్పుకోలేదు. అతను నేరుగా వెళ్ళి దొరవారి ముందు జోడించి పెట్టిన కుర్చీలలో ఒక కుర్చీ మీద కూర్చున్నాడు.

గౌడగారు కళ్ళనుంచి నిప్పులు కక్కారు. బీరడు చేతులు పిసుక్కొంటూ మాటలుముగించి అక్కడ్నుంచి పుత్రుడి సమేతంగా బయటపడి కొడుకుతో “అలాగున గౌడగారి ఎదురు కుర్చీమీద కూర్చోకూడదు” అని ఉద్బోధించాడు. తండ్రి నుంచి వచ్చిన ఈ మాటకు చదువు నేర్చిన ఆ యువకుడు “కుర్చీ ఉండేది కూర్చునేందుకు కాదా?” అని ప్రశ్నించాడు. “రావయ్యా... వచ్చి కూర్చో” అని ఆ కుర్చీలే నన్ను పిలిచినవి. నేను వెళ్ళి కూర్చున్నాను. ఇందులో ఏమి తప్పుంది నాయనా?” అంటూ మాట ముగించాడు.

ఇలాగున జట్యప్పకు బీరడి కొడుకు అక్కడ జరిగినదంతా చెప్పి ముగించాడు.

“మంచి మాటే చెప్పావు నా చెవులకు... కుర్చి ఉండేదే కూర్చునేందుకు... ఇది దొరవారి కుర్చి... ఇది కౌలుదార్ల కుర్చి అని ఏమైనా దానిమీద బోర్డుగీర్డు వేలాడదీసారా? నేను ప్రారంభించిన దాన్ని నువ్వు ముందుకు తీసుకెళ్ళావు; ఇక నాకు దిగులులేదు. మన పల్లెజనంలో ఈ ప్రజ్ఞ వచ్చిందంటే ఈ చెడు వ్యవస్థకు విరుద్ధంగా మనం గెల్చినట్లే” అంటూ కణసే జట్యప్ప ఆ చదువుకొన్న యువకుడ్ని వాటేసుకొన్నాడు. ఆ ఆలింగనంలో అదేంటో రోమాంచనం అనుభవించిన ఆ చదువు నేర్చిన యువకుడు తన విచారధారలో మరింత గట్టిగా అయ్యాడు.

**మూలకథ రచనా కాలం : 2009**

# అడవిదున్న

హెగ్డెగారి తోటమీద అడవిదున్నల మంద దాడి చేసిందట అని కొందరు చెప్పుకొంటుండగా, దాన్లో ఏమి విశేషం ఉంది అని మరికొందరు అంటున్నారు. మలెనాడులో ఉండే గ్రామాలలో తోటలు వ్యవసాయభూములు ఉండేది దట్టమైన ఘోరారణ్యం చెంతనేనండి! ఈప్రాంతంలో భవ్యమైన తోట అంటే, దాని చెంతే అడవి ఉంటది. ఇక్కడుండే గ్రామాలనుంచి నాలుగు అడుగులు ముందుకు వేస్తే దట్టమైన అడవి ఎదురౌతది. తోటలు పొలం మాగాణి మడులు అన్నీ అడవి అంచునే ఉంటవి. పొలం గ్రామం ఉందని మనం అనుకొన్నమీద హెగ్డెగారి తోటకు అడవి దున్నల గుంపు దూసుకొచ్చిన దాన్లో ఏమి ఆశ్చర్యం ఉంటది? మా అయ్య ఆస్తి అన్నట్లుగా ఇష్టారాజ్యంగా అడవి ఆక్రమించి దాన్ని నాశనం చేసి పొలంతోట ఇల్లు చేసుకొన్న పిమ్మట అడవి ప్రాణులు (జంతువులు) మరి ఎక్కడికి వెళ్ళేదుంటది? అదీ లింగనమక్కి ఆనకట్ట నిర్మించి దాన్నుంచి ఎంతో ప్రాంతంలో నీళ్ళను నింపిన మీద దాని ఫలితంగా అడవిపందులు, దున్నలు, పులులు, ఏనుగులు, చిరుతలు, జింకలు మొదలైనవన్నీ పల్లెలలోకి రాసాగినవి. ఇప్పుడు అడవిదున్న ఋజువుకని హెగ్డెగారి తోటకు వచ్చింది. ముమ్ముందు సాగర పట్టణంకూ అది రాగలదు అంటూ కొంతమంది విజ్ఞతతో నవ్వసాగారు.

అయితే జరిగిన విషయాన్ని కొంచెం వివరంగా చెప్పినప్పుడు మాటలలో మునిగినోళ్ళకు ఆశ్చర్యం అవలేదు.

అడవిదున్న ఒకటి రెండురోజుల నుంచి తోట అంచులోనే ఉంది అన్నప్పుడు "ఔనా" అన్నారు కొందరు.

ఈమాటకు ఒకరిద్దరు "అది అడవిదున్నో లేకపోతే రైతుకు చెందిన పెంపుడు దున్నో... సరిగా దాన్ని చూసారా హెగ్డెగారూ?" అంటూ ప్రశ్నించారు. తర్వాత వివరం తెల్సి మరిక తాము తొందరపడి అలాగున అడిగి ఉండాల్సింది కాదని వారికి అన్పించింది కూడా. పల్లెలో తోట చేసుకొని ఎన్నో దశాబ్దాల నుంచి నివసిస్తున్న హెగ్డెగారికి అది అడవిదున్నా... పెంపుడు దున్నా నడుమ ఉండే వ్యత్యాసం తెల్వదా?

అయినా ఒక అనుమానం...

అడవిదున్న ఇలాగున గ్రామంలోని జనుల సమీపంకు వచ్చేది లేదు. జనంలోని చప్పుడు చెవినపడితే చాలు, నీడ పడితే చాలు మరిక అది చెట్లలో అడ్డదిడ్డంగా పరుగులు పెడుతూ వెళ్ళిపోతది. ఎవరైనా దానికి అడ్డుపడి నిలువరించేది చేస్తే వాళ్ళను కొమ్ములతో చీల్చి తొక్కి అడవిలో కనుమరుగౌతది. జనం చెంత అది ఉండేది లేదు.

ఇలాగున ఉండే అడవిదున్న మరి హెగ్డెగారితోట వద్దే ఎందుకు ఉంది? ఆ రోజు ఇదొక కుతూహలకరమైన విషయంగా మారి జనం ఎక్కడెక్కడ్నుంచో సైకిళ్ళు స్కూటర్లు కార్లు పట్టుకొని ఎక్కి తొక్కి హెగ్డెగారి తోటకు రాసాగారు.

అది పెంపుడు దున్నైతే కాదు. కచితంగా అడవిదున్నే. దాని తలమీద అర్ధచంద్రాకారంతో కిరీటం అన్నట్లుగా వంగి మెరుస్తున్న కొమ్ములు, దాని చర్మంలో నిగనిగలాడుతూ నలుపువర్ణంతో ఉన్న రోమాలు, ముందుండే రెండు కాళ్ళ మోకాలి చిప్పమీద తెల్లటి మచ్చలు ఉన్నవి. అది నిలబడి అటుఇటు మెడ తిప్పి తిరిగే గంభీర భంగిమ, చప్పుడు వస్తే చెవులు రిక్కించి వినేరీతి... ఇదంతా అడవిదున్నలోని లక్షణాల్నే కచితం చేస్తుంది.

కుతూహలంనుంచో తమాషకో చూసేందుకని వచ్చినోళ్ళు మరిక పెంపుడు దున్నకాదు అడవిదున్నే అనేదాన్ని కచితం చేసుకొని నిలబడిన చోటునుంచి కొంచెం వెనుకకు జరిగారు. తమకు పరిగెత్తి పారిపోయేందుకు దారి సురక్షితంగా సుగమంగా ఉందా అనేదాన్ని పరిశీలించారు.

తనను చూసేందుకు వస్తున్నోళ్ళ సంఖ్య అధికమైనప్పుడు అడవిదున్న తలకొమ్ముల్ని ముందుకుపెట్టి, మరిక ముందున్న కాళ్ళను నేలమీద నిల్పి ఇంకేంటి పోగైన జనం మీదకు దూసుకొచ్చేది కచితమే అన్నట్టుగా కనబడింది. దున్న అక్కడ అలాగే నిలబడి దాడి చేసేందుకు సిద్ధమైనప్పుడు ఇటువైపున్న జనం దిబ్బ (మెరక) మీదకొచ్చి నిట్టూర్పులు వదులుతూ సాగర కెరటం వెనక్కి వచ్చినట్లుగా వెనకకు వాలిపోయి నిలబడ్డారు.

ఒకచోట హెగ్డెగారి భవ్యమైన విస్తారమైన వక్కతోట. ఆ తోట పక్కన కూడా వారికే చెందిన ఒకింత ఖాళీస్థలం. దాని పక్కన బలిష్టమైన కంచె నిర్మాణం. కంచెకు ఆనుకొనే అడవికి చెందిన ప్రాంతం. మరిక ఆ ప్రాంతమంతా దట్టమైన ఘోరారణ్యంతో నిండి ఉంది.

"అడవి మహిషాల మంద అప్పుడప్పుడు తోటలోకి వస్తుండేది నిజమే" అని హెగ్డెగారు చెప్పారు. అయితే అవి ఏ సందర్భమైనా మందమందగానే వచ్చేది ఉంది.

ఒంటరిగా ఏనుగు, పంది, దున్న, జింక తిరిగేది లేదు. ఇప్పుడు ఇక్కడున్న ఈ దున్న మందతో వచ్చింది. తోట అంచునుండే బలిష్టమైన కంచెను హెగ్డెగారు కట్టించి ఎనిమిది రోజులు కూడా కాలేదు. కంచె అస్తవ్యస్తంగా విరిగిపడిన రీతి చూస్తూ ఇక్కడికి వచ్చింది అడవిదున్నల మందే! అయితే వచ్చిన ఆ మంద అంతా వెళ్ళిపోగా ఇదొకటే ఎందుకు ఇక్కడ దిగబడిపోయింది?

అడవి మహిషాన్ని చూసేందుకని వచ్చిన ఈరణ్ణ, భుజంమీదున్న గొంగడ్ని దిబ్బమీద పరిచి కూర్చున్నాడు. రెండురోజులనుంచి మానకుండా వస్తున్నాడు ఈరణ్ణ. అతనిలో అడవి ప్రాణుల్ని చూసేదంటే కళ్ళకు పండుగలాగ అన్పిస్తది.

మందమందలుగా తిరుగుతుండే అడవి పందుల్ని అతను చూసియున్నాడు. అప్పుడప్పుడు వాట్ని వేటాడేదిఉంది అతనిలో. అడవిదున్నలైతే అతను ఇక్కేరి, జిగళిమనె, మల్లినమడుగు, మత్తూరు, గమటె ఘట్టలలో ఉండే ఘోరారణ్యంలో చూస్తుండేవాడు. అడవి ఏనుగుల మందనూ చూడాలని ఆనెబైలుకూ వెళ్ళి వచ్చాడు. శరావతి నది తీరానుండే సమృద్ధ వెదురుపొదల చాటున దాగి కూర్చుని ఏనుగుల మంద నీళ్ళు తాగేందుకు వచ్చి వెళ్తున్నదాన్ని చూసి రోమాంచితుడైయ్యాడు. అడవిలో పలురకాల ప్రాణుల్ని చూసి పరవశించిపోయే వాడు. ఆ ఘోరారణ్యంలో రోమాంచితుడై ఉన్నా దానితోపాటే బెదురూ పుడుతుండేది ఈరణ్ణలో. గ్రహచారంచెడి మరిక వాటి కళ్ళలో పడితే తన కత ముగిసిపోయినట్లే అని ఈరణ్ణ తనలో తను ప్రశ్నించు కొంటుండేవాడు.

హొవేరి బసప్పను, తాళగుప్ప రైలు పట్టాల చెంత అడవిపంది ఒకటి దాడిచేసి ఎత్తి పడేసినదాన్ని ఈరణ్ణ కళ్ళారా చూసాడు. వేటకని వెళ్ళినోళ్ళు నాటుతుపాకి నుంచి తూటా పేల్చారు. పంది పడిపోయి ఉండొచ్చని దాని చెంతకు వెళ్ళగా అరకొరగా గాయపడిన ఆ పంది బసప్పమీద ఆక్రమణ చేసింది. కిందపడిపోయిన అతని వీపును పంది కోరలనుంచి కుమ్మి పొడిచి బొటనవేలంత లోతుగా గాయం చేసింది వీపులో. మాంసం రెండు భాగాలుగా తెరుచుకొంది. మూడునెలలపాటు బసప్ప ఆయుర్వేద వైద్యంతో అరటిఆకుల మీద నిస్తేజంగా పడుకొని చికిత్స పొందాడు.

ఈ అడవి జంతువులకు అంతగా రోషం, కోపం, ఛలం(పట్టుదల)ఉంటదికదా!

అంతేగాకుండా అడవిని వాటికనే భగవంతుడు ఏర్పాటు చేసాడు కదా! అక్కడ అవి తమ ఇష్టానుసారంగా తిరుగుతుంటవి. పరిగెత్తుతుంటవి. కొండల్ని ఎక్కి దిగుతుంటవి. అదే మనిషైతే ఈ అడవిలో ఏమి చేయలేడు. పైనబడిన అడవి జంతువుకు బలైయ్యే దొకటే అతనికున్న మార్గం అండి!

అయితే దున్న ఇక్కడికి ఎందుకు వచ్చి ఇరుక్కుపోయింది? రెండురోజులనుంచి దాన్నే యోచిస్తున్నాడు ఈరణ్ణ.

తోట అంచునున్న అడవిదున్నకు వయస్సు మీదబడినట్లుంది. గొంతుకింద మాంసకండరాలు వేలాడుతున్నవి. తొడలకు కాళ్ళకు ముడతలు పడినవి. అక్కడక్కడ దాని శరీరం మీదున్న రోమాలు రాలినవి. అది నిలబడేది నడిచేది చూస్తుంటే మరిక దానికి వయస్సైందని కచితంగా ఈరణ్ణకు కలుగుతుంది. అయితే, అది తన మంద జతగా వెళ్ళనందుకు వేరే ఏదైనా కారణం ఉండొచ్చా? ఈరణ్ణ ఎంతో సూక్ష్మంగా దున్నవైపు చూస్తూ కూర్చున్నాడు.

అడవిదున్న, పంది, ఏనుగులలోని నిలువు... నడక... దమ్ము...బిగుమానం, అవి తిరిగి నిలబడేవిధం మెడతిప్పే విధానం... అన్నీ అపూర్వమండి! అఖాడంలోకి దిగిన పైల్వానులోని దర్పంలాగ ఈ ప్రాణులలో ఉంటది. మందలో ఇవి ఉన్నప్పుడైతే వీటి జోరు మరింత గొప్పగా ఉంటది... ఇప్పుడు ఇక్కడ ఒంటరిగా ఉన్న అడవిదున్న కొంచెం మందమతిగా ఉంది. ఇందుకు ఇది ఒంటరిగా ఉండిపోయినదానికి కూడా ఒక కారణం అయ్యుండొచ్చని అనుకొన్నాడు ఈరణ్ణ. అయితే నిశితంగా ఈరణ్ణ చూస్తున్నప్పుడు దున్నలోని కుడి కంటిచూపు సరిగాలేదేమో అని అన్పించింది అతనికి. ఎందుకంటే దున్న తన కుడిప్రక్క ఉన్న దాన్నంతా ఎడం పక్క ఉన్న కంటినుంచే చూస్తుంది. ఎడంపక్కకు తలతిప్పేందుకు దానికెంతో కష్టం అవుతుంది.

ఈ విషయం మనస్సులో పడిందే ఆలశ్యం లేచి నిలబడ్డాడు. గొంగడ్ని దులిపి భుజంమీద వేసుకొని గుట్ట ఎక్కాడు. హెగ్డెగారి ఇంటి ముందున్న పందిరి కింద నడుస్తూ, అరుగుఅంచుకు వెళ్ళి గొంగడి పరిచి కూర్చుండగా హెగ్డెగారు ఇంటి లోపలనుంచి బయటకు వచ్చారు.

"ఎవరు ఈరణ్ణేనా?"

"ఔను దొరా..."

హెగ్డెగారు నాలుగు ఆకులు ఒక వక్క కొంచెం సున్నం పట్టుకొని అరుగు అంచుకు వచ్చి అతని వైపుకు వంగి "తీసుకో వీటిని" అంటూ అతని చేతికి ఇచ్చి మళ్ళా పైకి ఎక్కి అరుగుమీదున్న కుర్చీలో కూర్చున్నారు.

"దొరా నాకొక డోటుంది"అన్నాడు ఈరణ్ణ. డౌటు అనే ఇంగ్లీషు పదం డోటుగా అపభ్రంశం అయ్యింది అతని నోటినుంచి.

"ఏంటది?" ఆకులోని ఈనెతీసి దానిమీద సున్నం రాస్తూ అడిగారు హెగ్డెగారు.

"మీ తోటకు వచ్చి ఒంటరిగా ఉన్న ఈ దున్నకు వయస్సు మీద పడింది మాత్రమేకాదు దొరా" అంటూ ఈరణ్ణ మడిచిన ఆకును నోట్లో వేసుకొన్నాడు. హెగ్డెగారు తను పలికిన మాటకు కొనసాగింపుగా ప్రశ్న అడుగుతారని ఈరణ్ణ వేచి యున్నాడు. హెగ్డెగారు "మరేంటి ఈరణ్ణా?" అని అడిగారు.

"దాన్లోని కుడికన్నుకు చూపు భాగ్యం లేదు దొరా... ఇక్కడే ఎక్కడో దానికంటికి గాయం అయినట్లుంది. మీరు కంచె రక్షణకని వెదురుముళ్ళు వేయించారు కదా... ఆ ముళ్ళు తాకి దానికంటికి గాయమైనట్లుంది. లేకపోతే అది తోటలో రెండుమినిట్లు (నిమిషాలు)ఉండేది లేదు... ఇంతమొత్తంలో జనం చేరినా అది ఉంది అంటే దానికి ఏదో డేంజర్ అయ్యిందనే లెక్క నాలో ఉంది..." అంటూ ఈరణ్ణ వేలు కొసన ఉన్న సున్నాన్ని గోరునుంచి గీసి చిన్న ఉండగా చేసి తన నోట్లోకి విసురుకొన్నాడు.

"అలాగున అంటావా?" అని అడిగారు హెగ్డెగారు ఈరణ్ణను.

"గ్యారంటీగా చెపుతున్నా... కావాలంటే మీరే వచ్చి పరీక్షించండి" అన్నాడు ఈరణ్ణ.

హెగ్డెగారు లేచారు. కాళ్ళకు చెప్పులు తొడుక్కొని ఇంటినుంచి దిగుతుండగా ఈరణ్ణ వారిని అనుసరించాడు. ఒకచోట హెగ్డెగారు ఆగి ఈరణ్ణ వైపుకు తిరిగి చూసారు.

ఈరణ్ణ దేహపటిమ వడిలిపోయిఉంది. బుగ్గలు సొట్టబడినవి. ముఖంలోని కళ ఒణిగిపోయిన వంకాయలాగ ఉంది. దేహం మీద కొట్లాటల వేట్లు నుంచి పడిన గాయాల మచ్చలు ప్రధానంగా కనబడుతున్నవి. ఒక కంట్లో శుక్లం ఏర్పడి మరిక అతని ముఖం వికారంగా కనబడుతుంది. నోట్లో ఉన్న దంతాలు కొన్ని ఊడిపోయినవి. మిగిలిన దంతాలు ఆకు వక్కల్ని సతతంగా నమిలినందున కర్రిగా ఉన్నవి. ఒకవైపున్న భుజం, కప్పుకూలి కుడివైపుకు వాలిపోయిన పాత ఇల్లులాగ, వాలిపోయి ఉంది. భుజం వాలిపోయినందున అతను నడిచేది కూడా విచిత్రంగా కనబడుతుంది.

ఈరణ్ణ ప్రాయంలో ఎలా ఉండేవాడు... ఇప్పుడు ఎలా ఉన్నాడు అని అనుకోసాగారు హెగ్డెగారు.

ఇప్పటికి పది సంవత్సరాల పూర్వం ఇతని జతగా ఇలా నడిచేది ఉందా? అతనైనా ఒక హెగ్డె(దొర) జతగా ఇలా వచ్చేవాడా?

ఈరణ్ణ మొదట్లో ఇక్కేరి సీమకంతా పేర్గాంచినోడే! ఆరు అడుగుల ఎత్తులో చామనఛాయ వర్ణంతో ఈరణ్ణలాగ మరొకడెవరూ ఈ ప్రాంతంలో లేడు కదా! గుట్టలో ఇటువైపునుంచి నిలబడి ఇతను మాట్లాడితే గుట్టకు అటువైపున నిలబడినోడికి ఇతని మాట వినబడుతుండేది. కొన్ని సంవత్సరాలు వాళ్ళ వీళ్ళ పొలాలు మడులలో పనులు చేసిన ఇతను కరణంగారిని, గౌడగారిని... మరెవరినో పట్టుకొని ఒకింత భూమిని స్వంతంగా ఏర్పాటు చేసుకొన్నాడు. ఆ తర్వాత అతడ్ని రోజువారి పనులకు పిలిచేవారే లేనట్లైంది. అలాగంటే ఈరణ్ణ పుండాకోరుగా అయ్యాడనే అర్థం కాదండి!

అతను ఎవర్నీ లెక్కబెట్టేదిలేదు. ఏ సీమలోని హెగ్డెగాని, గౌడగాని, చివరకు గవర్నమెంట్ నౌకర్లు, అధికార్లుగాని... అతను నిష్కర్షగా మనసులో ఉన్నదాన్ని భయభక్తిలేనట్లుగా చెపుతుండేవాడు.

"కరణంగారు... మీకు వక్కలరేటు ఇంత మొత్తం వచ్చింది అని చెపుతూ డబ్బులెక్కపెట్టేది గుర్తే తప్పితే వక్కచెట్లు ఎగబాకి కూర్చుని గెలలు దింపేది గుర్తా?" అంటూ పదిమంది చేరినచోట కరణంగారి ముఖానికి తగిలినట్లుగా అనేవాడు ఈరణ్ణ.

"గౌడగారు... కౌలుదార్లను చావచితకగొట్టి చేతిని నొప్పి చేసుకొంటున్నారు కదా... ఇప్పుడు దున్నే వాడిదే భూమి అనే శాసనం అమలులోకి వచ్చింది కదా... ఇకముందేమి చేయగలరు మీరు?" అంటూ గౌడగార్ని కెలికేవాడు.

"సాబ్... మీరు మీ ఆఫీసులో మాట్లాడినట్లుగా ఇక్కడ మాట్లాడకండి... పల్లె జనంకు గౌరవమర్యాదలు ఉంటవి?" అని ఒక రెవిన్యూ ఇన్స్పెక్టర్ అధికారమదంతో గ్రామస్తులమీద రేగి పడినప్పుడు ఈరణ్ణ అతని ముఖంమీద పడేటట్లుగా ఆ మాటలు పలికాడు.

మొరటు మాటకు జతగా అతని చేయి కూడా కొన్నిసార్లు చురుకు అయ్యేది.

ఎవరో తోట యజమాని జీతగాడ్ని కొట్టాడనో, మరెవరో భూకామందు వరి నాటువేస్తున్న మహిళమీద చేయి వేసి కొంటెగా పిలిచాడనో, ఎవరో హసలర (దళిత) బైరడి పొలాన్ని పశువులతో తొక్కించి పాడుచేసాడనో తెలిస్తే చాలు ఈరణ్ణ... "ఎవడ్రో వాడు... రొమ్ము విరుచుకొని ధైర్యంగా మెరుస్తున్నాడు... బయటకురా... ద్వంద్వ యుద్ధంలో నీ చేతిని విరగగొట్తాను నేను" అంటూ అక్కడికి వెళ్ళి అరుస్తుండేవాడు.

కొంతమంది ఇతడ్నుంచి వేట్లు తిన్నారు.

ఇలా వేటు బలంగా పడినోళ్ళు గుంపుగా వచ్చి ఇతడ్ని గాయపరిచి వాగులో పడేసి ప్రతీకారం తీర్చుకొన్నారు. ఇతని నుదురు భుజాలు తొడలమీద ఈ కారణంగానే గాయాల మచ్చలు ఉన్నవి

"ఈర... నీకెందుకు మహాశయ... ఈ లేనిపోని ఉసాబరి... నీ పొలం కుదురుగా చూసుకొంటూ ఉండరాదా" అని బోధించితే ఈరడు "ఓ అణ్ణా ఏంటి.. అంతట్నీ చూసుకొని వినుకొని ఉత్తిగనే ఉండు అని బోధిస్తున్నావు... నానుంచి ఉత్తిగనే ఉండేది కుదరదు... ఎదిరిస్తే ప్రశ్నిస్తే ఏమౌతది... ప్రాణం పోతది... అంతేకదా... పోనీ ప్రాణాన్ని" అని ధాటిగా మాట్లాడేవాడు.

ఈరణ్ణకు బీదాబిక్కి నుంచి మద్దతు ఉంది. అతని వెనుక ఎప్పుడూ పదిమంది ఉండేవారు. తమకు ఏదో అన్యాయం అయ్యిందని అన్పించినప్పుడు బీద జనం ఇతని

వద్దకు వచ్చేవారు. తమగోడు చెప్పుకొనేవారు. తక్షణమే ఈరణ్ణ గొంగడ్ని భుజం మీద వేసుకొని "పదండి, చూద్దాం అతని పరాక్రమాన్ని" అంటూ బయల్దేరేవాడు.

ఇంట్లో అర్ధాంగి ఉన్నా సహ్యాద్రి కనుమల క్రింద ఉండే మైదానం నుంచి బతుకుతెరువు కని ఇక్కడికి వచ్చిన శశి అనే మహిళ ఈరణ్ణకు ఉపపత్నిగా అయ్యింది. ఇతను ఆ ఇద్దరి మహిళల జతగా సరసంగానే నడుచుకొనేవాడు.

తాళికట్టిన భార్య నుంచి ఐదుగురు మగపిల్లలు కలిగారు.

"నాయనా (జనకా) తిందువుగాని రా అని ప్రేమగా పిల్చి తినబెట్టే ఒకే ఒక ఆడపిల్ల జన్మించలేదు కదా" అని ఇతను ఎంతో కొరిగాడు.

అయితే పుట్టిన మగపిల్లలు తనలాగే దృఢంగా ఉన్నారనే గర్వం ఇతనిలో ఉంది.

"ఈ పోరలు నా పేరు నిలబెట్టుతారు" అంటూ తన పిల్లల గురించి గర్వపడుతుండేవాడు.

ఆ సంతానం ఈరణ్ణకు పేరే తెచ్చారు. అయితే అది మంచితనంనుంచి కాదు. ఈరణ్ణ ఏనాడూ బీద, సాటిజనంకు కష్టాల్ని కలిగించలేదు. అయితే అతని సంతానం మాత్రం దుష్టపనులు చేయసాగారు.

పిల్లలు బలాఢ్యులౌతుంటే ఈరణ్ణ వయోభారం నుంచి దుర్బలుడిగా మారాడు. ఒక కంటికి శుక్లం వచ్చి చూపు కనబడకుండా పోయింది.

భార్యా...పిల్లలు ఒకటై పోరుసల్పుతున్నందున పొలాన్ని వాళ్ళకు అప్పగించాడు. ఇప్పుడు ఈరణ్ణ ఉపపత్ని ఇంట్లో ఉంటున్నాడు. ఆమె అక్కడ ఇక్కడ పనులుచేసి కూలిడబ్బుతో ఈరణ్ణను పోషిస్తుంది. భార్యాబిడ్డలు ఇతడి బాగోగుల్ని చూసేదిలేదు.

గొంగడి భుజం మీద వేసుకొని ఈరణ్ణ ఒకరిద్దరు దొరల వెనుక తిరగసాగాడు.

"వాళ్ళ వెనుక మనం ఎందుకు తిరగాలి... వాళ్ళు సాకిన కుక్కలమా మనం" అని మొదట్లో అంటుండే ఈరణ్ణ, ఇప్పుడు కల్మనె హెగ్డెగారు, బరదొళ్ళి గౌడగారు, సుళ్ళళ్ళి హెగ్డెగారు, ముండిగె గౌడగారు... వీళ్ళను చూసి ఆరడగుల దేహాన్ని కొంచెం తగ్గించుకొన్నాడు. ఆ నలుగురు దొరలూ ఇతడ్ని గౌరవంగానే చూసుకొనేవారు. ఇతనికి మర్యాద ఇస్తున్నారు. "ఏంటి ఈరణ్ణా" అంటూ ఇంటి చెంతకు వచ్చిన ఈరణ్ణకు ఆకువక్కలు ఇచ్చి స్వాగతించేవారు. ముఖ్యంగా ఆ నలుగురు దొరలు మంచి మనుషులే అనేది ఈరణ్ణ వాదంగా ఉండేది. వారెవరూ చెడు సావాసాలు చేయలేదు. జీతగాళ్ళను దూషించి దండినోళ్ళు కాదు. వీళ్ళకు సాగరపట్టంలో మంచి పేరే ఉంది. వీరి జతగా సంపర్కం నిల్పుకొంటే తన మనసుకు శాంతినెమ్మది అవుతదని భావించేవాడు ఈరణ్ణ.

కల్‌మనె హెగ్డె, సుళ్ళళ్ళి హెగ్డె, బరదొళ్ళిగౌడ, ముండిగె గౌడ... ఈ నలుగురు ఈరణ్ణ కనుక తమ ఇళ్ళకు వస్తే వద్దనేది లేదు. అతడ్ని వీరు ప్రీతినుంచి మాట్లాడించేవారు. ఈరణ్ణ ఒక కాలంలో ఈ ప్రాంతంలో మెరిసినోడు. అతని స్వభావమే అలాగుండేది. ఇప్పుడు ఐదుగురు పుత్రులున్నా అతడ్ని ఇంటినుంచి బయటకు గెంటేసారు. భార్య చెంతకే రానీయట్లేదు. తాళి కట్టకపోయినా ఆ ఉంచుకొన్నామే అతడ్ని సరిగా చూసుకొంటుంది. ఈరణ్ణకు వయస్సు అయ్యింది. "దొరా" అంటూ వస్తాడు. అడవిలో ఏదో ఆయుర్వేద ఔషధ తీగ గుర్తించేందుకు, చెట్లను గుర్తించేందుకు సహాయపడుతాడు. వక్క, మామిడి, ఇంటెనుక ఉండే గజనిమ్మ (దబ్బపండు)కు మరే ఇతర చెట్లకో పురుగుపట్టినప్పుడు ఇలా ఉపచారం చేయండి అని చెపుతాడు. పశువులు ముడుసుకుపోయినప్పుడు ఔషధి ఇస్తాడు. అతను అడుగు పెట్తే మంచిదే అనుకొంటారు ఆ నలుగురు.

కల్‌మనె హెగ్డెగారి ఇంటికి వారంలో నాలుగుసార్లు తప్పకుండా వెళ్తాడు. అతను వచ్చినప్పుడల్లా హెగ్డెగారు ఆకు వక్కల్ని ఇచ్చేది రూఢిగా ఉంది. ఎప్పుడో ఒకసారి, "నేను వెళ్ళి వస్తాదొరా" అంటూ ఈరణ్ణ బయల్దేరేందుకు నిలబడినప్పుడు, హెగ్డెగారు లోపలినుంచి బయటకొచ్చి ఒక నోటుతీసి "పుచ్చుకో దీన్ని. పట్టుకో భద్రంగా లక్ష్మీదేవిని" అంటూ అతనికి ఇచ్చేదుంది. ముఖ్య విషయం ఏమిటంటే అతనుగా ఎన్నడూ డబ్బు అడిగిందిలేదు. ఇస్తే తీసుకొనేవాడు. అంతేమరి! ఇది కూడా ఈ దొరలకు ప్రియమైన గుణంగానే కనబడింది. ఇందుచేత వారు ఈరణ్ణ మునుపు ఎలా ఉండేవాడు, ఇప్పుడు ఎలాగున్నాడు అని అప్పుడప్పుడు అనుకొనేవారు.

ఇద్దరూ తోట అంచుకు వచ్చారు. తమాషా చూసేందుకు జనం చేరియున్నారు. తోట బయట ఉండే చోట సైకిళ్ళు స్కూటర్లు కార్లు ఆగి ఉన్నవి.

కల్‌మనె హెగ్డెగారు, ఈరణ్ణ తోటలోకి వచ్చారు. దున్న మెడను ఒక వైపు వాల్చి పడుకొంది. హెగ్డెగారిని మెరకమీదే ఉండండని ఈరణ్ణ చెప్పి క్రిందకు దిగాడు. దున్న సమీపంకే ఈరణ్ణ వచ్చి నిలబడినా, దానికి తెల్వకున్నది గమనించిన హెగ్డెగారికి ఈరణ్ణ చెప్పిన మాట నిజమే అని అన్పించింది. కొంచెం సమయం తర్వాత దున్న లేచి నిలబడి అక్కడక్కడ తిరుగుతుండగా ఒక కన్ను నుంచి చూపులేదనేది కచితమైంది. దిబ్బ ఎక్కి వచ్చాడు హెగ్డెగారి చెంతకు ఈరణ్ణ.

"దాని కన్నుకు గాయమైంది దొరా. దాని కంటిక్రింద రక్తం కారుతుంది" అన్నాడు.

ఇప్పుడంతా స్పష్టమైంది హెగ్డెగారికి. ముందేమి చేయాలి?అనేది వారి మదిలో మెదిలింది.

గ్రామంకు చెందిన పెంపుడుదున్నో బర్రో అయితే పశువైద్యుడికి కబురుపెట్టొచ్చు. వారు వస్తారు. ఔషధోపచారం చేస్తారు. ఇదైతే అడవిజంతువు. దాని శుశ్రూష చేసేవారు ఎవరు? జవాబ్దారి మోసే వాళ్ళు ఎవరు? హెగ్డెగారు కొంచెం దిగులులో పడ్డారు. చెప్పాపెట్టకుండా అతిథిలాగ దున్న తమ తోటకే రావాలా? రేపు దీనికి ఏదైనా జరిగితే హెగ్డెగారితోటలో దున్న చనిపోయిందనే దుర్వార్త వస్తది. అడవిదున్నకు ఎవరూ దాతగా నిలబడేది లేదు. అది నిజం కూడా! ఇలాగున దాని పాటికి దాన్ని విస్మరించి చచ్చేందుకు విలవిలలాడేందుకు వదిలేసేది ఏమి పద్ధతి నాగరికుడిగా నానుంచి? అనుకొంటూ ఇంటికి వస్తూ హెగ్డెగారు ఈరణ్ణతో అన్నారు ఇలా: "ఈరణ్ణా సాగరపట్టణంకు వెళ్ళి వస్తావా?"

"ఎవరి వద్దకు దొరా?"

"గణపతి దేవస్థానం చెంత పశువుల దవాఖానా (వైద్యశాల) ఉంది. అక్కడ కృష్ణయ్యగారు అని ఒక భిషక్ (వైద్యుడు) ఉన్నారు. నేను నిన్ను పంపానని విషయం తెల్పు. వారు ఏమి ఉపచారం చేస్తారో చూద్దాం"

"అలాగే దొరా... మూగప్రాణి కదా అది" అంటూ ఈరణ్ణ బయల్దేరాడు.

సమాచారం విన్న కృష్ణయ్య గాబరా పడ్డాడు.

"అడవిదున్నా? నేను వచ్చి ఔషధోపచారం చేయాలా?" అంటూ వళ్ళు గోక్కొన్నాడు.

"నేను వచ్చేది లేదు మహాశయ... ఏదైనా ఉంటే పెంపుడు జంతువుల గురించి చెప్పు... వస్తాను. అడవి జంతువుల సాహసం వద్దు..." అని కట్టె విరిచినట్లుగా తిరస్కరించాడు.

"ఒక పనిచేయి... జోగ జలపాతం చెంతనుండే కార్గల్‌లో వన్యజీవుల సంరక్షణా కేంద్రం అని ఒకటుంది. అక్కడున్నోళ్ళకు విషయం తెల్పు... వారు ఏమైనా చేయగలరు ఆ అడవిదున్నకు" అన్నాడు మళ్ళా.

ఈరణ్ణకు కొంచెం వెలుగు కనబడింది కృష్ణయ్య మాటనుంచి.

హెగ్డెగారికి విషయం తెల్పి కార్గల్‌కు వెళ్ళే బస్సు ఎక్కాడు ఈరణ్ణ.

అక్కడున్న అరణ్యాధికారి ఆసక్తి చూపాడు. వన్యప్రాణికైన దుస్థితి మీద జాలిపడ్డాడు.

"ఒకట్రెండు రోజులు దాన్ని అక్కడే ఉండనీయండి. నేను శివమొగ్గకు వెళ్ళి మా విభాగంకు చెందిన వైద్యుడ్ని పిల్చుకొని వస్తాను" అన్నాడు.

"స్వామి, మీరు వచ్చేదాక"

"నువ్వు దాని అనుపానాల్ని సుభద్రంగా చూసుకో. అది భయపడిపోనట్లుగా చూసుకో. జనం దాని చెంతకు వెళ్ళి రాళ్ళు రప్పలు విసిరేది, కట్టెనుంచి కొట్టేదాన్ని చేయకుండా ఆపు. మేము వస్తాం అక్కడికి!" అంటూ భరోసా ఇచ్చాడు

వన్యప్రాణి మీద వారికున్న బాధ్యత ప్రీతి చూసి ఈరణ్ణకు సంతోషమైంది.

"స్వామి, మీరు రాకుండా ఉండేరు" అంటూ వారిని మూడునాలుగుసార్లు పదేపదే ఎచ్చరించి, మరిక సాగరంకు వెళ్ళే బస్సు వచ్చినప్పుడు దానికి అడ్డంగా చేయి చూపించాడు ఆపమని.

ఈరణ్ణ తోటకు చేరుకోగానే అడవిదున్న రక్షణకు కాపలాలాగ నిల్చున్నాడు. తండోపతండంగా వస్తున్న జనాన్ని దూరంగానే ఆపి "దాన్నేమి చూస్తారు... ఊరులో తిరుగుతుండే మారెమ్మ దున్నను చూడలేదా మీరు, దానిలాగే ఇది... నడవండి వెనుకకు" అని గదమాయిస్తూ పోరల్ని పెద్దల్ని వెనక్కి పంపుతున్నాడు.

దానికి తాగేందుకు నీళ్ళు దొరకట్లేదని అన్పించి, దొర ఇంటెనుక ఉన్న చెక్కతొట్టినుంచి నీళ్ళు నింపుకొని వచ్చి దాని చెంత పెట్టి మెరక మీదకు వచ్చాడు.

ఆ సాయంత్రం అదెవరో ఒక వార్త ప్రసారం చేసారు. అడవిదున్న మాంసం ఎంతోరుచి అని, కొంతమంది అడవిదున్న మాంసం కనే వేటాడుతారని, అటువంటోళ్ళు సులభంగా ఒక అడవిదున్న హెగ్డెగారి తోటలో దొరుకుతది, మరిక వాళ్ళు దీన్ని వధించొచ్చు అనే వార్తగా అది ప్రసారమైంది.

"దొరా, ఇలాగంట నిజమా? అని ఈరణ్ణ హెగ్డెగారి వద్దకు పరిగెత్తి చెప్పాడు.

"ఔను ఈరణ్ణా, కొంతమంది అడవిదున్నను వేటాడి తినేదుంది" అన్నారు హెగ్డెగారు.

"దొరా, నాలుగు రోజులు నేను మీతోట వద్దే గడుపుతాను... చేసేందుకు వేరే పని ఏముంది నాకు?" అన్నాడు ఈరణ్ణ.

ఆ రాత్రి ఈరణ్ణ మరొక గొంగడి, ఒక దుడ్డుకర్ర, లాంతరు జతగా తోటలోకి దిగాడు.

మూడోరోజు సర్కారి జీపు కల్‌మనె హెగ్డెగారి ఇంటికొచ్చింది. వైద్యుడు, వన్యప్రాణుల సంరక్షణాధికారి ఈరణ్ణను ముందుపెట్టుకొని తోటకు చేరారు. అడవిదున్నకు మత్తు కలిగించే సూదిని దూరంనుంచి బులెట్‌లాగ తుపాకి నుంచి పేల్చగా, అది మరిక ఒక చిన్న గుట్టలాగ నిస్తేజంగా పడిపోయింది. ఈ ముగ్గురు నలుగురు దాని చెంతచేరారు. అడవిదున్న కంటికి ఏ విధమైన అపాయం కాలేదు. కుడికన్ను క్రింద వెదురుముల్లు బలంగా గుచ్చుకొని, అది అక్కడే ఉండిపోయింది.

మరిక ఆ భాగమంతా చీముపట్టి వాచిపోయింది. గాయం చిట్లి చిట్లకనే ఉండి, కొద్దిగా చీము నెత్తురు కారుతుంది బయటకు.

వైద్యుడు తక్షణమే కార్యోన్ముఖుడైయ్యాడు. ముల్లు తీసినప్పుడు చీము అంతా బయటకు వచ్చింది. ఈరణ్ణ దున్న చెంతకూర్చుని దాని దేహాన్ని మృదువుగా నిమిరాడు తట్టాడు. అతనిలోని అంతఃకరణ నిండి బయటపడింది. వెదురుముల్లు మరియు దాన్నుంచి అయిన గాయం చేత నిండిపోయిన చీము ఈ రెండింటి బాధను సహించుకొంటూ నోరులేని ఆ మూగప్రాణి అనుభవించిన వేదన అతని పాలుకు ఆశ్చర్యవిషయంగా అయ్యింది.

వైద్యుడు ఉపచారసేవ ముగించి "ఇక దానికేమి కష్టం ఉండదు... నేను మళ్ళా ఒకట్రెండు రోజులలో వస్తాను" అన్నాడు.

"వచ్చేది కచితమేనా స్వామి... అంతమాత్రం దానిమీద కనికరం చూపండి" అంటూ ఈరణ్ణ ఆర్ద్రంగా వారి చేయి పట్టుకొన్నాడు.

హెగ్డెగారు తన ఇంట్లో వారికి అరటిపండ్లు తినబెట్టి, చిక్కటి కాఫీ ఇచ్చి వాళ్ళను సత్కరించారు.

ఉదయం ఐదుగంటలై ఉండొచ్చు.  చీకటి ఇంకా తొలగిపోలేదు. తూర్పుదిక్కున ఔనో కాదో అన్నట్లుగా సూర్యోదయం. పక్షులు తోట, అడవిలో ఉన్న వృక్షాలలో రాత్రంతా గప్‌చిప్ అయ్యి కూర్చున్నవి మేల్కొని కిలకిలారావం చేయసాగినవి. హెగ్డెగారు ప్రభాతఝామములో స్విచ్‌నొక్కి వ్యాసపీఠం పైనున్న తురంగ విరచిత భారతాన్ని కళ్ళకు ఒత్తుకొని నిన్న ఆపేసిన పుటనుంచి చదవసాగారు ముందుకే! ఒక పద్యంచదివి ముగించారు అంతే! బయటనుంచి ఈరణ్ణ కేకపెట్టుంది విన్పించసాగింది.

లేచి హడావుడిగా బయటకు వచ్చారు.

ఈరణ్ణ మెట్లమీద నిలబడి యున్నాడు.

'ఏంటి ఈరణ్ణ..." అంటూ దిగులులో పడ్డారు. అడవిదున్నకు మూడురోజుల నుంచి వైద్యులు ఔషధోపచారం చేస్తున్నారు.అది ఇకనూ బాగుపడేవరకూ దాన్ని సుభద్రంగా చూసుకోండి అని చెప్పారు. అంతలోనే దానికి ఏమైనా అయ్యిందా? లేకపోతే, రాత్రి ఎవరైనా దుష్టులు వచ్చి దాన్ని చంపి తీసుకెళ్ళారా? అనే మీమాంసలో పడ్డారు  హెగ్డెగారు.

"ఏంటి  ఈరణ్ణా?" అంటూ మళ్ళా అడిగారు.

"రాత్రి మందవచ్చింది దొరా... అడవిదున్నల మంద...మన దున్న ఆ మంద జతగా మళ్ళా అడవిలోకి వెళ్ళిపోయింది దొరా... " అంటూ ఈరణ్ణ ఎంతో సంతోషంగా చెప్పి కారుతున్న ఆనందభాష్పాల్ని తుడుచుకొన్నాడు.

“అడవిదున్నల మంద మళ్ళా దీన్ని తమ జతగా చేర్చుకొన్నవి కదా...” అన్నారు హెగ్డెగారు.

“మనుషుల బుద్ధి వాటికి ఎక్కడ ఎందుకు రావాలి దొరా, పేగుబంధ సంబంధాన్ని అవి మరిచేదుంటదా...” అంటూ మళ్ళా మళ్ళా కన్నీరు తుడుచుకొంటూ పందిరి దాటాడు. అతని చంకలో గొంగడి ఉంది. చేతిలో లాంతరు. అతని నడక మాత్రం భారంగా ఉంది.

తోటవైపు స్పష్టంగా వెలుగు పడింది. ఈరణ్ణ నిదానంగా ఎర్రమట్టితో నిండిన డొంకదారిలో కనుమరుగౌతుంది చూస్తూ నిలిచారు హెగ్డెగారు.

**మూలకథ రచనా కాలం : 1997**

# ఇక్కేరి గుడిమీద విమానం ఎగిరింది...

చెవులలోని కర్ణభేరి పగిలిపోతదేమో అన్నట్లుగా ఉన్న ప్రచండ ధ్వని ఒకటి క్షణంక్షణంకూ దగ్గరై, ఆ భీకర చప్పుడు ఏదో బ్రహ్మరాక్షసుడి రూపం దాల్చి ఇళ్ళు తోటలమీద పడి పోతదేమో అన్నప్పుడు, మళ్ళా చప్పుడు నిదానమై దూరంగా అటెటో వెళ్ళిపోయింది. ఆ భీకర చప్పుడులో అణిగిపోయిన పిల్లల అరుపులు కేకలు మళ్ళా స్పష్టంగా చెవులలో పడుతుండగా, స్థిమితంగా కూర్చొని తమలపాకుకు సున్నం రాస్తూ ఉన్న భట్టుగారు ఆకును చేతిలో పట్టుకొనే బయటకు వచ్చారు.

"ఇమానం... ఇమానం" అంటూ చిన్నపిల్లలు అరుస్తుంటే, నేలమీద నిలబడిన పెద్దోళ్ళు కళ్ళకు చేయి అడ్డంగా పెట్టుకొని విమానం వెళ్ళిపోయిన దిక్కునే చూస్తూ "అరెరే... కొబ్బరిచెట్టును తాకిందని అనుకొన్నాను" అనో... "ఇంత కిందకు ఏనాడూ విమానం ఎగిరి వెళ్ళిందే లేదుకదా ఇప్పటిదాకా" అనో, "ఎలా ఎగిరిందో గుర్తా? ఇక్కేరి గుడిమీద రొయ్యంటూ కిందకుదిగి... బేదూరు గ్రామం చెంత ఆకాశంకు మళ్ళా ఎగబాకింది మహాశయా... నేనైతే చచ్చాన్రోనాయనో అని బెదురుకొన్నాను" అనో వాళ్ళలో వాళ్ళు చెప్పుకొంటుండగా భట్టుగారు విమానం వెళ్ళిన దిక్కుకు కంటిరెప్ప కొట్టకనే వీక్షించసాగారు.

వక్కచెట్ల గుబురు మట్టలమీద కంటిచూపు పారించి ఆకాశంలోని నీలివర్ణాన్ని తదేకంగా చూసినప్పుడు వేలుమందంతో ఉన్న వెండి ముక్క ఒకటి చెంచాసైజులో, ఎండను లెక్కించకనే అక్కడ ఇక్కడ ఎగురుతూ, నేనేకదా చప్పుడు చేసింది అని దూరం నుంచి తన చప్పుడ్ను మరో మారు మోగించి వరదళ్ళి గ్రామంలో ఉండే గుట్ట నెత్తిమీద సుడులుసుడులుగా గిరికీలు కొట్టి మాయమైంది ఇమానం.

భట్టుగారు పందిరిదాటి ఇంటిముందున్న అరుగుఎక్కారు. చేతిలో ఉన్న ఆకును నోట్లో పడేసుకొని వక్కజతగా నములుతున్నప్పుడు, పిల్లలు తాము చూసిన అద్భుతంమీద తమకైన గలిబిలి భయం సంతోషం మీద ఏదేదో చెప్పుకొంటుండగా, మిట్టమీద నిల్చొన్న పెద్దోళ్ళు తమలోనే అది ఏజాతికి చెందిన విమానం? ఇంత క్రిందకు ఎందుకొచ్చింది? అనేదానిమీద జిజ్ఞాసలో పడింది కూడా భట్టుగారి గమనంలోకి వచ్చింది.

భట్టుగారు గోడకు ఒరిగి కూర్చున్నాడు. ఒక క్షణం వారి గుండె ధసక్ అంది అసత్యం కాదు, అయ్యయ్యమ్మో ఆ చప్పుడునుంచి!

బెంగళూరులో ఉండే పుత్రుడి ఇంటికి వెళ్ళినప్పుడు అతనుండే ఇంటి టెరస్ మీద నిలబడి ఒకట్రెండుసార్లు విమానం ఇలా భోర్ అంటూ తలపైనుంచి వెళ్ళినదాన్ని వారు చూసారు. తలెత్తి చూస్తుండగా విమానంలోని రెక్కలు, పక్కనున్న కిటికీలు... ఇంకా ఏమేమో కనబడినవి. దానిమీదున్న పెద్ద అక్షరాల్ని చదివిన కొడుకు అది మిలటరి విమానం అనో, ఏదో కంపెని విమానమనో చెప్పాడు.

"ఎవడో మంత్రో కంత్రిగాడో వెళ్తున్నాడేమో దాన్లో...." అంటూ స్వగతంగానే వ్యంగ్యం చేసాడు పుత్రుడు.

ఇప్పుడిప్పుడు ఈ మంత్రి పుంగవులు కార్లను వదిలి విమానంలోనో హెలికాప్టర్‌లోనో తిరుగుతున్న దాని గురించి పుత్రుడు "ఎవరిదో దుడ్డు(డబ్బు) యల్లమ్మదేవి జాతర" అన్నట్లుగా విమర్శిస్తూ ముక్కుమూతి విరుచుకొంది గమనించాడు భట్టు.

ఎక్కడో వరదప్రవాహ బీభత్సం జరిగినప్పుడు, ఈ మంత్రులు లేకపోతే ప్రధాని విమానంలో ఎక్కి కూర్చుని వరద బీభత్సాన్ని చూసి కోటో అరకోటో రూపాయల్ని ప్రవాహ పరిహారంకని రాల్చుతుంటారు. విమానం నుంచి వీక్షణ చేసినందుకే వాళ్ళకు అరకోటి ఖర్చు అవుతది. ఎక్కడో అగ్ని స్పర్శ నుంచి అయిన అనాహుతం (ప్రమాదం) కనో, మరెక్కడో రైలు యాక్సిండెంట్ అనో, ఇంకెక్కడో మరేంటో జరిగితే అక్కడికి తక్షణమే మంత్రులు వెళ్ళేదుంటది. విమానమో హెలికాప్టరో వారికోసం సదా సిద్ధమై ఉంటది అని పుత్రుడు చెప్పాడు. భట్టుగారికి ఇవన్నీ ఆసక్తిరేపే విషయాలు కావు. ఇందుచేత వారు పుత్రుడి నోటినుంచి వస్తున్న మాటలమీద ఎక్కువగా తల చెడుపుగోక ఆ మాటల్నే మరిచింది ఉంది కదా!

అయితే ఈరోజు ఎంతో క్రిందగా ఎగిరి వెళ్ళిన ఈ విమానం మూలకంగా వారి జ్ఞాపకాల దొంతరలో కొడుకు నుంచి వచ్చిన మాటలు దూదిపింజలాగ పైకి తేలిపోయినవి.

ఈరోజు ఎవడైనా మంత్రో కంత్రో వచ్చి యుండొచ్చేమో అని యోచించారు భట్టుగారు. ఒక మాటైతే నిజం. ఇప్పుడు ఈ మంత్రుల పీడ ఎక్కువైంది. ఒక చిల్లిదమ్మిడీ ప్రయోజనం ఈ దగుల్‌బాజిల నుంచి ప్రజలకు కలగట్లేదు. అయితే వీళ్ళ అట్టహాసం, హమ్మబిమ్ము, జబర్‌దస్తీతనం, దర్పం, అహం...అబ్బబ్బా హొసనగరం (శివమొగ్గ జిల్లాలోని తాలూకా పట్టణం)లో ఉండే పద్మసానినీ మీరిపోయి

ప్రవర్తిస్తున్నారు ఈ ఖాది తొడిగిన జనం... ఆ పద్మసాని వేశ్యగా ఉన్నా నీతినియమాల నిష్ఠనుంచి వృత్తిని కొనసాగించింది. అయితే ఈ ముండాకొడుకులు....?

భట్టుగారు లేచి అరుగుబారుకూ నడిచారు. అరుగు చివర చేమగడ్డల పొద ఉంది. వీరు తాంబూలం ఊసినందున ఆకుపచ్చ వర్ణం మాయమై అక్కడంతా ఎరుపువర్ణంతో ఊసిన లాలాజలమే (ఉమ్మే) ప్రధానమై కనబడుతుంది. భట్టుగారు అక్కడే నిల్చి కుడిచేయిలోని మొదటి రెండో బారువేళ్ళను నోటిలో పెట్టుకొని, ఈ రెండు వేళ్ళ సందునుంచి చివాల్నే తాంబూల పిప్పిని బయటకు పీకారు. ఆ తాంబూల పిప్పి కమానులాగ వంగి చేమగడ్డ పొదమీద పడింది. నోట్లో ఉన్న తాంబూల రసాన్ని తుపుక్కునే ఊసిన పిమ్మట, అక్కడే నిలబడి మరి ఇకనూ నోటిలో అక్కడ ఇక్కడ దాగియున్న ఆకువక్కల పిప్పిని, నాలుకనుంచి శుభ్రం చేసి ఊసి యథాస్థానంకు చేరాడు.

భట్టుగారు ఇలా వెనుదిరిగి వస్తున్నప్పుడు వారి జ్ఞాపకాల కొలనులోని అలలు ఉవ్వెత్తున ఎగిసిపడినవి. అడుగు (తళ) భాగంనుంచి పైకి విరజిమ్మిన జలం మరిక అక్కడ ఎన్నో రోజులనుంచి స్తబ్ధమై పోగుబడిన అంతట్నీ పైకి తేలగొట్టినట్లుగా వారి మనస్సు సుమారుగా ఏభై సంవత్సరాల గతకాలంలోకి జారగా భట్టుగారు కొంచెం ఆయాసపడి నోడిగా, నలిగిపోయినోడిలాగ, దేహంలోఉన్న శక్తిని ఎవరో గుంజినట్లుగా, కొంచెం నిశ్శక్తుడైనట్లుగా గోడచెంత కూలబడిపోయి కూర్చున్నాడు. తన జ్ఞాపకాల్ని విప్పుకోసాగాడు ఇలా: అప్పట్లో తనకు ఇకనూ ఇరవై సంవత్సరాలు కూడా అయ్యుండలేదు. పందొమ్మిదో ప్రాయంలో నాయన తన వివాహం జరిపించాడు. తన చిన్నతనంలో ఇస్కూలు కూడా లేదు. ఇంటికే పండితుడు వచ్చి అమరకోశం, భారత, భాగవతం, అష్టాదశ పురాణాలు... మొదలైనవాట్ని చదివించారు... శిక్షణాభ్యాసాన్ని పండితుడే కఠిణంగా చేయిస్తుండేవారు. నాయన మడేనూరు చెంత ఉండే హంజక్కి గ్రామంలో మంచితోట వేసాడు. ఆ తోటలో వక్కలు యాలకులు మిరియాలు జాజికాయలు పండుతుండేవి. వక్కల్ని బస్తాల్లో నింపుకొని సాగరప్రాంతం తాలూకా రైతులందరూ బారుబారుగా ఎడ్లబండ్లు కట్టుకొని మూడునాలుగు రోజులు ప్రయాణం చేసి బ్యాడగి పట్టణంకు చేరుకొంటుండేవారు. అక్కడ వస్తుమార్పిడి విధానం నుంచి అమ్మిన వక్కలకు బదులుగా ఎండుమిర్చి కందిపప్పు మినుములు పెసలు చింతపండు మరితర ఇంటివాడకంకని సరుకుల్ని తెస్తుండేవారు. నగదు వ్యాపారం తక్కువ ఆకాలంలో.

బాగా పెంచిన తోటలోని ఫసలు సమృద్ధిగా లభిస్తుండేది. తోటకు చెందిన సకలపనుల్ని తనే నేర్చాడు. తనకు వ్యవసాయకృషి మీద ఎంతో ఆసక్తి. వక్కచెట్లు

ఎక్కేది, గెలలు దించేది, చెట్టునుంచి మరో చెట్టుకు క్రిందకు దిగకనే దాటేది మొదలైన వాట్ని నేర్చుకొన్నాను. దళిత జీతగాళ్ళు కూడ నిలబడి 'ఒడెయ(దొరా)' అంటూ తనలోని వ్యవసాయ పనుల్ని చూసి అబ్బురపడుతుండేవారు.

ఒకరోజు నేను వక్కచెట్టు ఎగబాకాను. బంధం వేసుకొని సుభద్రంగా కూర్చుని ఒక గెల నరికి దాన్ని మోకు నుంచి క్రింద నిల్చిన బెనవడికి ముట్టించాను. మోకులోని ఒక కొసను తన నడుంకు కట్టుకొన్న వడ్డాణంలోని కొక్కెంకు ఇరికించాను. మరొక కొసను క్రిందున్న బెనవడు పట్టుకొని ఉన్నాడు. అంతలో చెవిచెంత ఏదో భోర్ అంటూ చప్పుడు వచ్చినట్లైంది నాకు.

"బెనవా... ఏందిరో అది?" అంటూ అరుస్తుండగానే వక్క మట్టలకు తాకి తాకనట్లుగా ఆకాశంలోని నీలిపరదాను చింపుకొని ఒక ఇమానం ఎగురుతూ రానేవచ్చింది. దగ్గరకు అంటే ఎంతో దగ్గరకు... చేతికి తాకుతది అన్నట్లుగా... అబ్బబ్బా దాని చప్పుడైతే భీకరం... చెవి లోపలున్న కర్ణభేరిని పగలగొట్టినట్లుగా...

"అదృశ్యం... దొరా అదృశ్యమౌతుంది అది?" అంటూ బెనవడు నత్తినత్తిగా పలుకుతూ చేయి ఎత్తి చూపిస్తుండగా,ఆ విమానం మడెనూరులో గుట్టక్రిందుండే ఘోరారణ్యంలో అదృశ్యమైంది.

"ఇమానం కాదా దొరా?" అంటూ బెనవడు నన్నే అడిగాడు.

"ఔన్రోయ్... ఇది ఇమానమే... అయితే అది ఇక్కడికి ఎందుకు వచ్చిందో...?"

వక్కచెట్టు పైన కూర్చున్న తన దేహం విమానం నుంచి అయిన ఆర్భాటానికి కంపించింది. మెల్లగా చెమట పట్టసాగింది. తనైతే విమానాన్ని స్వయంగా చూసి ఉండలేదు. అయితే వాటి చిత్రాల్ని చూసాను. విమానం మహారాజులకు చక్రవర్తికి మాత్రమే అనేది తన అభిప్రాయంగా ఉండేది. అయితే ఇది మడెనూరులోని ఈ ఘోరారణ్యంకు ఎందుకు వచ్చింది? అది కూడా రెండో ప్రపంచ మహాసంగ్రామంలోని సమయంలో కదా! అందుకే బెదురు తనలో ఉంది.

బెనవడు క్రిందనుంచి అరుస్తున్నాడు.

"దొరా... మైసూరు మహారాజుగారు వచ్చి యుండొచ్చేమో?"

"నీనెత్తి పాడుగాను... వేటాడేందుకు మహారాజుగారు గుర్రంబగ్గీలోనో, పల్లకీలోనో రాగలరు. విమానంలో కూర్చుని ఎవరైనా వేట ఆడేది ఉంటదా?"

మైసూరు మహారాజుగారు వేటాడేందుకని అప్పుడప్పుడు మలెనాడుకు వస్తుండేది నేను వినియున్నాను. వారు పల్లకిలోనో, ఆరుగుర్రాల్ని కట్టిన బగ్గీలోనో వచ్చేది ఉంటే, వారి బాగోగుల వ్యవస్థను పలెజనమే చూసుకొనేవారు. మహారాజావారు

పులుల్ని తుపాకి నుంచి కొట్టిపడేసింది మా జనం అందరికీ గుర్తే! అయితే విమానం ఇప్పుడు ఎందుకు వచ్చింది ఇక్కడికి?

ఎందుకో మరిక వక్కచెట్టుమీద కూర్చునేందుకు నా మనస్సు నిరాకరించింది. బంధంకున్న ముడివిప్పి క్రిందకు జారాను. బెనవడు తనలాగే బెదురుగొడ్డుగా ఉన్నాడు. ఎన్నడూరాని, ఎగరని విమానం పూర్తిగా క్రిందస్థాయిలోనే ఎగిరివెళ్ళింది మా సీమకంతా పెద్ద వార్తగా ప్రసారమైంది.

"ఇది (ఎగురాట) మంచికే అయ్యుండొచ్చా?" అని నాయన పలికింది ఎందుకో తనకు విచిత్రంగా కనబడింది. నాయన పలికిన మాటలో ఉన్న నిర్వేదం, ఈ మాటను పలుకుతున్నప్పుడు, వారి ముఖంమీద ఏదో అస్పష్టమైన భీతిలోని ఛాయలు నాట్యమాడుతున్న దాన్ని నేను గమనించాను.

"విమానం వచ్చింది ఎందుకో తెలుసా?" అని నేను ఇంటింటినీ అడుగుతూ వచ్చాను.

'ఎందుకండి హేరంబ?" అని మిత్రుడ్ని అడిగాను.

"శరావతి నదిమీద మడెనూరు చెంత ఒక ఆనకట్ట కట్టుతారట... సుమారుగా నూట ఏభై గ్రామాలు నీటిముంపుకు గురి అవుతవట... అందులో మాకు చెందిన గుండుమనెగ్రామం, మీ హంజక్కి గ్రామం కూడా ఉంటవట..." అన్నాడు హేరంబ.

ఆ తర్వాత జరిగిన కథ అంతా పెద్ద దురంతం (విషాదం). మడెనూరు చెంత ఆనకట్ట నిర్మించబడింది. ముంపు బాధితులకు వేరే చోట జమీను ఇచ్చారు. ఇంటికి తోటకు పొలం మడులకు ఇంతింతగా అని పరిహారధనం ఇచ్చారు. నేను, నాయన వేరే చోటుకు వెళ్ళి జమీను చూసుకొని వచ్చాం.

"బిడ్డా... ఎంతో దూరంకు వద్దు... ఇక్కడే చూద్దాం" అన్నాడు నాయన.

"మన బంధువులందరూ ఉండేది ఇక్కడే. కెళది సీమలోనో అవినహళ్ళి సీమలోనో సిరివంతె సీమలోనో జమీను ఉంది. అవికూడా మలెనాడు సీమలోనివే. అయితే అవి మనకు ఎంతో దూరం... ఇక్కడే ఎక్కడో ఒక చోట జమీను కొనుగోలు చేద్దాం" అన్నాడు నాయన. ఇందుచేత మడెనూరుకు దిగువప్రాంతంలోనే తాము జమీను చూసాం. లింగనమక్కి జలాశయం చెంత కాళమంజి గ్రామం. అక్కడ కొన్ని ఇళ్ళే ఉన్నవి. మంచి సారవంతమైన ప్రాంతం. వ్యవసాయకృషికి అనువైన ప్రాంతం అని అక్కడికి చేరుకొన్నాం. మొదట్లో ఉండే హంజక్కి గ్రామంనుంచి ఖాళీచేసి కాళమంజి గ్రామంకు వచ్చాం. వచ్చి చేరాం అంటే ఏదో చెప్పినట్లుగా అయ్యేది లేదు. పశువులు, వ్యవసాయ పనిముట్లు, ఇంటిపరికరాలు... అన్నిట్ని విప్పి ఆ

ప్రదేశం (హంజక్కి) లోని జ్ఞాపకాల్ని వదిలి ఇక్కడికి వచ్చి పది సంవత్సరాలపాటు ఎండనక వాననక శ్రమించి తోట చేసుకొన్నాము. నాయన వృదాప్యం నుంచి చనిపోయాడు. అమ్మ వయోభారంతో మంచాన పడింది. ఆమె కేశసంపదంతా తెల్లగా అయిపోయింది.

ఇన్ని ఇక్కట్ల నడుమునా కాళమంజిలో సంతోషమే అయ్యింది. జోగజలపాతంకు వెళ్ళి దిగువున ఉండే విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోకి దిగి అక్కడ తిరుగుతుండే యంత్రాల్ని (టర్బైన్లను) చూసినప్పుడు, ఆ యంత్రాల్నుంచి తయారైయ్యే విద్యుత్‌శక్తి తీగల మూలకంగా ఎక్కడెక్కడికో ప్రవహించి వీధుల్ని ఇళ్ళనూ వెలుగులతో నింపుతున్న దాన్ని చూసాక ఎవరికైనా ఆనందమే కదా ఉండేది!

ఎన్నోసార్లు నేను మడెనూరుకు వెళ్ళింది ఉందిలే! అక్కడ ఆనకట్టమీద నిలబడి, జలాశయంనుంచి మునిగిపోయిన హంజక్కికని వెతుకుతున్నప్పుడు, మా పూర్వపు గ్రామంకు అయిన దుర్గతి నుంచి నా కళ్ళలో నీళ్ళు ఉబికి వస్తుండేవి.

అయితే ఒక అధ్యాయం ముగిసి రెండో అధ్యాయం ప్రారంభమైంది కదా అని కాళమంజి గ్రామంలో కొత్తగా బతుకును చేసుకొన్నాం.

కొత్తగా వేసిన వక్కతోట చక్కగానే పెరిగింది. దానితో పాటు అరటి, యాలకులు, మిరియాలు, తమలపాకులు, అల్లం పంటల్ని అంతరకృషిగా చేసాం. కాలచక్రం వేగంగా పోతుంది. ఇప్పుడు మేము ఉన్నచోట ప్రభుత్వ పాఠశాలలు, ప్రౌఢశాలతో పాటు కలాశాల ఏర్పడినవి. బస్సులనుంచి తిరుగాట. తాళగుప్ప వరకూ రైలు వచ్చి వెళ్ళేది, శివమొగ్గ నుంచి ఆకాశవాణి ప్రసారకేంద్రం మొదలైన అనుకూలాలు ఏర్పడినవి.

రోజులు చకచకా దొర్లిపోతున్నవి. నేను ఇప్పుడు హంజక్కి గ్రామంవదిలి కాళహంజి గ్రామంకు వచ్చి సుమారుగా 20 సంవత్సరాలు దొర్లినవి. నా సంతానం పెరుగుతున్నారు.

ఒకరోజు ఒకింతగా వక్క మాలును తీసుకొని సాగర పట్టణంకు బయల్దేరాను. రోడ్డు అంచున భట్కళ నుంచి వచ్చే గజానన సర్వీసు బస్సుకని వేచియుండి ఎదురు చూస్తున్నాను. బస్సు ఎంతో దూరంలో ఉండగానే సంభ్రమంలోని దాని చప్పుడు వినబడుతూ వస్తుంటది. అయితే ఆ రోజు చప్పుడు ఇలాగే వినబడింది. అయితే ఈ చప్పుడు ఒకట్రెండు క్షణాలలోనే ఎక్కువైంది. బస్సు నుంచి వచ్చే చప్పుడు ఇదికాదని అన్పించింది. చప్పుడు నా చెవిలో భీకరంగా పడినప్పుడు తలెత్తి పైకి చూసాను. లింగనమక్కిలోని కొండలమీద ఒక విమానం నిదానంగా శరావతి నదిమీద ఎగురుతూ వెళ్ళి దూరానెక్కడో మాయమైంది.

మరోమారు నా ముఖం కందగడ్డలాగ అయ్యింది. దేహం వణికింది. విమానం ఇప్పుడు ఎందుకు వచ్చింది? ఎవరు వచ్చారు? మంత్రిగారా? గవర్నర్‌గారా? ప్రధానమంత్రా? వాళ్ళు వచ్చిందెందుకు? ఎంతో తొందరగానే నాలోని అన్ని ప్రశ్నలకు జవాబు దొరికింది. మా గ్రామంకు వచ్చే దినపత్రిక నుంచి గవర్నమెంట్ లింగనమక్కిలో ఆనకట్టను కట్టే పిడుగులాంటి వార్త ఒకదాన్ని మోసుకొచ్చింది. శరావతి నదిమీద ఇది రెండో ఆనకట్ట. బృహత్తరమైన ఆనకట్ట ఇది. సుమారుగా రెండొందల నలభై గ్రామాలు ఈ ఆనకట్టనుంచి ముంపుకు లోబడుతవి. వాటిలో మళ్ళా నేను ఇప్పుడుండే కాళమంజి గ్రామం కూడా ఒకటిగా ఉంది.

గతంలో నాయన చేదోడుగా ఉండేవారు. ఇప్పుడు నేను ఒక్కడ్నే! ఏమి చేయాలి? ఎక్కడికి వెళ్ళాలి? నా ఎదురు కేవలం జవాబులు లేని ప్రశ్నార్థక చిహ్నాలే ఉన్నవి. నెత్తిమీద చేతులు పెట్టుకొని కూర్చోకూడదు. ప్రభుత్వం నుంచి గ్రామం ఖాళీచేయమని నోటీస్ వచ్చింది. కొత్తగా జాగా వెతకాలి. కొత్తగా తోటవేయాలి. ఇల్లు కట్టుకోవాలి. నా పుత్రుడేమో "నాయనా… ఈ తోటగీటతీట వద్దు… వేరేదేదో బిజినెస్ చేద్దాం" అన్నాడు.

"పుత్రా… నువ్వైతే చేసుకో బిజిసెన్‌ను… నేను దీన్నే (వ్యవసాయకృషినే) చేస్తాను" అని బదులిచ్చాను.

పుత్రుడు బెంగళూరుకు చేరుకొన్నాడు.

నేను మూడోసారిగా ఇక్కేరిసీమకు వలస వచ్చాను. ఇక్కడ జమీనుకొని తోట వేసాను. ఇల్లు కట్టాను.

సుడిగాలికి చెట్టు విరిగి పడింది. పక్షి కట్టుకొన్న గూడు నేలలో పడి నాశనమైంది. పక్షి పట్టుదలతో మళ్ళా గూడును కట్టసాగింది. ఒక గట్టిదైన వృక్షం వెతికి, దాన్లోని సరైన కొమ్మలో మంచి స్థలం కనుగొంది. ఎక్కడెక్కడినుంచో చిన్నపుల్లలు రెమ్మల్ని తెచ్చింది. గూడు కట్టింది. దాని జీవనం సుభద్రంగా నడవాలి కదా, అది మంచిగా బతకాలి కదా…

ఇక్కేరి సంస్థానంకు దగ్గరలోనే కల్‌మనె గ్రామం ఉంది. గ్రామం వెనుక గుట్ట ఉంది. అక్కడ నిత్యం గలగలపారుతుండే వాగు ఒకటి ఉంది. సారవంతమైన భూమి, ఎండ కూడా బాగా పడుతది ఆ భూమిలో. మళ్ళా కొత్తగా తోటవేసాను. "ఈమేమో (అర్ధాంగి)… నాకూ వయస్సైంది. మీకూ వయస్సైంది… ఈ ముది వయస్సులో ఇదంతా (సేద్యం) అవుతదా" అంటుంది. ఈమెకు పుత్రుడుండే

బెంగళూరుకు చేరాలనే ఆశ; లేకపోతే ఒకొక నెల పుత్రికల ఇళ్ళలో గడిపిరావాలి అనే ఆశ జాస్తిగా ఉంది. అయితే నాకు?

"రుక్కు (రుక్మిణి)... నువ్వు అంటున్నట్లుగా ఇది కష్టమే... అయితే దీన్లో ఉన్న మజా మరేదాన్లోనూ ఉండదు..." అన్నాను.

ఇక్కేరి సంస్థానం శరావతినదినుంచి కొంచెం దూరంగా ఉంటది. మళ్ళా మూడోసారి విఘ్నం జరగరాదు అనే దూరపు ఆశ ఒకటుంది నాలో.

కల్‌మనె గ్రామంలో వేసిన తోట అభివృద్ధి పథంలోకి వచ్చింది.

సాగర పట్టణం నుంచి ఎంతోమంది కృషీవలురు నేను వేసిన తోట చూసేందుకని వస్తున్నారు.

"భట్టుగారు... చేస్తే (సంకల్పిస్తే) మీలాగే తోట చేయాలి" అంటున్నారు.

ఇప్పుడిప్పుడు కాళమంజి గ్రామం గుర్తుకొస్తుంది. నేను ఖుద్దుగా నాటి పోషించిన వక్కచెట్లను నా కళ్ళెదురే నరికి తీసుకెళ్ళారు. శరావతి యోజనలోని ప్రారంభోత్సవంకని ప్రధానమంత్రి వచ్చినప్పుడు లింగనమక్కిలో భారీగా పందిరి వేసారు. ఆ పందిరికి వాడింది కాళమంజి తోటలోని నా వృక్షాల్నే కదా...!

తనకు కోపం వస్తుంది.

ఇంటింటికీ విద్యుత్తు వెలుగులు ఇవ్వాలని ఈ మంత్రులు, ఇంజనీర్లు ఎన్నో గ్రామాల్ని, అడవిని ముంపుకు గురిచేసారు. ఇప్పుడు వెలుగు ఎక్కడుందో మీరే చెప్పండి? ఇప్పుడు నేనుండే కల్‌మనె గ్రామంలో రోజుకు ఎనిమిది గంటలు విద్యుత్ కోత ఉంది. వాతావరణ పెనుమార్పులనుంచి లింగనమక్కి జలాశయంలో జలం నిండనేలేదు. తలకళలె ఆనకట్టకూడా నిత్యం క్షయరోగిణిగా ఉంది. ఆ బోసుడి ముండా కొడుకులు చేసిందేంటి? వీళ్ళ దుష్టపాలన నుంచి వానలు గప్‌చిప్ అయినవి... ఇప్పుడు గలగలా పారే నీరూలేదు, వెలుగూ లేదు.

పాడైపోని ఆ పాత హంజక్కి, కాళమంజి గ్రామాలను... నేను, నా భార్య ఈ కల్‌మనె గ్రామంలో నెమ్మదితనంతో ఉంటున్నాము.

అయితే... అయితే...

భట్టుగారు గాలి ఆడకనే కదలకుండా ఉన్న వక్కచెట్లను చూస్తున్నారు. కల్‌మనె గ్రామంకు వచ్చి సుమారుగా ఇరవై సంవత్సరాలు దొర్లియుండొచ్చు. పుత్రుడేమో బెంగళూరులోని బతుకు విసుగేసి పోయిందని, కల్‌మనెకు వస్తాననేమాట మాట్లాడుతున్నాడు. కోడలికీ ఈ పరిసరం ఎంతో ఇష్టమై ఉంది. మనమడు ఇక్కడికి వస్తే తిరిగి బెంగళూరుకు వెళ్ళేందుకు ఇష్టపడటం లేదు. వారందరూ రానీ...

ఇక్కడికిరానీ... తను నిశ్చింతగా వారసుల సమక్షంలో చనిపోయేదాన్ని ఎదురు చూస్తుంటాను.

అయితే...

భట్టుగారు చెవుల్ని రిక్కబొడుచుకొని వినసాగారు. వక్కమట్టల చాటున కనబడే నీలాకాశాన్ని దిట్టించి చూసారు. మళ్ళా విమానం రాలేదు. అయితే ఇప్పటికి అరగంటక్రితం అది వచ్చి వెళ్ళింది కదా! అది ఎందుకు వచ్చి యుంటది? దాన్లో ఎవరున్నారు? మంత్రులా? ప్రధానమంత్రా?

భట్టుగారు దిష్టిబొమ్మలాగా గోడకు వెన్ను ఆన్చి కూర్చున్నారు. వారు స్థిమితంగా ఇలా కూర్చుండగా బేదూరు గ్రామంలో ఉండే మహాబల అరుగు ఎక్కి వచ్చాడు.

"మామా ఒక వార్త మీ చెవిలో పడిందా?"

భట్టుగారు బెదిరిపోయారు. ఖళ్ అంటూ గుండెలో ఉన్న ఏదో కవాటం ఒకటి విడిపోయింది.

"ఏంటి వార్త?" కష్టంగా అడిగారు భట్టుగారు.

"ఇక్కడంతా బంగారం దొరుకుతదట..." అన్నాడు మహాబల.

భట్టుగారు మహాబల ముఖాన్ని దిట్టించి చూసారు. అతను వివరంగా చెప్పసాగాడు ఇలా: "ఇక్కేరిసీమలో ఉన్న ఎనిమిది గ్రామాల్ని గనుల తవ్వకంకని ప్రభుత్వం గెటిజ్‌నుంచి ప్రకటించిందట. ఇక్కడున్న భూమిలోపలి పొరలలో బంగారం ఉందని ఉపగ్రహాల చిత్రాలు (ఫోటోలు) వెల్లడించినవట. ఈ ఎనిమిది గ్రామాల్ని, ఇక్కడుండే అడవి, తోటలు, పొలాలు, వరిమడులు, ఇళ్ళు... ఖాళి చేయిస్తారట.. ఇక్కడ గనులనుంచి ఖనిజాన్ని బయటకు తీసేందుకని పలుదేశీయ విదేశీ కంపెనీలు అర్జిపెట్టుకొన్నవట. ఈ ఎనిమిది గ్రామాలలో కల్‌మనె గ్రామం కూడా ఒకటిగా ఉందట. విమానం వచ్చింది ఈ ప్రదేశాన్ని చూసి వెళ్ళేందుకే అట!"

భట్టుగారి చేయివారి రొమ్ము మీద ఆడుతుంది.

ఎంతో యాతన నుంచి వారి ముఖం ముడుచుకుపోతుంది. మహాబల తను చెప్తున్న మాటల్ని ఆపి "మామా... ఏంటి... మామా ఏంటి..." అంటూ వారి చెంతకు దూసుకొచ్చాడు. భట్టుగారి అర్ధాంగి రుక్మిణి కూడా లోపలి నుంచి పరిగెత్తుకొంటూ వచ్చింది. వక్కచెట్లు కదలకనే మెదలకనే స్తబ్ధుగా నిలబడి యున్నవి.

**మూలకథ రచనా కాలం :1996**

# ద్వీపం

పెళ్ళైన మూడుమాసాల వరకూ సుధాకర్ చేసిన  ఒకే ఒక పని ఏమిటంటే, భార్యను వెంటబెట్టుకొని బంధుబలగం ఇళ్ళకు తిరిగింది కదా! ఈ రోజు హొసకొప్పలో ఉండే పెద్దత్త ఇంటికి, రేపు నాగరకొడిగెలో ఉండే చిన్నత్త ఇంటికి, మరొకరోజు నిడుగట్టలో ఉండే భావ ఇంటికి, నాలుగోరోజు హసవంతెలో ఉండే అక్క ఇంటికి, ఐదోరోజు మంజూగుణియలో ఉండే తాతగారి ఇంటికి, ఆరోరోజు సురళిలో ఉండే మామ ఇంటికి... ఇలాగున బస్సు ఎక్కి, దిగి, తోటలమధ్య నడిచి, బస్సు సౌకర్యం లేనిచోట ఎడ్లబండి ఎక్కేది, చివరిగా కాలినడకనుంచి అతను అర్ధాంగైన సరళను వెంటబెట్టుకొని తిరిగాడు. ఎండ అంత వేడిగా లేదు. జతగా ఆయా గ్రామాలలో దట్టమైన వృక్షాలనీడ ఉంది. గాలి హితంగా వీస్తుంది. సుధాకర్‌కు తోడుగా సరళ ఉంది. సరళకు తోడుగా సుధాకర్ ఉన్నాడు. తన బాల్యకాలంలోని రోజులు, కలాశాల లోని రోజుల గురించి ఇతను ఆమెకు చెపుతుంటే, మరిక ఆమె ఇతని పలుకులకు ఊగొట్టూ, వాగు వంకలు దాటి గుట్టలు ఎక్కి దిగి చిలుకాగోరింకలాగ వాళ్ళు తిరుగుతున్నారు. ఒక నెలపాటు సుధాకర్‌కు సంబంధించిన బంధువులందర్నీ చూసి వచ్చారు. మరొకనెలపాటు సరళకు చెందిన సంబంధీకుల ఇళ్ళకు వెళ్ళి వచ్చారు.

పెళ్ళికి అతిథులై వచ్చినోళ్ళందరూ వధూవరుల చేతుల్ని పట్టుకొని “అమ్మాయి... మొగుడు పెళ్ళాం మీ ఇరువురూ మా ఇంటికి వచ్చి వెళ్ళండి... మరువకండి మా పిలుపును” అని చెప్పినదాన్ని ఈ నవదంపతులు మరిచిపోలేదు.

వెళ్ళిన చోటెల్లా వీళ్ళకు అద్భుతమైన స్వాగతమే దొరికింది. భారి భోజనమే వడ్డించబడింది. బొబ్బట్లు, పాయసం, కజ్జికాయలు, కొబ్బరి లౌజు ఉండలు మొదలైన వాట్ని తిని తిని ఆయాసపడ్డారు.

ఈ మధ్యలో సుళగోడులో ఉండే తన ఇంటికి చేరుకొన్న సుధాకర్ ... “అన్ని ఇళ్ళనూ ప్రస్తుతానికి చుట్టేసి ముగించాము కదా సరళా” అంటూ భార్య ముఖం చూసాడు.

ఆమెకూ అలాగే ఔనని అన్పించింది. గుర్తుకు తెచ్చుకొని ఆమె కూడా తన బంధుబలగం ఉండే ఇళ్ళన్నిటికీ సుధాకర్‌ను తోలుకెళ్ళింది. తన పతిరాయరు

బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా కార్యభారం మోస్తున్నాడని, సరళ స్వభావుడు, వినయశీలి, స్నేహమయుడు అనే సద్గుణాల్ని తన దగ్గరి బంధుబలగంకు చూపించి పరిచయం చేసేది ఆమెకు గొప్ప విషయంగా ఉంది. ఇందుచేత ఆమె మర్చిపోకనే దగ్గర బంధువుల ఇళ్ళన్నిటికీ భర్తతో వెళ్ళివచ్చింది. ముంబై, పూనా నగరాలలో ఒకరో ఇద్దరో ఉన్నా అక్కడికి వెళ్ళేందుకు వేరేగా కాలాన్ని వాళ్ళు నిర్ధారం చేసుకొన్నందున, మరి ఇక ఇక్కడ వెళ్ళి గడిపేందుకు ఎవరూ లేనిదాన్ని కచితం చేసుకొన్నారు ఆ ఇద్దరు.

అయితే సుధాకర్ తక్షణమే గుర్తు చేసుకొన్నోడిలాగ "మనం బెంగుళూరుకు కొత్తకాపురంకని వెళ్ళే ముందే ముంపుకు గురైన మామ ఇంట్లో ఒక రోజు గడిపి వచ్చేందుకు సిద్ధంగా ఉండు మహాతల్లి" అని చెప్పాడు.

"ఎవరండి వారు? ముంపుకు గురైన మామ అని చెప్పుతున్నారు" ప్రశ్నించింది సరళ.

"మన పెళ్ళికి వచ్చారు కదా... రెండు భారీ పూలదండల్ని పట్టుకొని" అన్నాడు సుధాకర్.

"ఓ... గుర్తుకొచ్చిందండి!" అంటూ సిగ్గుపడింది సరళ. పెళ్ళిరోజు పెళ్ళిపీటల మీద కూర్చున్నప్పుడు దూసుకొచ్చి చదివింపుల్ని చదివిస్తున్న బంధుమిత్రుల్ని ఒక పక్కకు నెట్టూ తమ చెంతకొచ్చి, "ఏమండోయ్... మీరందరూ కొంచెం పక్కకు జరగండి... ఏంటేంటి వధూవరులను ఊపిరాడనట్లుగా ముసురుకొన్నారు కదా..." అంటూ బిగ్గరగా అందర్నీ గదిరించి, కొంతమందిని వారే పక్కకు నెట్టి జరపగా, కొంచెంగా బంధుజనం అటు ఇటు సర్దుకొని నిలబడినప్పుడు భుజంలో ఉన్న బారుసంచినుంచి రెండు భారీపూలదండలను తీసి "సుధాకర్.. ఇదిగో ఈ దండను పట్టుకో" అంటూ ఒక పూలదండ ఇచ్చి... "ఓ అమ్మాయి... పట్టుకో దీన్ని" అంటూ సరళ చేతికి మరో దండ ఇచ్చి.

"హాం... ఇప్పుడు పరస్పరంగా మెడలో దండలు వేసుకోండి" అంటూ వధూవరుల్ని ఒకరి మెడలో మరొకరు పూలదండల్ని వేసుకొనేటట్లుగా చేసి... "బెంగళూరులో కొత్తకాపురంకని వెళ్ళే ముందు మా ఇంటికి వచ్చి వెళ్ళండి... ఒకరోజు మిమ్మల్ని తీసుకురమ్మని బోటు నడిపే దుమింగడికి చెపుతాను. కొత్తదంపతులు బోటునుంచి జల విహారం చేయొచ్చు" అని చెప్పాడు.

పూలదండల వినిమయం నుంచి సిగ్గుపడిన సరళ తలెత్తి ఎదురులో నిలబడ్డ వ్యక్తిని చూసింది.

రామకృష్ణ పరమహంసగారిలాగ గుండ్రటి ముఖం, అదే చిన్న గడ్డం, అటు వంటిదే అయిన చిరుదరహాసం, వంటిమీద కప్పుకొన్న ముతక పంచె, మోకాళ్ళదాకా వచ్చేటట్లుగా కట్టిన మరొక పంచె, దేహమంతా దట్టంగా పెరిగిన రోమాలు, పాదరక్షలు లేని కాళ్ళు, కంగుమనే స్వరం... వీటితో నిండియున్న వారు అంతకే నిదానమై పోలేదు.

"ఓ అమ్మాయి..." అంటూ సరళను పిల్చారు. "ఇతను మరిచిపోయినా... నువ్వు జ్ఞాపకం చేసేదుంటది... సరేనా...? పెళ్ళైన మీద మొగుడు భార్య మాటను అలక్షించడు... నేను మీ కోసం ఎదురుచూస్తుంటాను... ఆమె (నా అర్ధాంగి) కూడా గట్టిగా మీ ఇరువురిని ఆహ్వానించండి అని చెప్పి పంపింది నన్ను..." అంటూ అందరికీ విన్పించేటట్లుగా బిగ్గరగా చెప్పి హడావుడిగా పెళ్ళిపీటల వేదిక నుంచి కిందకు దిగాడు.

ముంపుకు గురైన మామ అని సుధాకర్ చెప్పినప్పుడు పూర్వవృత్తాంతం అంతా గుర్తుకొచ్చి "ఔను కదా... నేనూ మరిచిపోయాను" అంది సరళ పెదం కొరుకుతూ.

"మిమ్మల్ని వారి ఇంటికి తోలుకెళ్ళే జవాబ్దారిని వారు నామీదే మోపారు... నేను మరిచాను" అంది సరళ మరలా.

"అక్కడికి వెళ్దాం సరళా... అయితే అందరి ఇళ్ళకు వెళ్ళినట్లుగా మనం వారి ఇంటికి అదంత సులభంగా వెళ్ళేదైతే లేదు సుమీ. బస్సులు, కార్లు, ఎడ్లబండి, సైకిల్.. ఇవేవి అక్కడ మన ఉపయోగంకు రావు. మనం ఒక బోటునుంచే అక్కడికి వెళ్ళేదుంటది" అంటూ సుధాకర్ ముంపుకు గురైన మామ కథను కొంచెం వివరంగా చెప్పాడు.

❖ ❖ ❖

ముంపుకు గురైన ఈ మామ సుధాకర్ తల్లికి తమ్ముడిగా ఉన్నాడు. విశ్వేశ్వరయ్య అనే పేరు ఉన్నా, పదిసంవత్సరాల నుంచి ఇప్పుడు అతను అందరి నోళ్ళనుంచి ముంపుకు గురైన మామగా పిల్చుకోబడుతున్నాడు.

గుబ్బగోడు గ్రామం వరాహినది నుంచి కొంచెం పైనున్న ఒక గుట్ట ఒడిలో ఉంది. గుబ్బగోడులోని శ్రీపాదరాయరు ఇరవై ఎకరాల తోటకు ఆసామిగా ఉన్నారు. సుధాకర్‌కు తల్లైన మంగళాంబ, విశ్వేశ్వరయ్య ఇద్దరూ శ్రీపాదరాయరుగారి సంతానంగా ఉన్నారు. వక్కలు పండించి వాట్ని తీర్థహళ్ళి (శివమొగ్గ జిల్లాలోని తాలూకా కేంద్రస్థాయి పట్టణం) లో ఉండే మండీలో వేసి అమ్మి ఇంటికి సంవత్సరం బారుకూ అవసరపడే ఎన్నో సరుకుల్ని సామాగ్రి తెచ్చి ఏ విధమైన తాపత్రయం బాధలు లేకనే జీవిస్తుండేవారు.

మంగళాంబకు వివాహం చేసి ఆమెను సుళగోడులో ఉండే మెట్టింటికి పంపిన సంవత్సరమే అదేంటో ఒక దుర్వార్త తీర్థహళ్ళి పట్టణంలో వినబడింది. వరాహి నదికి ఆనకట్ట కట్టుతారనే వార్తగా అది ఉంది. చిన్నపాటి తేలికపాటి కట్టల్ని కట్టుతుండేది రైతులందరికీ తెల్సు. అయితే ఈ ఆనకట్టలో ఎన్నో గ్రామాలు మునిగిపోతవనే వార్త విన్నప్పుడు అందరిలాగే శ్రీపాదరాయరూ పకపకా నవ్వారు.

"తిక్క... తిక్క ప్రభుత్వం... ఈ తిక్క ప్రభుత్వంకు ఏంది ఈ పిచ్చి మహాశయ... గ్రామాల్ని తోటల్ని పొలాల్ని అడవిని మునిగించేందుకని?" అంటూ చెవిలో పడుతున్న వార్త నిజంకాకూడదు అనే కోరికను ఉంచుకొన్న కొందరు పలికారు ఆ విధంగా. మిగిలిన జనం కూడా... అలాగే అంటూ వాళ్ళ మాటకు వంత పలికారు.

అయితే రోజులు గడుస్తుండగా ఈ వార్త నిజమైంది. యడూరు, హులికల్లు, మాణె, మల్లినమడుగు అనబడే గ్రామాలచెంత వార్షికంగాపడే వానగురించి లెక్కించే వాళ్ళు, వరాహినదిలో ప్రవహించే నీటి వేగం లెక్కించేవాళ్ళు, అక్కడక్కడ నేలతవ్వి లోపలున్న రాతి పొరను కనుగొనేవారు జమైయ్యారు విధినిర్వహణకని. చూసిన చోటెల్లా ఏవేవో ఉపకరణాల్ని మోసుకొచ్చి సర్వేచేసి తెల్లరాళ్ళను పాతి వెళ్ళారు. ఈ గ్రామం మునుగుతది, ఈ తోట, ఈ పొలం, ఈ మడులలో నీళ్ళు నిలబడిపోతవి, మరిక ఎక్కడో (ఇక్కడుండే భూముల్ని తోటల్ని ఇళ్ళను పోగొట్టుకొన్నోళ్ళకు) జమీను ఇచ్చేదుంది అనే మాటలు వినబడసాగినవి.

పాములాగ ఉన్న ఏదో ఒక ప్రాణి ఇళ్ళవైపుకు ప్రాకి వచ్చింది అన్నట్లుగా భీతిగొల్పే మాటలు వినబడసాగినవి. ఔను ఆ మాటలు పాములాగే రూపందాల్చి యడూరు, మాణె, హులికల్లు, శీర్నాళి, ఉళకొప్ప, కానమనె, నిల్సకల్, బైసె, కలమనె, కొప్ప, మంజువాణె, మల్లినమడుగు మొదలైన గ్రామాలలోకి ప్రాకి రాగా ఆయా గ్రామాలలోని జనం బెదిరిపోయారు.

గుబ్బగోడుకు చెందిన శ్రీపాదరాయరు తన తోటకు వెనకుండే గుట్ట ఎక్కి కూర్చున్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి వారు చూస్తూ వచ్చిన కొండనుంచి జారే దిగుడు ప్రాంతం, కిందున్న ఇల్లుతోట, దాని పక్కన కాననరాశిగా పిలవబడేవాగు... మళ్ళా దూరానున్న అడవి, దాన్లోని వృక్షాలు చెట్లు పొదలు వారికి కనబడినవి. ఇక్కడివరకూ నీళ్ళు వచ్చి చేరుతవా? వరాహినది పైకి ఎగబాకి తను చూస్తున్న వాటినంతా కబళిస్తదా? కట్టబోయే యడూరు డ్యామ్‌లో అంత భారీగా నీళ్ళు వచ్చి చేరుతవా? నిలబడుతవా? మొదలైన ప్రశ్నల నుంచి వారి మనసు ఇప్పుడూ ఈ విషయాన్ని నమ్మేందుకు సిద్ధంగా లేదు. ఇదేమైనా తమాషానా? ఇక్కడ పురాణాలలో

చెప్పినట్లుగా జలప్రళయం ఏదైనా సంభవించొచ్చా అని రాయరు యోచనచేస్తూ కూర్చుండగా, వారి పుత్రుడైన విశ్వేశ్వరయ్య వచ్చి తన నాయన జతగా కూర్చున్నాడు. ఎంతోసేపు నాయన లాగే కళ్ళెదురులో ఉన్న ప్రకృతి సోయగంతో నిండిన అటవీసంపద చూస్తూ కూర్చున్న అతను "అప్పయ్యా (నాయనా)" అన్నాడు.

"ఏంటి పుత్రా?"

ఆ మద్దివృక్షాలతోట, పశువులు, మర్రి చెట్టునీడ, మామిడి, నేరేడు, పనస, జామచెట్లు, మనం స్నానం చేసే మడుగు... అన్నీ మునిగిపోతవా నాయనా... ఆనకట్టలోని నీళ్ళు మన ఇంటిని మునిగించుతదా?" అని అడిగాడు. ఎందుకో అతని స్వరం కంపిస్తుంది. మాటలు భారమైయ్యాయి. ముంపుకు గురైయ్యే బాధ అతనికి తాకింది.

అక్కైన మంగళాంబ వివాహం తర్వాత ఇంటి నిర్వహణ, తోటకు చెందిన కృషి బాధ్యతల్ని తనే మోసేందుకని సిద్ధమౌతున్న విశ్వేశ్వరయ్య ఇప్పుడు ఈ వార్త విని నిజంగానే కంగారైయ్యాడు. భవిష్యత్తులో ఈ ఇల్లు,తోట అంతా ముంపుకు గురైతే తను ఏమి చేయాలి? ఎక్కడికి వెళ్ళాలి అని అతను ఆలోచన చేయసాగాడు. అతనికి ఆప్రదేశం జతగా ఉన్న సంబంధం ఎంతో లోతైంది. నాయనలాగే అక్కడుండే చెట్లు, వృక్షాలు పొదలు బండలు గుట్టలను అతను ఎంతగానో ప్రేమించాడు. వాటన్నిట్నీ ఏదో ఉప్పొంగి వచ్చే జలరాశికి బలి చేసేందుకు అతనైతే సిద్ధంగా లేడు.

కొడుకు మదిలోని దిగులు బాధలోని సెగలు తనకూ తాకి శ్రీపాదరాయరు... "పాలన చేస్తుండే ఈ ప్రభుత్వంకు, ప్రభుత్వంలోని అధికార్లకూ మన బాధ అర్థం అయ్యేదిలేదు పుత్రా... వాళ్ళు ఏమైనా చేయగలరు..." అంటూ ఉద్గరించినప్పుడు విశ్వేశ్వరయ్య మరింతగా చింతాక్రాంతుడైయ్యాడు.

ఎక్కడికో తేలిపోతున్న తెల్లమేఘాలు నిదానం నిదానంగా కారుమేఘాలుగా పరివర్తనం చెంది ఆకాశంకంతా తన దేహాన్ని చాపి భారంగా తూలుతున్నప్పుడు చీకటి ముసిరి మెల్లగా గాలి వీస్తున్నప్పుడు, ఆ ప్రాంతంకు జీపులు, లారీలు వచ్చి వెళ్ళేది ఎక్కువైంది. మాస్తికట్టెలో వరాహి విద్యుత్ ఉత్పత్తి యోజనా కచేరి ఒకటి ప్రారంభమై, మరిక దాన్లోని అధికార్లు నౌకర్లు పల్లెలలోకి జొరబడి, 'హుం.. ఇక మీరందరూ మూటాముల్లె కట్టుకోండి, సర్దుకోండి" అంటూ బెదిరించసాగారు. ఇళ్ళు తోటలు పొలాలు మడులు... మొదలైన వాటి వివరాల్ని పట్టుకుపోయారు.

"వేరేచోట జమీను చూసుకోండి" అని అంటున్నారు. పనులు నిదానంగా సాగుతున్నా ఆనకట్ట కట్టేది, పొలం ఇల్లు మునిగేది కచితమైపోయింది ఆయా

గ్రామ వాసులకు. ముంపుకు విరుద్ధంగా పోరాటం చేద్దామని పలికిన కొంతమంది, రాబోయే పరిహారడబ్బును శీఘ్రంగా పొందేందుకని పోరాటం చేయసాగారు.

చివరికి శ్రీపాదరాయరు వేకువనే లేచి ఒకింత పెరుగు కల్పిన చద్దిబువ్వ , చింతతొక్కును అరిటాకులో కట్టించుకొని, ఆనకట్ట నిర్మాణ కచేరి ఉండే మాస్తికట్టెకు వెళ్ళారు. ఎవరికో అనుకూలం చేసేందుకని వెళ్ళిన పుత్రుడు తన వంటిమీదే నాపరాయి పడేసుకొని ఆస్పత్రిలో చేరాడు అన్నట్లుగా రాయరులోని పరిస్థితి ఉంది. ఎవరికో ఇంటింటికి విద్యుత్‌శక్తి ఇచ్చేందుకని, మరెవరికో పరిశ్రమల స్థాపనకని ఈ రైతుల భూముల్ని కబళించుతున్నారు. శ్రీపాదరాయరు కచేరికి ముందున్న మర్రిచెట్టు నీడలో ఇతర గ్రామాల రైతుల జతగా కూర్చుని భోజనం చేసి కుళాయిలోని నీటికి దోసిడు పట్టి కొంచెం నీళ్ళుతాగి మరిక ఒకచోటకూర్చుని తనకు మంజూరైయ్యే కొత్త జమీనుకని, ఇప్పుడున్న ఇంటికి పొలంకు వచ్చే పరిహారధనం పొందేందుకని వేచియున్నాడు. నెలలు గడుస్తున్నా రాయరుగారి పనిమాత్రం జరగలేదు. మరి తన గ్రామం చెంత క్రమేణ డ్యామ్ లేచి నిలబడి, గుత్తేదార్లు రాళ్ళకు బండలకు గుట్టలకు డైనమేట్లు ఉంచి పేల్చుతున్నారు. అరణ్యంలో కాంట్ర్యాక్ట్ పొందిన గుత్తేదార్లు ఒకటి సరిపోతదైతే పదిచెట్లను నరికి ఆ కలపను ఎక్కడెక్కడికో సాగనంపుతున్నారు. ముంపుప్రాంతంలో లభించబోయే ఇసుక, గ్రానైట్‌రాళ్ళు మొదలైన వాట్ని రవాణించేందుకు కూలీలు భారీగావచ్చి చేరుకొన్నారు. యడూరు, మాణె, హులికల్లు మొదలైన గ్రామాలలోని పల్లెజనంకు ఇళ్ళు ఖాళీ చేయండని నోటీసులు వచ్చినవి. హులికల్లులో ఉండే నరసింహస్వామి కూడా తన పురాతన గుడిని వదిలేయాల్సిన పరిస్థితి వచ్చింది.

"ఈ తిక్క గవర్నమెంటోళ్ళు... మనం ఎంతో భక్తిశ్రద్ధలతో పూజించే దేముడ్ని కూడా వదలలేదు మహాశయ... దేముడ్ని ఎక్కడికో పంపారు" అంటూ జనం మాట్లాడుకోసాగారు. దేముడే ఇక్కడ్నుంచి వెళ్ళిపోయిన పిమ్మట మరిక మనది ఏంటి అన్నట్లుగా నిర్వాసితులు తమలో తామే చెప్పుకోసాగారు.

ఉద్యోగస్తుల నివాసంకని కాలనీలు ప్రణాళికాబద్ధంగా ఏర్పడినవి. సర్కారి కచేరీలు నిర్మాణమైనవి. ఆనకట్టతో పాటు విద్యుత్ ఉత్పాదన కేంద్రం, రోడ్లు, వంతెనల నిర్మాణపనులు వేగంగా జరుగుతున్నవి. ఇస్కూల్, హోటెళ్ళు, క్లబ్బులు, బస్ట్యాండ్, మాంసం చేపల్నిఅమ్మే నీచుదుకాణాలు తలెత్తినవి. ముంపు నిర్వాసితులకు ఇచ్చే పరిహారధనంలోని బిల్లులు ఒక కచేరి నుంచి మరొక కఛేరికి, కఛేరినుంచి కోర్టుకు, మంత్రి గారి దస్కత్తుకు, సెక్రటేరియట్‌కు... ఇలా పరుగులు పెట్టుతుండగా కొన్ని బిల్లులు మాయమైనవి. కొన్ని ఎగిరిపోయినవి. లంచం ఇచ్చినందున కొన్ని బిల్లులు

తొందరగానే పాస్ అయ్యి శీఘ్రంగా పరిహారరొక్కాన్ని చూసినవి. ముంపు నిర్వాసితుల త్యాగం, దేశ ప్రేమగురించి వాళ్ళను పొగిడి మునగచెట్టు ఎక్కించగా, ఈ రైతు సమూహంలో శ్రీపాదరాయరూ ఉన్నారుకదా!

శ్రీపాదరాయరు చద్దిమూట కట్టుకొని చెప్పులు అరిగేలాగ కఛేరి చెంతకు పలుమార్లు వెళ్ళి కూర్చునేటప్పుడే మంగళాంబకు మొదటి కాన్పు చేయించారు. తర్వాత కొడుక్కి పెళ్ళి చేసారు. మునిగిపోయే తమ జమీనుకు బదులుగా ఇవ్వబోయే పొలం చెంతకు వెళ్ళి చూసివచ్చారు. పరిహార రొక్కం వచ్చిన పిమ్మట కొత్తగా ఇచ్చే జమీనులో ఏమేమి చేయాలనే దానిమీద ఆలోచన చేసారు. ఆనకట్ట లేచి నిలబడి, మరిక ముందుకే ప్రవహిస్తుండే నదిలోని నడక ఆగిపోయి నిల్చినప్పుడు, వానాకాలం ఆరంభమై నీళ్ళు ఆనకట్ట మూలకంగా ఆగినప్పుడు చుట్టుపక్కల ఉండే గుట్టల్ని కొండల్ని తోటలలో ఉండే లోపలిభాగాన్ని వెతుకుతూ తన దేహాన్ని చాపుకొంటుంది గమనించారు శ్రీపాదరాయరు. ఇలాగున ఒకరోజు నీళ్ళు ఎక్కడెక్కడో నిండుకుంటుండగా శ్రీపాదరాయరు "ఏమోయ్" అంటూ భార్యని పిలిచారు. అమ్మా... కోడలా" అంటూ కోడల్ని పిలిచారు. "విశ్వేశ్వరా" అంటూ పుత్రుడ్ని పిలిచారు.

ఇంటి అరుగుమీద కూర్చున్న రాయరు దూరానున్న వక్కతోట వైపు చేయిచాపి చూపెట్టారు.

"పరిహారధనం ఇప్పటికీ ఆ బోడిముండా కొడుకులనుంచి అందలేదు. అయితే ఈ రోజు తోటఅంచుకు నీళ్ళు వచ్చి చేరినవి" అన్నారు కటువుగా. కుటుంబ పరివారం అంతా భయం భయంగా అటు చూస్తుంటే తోటనుంచి పారుతుండే వాగు ఇప్పుడు పూర్తిగా నిండిపోయింది. నీళ్ళు రభసగా వచ్చి వక్కతోటలోపల, వక్కచెట్ల మొదళ్ళలో చెమ్మచెక్క ఆట ఆడసాగింది.

శ్రీపాదరాయరు మళ్ళా మాట్లాడలేదు. మాట్లాడే శక్తి వారిలో అణిగిపోయింది. ఇదైన ఒక నెలకు వారు చనిపోయారు. వారు చనిపోయిన రోజు నీళ్ళు తోటదాటి ఇంటి ప్రాంగణంలోకి వచ్చి చేరినవి.

ఇక ఇప్పుడు కఛేరికి తిరిగే వంతు విశ్వేశ్వరయ్యకు దక్కింది. కోపం అసహనం నుంచి కుతకుత లాడుతూ వారు అధికార్లముందుకు వెళ్ళి నిలబడగా ఒక అధికారి...

"ఔనండి.. మీరు గుబ్బగోడుకు చెందినవారు కాదా?" అని అడిగాడు.

"ఔను... గుబ్బగోడు గ్రామవాసినే.. ఎందుకు అడుగుతున్నారు అలా?"

"ఇప్పుడు గుబ్బగోడులో ఏమి నీళ్ళు వచ్చినవండి? ఆ వచ్చి చేరుకొన్న నీటి మట్టంకన్నా మరిక పైకి నీళ్ళు ఎగబాకేది లేదు... మీరెందుకు పరిహారధనంకని హడావుడి చేస్తున్నారు?" అన్నాడు ఆ అధికారి.

"ఆనకట్ట నిర్మాణం పరిపూర్ణంగా ముగించబడింది. నీళ్ళు నిలబడినవి. మీ తోట మునిగింది. అయితే ఇల్లు ఇంటెనుక ఉన్న పొలం ఎప్పటిలాగే ఉంది. విశాలమైన గుట్టనెత్తిన  అడవి, పొదలు సురక్షితంగానే ఉన్నవి" అన్నాడు అధికారి.

"ఔనా?" అంటూ నిర్వేదంగా పలికాడు విశ్వేశ్వరయ్య.

"అలాగైతే ముంపుకు గురైన తోట పరిహారధనం నిదానంగానే ఇవ్వండి" అని చెప్పి ఇంటికి చేరాడు.

❖ ❖ ❖

గడిచిన పది సంవత్సరాలనుంచి విశ్వేశ్వరయ్య మరియు అతని అర్ధాంగి నాగవేణి గుబ్బగోడులో ఉండే పాత ఇల్లు, పొలంలోనే ఉన్నారు. వారికి అందిన పరిహారధనం నుంచి తీర్థహళ్ళి పట్టణంలో ఒక ఇల్లు కొన్నారు. ఆ పట్నంలోని ఇంట్లో విశ్వేశ్వరయ్య ముగ్గురు పిల్లలు మరియు వారి వృద్ధమాత ఉంటున్నారు.

ఇప్పుడు గుబ్బగోడు చుట్టూ నీళ్ళు నిలిచినవి.  సుమారు ఏడెనిమిది కి.మీ. విస్తారంగా జలాశయం ఉంది. ఈ జలాశయంను దాటుకొనే గుబ్బగోడుకు వెళ్ళేదుంది. అక్కడ విశ్వేశ్వరయ్య, నాగవేణి సుఖంగానే ఉన్నారు. కొత్తగా వక్కతోట వేశారు. మాగాణి మడులు చేసారు. నీటికి కొరత లేనందున కూరగాయల్ని పండించుతున్నారు. పిల్లలేమో తీర్థహళ్ళికి వచ్చి ఉండండి అని తల్లిదండ్రులకు మొక్కుతున్నారు. వృద్ధమాత కూడా కోడలితో "ఇక్కడికే వచ్చియుండండి... అక్కడ ఏమి ఉందని ఉంటున్నారు?" అని బోధిస్తుంది. అయితే ముంపుకు గురైన మామ అనే (అడ్డ)మారుపేరు పొందిన విశ్వేశ్వరయ్య తల్లినుంచి వచ్చిన మాటకు నవ్వుతున్నాడు. "మేము అక్కడ హాయిగా ఉన్నాం... మున్ముందునా అక్కడే ఉంటాం" అని పలుకుతున్నాడు విశ్వేశ్వరయ్య.

తీర్థహళ్ళికి వచ్చినప్పుడు ఇంటి అవసరంకు కావాల్సిన సరుకుల్ని ఖరీదుచేసి వెళ్తాడు గుబ్బగోడుకు. ఆ ఇద్దరు ఒకట్రెండు రోజులు పిల్లల జతగా కాలం గడిపి వెనుతిరుగుతారు. పిల్లలకు మాత్రం గుబ్బగోడులోని ద్వీపం నచ్చేదిలేదు.

"మేము అక్కడికి వచ్చేది లేదు నాయన" అంటూ తలూపుతుండేవారు.

ఫెర్రి విభాగంవారు వరాహి ఆనకట్టలో వెనుకకు తన్నే నీళ్ళచెంత ఉండే కొన్ని గ్రామాల ప్రజల అనుకూలంకని బోట్లును జలాశయంలో నడుపుతున్నారు. ఈ బోట్లలో దుమింగడి బోటు కూడా ఒకటి. గుబ్బగోడుకు ముందుండే తెంకబైలి గ్రామంకు వెళ్ళే ఈ దుమింగడి బోటు కొన్నిసార్లు గుబ్బగోడు వద్దే హాల్టింగ్ చేస్తుండేది.

"షావుకారుగారు... ఏమైనా తెచ్చేదుందా?"

"షావుకారుగారు... వస్తారా పట్నంకు?"

"షావుకారుగారు... మీ పిల్లలకు ఏమైనా ఇచ్చి వచ్చేదుందా నానుంచి?" అడుగుతుండేవాడు దుమింగ.

అతని నుంచి అది ఇది అని ఏవేవో పనులు చేయించుకొంటుండేవారు విశ్వేశ్వరయ్య.

❖ ❖ ❖

ఈ అన్ని విషయాల్ని సూక్ష్మంగా సరళకు తెల్పాడు సుధాకర్.

"ఈరోజో రేపో దుమింగ రావచ్చు. మామ మాట తప్పే ఆసామి కాదు..." అన్నాడు సుధాకర్.

అతను చెప్పినట్లుగానే అయ్యింది. రెండురోజుల తర్వాత దుమింగ వారి ఇంటి ముందు ప్రత్యక్షమైయ్యాడు.

బోటు నడిపే దుమింగను చూడగానే సుధాకర్ భార్యను పిలిచి "వెళ్ళి వద్దాం పద" అన్నాడు.

"రేపు మళ్ళా గుబ్బగోడుకు వచ్చి మమ్మల్ని తిరిగి ఇక్కడకు చేర్చాలి దుమింగ" అంటూ దుమింగకు ముందస్తు ఎచ్చరిక చెప్పాడు. ఇంట్లో తన తల్లికి "రేపు సాయంకాలం తిరిగి వస్తాం. అక్కడ సరళకు విసుగు పుట్టొచ్చు" అని చెప్పాడు.

"చుట్టూ నీళ్ళుంటవి సరళా... కొంచెం భయమూ అవుతది. అయితే ఒకరోజు అక్కడ గడపి రావచ్చు. కష్టం ఏమి ఉండదు" అంటూ ఆమెకు ధైర్యం నూరిపోసాడు.

సరళ ఒకట్రెండు చీరలు లంగాలు మాచింగ్ బ్లౌజు(రవిక)లు ఫేర్ అండ్ లవ్‌లీ మొదలైన వాట్ని బ్యాగులో నింపుతున్నప్పుడు... "సరళా ఇవన్నీ ఎందుకు... అక్కడ ఇళ్ళు, రోడ్లు ఉండవు, జనం కూడా ఉండరు" అంటూ నవ్వాడు.

"ఉండనీయండి వాట్ని" అంది సరళ.

వాళ్ళు బస్సు నుంచి ఆనకట్ట చెంత దిగినప్పుడు సరళ ఆ జలరాశిని చూసి "ఓ! ఎంతగా నీళ్ళు ఉన్నవో కదండి" అంది.

బోటు బయల్దేరుతుండగా ఆమెకు ఎంతో సంతసం కలిగింది. కొంచెం దూరం వెళ్ళిన తర్వాత బోటు తన దిక్కును మార్చుకుంది.

దుమింగడేమో "చూడండి సార్... అక్కడుండేది సత్కుళ్ళ దేవప్ప హెగ్డెగారి భవంతి... ఇది హులికల్ దేవస్థానం ఉండే జాగ... ఇది యడూరు హెగ్డెగారి సౌధం... ఇది సాణెకల్లు.. ఇది కార్గల్లు... ఇది శీర్నాళిలోని రాజభవనం... " అని చెపుతుండగా, సుధాకర్ "ఔనయ్యా... ఇప్పుడు అన్ని వైపులా నీళ్ళు నిండి జలాశయం తొణికిసలాడుతుంది.. మరిక నువ్వు ఎలాగున మునిగిపోయిన గ్రామాల్ని గుర్తుంచుకొని చెప్పగలవు?" అని ప్రశ్నించాడు.

"నేను క్రితంలో ఇక్కడ నాటుపడవ నడుపుతుండేవాడ్ని... నది ప్రవాహం అప్పట్లో చిన్నగా సాఫీగా ఉండేది... ఇక్కడంతా ఊర్లు ఎన్నో ఉండేవి. ఇప్పుడు అవన్నీ ముంపుకు గురై మునిగిపోయినవి. నా జ్ఞాపకం మాత్రం ఇలాగే స్థిరంగా నిలబడిపోయింది..." అన్నాడు.

అతను గుబ్బగోడుకు వెళ్ళేది కుదరదట. ఆ గ్రామం సర్కారు దాఖలాలలో లేదట. అయినా విశ్వేశ్వరయ్య గారు ఏదో బక్షీస్ ఇస్తారనే ఆశనుంచి అతను అప్పుడప్పుడు గుబ్బగోడుకు దొంగలాగ బోటు తిప్పుతాడట!

"అలాగే... నువ్వు చెపుతుంది సరే... రేపు సాయంత్రం మమ్మల్ని తిరిగి తీసుకొచ్చి వదులు... నేనూ ఏదాన్నో ఈనాం రూపంలో ఇస్తానులే" అన్నాడు సుధాకర్.

విశాలమైన జలరాశి మధ్యలో బోటు వెళ్తుంది. నిదానంగా తీరం ఒకటి దగ్గర పడింది.

విశ్వేశ్వరయ్య నాగవేణి దంపతులు తీరం చెంతకొచ్చి ఆ నవదంపతుల్ని స్వాగతించారు.

"మామా... మేము వచ్చాం కదా" అంటూ సుధాకర్ బోటునుంచి చెంగున దూకాడు. అతని వెనకే సరళ నిదానంగా దిగింది.

"దుమింగా... రా ఇంటికి... చాయ్ తాగి వెళ్ళు" అన్నాడు విశ్వేశ్వరయ్య.

"ఎంతో హితకరంగా ఉంది గుబ్బగోడు. అడవి దట్టంగా పెరిగి ఉంది. లతలు తీగలు పెనవేసుకొని ఉన్నవి. పక్షుల కిలకిలనాదం చెవులకు ఏదో సంగీత పరికరంలోని నాదంగా ఉంది. అక్కడక్కడ మేస్తున్న ఆవులు బర్రెలు ఎన్నో ఉన్నవి. ఏదో నందనవనంకో లేకపోతే వేదకాలంలోని ఋషులఆశ్రమంకో వచ్చి చేరుకొన్నట్లుగా సరళ సంబరపడసాగింది.

నాగవేణి వచ్చిన అతిథులకు ముందస్తుగానే సిద్ధంచేసి ఫ్లాస్కులో ఉంచిన చాయ్ ఇచ్చింది. జతగా చెక్కెరకేళి అరటిపండ్లను తినబెట్టింది.

అరటిపండ్లు తిని చాయ్ తాగిన దుమింగ మరిక బయల్దేరుతుండగా సుధాకర్ అతనితో "రేపువచ్చి మమ్మల్ని తీసుకెళ్ళేది జ్ఞాపకం పెట్టుకో" అన్నాడు.

"సరేసరే" అంటూ నవ్వాడు దుమింగ. అతడ్ని వదిలేందుకని బోటు నిల్చిన తీరం వరకూ విశ్వేశ్వరయ్య అతని వెనుకే నడిచాడు.

"సరళను వెంటబెట్టుకొని కొండపైదాకా వెళ్ళిరండి సుధాకరా... ఇక్కడ తిరిగేందుకు విహరించేందుకు రాచవీధులేమి ఉండవు" అంది నాగవేణి.

వెళ్దాం అని సరళ లేచి నిలబడింది.

"కాళ్ళ క్రింద నలిగే వాట్ని చూసుకొంటూ వెళ్ళండి... అలాగే ఆ పడమటి అంచునుండే నీళ్ళలోకి దిగకండి... మొసళ్ళు ఉంటవి... జింకలు, నెమళ్ళు చూసేందుకు దొరకొచ్చు... మంచిగా కనులారా చూసి రండి" అంటూ ఆమె ఇంటి ముందుండే ప్రాంగణంకు వచ్చింది.

నవదంపతులు కొండ ఎక్కారు. తోట దాటి, దాని చెంతనుండే వరిమడుల్ని దాటితే కొండమీదున్న శిఖరంకు చేరుకోవచ్చు. శిఖరం నుంచి నిలబడి చుట్టూ చూస్తే నాలుగువైపులా నీళ్ళే! బెంగుళూరులో ఉండే పెద్ద బస్స్టాండ్‌లో సగం అన్నట్లుగా ఉన్న మామ పొలంలో తోట, వరిమాగాణి, ఇల్లు, అడవి అన్నీ ఉన్నవి. తాము నిలబడిన ఆ జలాశయ విస్తీర్ణం బెత్తెడంత జాగాను మామకు వదిలిపెట్టి అలలు అలలుగా అలరారుతున్న ఆ జలాశయంలోని నీళ్ళ సంపదను చూసి సరళ "అయ్యయ్యమ్మో! ఒక రీతిలో బెదురు పుట్టుతది కాదా?" అని ప్రశ్నించింది సుధాకర్‌ను.

"బెదిరేది ఎందుకు మహారాణీ?"

"ఔనండి, ఇక్కడ ఈ దంపతులు తప్పితే వేరేవారు ఎవరూ లేరుకదా... ఇప్పుడు మనం నలుగురమే.. బయట ఏమి జరుగుతుందనేది మనకు (ఇక్కడివారికి) తెల్సేది లేదు... మన దగ్గర (ఇక్కడ) ఏమి జరుగుతుందనేది బయట ఉన్న జనంకు తెల్సేదిలేదు... మొత్తం ప్రపంచం నుంచి ఈ స్థలం దూరం అండి" అంది సరళ.

"ఔను... అయినా మామ అత్త సుఖంగానే ఇక్కడ బతుకుతున్నారు కదా..." అన్నాడు సుధాకర్.

సాయంత్రం దాకా వీళ్ళు నిలుచున్న చోటే నిల్చారు. తిరిగినచోటే తిరిగారు. విశ్వేశ్వరయ్య కొంచెంసేపు అయిన తర్వాత వచ్చి ఆ యువదంపతుల జతగా చేరుకొన్నాడు. తర్వాత నాగవేణి కూడా వచ్చింది.

సాయంత్రం అవుతుంది అన్నప్పుడు ఎక్కడెక్కడినుంచో నానారకాల పక్షులు అక్కడికి వచ్చి చేరుకొన్నవి. నీటి ఆధారిత పక్షులే అధికంగా ఉన్నవి. అక్కడున్న చెట్లకొమ్మల మీద పక్షులన్నీ తమ గూళ్ళకు చేరుకొని కోలాహలం చేయసాగినవి. మయూరాలు కన్పించినవి. అడవిలో ఒక అంచున జింకల మందను చూసి సరళ సంబురపడింది. క్రిందకు జారుతున్న సూర్యుడు ఆ జలాశయంలోనే మునిగిపోతాడేమో అన్నట్లుగా, వరాహినది జలాశయం ఒడ్డుకు వచ్చి నిలబడిన సరళ "ఓ... అద్భుతం!" అంటూ గావుకేక పెట్టింది.

సూర్యుడు పశ్చిమంలో మునుగుతుండగా, గుబ్బగోడులో తాము ఇద్దరమే బతుకుతున్న దాని గురించి విశ్వేశ్వరయ్య చెప్పసాగాడు ఇలా: "మాకు పట్నం నుంచి కావాల్సింది ఉప్పు, చింతపండు, అగ్గిపెట్టె, చాయ్‌పత్తి(పౌడర్), కిరోసిన్‌నూనె,

వంటనూనె, ఎండుమిర్చి, కందిపప్పు మొదలైనవి మాత్రమే. వీటన్నిట్నీ నెలకొకసారి తెచ్చుకొంటాము. రెండుమూడు నెలలకు ఒకసారి తీర్థహళ్ళి పట్నంకు వెళ్ళి పిల్లల బాగోగులు , అమ్మ ఆరోగ్యంగా తిరుగుతుండేది చూసుకొని వస్తాం. అప్పుడే వరిధాన్యం, వక్కలు తీసుకెళ్ళి మండీలో ఉండే పెద్ద అంగడిలో అమ్మకంకని వేసి వస్తాను. ఎంతోమంది పరాయోళ్ళకు మా జీవనం విచిత్రంగా అన్పిస్తది... మాకు అలా అన్పించదు. మేము ఇక్కడ సహజంగానే జీవిస్తున్నాము. తోటలో శ్రమించేది ఎంతో ఉంది. వరిమాగాణి పని ఉంటది. తోడుగా ఉన్న ఆవులు, ఎద్దుల్ని మంచిగా చూసుకొంటాం... అవసరమైనప్పుడు జనం (కూలీలు) కూడా దొరుకుతారు...” అంటూ చెప్పసాగాడు.

సుధాకర్, సరళ ఇంటివైపుకు మళ్ళినప్పుడు సూర్యుడు నీళ్ళలో మునుగుతున్నాడు. అంత విశాలంగా ఉన్న జలాశయంలోని నీళ్ళన్నీ ఎరుపువర్ణంకు మారినవి. నాగవేణి దీపంబుడ్డి వెలిగించి తెచ్చి అరుగుమీద పెట్టింది. చల్లగా వీస్తున్న గాలి చుట్టూ ఉన్న అడవిలోకి దూసుకెళ్ళి; ఆ అడవినుంచే ధ్వనులు వస్తున్నట్లుగా చిత్రవిచిత్రంగా చప్పుడు వస్తుంది. దీపం బుగ్గలోని వెలుగు కారుచీకటి జతగా పోరాడలేక, మండుతున్న వత్తిలోని వెలుగు మంట అటు ఇటు ఊగుతుంది.

“మామా... మీకు కరెంటు సదుపాయం లేదా?” అని అడిగాడు సుధాకర్.

“ఔను అల్లుడూ... ఇక్కడ ఎంతోమంది కథ మాలాగే ఉంది. డ్యామ్‌కని మేము ఎంతో త్యాగం చేశాం. అయితే విద్యుత్ సౌకర్యం మాకు దొరకనే లేదు.” అన్నాడు విశ్వేశ్వరయ్య.

వంటింట్లోకి చేరుకొన్న నాగవేణి వంటపని ముగించి “లెగవండి భవ్య భోజనంకు” అని పిల్చేదాక విశ్వేశ్వరయ్య నుంచి విషాదం, బాధ, సంకటస్థితిలోని మాటలు వస్తూనే ఉన్నవి.

“అయితే మామా... మీరు ఈ ద్వీపం(నడుగడ్డ)లో నివసిస్తూ తప్పు చేసారేమో అని నాకు అన్పిస్తుంది” అన్నాడు సుధాకర్.

“తప్పు అని నాకు అన్పించడం లేదు... మాతోపాటు గతంలో ఉన్న జనం అనివార్యంగా పొలం, తోట, ఇల్లు వదిలివెళ్ళి, కొత్త ప్రాంతంలో ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నారు. వారితో పోల్చి చూస్తే మేము సుఖంగానే ఉన్నాము. చుట్టూ నీళ్ళు నిల్చినవి... మా వాళ్ళు ఎవరూ దగ్గర లేరు అనేది తప్పితే అదే వెనకటి కాలంలోని ఇల్లు, తోట, పరిసరం ఉన్నవి... ఈ సుఖసంతోషం ఎంతోమందికి ఉండేది లేదులే” అన్నాడు విశ్వేశ్వరయ్య.

మసకు మసకుగా వెలుగుతున్న దీపం బుడ్డి (బుగ్గ) కాంతిలోనే వాళ్ళు భుజించారు.

సమయం జారుతుండగా గుబ్బగోడులోని నీరవమౌనం;ఆ నిశ్చల మౌనాన్ని కెలుకుతున్నట్లుగా వినబడే చప్పుళ్ళు కొత్తవాళ్ళకు భీతిని కలగజేస్తవి.

నాగవేణి లోపలి గదిలో పాన్పు పరిచి కిరోసిన్‌బుడ్డి (బుగ్గ) ఒకదాన్ని వెలిగించి అక్కడున్న గూడులో పెట్టి "పడుకోండి ఇక సుఖంగా... నిదానంగా మేల్కొండి... ఇక్కడ అంతా నిదానమే... బయట ఎక్కడికీ పట్నంలోలాగ వెళ్ళేది లేదు... " అంటూ నవ్వింది.

సుధాకర్ ఆవులిస్తూ భార్య ముఖం చూసాడు.

వాకిలు మూసి నాగవేణమ్మ వెళ్ళిన తరువాయి సరళ సుధాకర్ బాహువులలో ఇరుక్కొని "ఏమండి... మనం రేపే వెళ్ళిపోదాం" అంది.

"ఏంటి... ఇక్కడికి వచ్చి ఇకనూ ఒక రాత్రి కూడా గడిచిపోలేదు. అప్పుడే విసుగైందా?" అన్నాడు.

"మరేంటండి? ఇదేమైనా ఒక ఊరా? ఇక్కడేమైనా పట్నంలోని రాచవీధులు ఉన్నవా? ఈ ఇద్దరూ కాకుండా వేరే జనం ఉన్నారా? చుట్టూ నీళ్ళు, మధ్యలో అడవి... నాకు భయమేస్తుందండి."

సుధాకర్ నాజూకుగా ఆమెను చెంతకు లాక్కొని "నేనంటూ ఉన్నాను కదా చేష్టలు చేసేందుకు... ఇక పట్నంలోని జనసందడి నీకెందుకు?" అన్నాడు.

ఆమె పులకించింది అతను చేయబోయే చేష్టలకని.

రాత్రంతా ఆమెకు సుధాకర్ నుంచి చేస్తున్న చేష్టలకు నిద్రపట్టలేదు. నక్కో మరేదో కూసిన చప్పుడు; పక్షుల కలరవం, చెట్లు ఒకదానికొకటి తాకుతూ చప్పుడు చేస్తున్నవి. సుధాకర్‌ను వాటేసుకొనే ఆమె ఆ రాత్రంతా మధురంగా గడిపింది.

❖ ❖ ❖

నవదంపతులకు మెలుకువ అయినప్పుడు ఎంతో పొద్దైంది. నాగవేణి తలుపు తట్టి నురగలు పెట్టున్న వేడి కాఫీ తెచ్చి ఇచ్చింది.

"నిద్ర గాఢంగా పట్టిందా?" అని అడిగింది నాగవేణమ్మ. ఆమె వెనుకే విశ్వేశ్వరయ్య వచ్చి చెల్లాచెదురైన పాన్పును తొంగిచూసి ముసిముసిగా నవ్వాడు.

నాగవేణమ్మ –విశ్వేశ్వరయ్య ఎంతో సంభ్రమంతో ఉత్సాహంగా ఉన్నారు. ఉదయంలో ఉపాహారం కని మసాలాదోశెల్ని చేసింది. విశ్వేశ్వరయ్య ముందు నిలబడి వారికి వడ్డన చేసాడు. తర్వాత నవదంపతుల్ని తోటకు తీసుకెళ్ళాడు. వక్కలు, యాలకులు, మిరియాలు, అరటి, పసుపు, అల్లం మొదలైన పంటలు తనతోటలో

పండిస్తున్న విధం గురించి వివరంగా పరిచయించాడు. తోట అంచున ఉండే రక్షణ కంచె వద్ద ఏవేవో మొక్కలు, పూలచెట్లను పరిచయించాడు. వేరుశెనగకాయలు చెట్టులో కాకుండా, చెట్టునుండే వేర్లునుంచి లభించే విధంచూసి ఆ నవదంపతులు ముక్కున వేలేసుకొన్నారు. నాగవేణమ్మ మధ్యలో వచ్చి "భోజనాలు సిద్ధం... వచ్చి భోంచేయండి" అని కోరింది.

భోజనాల వ్యవస్థ భారీగా ఉంది. రుచికరమైన బొబ్బట్లు, మినుములతో చేసిన గారెలు, పూర్ణాలు, పులిహోర, గసగసాల పాయసం, పెరుగునుంచి చిలికిన నవనీతం, కందిపచ్చడి, పుల్ల బచ్చలి పప్పు... అన్నిట్నీ కొసరి కొసరి వడ్డించింది నాగవేణమ్మ. రకరకాల ఊరగాయ పచ్చళ్ళు విస్తరలో ఉన్నవి. వాళ్ళు సుష్టుగా భుజించారు.

మాటల్ని గుత్తకు తీసుకొన్నోడిలాగ విశ్వేశ్వరయ్య పశుపక్ష్యాదుల గురించి వివరించాడు. అడవిపంది, జింకల సామూహిక జీవనాన్ని తెల్పాడు. అయితే తమ చెంతకు బంధుమిత్రులు, వారసులు వచ్చేది లేదు" అని నవ్వాడు. ఆ నవ్వులో ఒక విషాదం ఉంది.

సూర్యుడు అటు పడమర దిశకు వాలుతుండగా నవదంపతులు సిద్ధమైయ్యారు. "మామ దుమింగడి బోటు వస్తది... మేము బయల్దేరుతాం" అన్నాడు సుధాకర్.

"అలాగే... అతడ్ని రానీయండి" అన్నాడు విశ్వేశ్వరయ్య.

నవదంపతులు ఇంటి ముందున్న అరుగుమీద కూర్చుని బోటు వచ్చేదాన్ని ఎదురు చూడసాగారు.

ఎంతోసేపు ఎదురుచూసినా బోటు రాకపోయిన దాన్ని గమనించి "అయ్యో, బోటు రాలేదు కదా" అంటూ భయపడింది సరళ.

"రావాలని చెప్పాను కదా... అతను మరిచాడేమో" అంటూ చిక్కులో పడ్డాడు సుధాకర్.

నాగవేణి నేతితో వేపించిన పనస అప్పడాల్ని తెచ్చింది. వాటితో పాటు ఉడకబెట్టి పోపు పెట్టిన అలసందల్ని తెచ్చింది. విశ్వేశ్వరయ్య నుంచి మాటలజోరు సాగుతుంది. నిదానంగా చీకటి ముసిరింది.

"ఈ రోజుకు ఇక ఇంతే... మీరు మాత్రం చింతించకండి" అంటూ విశ్వేశ్వరయ్య ఆ దంపతుల్ని సముదాయించాడు.

గుబ్బగోడులోని ఈ నీరవద్వీపంలో మరొకరాత్రి గడిచింది. సరళ అసహనంగా నెత్తిని గోక్కోసాగింది. ఒక క్షణం ఒక గంటగా అవుతదేమో అన్నప్పుడు నాగవేణమ్మ గుమ్మడికాయ హల్వా, పాలతాకుల పాయసం చేసుకొని వచ్చింది.

సరళేమో సుధాకర్‌తో "ఆ బోటు నడిపే దుమింగ ఎప్పుడైనా రావచ్చు... అతను వచ్చిన తక్షణమే మనం బయల్దేరుదాం..." అని చెప్పింది. ఆమె కొత్తచీర కట్టుకొనే ఆ రోజంతా బోటు రాకకని ఎదురుచూసింది.

రెండోరోజు వెళ్ళిపోయింది.

మూడోరోజు వచ్చింది.

"మామ... బోటు నడిపేటోడికి కబురుపెట్టేందుకు ఏమైనా ఏర్పాటు ఉందా?" అంటూ ప్రశ్నించి, తన ప్రశ్నకు జవాబు తన బుర్రలోనే మెరిసినందున పుచ్చుమోముతో నవ్వాడు సుధాకర్.

దిగులు వ్యాకులంతో ఉన్న సరళ చెంతకొచ్చి "విసుగు కలుగుతుందా సరళా" అంటూ అడిగాడు సుధాకర్. "బోటు నడిపేటోడు మన గురించి మరిచిపోయి ఉండొచ్చేమో?" అంటూ సుధాకర్ తల చెడుపుకోసాగాడు.

నవదంపతులలో ఉన్న ఈ అసహనాన్ని,వ్యాకులాన్ని నాగవేణమ్మ విశ్వేశ్వరయ్య గమనించారు.

"ఓయ్ ఓయ్! మీకు విసుగు కలుగుతుందా... విసుగు అనే మాటకన్నా బెదురు కలుగుతుందేమో..." అంటూ విశ్వేశ్వరయ్య తన మాటను మార్పు చేసుకొన్నాడు.

"మొట్టమొదట మాకూ మీలాగే అవుతుండేది... నేను ఈమే ఇద్దరం.... అయ్యో అనేందుకు మూడో మనిషేలేడు... పిచ్చిపట్టేటట్టుగా ఉండేది... అయితే క్రమేణ అంతా అలవాటు అయ్యింది... మీరు మాలాగ ఇక్కడ ఉండిపోయేది లేదు... ఈరోజు గాకపోయినా రేపు దుమింగడు కచితంగా రాగలడు..." అంటూ నవ్వాడు విశ్వేశ్వరయ్య.

ఆ రాత్రి వారు భుజించిన పిమ్మట గోడలో వేలాడదీసిన సంచినుంచి సంగీత పరికరం తీశారు. మూలన ఉంచిన హార్మోనియం పెట్టెతీసి "నాగవేణి...శృతి చేయి" అన్నాడు అదొక రోజువారి కార్యక్రమం అన్నట్టుగా.

నాగవేణి హార్మోనియం పెట్టెను దగ్గరకు లాగింది.

"యక్షగానం... గుర్తుందా మీకు?" అంటూ నవదంపతుల ముఖాన్ని చూసింది.

"గజముఖదవగె గణపగె చెలువగె (సుందర గజముఖ గణపతికి)

త్రిజగ వందితనిగారతి ఎత్తిరె (ముల్లోకాలలో వందనాలు పొందే గణపతికి ఆరతి ఎత్తి)..." అని ఎంతో ఎత్తులో, అంతే గడుసైన ఇంపైన ధ్వనితో గణపతి దేముడ్ని స్తుతించాడు విశ్వేశ్వరయ్య.

తర్వాత ఖాండవవనంలోని దహన ప్రసంగం ఎంచుకొని అక్కడుండే కొన్ని పద్యాల్ని రాగయుక్తంగా పాడసాగాడు. వనాన్ని దహించి వెళ్ళేటప్పుడు మయుడు

అనే రాక్షసుడు, నాలుగు సారంగపక్షులు అగ్ని జ్వాలలనుంచి తప్పించుకొని వెళ్ళేదాన్ని రాగబద్ధంగా భావపూర్ణంగా పాడాడు. సుధాకర్‌కు విశ్వేశ్వరయ్య ఎక్కడో వనదహనంకు బదులు ముంపుకు గురైన కథనే చెపుతున్నాడేమో అని అన్పించింది. ఆ నీరవ రాత్రిలో విశ్వేశ్వరయ్యగారి యక్షగానంలోని మధురమైన పాటలు ఏదో ఒక సమ్మోహనంను కలిగించింది ఆ నవదంపతులమీద. చుట్టూ ఉన్న అడవి కూడా వారి గానామృతానికి వళ్ళు మరిచి విన్నదానిలాగ సుధాకర్‌కు తోచింది.

చివరగా మంగళం పాడి మరిక “చాలు” అన్నాడు.

“నాగవేణి... భోజనంకు విస్తర్లు వేయి” అన్నాడు. నాగవేణమ్మ అప్పుడు కూడా రుచికరమైన వంటపదార్థాల్ని చేసింది.

రాత్రి పడుకోబోయే ముందు సరళలోని మానసిక బిగువును తొలగించేందుకు సుధాకర్ ప్రయత్నించాడు. సరళతో ప్రీతిగా మాట్లాడాడు. నాగరిక ప్రపంచం నుంచి ఎంతో దూరంగా ఉండిపోయిన అత్తమామల గురించి చెప్పాడు. పిల్లలు (వారసులు) కూడా ఇక్కడికి వచ్చేందుకు ఒప్పుకోవట్లేదని ఇటువంటి పరిస్థితిలో మామ అత్త ఇద్దరే మున్ముందు ఎలా ఉండగలరో అని యోచన చేసాడు సరళతో.

“ఇక్కడుండే తరులు, గిరులు, లతలు, పశుపక్ష్యాదులు, అడవి ప్రాణులతో మనం స్నేహం చేసుకొంటే మరిక ఇక్కడ ఉండేది కష్టమేమి కాదేమో?” అన్నాడు సుధాకర్ సరళతో. ఆరాత్రి గడిచిపోయి మళ్ళా ఉషోదయం అయ్యింది. సరళ మల్లెల్ని తెంపింది. మాలలు కట్టి నాగవేణమ్మ సిగలో ముడిచింది.

సుధాకర్ కూడా పంచె పైకి ఎత్తికట్టుకొని మడులు తోటలో అది ఇది చేసి విశ్వేశ్వరయ్యకు సహాయపడ్డాడు.

“ఈరోజు దుమింగడి బోటు రాకపోతే నాకు తెప్ప ఉంది. అందులో వెళ్ళి నేను అతడ్ని పిల్చుకని వస్తాను. మీరు దిగులు పడొద్దు. మిమ్మల్ని ఇక్కడే శాశ్వతంగా అట్టిపెట్టుకొనేది లేదు” అంటూ విశ్వేశ్వరయ్య జలాశయం ఒడ్డున పైకి లాగి సుభద్రంగా గూటంకు కట్టి ఉంచిన తెప్పను చూపించాడు.

సరళ, సుధాకర్ నాలుగురోజులకే మార్పు చెందారు. ఇప్పుడు వాళ్ళలో ఉన్న విసుగు అసహనం దూరమైంది. ద్వీపంలో తాము ఇరుక్కుపోయాం అనే దాన్ని వాళ్ళు మరిచారు. చుట్టూ నిల్చిన నీళ్ళు మొదట్లో భీతిని కలిగించింది వాస్తవమైనా, ఇప్పుడు ఆ జలసమృద్ధే సంతోషంకు కారణమైంది. ఆ దంపతులు చేయి చేయి పట్టుకొని నిసర్గ(ప్రకృతి) మధ్య, అత్యాధునిక వసతి ఏ ఒక్క అనుకూలం లేని ఈ ద్వీపంలో చిలకా గోరింకలాగ ప్రవర్తించారు. తిరుగాట చేశారు.

ఐదోరోజు సూర్యకిరణాలు భూమిలో పడుతుండగా, "అల్లుడూ... మీరు ఈ రోజు వెళ్ళొచ్చు" అన్నాడు విశ్వేశ్వరయ్య. సుధాకర్ ఆశ్చర్యంగా మామ ముఖం చూసాడు. వారు ఇలా చెప్పిన దానికి కారణం ఏమి అనేది అవసరం లేదు.

"మీకు ఆలశ్యం జరిగిన దాంట్లో దుమింగడి తప్పేమిలేదు. నేనే ఖుద్దుగా అతనితో ఐదురోజుల తర్వాత రావాలని చెప్పాను. మీకెంతగా విసుగు అయ్యిందో... అయితే సదా ద్వీపంలో ఉండే ఆత్మబంధువుల జతగా నాలుగురోజులు మీరు మాతో ఇక్కడ గడిపింది మాకైతే ఎంతో సంతోషం అయ్యింది. మనిషి తోటి మనుషుల్ని వదిలి ఉండలేడు అనేది అబద్ధం కాదు" అన్నాడు విశ్వేశ్వరయ్య. నాగవేణి భర్తమాటకు ధ్వని జోడించింది.

దూరంలో ఏదో చప్పుడు విన్పించింది. సుధాకర్ జలాశయం వైపు చూశాడు. నీళ్ళమీద ఒక బిందువుగా కన్పించుకొన్న బోటు తీరం చెంతకు వస్తుండగా నాగవేణమ్మ, విశ్వేశ్వరయ్యల ముఖాలు వడలిపోయినవి. సుధాకర్ మామ చేతిని పట్టుకొని...

"మామా... మేము మున్ముందు వచ్చినప్పుడల్లా ఎనిమిదిరోజులు ఇక్కడే గడిపి వెళ్ళిపోతాం... మాకైతే ఏమి విసుగు కలిగేది లేదు" అన్నాడు. బోటు వచ్చి ఒడ్డున ఆగినప్పుడు దుమింగ ఒడ్డునున్న మెరక ఎక్కి విశ్వేశ్వరయ్య ఇంటివైపుకు వడివడిగా వస్తుంది కనబడసాగింది.

**మూలకథ రచనా కాలం : 2000**

**ఈ కథనే నవలగా విస్తరించి ద్వీప అనే పేరుతో ప్రచురించారు నా.డి'సోజ. ఈ నవలను 'ద్వీప' అనే పేరునుంచి గిరీశ్ కాసరవళ్ళి దర్శకత్వంలో నటి (స్వర్గీయ) సౌందర్య నిర్మాతగా నటిగా మారి చలనచిత్రంగా రూపొందించబడింది.**

**ఈ చిత్రంకు జాతీయ స్థాయిలో స్వర్ణకమలంతో పాటు అనేక పురస్కారాలు లభించినవి.**

# అలీబాబా గారి మనోవ్యాధి

మన కథకు నాయకుడైన అలీబాబా భికారికొప్పలోని శిరాజుద్దీన్‌కు కొడుకు అండి. శిరాజుద్దీన్ ఇప్పుడు లేరు. అయితే తండ్రి నుంచి వచ్చిన ఇంటిలో ఒక భాగం సైకిల్ షాపు పెట్టుకొని మరొక భాగంను నివాసయోగ్యంగా మార్చుకొని అలీబాబా ఉంటున్నాడు. భికారికొప్ప చిన్న గ్రామం. ఆ గ్రామంకు తగినట్లుగా అలీబాబా సైకిల్ షాపులో కేవలం ఆరు సైకిళ్ళు ఉన్నవి. ఆ ఆరులో ఒకటి సదా రిపేరుకు వస్తుంటది. రిపేరుకు వచ్చిన సైకిలు ట్యూబుకు గాలికొట్టుతూనో పంక్చరు వేస్తూనో హ్యాండు ఫెడల్ సరిచేస్తూనో అలీబాబా ఉన్నప్పుడు అంగడి పీరడు, హోటెల్ వెంకటేశి, సరుకుల దుకాణంకు చెందిన విశ్వనాథషెట్టి, మట్కాజూదంకు ఏజెంట్ అయిన బాబిజాన్.... ఇలా ఎవరెవరో వచ్చి బాడుగకని సైకిళ్ళను తీసుకెళుతుంటారు. వారు వచ్చి సైకిల్ హ్యాండిల్ మీద చేయి వేసిన తక్షణమే "తీసుకెళ్ళండి అణ్ణా" అంటూ అలీబాబా లేచి గోడకున్న గూడులోని గడియారాన్ని ఒకసారి చూసి సైకిల్ నంబరు తీసుకెళ్ళిన గిరాకిదారుడి పేరు, టైము మొదలైన వాట్ని పుస్తకంలో నమూదించు కొంటాడు. సైకిల్ వెళ్ళి ఎటెటో తిరిగి వచ్చిన పిమ్మట ఈ మూడువిభాగాల ముందు సైకిల్ వచ్చి చేరుకొన్న టైమ్ రాసుకొని డబ్బు ఎంతైందని గుర్తించి అక్కడే ఆ డబ్బును రాసుకొని "ముప్పై ఐదు పైసలో... ఏభై పైసలో" అని చెప్పి గిరాకి నుంచి డబ్బు పొంది మేజాబల్ల సొరుగులో వేసి మరిక తన పనిలో మునుగుతాడు.

❖ ❖ ❖

అలీబాబా తండ్రి కొద్దికాలం క్రితమే స్వర్గస్థుడైయ్యాడు. దగ్గరదగ్గరగా వంద సంవత్సరాలు బతికిన గట్టి మనిషి అతను. అతనేమి బికారికొప్పలో సైకిల్ షాపు పెట్టి ఉండలేదు. అతనైతే తంబాకు (పొగాకు) వ్యాపారి. భికారి కొప్పకు ఆనుకొని చుట్టు ప్రక్కల పండుతుండే తంబాకును వేరే గ్రామాలకు తీసుకెళ్ళి అమ్మేది అతని కార్యంగా ఉంది. అతను ఈ వ్యాపారాన్ని వదిలి ఎన్నో సంవత్సరాలు అయినవి. అలీబాబా భికారికొప్పలో ఉండే కన్నడ ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం చదివి ముగించిన పిమ్మట ఇంట్లోనే ఉన్నాడు. పుత్రుడ్ని ఏదో ఒక పనిలో పెట్టాలని శిరాజుద్దీన్ ఏమేమో చేసాడు. అలీబాబా ఒకరీతిలో హఠమారి పోరడు. వాళ్ళు వీళ్ళ

నుంచి ఏ దుష్ట మాటనైనా అన్పించుకొనేది, దెబ్బలు తినేది అతనిలో లేదు. ఆ పోరడు సమాధాన చిత్తుడిగా వినయశీలుడిగా స్వాభిమానిగా మరియు హఠమారి గానూ ఉండేవాడు. ఇందుచేత ఐదారు చోట్ల పనిలో చేరి మానుకొన్నాడు. అయితే ఇతను ఎన్నో సంవత్సరాలు కుదురుగా పనిచేసింది మాత్రం భికారికొప్పకు చెందిన నారాయణరాయరి గారి సైకిల్ షాపులో నండి!

నారాయణరాయరు గారు పూర్వంలో ఖాది ధరించి జైలుకు వెళ్ళాడట. చివరికి ఆ స్వాతంత్ర్య సమరయోధుడు బతుకు తెరువుకని సైకిల్‌షాపు పెట్టుకొని స్వస్థలంలోనే ఉన్నాడు. వారి శిష్యుడు అలీబాబా; పదిహేను సంవత్సరాలు వారి వద్ద ఉండి సైకిల్ రిపేరు నుంచి అన్నీ నేర్చుకొన్నాడు. నారాయణరాయరి గారి ఎన్నో మాటలు దేశప్రేమ మొదలైన వాట్ని కొంచెంకొంచెంగా నేర్చాడు. ముఖ్యంగా తన పాటికి తను, తన కార్య భారం అనే దాన్ని నేర్చుకొన్నాడు.

పెళ్ళైన తర్వాత నారాయణ రాయరే అలీబాబాకు సైకిల్ షాపు పెట్టుకొనేందుకు దోహదపడ్డారు. రాయరుగారు వృద్ధాప్య దశ నుంచి భికారికొప్ప వదిలేసి నగరంలో ఉండే కొడుకు చెంతకు వెళ్ళే నిర్ధారంలో ఉన్నందున, అలీబాబా నిరుద్యోగి కాకూడదని శిరాజుద్దీన్‌కు చెప్పి అతని ఇంట్లో ఉండే ఒక పార్శ్వం (భాగం)లో సైకిల్‌షాపు పెట్టించారు. కొత్తవైన రెండు సైకిళ్ళ జతగా పాతవైన మరో రెండిట్ని ఇచ్చారు. కష్టపడే తత్వాన్ని ఎవరూ అలీబాబాకు నేర్పేదిలేదు. నారాయణరాయరు ఊరు వదిలి వెళ్ళారు. శిరాజుద్దీన్ చనిపోయాడు. గడిచిన ఇరవై సంవత్సరాల నుంచి అలీబాబా సైకిల్ షాపు నడుపుకొంటూ వస్తున్నాడు. ఊరులో కొంత మందికి అతను దాదా (పెద్దాయన), మరికొంతమందికి నువ్వు మీరు అనేంతగా స్నేహితుడండి!

ఉదయం ఎనిమిది గంటలకు అతను సైకిళ్ళను బయట పెట్టితే మరిక అవి లోపలికి చేరేది రాత్రి తొమ్మిది గంటలకు. సైకిళ్ళను లోపల పెట్టిన మీద అతను లెక్కపుస్తకం ఎదురుపెట్టుకొని, ఆ రోజు సంపాదన ఎంతైంది అనేదాన్ని తెల్సుకొనేందుకు టోటల్ చేసేటప్పుడు రెండు సంఖ్య (అంకె)లు వస్తవి. ఒక రోజు ఇరవై మరొక రోజు ఇరవై ఐదుగా వస్తది. గ్రహచారం బాగుంటే ముప్పైరూపాయలు కూడా వచ్చేదుంది. పండుగ జాతర సంత దినాలలో ఎక్కువగా సంపాదన ఉండేది. వానాకాలంలో మాత్రం ఎంతో తక్కువ సంపాదన ఉండేది.

మరిక రాత్రివేళ కిరోసిన్ రాసుకొని చేతులు కడుక్కొంటున్నప్పుడు తనలోని శ్రమ కార్యం ఆరోజుకు ముగిసింది కదా అని అతనికి అన్పిస్తది. రోజూ వచ్చే సంపాదనలోని ఇరవైయ్యో ఇరవై ఐదు రూపాయలలోనే కుటుంబాన్ని పోషించుకొనేది;

సైకిళ్ళకు ట్యూబులు టైర్లు విడిభాగాల్ని తెచ్చుకొనేది; పగలంతా విరామం లేదు అన్నట్లుగా పని చేసేదుంది. ఎందుకు ఇలాగున అని అతను యోచిస్తుండేవాడు. భార్య ఎదురు తన శ్రమశక్తిలోని విషయాన్ని ప్రస్తావించేవాడు. ఆమెకూడా ఔనుకదూ అంటూ రాగం చేస్తుండేది.

"ఆ మునీర్‌కన్నా మనం వెనక బడ్డాం కదా" అంటుంది అతని బీబి.

"హుం... చూడండి... అతను ఇప్పుడు ఇల్లు కట్టుతున్నాడు"

"అతని అర్ధాంగి చెవులు మొత్తం, కుట్టించుకొన్న పోగులతో నిండిపోయినవి... మళ్ళా ముక్కు పుడకలు (ముక్కెరలు) కుట్టించుకొనే స్థితిలో ఉంది..."

"మీలాగే అతను కష్టపడేది లేదు ... చేతికి గ్రీజు అంటేది లేదు... నడుంవంచి గాలిపంపు కొట్టేది లేదు..." అంటూ బీబి ఒకటొకటే చెపుతుంది.

"ఔనుకదా... ఔనుకదా" అంటూ అలీబాబా ఆశ్చర్యపడుతుండేవాడు.

తిండితిని పడుకొంటే మునీర్ గుర్తుకొస్తున్నాడు. ఉషోదయమై షాపు తలుపులు తెరిచినా మునీరే గుర్తుకొస్తున్నాడు.

మునీర్ సంపాదనా పరుడైనందుకు కారణం ఏంటి అనే విషయం మీద జిజ్ఞాస చేసాడు అలీబాబా.

❖ ❖ ❖

కర్నాటక ప్రభుత్వంకు చెందిన పబ్లిక్‌వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పిడబ్ల్యుడి)లో మునీర్ గ్యాంగ్‌మన్. భికారికొప్పలో ఒక ఉపవిభాగం ఉంది. ఈ ఉపవిభాగంలో ఐదారుగురు సూపర్ వైజర్లు, ఒక జూనియర్ ఇంజినీర్ ఉన్నారు. ప్రతియొక సూపర్‌వైజర్ చేతికింద ఆరేడుగురు గ్యాంగ్‌కూలీలు ఉన్నారు. ఈ గ్యాంగ్‌కూలీల పని ఏమిటంటే రోడ్డు పక్కనున్న ముళ్ళ పొదల్ని నరికేది, రోడ్డును బాగుపరిచేది, ప్యాచ్‌వర్క్, జంగిల్ క్లియరెన్స్, రోడ్డు మీద వాన నీరు నిలవనట్లుగా కాలువ చేసేది, బ్రిడ్జ్ మరమత్తు, ప్రభుత్వ క్వార్టర్స్‌లలో చిన్న రిపేరు పనులు మొదలైనవి ఉంటుండేవి. ఈ గ్యాంగ్ కూలీలకు నెలవారి జీతం లేదు. రోజు కూలి మాత్రమే. రోజుకు ఎనిమిది నుంచి పదిరూపాయల కూలి. ప్రతి ఆదివారం సెలవు. వీళ్ళు పనికి వెళ్ళని రోజు జీతం ఉండదు. నెల నిండినప్పుడు వీళ్ళచేతికి వచ్చేది రెండొందలో రెండు వందల ఏబైయ్యోనండి....!

మునీర్ ఒక గ్యాంగ్‌మన్. అతని పని భికారికొప్ప దగ్గర ఒక వంతెన కట్టుతున్న చోట. కాంక్రీటుకు నీళ్ళు చిమ్మేది అతని డ్యూటిగా ఉంది. నెలకు అతనికి వచ్చే మొత్తం దగ్గరదగ్గరగా మూడొందలు. అయితే అతని దౌలత్తు (దర్పం)? ఎప్పుడూ

చేతిలో గణేశ్ బీడికట్ట ఉంటది. లారీలో తిరుగాట. షర్ట్, ప్యాంటు ధరించి మసీదుకు వచ్చేటప్పుడు అత్తరు రాసుకొని వస్తాడు. 'క్యామియా' అని బిగ్గరగా అందరి చెంత కలుపుగోలుగా మాట్లాడుతుంటాడు. మసీదుకు కొంచెం దూరంలో అతని కొత్తఇల్లు నిర్మాణమౌతుంది. బీబి చెప్పినట్లుగా అతని భార్య వంటి మీద బంగారం నిండియుంది.

తను?

రోజుకు సగటున ఇరవైరూపాయలని అనుకొన్నా నెలకు ఆరువందలు... రోజుకు పన్నెండు గంటల పాటు శ్రమించేది ఉందికదా... బీబి వంటి మీద ఒక కాసు బంగారం తను చేయించలేదు. బ్యాంకులో ఒక పైసా పొదుపు ఖాతాలో పడేయలేదు. అత్తరు, బీడికట్ట, కొత్తబట్టలు ఎంతో దూరం తనకు తన కుటుంబంకు. జనం చెంత మాట్లాడేందుకు సరితూగని ఆర్థిక స్తోమత నుంచి బిడియం.

"ఛి...ఛీ! ఎందుకు ఇలా?"

ట్యూబుకు గాలి నింపి దాన్ని నీళ్ళు నింపిన ఇనుప తట్టలో మునిగించి ఎక్కడ పంక్చర్ అయ్యిందనేదాన్ని కనుగొంటుండగా ఎదురులో ఉండే అంగడికి చెందిన సైదూర షాపు వద్దకు వచ్చి

"సలాం అలేకుం దాదా" అని అతనే ముందు మాట్లాడాడు.

"అలేకుం సలాం" అన్నాడు అలీబాబా. మళ్ళా "ఏంటి సమాచారం... సోడా బుడ్లు పంచేందుకు వెళ్ళలేదా?" అంటూ అతనితో మాటలకు దిగాడు అలీబాబా. సైకిల్ షాపుకు ఎదురులో ఉన్న అంగడిలో సత్యానంద కామత్ గారి సోడా ఫ్యాక్టరి ఉంది. ఇక్కడ తయారైయ్యే సోడాల్ని భికారికొప్పలో ఉండే అన్ని అంగళ్ళకు మోసుకెళ్ళి ఇచ్చి, ఖాళి బాటళ్ళను తెచ్చేడ్యూటి సైదూరలో ఉంటది. ఈ డ్యూటికని అతనికి దొరికేది బాటిల్‌కు రెండు పైసలు.

"సోడాగ్యాసు సిలెండర్ రాలేదు. అది వస్తే పని. లేకపోతే ఉపవాసం" అని చెప్తూ బీడి వెలిగించి పొగను రింగు రింగులుగా వదిలాడు సైదూర.

"ఈ ప్రైవేట్ చాకిరిలోని నుదుటిరాతే ఇలాగుంటది కదా?" అన్నాడు అలీబాబా.

"ఔనౌను! ప్రభుత్వ ఇలాఖాలో ఉండే మునీర్‌ను చూడండి... ఎలా దిల్‌దార్‌గా ఉన్నాడో..."

"ఔనా... అతనికి కూలి పదిరూపాయలు కాదా?"

"ప్రభుత్వం ఇచ్చేది పదే... అయితే ఇతను కమాయించేది?"

"అది వేరేనా?"

"ఉత్తిగనే మొత్తానికి పంప్ కొట్టుతూ కూర్చుంటే అయ్యేది లేదు అణ్ణా...

బయటుండే ప్రపంచం చూడాలి... కొంచెం బ్రిడ్జ్ దాకా వెళ్ళిరా... అక్కడేమి జరుగుతుందో చూసిరా..." అన్నాడు సైదూర.

అంతలోనో సోడా ఫ్యాక్టరి ఎదురు మాలతి సర్వీసు బస్సు వచ్చి నిలబడి పోం పోం అని చప్పుడు చేస్తుండగా "ఓ సిలిండర్ ఆయా" అంటూ సైదూర రోడ్డులోకి గెంతాడు.

అలీబాబా రంధ్రం పడిన చోట సెల్యూషన్ రాసి ఆ రంధ్రం పైన పెట్టేందుకు అందాజుగా కొలత నుంచి రబ్బర్ ముక్క కత్తిరించసాగాడు.

మొదలే పురుగు చేరి కొరుకుతున్న తలలో ఇప్పుడు పులి ప్రవేశించి దాడి చేసింది అన్నట్లుగా అలీబాబా స్థితి ఉంది. సైదూర చెప్పిన మాట నిజం. నా పాటికి నేను అన్నట్లుగా సదా పనిలో మునిగేటోడ్ని నేను కదా! శుక్రవారంలో నమాజు చేసేది తప్పితే వేరే ఏ ఇతర విషయంలో తలదూర్చేందుకు వెళ్ళేటోడ్నికాను నేను. ఊర్లో ఎవరెవరు ఎలాగున్నారు అని ఏనాడూ తల చెడుపుకొంది లేదు. ఈ మునీర్ ఎందుకు ఈ రోజు నన్ను పీడిస్తున్నాడు? సైదూర కూడా నాకు ప్రపంచ జ్ఞానం లేదన్నట్లుగా ఛీడించి వెళ్ళాడు. బ్రిడ్జ్ చెంతకు వెళ్ళి చూసిరా అని వేరే విధంగా చెప్పాడు. చూద్దాం... అక్కడికి వెళ్ళి.

సాయంత్రం నాలుగు గంటలప్పుడు కొడుకు స్కూలు నుంచి వచ్చాడు.

"బేటా" అంటూ పుత్రుడ్ని పిలిచాడు అలీబాబా.

"వచ్చి గల్లాపెట్టె ముందు కూర్చో... ఐదో నెంబరు సైకిల్ మేల్‌కొప్పుకు వెళ్ళింది.... రేపు వస్తది... మిగిలిన సైకిళ్ళు ఇప్పుడు వచ్చేదుంది... నేను ఒక గంటలోపల వస్తాను..." అంటూ అలీబాబా కండువానుంచి చేయి తుడుచుకొని బయటకు వచ్చాడు.

బ్రిడ్జ్ ఉండే దారి పట్టుకొన్నప్పుడు ఇదేంటి ఏదో సాధించాలని బయల్దేరుతున్నోడిలాగ తను మునీర్ చేసే డ్యూటి మూలాన్ని శోధించేందుకు బయల్దేరాను కదా అని ఆశ్చర్యపడ్డాడు. తనకెందుకు వచ్చింది ఈ బుద్ధి అని మళ్ళా ఒకట్రెండు సార్లు తల గోక్కొన్నాడు.

సైదూర ఊరంతా సోడా బాటిళ్ళను మోస్తూ తిరుగుతుంటాడు. రోజుకు అతని సంపాదన ఐదారు రూపాయలు మించదు. నేను పెట్టుబడి పెట్టి పనులు చేస్తున్నాను. చేతినిండా సంపాదన కలగట్లేదు. అయితే మునీర చేతికి బురదచేసుగోకనే పెట్టుబడికూడా పెట్టకనే అది ఎలాగ కొత్త ఇల్లు కట్టించుతున్నాడు? ఇప్పుడు అతని గుట్టు ఏమిటనేది తెల్సుకోవాలని అన్పిస్తుంది. అలాగ భావన చేసుకొనే ఇప్పుడు నేను బయల్దేరానుకదా...

"ఔను... అదంతా తెల్సుకొని చేసేది ఏంటి?"

అతని నడక నిదానమైంది.

మొదట అదేమి గుట్టో తెల్సుకొందాం... తర్వాత ముందు రాబోయే విచారం....

ఊరు నుంచి కొంచెం దూరంకు సాగుతుండగా ఇళ్ళు అంగళ్ళు వెనకబడి పోయి అడవి ప్రారంభమౌతది అన్నప్పుడు పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ వాళ్ళ స్టోరు షెడ్ దాటుకొనిపోతే వంతెన ఎదురౌతది.

అలీబాబా ఆ రోజు సాయంత్రం సూర్యుడికి ఎదురుగా నడవసాగాడు. ఈ దుష్ట కుతూహలం తనలో ఎందుకు జనించింది అని ఒక విధమైనా కసివిసి కలిగినా నడిచాడు.

భికారికొప్పకు కొంచెం దూరంలో అలకావతి నది ఉంది. పెద్దనదిగానే అది గుర్తుంచుకోబడింది. వానాకాలంలో జోరుగా కట్ట అంచువరకూ ప్రవహించే ఈ నది, ఎండాకాలంలో కొంచెం తగ్గి ప్రవహిస్తది. కర్నాటక రాష్ట్రంకు చెందిన ఒక రహదారి (స్టేట్‌హైవే) భికారికొప్ప మూలంగా వెళ్తున్నందున అలకావతి నదిమీద ఒక వంతెన ఉంది. అయితే బ్రిటీషోళ్ళనుంచి నిర్మించబడిన ఈ వంతెన ఇప్పటికే శతవసంతాలు నింపుకొన్నందున దాని స్తంభాలు శిధిలమైనవి. నది ప్రవాహ జోరు నుంచి రెండు ఒడ్డులు కోతకు గురైనవి. ఒక కారూ వంతెన మీద వెళ్తే చాలు గలగల అంటూ వంతెనలోని కమానులు కదులుతుంటవి. ఇలా దుస్థితి ఉన్నందున ఘనతవెత్త సర్కారు ఇక్కడ మరొక కొత్త వంతెన కట్టాలని యోచించింది. పాత వంతెన చెంతే కొత్త వంతెనకని నక్ష (ప్లాను) ఇచ్చారు. పాత అప్రోచ్ మార్గంను కొంచెం నేరుగా చేస్తే ఈ కొత్తవంతెన మీదనుంచి వాహనాలు సులభంగా తిరగగలవని ప్రభుత్వం నిర్ధారించుకొన్న మీద నలభై లక్షల రూపాయల ఎస్టిమేట్ (అంచనా)తో ఈ వంతెన పనులు ఇప్పటికి రెండు సంవత్సరాల క్రితం ఆరంభమైనవి.

ఎనిమిది స్తంభాలు, పదికమానులతో ఉండే భారి నిర్మాణంగా ఇది ఉంది. రాజధానిలో ఉండే పెద్ద గుత్తేదారు ఈ పనిని చేపట్టాడు. మూడు స్తంభాలు లేచి నిలబడలేదు... ఆ గుత్తేదారు దివాళా అయ్యాడు. వేరెక్కడో చేస్తున్న కాంట్రాక్ట్ పనిలో భారీగా నష్టం జరిగినందున అతను భికారికొప్పలోని పని వదిలి పరారైయ్యాడు. ప్రభుత్వం అతని ఆచూకికని శోధన చేసేందుకు బయల్దేరింది. అతను రావొచ్చని ఎదురు చూసింది. ఫలితంలేక మళ్ళా వేరే గుత్తేదార్లకని పత్రికల మూలంగా పిలుపునిచ్చింది. సగం సగంగా పని జరిగింది... రండి రండి అని ప్రభుత్వం ఆహ్వానించినా సెంటిమెంట్ మూలంగా ఎవరూ రాలేదు. విసుగు చెందిన ప్రభుత్వం

చివరికి ఈ పనిని తనకు చెందిన పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ నుంచి చేయించాలనే నిర్ధారం చేసుకొంది. ఇప్పుడు ఈ వంతెన నిర్మాణం పి.డబ్ల్యు.డి. నుంచి సాగిపోతుంది.

ఐదారు స్తంభాలు లేచి నిలబడినవి. మిగిలిన స్తంభాలకు పునాది తవ్వారు. ఈ వైపు కమానులు సిద్ధమైనవి. రెండు వైపులా అప్రోచ్ రోడ్డు పనులు జరిగినవి. ఐదారు లారీలు, వందో రెండొందల మందో కూలీలు, కాంక్రీట్ మిక్సర్లు, ఇంజనీర్లు, సూపర్‌వైజర్లు, వర్క్ఇన్స్‌స్పెక్టర్, గ్యాంగ్ కూలీలు... వీళ్ళతో అలకావతి నది ఒడ్డు అంటే ఒక చిన్న జాతరగానే మనం భావించుకోవచ్చు.

కొత్త వంతెనకు కొంచెం దూరంలో ఒక చాయ్ హోటెల్ ఉంది. అలీబాబా దాని ద్వారం వద్దకు ముట్టలేదు; అంతలో హోటెల్ లోపల నుంచి వాసుదేవనాయర్ బయటకొచ్చి "అరెరె... అలీబాబన్ కదా... రండి... రండి... అపరూపంగా ఈ వైపుకు వచ్చారు కదా" అంటూ స్వాగతించాడు. నాయర్ అలీబాబాకు గిరాకి దారుడు. నాయర్‌కు మూడో నెంబరు సైకిలే కావాలి. ఎందుకంటే ఉన్న సైకిళ్ళలో అదే కొత్తది కదా!

హోటెల్ లోపలికి ప్రవేశించి "ఉత్తిగనే వచ్చా" అన్నాడు అలీబాబా. వేడివేడి చాయ్ చేసి ఒక గ్లాసులో నింపి తెచ్చి ఇచ్చాడు. పనస అప్పడం తింటారా అని అడిగాడు. ఉత్తిగనే వచ్చారాలేక ఎవరినైనా చూసి కల్సేదుందా అని మళ్ళా అన్నాడు.

"సరి.... సరి... వెళ్ళిరండి" అంటూ వేరేగిరాకీల వైపు తిరిగాడు నాయర్.

ఇప్పటిదాకా అలీబాబా ఇక్కడికి వచ్చిందిలేదు. బస్సులో వెళ్తున్నప్పుడు చూసాడు ఆ వంతెన నిర్మాణాన్ని. ఇక్కడింత భారీగా నిర్మాణ పనులు జరుగుతున్నవి అని తెల్సుకొంది ఇప్పుడే కదా! అరకొరగా ముగించబడిన కొన్ని స్తంభాలు కమానుల మీద కొంచెం దూరం వెళ్ళాడతను. అతను వచ్చిందే మునీర్‌ను వెతికేందుకు కదా... అతను ఎక్కడుండొచ్చు అని కొంచెం అక్కడిక్కడ వెతికాడు. పెద్దగా కష్టపడకుండానే మునీర్ కనబడ్డాడు. సగం వరకూ పైకి లేచిన స్తంభం మీద నిలబడి మునీర్ పైపు నుంచి నీళ్ళు తడుపుతున్నాడు స్తంభాన్ని. అతని మణికట్టులో ఉన్న వాచి తళతళగా మెరుస్తుంది. చివాల్నే నీళ్ళను స్తంభం మీద చిమ్ముతూ ఎవరితోనే మాటలలో మునిగాడు అతను.

తను ఏదో ఊపుతో ఇక్కడికి వచ్చాను. అయితే ఇక్కడ నాకు ఏమి తెలుస్తది అని అలీబాబా మూగబోయి నిలబడ్డాడు. పనులు జోరుగా సాగుతున్నవి. యంత్రాలు తిరుగుతున్నవి. కాంక్రీటింగ్ జరుగుతుంది. ఒక చోట ఇనుప చువ్వల్ని పరిచి, వంచి వంతెనలో ఉండే కమానులను నిల్పుతున్నారు. అయితే తనకు అవసరమైయ్యే జవాబు ఇక్కడ ఎలా దొరుకుతది?

అలీబాబా చూస్తూ నిలబడియున్నప్పుడు మునీర్ ఇతడ్ని గమనించాడు. చేతిలో ఉన్న పైపును క్రింద పెట్టి అతను పైకి వచ్చాడు.

"సలాం అలేకుం దాదా" అంటూ అతనే మాట ప్రారంభించాడు.

"అలేకుం సలాం..."

"ఇంతదూరం?"

"ఇప్పుడే వచ్చాను..."

"నిర్మాణ పనుల్ని చూసేందుకా?"

"ఔనౌను... ఇప్పటిదాకా ఈ వైపుకు రాలేదు కదా..."

"అలాగైతే వేరే ఏదైనా ఉద్దేశం ఉందా..." అంటూ మునీర్ ఎంతో దగ్గరకు వచ్చాడు.

"షాపుకు, ఇంటి రిపేరుకు సిమెంట్ కావాలంటే చెప్పు దాదా"

"సిమెంట్?"

"ఔను...! మార్కెట్ రేటుకన్నా బస్తాకు ఇరవై రూపాయలు తగ్గించి ఇవ్వండి...."

ఏదో జాడ దొరికిందికదా అని అలీబాబా చురుకైయ్యాడు.

"నీకు ఎక్కడ దొరుకుతది సిమెంట్..."

"బ్రిడ్జ్ పనులకని రోజుకు వందలకొద్ది బస్తాలు వస్తుంటవి. అందులో నుంచి పదో ఇరవైయ్యో బస్తాల్ని ఇటువైపు పడేయించుకొంటాను..."

"లెక్కకు అందాలికదా ఆ మూట (బస్తా)లన్నీ..."

"సరిసరి... ఇక్కడ ఎవరు అడుగుతారు లెక్కను... ఇక్కడుండే ఒకరిద్దర్ని నా వైపు తిప్పుకొంటే చాలు... మీకు ఇదంతా తెల్వదులే దాదా..." అంటూ చెప్పిన మునీర, ఇటువంటి విషయాలలో అలీబాబా ఏమి తెల్వని అమాయకుడని అనుకొన్నాడు. తన అమాయకత్వాన్నే మరోమారు చూపెట్టూ అలీబాబా అడిగాడు ఇలా: "అలాగైతే నీకు సరైనంత లాభం ఉంటదికదా..."

"దాదా... నీ దగ్గర దాపరికం చేసేదెందుకు?"

"రోజుకు ఇరవై బస్తాలు (మూటలు) నేను అమ్ముతుంటాను. వచ్చే లాభంలో వర్క్ ఇన్స్‌పెక్టర్ రామేగౌడకు, జూనియర్ ఇంజినీరైన ప్రభాకర్‌సారుకూ వాటాలు వెళ్తవిలే... వాళ్ళకు సింహభాగం ఇచ్చినా, నాకూ మిగులుతుంటది చేతినిండానే" అంటూ మునీర మణికట్టులో వాచీని జేబు రుమాలు నుంచి తుడిచాడు. ప్యాంటు సరిజేసుకొన్నాడు. అలీబాబాలోని చింతనకు జవాబు చెపుతున్నోడిలాగ "మరిక... ప్రభుత్వం ఇచ్చే కూలి ఏ మూలకు సరిపోతది దాదా... ఇలాగే ఏదోదాన్ని చేస్తేనే సుఖంగా బతకొచ్చు..." అన్నాడు.

"గుర్తైందిలే... వదిలేయ్ విషయాన్ని" అంటూ అలీబాబా అక్కడ్నుంచి కదిలాడు.

"ఔను దాదా... సిమెంట్ అవసరమైతే చెప్పు... ఇనుప చువ్వలు కావాలంటే రామేగౌడ దగ్గరకు వెళ్తే దొరుకుతది..."

మరొక విషయం తెల్సినందున అలీబాబా రెండు నిమిషాలు ఆగి నిలబడ్డాడు.

"రామేగౌడ ఇల్లు ఎక్కడుంది మునీర?"

"అతనికైతే క్వార్టర్స్ లేదు. సబ్ డివిజన్ ఆఫీసు వెనుక మెటీరియల్స్ యార్డ్‌లో ఉండే షెడ్డే అతనికి ఇల్లుగా ఉంది... అతడిలోని జోరుదారు అంతా నడిచేది అక్కడే..."

"సరి" అంటూ అలీబాబా అక్కడ్నుంచి బయటపడ్డాడు.

❖ ❖ ❖

బయటుండే పరపంచాన్ని చూడమని సైదూర చెప్పిందైతే ఉత్ప్రేక్ష కాదు. ఇక్కడ ఒక వంతెనలోని నిర్మాణ పనులు జరుగుతున్నవనేది గుర్తు; దానితోపాటు మునీర్ గ్యాంగ్‌కూలీ అనేది గుర్తుంది. అయితే ఇప్పుడు చూస్తుంటే, తనకు లోకంలోని గుట్టులు ఏమి తెల్వవు అనేది స్పష్టమౌతుంది.

దీపం వెలిగిస్తున్నప్పుడు అలీబాబా ఇంటికి చేరాడు. పుత్రుడు చక్కగా లెక్కరాసి డబ్బు పొందాడు గిరాకీలనుంచి. ఇంకా రెండు సైకిళ్ళు వచ్చేదుంది.

"నువ్వు ఇక వెళ్ళి చదువుకో మంచిగా" అని కొడుకును పంపి అలీబాబా గల్లాపెట్టె ముందు కూర్చున్నాడు.

ఇకనూ వంతెన వద్దే ఉన్న అనుభవం అలీబాబాలో ఉంది. కాంక్రీటు మిక్సర్లు తిరుగుతున్న చప్పుడు చెవిలో ఉంది. జనం అరుపులు, తిరుగాట... వాటి వెనకే మునీర్‌లోని ధ్వని చెవిలో ఇంకా పడుతున్నట్లుగా ఉంది అలీబాబాకు. ఈ మునీర్ కేవలం గ్యాంగ్‌కూలి మాత్రమేకాదు; రోజుకు ఎనిమిది రూపాయల కూలిపొందే డిపార్ట్‌మెంట్‌కు చెందిన కనిష్ఠ నౌకరు కాదు. ఇలా కచ్చితంగా అంత మాత్రంలోనే ఉంటే ఇతను ఇప్పుడు అంత బలాఢ్యుడిగా ఎలాగౌతాడు? వంతెనకు వాడే సిమెంటును పరులకు అమ్మే దూరంకు అతని చేయి ఎలాగున చాపగలిగాడు? అరె అల్లా, ఇదెంత కరామత్ అయ్యా!

మనస్సుకు ఏదో మంకు పట్టినోడిలాగ అలీబాబా కూర్చున్నాడు. తను ఏదో చెప్పి కబురు పెట్టి రారమ్మన్నట్లుగా సైదూర మెట్లు ఎక్కివచ్చాడు.

"దాదా.... వెళ్ళి చూసి వచ్చావా బ్రిడ్జ్‌ని?

"వెళ్ళివచ్చాను... నువ్వు చెప్పినట్లుగానే.. ఆ ప్రపంచం వేరేదేదోగా ఉంది"

"మునీర్ కల్సాడా?"

"కలిసాడు... సిమెంట్ కావాలా అని అడిగాడు...! ఔను సైదూర... ఈ మునీర్‌కు సర్కారి డిపార్ట్‌మెంట్ అంతటిలో చేయిపెట్టేది ఎలాగ గుర్తో?"

"మీకు విషయం పూర్తిగా తెల్వదు దాదా... చాకచక్యత ఉంటే సర్కారి డిపార్ట్‌మెంట్‌లో ఎవడైనా లూటి చేయగలడు" అంటూ సైదూర మునీరుడి కత మొదలుపెట్టుండగా, చీకటి పడిందని అలీబాబా లేచి దీపంబుడ్డి వెలిగించి మరిక మునీరుడి కథ వింటూ కూర్చున్నాడు.

## 2

భికారికొప్పలోని ప్రైమరి పాఠశాలకు జవానైన సైయద్ కుమారుడు మునీర్ కదా! మొదట్లో తండ్రితో పాటు పాఠశాలకు వెళ్తుండే ఇతను క్రమేణ పాఠశాలలోని శిక్షణ నుంచి తప్పించుకొని బలాదూరుగా తిరుగుతుండగా, అతని తండ్రైన సైయద్ ఇతడ్ని రహిమ్‌ఖాన్‌కు చెందిన కొలిమిలో గాలితిత్తి ఒత్తేందుకు పంపించాడు. అక్కడ్నుంచి మునీర్ భికారికొప్పలో ఉన్న ఏకైక మిలిటరి హోటెల్‌లో మూడు సంవత్సరాలు గ్లాసులు కంచాలు గిన్నెలు కడిగాడు. మళ్ళా మూడు సంవత్సరాలు అదే హోటెల్‌లో సర్వర్‌గా మారి డ్యూటి చేసాడు. అంత పొద్దుకు మునీర్‌కు చిన్నగా మీసం మొలిచింది.

ఆ మిలిటరి హోటెల్‌కు నిత్యం భవ్య భోజనంకని వస్తుండే ఇంజినీర్ కల్లప్పగారి పరిచయం అతనికి అయ్యింది.

కల్లప్ప ఒక రోజు పిలిచి అడిగాడు అతడ్ని!... "ఏంటి... మాంసం కర్రీలో ఒకే తుకడా (ముక్కే) ఉండాలా?" అని ప్రశించాడు.

"ఒక కప్పుకర్రీకి ఒకే ముక్క వేయి అని యజమాని రూల్స్ పెట్టాడు!" అన్నాడు మునీర్.

"నీ యజమాని రూల్స్‌కు నిప్పుపెట్ట" అంటూ కల్లప్ప జేబు నుంచి ఐదు రూపాయల నోటు తీసి గుట్టుగా మునీర్ చేతిలో పెట్టాడు.

"రేపట్నుంచి రెండు పెద్దముక్కల్ని కప్పులో నింపుకొని తీసుకురా" అన్నాడు కల్లప్ప.

మునీర్ హోటెల్ యజమాని పెట్టిన రూల్స్‌ను అతిక్రమించాడు. అప్పుడప్పుడు ఐదు రూపాయల నోటు ఇతనికి దొరికేది ముందుకే కొనసాగిపోతుంది.

మరొక రోజు కల్లప్ప అడిగాడు ఇలా: "వంట చేసేది వస్తదా: నీకు?" అని.

"ఓ బిరియాని, ఫలావ్, చేపల పులుసు, రొయ్యల వేపుడు, ఆలుగడ్డ కూర్మా... అన్నిట్నీ చేస్తాను".

"ఎంత జీతం వస్తది ఇక్కడ?"

"టిఫిన్ కాఫి భోజనం పెట్టి రోజుకు మూడు రూపాయలు ఇస్తారు..."

"నేను టిఫిన్ కాఫి భోజనం పెట్టి ఎనిమిది రూపాయలు ఇస్తాను. రా, నాతో పాటు... డిపార్ట్‌మెంట్‌లో నౌకరి" అన్నాడు కల్లప్ప సార్.

ఇంట్లో విషయం తెల్పి కల్లప్ప వెనుక బయల్దేరాడు. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో గ్యాంగ్‌మెన్‌గా అయ్యాడు. కల్లప్పసార్‌కు వంట సిద్ధం చేసి వడ్డించేది, బీరు బ్రాంది తెచ్చిఇచ్చేది... మరితర పనులు ఉంటుండేవి; జీతం మాత్రం ప్రభుత్వం నుంచి. రెండు సంవత్సరాలు ఇలాగే కొనసాగింది. రుచికరంగా వంట చేసి కల్లప్పసార్‌కు వడ్డించి తనూ కొవ్వు పట్టి బలిసాడు మునీర్. కల్లప్పకు ట్రాన్స్‌ఫరై అతని జాగాకు శ్రీనివాస అయ్యర్ వచ్చారు. వచ్చిన మొదటి రోజే గ్యాంగ్‌మన్ డ్యూటీకి నెట్టాడు అయ్యర్‌సాబ్.

దారిపక్కనుండే పొదల్ని తొలగించేది, దారి మీద ఏర్పడిన గుంతల్ని పూడ్చేది, వానా కాలంలో కూలిపడిన వృక్షాల్ని నరికేది, లేచిపోయిన తారు పరదాను మళ్ళా వేసేది ఇలాగున ఎన్నో పనులు మునీర్ మీద పడినవి. అయ్యర్ సాబ్ వచ్చిన పిదప కొంచెం కష్టమూ ఎదురైంది మునీర్‌కు. ఈ మధ్యలో మునీర్‌కు పెళ్ళైంది. ఒక బిడ్డా జనించింది. కల్లప్పసార్ వద్ద ఉండేటప్పుడు మిగిలిపోయిన అన్నం చారు వేటకూరపులుసు మొదలైనవాట్ని భార్యకని పట్టుకొస్తుండేవాడు. నెల జీతం ఇచ్చే రోజు, కల్లప్పసార్ మునీర్ నుంచి నాల్గైదు స్ట్యాంపులంటించిన రశీదులలో వేలుముద్ర ఒత్తించుకొని జీతంతో పాటు ఇరవై రూపాయల్ని అదనంగా ఇస్తుండేవాడు. జతగా కల్లప్పసార్ నుంచి జరిగే వేరే కొన్ని వ్యవహారాలనుంచీ మునీర్‌కు లాభం వస్తుండేది. కల్లప్పసార్ ట్రాన్స్‌ఫరై వెళ్ళిన పిమ్మట ఈ అనుకూలాలంలకు విఘ్నం ఎదురైంది. వచ్చిన యువ ఇంజినీర్ అయిన ఆ అయ్యర్ సాబ్ పూర్తిగా మడివంతుడు. భయస్థుడు కూడా. మునీర్ మిగిలిన తోటి గ్యాంగ్‌మన్ల ముందు గొణుగుతూ "ఈ ముద్దపప్పు మాత్రమే తినే అయ్యర్‌సాబ్ ఎక్కడ్నుంచి, ఏ అగ్రహారం నుంచి వచ్చి చేరాడు ఇక్కడికి" అంటూ వాపోతుండేవాడు.

ముద్దపప్పు తినే శ్రీనివాస అయ్యర్ భికారికొప్ప ఉప విభాగంలో ఎక్కువరోజులు ఉండలేదు. అలకావతి నది మీద ప్రభుత్వం మరొక కొత్త వంతెన కట్టిస్తది అనేవార్త బయట పడిందేచాలు, భికారికొప్పలోని సబ్‌డివిజన్ ఆఫీసులో భారీ మార్పులు జరిగినవి. ఎక్కడెక్కడినుంచో ఇంజినీర్లు ఇక్కడికి ఎగిరివచ్చి, ఇక్కడున్న పాతకాపుల్ని ట్రాన్స్‌ఫర్ చేయించారు. ఇప్పుడు మునీర్‌కు సాబ్‌గా వచ్చినోడు అమానుల్లా. మళ్ళా మునీర్ ఆ సాబ్ ఇంట్లోకి చేరాడు. బ్రిడ్జ్ పని ఆరంభమైంది. గుత్తేదారు తరుపున

ఉండే కన్‌స్ట్రక్షన్ కంపెనీలోని ఇంజినీర్లు తాగేందుకు తినేందుకు అమానుల్లా ఇంటికి వస్తుంది మునీర్‌లో అదృష్టదశ మళ్ళా తిరిగి వచ్చేందుకు కారణమైంది.

గుత్తేదారుడి కంపెని దివాళై వంతెన నిర్మాణ పనులు ఆగినవి. గవర్నమెంటే తన ఆధ్వర్యంలో ఈ బ్రిడ్జ్ నిర్మాణ పనులను చేపట్టాలనే నిర్ధారం చేసుకోగా, మండ్యలో ఉండే పులిలాంటి ఇంజినీర్ ఒకడు భికారికొప్పకు దూసుకొచ్చి అమానుల్లాను పారదోలాడు వేరెక్కడికో. ప్రభాకర్ చార్జ్ తీసుకొని మునీర్‌ను గ్యాంగ్ బృందంలోకి నెట్టాడు. అయితే మునీర్‌ను వేరొక రీతిలో వాడుకొనేందుకు ప్రభాకర్‌సారు యోచన చేసాడు. ఎందుకంటే గ్యాంగ్‌లో ఉన్నోళ్ళందరిలో చురుకైనోడిగా ధైర్యవంతుడిగా ఉండేటోడు మునీర్ ఒక్కడే అనే విషయాన్ని గ్రహించాడు ప్రభాకర్ సారు.

ఒక రోజున "మునీరా... ఏమి పనులు చేస్తున్నావు?" అంటూ అడిగాడు.

"ప్రస్తుతం కాంక్రీట్ మిక్సర్ యంత్రం వద్ద సార్"

"అక్కడే ఉండు"

ఆ సాయంత్రం ప్రభాకర్ సార్ మునీరను అడిగాడు ఇలా: "ఎవరూ సిమెంట్‌కని వస్తుండేది లేదా?"

"ఈరోజు వరకూ ఎవరూ రాలేదుసార్!"

"ఎవరికైనా సిమెంటు కావాలేమో అడుగు... మిక్సర్‌లో పడేసేటప్పుడు ఐదోపదో సిమెంట్ మూటల్ని బయటనే పెట్టు... తెల్సిందా?"

మునీర్‌కు తెల్సిపోయింది. అతనే గిరాకీల్ని తెచ్చాడు. వాళ్ళకు సిమెంట్ బస్తాల్ని సరఫరా చేసాడు. డబ్బు పొందాడు. పొందిన దాన్లో సింహభాగాన్ని ప్రభాకర్ సార్‌కు ముట్టజెప్పాడు. ఇప్పుడూ ఇదే విధానం ముందుకే కొనసాగుతుంది. ఏవిధమైన చిక్కులు తంటాలు కష్టాలు రానట్లుగా మునీర్‌కార్యాన్ని ముందుకే కొనసాగిస్తున్నాడు. బ్రిడ్జ్ చెంత ఇప్పుడు నీళ్ళుచిమ్మే పని వేరే. అయితే సిమెంటు బస్తాల జవాబ్దారి ఇతనిదే. మసీదు దగ్గర మునీర్ ఇల్లు నిర్మాణమౌతుంది వంతెన జతగా. భార్య వంటి మీద బంగారు ఆభరణాలు నిండినవి. చూసేందుకు మునీర్ పి.డబ్ల్యు.డి.లో గ్యాంగ్‌కూలి. అయితే లోపల "ఇలాగుంది ఇతగాడి కత" అన్నాడు సైదూర.

"ఛిఛీఛీ" అంటూ మరిక షాపు తలుపులు మూసేందుకని లేచాడు అలీబాబా.

ఆరాత్రి భుజించి పడుకొన్నా అలీబాబా తలలో ఇదే విషయం ఉంది. మునీర్ రోజుకు ఇరవై సిమెంట్ బస్తాల్ని అమ్ముతున్నాడట. నెలకు ఎన్ని మూటలు? సంవత్సరంకు ఎన్ని అవుతవి? ఇప్పటిదాకా అతను ఎన్ని బస్తాల్ని అమ్మి ఉండొచ్చు. ఇందునుంచి ఎంత డబ్బు వచ్చి ఉండొచ్చు? ఒక టైరుకు గాలి కొట్టే పదిపైసలు, పంక్చర్ వేస్తే ఒక

రూపాయి నాకు లభిస్తది. ఐదొందల రూపాయల సైకిల్‌ను బాడుగకు ఇస్తే గంటకు ఎనబైపైసలు.

బీబి రెండు సార్లు అడిగింది "ఏంటి నిద్ర రావట్లేదా?" అని

"వస్తుందిలే" అంటూ ఆవులించాడు అలీబాబా.

మరునాడు ఏదో పండగ నిమిత్తం పుత్రుడి స్కూలుకు సెలవుంది. అలీబాబా షాపు తెరిచేందుకు కొంచెం ఆలశ్యం చేసినప్పుడు మటన్‌షాపు యజమానైన షరీఫ్‌సాబ్ షాపు ద్వారం వద్ద కనిపించాడు.

"ఓ... రండి రండి... ఇంత దూరంకు వచ్చారు కదా" అంటూ స్వాగతించాడు అలీబాబా.

"ఈ దారిలో బ్రిడ్జ్‌వైపుకు వెళ్తున్నా... మిమ్మల్ని కల్సి మాట్లాడించి వెళ్దాంలే అని వచ్చాను" అన్నాడు షరీఫ్ సాబ్.

అలీబాబా చాప పరిచాడు. మంచి చాయ్‌చేయమని బీబీకి చెప్పాడు. క్షేమ సమాచారంలోని మాటలు ముగిసిన పిమ్మట అలీబాబానే అడిగాడు "ఏమి సమాచారం... బ్రిడ్జ్ వద్ద"? అని. "ఇల్లు కట్టిస్తున్నాను కదా... కిటికీలకు ఒకిన్ని ఇనపరాడ్లు కావాల్సి ఉంది!" అన్నాడు షరీఫ్.

"బిడ్జ్ దగ్గర దొరుకుతవా?"

"కావాలంటే టన్నులకొద్ది అక్కడ ఇనపరాడ్లు దొరుకుతవి"

బీబి లోపల నుంచి గాజుల సవ్వడి చేసింది.

అలీబాబా లోపలికి వెళ్ళి రెండు కంచు గలాసులలో చాయ్ తెచ్చి ఒకదాన్ని షరీఫ్ ఎదురుంచి మరొకదాన్ని అతను పట్టుకొని కూర్చున్నాడు.

చాయ్ తాగిన పిమ్మట "రండి నాతో పాటు... వెళ్ళి వద్దాం అక్కడికి" అన్నాడు షరీఫ్.

"ఈ రోజు పుత్రుడు ఉన్నాడులే షాపు చూసుకొనేందుకు... వెళ్దాం నడవండి" అంటూ అలీబాబా చెప్పులు తొడుక్కొని బయల్దేరాడు.

బ్రిడ్జ్‌కి కుడివైపు డిపార్ట్‌మెంట్ వారి సైట్ ఆఫీసు ఉంది. అక్కడ యంత్రాలు, లారీలు నిలబడుతవి. కుప్పగా పడేసిన ఇనుపరాడ్లు, రేకుల షెడ్డులో సిమెంట్, షెడ్డు ముందు కుప్పగా పోసిన ఇసుక కంకర ఉంది. వీట్ని బ్రిడ్జ్ చెంతకు మోసుకెళ్తున్న కూలీలు, వాళ్ళ తిరుగాట, అరుపులు, కోలాహలంగా ఆ సైట్ అంతా గజిబిజిగా ఉంది. వీటి మధ్య వర్క్ ఇన్స్‌స్పెక్టర్ రామేగౌడ తూకం వేసే మిషన్ వద్ద నిలబడి ఇనపరాడ్లను తూకం చేసి పంపుతున్నాడు. పెనవేసుకొన్న బారు రాడ్లను కూలీలు

ఎత్తి తెచ్చి కాటా మిషన్ మీద పెట్టున్నారు. రామేగౌడ వాట్ని తూకం చేసి పుస్తకంలో రాసుకొని కూలీలతో వాట్ని మోసుకెళ్ళండి అని చెపుతున్నాడు. మళ్ళా వేరే కూలీలు రాడ్లను ఎత్తి తెస్తున్నారు తూకం కని. అలీబాబా షరీఫ్ వెనకే వెళ్ళి రామేగౌడకు కొంచెం దూరంలో నిలబడ్డాడు.

"ఏంటి సాయబ్బు... ఏంటి విషయం?" అంటూ రామేగౌడ దర్పం చూపెట్టూ మాట్లాడాడు.

"మీ వద్దకు వచ్చేదెందుకో మీకు తెల్సుకదా" అన్నాడు షరీఫ్.

"ఔనా... ఎంత సరుకు కావాలి?"

"ఏడు కిటికీలకు సరిపోయేంతగా"

"అలాగా" అంటూ ఒక కుప్పలోని రాడ్లు మొత్తం ఖాళీ అయ్యే వరకూ రామేగౌడ కాటామిషిన్ వద్ద నుంచి కదలలేదు. తర్వాత వీళ్ళ వైపుకు తిరిగాడు.

"రండి" అంటూ వీళ్ళను మరొకషెడ్డు వద్దకు తోలుకెళ్ళాడు. లోపల ఒక ట్రెండు కుర్చీలు అడ్డ బెంచి ఉన్నవి.

"ఈ రాత్రి మీ ఇంటికి పంపితే అవుతది కదా" అన్నాడు రామేగౌడ.

"అలాగే పంపండి సార్... డబ్బులు"

"నూట ఏభైరూపాయలు ఇవ్వండి"

"ఎక్కువ కదండి... నూరు రూపాయలు తీసుకోండి"

"అలా కుదరదు షరీఫ్... నేను నాపైన ఉన్నోళ్ళకు లెక్కతో ఇవ్వాలి... పట్నంలో కొంటే మీకు మూడు వందల రూపాయలు అవుతది... నేను సగం మొత్తాన్నే అడిగాను"

షరీఫ్‌సాబ్ చొక్కాలో ఎడంవైపు ఉన్న జేబునుంచి డబ్బులు లెక్కబెట్టి ఇచ్చాడు. రామేగౌడ ఆ డబ్బును ప్యాంటు జేబులో కుక్కుకొన్నాడు.

"ఈ రాత్రి సరకు మీ ఇంటికి వచ్చి చేరుతది... మీరిక నిశ్చింతగా వెళ్ళండి" అన్నాడు. అలా అంటూనే "మీరెవరికైనా సరుకు కావాలంటే ఇక్కడికి చెప్పి తోలండి" అంటూ మాట చేర్చాడు.

"ఇనపరాడ్లు ఎక్కడదొరుకుతవో గుర్తైందా మీకు?" అని షరీఫ్ అలీబాబా వైపు తిరిగి పలికాడు అలా.

"గుర్తైందిలే... రాత్రివేళ వాట్ని పంపుతాడా అతను?"

"అతనే నికార్సుగా పంపుతాడు... అందులో మోసం ఉండదు... నాకు మాత్రమే కాదు, భికారికొప్పలో ఎవరెవరికి ఇనుపరాడ్లు అవసరమైతే రామేగౌడే సరపరా చేస్తాడు..." అన్నాడు షరీఫ్.

"మంచి సంపాదనే ఇది కదా"

"చూసారు కదా... రెండు నిమిషాలలోనే నూట ఏభై రూపాయలు. ఇందులో నూరు రూపాయలు పైన ఉన్నోళ్ళకు వెళ్ళినా ఏభైరూపాయలు మిగులుతదిలే రామేగౌడకు" అన్నాడు షరీఫ్.

దారి తొక్కుతూ షరీఫ్‌సాబ్ చెప్పిన ఈ దొంగదందా మీద విచారించసాగాడు అలీబాబా.

❖ ❖ ❖

రామేగౌడ క్రితంలో మాలతినది నీటి అన్వేషణా విభాగంలో, నదిలో ప్రవహించే నీళ్ళలెక్కను లెక్కిస్తుండేవాడు. పేరుకు హోదాకు వర్క్ఇన్స్‌స్పెక్టర్ అయ్యున్నా చేసే పనిమాత్రం ఉదయంలో ఒకసారి, మధ్యాహ్నంలో ఒకసారి, సాయంత్రంలో ఒకసారి మాలతినది ఒడ్డుకు వెళ్ళి పారుతున్న నదిలోని నీటి మట్టాన్ని నమూదించేదిగా ఉంది. నెలకు నాలుగు వందల ఏభై రూపాయల జీతం కదా అతనికి. అస్తుబిస్తుగా కచితమైన నెల జీతం. ఇటువంటి పరిస్థితిలో వనవాసం ఉపవాసం చేసుకొని జీవిస్తుండే వాడు రామేగౌడ పై సంపాదన లేనందున.

ఇప్పటికి మూడు సంవత్సరాల క్రితం ఇతని ఊరుకు చెందిన ఒకరు ఎం.ఎల్.ఎ.గా అయ్యాడు. రాగిగుడ్డె పరమేశ్వరయ్య ఎం.ఎల్.ఎ.గా అయ్యి రాజధానికి వెళ్ళారు. ఏదో మహిమ అన్నట్లుగా సులభంగానే మంత్రి అయ్యాడు. పరమేశ్వరయ్య మంత్రై స్వగ్రామంకు వచ్చిన మొదటి రోజే, మల్లెపూల దండ పట్టుకొని వెళ్ళినోళ్ళలో రామేగౌడ కూడా ఒకడిగా ఉన్నాడు.

"తమ్ముడూ... ఏదైనా వ్యక్తిగత పని అవ్వాలంటే చెప్పు... చేసిపెట్తా" అన్నాడు పరమేశ్వరయ్య.

"అలాగే అణ్ణా" అని తలూపాడు రామేగౌడ. ఇంటికి చేరుకోగానే అతని తలలో (మెదడులో) ఉన్న మిషన్‌స్టార్టైంది. ఈ నీటి కొలతల అన్వేషణా విభాగంలో పైసంపాదన లేదని కచితమైంది. ఏదైనా వర్కింగ్ జరిగే డివిజన్‌లో పడితే ఎంతో కొంత దోచుకోవచ్చని యోచించాడు. మాలతి నదిలోని అన్వేషణా విభాగం తన స్వస్థలంకు ఎంతో దూరాన ఉంది. గ్రామంలో వృద్ధ తల్లిదండ్రుల్ని చూసుకొనేందుకు ఎవరూ లేరు. తనను తన ఊరికి దగ్గరుండే ఏదో ఒక ప్రాజెక్ట్ విభాగంలో ట్రాన్స్‌ఫర్ చేయండి అని రాసిన ఒక వినతిపత్రం పట్టుకొని రామేగౌడ రాజధానికి పరుగుపెట్టాడు. మంత్రిగార్ని కలిసాడు.

"ఇలాగంటే ఎలా తమ్మి... స్పష్టంగా ఏదో ఒక ప్రాజెక్ట్ పేరు చెప్పు" అని పరమేశ్వరయ్యే నేరుగా అడిగాడు.

మళ్ళా “భికారికొప్పలో బ్రహ్మాండగా పని జరుగుతుంది... అక్కడికి వెళ్ళు” అంటూ మంత్రిగారే సూచించి తెల్పి ముఖ్య ఇంజినీరుకు ఫోన్ చేసాడు. నీటికొలతల అన్వేషణావిభాగంలోని డ్యూటీని కాలుతో తన్ని భికారికొప్పకు వచ్చాడు రామేగౌడ. గుత్తేదారు కంపెనినుంచి పని జరుగుతున్నా ఇతనికి పైసంపాదన కొరత లేదు. కంపెనీ వాళ్ళే వారంకు ఇంత అని డబ్బు ఇస్తుండేవారు. కంపెని దివాళై వెళ్ళిపోయిన తర్వాత ఇతని దారి మరింతగా సుగమం అయ్యింది. ఇప్పుడు రామేగౌడను నిలువరించేవాళ్ళే లేరు. బ్రిడ్జ్ నిర్మాణంకు అవసరపడే ఇనుము అంతా ఇచ్చే డ్యూటి ఇతనిది. సరిగా తూకం వేసి పుస్తకంలో రాసుకొని ఇస్తాడు. ఇనుపరాడ్లు లారీలో లోడు అవుతున్నప్పుడు రెండు నాలుగు ఆరు ఎనిమిది అంటూ రాడ్లు క్రింద పడుతుండేవి. అవి భికారికొప్ప జనంకూ మరియు బయటుండే ఊళ్ళ జనంకూ సరఫరా అవుతుండేవి.

రాత్రి అవుతుంటే రామేగౌడ తాగి తూలుతుండేవాడు. సిగిరేట్ తాగుతూ మాయాబజార్‌కు వెళ్తుంటాడు. అక్కడ ఎవతో ఒకామె ఇతనికని వేచియుంటది. చేపకనుల మీనలోచనో లేకపోతే బంగారు వర్ణంతో ఉండే కాంచనమాలో ఉంటది సంగమకేళికని.

“ఎంత కావాలో చెప్పు” అంటూ వాళ్ళెదురు ఒకరూపాయ కట్ట విసురుతాడు రామేగౌడ. అతని బాగోతం విన్న అలీబాబా “యా అల్లా” అంటూ నిట్టూర్చాడు. షరీఫ్ సాబ్ సలాం చెప్పి వెళ్ళిపోయాడు. అలీబాబా ఇంటికి చేరి అరుగు మీద కూర్చున్నాడు.

“ధీం” అంటూ తల బాధ పెట్టుంది గమనించాడు. మునుపెన్నడూ అతనికి ఇలాకాలేదు. ఎప్పుడూ సైకిల్‌షాపులో ఏదో ఒక పని అలుముకొని ఉంటుండే తన తలలోపల వేరే విషయం దూరిందేలేదు. ఉత్తిగనే తిరిగేది, కూర్చుని యోచన చేసింది తక్కువే. ఔను, యోచన చేసేందుకు తనలో ఏముంది? అల్లా దయనుంచి ఉన్నదాన్లోనే తృప్తి చెందేటోడ్ని నేను. సైకిళ్ళ నుంచి వచ్చే బాడుగ దిననిత్యం ఉండే ఖర్చును సరిజేస్తుంది. సంవత్సరంకు ఒకసారి నగరంలో ఉండే సైకిల్ మార్ట్ నుంచి కొత్త సైకిల్‌ను తెస్తుంటాను. దాని ఋణం ఐదారు నెలలోనే తీరిపోతుంటది. ఋణ సదుపాయం కలిగించిన ఆ మార్ట్ ఓనర్ ఏనాడూ డబ్బు కని పీడించింది లేదు. ఇంట్లో బీబి నుంచి బాధలేదు, ఉన్న ఒక కొడుకూ చక్కగా చదువుకొంటున్నాడు. విధేయుడిగానూ ఉన్నాడు. మరేంటి దిగులు? తలనొప్పి ఎందుకు? ఇంతకాలంకు ఇప్పుడే కదా తల ‘ధిం’ అంటూ బాధిస్తుంది.

‘ధిం’ అని బాధిస్తుంది సరే; నిన్నట్నుంచి చూస్తున్నాను కదా వంతెనకట్టే నెపంలో ఏమేమి జరుగుతుందని. మొదట కేవలం గ్యాంగ్ కూలి ఒకడు ఎలా

తనకన్నా ఎక్కువ సుఖంగా ఉన్నాడు అని ఆరంభమైన ఈ విచారం ఎక్కడెక్కడికో వెళ్ళి ముట్టింది కదా... సోడా అంగడిలో పని చేస్తుండే సైదూర... మీకేమి తెల్వదు అని రేగించినందున తను మరింత లోతుకు వెళ్ళేందుకు కారణమైందికదా! ఏదో గోప్యంగా ఉంది, అదేంటో తెల్సుకోవాలని ప్రయత్నించింది, క్రమేణ వంతెన కట్టే పనిలో దాగిన మరొక పార్శ్వం (ముఖం) కనులలో పడింది కదా... అక్కడ సిమెంట్ అమ్ముకొనే మునీర్, ఇనపరాడ్లను అమ్మే రామేగౌడ... అక్కడ వాళ్ళు ఇద్దరేకాదు... ఇంజినీర్ ఉన్నాడు ఆ దుష్కృతంలో. ఇంకా ఎంతో గుంపు ఉన్నట్లుంది... వాళ్ళంతా ఏమేమి అమ్మేస్తున్నారో? ఏమేమి చేస్తున్నారో? యా అల్లా... అంటూ అలీ బాబా కొంచెం ధ్వని పెంచి పలుకుతున్నప్పుడు బీబి బయటకొచ్చింది.

"ఏంటి షాపు మరిచి ఇక్కడే కూలబడ్డారు కదా" అంది.

"లేదు.. లేదులే... బయల్దేరుతున్నా" అంటూ అతను, ఛీ షాపు తెరిచేది మరిచి పోయి కూర్చున్నాను కదా అని బాధ పడ్డాడు.

❖ ❖ ❖

నాయన వచ్చినందున కొడుకు లేచాడు. మేల్‌కొప్పకు వెళ్ళిన ఇదో నంబరు సైకిల్ స్తంభంకు ఒరిగి నిలబడి ఉంది. దాని వెనుక చక్రంలోని టైరు నేలకు అతుక్కొని ఉంది.

"బేటా ఏమైంది టైరుకు?"

"పంక్చర్ అయినట్లుంది నాయన... దీని మీద బోరేగౌడ వక్కబస్తాల్ని పెట్టుకొని వచ్చాడు"

"ఓ... ఇప్పటికే ఎనిమిది చోట్ల పంక్చర్లను వేసియున్నాను... మరిక నిలుస్తదో లేదో" అంటూ అలీబాబా పానర్, కత్తెర పట్టుకొని నిలబడ్డాడు. ఇక ఒకట్రెండు గంటలు పని చేసేదుంది.

కొడుకు ఇంటిలోపలికి వెళ్ళాడు. అలీబాబా ట్యూబుకు గాలికొట్టూ, బాడుగ వివరాలు రాసుకొంటూ ఏదో పని చేసుకొంటుండగా షాపు ముందు ఎవరో వచ్చి నిలిచాడు.

"నమస్తే దాదా... సైకిల్ ఉందా?"

తలెత్తి చూసాడు. పరిచయం ఉన్న ముఖమే. అయితే ఎన్నడూ సైకిల్‌కని వచ్చినోడు కాదు. అప్పుడప్పుడు తన షాపు ముందు నుంచి నడిచి వెళ్తుండే వ్యక్తి అతను.

"సైకిల్ లేదు కదా అణ్ణా" అన్నాడు అలీబాబా. సైకిల్ నిజంగాలేదు. అన్నీ బయటకు వెళ్ళినవి. ఒకటి రిపేరులో ఉంది.

"రా.. అణ్ణా... కూర్చో... ఏదో ఒకటి వచ్చేదుంది... చూద్దాం" అన్నాడు అలీబాబా. క్రింద నిలబడి నోడు లోపలికి వచ్చి అడ్డ బెంచి మీద కూర్చుని బీడి వెలిగించాడు.

"ఎక్కడుంటావు"

"ఇదే ఊరులో... ఇంజినీర్ ప్రభాకర్ సాబ్ వద్ద కుక్‌గా ఉన్నాను నేను" అంటూ అతను స్టైలుగా రింగు రింగులుగా పొగవదిలాడు.

అలీబాబా చెవులు రిక్కించినవి.

"బ్రిడ్జ్ పనులు చేయిస్తుంటారు కదా వారు?" అని అడిగాడు అలీబాబా.

"ఔను.. వారేనండి!"

"వారు ఇక్కడ కాపురం పెట్టలేదా?"

"వారి పిల్లలంతా చదివేది ఇంగ్లిపీసులోనే... ఇక్కడ ఎక్కడుంది ఇంగ్లిపీసు పాఠశాల... వారికేమి తక్కువ... అక్కడొక కాపురం ఇక్కడొక కాపురం... ఎనిమిది రోజుల కొకసారి పిల్లల చెంతకు వెళ్ళివస్తారు..."

"ఖర్చు ఎంతో ఉండదా?"

"బాగానే అడిగావు అణ్ణా... డబ్బు దాచేందుకు వారికి జాగానే లేదు. ఇక ఖర్చు గురించి యోచన చేస్తారా వారు..."

అలీబాబా చేస్తున్న రిపేరు పని వదిలి కూర్చున్నాడు. "అంత గొప్పగా సంపాదన ఉందా?"

"మా సార్ విషయం నేను చెప్పకూడదు... అయితే భికారికొప్పకు అంతా తెల్సిన విషయమే ఇది... ఈ ఇంజినీర్ల బృందంకు సిమెంట్, ఇనుము అమ్ముతుండే డబ్బు నుంచి సింహభాగం పాలు వస్తది... బ్రిడ్జ్‌కని ఇసుక, కంకర తెచ్చి పడేసే కాంట్రాక్టుదారులు ఐదు లోడులు తెచ్చిపడేసి పదిలోడ్లుగా బిల్ చేయించుకొని ఈ బృందంకు గొప్పగా డబ్బు ఇస్తారు... మళ్ళా... ఇదిగో ఇటు చూడండి" అంటూ అతను (వంటోడు) తన కాళ్ళు చేతులలో ఉన్న బొటనవేళ్ళను చూపించాడు. ఇంక్‌ప్యాడు నుంచి ఆ బొటన వేళ్ళ మీద నేరేడు వర్ణం ఏర్పడి ఉంది.

"ఏంటణ్ణా ఆ వర్ణం?"

"ఆ వర్ణం ఏమిటింటే..."

"కూలి పనుల కని నియమించుకొనేది పదిమందినే... హాజరు పుస్తకంలో చూపించేది ముప్పై మందిని. పనులకు రాని జనం పేరు ముందు మేము చేతులు కాళ్ళకున్న కుడి ఎడమల బొటన వేళ్ళను ఒత్తేది... మాకు పదో పరకో జాస్తిగా దొరుకుతది... సార్లకైతే వేలలో లాభం..."

ఏదో నల్ల గండు చీమ ఒకటి కుట్టినట్లై అలీబాబా తక్షణమే చేయివేసి చీమకని వెతికాడు.

"నాకు ఇదంతా తెల్వదు కదా అణ్ణా" అన్నాడు అలీబాబా.

"అయ్యో... మళ్ళా పురాణం మరొకటి ఉంది" అంటూ కుక్ మెడచాపి బయటకు చూసాడు. "సైకిళ్ళు రాలేదు కదా.. అర్జెంట్‌గా కావాలి అణ్ణా" అన్నాడు.

అతను అర్జెంట్ అని అంటుండగా మట్కా ఏజెంట్ అయిన బాబాజాన్ సైకిల్ పై నుంచి దిగాడు.

"ఈ రోజు ఎంత నంబరు తగిలింది అణ్ణా?" అడిగాడు కుక్.

"ఎనిమిది ఆరు"

"మా సార్ ఆరు ఎనిమిది కాంబినేషన్ మీద రెండొందలు కట్టారు... మొత్తం పోయింది కదా!" అంటూ అతను బాబా జాన్ నుంచి సైకిలి పొంది తీసుకెళ్ళాడు. అలీబాబా లేచి పుస్తకం చూసాడు. "ఎనిమిది అణాలు ఇవ్వు బాబాజాన్" అని అన్నాడు.

"పాత బాకి ఉంది కదా రెండు రూపాయలు... అదీ తీసుకో... మిగిలింది మీ వద్దే ఉండనీ" అంటూ బాబా జాన్ ఐదు రూపాయల నోటును ఇచ్చాడు.

"ఏంటి నీకూ ఏదైనా లక్కి నెంబరు తగిలిందా ఈ రోజు?"

"ఔను దాదా... ఈ రోజు నాకు కమిషన్ నలభైరూపాయలు వచ్చింది... మేముగా ఆడేది లేదు... ఈ రోజు జూదం బాగా జరిగి... నా కమిషన్ అంతగా వచ్చింది..."

బాబాజాన్ సైకిల్‌షాపు ముందు నించొని ఖరీదైన విల్స్ సిగరేట్ వెలిగించాడు. కాలర్ వెనక నాజూకుగా మడిచి ఉంచుకొన్న కరవస్త్రం (జేబు రుమాలు) తీసి ముఖం తుడుచుకొన్నాడు. మళ్ళా కరవస్త్రాన్ని మెడ మీదకే చేర్చుకొన్నాడు.

"ఈ బ్రిడ్జ్ పనులు జరిగేంతవరకూ నా దంధాకు డౌటు లేదు దాదా... అక్కడ కూలీలు మాత్రమేకాదు స్టాఫ్ మొత్తం మట్కా ఆడుతారు" అంటూ ఏదోదాన్ని జ్ఞాపకం చేసుకొన్నోడిలాగ షాపు నుంచి బయటకు వెళ్ళిపోయాడు.

మరిక అలీబాబా లేచి నిలబడి పైన దాబెట్టిన గాలిపంపును చేతిలోకి తీసుకొన్నాడు.

❖ ❖ ❖

మధ్యాహ్నం మూడు గంటలైందేమో... బయట ఎండ తీక్షణంగా ఉంది. ఒకే ఒక సైకిల్ బయటుంది. పనేమిలేదు. అలీబాబా ఉత్తిగనే చేతులు ముడుచుకొని

కూర్చున్నాడు. అప్పుడు ఇద్దరు పోలీసులు నేరుగా షాపుకు వచ్చారు. కొంచెం గాబిరి అయ్యింది అలీబాబాకు.

"ఈ సైకిల్ షాపు మీదేనా?" అంటూ ఒక పోలీసు నిలబెట్టిన సైకిల్ వెనుక మడ్ గార్డ్ మీద రాసియున్న పేరును వంగి చూస్తూ పలికాడు.

"ఔను... ఎందుకు?"

"మూడో నంబరు సైకిల్ తీసుకొని వెళ్ళినోడు ఎవరు?"

"ఏదో దుశ్చర్య జరిగిందనేది కచితమై, అలీబాబా పుస్తకాన్ని తెరిచాడు.

"లంబాణి ధాక్యా"

"సరి, సరి... మీ సైకిల్‌ను సీజ్ చేసాం"

"అలా చేయకండి సార్... ఉందే ఆరు సైకిళ్ళు"

పోలీసులిద్దరూ నిలబడి యున్నారు.

"స్టేషన్‌కు వచ్చి ధఫేదారుకు చెప్పండి... లేకపోతే సైకిలు కోర్టుకు వెళ్తది" అంటూ వాళ్ళిద్దరు షాపు నుంచి వెనుదిరిగారు.

అలీబాబా తలకు టోపి అదుముకొన్నాడు. గడ్డం దువ్వుకొన్నాడు. పైజమాకు అంటుకొన్న దుమ్ము దులుపుకొన్నాడు. బీబి అంటూ ఇంటివైపుకు తిరిగికేక పెట్టాడు.

భార్య బయటకొచ్చింది.

"మూడో నంబరు సైకిల్ స్టేషన్‌కు వెళ్ళిందట" అన్నాడు బాధగా

"ఎందుకు?"

"దాన్ని లంబాణి ధాక్యా తీసుకెళ్ళాడు.. కాపు సారా తెస్తూ పట్టుబడ్డాడని... కనబడుతుంది"

"ఛీఛీ" అంటూ ఆమె దుఃఖపడింది.

"స్టేషన్‌కు వెళ్ళివస్తా"

ఆమె తలూపింది. ఏదైనా పని మీదో లేకపోతే శుక్రవారం నమాజుకో అలీబాబా వెళ్ళినపుడు షాపు చూసుకొనేది బీబినేకదా! ఆమెకు చదివేది రాసేది తెల్వదు. ఆమె ఉన్నప్పుడు సైకిల్ తీసుకెళ్ళేందుకు ఇచ్చేందుకు వచ్చేటోళ్ళు తమకు తామే పుస్తకంలోని వేళాపట్టికలో టైము రాస్తుండేవారు. లేకపోతే పుస్తకం చూసి టైమ్ లెక్కజేసి డబ్బు ఇచ్చి వెళ్తుండేవారు. మోసం వంచన ఎవరూ చేసేది లేదని ఆ ఆలుమగలకు గుర్తే! ఎవరు కూడా వంచన చేసేది లేదు. అలీబాబా అంటే భికారి కొప్పలో ఉండే జనంకు గౌరవభావం ఉంటుండేది. బీబి షాపు–ఇల్లు మధ్య నుండే స్తంభంకు ఒరిగి నించోగా అలీబాబా స్టేషన్ ఉండే దారి వైపుకు తిరిగాడు.

ధాక్యా గాడి విషయం వారికి తెల్సు. ఎన్నోసార్లు ధాక్యాకు సైకిల్ ఇచ్చేందుకు నిరాకరించాడు అలీబాబా. "నువ్వు దొంగసారా తెచ్చేది, పోలీసుల వలలో చిక్కిపడేది... వీటి నుంచి సైకిల్ ఇచ్చేది లేదు" అని అంటుండే వాడు అలీబాబా. అయితే ఈ రోజు ధాక్యావచ్చి తన చిన్న పిల్లకు ఆరోగ్యం సరిగా లేదు... తాండానుంచి పాపను ఆస్పత్రికి తీసుకెళ్ళాలి అని కత అల్లాడు. కావొచ్చేమో అని సైకిల్ ఇచ్చిందే తప్పు అయ్యింది. ఇప్పుడు స్టేషన్ చుట్టూ తిరిగేది ఉందికదా అనుకొన్నాడు అలీబాబా.

అలీబాబా స్టేషన్ లోపలికి వెళ్ళాడు. ధపేదారైన ఫకీరప్ప పళ్ళలో ఇరుక్కొన్న ఏదో దాన్ని బయటకు తీస్తూ కూర్చున్నాడు. అతను అలీబాబాకు పరిచితుడే. ఈ వృద్ధుడి మీద అతనికి ఒక రీతిలో పూజ్యభావన ఉంది. అలీబాబా సరళజీవి. దైవభక్తుడు, కష్టజీవి. లేనిపోని గొడవలకు వెళ్ళేదిలేదు. మోసం గీసం లేదు అతనినుంచి.

"రండి దాదా రండి" అన్నాడు ధపేదారైన ఫకీరప్ప.

"మా సైకిల్" అంటూ అలీబాబా తగ్గు స్వరం నుంచి ఏదో దాన్ని తనే తప్పు చేసినోడిలాగ పలికాడు.

"మీరు అటువంటోడికి ఎందుకు ఇస్తారు? మేము దొంగమాలు సమేతంగా సైకిల్‌ను కోర్టుకు ప్రొడ్యూస్ చేస్తే మరిక మీరు కోర్టుచుట్టూ తిరిగేది ఉంటదికదా" అన్నాడు ఫకీరప్ప.

"ఆ లుచ్చాగాడు మా వాళ్ళను చూసి పారిపోయాడు... మీరు మీ సైకిల్‌ను తీసుకొని వెళ్ళండి" అంటూ దయ చూపించాడు ఫకీరప్పసారు.

అలీబాబా చేతులు జోడించి నమస్కారం చేసి "వెళ్ళివస్తాను సార్" అంటూ బయటకొచ్చి స్టేషన్ ముందు నిలబెట్టిన మూడో నంబరు సైకిల్‌ను నెట్టుకొంటూ వెళ్తున్నాడు. కొంచెందూరంకు సాగినప్పుడు మల్లందూరు గ్రామంకు చెందిన బుడేన్‌సాబ్ అనిరీక్షితంగా ఎదురుపడ్డాడు. సలాం అయిన మీద అలీబాబా అడిగాడు "ఎప్పుడు వచ్చారు ఇక్కడికి?" అని.

"ఇప్పుడే వచ్చాను... పి.డబ్ల్యు.డి ఆఫీసులో కొంచెం పని బడిఉంది"

"ఔనా... ఇంట్లో బీబి బచ్చే (భార్యా బిడ్డ) క్షేమంగా ఉన్నారా?"

"క్షేమంగానే ఉన్నారు.... మీ దగ్గర?"

"చక్కగానే ఉన్నారు... ఇంటికి వెళ్దారండి"

"లేదు... ఇప్పుడు శివమొగ్గ (షిమోగా)కు వెళ్ళేదుంది"

"అలాగైతే చాయ్ తాగి వెళ్దురుగాని... రండి"

“బద్రియా హోటెల్‌లో చాయ్ తీసుకురమ్మని చెప్పి అలీబాబా బుడేన్‌సాబ్ వైపుకు తిరిగాడు.

“ఏమి పనిమీద వచ్చారు?”

“చెఱువులో పూడిక తీయించండి అని ఒక అర్జీ పెట్టాను నెలక్రితం... ఏమైందో నా అర్జి స్థితి చూద్దాం అని వచ్చాను.”

“అర్జి ఇస్తే పని జరుగుతదా?”

“జరుగుతది... అయితే పలు మార్లు వచ్చి, విన్నపం చేసుకొని వెళ్ళాలి. గవర్నమెంట్ ఆఫీసు అది. పని జరగాలంటే ముందు అర్జి పెట్టుకోవాలి... ఈ విధంగా నేను ఎన్నో పనుల్ని చేయించుకొన్నాను గ్రామ అభ్యుదయంకని.

“ఔనా!”

బుడేన్‌సాబ్ మాటవిన్న తక్షణమే అలీబాబాకు గుర్తుకొచ్చింది తన మెదడును కొరుకుతున్న విషయం మీద. ఇప్పటి వరకూ రెండు మూడు రోజుల నుంచి తను ఏవేవో అన్నిట్ని చూసాను. అవన్నీ దుష్కృత్యాలుగా అన్పిస్తున్నవి. వీటిమీద ఏదైనా చేయాలనే ఒత్తిడి అతని మెదడులో అధికమౌతుంది. అయితే చేయబోయేది ఏంటని స్పష్టంగావట్లేదు. ఇప్పుడు బుడేన్‌సాబ్ అర్జీ ప్రస్తావన, మరి దాని ప్రభావం గురించి చెప్పినప్పుడు ఏదో వెలుగు ఉదయించినట్లై “ఔనా... అర్జి మహత్మ్యం అలా ఉంటదా?” అని అడిగాడు అలీబాబా.

“ఔను... ప్రభుత్వం నుంచి పని అవుతది అని అనుకొంటే అర్జి రాసేదే మంచిది... ప్రభుత్వం ఉండేది ఎందుకు?” అన్నారు బుడేన్‌సాబ్.

“ప్రభుత్వం నుంచి పనులు సరిగా వేగవంతంగా జరిగేది లేదు కదా?” అన్నాడు అలీబాబా.

“అరెరే, ఓటు వేసే మనకు సర్కారు సరిగా పని చేస్తుందో లేదో అనేదాన్ని తెల్సుకొనేందుకు మనకు అధికార జ్ఞానం లేదా? తెల్సుకొనే అధికార విచక్షణా జ్ఞానం మాత్రమే కాదు, ప్రభుత్వం సక్రమంగా పనులు చేసేటట్లుగా చూసుకొనేది కూడా మననుంచే జరగాలి!” అన్నారు బుడేన్‌సాబ్.

“అలాగున అంటున్నారా...”

“మరి...? ప్రభుత్వం ఖర్చు పెట్టే డబ్బు ఎవరిది? మనదేకాదా? ఆ డబ్బు వృథా కాకూడదు. లూటిగా కాకూడదు అని అనుకొంటే, మనం మరిక ప్రభుత్వం చేస్తున్న పనులను నిశితంగా గమనించేది ఉంటది...”

అలీబాబా మూగబోయి బుడేన్‌సాబ్ చెపుతున్న మాటల్ని వింటూ కూర్చున్నాడు. బుడేన్‌సాబ్ ఈ సీమలో పాత తరంవారు. వారు పూర్వంలో బ్రిటీషోళ్ళ విరుద్ధంగా

స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచుకొని జైలుకు వెళ్ళారు. సార్వజనిక కార్యకలాపాలలో ఎప్పుడూ ముందు వరుసలో ఉండే ఘనవ్యక్తి. వారి మాట, చేస్తున్న పని అంటే అలీబాబాకు ఎల్లప్పుడూ మెచ్చుగే ఉండేది. బుడేన్ సాబ్ గారు మాటను కొనసాగించారు.

"మా ఊర్లో నిర్మించిన నీళ్ళ ట్యాంక్ పనిని మొదట్లో అస్తవ్యస్తంగా చేసారు... సిమెంట్ మూటల్ని బయటకు పంపి అమ్ముకొన్నారు. నేను అర్జిపెట్టి పై అధికార్లకు తెలియజేసాను. మరిక పని చక్కగా జరిగింది. నేను గనుక అర్జి పెట్టకనే ఉండుంటే మా నీళ్ళ ట్యాంక్ నాలుగు సంవత్సరాలలోనే కూలిపోయేది..."

"ఈ విషయం (అర్జి ఘనత) నాకు తెల్వదు కదా" అని అలీబాబా పలికాడు. "ఇక్కడకూడా అస్తవ్యస్తంగా ఒక పని జరుగుతుందికదా... నేనిప్పుడు దాన్ని గమనిస్తున్నా. బ్రిడ్జ్ పని కచితంగా తృప్తికరంగా జరగట్లేదు" అని అలీబాబా తనలోతనే చెప్పుకొన్నాడు.

బుడేన్‌సాబ్ గారి మాట ముందుకే సాగిపోతుంది ఇలా: "మళ్ళా... మల్లందూరు– కోణందూరు నడుమ ఉండే రోడ్డు రిపేరు సరిగా జరగలేదు. బాధ్యత ఉన్న అధికార్లకు అర్జీపెట్టి రెండోసారి పనిచేయించాను. భాంచోద్‌గాళ్ళు ప్రజల డబ్బు మొత్తాన్ని కబళిస్తున్నారు... జనం హుషారైతే బెదురుతారు."

చాయ్ తాగి బుడేన్‌సాబ్‌కు వీడ్కోలుపలికి అలీబాబా షాపుకు వచ్చాడు. ధాక్యాపేరు ముందు సున్నా చుట్టి కుర్చీ మీద కూర్చున్నాడు. బుడేన్‌సాబ్ గారి మాట చెవిలో మార్మోగుతుంది.

సాయంత్రం గడిచి రాత్రివేళ భోజనం ముగించి పాన్పు మీద పడుకోగా అవే (బుడేన్‌సాబ్ గారి) మాటలు చెవిలో మార్మోగుతుంది.

బ్రిడ్జ్ పని సరిగా జరగట్లేదు అనేదైతే కచితం. సిమెంటు ఇనుము పరుల పాలు అవుతుంది. ప్రభుత్వంకు మోసం అవుతుంది. ఈ విషయాన్ని ఇక్కడుండే ఇంజినీర్‌సార్ గమనంకు ఎందుకు తీసుకెళ్ళకూడదు? తను ఇప్పటి వరకూ తెల్సుకొన్న సమస్త విషయాన్ని అర్జీలో రాయించుకొని ఎందుకు వారికి సమర్పించకూడదు? ఈ అర్జి అపవాదం, అసత్యంకాదు. జరుగుతున్న అక్రమంకు సాక్షినేనే. షరీఫ్‌సాబ్ ఉన్నాడు. కుక్ కూడా ఉన్నాడు. మరి ఇంకేమి సాక్ష్యాలు కావాలి. బుడేన్‌సాబ్ గారు చెప్పినట్లుగా సార్వజనికులు హుషారై ఉంటే సర్కారి నౌకర్లు బెదురుతారు. మరిక ఒక అర్జి రాయించుకొనేదే సై... అలాగైతే ఏమని రాయించుకోవాలి?

బీబీ నిదానంగా గురక పెట్టుంది. కొడుకు నుంచి వస్తున్న కలవరింతలు ఆగినవి. "యా అల్లా" అంటూ దిండుకు తల వాల్చిన తక్షణమే క్రితంలో నిద్ర

వస్తుండేది. మూడు నాలుగు రోజుల నుంచి ఇప్పుడు నిద్ర దూరమైంది. బీబి పదేపదే అడుగుతుంది “నిద్ర పట్టలేదా?” “ఏంటి ఏదో ఆలోచనలో మునిగారు?” అని.

హోహో అని ఆవులిస్తున్నాడు అలీబాబ. కంటిరెప్పలు భారమై తూలుతున్నవి. నిద్రవచ్చిందని పక్కకు మరలి చేతుల్ని భారంగా చాపుకొన్నాడు. అయితే నిద్ర రావట్లేదు. అలీబాబాకు సుఖనిద్రపట్టినప్పుడు అర్ధరాత్రి గడిచి వెళ్ళి పోయింది.

❖ ❖ ❖

సైకిల్ షాపు తెరిచి గణపయ్య గారి పుస్తకాల షాపుకు నడిచి వెళ్ళాడు. “గణపయ్య మహారాజ్... దో ఖాళి పేపర్ దేవో (రెండు ఖాళీ పేపర్లు ఇవ్వండి)” అని అడిగి రెండు ఖాళి తెల్లకాగితాల్ని కొని తెచ్చాడు.

స్కూలుకు ఇంకా సమయం ఉన్నందున పుత్రుడు ప్రాంగణంలో బొంగరం ఆట ఆడుతున్నాడు.

“బేటా... నీ కలాన్ని పట్టుకొని రా ఇటు”

“ఏదో రాసేదుందని ఊహించిన పుత్రుడు పెద్ద అద్దుడు పుస్తకం కలం పట్టుకొని వచ్చాడు. తెల్లకాగితాన్ని కొంచెం అంచు వదిలి బారుగా మడిచి కొడుకు చేతికి ఇచ్చాడు.

“ఒక అర్జి రాయి బేటా... అక్షరాలు గుండ్రంగా ఉండాలి... వ్యాకరణ తప్పులు ఉండకూడదు... నిదానంగా రాయి” అన్నాడు అలీబాబా.

పుత్రుడు కాగితాన్ని కలాన్ని సరిగా పట్టుకొని రాసేందుకు తండ్రి ముఖం చూసాడు.

శివమొగ్గ జిల్లాలోని భికారికొప్ప నివాసిని, లేట్ శిరాజుద్దీన్ గారి ఏకైక పుత్రుడ్ని మరియు సైకిల్ షాపుకు యజమానినైన నేను (అలీబాబా) భికారికొప్ప సబ్ డివిజన్‌లో ఉండే అసిస్టెంట్ ఇంజినీర్ గారి దివ్య సన్నిధికి రాయించి ఇస్తున్న అర్జి ఏమిటంటే,

స్వామి... ప్రభుత్వం ప్రజల ప్రయోజనార్థంకని అలకావతి నది మీద ముప్పై లక్షల రొక్కంతో ఒక బృహత్తర సేతువును కట్టిస్తుంది. సరైన యోజనగానే ఉన్నా...

మరిక పుత్రుడికి చెప్పబోయే మాటను మరిచి కూర్చున్నాడు. మునీర్, రామేగౌడ, ప్రభాకర్ మీద తను ఆపాదన మోపి అర్జి రాయించుకొంటున్నాను అనేది మనస్సులో మెరిసిన తక్షణమే ముందు చెప్పబోయే పదాలు మెరవక నాలుక తడారిపోయింది. వీళ్ళంతా దండిగా డబ్బు గడిస్తున్నారని కడుపు మంట నుంచి ఇలా రాయిస్తున్నానా? తనలోని అక్కసు ఆరంభమైందే అలాగున... అయితే ఇప్పుడు

వాళ్ళ మీద కడుపుమంట, అక్కసు తనలో లేదు. ప్రభుత్వంకు ఇక్కడ ద్రోహ మౌతుందనేదే ఇప్పుడు ప్రస్ఫుటంగా కనబడుతుంది. తన మనస్సులోని స్వస్థత చెడింది కూడా ఈ కారణంకే! భికారికొప్పలో అడ్డదారులు పట్టి శ్రీమంతులుగా మారినోళ్ళు ఎంతోమంది ఉన్నారు. భట్కళ పీర్‌జాదా ఇంపోర్టెడ్ వాచీలను దొంగ బంగార బిస్కట్లను అమ్మి శ్రీమంతుడిగా మారాడు. రామకృష్ణయ్య మట్కా జూదం నుంచి షావుకారు అయ్యాడు. గురుబసయ్య దొంగమాలు రవాణా చేసి పెద్దోడిగా అయ్యాడు. మరింకా ఎంతో మంది ఉన్నారు. వారి గురించి ఎన్నడూ తల చెడుపుకొన్నోడ్ని కాను. వాళ్ళు శ్రీమంతులైయ్యారని నేను కృశించినోడ్నికాను. అయితే ఇప్పుడున్న ఈ ప్రహసనం అలా కాదు. ఇక్కడ లూటి అవుతుంది ప్రభుత్వంకు చెందిన మాలు. వంతెనకని వాడబడే సిమెంటు ఇనుము ఇలా బయటకు వెళ్ళిపోతే, మరిక కట్టబడుతున్న ఈ వంతెన ఎక్కువ రోజులు స్థిరంగా ఉండేదిలేదు. ఇదే తనలోని చింత. మళ్ళా ప్రభుత్వ పని అనే వంకతో మోసం వంచన జరగకూడదు. ఇది రాష్ట్రంలోని మహాజనతకే కాదు, దేవుడికీ అయ్యే వంచన. ఈ దుష్టపని ఆగిపోవాలి.

"రాస్కో బేటా" అన్నాడు అలీబాబా.

వంతెన నిర్మాణ పనికని ఘనతవెత్త ప్రభుత్వం సరఫరా చేసిన సిమెంటు, ఇనుము బయట అమ్మబడుతుంది, కూలీల నియామకంలో అవుతున్న వంచన, ఇసుక కంకర సప్లైలో అవుతున్న దగుల్బాజి తనం అన్నిట్నీ వివరంగా రాయించాడు. అయితే బాధ్యులైనోళ్ళ ఎవరి పేర్లనూ ఉదహరించలేదు. పేర్లు వద్దనుకొన్నాడు. ఏమేమి అక్రమం జరుగుతుంది అనేదాన్ని రాస్తే చాలు అని విచారం చేసాడు. చివరగా మీ విధేయుడు అని రాయించి దానికింద దస్కత్తు చేసాడు.

"ఇస్కూలుకు పొద్దైంది వెళ్ళు ఇక" అంటూ అర్జీని తన చేతిలోకి తీసుకొన్నాడు.

❖ ❖ ❖

భికారికొప్పకు బయట అన్నట్లుగా ఉండే మసీదు, జూనియర్ కళాశాల, ఎలక్ట్రిక్ ఆఫీసు మొదలైన వాట్ని దాటి వెళ్తే పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ కఛేరి వస్తది. బీబీని షాపులో కూర్చోమని చెప్పి అలీబాబా కఛేరికి చేరుకొన్నప్పుడు పదకొండు గంటలైంది. కొంతమంది గుత్తేదార్లు, నౌకర్లు, వాహనచాలకులు బయట తిరుగుతున్నారు. సార్ గది ఎదురు మురికిబట్టతో ఉన్న జవాను ఒకడు నిలబడి యున్నాడు. వాళ్ళ మధ్య అలీబాబా కొంచెం దూరంలో ఉన్నాడు. ఏదైనా గుత్తపనికో, పీస్‌వర్క్ పట్టేందుకో వచ్చారా అని ఒకరిద్దరు అడిగారు.

"అలాగేమికాదు.. అలాగేమికాదు" అంటూ అలీబాబా సారు ఉండే గది... తలుపు చెంత కొచ్చాడు. ప్యూన్ అలీబాబాను అపాదమస్తకంగా పైకి కిందకు దిట్టించి

చూసాడు. అలీబాబా పరిచయం అతనికి ఉంది. దూరంగా ఎప్పుడో చూసాడంతే! ఇప్పుడు ఇతను ఎందుకు వచ్చి ఉండొచ్చు? కాంట్రాక్ట్ గింట్ర్యాక్ట్ ఏమిలేదట... మరిక?

"సార్‌ను కలవాలి!"

"ఏంటి పని?"

"ఒక అర్జీ ఇచ్చేదుంది"

"మేనేజర్ చేతికి ఇచ్చి వెళ్ళు"

"లేదు, నేనే ఖుద్దుగా సార్‌ను కల్సే ఇచ్చేదుంది"

"ఇక్కడే నిలబడు"

అలీబాబా నిలబడ్డాడు. జనం సారు గదిలోకి వెళ్తున్నారు వస్తున్నారు. ఫైళ్ళు, పేపర్లు, కొలతల పుస్తకాలు, బిల్లులు లోపలికి వెళ్తున్నవి బయటకు వస్తున్నవి. అలీబాబా వంతు రాలేదు. ప్యూన్ బీడి తాగుతూ లోపలికి వెళ్ళివచ్చిన గుత్తేదారు ఇచ్చిన రెండు నోట్లను జేబులో పెట్టుకొని నిలబడండి నిలబడండి అని అలీబాబాకు చెపుతూనే ఉన్నాడు. అలీబాబా అలాగే ఓపికగా నిలబడి ఉన్నప్పుడు గుత్తేదారైన అహమద్ బ్యారి అక్కడ కన్పించాడు.

"అరె దాదా, మీరు ఇక్కడ... ఏంటి సమాచారం?" అంటూ అలీబాబా భుజంమీద చేయి వేసి బయటకు తోలుకొచ్చాడు. కొంచెం దూరంలో మామిడి వృక్షం క్రింద రాతి బల్లలు కూర్చునేందుకు అనుకూలంగా ఉన్నందున అలీబాబా, బ్యారి అక్కడకు వెళ్ళి నీడలో కూర్చున్నారు.

"సార్‌ను కలవాలని వచ్చా...?"

"ఆ ప్యూన్ మహాశయుడు లోపలికి వదిలేది లేదు. మీరు డబ్బు ఇచ్చే ఆసామి కాదని అతనికి గుర్తైందిలే. ఔను, మీరు సారును కల్సేది ఎందుకు?" అన్నాడు అహమద్ బ్యారి.

అలీబాబా తను అర్జీ ఇచ్చేందుకని వచ్చాననే విషయం చెప్పలేదు. అయితే అర్జీలో ఉన్న విషయాన్ని సార్‌కు చెప్పేందుకు వచ్చానని అన్నాడు. వంతెన వద్ద జరిగేదంతా సార్‌కు తెల్వదా అని ప్రశ్నించాడు.

అహమద్ బ్యారి గొల్లున నవ్వాడు.

"దాదా ఏమి ప్రయోజనం జరగదు" అన్నాడు.

"ఎందుకు?"

"ఇతను కూడా పెద్ద గజదొంగే దాదా..." అంటూ బ్యారి అలీబాబాకు మరింత చేరువుగా వచ్చాడు.

"రండి ఇటు" అంటూ అలీబాబాను తన వెనక నడిపించాడు. కచేరి కట్టడం వెనక పెద్ద సిమెంట్ గోదాం ఉంది. ఒక చోట లారి నుంచి దింపుతున్న సిమెంటు మూటలు, మరొక చోట లారీకి నింపుతున్న మూటల్నీ చూపించాడు.

"ఈ భికారికొప్ప ఉపవిభాగంలో ఈ బ్రిడ్జ్ నిర్మాణపని మాత్రమే కాదు... నాలుగు ప్రభుత్వ భవనాలు, ఒక ఆస్పత్రి, రెండు దేవస్థానాల పునర్ ఉద్ధరణ, మూడు చెఱువుల పనులు జరుగుతున్నవి. వేలకొద్ది సిమెంట్ మూటలు వస్తుంటవి. ఈ పెద్దసారు మరొక గుమాస్తా చేతులు కల్పి ఏమి చేస్తున్నారో గుర్తా? ఇలారండి" అంటూ అలీబాబాను బ్యారి గోదాం వెనుకకు తీసుకు వెళ్ళాడు. వంగి తొంగి చూసారు. ఏడెనిమిది కూలీలు, నిండియున్న సిమెంటు మూటల నుంచి కొంత ప్రమాణంలో సిమెంటును బయటకు తీసి ఖాళిగోతాలలో నింపుతున్నారు.

ప్రభుత్వం పంపే సరైన తూకంతో ఉండే రెండు బస్తాలను వీళ్ళు మూడు బస్తాలుగా మార్చుతున్నారు. ఆ మూడో బస్తా వీళ్ళకు చెందుతది; బ్లాక్ మార్కెట్‌లో అమ్మేందుకని. దీనితోపాటు గోదాంలో మరిక ఏమేమి కార్యకలాపాలు జరుగుతవో అందునుంచి ఒక భాగం ఈ సారుకు లభిస్తది. అలాగే ఈ పెద్దసారుకు వేరే దందా కూడా ఉంది. నాకు పీస్ వర్క్ వచ్చేదుంటే, ఇతనికి ముందస్తుగానే పర్శంటేజ్ ఇవ్వాలి. నాకు స్టీలు, సిమెంట్ కావాలంటే ఇతనికి డబ్బు ముట్టజెప్పాలి. బిల్లుపాస్ అవ్వాలంటే డబ్బు కురిపించాలి. కొలతలు తీసుకొనేందుకు డబ్బు చెల్లించాలి. జరగని పని జరిగిందని చెప్పి బిల్లు చేయించుకొనేందుకూ ఇతని మార్గదర్శనం నుంచే డబ్బు ధారపోయాలి...

"అలాగైతే... అలాగైతే"

'ఇక్కడ జరుగుతున్న అక్రమాలన్నీ సారు చెంత చెప్తే ప్రయోజనం లేదు దాదా''

"మరి"

"దాదా... ఈ ఉసాబరి మీకు వద్దు... మీరు నేరుగా ఇంటికే వెళ్ళండి" అని భుజం తట్టుతూ చెప్పాడు అహమద్ బ్యారి.

ఔను అని అన్పించి అలీబాబా వెనుదిరిగాడు. వెళ్ళిన దారినుంచే నడిచివచ్చాడు.

"ఎంత పొద్దు గడిపారో మీరు... నేను వంటకూడా చేయలేదు" అంది బీబి.

## 3

రాసిన అర్జీ గూడులో ఉంది. అయితే అలీబాబాలో ఒక విధమైన క్షోభ ఉంది. ఛీ! ఎటువంటి నిష్క్రియపని జరిగింది. ఒక పని చేయాలని బయల్దేరిన తను

పిరికోడిలాగ భయపడి వెనుకంజె వేసాను కదా! ఇప్పుడు ఈ అసిస్టెంట్ ఇంజినీరునూ చేర్చి మళ్ళా కొత్తగా అర్జి రాయించి ఇస్తే ఎలాగుంటదో? అయితే రాసిన అర్జీని ఇచ్చేది ఎవరికి? ఒక దినం అలాగే గడిచింది. నాలుగో నంబరు సైకిలు రిపేరుకు వచ్చింది. దాన్ని రిపేరు చేసేందుకు కూడా మనసు కలగట్లేదు. రిపేరు చేద్దాం అని కూర్చుంటే సిమెంటు గోదాంలోని ఆ దృశ్యం కళ్ళెదురుకు వస్తుంది. ప్రభుత్వం పంపిన సిమెంటు బస్తాల రెండిటినుంచి మూడు ఖాళి బస్తాలలో నింపుతున్న దృశ్యం... చిచిఛీ అంటూ తలగోక్కొని లేచాడు. యా అల్లా... ఇదంతా ఎందుకు నడుస్తుంది. ఇక్కడ అని భీతిల్లాడు. ఇదంతా బయట ఉండే జనం ఎవరికీ తెల్వదు. తెల్సినా ఒకట్రెండు విషయాలు మాత్రమే గుర్తుంటవి. అయితే ఇక్కడ మునీర్ చేస్తుండేది, రామేగౌడ నుంచి సరుకు దాటవేత, ప్రభాకర్ సారులోని భ్రష్టాచారం, అహమద్ బ్యారి తేటతెల్లంగా చెప్పింది... ఎంతమందికి తెలుసు? వీట్ని సార్వజనికు లందరికీ తెలియపరచాలి... తర్వాత ముందు రాబోయే పరిణామాన్ని ఎదుర్కొనేది... ఒక విధమైన ఆవేశం వచ్చింది అలీబాబాకు. జనం ఏమని భావిస్తున్నారు? బ్రిడ్జ్ కట్టుతున్నారు, ఆస్పత్రిని నిర్మిస్తున్నారు, పాఠశాల భవనాల్ని కట్టుతున్నారు, చెఱువుల్ని మరామత్తు చేస్తున్నారు అనే వాట్ని జనం చెప్పుకొంటున్నారు. అయితే లోలోపల ఏమేమి జరుగుతుందనేది సార్వజనికులకు ఎలా తెల్సేదుంది? తన ఉదాహరణే ఉంది కదా... మునీర్ విషయంకు వెళ్ళే దాకా తనకేమి తెల్వలేదు కదా! అక్కడికి వెళ్ళాను... చూసాను. మళ్ళా మళ్ళా మరింత లోతుకు వెళ్ళాను. ఇప్పుడు మొత్తం అంతా తెల్సిందికదా... ఇలాగే మిగిలినోళ్ళకూ తెల్వాలి. అంటే... హాం! దినపత్రికలో వేయించాలి వార్తగా... పేపర్‌లో రాయించాలి ఈ దుష్కృత్యాన్ని.

వెలుగు సోకకముందే ధడబడ లేచాడు అలీబాబా.

“బీబి”

“ఏంటి?”

“ఈ రోజు షాపు బంద్... నేను నగరంకు వెళ్ళివస్తాను”

“టైర్లు ట్యూబులు తెచ్చేందుకా?”

“కాదు, వేరేపని ఉంది... సాయంత్రం నాలుగులోపు వస్తాను ఇంటికి”

స్నానం చేసి ట్రంక్‌పెట్టె నుంచి పైజమా షర్ట్ తీసి కట్టుకొన్నాడు. కొత్తటోపి పెట్టుకొన్నాడు. ఆ అర్జి పత్రాన్ని జేబులో భద్రంగా పడేసుకొని బయల్దేరాడు. ఏదో ఊపు ఉత్సాహం. బీబి ఆశ్చర్యంగా చూస్తుంది. ఏమైంది వీరికి ఈ ఎనిమిది రోజులనుంచి? ఎప్పుడూ ఏదో యోచన... ఏదో చింత. క్రితంలో నమాజుకని షాపు వదిలి వెళ్తుండే వీరు ఇప్పుడు ఉన్న పళంగా తక్షణమే లేచి వెళ్తున్నారు నగరంలోకి. పుత్రుడి చేతి నుంచి ఏదేదో రాయించుకొంటున్నారు. ఏమైంది వీరికి? అనుకొంటూ

ఆమె నిలబడి చూస్తుండగానే అలీబాబా బస్టాండ్ వైపు మలుపు తిరిగింది చూడసాగింది. మరిక ఆమె ఇంట్లోకి వెళ్ళి పోయింది. ఒక దినం షాపు బంద్దైతే ముప్పైరూపాయలు నష్టం. గిరాకీదార్లకూ కష్టమే. అదేంటి నగరంలో అంత ఘనకార్యం వీరికి అని అనుకొంటూ వాకిలు వేసుకొంది.

'త్రిశూలం' అనేది నగరంలో ఉండే ఏడెనిమిది దినపత్రికలలో ఒకటిగా ఉంది. దీని సంపాదకుడు గుండాశాస్త్రి. ముప్పై సంవత్సరాల ఉరకలు వేసే యువరక్తం వాడు. అలీబాబా గారి పరిచయం అతనికి ఉంది. ఇప్పటికి మూడు సంవత్సరాల క్రితం అలీబాబా గారి సైకిల్ ఒకటి దొంగిలించబడింది. సంతరోజు అలీబాబా ఇంట్లో తిండి తిని బయటకు వచ్చేలోపే బయట నిలబెట్టిన సైకిల్ ఒకటి మాయమైంది. ఎవరైనా గిరాకిదారుడు తీసుకొని వెళ్ళియుండొచ్చని రెండు రోజులు అలీబాబా ఎదురు చూసాడు. సైకిల్ తిరిగి వచ్చింది లేదు. పోలీసులకు కంప్లైంట్ ఇచ్చాడు. శ్రేయోభిలాషి ఒకడు పేపర్‌లో వార్త వేయించు అని చెప్పాడు. టైర్లు ట్యూబులు కొనాలని నగరంకు వెళ్ళి, అలాగే 'త్రిశూలం' ఆఫీసుకు వెళ్ళి సంపాదక మహోదయుడ్ని కలిసాడు.

"పేపర్‌లో వేస్తానులే" అనిన గుండాశాస్త్రి "పది రూపాయలు అవుతది" అని అన్నాడు. మళ్ళా 'మీరు సీనియర్ సిటిజన్ కదా... ఐదు రూపాయలు మాత్రమే ఇవ్వండి చాలు" అన్నాడు.

పేపర్‌లో ప్రకటించితే సైకిలు దొరకొచ్చని అలీబాబా ఐదురూపాయలు సమర్పించుకొన్నాడు.

మూడో రోజు "ఇలాహి అని మడ్ గార్డు మీద రాయబడిన నాలుగో నంబరుతో ఉండే బాడుగ సైకిల్ దొంగలించబడింది. ఎవరైనా ఆ సైకిల్‌ను చూస్తే తెల్పండి దిగువ ఉన్న అడ్రసుకు" అనే వార్త 'త్రిశూలం' పత్రికలో అచ్చు అయినప్పుడు అలీబాబా పదిసార్లు చదివాడు. ఒక ట్రెండు రోజుల తర్వాత ఒక అద్భుతం జరిగింది. నగరంలోని హైస్కూల్ విద్యార్థి ఒకడు అలీబాబాకు ఉత్తరం రాసాడు: "మా స్కూలులో మీ సైకిలు ఉంది" అని. అలీబాబా పడుతూ లేస్తూ లగుబగనే అక్కడికి చేరుకొన్నాడు. సైకిల్ అక్కడుంది. ఎవడో షాపునుంచి సైకిల్ దొంగిలించి తీసుకెళ్ళినోడు హైస్కూలు చెంత వదిలేసి ముందుకే ప్రయాణాన్ని సాగించాడు. అలీబాబా తనకు పత్రం రాసిన పోరడికి కృతజ్ఞతాపూరకంగా రెండు రూపాయలు ఇచ్చి గుండాశాస్త్రికి కాఫి తాపించి సైకిల్‌ను బస్సుమీద వేసుకొని స్వస్థలంకు చేరాడు.

ఈ సైకిల్ ఘటననుంచి అలీబాబాకు గుండాశాస్త్రిగారి పరిచయ భాగ్యం అయ్యింది. అలాగే పత్రికలోని ప్రభావం ఎంతగాఢంగా ఉంటదనేది అప్పుడు తెల్సి వచ్చింది.

❖ ❖ ❖

'త్రిశూలం' పేపరు ఆఫీసులో, విరిగిన కుర్చీ మీద కూర్చుని అలీబాబా సమస్త విషయాన్ని చెప్పాడు. కుతూహలం ఆసక్తి నుంచి గుండాశాస్త్రి విషయాన్నంతా రాసుకొన్నాడు. పలువురు పేర్లనూ రాసుకొన్నాడు. మిగిలిన విషయాల్ని చేర్చుకొన్నాడు. గుండాశాస్త్రి మంచి చాయ్ తెప్పించి తాపించాడు అలీబాబాకు.

"ఈ దేశంకు మీలాంటి వ్యక్తులుకావాలి" అంటూ అలీబాబాను పొగిడాడు.

"మనం ఇప్పుడు భ్రష్టాచారం జతగా రాజీ పడుతున్నాము. కాదు, దాన్నుంచి మనం లాభం చేసుకొంటున్నాము. అయితే ఎంత మంది భ్రష్టాచారంకు విరుద్ధంగా పోరాటంకని నిలబడుతున్నారో చెప్పండి. చూసిన దాన్ని నిర్భీతి నుంచి మీలాగ ఎంత జనం వచ్చి చెపుతారు? మొత్తం దేశంకు మీరు ఉపకారం చేస్తున్నారు... దేశంలో ఉన్న భ్రష్టాచారాన్ని అణగదొక్కే దాన్లో మీరు ముందు కొస్తుంది ఈ భరతదేశం చేసుకొన్న పుణ్యం అండి..."

అలీబాబా అతని పలుకుల నుంచి ఉబ్బిపోయాడు. ఏదో ఒక విచిత్ర భావనకు లోబడి తను ఈ పనికి చేయినిల్పాను తప్పితే ఇటువంటి ఉదాత్త అద్భుత ఉద్దేశం తన నుంచి నెరవేరుతదనే కల్పన అతనిలో లేదు. ఇప్పుడు గుండాశాస్త్రి మాట విన్న పిమ్మట భలే భలేగా అన్పించింది.

"ఏదో... ఈ అనాచారం నుంచి దేశంకు మంచిది అయ్యేదే లేదని అన్పిస్తుంది. మీరు పేపర్‌లో వేయండి" అన్నాడు శాస్త్రి పొగడ్త నుంచి ఉబ్బిపోయి.

"కచితం... ఈ భ్రష్టాచారం నుంచి దేశం సుభద్రంగా ఉండేదిలేదు... ఈ మాదర్ చోద్‌లు దేశాన్ని మునిగించి పడేస్తారు... నేను మూడు రోజులపాటు వేస్తాను... మొత్తం ఆ డిపార్ట్‌మెంట్ వణికిపోవాలి... ఆ నా ఇంజినీరు కొడుకులంతా ఉచ్చ పోసుకోవాలి... ఇదిగో ఇక్కడ సంతకం పెట్టండి... మీకేమి కష్టం ఎదురైయ్యేది లేదు... ఇలా... మా రికార్డ్‌కని" అంటూ శాస్త్రి తను రాసిన కాగితాన్ని ముందుకు జరిపాడు. అలీబాబా సంతకం పెట్టాడు భయపడకనే తొణకకనే.

❖ ❖ ❖

అలీబాబా గ్రామంకు తిరిగి వచ్చాడు సాయంత్రం నాలుగు గంటలన్నప్పుడు. షాపు తెరిచేది ఎందుకులే అని ఇంట్లోనే ఉన్నాడు. బీబి చాయ్ చేసి తెచ్చి ఇస్తూ "ఎందుకు వెళ్ళారు నగరంకు?" అని అడిగింది.

ఊపు మీదున్న అలీబాబా ఇలాగ ఇలాగ అని సమస్తాన్ని వర్ణించాడు. "ఇదంతా మనకు కావాలా" అంది ఆమె అరకొరగా అర్థం చేసుకొని.

"ఊరుకోవే... మహిళవు నువ్వు... నీకు ఇదంతా తెల్సేది లేదు. ఇప్పుడు సర్కారు ఎవరిది? ఓటువేసే ప్రజలది కదా...! ప్రజలు జాగృతమైతే గవర్నమెంట్ సరిగా ఉంటది".

బీబి భర్త ముఖం చూస్తూ అంది ఇలా: "ఈ రోజు షాపు బంద్ చేసినందుకు నష్టం అంటూ అయ్యింది కదా..."

"అయితే కానీ... ఒక రోజేకదా...!"

మరునాడు షాపు తెరిచి రంగనాథ సర్వీసు బస్సు వచ్చే సమయం చూసి అలీబాబా బస్టాండుకు వెళ్ళాడు. బీడి అంగడి వెంకటేశ్ పేపర్ బండిల్ విప్పుతుండగా 'త్రిశూలం' పేపర్ మూడు నాలుగు రోజులు ఈ వార్తను ప్రకటించలేదు. ఐదో రోజు ఒక ప్రకటన పెద్ద అక్షరాలతో చౌకాకారంగా ఉన్న ఒక బాక్స్‌లో "నిరీక్షించండి... పబ్లిక్‌వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లోని ఉపవిభాగంలో భ్రష్టాచారం. సిమెంటు, ఇనుముకు చెందిన గోలుమాలు... గోదాంలో జరుగుతుంది ఏంటి? వివరంగా వార్తకని మీ ప్రతులను ముందస్తుగా బుక్ చేసుకోండి."

అలీబాబా పేపర్‌కొని తెచ్చి బీబీకి చదివిచెప్పాడు. షాపు కొచ్చిన గిరాకీదారులకూ చూపించాడు. ఈ వార్త వెనుక తను ఉన్నదాన్ని నోరు విప్పి చెప్పలేదు. అయినా ఈ విషయాన్ని చదివి చదివి చెపుతుండేటప్పుడు అతను రోమాంచితుడుగా అవ్వలేదు.

ఒక రోజు, రెండు రోజులు, మూడు రోజులు... వార్త రిపోర్ట్‌గా రాలేదు. రేపు ఎల్లుండి అని ఎదురు చూడసాగాడు. ఈ రోజు కచితంగా వస్తదని బస్టాండుకు చేరుకొనేవాడు. వార్త ప్రకటించపడుతది. జనం చదువుతారు. ప్రభుత్వం మేల్కొంటది. విచారణ జరుగుతది. దోషులకు శిక్ష పడుతది. ట్రాన్స్‌ఫర్లు జరుగుతవి. మరిక డిపార్ట్‌మెంట్ బాగుపడుతది. సర్కారి నౌకర్లు భయపడి నిష్ఠ, ప్రామాణికత్వం నుంచి డ్యూటి చేస్తారు. బ్రిడ్జ్ నిర్మాణ పనులు నాణ్యంగా జరుగుతది.... అనే వాటినంతా అలీబాబా ఊహించుకోసాగాడు. అయితే వార్త ప్రకటించబడలేదు. నగరంలో జరిగే రాఘవేంద్రస్వామి ఆరాధన, మఠాధిపతి లింగైక్యమైయ్యారు, ఒక తరుణిమీద నలుగురు నుంచి అత్యాచారం, ఆరు కాళ్ళ బర్రెదూడ జననం, దొంగసారా కనుగొంది, శుభవివాహం, మరణ సమాచారం, చోరుల ఆర్భాటం అనేవన్నీ 'త్రిశూలం' పేపర్‌లో వార్తలుగా ఉన్నవి. అయితే అలీబాబా గారి ఈ వార్త మాత్రం ఒక నెలగడిచినా ప్రకటించబడనేలేదు.

మొన్న నమాజు ముగించి బయటకు వస్తుండగా మునీర్ కల్సాడు.

‘బాగున్నావా దాదా?”

“బాగానే ఉన్నా... నువ్వు?”

“ఇలాగున్నాను చూడండి”

“ఏదో వార్త వచ్చింది (వినబడింది) నాలుగు రోజుల క్రితం”

“మా డిపార్ట్‌మెంట్‌దే కదా... ఆ రోజే గుండాశాస్త్రి గాడు వచ్చాడు”

అలీబాబా నిలబడి పోయాడు.

“పేపర్ చూపెట్టి... రేపటి నుంచి నాలుగు రోజులపాటు వార్త ప్రచురిస్తాను కంతులవారీగా... ఒకరు పూర్తి సమాచారం ఇచ్చారు అని వాగాడు. పెద్దోళ్ళం, చిన్నోళ్ళం... అందరమూ చేరి రెండు వేల రూపాయల్ని అతనికి ముట్టజెప్పాం. నేను రెండొందలుగా నావంతు నుంచి ఇచ్చాను. ఇది ఇలాగే ఉంటది... మా నుంచి ఒక రోమాన్ని పీకేదిలేదు ఎవరైనా...” అంటూ మునీర్ థూ అని మురికి కాలువ మీద ఊసాడు. అలీబాబా అంగడికి చేరుకొని మందమతి లాగ కూర్చున్నాడు. హోటెల్ వెంకటేశి వచ్చి “దాదా... సైకిలు తీసుకెళ్తున్నా” అని చెప్పింది కూడా అలీబాబాకు వినబడలేదు.

## 4

నమాజు ముగించి వచ్చిన గంటలోపే గాడి రంగప్ప ఒక విరిగిన సైకిల్ తెచ్చాడు రిపేరుకని. దాన్ని షాపులోకి తెచ్చి కూర్చున్నాడు అలీబాబా. శుక్రవారం గడిచింది. శనివారం గడిచింది. దేహంలో ఊపు ఉత్సాహం జనించలేదు అలీబాబాకు. ఆదివారం కూడా అదే స్థితి. తను లోకంకు వెళ్ళడించేందుకని తీసుకెళ్ళిన సత్యం చనిపోయింది కదా అనే వ్యథతో తిండి నిద్ర వద్దనేంతగా వ్యాకులం అతనిలో ఉంది.

ఆదివారం సైదూర షాపుకు వచ్చాడు. ఆ రోజు అతని సోడా ఫ్యాక్టరి బంద్రై ఉన్నందున అతనికి సెలవు. పట్నంలో కూలినాలి చేసి అతను ఆరోజు రెండు రూపాయలు సంపాదిస్తాడు. రాగానే అతను అడిగాడు ఇలా:

“దాదా... బ్రిడ్జ్ విషయం తెల్సిందా మీకు?”

“తెల్వదు... ఏంటి విశేషం?”

“తెల్వదా మీకు?... నాలుగో కమాను కూలిపోయింది”

“అరె... నాతో ఎవరూ అనలేదే?”

“ఎంతో గుట్టుగా విషయాన్ని దాబెట్టారు దుష్ట ముండాకొడుకులు. వేయాల్సిన రీతిలో ఇనుము సిమెంట్ కంకర సమపాళ్ళలో వేస్తే బ్రిడ్జ ఎందుకు కూలుతది?

వాడు తిన్నాడు వీడు తిన్నాడు... నిలబడు మంచిగా అంటే నిలబడుతదా బ్రిడ్జ్... ప్రస్తుతం అక్కడ పని జరగట్లేదు... రాత్రి పొద్దులో కూలినందున ఎవరూ చావలేదు..." అంటూ సైదూర చెపుతుండగా, అలీబాబా మనసులో ఏవేవో విచారాలు వచ్చి వెళ్ళసాగినవి. బ్రిడ్జికుండే కమానులు కూలినవి అంటే సైదూర చెపుతున్నట్లుగా పని సరిగా జరగలేదు కదా... ఈ సత్యాన్నే కదా తను అర్జి మూలకంగా బయటపెట్టేందుకు వెళ్ళింది? గుండాశాస్త్రికి వివరించింది... అయితే తన సత్యసమాచారం ఎవరి చెవిలోనూ పడలేదు కదా... శాస్త్రి పేపర్‌లో ప్రకటిస్తానని బెదిరింపు చేసి డబ్బు పోగుచేసుకొన్నాడు కదా...ఛీ!

సైదూర పదినిమిషాలు మాట్లాడి మరిక ఎవరో పిలిచారని లేచి వెళ్ళిపోయాడు.

పడుకొన్నోడు లేచినట్లుగా వళ్ళు విరుచుకొని "బేటా" అంటూ కొడుకును పిల్చాడు. 'త్రిశూలం' పేపర్ ప్రహసనం నుంచి ఒక వైపు అవమానం మరోవైపు నిరుత్సాహం అయ్యింది. ఆ రెండూ ఇప్పుడు కనుమరుగై కొత్తగా బ్రిడ్జ్‌లోని కమానులు కూలిపోయిన విషయాన్ని ఎత్తుకోవాలని నిర్ధారం చేసుకొన్నాడు అలీబాబా. ఇంతకు మునుపు తెచ్చిన రెండో తెల్లకాగితం ఖాళీగానే ఉంది. దాన్ని ఒక అంచుకు మడిచి సిద్ధం చేసాడు. కలం, అద్దుడు పుస్తకం జతగా వచ్చిన కొడుకు చేతిలో దాన్ని ఉంచి "ఒక అర్జీ రాసి పెట్టు బేటా" అంటూ అడిగాడు.

ఈసారి నగరంలో ఉన్న పెద్ద ఇంజినీర్ గారి దివ్య సముఖంకు అని ఆరంభించాడు చెప్పేదాన్ని. మొదటనుంచి సిమెంటు, ఇనపరాడ్ల ప్రహసనం వివరించి మిగిలిన భ్రష్టాచారాల మీద కూడా రాయించి గ్యాంగ్‌కూలి నుంచి ఆ ఉపవిభాగంలో ఉండే అసిస్టెంట్ ఇంజినీరు వరకూ అందరూ ఎలా దేశ సంపదను లూటి చేస్తున్నారనేదాన్ని తెల్పి ఇప్పుడు నాలుగో కమాను కూలినందుకు పైన పేర్కొన్న కారణాలే ఉన్నవని అర్జీలో వివరించాడు. ఇక ముందు పనులు ఇలాగే సాగితే వంతెన కట్టి ముగించిన ఒకే సంవత్సరంలో కూలిపోతదని, దాని పాపం తమ శిరస్సు మీద పడుతదని చెప్పి రాయించి దాన్లో దస్కత్తు చేసాడు.

నగరంకు వెళ్ళి దీన్ని పెద్ద ఇంజినీరు సాబ్‌కు ఇచ్చేదే సై అని భావించినప్పుడు ఒక వార్త వినబడింది. పెద్దసారే ఖుద్దుగా భికారికొప్పకు వచ్చాడనేది ఆ వార్తగా ఉంది.

మంచే అయ్యిందిలే అనుకొంటూ అర్జీని జేబులో పెట్టుకొని, పుత్రుడితో షాపు చూసుకోమని చెప్పి బయల్దేరాడు అలీబాబా.

మొదటగా బ్రిడ్జ్ వద్దకు వచ్చాడు. పెద్దసార్లు కనబడలేదు. అక్కడ్నుంచి ఆఫీసుకు అలీబాబా వెళ్ళి చేరుకోగా ఆఫీసు ముందు రెండు జీపులు... బయట చేతులు

కట్టుకొని విధేయులుగా నిలబడిన నౌకర్లు... లోపల అరుపులు, కేకలు... బిగ్గరగా ఎవరో ఎవడ్నో తిడుతున్నారు...

"మిమ్మల్నందర్నీ చైనాలోలాగ ఉరితీయాలి... ఏంటి? పని చేస్తున్నారా... లేకపోతే పెంట తింటున్నారా... భారతరత్న విశ్వేశ్వరయ్య గారు జనించిన రాష్ట్రం ఇది... మనం ఎలా చేయాలి నిర్మాణ పనుల్ని ఘనంగా? కమాను కూలిందంటే ఏంటి? నాకెందుకు రిపోర్ట్ చేయలేదు? నేను మిమ్మల్నందర్నీ సస్పెన్షన్‌లో ఉంచుతాను... గవర్నమెంట్‌కు రాస్తాను... యూజ్‌లెస్ ఫెలోస్, హోప్‌లెస్ ఫెలోస్... మీరు ఇంజినీర్లు కాదు... బూటకం కొడుకులు... కొజ్జాగాళ్ళు..."

ఆ కేకలుతో కూడిన మాటల్ని వింటుంటే అలీబాబాకు సంతోషం అయ్యింది. అర్జీ ఇచ్చేందుకు, మాట్లాడేందుకు ఇది సరైన సమయం...! వచ్చిన ఈ పెద్దసారులో కొంచెం సత్యం ప్రామాణికతనం ఉంది. వీరు తన విన్నపాన్ని వినగలరు. అయితే ఇప్పుడు దోషులంతా లోపల ఉన్నారు... వారు బయటకు రానీ... తర్వాత లోపలకు వెళ్తే సరి అని అలీబాబా నిధానంగా మామిడిచెట్టు నీడలోకి వచ్చి రాతి బెంచి మీద కూర్చున్నాడు.

కొంచెం దూరంలో ఇద్దరు డ్రైవర్లు మాట్లాడుకొంటున్నారు. ఒకడైతే ఇక్కడోడే... ఈ కచేరిలో ఉండే జీపుకు చాలకుడు. ఇంకొకడు నగరం నుంచి వచ్చినోడు. ఎక్సిక్యూటివ్ ఇంజినీరు గారి డ్రైవరై ఉండొచ్చు.

"పెద్దసారు ధాటిగానే అరుస్తున్నాడు కదా"

"ఔను... నోరు జోరుగా చేసుకొంటేనే డబ్బు జాస్తిగా దొరుకుతది..."

"అందుకేనా బిగ్గరగా బూతులు తిడుతుంది?"

"మరి... అందుకే..."

"ఔనా..."

"హుం... రాత్రి పెద్దసారు పుత్రిక బెంగళూరు నుంచి వచ్చింది. మొగుడేమో ఐదువేలు మీ నాయన నుంచి గుంజుకొని తీసుకురా... కుదరకపోతే నా వద్దకు రాకు అని కటువుగా చెప్పి తోలాడట అతను (అల్లుడుగారు)..."

"ఏమి చేస్తాడు ఆ అల్లుడు?"

"చేసేదేంటి... గుర్రంతోకకు డబ్బు కట్టేది (హార్స్ రేసులో పాల్గొనేది) కదా"

"ఛి ఛి ఛీ"

"మూడు నెలలకొకసారి సారు పుత్రిక వస్తది... ఐదు వేలు పదివేలు అని అడుగుతది... పుత్రిక పుట్టింటికి వస్తే, మా పెద్దసారు సబ్ డివిజన్లలో ఉండే

ఆఫీసులకు సర్‌ప్రైజ్ విజిట్ చేస్తుంటారు...”

అందరూ ఇక్కడ డబ్బును రెడిచేసుకొని వెళ్తారు. వదిలేయ్ ఆ విచారాన్ని... ఉదయంలోనే హడావుడిగా ప్రభాకర్, శివరామ, రామేగౌడ, పాటిల్, హెగ్డె... మా సారు వద్ద వేలవేల రూపాయల్ని సమర్పించుకొన్నారు. బూతులు అరుపులు ఆగినవంటే మరిక మా సారుకు డబ్బు ముట్టజెప్పినట్లే... ఆ తర్వాత మేము నిశ్చింతగా వెళ్ళిపోతాం...”

భాగోతం చెప్పుకొంటూ ఆ ఇద్దరూ పకపకా నవ్వుకొన్నారు.

అబ్బబ్బా అన్పించింది అలీబాబాకు. అరె ఈ పెద్దసార్ మొదలే గజదొంగా... ఇతని వద్దకే వచ్చానా? అని అనుకొంటూ అలీబాబా కూర్చున్న చోటు నుంచి లేచాడు. షాపులో రంగప్ప తెచ్చి ఇచ్చిన సైకిల్‌ను రిపేరు చేయలేదు కదా అలీ బాబా. నిరుత్సాహంగా ఆదివారం, సోమవారం గడిచిపోయినవి.

మంగళవారం వచ్చింది.

అలీబాబా సైకిళ్ళను బయట పెట్టి కూర్చున్నాడు. రెండు సైకిళ్ళను రిపేరు చేసేదుంది. రిపేరు చేస్తే సరి అనుకొన్నాడు. కూర్చున్న చోటే ఆవులించాడు.

## 5

బీబి ఇంటెనుక తనంతతనే ఇటుకల్ని జోడించి ఒక గూడు కట్టింది. అందులో ఏడెనిమిది కోళ్ళను సాకింది. మూడు నాలుగు కోడిపెట్టలు సదాగుడ్లు పెట్టుతున్నవి. మిగిలిన పెద్ద పుంజులు వీధి తిరిగి వస్తుంటవి. కొత్తగా పిల్లల్ని కొని పెరిగిన బలిసిన పాతకోళ్ళను బీబి అమ్ముతుండేది. అప్పుడప్పుడు వాళ్ళు వీళ్ళు పుంజుల్ని గుడ్లను కొనేందుకు బీబి వద్దకు వస్తుండేవారు. అది ఏమున్నా బీబీకి చెందిన వ్యవహారం. కోళ్ళను అమ్ముతున్నందున వచ్చే డబ్బు ఆమెదే. అలీబాబా అందులో చేయి పెట్టేది లేదు.

అలీబాబా సైకిల్‌ను తుడుస్తున్నప్పుడు ప్రవాసి మందిరంలో (ట్రావలర్స్ బంగళాలో) ఉండే జవానైన కైతాన్ సోజ షాపు ముందుకొచ్చి నిలబడ్డాడు.

“ఏంటి కైతానణ్ణ... ఇంత దూరంకు వచ్చావు? సైకిల్ కావాలేంటి?”

కైతాన్ సోజ ఖికారికొప్పకంతా పరిచిత వ్యక్తే! ఇస్కూలు పోరడిలాగ నాలుగో నాలుగున్నర అడుగుల ఎత్తు... ఆ ఎత్తుకు తగినట్లుగానే శరీరం... చిన్న కళ్ళు... గుంగురుజుట్టు... ఎప్పుడూ నవ్వుతూ తమాష చేస్తుండే కైతాన్ సోజ ధ్వని కొంచెం కీచు...

“సైకిల్‌కావాలి...” కళ్ళు మిటకరిస్తూ అన్నాడతను.

"తీసుకో... ఇది బాగా ఉంది" అంటూ ఒక సైకిల్‌ను క్రిందకు దింపిపెట్టాడు అలీబాబా.

"ఈ సైకిల్ కాదు మహాశయ.. అది..." అంటూ కైతాన్ బయట తోటకూర కాడల గింజల్ని మెక్కుతున్న పుంజు ఒకదాన్ని చూపించాడు.

అది ప్రవాసి మందిరంలోని భాష. మాంసం చేపలు తిననోళ్ళందరూ తినసాగిన పిమ్మట గొర్రె కోడి చేప మొదలైన జీవాలకు పర్యాయపదాలు వచ్చినవి. రెండు కాళ్ళకోడి అంటే సైకిల్‌గా, నాలుగు కాళ్ళ గొర్రె కారుగానూ, చేపలు అంటే పడవగానూ మారు పదాలతో పిలవబడుతున్నవి. పావురాళ్ళు, నెమళ్ళు మొదలైనవి విమానంగా, హెలికాప్టర్‌గా గుర్తించుకోబడుతున్నవి. అతనిమాట లేటుగా అర్థమైన అలీబాబా... "ఆ డిపార్ట్‌మెంట్ నాది కాదు మహాశయ" అంటూ బీబీని పిలిచాడు. ఆమె ఇంట్లోలేదు.

"వస్తది... కూర్చో" అన్నాడు.

కైతాన్ సోజ కూర్చున్నాడు.

"ఎవరు వస్తున్నారు?" అడిగాడు అలీబాబా.

"మామ... పెద్దమామ వస్తున్నారు"

"ఎవరు మహాశయా వారు?"

"సర్కిల్ నుంచి వస్తాడు... సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉన్నట్లుగానే సర్కిల్ ఇంజినీరూ ఉంటాడు..."

అర్థంకాలేదు అలీబాబాకు... గుడ్లు మిటకరించి అతని ముఖం చూసాడు.

"ఈ భికారికొప్పలో ఉండే ఆఫీసు ఒక సబ్ డివిజన్ స్థాయిలో ఉంటది.. ఆ సబ్ డివిజన్ లాగ మరో నాలుగు సబ్ డివిజన్లను కలిపి దాని మీద ఒక సర్కిల్ డివిజన్ ఉంటది... దాన్లో ఒక పెద్ద ఇంజినీర్ సాబ్ ఉంటాడు... ఆ పెద్ద సారు వస్తున్నాడు... అతనికి నాటు కోడిపుంజు కూర అంటే ఎంతో ఆశ... అందుకే వచ్చా..." అంటూ వివరంగా చెప్పిన పిమ్మట కొంచెం కొంచెంగా అర్థమైంది అలీబాబాకు. "సరిసరి" అంటూ అలీబాబా తలూపాడు. ఎదురింటికి వెళ్ళిన బీబి పుదీనా కట్ట పట్టుకొని వచ్చినప్పుడు అలీబాబా... "చూడు కైతానణ్ణ వచ్చాడు... మంచికోడి పుంజు కావాలట" అంటూ కైతాన్ సోజను అటు పక్కకు పంపాడు.

మరిక ఆ ఇంజినీర్ల విషయంకు వెళ్ళేది వద్దని అనుకొన్నాడు. ఎలాగోలా ఆ కఛేరికి చెందిన వార్త బయటకు తలచాపుతూ పాడుబడ్డ రాతి గోడ పగుళ్ళలో మన్ను నింపి లోపలికి చేరుకొన్న పాము మరిక బయటకు రాదులే అని అనుకొంటుండగా, వేరొక కంతనుంచి పాము తన తలను బయటకు చాపుతది.

కొట్టి పడేద్దాం అని అనుకొంటే ఈ పాము దొరుకుతదా? ఈ పాములాగే ఉన్న పి.డబ్ల్యు.డి. నుంచి తను ఇప్పుడు వంటినిండా కాట్లు వేయించుకొన్నాను. గ్యాంగ్‌మన్ మునీర్, వర్క్ ఇన్స్‌పెక్టర్ రామేగౌడ, అసిస్టెంట్ ఇంజినీర్ ప్రభాకర్, మళ్ళా ఎక్సిక్యూటివ్ ఇంజినీర్... ఇంకా ఎవరెవరున్నారో... ప్రస్తుతంకు ఇంత మంది కాటు నుంచి విషం నా వంటి మీదంతా వ్యాపించింది. దీనితో పాటు 'త్రిశూలం' పత్రికలోని గుండాశాస్త్రి చేసిన వ్రణం కూడా ఉంది. ఈ పాము నుంచి తప్పించుకొనేందుకు చేసిన యత్నాలేవి ఇప్పటి వరకూ ఫలితం కానరాలేదు. పామూ దొరకలేదు. ఇప్పుడేమో కైతాన్ సోజ మరొక కొత్త వార్త తెల్పాడు. భికారికొప్ప డిపార్ట్‌మెంట్‌కు చెందిన పైస్థాయిలోని పెద్ద అధికారి వచ్చే వార్తగా అది ఉంది.

"వీరిని చూసి కలిస్తే ఎలాగుంటదో?"

"ఏదైనా ఉపయోగం అవుతదేమో?"

ఎక్సిక్యూటివ్ అధికారికని రాయించిన అర్జి అలాగే ఉంది. దాని విళాసం (చిరునామా) మాత్రమే మార్పు చేయించి ఈ పెద్దసారుకు ఇస్తే? వీరిని కల్సి కడుపులో నింపుకొన్న చేదునంతా బయటకు కక్కితే? అలీబాబా కుర్చీ మీద నీరవం (నిశ్చలం)గా కూర్చున్నాడు. ఔను... ఇప్పటిదాకా తను చేసింది ఫలాన్ని ఇవ్వలేదు.

ముందేంటి కింకర్తవ్యం?

నిరాశ ఎందుకు? ప్రయత్నించేదాన్లో తప్పేమిలేదుకదా... బుడేన్‌సాబ్ గారు చెప్పినట్లుగానే గుండాశాస్త్రి చెప్పినట్లుగానే నాలో ఉంది మహత్వమైన విషయం. దేశంకు హితం. జనతలోని అభివృద్ధికి చెందిన ప్రతియొకదాన్ని నాశనం చేస్తుంది ఈ అవినీతి ఘోరకార్యం. ఈ విషయాన్ని కొంత మంది గమనంకు తెచ్చేందుకని తను వెళ్ళింది నిజం. వెళ్ళగా వాళ్ళు అయోగ్యులని తిరిగి వచ్చింది నిజం. అయితే ఒక డిపార్ట్‌మెంట్‌లో అందరూ గజ దొంగలుంటారా? బుద్ధి సంపన్నులు, ప్రామాణికులు అక్కడ ఉండేది లేదా? ఈ సారి మరోమారు ప్రయత్నిస్తా... చూద్దాం...

కైతాన్‌సోజ పుంజుకాళ్ళు పట్టుకొని దాన్ని తలకిందులజేసి ఊపుతూ బయటకు వచ్చినప్పుడు అలీబాబా అతడ్ని ఆపి నిలబెట్టాడు.

"ఔను...సార్ ఏటైమ్‌కు వస్తాడు?"

"సాయంకాలంకు... రాత్రి ఇక్కడే మకాం... ఎందుకు అడుగుతున్నావు దాదా... మీరూ వస్తారా సారును చూసేందుకు?"

"ఔను... వస్తాను"

"కచితంగా రండి.... పుంజు మీ ఇంటిదే అని పరిచయం చేసిపెట్టాను"

"కొక్కరకో" అంటూ కూస్తూ అసహనం చెందుతున్న పుంజుకాళ్ళను బలంగా పట్టుకొనే కైతాన్ వెళ్ళి పోయాడు.

అలీబాబా అర్జి తెరిచి కూర్చున్నాడు.

కుమారుడు ఇస్కూలు నుంచి రాలేదు.

"బీబి... బేటా రాలేదా?" అంటూ అలీబాబా తలుపు చెంత కొచ్చి అడిగాడు.

"ఇస్కూలులో ఇంద్రజాల ప్రదర్శన ఉందట. ఇంటికి వచ్చి చేరేందుకు టైమ్ అవుతదని చెప్పి వెళ్ళాడు ఉదయంలో"

"అలాగైతే నువ్వు కొంచెం షాపు వైపు కన్నేసి ఉండు"

బీబి ఎన్నడూ లేని విధంగా బుసగొట్టూ వచ్చింది. ఆమె ముక్కులోని ఒక ముత్యం ముక్కెర ఆ సాయంత్రం ఎండలో మిలమిల మెరుస్తుంది.

"ఔనండి... మీరు ఎక్కడికి వెళ్తున్నారు?"

"కొంచెం బయట పనిబడి వెళ్తున్నా?"

"ఇప్పుడు ఒకట్రెండు నెలల నుంచి మీరు చేస్తుంది ఏంటి? రాత్రులలో సరిగా తిండితినటం లేదు, సరిగా నిద్రించటంలేదు. అదేంటో అర్జి రాయించుతున్నారు. కఛేరి నగరం అని తిరుగుతున్నారు... ఇదంతా ఏంటి?"

"నీకు తెల్వదులే"

"తెలుస్తది మంచిగానే...అయితే మీరు చెప్పట్లేదు... ఔను మీ బుగ్గలు సొట్టబడి లోతుకు వెళ్ళింది ఎందుకు? షాపులో జరిగే యాపారంలో మీకు ఆసక్తి మునుపటిలాగ ఎందుకు లేదు? గతంలో సైకిల్ చెడిపోయివస్తే తక్షణమే రిపేరు చేస్తుండేవారు... ఇప్పుడెందుకు రిపేరు చేయకనే సైకిల్‌ను అలాగ స్తబ్ధుగా ఉంచారు..."

ఎన్నడూ ఎదురు మాట పలకని బీబి నోటి నుంచి వచ్చిన ఈ వాక్యాలను విన్న అలీబాబా కొంచెం అధీరుడైయ్యాడు. బీబి ఉత్తిగనే ఎన్నడూ ధ్వని ఎత్తింది లేదు. గొంతు పెంచి మాట్లాడింది లేదు. అంతేగాకుండా ఇప్పుడు ఆమె అడుగుతున్న దాన్లో న్యాయం ఉందిలే! అయితే ఆమెకు ఏమి జవాబు పలికేను?

"బీబి నీకు చెప్పకూడదని కాదు... రాత్రి తిరిగి వచ్చిన పిమ్మట చెపుతాను... కొంచెం షాపు వైపు దృష్టి నిలుపు..." అంటూ అలీబాబా మెట్లు దిగాడు.

ప్రవాసి మందిరం ఎదురు అంబాసిడర్ కారు ఉంది. వరండాలో చప్పుడు చేయకనే నిలబడి తిరుగుతున్న ఒకరిద్దరు ఉన్నారు. అలీబాబా వారిలో ఒకడ్ని అడిగాడు. "పెద్దసారు వచ్చారేంటి?" అని.

"ఔను... వారులోపల ఉన్నారు"

"నేను వారిని చూసేదుంది"

"ఏంటి విషయం?"

"వారివద్దే చెప్పేదుంది"

బయటున్న వ్యక్తి ఏమి చేయాలని యోచిస్తూ నిలబడగా, అప్పుడు డోర్‌కున్న పరదా పక్కకు తొలగి

"సదానంద... ఏమిటట ఆ పెద్ద మనిషి నుంచి?"

"మిమ్మల్ని కలవాలని అంటున్నాడు సార్"

"వారిని లోపలకు పంపు"

అలీబాబా హృదయంలో సంతోషం ఉప్పొంగింది. అల్లా ఎంత దయామయుడో... ఎంత మహిమాన్వితుడో...ఎవరెవరో చిన్న చిన్న సార్లను కల్సేందుకు వెళ్ళినప్పుడు ఒకటికాదు ఎన్నో విఘ్నాల్ని కలిగించాడు... ఇప్పుడు చూస్తే దారి ఎంత సుగమంగా చేసాడో కదా... ఖుదా అల్లా... నీకు నా ప్రణామాలు...

అలీబాబా చెప్పులు బయట విడిచి చొక్కా మరియు టోపి సరిజేసుకొన్నాడు. గడ్డాన్ని నిమిరాడు. ఎడం వైపులో ఉన్న జేబునుంచి అర్జి బయటకు తీసి చేతిలో పట్టుకొని లోపలికి వెళ్ళాడు.

సోఫామీద పెద్దసారు ఉన్నారు. ఎరుపు వర్ణంతో వారి మోము కళకళలాడుతుంది. మెరుస్తున్న కళ్ళు. అంతగా ఏమి దర్పం చూపట్లేదు.

"రండి"

అలీబాబా చేతులు ముడిచాడు.

వారివద్దకు వెళ్ళి వంగి అర్జి ఇచ్చాడు. వారు తీసుకొన్నారు. పత్రం మీద కళ్ళను ఆడించారు. అయితే పూర్తిగా ఆ పత్రాన్ని చదవలేదు. దాన్ని అలాగే అతనికి ఇచ్చేసారు. "మీరే చెప్పండి... ఏంటి విషయం... కూర్చోండి సుఖంగా" అంటూ వారు అలీబాబాను దిట్టించి చూసారు. దాదా ముఖం మీద సరళత్వం, ప్రీతి, ఏదో ఒక దివ్యత్వం, ఎత్తైన వారి దేహనిర్మాణం... అయినా దాన్లో ప్రస్ఫుటంగా కనబడుతున్న నమ్రత... వారికిక అలీబాబా మీద ఏదో గౌరవభావం ఉప్పొంగింది.

అలీబాబా సారుకు చెంతనున్న వెదురు బద్దల కుర్చీలో స్థిమితంగా కూర్చున్న తర్వాత ఆ పెద్దసారు "చెప్పండి విషయం" అని అడిగారు.

"నేను భికారికొప్పలో ఉండే అలీబాబాను... నాకొక చిన్న సైకిల్ షాపు ఉంది... ఇప్పుడు సుమారుగా రెండున్నర నెలల నుంచి నేనొక విషయాన్ని గమనిస్తూ వచ్చాను సాబ్... నాకైతే నేరుగా సంబంధం లేదు ఇది... దీన్నంతా చెప్పేందుకు

నేను ఘనవ్యక్తినీ కాను... అయినా ఈ పుణ్యభూమికి చెందిన ప్రజను... నేను! ఆ ధైర్యంనుంచే కొన్ని మాటల్ని చెపుతాను... పెద్ద అధికారి మీరు... నా మాటను ఆలకించండి."

"చెప్పండి విషయమంతా... సంకోచపడకండి"

"అలకావతి నది మీద ముప్పైలక్షల ఖర్చుతో వంతెన కట్టిస్తున్నారు... ముప్పై లక్షలు సరైనరీతిలో వినియోగం అయితేనే బ్రిడ్జ్ దృఢంగా నిలబడిపోతది కదా..."

"ఔను" అన్నారు పెద్దసారు.

"ప్రభుత్వ అభిప్రాయం కూడా ఇదేకదా" అని మళ్ళా అన్నారు పెద్దసారు.

"అయితే సాబ్... ఇక్కడ ఏమి జరుగుతుందో తెల్సా?" అంటూ అలీబాబా గట్టిగా ఊపిరి పీల్చుకొని చెప్పసాగాడు. కల్లాకపటంలేని పసిబాలుడిలాగ ఉన్నది, విన్నది, చూసింది... రోజులు వారాలు నెలల సహితంగా పేర్లు స్థలాల వివరాల్ని ఇస్తూ చెప్పసాగాడు. సహనంగా సాబ్ వింటూ కూర్చున్నారు.

చెప్పేదంతా ముగిసిన మీద "ఇది ఇంత మట్టంకే నా నుంచి వెళ్ళడైంది సాబ్... ఇక ముందు మీరు ఏమి చేస్తారో చేయండి" అన్నాడు అలీబాబా. సాబ్ ఐదు నిమిషాలు మౌనంగా కూర్చున్నారు. తర్వాత నిట్టూర్చారు. అనంతరం వారు అన్నారు ఇలా: "దాదా... నేను ప్రభుత్వ అధికారిని... నాకన్నా పై స్థాయిలో మళ్ళా కొంతమంది ఉన్నారు... తెల్సామీకు?"

"గుర్తేసార్... ఇంకా పెద్ద ఇంజినీర్లు ఉండొచ్చు... మంత్రులూ ఉండొచ్చు..."

"ఔనుకదా... ఈ పైనున్నోళ్ళు నా నుంచి ఏమి ఆశించుతారో గుర్తా?"

"తెల్వదుసార్... ఏదాన్ని సార్?"

"ముప్పైలక్షల పని జరిగే ఒక ఉపవిభాగం మీద ఉండే సర్కిల్‌కు నన్ను పై అధికారిగా నియామకం చేసినందుకు ఖుద్దుగా నేను నా పైన ఉన్నోళ్ళకు తక్కువంటే తక్కువగా ఐదు లక్షల్ని ఇచ్చేదుంది..."

"సర్కార్... ఏంటి మీరు చెపుతుంది?"

"ఔను దాదా... గ్యాంగ్ కూలి మునీర్ సిమెంట్ అమ్మేది... రామేగౌడ స్టీల్ అమ్మేది... మిగిలిన సిబ్బంది భ్రష్టాచారంలో మునిగేది ఇందుకే. వారేమి చేయగలరు? పై స్థాయిలో ఉండే అధికార్లకు పంచాలి అని వామమార్గంలో డబ్బు పొందుతున్నప్పుడు తమ కోసం అని ఒకింత డబ్బును దాబెట్టుకొంటుంటారు. ఐదు లక్షలు పైన ఉన్నోళ్ళకు సమర్పించే జతగా మరి రెండో మూడో లక్షల్ని వారు దాచుకొంటారు. ఈగుట్టు... మీకు చెప్పకూడదు... అయినా చెపుతున్నాను. ఇంకా ఒక మాట నేను చెప్పేదుంది

దాదా... ఈ భ్రష్టాచారంను నిలువరించేందుకు సాధ్యమేలేదు..."

అలీబాబా లేచాడు బరువెక్కిన హృదయంతో. "వస్తాను సార్" అంటూ నమస్కరించాడు. చెప్పులు తొడుక్కొని ప్రవాసి మందిరంలోని కాంపౌండ్ గేటు దాటాడు. అప్పటికప్పుడే ఇంటికి చేరేందుకు సాధ్యంగాని సుస్తు కలిగింది... అయినా నడిచాడు ఎలాగోలా!

అలీబాబా గారి సైకిల్ షాపు ఇప్పుడు బంద్ అయ్యింది. నిత్యం సైకిళ్ళను తీసుకెళ్ళేవారు షాపు వద్దకు వచ్చి మూయబడిన తలుపులు చూసి వెళ్ళిపోతున్నారు. సైదూర, బాబాజాన్ మొదలైనోళ్ళు దాదా ఇంటిలోకి వస్తున్నారు.

"దాదా... దాదా" అంటూ వాకిలి చెంత నిలబడి కేక పెట్టుతున్నారు.

మఫ్లర్ చుట్టుకొని అలీబాబా ఆయాసపడుతూ బయటకు వస్తున్నాడు.

"అరె ఏమైంది దాదా"

"అక్కడిక్కడ ఒకింతగా తిరిగినందునో ఏమో... ఆయాసం... అలుపు... వంటి నెప్పులు మొదలైన బాధల నుంచి తిండి సరిగా వెళ్ళటంలేదు... నిద్రపట్టట్లేదు" అంటూ అలీబాబా తన దుస్థితిని తెల్పాడు.

శుక్రవారం అలీబాబా నమాజుకు వెళ్ళలేదు. అతను ఎంతగానో నలిగిపోయాడు.

ఇప్పుడు సైకిల్ షాపు మూతబడియుంది. భికారికొప్పలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడొకరు నిత్యం అలీబాబాకు మాత్రలు (గుళికలు), ఇంజెక్షన్ ఇస్తూనే ఉన్నారు.

"జబ్బేమి లేదు... నయమౌతది... ఏదో మనోవేదన" అని బీబీకి సమాధానం చెపుతున్నారు బిషక్‌లు.

మన కథానాయకుడైన భికారికొప్పకు చెందిన లేట్ శిరాజుద్దీన్ పుత్రుడు మరియు సైకిల్‌షాపు యజమానైన అలీబాబా తలకు మఫ్లర్ చుట్టుకొనే ఇంటి అరుగు మీదున్న స్తంభంకు ఒరిగి కూర్చున్నాడు. మాటమంతి లేదు. ఏమి జబ్బు అనేది ఎవరికి అంతుబట్టలేదు. అతను పెద్ద ఇంజినీర్‌సాబ్‌కు ఇచ్చిన మరియు సాబ్ కళ్ళు ఆడించి తిరిగి ఇచ్చేసిన అర్జిమాత్రం ఇకనూ ఇతని వద్ద భద్రంగా ఉంది. రోజులు దొర్లుతుండగా అలీబాబా కృశించి వడిలిపోసాగాడు. కాని, ఆ అర్జి మాత్రం ళకళకగానే ఉంది. అదేనండి ఇప్పుడే రాసి ముగించినట్లుగా...

**మూలకథ రచనాకాలం : 1987**

# "తారుకు సంబంధించిన కథ"

పూర్వం తారు డ్రమ్ములలోనో, బ్యారెళ్ళలోనో వచ్చి చేరుతుండేది. లారీలో వచ్చిన బారెళ్ళను దింపి ఉపవిభాగం (సబ్‌డివిజన్) కఛేరికి ముందుండే ఖాళి స్థలంలో వరుసగా ఒకదానిమీద మరొకటి పేర్చి పెట్టుతుండేవారు. స్టోరు కీపరైన తిప్పాజయ్య తన సహాయ సిబ్బంది మూలకంగా మొత్తం ఎన్ని బ్యారెళ్ళు వచ్చి చేరుకొన్నవని లెక్క పెట్టించి పుస్తకంలో రాసుకొనేవాడు. అపరూపం అన్నట్లుగా బ్యారెళ్ళను దింపుతున్నప్పుడు హమాలీలు వాట్ని మోసుకొచ్చి తలక్రిందులుగా దింపుతుండేది ఉంటది కదా! బ్యారెల్ లోపలున్న తారు ఘనీభవించి ఉన్నందున తలక్రిందులుగా పడేసినా ఎక్కువ నష్టం కష్టం అయ్యేదిలేదు. జూనియర్ ఇంజినీరు, సహాయ ఇంజినీరు రోడ్డు రిపేరుకని లేకపోతే గుంతలు పడిన రహదారి బాగుపరిచేందుకని ఇన్ని బ్యారెళ్ళ తారు కావాలని స్టోరుకీపరు నుంచి తీసుకు పోతుండేవారు. ఉప విభాగం కఛేరి ముందు వరుస వరుసగా పేర్చి పెట్టిన బ్యారెళ్ళలోని తారు ఎండాకాలంలో కరిగిపోతుండేది.

ఇప్పుడున్న నూతన వ్యవస్థ ఏమిటంటే తారు వచ్చేది ట్యాంకుల నుంచి మాత్రమే! పెట్రోలు ట్యాంకు లాగ పెద్ద వాహనంలో ఉండే ట్యాంకులో తారును నింపి ఉత్పాదక కంపెని వాళ్ళు మద్రాసు నుంచి నేరుగా పంపుతుంటారు. తారుతో నిండియున్న ట్యాంకరు వెహికెల్ ముందుగా జిల్లా కేంద్రంలో ఉండే పి.డబ్ల్యు.డి. ఆఫీసుకు వస్తది. అక్కడుండే స్టోరు కీపరు తారు ఎవరికి కావాలి అని సాగరం, సొరబ, హొసనగర, శికారిపుర మొదలైన తాలుకాపట్టణాలలో ఉండే సబ్ డివిజన్ (ఉపవిభాగ) కఛేరి వాళ్ళకు ఫోన్ కొట్టి "తారు వచ్చిందండి మద్రాసు నుంచి... మీకు ఏమైనా కావాలా" అని అడుగుతాడు. ఎవరు కావాలని అడుగుతారో అక్కడికి ట్యాంకర్‌ను పంపుతాడు. మద్రాసు నుంచి వచ్చిన తమిళ లారిడ్రైవర్ గొణుగుతూ సాగరంకో సొరబ పట్టణంకో బయల్దేరుతాడు.

సాగర పట్టణంకు ట్యాంకర్ వచ్చి చేరుకొన్న తక్షణమే స్టోరు కీపర్ తనపైన ఉండే అసిస్టెంట్ ఇంజినీరును అడుగుతాడు ఇలా: "తారు వచ్చింది, ఎవరికి అవసరం ఉంది అని"

కొంత మంది మాకు వద్దు, మా చెంత సంప్ లేదని అంటారు. వచ్చిన ఈ ట్యాంకర్‌ను ఖాళీ చేయించేందుకు ఒక పెద్ద సంప్ కావాలి. అది పెద్దదిగా ఉండే గుంతకదా...! మా వద్ద సంప్ లేదు, నేనేంటి నా తల మీద కుమ్మరించుకోవాలా అని కొంతమంది రగడ చేస్తుంటారు. అసిస్టెంట్ ఇంజినీరు చివరిగా "గుత్తేదారు తిరుమలయ్య తారు కావాలని అడిగాడు. ట్యాంకర్ మొత్తం వద్దు. పది బ్యారెళ్ళ తారు చాలు అని అంటున్నాడు" అని తన పైన ఉండే జూనియర్ ఇంజినీరుకు చెప్పాడు.

ఈ రగడ వద్దని భావించిన తిప్పాజయ్య ఒక శుభదినాన కఛేరి ముందు ఒక పెద్ద సంపు నిర్మించాడు ప్రభుత్వం తరపున. 20×20×8 అడుగుల కొలతతో ఉన్న సంపు అది. ఇక సరేనండి, లారీ డ్రైవర్ లారి ట్యాంకరును వెనక్కి వెనక్కి నడుపుతూ సంప్ చెంతకు లారి నిలబెట్టి లారీ కుండే గుదం లాంటి పైపు ఓపెన్ చేసి తారును వదులుతాడు. అరెరే సరసర అంటూ తారు జారుతదా కిందకు? లేదుకదా! ట్యాంకరులో వేడివేడి తారును ద్రవరూపంలో నింపి పంపినందున రవాణా జరిగే సమయంలో అది గట్టిపడి పోయి ఉంటది. ట్యాంకర్ బాడి క్రింద కట్టెలు వేసి మంటపెట్టుతాడు క్లీనర్ అయిన చిన్న తంబి. ఒక రోజంతా మంటసెగనుంచి వేడెక్కిన ట్యాంకర్ గుదంనుంచి నిదానంగా దారలు దారలుగా తారు జారి సంపులో పడుతది.

కొన్నిసార్లు సంపు నిండినప్పుడు ఖాళీగా పడియున్న బ్యారెళ్ళలో కరిగిన తారును నింపుకొంటారు.

ట్యాంకర్ మంచిగా ఖాళీ అయిన తర్వాత తిప్పాజయ్య తారు మాచెంతకొచ్చి అన్‌లోడ్ అయ్యిందని రశీదు రాసి ఇస్తాడు.

ముందుగా జిల్లా కేంద్రమైన శివమొగ్గకు తారు ట్యాంకర్‌ను తెచ్చిన డ్రైవర్ లారి మొత్తాన్ని వే్‌బ్రిడ్జ్ నుంచి తూకం చేయిస్తాడు. ఖాళి అయిన పిమ్మటా మరోమారు తూకం చేయిస్తాడు. జిల్లా కేంద్ర కఛేరిలో ఉండే మైన్‌స్టోరు కీపర్‌కు ఎన్ని టన్నుల మొత్తంలో తారు వచ్చిందనేది కచితమై అతను అప్పుడు అన్ని టన్నుల తారుకు బిల్‌చేసి కంపెనీకి డబ్బు చెక్కు రూపేణా ముట్టించే వ్యవస్థ చేస్తాడు.

సబ్‌డివిజన్ ఆఫీసు (ఉపవిభాగ కఛేరి)లో ఉండే జూనియర్ ఇంజినీరుకు, అసిస్టెంట్ ఇంజినీరుకు తారు అవసరపడితే వారు తమ చేతి కింద ఉండే దినసరి కూలీల్ని పిల్చుకొంటారు.తారు సంపులో గట్టిపడిపోయి, పాకం ముదిరి గట్టిపడిపోయిన బెల్లం ఉండలాగ ఉంటది. దాన్ని బయటకు తీసేందుకు అనుకూలంగా ఉంటదని దాని మీద నీళ్ళు నింపుతారు. కూలి జనం సంపులో దిగి తీగలు తీగలుగా సాగే

డాంబరు(తారు)ను బయటకు తీస్తారు. లేకపోతే తారును సుద్దలు సుద్దలుగా కత్తిరించి బయటకు తీస్తారు. ఇలా బయటకు తీసినదాన్ని ఖాళి డ్రమ్ములలో నింపి పనులు జరిగే చోటుకు తీసుకెళ్తారు. అక్కడ దాన్ని మళ్ళా వేడిచేసి కంకర మీద పోస్తుంటారు. స్టోరు కీపర్ తన నుంచి జూనియర్ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీరు ఇంతింతగా తారు తీసుకెళ్ళారని లెక్క పుస్తకంలో రాసుకొంటాడు.

ఈ అన్ని అగచాట్ల నుంచి తారుకు చెందిన ధారలు ముద్దలు ముద్దలుగా సంపు చుట్టూ ఉపవిభాగ కఛేరి చుట్టూ అక్కడక్కడ చిత్తరువులుగా పడి ఆ మొత్తం స్థలాన్ని మురికిగా చేసి పెట్టుతది. కఛేరికి ముందున్న మైదానంలో తారు ముద్దలు చెల్లా చెదురై పడియుంటవి. వానాకాలంలో ఏమేమి పనులకూ వాడుకోబడని తారు మరిక వేసవి వచ్చిందంటే చాలు, ఎక్కడెక్కడో పడిన ముద్దలన్నీ కరిగి ద్రవరూపమై మరిక దాని మీద కాలు  పెట్టే చాలు కాలుకు, చెప్పు అడుగులు పడితే చెప్పులకు, బూట్లు అయితే బూట్లకు అంటుకు పోతది. అక్కడ తిరుగుతుండే చోటా కాంట్ర్యాక్టరైన మంజణ్ణగారి జావామోటర్ సైకిల్‌లో ఉండే టైర్లకు, ఏవన్ కాంట్రాక్టరైన కామత్ గారి మారుతి కారు చక్రాలకు, తపాలు మోసుకొచ్చే విల్సన్ సైకిల్ చక్రాలకు ఈ తారు అంటుకొని వాళ్ళంతా ఛీ థూ అని గొణుగుతూ తిరుగుతుంటారు.

ఉప విభాగంలోని కఛేరికి మేనేజరిణి అయిన పద్మావతి బాయి చెప్పులకూ తారు అంటుకు పోయినప్పుడు “ఇదేమి కర్మ... తారు అమ్ముకొని డబ్బు గడించేవారు ఎవరో... చెప్పుల్ని క్లీన్ చేయించుకొనేందుకు రెండు రూపాయల కిరోసిన్ నూనెను నేను ఖర్చు పెట్టాల్సి వస్తుంది కదా” అని స్టోర్‌కీపర్‌ను, జూనియర్ ఇంజినీరు, అసిస్టెంట్ ఇంజినీరును మనస్సులో పెట్టుకొని తిట్టుతూ తిరుగుతుండేది. ఆమె ఇలా తిట్టుతున్నప్పుడు స్టోర్ కీపర్ తిప్పాజయ్య మరియు ప్రముఖులుగా ఆఫీసులో గుర్తుంచుకోబడిన జూనియర్ ఇంజినీరైన భైరప్ప, అసిస్టెంట్ ఇంజినీరైన రుద్రయ్య కొంచెం ఉలికి పడుతుండేవారు.

గతంలో తారు బ్యారెళ్ళ రూపకంగా వస్తున్నప్పుడు దొంగతనంగా బ్యారెళ్ళను అమ్ముతుండేది జరిగేది కాదు. అయితే ఇప్పుడు తారు ట్యాంకుల నుంచి రాసాగిన పిమ్మట స్టోరుకీపరైన తిప్పాజయ్య పాలుకు అవకాశాలు ఎన్నోరూపాలుగా తెరుచుకోబడినవి. డబ్బు అక్రమంగా గడించేందుకు అతనికి పలు అవకాశాలు ఒదిగి వచ్చినవి.

మద్రాసు నుంచి తారు నింపుకొని బయల్దేరిన ట్యాంకరు డ్రైవరు అది ముట్టాల్సి ఉన్న పట్టణంకు చేరుతున్నాము అని భావించినప్పుడు ట్యాంకరు క్రింద ఉండే పొయ్యిలో

కట్టెల మంట వేసి గట్టి పడిన తారును ద్రవరూపంగా కరిగించి తెస్తాడు. జిల్లా కేంద్రకఛేరికి చేరే ముందే ఆ లారీ ట్యాంకరును వేబ్రిడ్జ్‌లో తూకం చేయించి దాఖలాల జతగా పెద్దాఫీసులో ఉండే స్టోరు కీపరుకు లారీ ట్యాంకరులో ఉన్న తారును అన్‌లోడు చేసుకోమని కోరుతాడు. స్టోరుకీపరు ఏయే తాలూకాలకు ఎంతెంత తారు కావాలనే దాన్ని కచితం చేసుకొని ఆయా తాలూకా కేంద్రాలకు తారు పంపి దాన్ని శీఘ్రమే అన్‌లోడు చేసుకోండని తాకీదు పంపుతాడు.

ఈ తారు తిప్పాజయ్య ఉండే ఉపవిభాగంకు వస్తదని తెల్సిన తక్షణమే, తిప్పాజయ్య వేరొక వ్యవస్థ రూపొందించుకొంటాడు.

మునిసిపాలిటివారు, గ్రామపంచాయితి వారు తమ తమ పట్టణం గ్రామాలలో కొత్త రోడ్లకు తారు వేయించే వ్యవస్థను తీర్మానం చేసుకొంటారు. అలాగే కొన్ని ప్రైవేట్ కర్మాగారం వారు, ఇస్కూలు, కలాశాలల వారు తమ తమ సంస్థలలోని రోడ్లకు తారు వేయించుకోవాలని ప్రణాళికల్ని రచించుకొంటారు. వీళ్ళకు ప్రభుత్వం తారును సరఫరా చేసేది లేదు. వారంతా బహిరంగ మార్కెట్టులోనే తారును కొనేదుంది. తిప్పాజయ్య తన ఉపవిభాగంకు వచ్చిన తారును ఆయా చోటులకు పంపుతుంటాడు. బ్యారెళ్ళ బ్యారెళ్ళ ప్రమాణంలో ఆయా సంస్థల స్థలాలలో తారును ఖాళీ చేయించి మిగిలి ఉన్న దాన్ని తన కఛేరి ముందున్న సంపులో నింపుకొని తారు సరిగానే వచ్చి చేరిందని రశీదు పత్రంలో సంతకంపెట్టి ఖాళీ లారీని జిల్లా కేంద్రంలో ఉండే తనపై ఆఫీసుకు పంపుతాడు. అప్పుడు ప్రభుత్వం తారు ఉత్పాదించే కంపెనీకి డబ్బు చెక్కు రూపేణా పంపుతది.

ఇక్కడుండే ఉప విభాగంలోని ఇంజినీర్లు రోడ్డు రిపేరుకో, గుంతల్ని పూడ్చేందుకో, రోడ్డు మొత్తం తారు నుంచి వేసేందుకో ఇండెంట్ పెట్టారు. ఇంజినీరు సార్ కోరిక ప్రకారం తిప్పాజయ్య గుత్తేదారులందరికీ తారు పంపినట్లుగా నాటకం ఆడుతాడు. ఒకరిద్దరు భోళాశంకరులుగా ఉండే గుత్తేదార్లకు "వెళ్ళండి అటు... ఎలాగోలా అడ్జెస్ట్ చేసుకోండి... తారైతే ఇప్పుడు లేదు" అని దబాయిస్తాడు.

కొంత మంది గుత్తేదార్లు తమకు తామే వచ్చి ధ్వని పెంచి తిప్పాజయ్య నుంచి ఒకింత డబ్బు గుంజి, సగంసగంగా బ్యారెళ్ళలో తారు నింపుకొని వెళ్ళి తూతూ మంత్రంగా పని చేయించి మొత్తం రోడ్డు అంతా రిపేరు చేసాం, అన్ని గుంతల్ని పూడ్చి సరిజేసాం అంటూ కొలతల పుస్తకంలో రాయించుకొని పోతుంటారు. ఇంకా మరింత పాపం ఎందుకులే అని భావించే కొంతమంది గుత్తేదారులు ఉపవిభాగం ముందు, సంపు దగ్గర ముద్దలు ముద్దలుగా పడియున్న తారును పైకిలేపి తీసుకొని వెళ్ళి గుంతలు నింపి తమ మానమర్యాదల్ని కాపాడుకొంటుంటారు.

పాలూలేవు పాలగిన్నే లేదు అన్నట్లుగా సర్వం గుటుకాయ స్వాహ చేసాడు అన్నట్లుగా తిప్పాజయ్య ఎన్నో బ్యారెళ్ళ తారును మాయచేసి లక్షలాది రూపాయలను పొంది, దాన్లో కొంత శాతంను పై నుండే ఇంజినీర్లకు, విభాగంలోని అకౌంటెంట్‌కు, ఆడిటర్‌కు వాళ్ళవాళ్ళ స్థాయిని బట్టి పాలును సరిగానే ఇస్తూ సుఖజీవిగా బతుకుతున్నాడు.

మొన్న మొన్నటి వరకూ తెగిన చెప్పుల్ని వేసుకొని పాదాల్ని ఈడ్చుతూ వస్తుండే తిప్పాజయ్య, ఇప్పుడు స్వగ్రామంలో ఒక వక్కతోట వేసాడు. మూడు తాలుకా పట్టణాలలో మూడు ఇళ్ళ స్థలాల్ని సెంటర్‌గా ఉండే చోటే కొనుగోలు చేసాడు. అతని అర్ధాంగి వంటిమీద కేజీల కొద్ది బంగారు నగలు ఉన్నవి. జయలలితకు ఉన్నట్లుగా ఐదొందల చీరలు ఉన్నవి. రెండొందల జతల చెప్పులు ఉన్నవి. ఇతని పిల్లలు ఇంగ్లీష్ మీడియం కాన్వెంట్‌కు వెళ్తున్నారనేది తెల్సిన ఆఫీసు మేనేజరిణి అయిన పద్మావతి బాయి ఈ తిప్పాజయ్య అక్రమ సంపాదనను మనస్సులో పెట్టుకొని గొణగకనే ఉంటదా ఏమి? ఇతరులైన జూనియర్ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీరు ఇదే తారు కృపనుంచి డబ్బు పోగు పరుచుకోగా, మరిక ఆమె మనస్సులో వీరు కూడా ఉండే దాన్లో ఆశ్చర్య పడేది మనకు ఏమి లేదులేండి!

అయితే ఇది పద్మావతి బాయి గొణుగుడుకు మాత్రమే ఆగిపోలేదు. తిప్పాజయ్య అడ్డదిడ్డంగా అందిన కాడికి దోచుకొని ఎంతో ఆస్తి చేసుకొన్న జతగా పట్నంలో ఉండే ముఖ్య రహదారి నిండా గుంతలు పడి యుంది కూడా పట్టణంలోని జనుల గమనంకు వచ్చింది. ముఖ్యంగా పి.డబ్ల్యు.డి.లో పనులు చేస్తుండే గుత్తేదార్లు వస్తుండే తారు అంతా ఎక్కడికి పోతుందని ఆరాతీసారు. దీని మీద ఒక ఆర్జీ కూడా అవినీతి నిరోధక శాఖ వాళ్ళకు వెళ్ళి ముట్టింది అనే మాట ఆ నోటా ఈ నోటా వినబడసాగింది.

ఇలా ఉండగా ఉప విభాగంకు చెందిన ఈ తారులో ఒక నిరుపద్రవి జీవి చిక్కుకొన్న ఘటన ఒకటి జరిగింది. మే నెలలోని ఉష్ణంలో హమాలీలందరూ సంపెంగ చెట్టు మొదలులో కట్టిన అరుగు మీద కూర్చుని అష్టాచెమ్మా ఆడుతున్నారు. సిమెంటు, స్టీలు, పైపులు మరితర సామాగ్రి ఉపకచేరికి వస్తే వీళ్ళకు పని దొరుకుతది. లేకపోతే గుత్తేదారు ఉపకచేరి నుంచి ఏదైనా సామాగ్రిని తీసుకెళ్ళేదుంటే వీళ్ళకు పని దొరుకుతది. వీళ్ళేమి సర్కారి నౌకర్లు కారు. ప్రైవేట్ జనమే. వీళ్ళకు లోడు చేస్తే ఇంత, దించితే ఇంత అని ముందస్తుగా నిర్ణయించిన కూలి ఉంటది. ఈ డబ్బు పొంది జీవనం సాగిస్తుంటారు వీళ్ళు. లారీలు వచ్చినప్పుడు మాత్రం వీళ్ళకు పని జాస్తిగా ఉంటది. లేకపోతే సంపెంగ చెట్టు మొదలు వద్ద ఉండే అరుగు మీద బొగ్గుతో గళ్ళు గీసి అష్టా చెమ్మ ఆట ఆడేది వీళ్ళకు ఒక హవ్యాసం (హాబి)గా ఉంది.

ఎండ దహిస్తుంది. అక్కడ ఇక్కడ పడియున్న తారు ముద్దలన్నీ కరిగి ఎవరైనా ముట్టుకొంటే చాలు కరుచుకుపోతవి అన్నట్లుగా వేడివేడి ద్రవరూపంగా కరిగి ఉన్నవి. కొన్ని ముద్దల్ని మొన్న మొన్నే గుత్తేదారైన తిరుమలయ్య తీసుకెళ్ళి రోడ్డులో ఉన్న గుంతల్ని పూడ్చాడు. అయినా ఎక్కడెక్కడో దాగిన తారు ముద్దలు ఇప్పుడు ఎండ సెగకు నిదానంగా కరుగుతున్నవి.

బొగ్గు గళ్ళ మీద రాయిని జరుపుతున్న సాదిక్ ఎందుకో స్టోర్‌కీపర్ గది వైపు మెడ తిప్పి చూసాడు. మరుక్షణానే అతను భయపడ్డాడు.

'క్యారెవో?' అంటూ కళ్ళను సూక్ష్మంగా చేసుకొని చూడసాగాడు. అతని దృష్టి పథంకు దృష్టి తాకించి మిగిలినోళ్ళూ చూడసాగారు.

బయటుండే జాగాలో పడిన ఆకులు, కాగితాల ముక్కలు, గోనెసంచి పీలికలు మరిక ఏవేవో చేరుకొని ఒక బంతిలాగ మారి బయటున్న మైదానం వైపుకు పాకుతూ వెళ్తుంది ఏదో?

అదేంటో విచిత్రంగా అన్పించి అందరూ ఆట ఆడేది ఆపి లేచి అటువైపు వచ్చారు. నిశితంగా చూస్తే ఎంతో పొడవుగా ఉన్న పాముగా అది ఉంది. ఎండవేడి ఉక్కపోత తాళలేక బిలంనుంచి బయట పడ్డ అది తనకు తెల్వకనే కరిగి నిలబడిపోయిన తారు ద్రవం వైపుకు పాకుతూ వచ్చింది. తారు దాని వంటికి అంటుకొంది. అందులో నుంచి తప్పించుకొనే హడావుడిలో మళ్ళా మళ్ళా తారుకే అంటుకొన్న పాము శరీరం మీద మైదానంలో పడియున్న కసువంతా అతుక్కుపోయింది. పాము ఈ సమస్తాన్ని నింపుకొని గోళాకారంగా ఉండే ఒక వస్తువులాగ ఇక మున్ముందుకు పాకలేక, చుట్టూ చేరి గుంపుకూడిన జనాన్ని చూసి బెదిరి, తన అవస్థకు విలవిలలాడుతూ విచిత్రమైన, అఘాతకారి అయిన, కరుణాజనకమైన ఒక దృశ్యాన్ని ఒకట్రెండు నిమిషాలలోనే అక్కడ సృష్టించింది.

పాములోని అగచాట్లును చూసేందుకు మొదట పదికళ్ళు, తర్వాత నూరు కళ్ళు అక్కడ ఆవిర్భవించగా చుట్టు పక్కల ఉన్న కచేరీలలోని సిబ్బంది, రోడ్డు మీద వెళ్తున్నోళ్ళు, సమవస్త్రం ధరించిన కాన్వెంటు పిల్లలు, బస్టాండ్‌లో దిగి పట్టణంలోకి ప్రవేశిస్తున్నోళ్ళు అందరూ అక్కడ జమైయ్యారు దృశ్యాన్ని చూసేందుకని.

పాము మరింతగా బెదిరింది.

తన దేహాన్ని లాగుకెళ్ళేది దానికి మతిమరుపై మరిక ఆ పాము చుట్లు చుట్లుగా చుట్టుకో బడసాగింది. దాని వంటికి అతుక్కొన్నదంతా మరింతగా బలపడి మరిక అది పాకుతూ వెళ్ళేందుకు అడ్డుపడగా ఎండవేడికి కరిగి ద్రవ రూపంలో

మారిన తారు మరింతగా దాని చర్మంకు అంటుకు పోయింది. ఇందు నుంచి పాముకు దిక్కుతోచక అటుఇటు పొర్లుతుంది.

కర్మ ధర్మ సంయోగం అన్నట్లుగా పాము ఇక్కడ తారులో ఉడుకుతుండగా చుట్టూ గుంపుకట్టి చేరిన జనం గమనానికి రానట్లుగా పెద్ద జీపు ఒకటి ఉపవిభాగం వద్దకొచ్చి ఆగి అందులో నుంచి సూటు బూటు ధరించిన సిబ్బంది ధడధడగా దిగి స్టోరు కీపర్ గదిలోకి జొరబడ్డారు.

ఇలా ధడధడగా దూసుకొచ్చిన తక్షణమే స్టోరు కీపరుకు ముందున్న ఫైళ్ళు, కొలత పుస్తకం, బిల్‌బుక్కు మొదలైనవాట్ని గుంజుకొని “మేము అవినీతి నిరోధక శాఖకు చెందిన వాళ్ళం...”అంటూ బిగ్గరగా పలికి తిప్పాజయ్య ఊపిరి ఆగిపోయేటట్లుగా చేసారు ఆ సిబ్బంది.

బయట అదేంటో పాము పాము అని జనం మాట్లాడు కొంటున్న దాన్ని విన్పించుకొన్న తిప్పాజయ్య బయటకు వెళ్ళి చూసి వద్దాం అనుకొంటున్న వేళలోనే ఈ దాడి జరిగింది.

అవినీతి నిరోధక శాఖ వారు తిప్పాజయ్య నోటి నుంచి మాట వచ్చేందుకు అవకాశం ఇవ్వలేదు.

ఇప్పటి వరకూ ఎంత మొత్తం తారు వచ్చింది లెక్క తెల్పండి అంటూ అందుకు సంబంధించిన ఫైలును స్టోరుకీపరైన తిప్పాజయ్యనుంచి గుంజుకొన్నారు.

ఏఏ ఇంజినీరు ఎంతెంతగా తారుకని ఇండెంట్ పెట్టాడో ఆ ఫైలు ఇవ్వండి...

ఇంజినీర్లు ఏయే రోడ్లను తారు నుంచి వేయించారో ఆ ఫైలు తీసుకొచ్చి చూపండి? ఏయే రోడ్లకు చెందిన ఎన్నెన్ని గుంతల్ని బాగుచేసారో ఆ లెక్కచూపండి? ఇందుకోసం అదెంత మొత్తంలో బిల్లు పెట్టారో దాన్ని చూపండి? ఆ ఇంజినీర్లు ఎవరు? వాళ్ళ పేర్లను ఇవ్వండి. తక్షణం వాళ్ళను ఇక్కడికి పిలవండి అన్నారు ఆ సిబ్బంది.

ఈ అవినీతి నిరోధక శాఖా సిబ్బంది పురసభ, గ్రామపంచాయితీలకు వెళ్ళి వాళ్ళు డాంబరు (తారు) ఎక్కడ్నుంచి కొనుగోలు చేసారు, ఎప్పుడు వాళ్ళు ఆయా రోడ్లకు తారు వేయించారు అనే సమాచారమంతా సేకరించుకొని వచ్చారు.

రేపు ఉప విభాగ పర్యవేక్షణలో ఉండే అన్ని రోడ్లను తనిఖి చేస్తామని వాళ్ళు చెప్పారు గట్టిగా.

కేవలం అరగంటలోనే అవినీతి నిరోదకశాఖా సిబ్బంది ఉపవిభాగం మీద దాడి చేసిన వార్త అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ముట్టి మరిక అక్కడుండే నౌకర్ల వర్గమంతా అప్రమత్తమైయ్యారు.

తిప్పాజయ్య అలాగే ఇతర ఇంజినీర్లు ఎంతో డబ్బు పోగుపరుచుకొంది తెల్సిన గుత్తేదార్లు, ఉపవిభాగంలో చిల్లిదమ్మిడి దొరకని ఇతర నౌకర్లు, పద్మావతి బాయి ఈ దాడి నుంచి సంతోషపడ్డారు.

"ఇక ఈ దుష్టులు తప్పించుకోలేరయ్యా... అన్నిటికి ఆధారాలు ఉన్నవి... వరిమాగాణి మడులుగా మారిన అన్ని రోడ్లు యథాస్థితిని తెలియజేస్తవి..." అంటూ ఉప్పొంగిపోయి చెప్పుకొంటుండగా, స్టోరుకీపరు గది ఎదురు పాము తారులో ఇరుక్కుపోయి పడరాని పాట్లు పడుతుంది ముందుకే కొనసాగి పోయింది.

దేహమంతా తారు పులుముకొని క్షణం క్షణంకూ ఈ తారు మాయలో ఇరుక్కుపోయిన పామును ఉత్తిగనే చూస్తూ నిలబడేది అక్షమ్యం అని అన్పించింది కొంత మందికి.

"అయ్యో! ఇది నాగుపాము" అని ఎవడో పాములోని జాతి గురించి కొత్తదొక సత్యాన్ని చాటాడు. నాగుపాము అని చెప్పిన తక్షణం పాము మీదున్న కరుణ, జాలి, దయ, ప్రీతి మరింతగా అధికమై పోసాగింది జనం హృదయాలలో.

"ఏమైనా చేసి దాన్ని రక్షించాలి"

"పామును బతికించుకోవాలి" అనే మాటలు వినబడసాగినవి.

అయితే ఎలా? ఎలా?

పాము తారుకు చెందిన ఒక ముద్దలో పడి పొర్లాటచేస్తుంది. దేహాన్ని లాగుతుంటే తల, తలను లాగుకొంటే తోక ఎక్కడెక్కడో తారు అంటుకుపోయి మరిక పాము బయటకు ప్రాకలేక విలవిలలాడుతుంది. తారు దశ నుంచి అక్కడక్కడ పడియున్న కసువుపుల్లలు, గొర్రె వెంట్రుకలు అన్నీ చేరి ఒక వలను దాని మీద విసిరినట్లుగా ఉంది అక్కడున్న స్థితి.

"కిరోసిన్‌నూనె తెచ్చి దాని దేహం మీద రాస్తే తారు కరిగి పోవచ్చు."

"దాని వంటి మీద అంటుకుపోయిన ఆకులు, కసువుపుల్లలు, కాగితం ముక్కలు తీసిపారేస్తే అది మరిక ఆరామంగా ఉండగలదు"

"అది భీతితో ఉందయ్యా"

"పాపం... అది బెదురుగొడ్డుగా ఉందయ్యా..." అనే మాటలు గుంపునుంచి వస్తున్నవి.

"ఔను! పామును ముట్టుకొనేవారు ఎవరు? పట్టుకుపోయేవారు ఎవరు? కిరోసిన్ నూనె పూసి పరిశుభ్రంగా కడిగేవారు ఎవరు?" అనే ప్రశ్నలు తేలుతూ వస్తున్నవి.

"పాముకు కోపం వచ్చినట్లుంది"

"పాము రేగి పడుతుంది"

"నాగుపాముకు ఈ కష్టాలన్నీ రాకూడదు"

గుంపు నుంచి ఒకటొకటే మాట వినబడసాగింది.

వాడెవడో ఒక బారు కర్ర తెచ్చి పాము వంటికి అతుక్కుపోయిన చెత్తా చెదారం తీసే ప్రయత్నం చేయసాగాడు. పాము బుస్సు అని పడగ ఎత్తింది. చుట్టూ చేరి నిలబడిన జనం మృత్యుదర్శనం అయినట్లుగా ఒక్కసారిగా గావుకేక పెట్టి వెనక్కి జరిగారు. అక్కడికి పోలీసులూ వచ్చారు. అగ్నిమాపక దళం వారూ వచ్చారు.

నిదానంగా చీకటి పడసాగింది.

❖ ❖ ❖

తమను బతిమాలేది, దండాలు దస్కాలు పెట్టేది ఏమి తమకు నచ్చవని అవినీతి నిరోధక దళం వాళ్ళు తిప్పాజయ్యా గారి బీరువాలో దాగియున్న అన్ని అఫిషియల్ రికార్డులను తీసుకొని తమ జీపులో పడేసుకొన్నారు. అలాగే జూనియర్ ఇంజినీరైన భైరప్ప, అసిస్టెంట్ ఇంజినీరైన రుద్రయ్యా, వర్క్ఇన్స్‌పెక్టరు అయిన దుబాషి చెన్నయ్యా, రహీమ్‌ఖాన్, భగవాన్, వెంకటాద్రి... లను పిల్చి వాళ్ళదగ్గరున్న ఫైళ్ళను, కొలత పుస్తకాల్ని, దినగూలి వేతనంకు చెందిన ఓచర్ బుక్‌ను జీపులో పడేసుకొన్నారు.

"మీరంతా రేపు ఉదయం ప్రవాసిమందిరం (ట్రావలర్స్ బంగళా)కు రావాలి" అనే ఆజ్ఞ జారీ చేసాడు అవినీతి నిరోధక శాఖ అధికారి.

"మీరు వచ్చి రేపు ఒక ప్రకటన ఇవ్వాలి... అలాగే మేము మీమీ పరిధిలో ఉన్న రోడ్లను తనిఖి చేస్తాం... ఏమి మాయ ఆట ఆడుతున్నారురో మీరు? ప్రభుత్వం సరఫరా చేసిన తారును వేరెచోట అమ్మి డబ్బు పోగుజేసుకొని... రోడ్లకు తారు వేయకనే... గుంతల్ని పూడ్చకనే దొంగబిల్లుల్ని సృష్టించారు కదా రాస్కెల్స్... చెట్లను నాటేటట్లుగా రోడ్డు మీద గుంతలు పడియున్నవి... తిన్న మెక్కిన ప్రభుత్వ సొమ్మును మేము సరిగానే మీ నుంచి కక్కిస్తాము..." అంటూ అధికారి ఒక గంటపాటు తన ముందు దోషులుగా నిలబడిన తిప్పాజయ్యా, భైరప్ప, రుద్రయ్యా, దుబాషి చెన్నయ్యా, రహీమ్‌ఖాన్, భగవాన్, వెంకటాద్రి మొదలైనోళ్ళను ఏక వచనం నుంచి బండ బూతులు తిట్టి వాళ్ళ ముఖం మీద ఊసాడు.

జీపు ట్రావలర్స్ బంగళా వైపు ముఖం పెట్టింది.

పాము చుట్టూ నిలబడినోళ్ళందరూ నిదానంగా వెళ్ళిపోయారు. నైట్‌వాచ్‌మన్ వచ్చి "వెళ్ళండి మహాశయులారా... దాని పాటికి దాన్ని వదిలేయండి" అంటూ జనంకు చెప్పి ఉపవిభాగంలోని కాంపౌండు గేటును లాగి బీగం తగిలించాడు.

అతను కూడా ఒక క్షణం పాము చెంత కొచ్చి దాని దురవస్థను చూసి "నువ్వెందుకు వచ్చి తారులో ఇరుక్కుపోయావు" అంటూ ఒక బీడి వెలిగించి సంపెంగ చెట్టు మొదలులో ఉన్న అరుగు మీద కూర్చుని బీడి తాగుతున్నాడు.

❖ ❖ ❖

అవినీతి నిరోధక శాఖ దళం నుంచి జరిగిన హఠాత్తుదాడిలో మొదటిగా బెదిరినోడు స్టోరు కీపరైన తిప్పాజయ్య కదా!

మూడు నాలుగు సంవత్సరాల క్రితం ట్రాన్స్‌ఫరై గుమాస్తాగా వచ్చిన తిప్పాజయ్యకు అతని కులంకు చెందినోడే అయిన డివిజన్ ఆఫీసు మేనేజర్ "ఒక పని చేయవయ్యా... ఉపవిభాగంలో స్టోరు కీపర్ వేకెన్సి ఖాళీగా ఉంది... నువ్వు అక్కడికి వెళ్ళి చార్జ్ తీసుకో" అన్నాడు.

"అక్కడికి వద్దు సార్... సిమెంటు, స్టీలు, కంకర, తారు అనే వాటి లెక్కల్ని నిరంతరంగా చూసుకోవాలి... ఏదైనా ఎక్కువ తక్కువ అయితే... చేతి నుంచి కట్టాలి" అంటూ తిప్పాజయ్య ఆ డ్యూటి వద్దేవద్దు అని హఠం చేసాడు.

"ఓయ్ మూర్ఖ శిఖామణి... స్టోర్ కీపర్ పోస్ట్ దొరుకుతది అంటే వేల రూపాయలు కుమ్మరించి దాన్ని పొందేందుకు సిద్దంగా ఉంటారు ఎందరో... నువ్వేంటయ్యా ఇలాగున మాట్లాడుతున్నావు? వెళ్ళు... నేను నిన్ను అక్కడికే తోలుతాను నా జాతోడివని భావించి..."అని చెప్పిందే గాకుండా అతడ్ని ఉపవిభాగం స్టోర్ కీపర్ పోస్ట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసాడు.

భయపడుతూ వచ్చి చేరిన ఇతను స్టోరులో ఉన్న సిమెంటు, స్టీలు, ఇనుము, తారు, పలుగులు, పారలు, గంపలు, పికాశి... మొదలైనవాట్ని చూసి భయపడ్డాడు. భయపడుతూ వాటన్నిట్ని తన వశంలోకి తీసుకొన్నాడు. గుత్తేదారులు సిమెంట్‌కని వచ్చారు.

ఏభై బస్తాలు ఇండెంట్ పెట్టి నలభై ఐదు బస్తాల్ని తీసుకెళ్ళారు.

"ఉండనీయండి సార్ ఐదు బస్తాలు" అన్నారు.

స్టీలు పట్టుకెళ్ళేటప్పుడూ ఇలాగే చేసారు. నాలుగు రాడ్లను ఇక్కడే వదిలివెళ్ళారు.

స్టోరులో ఉన్న అసిస్టెంట్ నుంచి తిప్పాజయ్య అంతా నేర్చుకొన్నాడు. గుత్తేదార్లూ నేర్పించారు. ఇంజినీర్లూ బోధన చేసారు. అక్కడున్న వ్యవస్థ నుంచి అన్ని పాఠాల్ని సులభంగానే నేర్చుకొన్నాడు. కొన్ని మాసాలలోనే అవినీతి విద్యలో ఆరితేరాడు తిప్పాజయ్య.

అతనూ డబ్బు పోగుజేసుకొంటున్నాడు. ఉపవిభాగంలో తన పైన ఉండే జూనియర్, అసిస్టెంట్ ఇంజినీర్లకు డబ్బు వారి వారి స్థాయి ప్రకారం ముట్ట జెప్పేవాడు.

ఈ తారు ప్రకరణం కూడా అందరి సహకారం నుంచే సమిష్ఠిగా జరుగుతుంది.

తిప్పాజయ్య కేంద్ర బిందువు అయినందున అతనివద్ద డబ్బు ఎక్కువగా పోగుబడింది.

భైరప్ప, రుద్రప్ప, దుబాషి చెన్నయ్య మొదలైనోళ్ళు ఒకొక సెక్షన్ చూసుకొంటున్నందున వారి వారి శక్తి సామర్థ్యం ప్రకారం వారు డబ్బు పోగు జేసుకొన్నారు.

అయితే అవినీతి నిరోధక శాఖ దళం వారు దాడి చేసినప్పుడు అందరూ ఒకటైయ్యారు. ఆ బృందానికి తిప్పాజయ్య నేతృత్వం వహించాడు.

"దొంగ భాడకోవులు... జాడ ఇవ్వకనే ఎకాఎకి దాడిచేసారు కదా" అని అతను గొణిగాడు.

"ఏదో దాన్ని విరుగుడు మంత్రంగా చేయాలి కదా సార్"

"చెయ్యాల్సిందే... ఉత్తిగనే కూర్చుంటే అయ్యేదిలేదు"

"మీరు మీమీ స్థాయిలో లాబీయింగ్ చేయండి... నేను నా లెవల్‌లో లాబి చేస్తాను... అందరూ ఒకింతగా డబ్బును బయటకు తీయండి... అంతా సరిగా జరుగుతది..." అంటూ తిప్పాజయ్య అందరికీ మార్గదర్శనం చేసాడు. ధైర్యం చెప్పాడు.

❖ ❖ ❖

ఆ రాత్రంతా ప్రవాసి మందిరలో ఉన్న ఫోన్ సతతంగా మోగింది. ముఖ్యమంత్రి గారి పి.ఎ. మాట్లాడాడు. జిల్లాకు చెందిన పార్లమెంట్ సదస్యులు ఢిల్లీ నుంచి 'హలో' అన్నారు. ఏడెనిమిది ఎం.ఎల్.ఎ.లు అవినీతి నిరోధక శాఖా అధికారి చెంత "చూడండిసార్... రుద్రప్ప మా కులపోడు.. భైరప్ప మా జాతోడు... ఏదో నామకేవాస్తేగా ఒక ఎంక్వైరి చేసి ఆ శాస్త్రంలో ఉన్న పనిని ముగించండి" అని నాజూకుగా స్థుతి మెత్తగా చెప్పారు.

పి.డబ్ల్యు.డికి చెందిన రిటైర్డ్ కార్యదర్శి అట, రిటైర్ట్ చీఫ్ ఇంజినీర్ అట, రిటైర్డ్ అండర్ సెక్రటరి అట... అందరూ ఈ దుష్టుల రక్షణకని మాట్లాడారు.

"చూద్దాంసార్... కేసు స్ట్రాంగ్‌గా ఉంది.... నా వెనుక ఉన్న సిబ్బంది అంతా ప్రామాణికులు.... చూద్దాంలే... చూద్దాం" అంటూ అవినీతి నిరోధక శాఖా అధికారి అందరికీ చెప్పి చెప్పి అలసి పోయాడు.

❖ ❖ ❖

ఉప విభాగ కఛేరి చెంత పాము తారులో ఇరుక్కుపోయిన వార్తను దినపత్రికలలో రిపోర్ట్ చేసేందుకని అక్కడికి వచ్చిన ఏడెనిమిది మంది పత్రికా

విలేఖర్లకు ఉపవిభాగంలోని లంచగొండుల మీద అవినీతి నిరోధక శాఖా దళం వారు దాడి చేసి పట్టుకొన్న వార్త గమనంకు వచ్చింది. ఈ ఏడెనిమిది పత్రికా విలేఖర్లు కొత్తగా వచ్చిన ఈ వార్తను కచితంగా తెల్సుకొనేందుకు తిప్పాజయ్య ఇంటికి, భైరప్ప రుద్రప్ప ఇళ్ళకూ మూకుమ్మడిగా దాడిచేసారు.

"అదేంటి వార్త?" అని 'గొందలం' దినపత్రికకు చెందిన గోవిందయ్య తిప్పాజయ్యను అడుగుతుండగా, తిప్పాజయ్య "ఓ అదా... అదొకపాము... తారులో" అంటూ నత్తినత్తిగా చెప్పసాగుతుంటే "ఆ వార్తను అటుండ నీయండి... అదేనండి యాంటికరప్షన్ వాళ్ళు మీ మీద, మీ సహభాగస్థుల మీద దాడిచేసారట కదా" అంటూ మాటను ముఖ్యవిషయంలోకి తెచ్చి తిప్పాజయ్యను నిలదీసి గట్టిగా అడిగాడు.

"అదింకా ఎంక్వైరి అవుతుంది... అదంతా ఉండేదే... వదలండి నన్ను... మీరు దాన్నంతా తలలో వేసుగోకండి... రేపు నేనే అన్ని వివరాల్ని మీకు ఇస్తాను" అంటూ ఎంతో అర్థగర్భితంగా సీనియర్ రాజకీయ వేత్తలాగ పలికాడు.

పట్టణంలో ఉన్న మిగిలిన పత్రికల వాళ్ళు జూనియర్, అసిస్టెంట్ ఇంజినీర్లను కల్సినా ఇదే విధంగా జవాబు పొందారు.

ఇందుచేత పత్రికలోళ్ళు పాము ప్రకరాణాన్ని రేపో ఎల్లుండో పత్రికలలో ప్రచురించేదానికి ముందస్తుగా స్థలం రిజర్వ్ చేసుకొని, ప్రస్తుతం తిప్పాజయ్య గారి ప్రకరణ పురాణంలోని వివరాలకని ఎదురు చూడసాగారు.

❖ ❖ ❖

అవినీతి నిరోధక శాఖా అధికారి ఇంజినీర్ల నుంచి స్టేట్‌మెంట్ పొంది, పి.డబ్ల్యు.డి. నుంచి రోడ్లుగా గుర్తించుకోబడిన అన్ని రోడ్లకు వెళ్ళి, రోడ్లకు ఎప్పుడు తారు వేసి నవీకరించింది, ఎప్పుడు గుంతల్ని పూడ్చి సరిజేసింది మొదలైన అన్ని వివరాల్ని చూసి సంగ్రహించుకొన్నాడు.

"ఇదేంటండి... దీన్ని రోడ్డు అని అంటారా... స్నానాలు చేసే రొచ్చు గదిలాగ ఉంది" అంటూ అక్కడా ఆ అధికారి రేగిపడ్డాడు.

వేశ్యావాటిక మీద పోలీసులు దాడి చేసినప్పుడు, వేశ్యలందరూ తలవంచి నిలబడినట్లుగా మన దుష్టభ్రష్ట సిబ్బంది కూడా అలాగే తలవాల్చి బూతు మాటల్ని పెద్ద సారు నుంచి ఘనంగా మీద పడేయించుకొన్నారు.

❖ ❖ ❖

మరునాడు సూర్యోదయమై సూర్యకిరణాలు పడుతుండగా ఆ పాము అక్కడే ఉంది. ఎలాగుందో అలాగే ఉంది. వాచ్‌మన్‌గేటు తీస్తుండగా బయట వేచియున్న

జనం లోపలకు దూసుకొొచ్చి పాము చుట్టూ గుంపు కట్టారు.

పాము తనలో ఉన్న చైతన్యాన్ని పోగొట్టుకొంది.

ఓడిపోయిన దానిలాగ ఒక వైపుకు తలవాల్చింది.

దాని దేహం మీదంతా తారు చుక్కలు దట్టంగా అంటుకుపోయి మిలమిల మెరిసే తారకలులాగ మెరుస్తున్నవి. నేల మీద పొర్లి వళ్ళును అటుఇటు లాక్కొన్నందున అక్కడక్కడ దాని దేహం నుంచి రక్తం కారుతుంది.

చుట్టూ చేరిన జనం దాని దుస్థితి చూసి "అయ్యయ్యో" అన్నారు. థుథుథు అని ఉమ్మి నమలసాగారు.

తొమ్మిది గంటలైంది అన్నప్పుడు పాముల్ని పట్టుకొనేదాన్లో నిపుణుడైన ఒక యువకుడు వచ్చాడు. అతని పేరు సదాశివయ్య అట.

"నేను ఇప్పటిదాకా నూట ఇరవై సర్పాల్ని పట్టుకొన్నాను" అంటూ అతను మీసాన్ని మెలితిప్పాడు.

"అరగంటలోపే పామును కాపాడుతాను" అంటూ చుట్టూ గుంపుకట్టి నిల్చినోళ్ళ ముఖాల్ని చూస్తూ పలికాడు.

సరసరా షర్ట్‌కున్న బారు చేతుల్ని మడుచుకొన్నాడు. తెచ్చిన కిరోసిన్ నూనె, ఒక బట్ట ముక్కను పట్టుకొని పాము చెంతకు చేరాడు. అంతలో అక్కడ కన్పించుకొన్న తిప్పాజయ్య "ఇదొక పుణ్యకార్యం చేసి పెట్టు మహానుభావా" అంటూ అతని చేతిలో నూరు రూపాయల నోటు ఒకటి పెట్టి అక్కడ్నుంచి మాయమైయ్యాడు.

ఆ యువకుడు సుతారంగా పాము తల పట్టుకొన్నాడు. నోరు తెరిచి కాటు వేయనట్లుగా రబ్బరు బ్యాండ్ వేసి టేపు చుట్టి బంధించాడు. తర్వాత పాము దేహంకు అంటుకొన్న మకిలునంతా (గడ్డి గాసం కాగితాల ముక్కలు అన్నిట్నీ) తీసిపారేసాడు. పామును సుభద్రంగా ఎత్తి తెచ్చి పచ్చగడ్డి మీద పడుకోబెట్టి దాని దేహంలో అతుక్కొన్న తారుకు కిరోసిన్‌నూనె పూసి మెల్లగా తారును తీయసాగాడు. పాము బాధతో అటు ఇటు కొట్టుకొంటుంది. నోరు విప్పి బుసగొట్టేందుకు ప్రయత్నించింది.

చుట్టూ గుంపుకట్టి నిలబడిన జనం ఈ చోద్యాన్ని చూస్తున్నారు.

ఆ యువకుడి ధైర్య స్థైర్యం వీళ్ళ నుంచి మెప్పుపొందింది.

"నాగు పాము జీవాన్ని నిలబెట్టేది అంటే అదెంతో పుణ్యకార్యం" అని వారు మాట్లాడుకోసాగారు.

❖ ❖ ❖

పదకొండు గంటలకు అవినీతి నిరోధక శాఖ వారి జీపు తిప్పాజయ్య ఉండే

గది వద్దకు వచ్చి నిలబడింది. దానిలోపల నుంచి అన్ని రికార్డులను, ఫైళ్ళను, ఓచర్ల బుక్కును, కొలతల పుస్తకాల్ని కిందకు దింపారు.

ఆఫీసు ముందు తిప్పాజయ్య, భైరప్ప, రుద్రయ్య, దుబాషి చెన్నయ్య, రహీమ్‌ఖాన్, భగవాన్, వెంకటాద్రి మొదలైన దుష్టులందరూ బారుగా నిలబడి ముసిముసి నవ్వుల్ని నవ్వు కొంటుండగా, అవినీతి నిరోధక శాఖా అధికారి, సిబ్బంది వర్గం జీపు ఎక్కి ఆత్మీయంగా టాటా బైబైచెప్పి వెళ్ళిపోయారు తమ నగరంకు.

ఉప విభాగం కచేరి బయట పాము చుట్టూ గుంపుకట్టి నిలబడియున్న జనం ముఖాల మీద నిరాశ అలుముకోసాగింది. ఆ యువకుడు పామును తారుకూపం నుంచి విముక్తం చేసాడు. అయితే పాముకు మరిక సత్తువ లేదు. అది నిదానం నిదానంగా ఆ యువకుడి చేతిలోనే ప్రాణం వదిలింది.

అక్కడ ఉన్నోళ్ళందరూ దాని అంత్యక్రియకు సహాయపడ్డారు. దాని నోటిలో బ్రిటిష్ కాలం నాటి రాగితో చేసిన ఒక చిల్లి దమ్మిడీని పెట్టారు. సంపెంగ చెట్టుకు కొంచెం దూరంలో దాన్ని పడుకోబెట్టి గడ్డి వేసి దహనం చేసారు.

అవినీతి నిరోధక శాఖా సిబ్బంది ఇక్కడ ఈ ఉప విభాగంలో అంతా సక్రమంగానే ఉందని చెప్పి వెళ్ళిపోయి నందున నిరాశ చెందిన పురజనులందరూ వచ్చి పాము దహనమౌతున్న చితి చెంత జమైయ్యారు.

దూరంగా నిలబడియున్న ఉపవిభాగంలో మేనేజరిణి అయిన పద్మావతిబాయి "పాపం... ఈ సర్పాన్ని సజీవంగా ఉంచేందుకు కుదరలేదా?" అంటూ బాధ పడింది.

నగరం నుంచి ప్రచురితమైయ్యే దిన పత్రికలలో ఉపవిభాగం మీద దాడి జరిగిందిగాని తారులో చిక్కుకు పోయి చనిపోయిన పాము గురించి గాని వార్త ప్రకటించబడలేదు, వెల్లడించబడలేదు బయట ప్రపంచంకు.

**మూలకథ రచనాకాలం : 2003**

# ముగ్గురు ముసలోళ్ళు... ఒక పాత భవనం

## 1

ఇప్పటికి కొన్ని సంవత్సరాల క్రితం ముంబైలో ఉండే కొన్ని పాత కట్టడాలు కూలిపోసాగినవి. బాంద్రా, బొరివిలి, శాంతాక్రజ్, జుహు, మలబార్ హిల్ మొదలైన చోట్ల నూరోనూటఏభై సంవత్సరాల నుంచి వాన, ఎండ, జోరు గాలి తట్టుకొని నిలబడిన మూడు నాలుగు ఐదు అంతస్తుల కట్టడాలలోని పునాదులు బలహీనమై కూలిపోసాగినవి. ఆ భవనాలలో నివసిస్తుండే బడుగు బలహీన వర్గాలకు చెందిన కూలీలు, కాటన్ మిల్లులలోని కార్మికులు, బి.ఇ.ఎస్.టి డ్రైవర్లు, ఆస్పత్రులలో పనులు చేసే నాలుగోస్థాయి నౌకర్లు, గూర్ఖాలు, ట్యాక్సీడ్రైవర్లు... నిర్గతికులై రోడ్డున పడ్డారు. కొంత మంది ప్రాణాల్ని కోల్పోయారు కూడాను.

అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం, ముంబై మహానగర పాలక సంస్థ సంయుక్తంగా ఒక కార్యక్రమం చేసుకొంది. కార్యక్రమం ఏమిటంటే ముంబైలో ఉండే అన్ని పాత భవనాల్ని (కట్టడాల్ని) ఒకసారి పరిశీలించేది, పూర్తిగా పాతబడిపోయి మరిక దానిలో జీవంలేదు అనే వాట్ని కూలగొట్టేది ఉందికదా!

ఇలాగని ఒక ఆజ్ఞ (జి.ఓ.) బయటకొచ్చింది. ఆ ఆజ్ఞను పాటించేందుకు అధికార్లు నౌకర్లు అత్యుత్సాహంగా దూసుకెళ్ళసాగారు.

ముంబైలో ఎన్నో పాత భవనాలు ఉన్నవి. ఈ భవనాలు బ్రిటిషోళ్ళపాలనను, దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని, హిందూ... ముస్లింల నడుమ జరిగిన గలాబాను, గుజరాతి... మరాఠీల నడుమ జరిగిన భాషాపరమైన కలహాన్ని, శివసేనలోని ఆర్భాటాన్ని చూసియున్నవి. చూసినా చూడనట్లుగా మౌనంగా నిలబడి పోయినవి.

ఈ అన్ని పాత భవనాలు మొదటగా బలపరీక్షకు లోబడినవి. నిర్మించబడిన సంవత్సరం, భవన నిర్మాణంకు వాడబడిన వస్తుసామాగ్రి, భవనంలోని ప్రస్తుత స్థితిగతి, వార్షిక నిర్వహణ, భవనంలోని గట్టిదనం... ఇలాగున పలుకోణాల నుంచి పరిశీలించిన ప్రభుత్వ అధికారులు కొన్ని భవనాలకు మినహాయింపు ఇచ్చారు. కొన్ని భవనాలలో ఉండే కాపురాల్ని ఖాళి చేయమని ఆజ్ఞ జారి చేసారు. భవనాలు ఖాళి అయితే సత్వరమే వాట్ని డిమాలిష్ చేయాలని ఆజ్ఞ చేసారు.

ఈ ఆదేశం (ఆజ్ఞ) బయటపడిందేచాలు, సగం ముంబై గలిబిలి అయ్యింది. తేనెతుట్టెకు రాయిపడినట్లుగా జనం చంచల మనస్కులైయ్యారు. అక్కడక్కడ ప్రతిభటన, సత్యాగ్రహం, ధరణి జరిగినవి. ఒకొక అంతస్తులో ఉండే పిచ్చుకగూళ్ళలాంటి అపార్ట్‌మెంటులలో ఉండే వందలాది కుటుంబాలు ఎక్కడికి వెళ్ళాలి, వెళ్ళి కొత్త చోట ఎలా నిలదొక్కుకోవాలి అనేది తెల్వక హైరాణా పడినవి.

గవర్నమెంట్ ఈ బడుగు జీవుల ప్రతిభటనకు 'నో' అంది. "మీరు ఏదాన్నైనా చేసుకోండి. పాత భవనాలు ఖాళీ అవ్వాలి, శీఘ్రమే కూలగొట్టేదుంది... వేరేదారి లేదు" అని ప్రభుత్వంనుంచి ఆదేశం బయటకొచ్చింది.

ప్రభుత్వం నుంచి డిమాలిష్ చేయబోయే సుడిలో చిక్కుకుపోయింది మాహీమ్‌లో ఉండే మాణిక్‌చంద్ సోహన్‌లాల్ వాడ.

మాహీమ్‌నుంచి కెడల్ రోడ్డు మూలకంగా ముందుకు సాగి వెళ్తుంటే నాలుగో మలుపు నుంచి ఎడంపక్కకు తిరిగితే సోహన్‌లాల్ గారి వాడ వస్తది. ఆ వాటిక అంటే సామాన్య అర్థంలో అది గృహం కాదు. నాలుగు అంతస్తులతో భారీగా ఉన్న వాటిక అది. సోహన్‌లాల్ వాడ అని పిలవబడుతుంది.

నాలుగు దిక్కులకు ముఖం పెట్టుకొని నిలబడిన ఈ వాడలో ఇరవై ఐదు × ఇరవై ఐదు పోర్షన్లతో కింద నూరు, పైన మళ్ళా నూరు, మూడో అంతస్తులో నూరు, నాలుగో అంతస్తులోనూ నూరు... ఇలాగున నాలుగువందల పోర్షన్లలో ఆ వాడ ఉంది. చౌకాకారంగా ఉన్న ఈ వాడలోని గ్రౌండ్‌లో ఒక ప్రాంగణం ఉంది. అక్కడే పాయిఖానా(కక్కసు)కు, స్నానంకు గదులు ఉన్నవి. కుళాయిలూ ఉన్నవి.

ఎప్పుడూ బేగంబజార్, జనరల్ బజార్, జుమ్మేరాత్ బజార్... లాగ లేకపోతే ఛత్రపతి శివాజి టెర్మినస్ లాగ గిజగిజలాడే జనంతో ఆ వాడ ఉంటది. అరుస్తుండే పిల్లలు, నీళ్ళకో మరేదానికో జగడం చేసుకొంటున్న మహిళలు, పలురకాల వస్తువుల్ని అమ్మేందుకని తెస్తుండే వ్యాపారులు, తలుపు చెంత కూర్చుని ఖళ్ ఖళ్ అంటూ దగ్గే గొణిగే వృద్ధులతో సోహన్‌లాల్ వాడ పగలు రాత్రి భేదం లేకనే ఎప్పుడూ కోలాహలంగా జాతరగా ఉండే నివాస గూడుగా గుర్తుంచుకోబడింది.

ఈ వాడ మీదా కార్పోరేషన్ అధికార్లు దాడి చేసారు. ఒక వైపు నుంచి వార్త అన్ని పోర్షన్లకూ ముట్టి, రాత్రి డ్యూటి ముగించుకొని వచ్చిన పురుషులు కట్టిన బట్టల్ని విప్పకనే హడావుడిగా బయటకొచ్చి నిలబడ్డారు. మహిళలు తాము చేయబోయే ఇంటి పనుల్ని మరిచారు. పిల్లలు హఠం చేసేది వదిలారు. వృద్ధులనుంచి దగ్గు మాయమైంది.

వచ్చిన అధికార బృందం వెనక సోహన్‌లాల్ గారి పుత్రుడైన పన్నాలాల్ వాడకు సంబంధించిన రికార్డులను ఫైళ్ళను పట్టుకుని తిరిగాడు. అధికార బృందం గోడలోని ఇటుకల వరుస మధ్య పెచ్చులూడి రాలిపడుతున్న సున్నం, బయటకే కనబడుతున్న స్లాబులోని ఇనపరాడ్లు, తుక్కుపట్టిన పోర్షన్లలోని ఇనుప తలుపులు, చెదలు పట్టిన కిటికీలు మొదలైనవాట్ని పరిశీలించింది. గోడమీద అక్కడక్కడ చిగురుతూ ఉన్న చెట్లనూ బృంద సభ్యులు గమనించారు. కుడివైపు ఉత్తర దిక్కులో ఉండే గోడమీద ఒక మర్రిచెట్టు బలంగా నేలకు ఊడలు పాకి నిలబడినదాన్ని కూడా వారు చూసారు నిశితంగా.

పైంట్ సున్నం కానరాని ఆ కట్టడం ఆ ప్రాంతంకంతా ఒక శాపగ్రస్త నివాసంలాగ నిలబడియుంది. ఆవాడలో ఉండే జనం కూడా అలాగే దురదృష్ట జనంగా గుర్తుంచుకోబడ్డారు. డబ్బావాలాలు, మెకానిక్‌లు, డ్రైవర్లు, క్లీనర్లు, బూట్‌పాలిష్ చేసేటోళ్ళు, వీధులలో కేకబెట్టూ అమ్మే చిరువ్యాపారులు, రైలు పోర్టర్లు... ఇలా వీరు ముంబై మహానగరాన్ని మోస్తూ సాకుతూ వచ్చిన దిగువ స్థాయి (బలహీన) వర్గంకు చెంది, ఆ వాడలో అధిక శాతంగా ఉన్నారు.

పోర్షన్లలో కాపురం ఉన్న కొంత మంది, డిమాలిషన్ స్క్వాడ్ అధికార్లు వెళ్ళిన చోటకు వీరూ వెళ్ళి, అధికార్లు ఆగిన చోట వీరూ ఆగి, అధికార్లు పరిశీలించిన అన్ని చోట్లా వీళ్ళూ పరిశీలనగా చూసి, మరిక అధికార్లు బయల్దేరి వెళ్ళుతుండగా వారి కార్లు, వ్యానుల వరకూ వీళ్ళూ వెళ్ళి వీడ్కోలు పలికి తిరిగి వాడలోకి వచ్చారు.

సోహన్‌లాల్ గారి పుత్రుడు వీళ్ళ వైపు కన్నెత్తి చూడకనే తన లక్జ్యురి కారు ఎక్కి తన పాటికి తను వెళ్ళిపోయాడు.

"ఏమిటట? ఏమిటట?" అని దగ్గుతున్న దాన్ని ఆపి తిరిగి పోర్షన్ల వైపుకు వెళ్తున్నోళ్ళను ఆపి అడిగారు అక్కడ అరుగు మీద కూర్చున్న ముసలోళ్ళ బృందంలో సభ్యులైన బాక్సర్ బస్తియాంవ, భయ్యా...

"ఏమని జవాబు ఇస్తారు... సిమెట్రి (క్రైస్తవ స్మశాన వాటిక)లో తొందరగా ఒక జాగా చూసుకోమని చెప్పారు" అన్నాడు బాక్సర్ బస్తియాంవకు కొడుకైన రొజారియో.

"చూసుకొన్నానులే వదిలేయ్ నీ మాటను... మైకెల్ చర్చి వెనుక ఉండే సిమెట్రిలో... ఒక జాగా చూసుకొన్నాను... అంతేకాదు బాంద్రాలో ఉండే ఫెర్నాండెజ్ గారి అంగడిలో అందంగా ఉన్న శవపెట్టెగనూ ముందస్తుగానే డబ్బు చెల్లించి బుక్ చేసుకొన్నాను... నీ గురించి నీ భవిష్యత్తు గురించి యోచన చెయ్యి ఇడియెట్... నీ

గురించి యోచించుకో" అంటున్న బాక్సర్ బస్తియాంవకు మళ్ళా దగ్గు వచ్చినందున అంతకే మాట ఆపి ఖళ్ ఖళ్న దగ్గసాగాడు.

గుంపుగుంపుగా నిల్చిన ఆ జనమంతా ఆ వాడలోని ఒకొక అంతస్తులో ఉండే పిచ్చుకగూళ్ళలాగ ఉండే పోర్షన్లలో మాయమైయ్యారు. వారందరికీ ఈ తండ్రి కొడుకుల జగడం కొత్తగా ఏమి అయ్యుండలేదు.

జనం బెదిరి తమ తమ గూళ్ళకు చేరుకొన్నా బస్తియాంవ నుంచి మాట ఆగలేదు. దగ్గి దగ్గి ఎగశ్వాసపైనే, దిగువ శ్వాస దిగువుకే అయ్యి గొంతులో ఇరుక్కొన్న కఫం బయటకు రాగా, దాన్ని పారుతున్న కాలువలో ఊసి మాట్లాడేందుకని జనాన్ని వెతికాడు బస్తియాంవ. అతనికి తోడుగా ఉండేవాడు పక్కనుండే భయ్యాకదా! భయ్యాకు బాక్సర్ లాగే సమవయస్సు. బాక్సర్‌కు ఉన్నట్లే దగ్గు ఉబ్బసం. తన కొడుకుకు చెందిన పోర్షన్‌లో ముందుండే అరుగుమీద బొంత పరుచుకొని అతను పడియుంటాడు.

"విన్నావా... సుపుత్రుడు పలికిన దాన్ని?" అంటూ బాక్సర్ భయ్యాను మాటలలోకి లాగాడు.

"వయస్సై మూలబడితే ఇలాగే కదా... ముడుచుకు పోయి ఏదో మూలలో కూర్చునే మనకు మాట్లాడే హక్కూ లేదు కదా" అన్నాడు భయ్యా విషాదంగా.

"అయినా..."

"అయినా గియనా అంటూ ఏమి ఉండదు... వాళ్ళ నుంచి ఏమేమి చెప్పించుకోవాలో దాన్నంతా మనం మరోమాట ఎత్తకనే వినేదుంది..." అన్నాడు భయ్యా.

బాక్సర్ మరియు భయ్యా... ఇద్దరూ ఒంటరిగానే ముంబైకు వచ్చారు. బాక్సర్ బస్తియాంవ హొన్నావరం (ఉత్తర కన్నడ జిల్లాలో ఉండే పట్టణం) నుంచి రాగా, భయ్యా ఆనంద్ పట్టణం (గుజరాత్) నుంచి వచ్చాడు.

ఎన్నో రోజుల ఉపవాసం వనవాసం తర్వాత బాక్సర్‌కు రైల్వేవర్క్‌షాపులో పని దొరికింది. భయ్యా తనకు తానే ఒక పని వెతుక్కొన్నాడు. అక్కడక్కడ గ్రామీణ సీమ నుంచి వచ్చే పాలుకొని రోడ్డు పక్కన ఒక కుంపటి పెట్టుకొని వేడి వేడి పాలు కాచి అమ్మే వృత్తిని చేసుకొన్నాడు.

బస్తియాంవ చేతికి నెలజీతం పోగుబడుతుండగా తక్షణమే అతనికి బాక్సింగ్ నేర్చుకోవాలని అన్పించింది. అతని దేహ దారుఢ్యం కూడా ఉక్కులాగ ఉంది. తొడలలో ఉండే స్నాయువులు (నరాలు) ఉబ్బి గెంతుతుండేవి. మాహీమ్ చెంతనుండే సిటిలైట్ టాకీసు పక్కన ఒక వ్యాయామశాల ఉంది. అక్కడ యువకులకు బాక్సింగ్

నేర్పుతుండేవారు. బస్తియాంవ ఈ శాలకు సాయంత్రం వేళ వెళ్ళసాగాడు.

సిటిలైట్ టాకీసుకు ముందుండే రోడ్డు పక్కన పెద్దదొక కడాయి పెట్టుకొని భయ్యా పాలను కాచేవాడు. దారిలో వెళ్తున్న జనం వేడివేడి పాలు తాగి వెళ్ళి పోతుండేవారు. ఉదయం నుంచి కట్టెబొగ్గులతో కాలుతున్న పాలు సాయంత్రం పొద్దుకు చిక్కబడి రుచికరంగా మార్పు చెందేది.

సాయంత్రం వ్యాయామ అభ్యాసం ముగించి బయటకొచ్చే బస్తియాంవ భయ్యా చెంత ఒక లోటా పాలు తాగి వెళ్తుండేవాడు.

అప్పటికింకా బస్తియాంవ పెళ్ళి చేసుకోలేదు. ఒక అద్దెకొంపనూ పొందలేదు. దాదర్‌కు సమీపానుండే బాందే వాగు చెంతనుండే బస్తీలో ఒక ఇరుకు గదిలో అతను ఉండేవాడు. ముంబైలో ముందస్తుగా బాడుగ ఇల్లు పొందకనే పెళ్ళి చేసుకోగూడదనే సత్యం అతనికి బాగా గుర్తుందిలే!

హొన్నావరంలో అమ్మనాయన కొడుకు జోడికని యువతిని వెతుకుతుంటే, ఇతను ఇక్కడ బాడుగ ఇల్లుకని వెతుకుతున్నాడు.

తొందరగానే అన్నట్లుగా మాహీమ్ చెంతనుండే కెడల్‌రోడ్డులో అతనికొక బాడుగ కొంప దొరికింది. ఇల్లు అంటే ముంబై భాషలో ఒక గూడు అండి. ఒకే గది, ఒకే తలుపు; ఒకే కిటికి; ఒక మూలలో స్నానం గది; వెనకెక్కడో కక్కసుగది.

సోహన్‌లాల్ వాడ అని ప్రఖ్యాతమైన ఆ నాలుగు వందల పోర్షన్ల మధ్య ఒక పోర్షన్ పొందేందుకని బాక్సర్ నాలుగు వందల రూపాయలు అడ్వాన్స్‌గా (పగడి) ఇచ్చాడు.

"ఇక్కడ కాపురం పెట్టేందుకు ఇల్లు దొరికింది... ఇక కష్టమేమి లేదు" అని అతను స్వగ్రామంకు ఉత్తరం రాసాడు.

ఇంత పొద్దుకే అతనికీ భయ్యాకు స్నేహం వృద్ధి చెందింది.

భయ్యా తనకు పెళ్ళైన విషయం, భార్య ఊరులో ఉన్న విషయం తెల్పి "తను చిన్నగూడు ఒక దాన్ని కాపురం పెట్టేందుకు వెతుకుతున్నాను" అని చెప్పాడు.

అప్పుడు బాక్సర్ సోహన్‌లాల్ వాడ గురించి చెప్పాడు.

"పగడి ఇస్తే అక్కడ పోర్షన్ (గూడు) దొరకొచ్చు" అన్నాడు బస్తియాంవ.

బాక్సర్ బస్తియాంవ స్వగ్రామంకు వెళ్ళి పెళ్ళి చేసుకొని భార్యను ముంబైకు వెంటేసుకొని వచ్చినప్పుడు, అతని పోర్షన్ పక్కనే భయ్యా పోర్షన్ పట్టుకొన్నాడు.

"బహుత్ అచ్ఛాహువా" అంటూ ఇద్దరూ సంతోషపడ్డారు.

ముంబైలో అద్దెకొంప పొందిన తక్షణమే భయ్యా స్వతంత్రంగా తన పాల వ్యాపారాన్ని ప్రారంభించాడు. సోహన్‌లాల్ వాడకు ఎదురులో ఉన్న డిసోజ గారి

పది మూరల జాగాను కిరాయికి పొంది ఒక పశువుల షెడ్డు కట్టాడు. రెండు ఆవుల్ని శ్రీమంతుల ఇళ్ళ ముంగిటకు తోలుకెళ్ళి అక్కడే పాలుపితికి పోసేది, తర్వాత పూర్వపు జాగాలో పాల వ్యాపారంతో పాటు దూద్‌పేడా, కోవా వ్యాపారాన్ని చేయసాగాడు.

అతని అర్ధాంగైన నిమ్మి (నిర్మల) ఎంతో బుద్ధివంత మహిళ. అలాగే గట్టిగా పోరాడే ధీమంతతనం ఉన్న మహిళ. వాడలో ఉండే ఇతర పోర్షన్ల మహిళలు పశువుల షెడ్డు నుంచి పేడ వాసన, ఉచ్చవాసన వస్తుందని తకరారు చేసినా వాళ్ళందరి నోళ్ళూ మూయించి పాలవ్యాపారాన్ని ముందుకే కొనసాగించింది భర్త నేతృత్వం నుంచి.

బాక్సర్ బస్తియాంవకు అర్ధాంగై వచ్చిన హొన్నావరంకు చెందిన మాడ్తా మొదట మొదట ముంబైలోని భాష, జనుల తీరుతెన్నులు, నడవడిక, అరుపులు కేకలు, క్షణం విశ్రాంతి పొందకనే జీవనం సాగిస్తుండేది మొదలైనవాట్ని విని చూసి బెదిరినా ఎంతో తొందరగానే ముంబై జీవితాన్ని వంట బట్టించుకొంది.

వాడలో ఉండే పోర్షన్ల ద్వారం చెంతకే మోసుకొచ్చి అమ్మేవాళ్ళు ఉదయంనుంచి సాయంత్రం వరకూ వస్తుండే వారు. బాజివాలా, పాపడ్‌వాలా, బ్రెడ్‌వాలా, కపడ్‌వాలా, ఐస్ క్రీం వాలా అంటూ వస్తున్నోళ్ళ పరిచయం మొదట మొదట ఆమెకు కలగలేదు.

అయితే కొన్ని రోజులకే ఈమె

"ఏయ్ బాజివాలా... బాజిలావ్ (బాజి తీసుకరా)..." అని పిల్చేది నేర్చుకొంది. నిదానంగా గీసిగీసి బేరం చేయసాగింది. బస్తియాంవే ఆశ్చర్యపడేలాగ హింది భాష మాట్లాడసాగింది.

భయ్యాకు భార్యైన నిమ్మి కూడా ఈమెకు మంచిగా శిక్షణ ఇచ్చింది. ఇప్పుడు మాడ్తానే మాహీమ్ బజారుకు వెళ్ళి కాయగూరలు చేపలు మాంసం తెచ్చుకొనేదాన్లో పరిణితురాలైంది.

బస్తియాంవ బాక్సింగ్ క్షేత్రంలోకి దుముకి అక్కడ మంచి పేరే గడించాడు. అది చాలదన్నట్లుగా సినిమాలలో ఫైటర్‌గా అభినయించాడు. మెహబూబ్ స్టూడియో, ఫిల్మిస్తాన్ స్టూడియోల పరిచయం అతనికి అయ్యింది.

అతను అభినయించిన చిత్రాలు సిటిలైట్, రీగల్ టాకీసులలో ప్రదర్శించబడి మరిక ఇతను ఫైటింగ్ స్టారుగా కీర్తించబడ్డాడు.

అతని అర్ధాంగి మాడ్తా భర్త జతగా చలన చిత్రం చూసేందుకు వెళ్ళి అతను చేసిన ఫైటింగ్ దృశాల్ని చూసి బెదిరింది. "అలా కొట్లాడితే పెనుగులాడితే దెబ్బలు తింటే మీకెవరికీ ఏమికాదా?" అంటూ భర్తను అడిగి అతని భుజాలు తొడలు తడిమి తడిమి చూసింది.

'అది సినిమానే మహారాణి... అక్కడ ఆ ఫైటింగ్ దృశ్యాలలో నిజం కన్నా అబద్ధమే జాస్తిగా ఉంటది... జనంకూ అదే కావాలి" అంటూ అతను భార్య ఎదురు చలనచిత్రాలలోని పోరాట దృశ్యాల నిజాన్ని తేటతెల్లం చేసాడు.

సోహన్‌లాల్ వాడ భయ్యా, బస్తియాంవ లాంటి బడుగు జీవులకు ఆశ్రయం ఇచ్చింది.

**2**

ముంబై మహానగరంలో వివిధ క్షేత్రాలలోని పలురంగాలలో శ్రమిస్తున్న ఎంతో దిగువస్థాయికి చెందిన కుటుంబాలోళ్ళు సోహన్‌లాల్ వాడలో సురక్షితంగా ఉన్నారు.

డాక్‌యార్డులో గుత్తేదారైన సోహన్‌లాల్ కెడల్ రోడ్డుకు సమీపాన గోదాంలాంటి పెద్ద కట్టడాన్ని కొనుగోలు చేసి దాన్ని కాపురంగా కుటుంబాలు నివసించేందుకు అనుకూలమయ్యేటట్లుగా ఒక వాడలాగ పరివర్తించాడు. ముంబై నగరంలో నివాసంగా ఉండే ఇళ్ళకు ఎంతో డిమ్యాండ్ ఉన్నందున కాపురం పెట్టి నివసించేందుకని వెతుకుతూ తిరుగుతున్న జనం ఈ వాడలో ఉండే వందలాది పోర్షన్లకు వచ్చి చేరుకొన్నారు. బ్రోకర్లు కూడా అక్కడిక్కడ తిరిగి బాడుగకు ఉండేవాళ్ళను వెతికి తెచ్చి వాళ్ళ నుంచి కమిషన్ పొందుతుండేవారు.

అన్ని రకాల వస్తువులను, బియ్యం, గోధుమలు మొదలైన ఆహార పదార్థాల్ని, తెచ్చి నింపబడుతుండే ఆ కట్టడం ఇప్పుడు సోహన్‌లాల్ కృషి నుంచి సోహన్‌లాల్‌వాడగా ప్రఖ్యాతమైంది. బాక్సర్ బస్తియాంవ, భయ్యా లాంటి వందలాది జనంకు ఇందు నుంచి అనుకూలమైంది.

మొదట మొదట సోహన్‌లాల్‌కు నిజంగానే ఈ గోదాంను కొనాలనే మనస్సులేదు. అయితే అతని వద్ద సబ్ కాంట్రాక్ట్ పొందిన చున్నిలాల్ ఎక్కడెక్కడో అప్పులు చేసినందున, ఇతనికీ అప్పు చెల్లించేది ఉన్నందున చున్నిలాల్ గారి గోదాం సోహన్‌లాల్ మెడకు హారంలాగ పడింది. ఈ గోదాం కట్టడం నాలుగు అంతస్తులలో ఉన్నా దానికొక సరైన వ్యవస్థ ఆకారం ఉండలేదు. దీన్నొక వాడగా పరివర్తించేందుకు మళ్ళా సోహన్‌లాల్ డబ్బు వ్యయం చేసాడు. అప్పుచేసాడు. కార్పోరేషన్ నుంచి అనుమతి పొందేందుకని తిరిగాడు.

ఇవన్నీ చేసి ముగించిన పిమ్మట అతనికి కొంచెం నెమ్మది అన్పించింది. ఎందుకంటే మాహీమ్, దాదర్, మాతుంగా, బాంద్రా... మొదలైన చోట్ల ఇంత పెద్ద నివాసవాడ మరొకటి లేదనే మాటా వినబడింది. సుమారుగా నాలుగు వందల కుటుంబాలకు ఆశ్రయం ఇచ్చానులే అని అతను ఉప్పొంగాడు.

కాలం గడుస్తుండగా సోహన్‌లాల్ ఆ వాడ మీద చేసిన ఋణం తీర్చాడు. ఈ వాడను కుదవ బెట్టి మళ్ళా ఋణం పొంది శివాజిపార్క్ చెంత అతను నివసిస్తున్న ఇంటిని కొత్తగా కట్టాడు. వాడలో ఉండే ఎంతోమంది నెల నెలా బాడుగ సరిగా ఇచ్చే పరిపాఠి చేసుగోకపోయినా తనకు నష్టం అయ్యిందని ఏనాడూ భావించలేదు. సంతానం ఇద్దరూ వ్యాపార లావాదేవీలలో మునిగియున్నారు. అక్కడ్నుంచి లాభమే వస్తుండేది. ఇందుచేత వాడలోని దైనందిన వ్యవహారాల మీద అతను అంతగా గమనం పెట్టలేదు. సండాసు పని చేయట్లేదు, నల్లా (కుళాయి) లో నీళ్ళు సరిగా రావట్లేదు అని వాడలో ఉండే బాడుగ జనమే తమకు తామే సరి జేయించు కొంటుండేవారు. కొంతమంది తాము ఉండే పోర్షన్లకు పైంట్ సున్నం డిస్టెంబర్ వేయించుకొనేవారు. కొంతమందైతే పోర్షన్లలో చేరిన నాటి నుంచి రంగులు వేయించుకోలేదు గోడలమీద.

ఇందుచేత సోహన్‌లాల్ వాడకు వేరేగా అయిన ఒక విశిష్టరూపం ఉంది. గోడలు గడపలకు రంగులు, అక్కడ ఆరేసేందుకు వేలాడదీసిన చీరలు, లంగాల రంగులు, సదా తిరుగుతుండే జనం, వాళ్ళ మాటలు, నడవడిక, చేస్తున్న తేలికపాటి వృత్తి పనులు, వాళ్ళవాళ్ళ వయస్సు, ప్రవర్తన అన్నీ ఆ వాడను వర్ణరంజితంగా చేసినవి.

అయితే బయటోళ్ళు ఈ వాడను తిరస్కారంగా తాత్సారంగా చూస్తుండేవారు. లేబర్ జనమే ఈ వాడలో ఉన్నారనేది ఒక కారణమైతే, పైంట్ సున్నం లేకుండా పాత కట్టడం ఇక్కడుంది అనేది మరో కారణంగా ఉంది. ఈ వాడలో ఉండే జనమంతా దాదాలు, పిక్‌పాకెట్‌గాళ్ళు, బ్లాక్ మార్కెట్టులో సరుకులు అమ్మేటోళ్ళు, చదువు సందెలు లేని జనం అని బయటోళ్ళ అభిప్రాయంగా ఉంది. అంతేగాకుండా అప్పుడప్పుడు వేరే చోట కొట్లాటలు, దాడులు జరిగితే పోలీసులు ఇక్కడికి విచారణకని వస్తుండేవారు.

సోహన్‌లాల్ వాడకు సమీపంలో ఉండే సింధి సమాజం, కొంకణి సమాజంలోని శ్రీమంత ఫ్యాట్ల జనం ఈ వాడను హమేషా ద్వేషిస్తుండేవారు.

ఇటువంటి సందర్భం సృష్టి గావింపబడి ఉండగా ముంబై నగరంలోని పాత కట్టడాలు కూలిపోసాగినవి. కొంత మంది దుర్మరణం చెందారు కదా. అందుచేత మేల్కొన్న ప్రభుత్వం పాతకట్టడాన్ని గుర్తించి, కాలం చెల్లిన కట్టడాల్ని కూల్చి వేసే కార్యంకు అనుమతి ఇచ్చింది. డిమాలిషన్ కమిటి వారు ఒక పర్యాయం సోహన్‌లాల్ వాడకూ వచ్చి వెళ్ళారు. కమిటి మెంబర్లు ఏమి చెప్పొచ్చు అనే దిగులు వాడలో ఉన్న అందర్నీ వేదించసాగింది.

అందర్నీ అనే దాని కన్నా వాడలో ఉన్న ముసలోళ్ళు ముసలమ్మలు ఎక్కువగా వేదన చెందారు.

గడిచిన ముప్పై నలబై ఏబై సంవత్సరాల నుంచి ఈ వాడలో బతుకుతూ వచ్చిన వీళ్ళు, ఇక ఈ ముదితనంలో ఎక్కడికి వెళ్ళేమయ్యా అని విచారించసాగారు.

వారసులు వేరే చోట కాపురాల్ని షిఫ్ట్ చేస్తారు. వాళ్ళతో పాటు వెళ్ళేది ఉంటదిలే. అయితే వారసులకు ఉన్న పళంగా వేరే చోట అద్దె కొంప దొరకాలికదా! ఎంతో ఎక్కువగా బాడుగ, ముంబైనుంచి ఎంతో దూరాన... కొన్ని అననుకూలాలతో ఉండే కొంప చిక్కితే అక్కడికి వెళ్ళేది ఉంటదా? స్కూలుకు మార్కెట్టుకు బస్‌స్టాప్‌కు ఆస్పత్రికి ఇక్కడ భలేగా సదుపాయం ఉంది. మరికొత్తచోట?

ఇలాగే యోచన చేసిన బస్తియాంవ తన కొడుకుతో... "ఏమిటట? ఏమిటట" అని అడిగింది, అందుకు వచ్చిన జవాబు పరమరోతగా ఉందిలే!

బస్తియాంవకు సుపుత్రుడైన రొజారియో తండ్రికి చెప్పిన జవాబు పెడసరిగా ఉందని అన్పించింది భయ్యాకు.

"ఎవరూ ఇక్కడ శాశ్వతంగా ఉండేది లేదులే... అందరూ ఎప్పుడో ఒకప్పుడు వెళ్ళిపోయే వారే... అయితే ఇలా తల బిరుసుతో చెప్పొచ్చా అతను!"

కొడుకు గురించి బస్తియాంవకు అనుమానం ఉన్నదైతే నిజం. ఇలాగ ఊహించే అతను ఒకింతగా డబ్బును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసాడు. సిమెట్రిలో రవ్వంత జాగా ఖననంకని ఖరీదించాడు. శవపెట్టెను ముందస్తుగానే బుక్ చేసుకొన్నాడు. తెలుపు వర్ణంతో ఉండే సూటు, షర్ట్, చేతి సంచి, బూట్లు, సెంట్ బాటిల్ అన్నీ ఖరీదించి కొంపలో పెట్టుకొన్నాడు ముందు చూపుతో.

తను ఏమైనా ముందస్తుగా ప్రణాళికల్ని చేసుకొన్నానా అని భయ్యా తనను తనే ప్రశ్నించుకొన్నాడు. తనకు అవన్నీ అవసరమయ్యేది లేదు. ఎందుకంటే తను హిందువును కదా! తలకొరివి పెట్టేటప్పుడు వంటి మీదున్న బట్టలన్నీ తీస్తారు కదా అని తనకు తనే చెప్పుకొన్నాడు.

అయితే తన సుపుత్రుడు మురళి కూడా రోజారియో లాగనే!

ఈ పుత్రుడి జననంకని తను ఏమేమి చేసాడు...

కొల్హాపురం, పండరీపురం, చివరగా దార్జలి దర్గా మొదలైన చోట్లకు వెళ్ళి అక్కడుండే దేవుళ్ళకు మొక్కి పొందాను కదా ఈ పుత్రుడ్ని!

అదేంటో బస్తియాంవడి కథకూడా తనలాగే ఉంది.

పెళ్ళైన ఎన్నో సంవత్సరాల తర్వాత అతనికి పుత్రుడు జనించాడు.

తామిద్దరం వారసుల్ని పై పోటి అన్నట్లుగా పెంచాం. దేనికీ కొరత చేయలేదు. రొజారియో, మురళి ఇద్దరూ బాంద్రాలో ఉండే ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు వెళ్ళి చదివారు. అదేంటో ఇద్దరూ ఎక్కువ చదువును పొందలేదు. ఇప్పుడు కెడల్ రోడ్డులో ఉండే 'కెంప్' అనే కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు.

బస్తియాంవ తన పుత్రుడికి వివాహం జరిపించాడు. మురళికీ యుక్త వయస్సులోనే తను పెళ్ళి చేసాడు.

తండ్రుల ఆలనపాలన విషయంలో ఆ ఇద్దరి ప్రవర్తన సరిగాలేదు.

బస్తియాంవకు ఉబ్బసం.

బాక్సింగ్‌లో మంచి పేరే గడించాడు. సుష్టుగా తినే దేహ దారుఢ్యాన్ని పెంపొందించుకొన్నాడు. వయస్సు దాటిన మీద వణిగిన చెఱుకు గడలాగ ఉన్నాడు.

మధుమేహం తనను పీడిస్తుంది. దానితో పాటు కొంచెం ఉబ్బసమూ ఉంది.

మరో విచిత్రం తమ మధ్య ఉంది ఏమిటంటే పది సంవత్సరాల క్రితం బస్తియాంవడి అర్ధాంగైన మాడ్తా ప్రభువు పాదంకు చేరుకొంది. ఇప్పటికి ఐదు సంవత్సరాల క్రితం తన అర్ధాంగైన నిర్మల వైకుంఠ వాసి అయ్యింది.

"భార్య ఒకతి తోడుగా ఉండుంటే మనకు ఇంత కష్టం అయ్యేది కాదు" అంటాడు బస్తియాంవ.

"మనం చనిపోయి వాళ్ళు బతికియుంటే వాళ్ళకూ ఇదేగతి అయ్యేదేమో.. వాళ్ళు పైకి పోయిందే మంచిదైందని భావించుకో" అని బస్తియాంవ నుంచి వచ్చిన మాటకు బదులు జవాబు చెప్పాడు భయ్యా.

వార్ధక్యం వలన భయ్యా తన వ్యాపారాన్ని ఆపేసాడు.

సోహన్‌లాల్ వాడలోని గ్రౌండ్ ఫ్లోర్‌లోని పదిహేనో నంబరు పోర్షన్ బాక్సర్ బస్తియాంవడి అయితే పదహారో నంబరు పోర్షన్ భయ్యాది. వీళ్ళిద్దరూ అరుగు మీదుండే మూడు అడుగుల జాగాలో తమతమ బొంతల్ని పరుచుకొని దాని మీద ప్రతిష్ఠాపన అయ్యేవారు. వీరి మధ్యలో గోడ ఒకటి తక్కువ ఎత్తులో ఉంది. మాట్లాడేందుకు, పరస్పరంగా చూసుకొనేందుకు ఏవిధమైన అడ్డులేదుకదా!

కబుర్లకైతే ఎన్నో విషయాలు వారిరువురి నడుమా వినియోగం అవుతుండేవి.

మరి ఇక ఏమి విషయం దొరకనట్లైతే, పరస్పరంగా సాంత్వనం (ఓదార్పు) చెప్పుకొనే విచారం ఉంటుండేది. ఇదే వీళ్ళిద్దర్ని దగ్గర దగ్గరకు తెచ్చింది. ఇంకా బతకాలి అనే ఛలం (పట్టుదల) వాళ్ళలో మెండుగా ఉంది.

## 3

సోహన్‌లాల్ వాడ చుట్టూ చీకటి ముసిరి అక్కడక్కడ కుక్కలు తిరుగుతూ మొరుగుతున్నవి. రాత్రివేళ డ్యూటి చేస్తుండేవారు ఆ చీకటిలోనే వాడ నుంచి బయటపడి తమతమ దారులను పట్టుకొంటుండేవారు.

రాత్రి పదిగంటలైంది అన్నప్పుడు ఖలందర్‌కు చెందిన ట్యాక్సి వచ్చి వాడవైపు ముఖం పెట్టి నిల్చింది. డిసోజాగారి జాగాలో ట్యాక్సి నిలబెట్టాడు ఖలందర్. గతంలో అక్కడ భయ్యాకు చెందిన ఆవుల కొట్టం ఉండేది. కొట్టం (షెడ్డు) తీసేసిన పిమ్మట డిసోజ గారు ఆజాగాను ఖలందర్‌కు నెలకు వందరూపాయల బాడుగకని ఇచ్చాడు.

ఖలందర్ ట్యాక్సీ మీద తాడప్రతి (టార్పాల్) కప్పి వాడలోకి వస్తూ...

"బాక్సర్ సాబ్... నిద్రపోతున్నారా?" అని ఎప్పటిలాగే సౌజన్యంగా అడిగాడు.

"ఎక్కడ వస్తది నిద్ర... సుఖంగా నిద్రపోయే కాలం మున్నెన్నడో వెళ్ళి పోయింది కదా" అన్నాడు బస్తియాంవ. ఏదో గుర్తుకు వచ్చినట్లుగా "విషయం తెల్సిందా మీకు?" అన్నాడు ఖలందర్.

"ఏంటి విషయం?" అని మధ్యలో నోరుపారేసాడు గోడకు ఆ వైపునుండే భయ్యా

"డిమాలిషన్ కమిటి వారు ఈవాడను డిమాలిష్ చేసేందుకని ఆజ్ఞ జారి చేసారట... ముందుగా ఇక్కడుండే కుటుంబాలన్నీ ఖాళి చేయాలట... తదుపరి డిమాలిషన్ అట..." అన్నాడు ఖలందర్.

"ఔనా...!"

"ఔను! కార్పోరేషన్ ఆఫీసుకు వెళ్ళినప్పుడు అక్కడ ఈ సమాచారం తెల్సింది నాకు" అన్నాడు ఖలందర్.

ఖలందర్ మెట్లు ఎక్కి వెళ్ళి పోయాడు. మూడో అంతస్తులో అతని పోర్షన్ ఉంది.

"అయిపోయింది... మన బతుకు" అంటూ ఉద్గరించాడు బస్తియాంవ.

"ఇన్ని కాపురాలకు ఎక్కడని బాడుగ కొంపలు దొరుకుతవి... ఎక్కడికని వెళ్తారు... ఏమి చేస్తారు..." అన్నాడు భయ్యా.

"గవర్నమెంట్ ఫలాన రోజు అని గడువు ఇస్తది... ఆ గడువు లోపు పోర్షన్లన్ని ఖాళీ అవ్వాలి... తర్వాత ఒక రోజు డిమాలిషన్ (కూల్చివేత) మొదలౌతది" అన్నాడు బస్తియాంవ.

ఆ కారు చీకటిలో కంటి చూపు కనబడక ఆ ఇద్దరూ ఏదో దాన్ని తడుముకోసాగారు.

సోహన్‌లాల్ వాడలో ఉన్న కొంత మంది ముందు చూపుతో గ్రేటర్ ముంబైలో ప్రభుత్వం అమ్మిన జాగాల్ని కొని ఇళ్ళు కట్టుకొన్నారు. కొంత మంది అపార్ట్‌మెంట్లను కొన్నారు. కొంతమంది ముంబై సహవాసం చాలని తమ స్వంత ఊళ్ళకు వెనుదిరిగారు. తామిద్దరం ఏమి చేసుకోలేదు కదా అని ఆ ఇద్దరూ మథన పడ్డారు. ఆనందలోనో హొన్నావరంలోనో తక్కువరేటుతో స్థలం కొని ఇల్లుకట్టే స్థోమత మొదట్లో వారిద్దరికీ ఉంది. అదీ చేయలేదు. ఇప్పుడు?

రాతంత్రా దగ్గుతూ కలవరిస్తూ వాళ్ళు కాలాన్ని నెట్టారు. వెలుగుపడి జనం చెంబు మగ్గు పట్టుకొని పాయిఖానాకని పోతున్నప్పుడు డిమాలిషన్ విషయమంతా బయటపడింది.

వందలాది కుటుంబాల్ని తన ఒడిలో పెట్టుకొన్న సోహన్‌లాల్ వాడ నిదానంగా కంపించి వాడలోని తన దురంతాన్ని (దుస్థితిని) అందరికీ తెలియజేసినట్లుగా కనబడింది.

అందరిలోనూ ఒకటే ప్రశ్న...

“ఎక్కడికని వెళ్ళేదుంది? ఎక్కడికని వెళ్ళేదుంది?”

వరుసగా ఉండే పోర్షన్‌లలోని కాపురాలకు ఒక విషయం కచితమైంది. తాముండే ఈ కట్టడంలో మరిక జీవం ఉండేది లేదని అందరూ భావించారు.

పై అంతస్తులో జనం తిరుగుతుంటే క్రిందుండే భీములు(దూలాలు) కదులుతుండేవి. కాంక్రీట్ రాలి పడుతుండేది. అక్కడక్కడ స్లాబులో ఉండే ఇనపరాడ్లు కనబడుతుండేవి. దీపావళి నాడు పిల్లలు టపాసులు కాల్చితే ఆ మోతకు మొత్తం కట్టడం కంపిస్తుండేది. వానాకాలంలో గోడలన్నీ బ్లాటింగ్ పేపర్ పీల్చుకొన్నట్లుగా చెమ్మపట్టి ఉంటుండేవి. వేగంగా వీసే గాలికి ఆ వాడ ఎగిరిపోతదేమో అన్నట్లుగా అన్పిస్తుండేది.

“ఇటువంటి కట్టడంలో ఉండేది అపాయమే.. డిమాలిషన్ కమిటి వారు దీన్ని కూల్చేది సరైన నిర్ణయమే...” అని ఆ కుటుంబాలోళ్ళు అనుకోసాగారు.

అయితే ఈ కుటుంబాలన్నీ ఎక్కడికి వెళ్ళేదుంది? ఇక్కడే ఉంటే మరొక గుజరాత్ భూకంపపీడితులు లాగ అయ్యేదుంది. కట్టడం కూలితే అవశేషాల క్రింద చిక్కుకు పోయిన కాపురాలోళ్ళెవరూ బతికి బట్టకట్టేది లేదు. ఇలా భావించితే మరిక వేరేదారి ఏమిటి? ఎక్కడుంది? అని అనుకోసాగారు.

వాడలో నివాసముంటున్న పోర్షన్లన్నిటికి కార్పోరేషన్ నుంచి నోటీస్ వచ్చింది. ఎవరు ఆ వేళ పోర్షన్లలో ఉండలేదో వాళ్ళ తలుపుల మీద నోటీస్ పత్రాన్ని అంటించారు. ప్రస్తుతం ఉన్న ఈ వాడను కూల్చివేసేది ఉన్నందున, పోర్షన్లలో ఉండే కాపురాల్ని

ఖాళి చేసి పలానా దినం లోపల వెళ్ళి పోవాలని ఆ నోటీస్ పత్రంలో రాయబడి ఉంది.

మాహీమ్, మాతుంగ, దాదర్‌లలో కొన్ని పాతకట్టడాల్ని డిమాలిష్ చేస్తున్న ఫోటోలు దినపత్రికలలో ప్రచురించబడగా, ఊగుతున్న ఈ కత్తి నుంచి మరిక తప్పించుకొనేది లేదని కుటుంబీకులకు కచితమైంది. పది తాపత్రయాలలో ఈదులాడుతుండగా ఇదొకటి పదకొండో తాపత్రయంగా వచ్చి చేరుకొందని ఆయా పోర్షన్లలోని జనం తల్లడిల్లారు.

ఒకటొకటిగా సోహన్‌లాల్ వాడనుంచి కాపురాలు ఖాళీ చేసి పోసాగినవి.

సూరణ్‌కర్ పోర్షన్ ఖాళీ చేసాడు. డబ్బావాలా శివశంకర్ పోర్షన్ ఖాళీ చేసాడు. డ్రైవరైన దామ్లె వాడ వదిలి వెళ్ళాడు. పైంటర్ పరాంజపె తన సామాన్లను వేరెక్కడికో తరలించాడు

నర్స్ వెరోనిక, కాంపౌండర్ అయిన ధురేకర్, బూటుపాలిష్ చేసే తిరువెంగడ, బ్యాండ్ మాస్టర్ గోవింద దామ్లె, ఓసి (మట్కా) బిడ్డరైన ఫెర్నాండెజ్ మొదలైనోళ్ళు వాడలో ఉన్న మిగిలిన కుటుంబాలకు టాటా బైబై చెప్పి ముంబైలోని విశాల జగత్తులో చెల్లా చెదురైయ్యారు. సోహన్‌లాల్‌కు క్రమపద్ధతిగా బాడుగ ఇవ్వకనే బాకిపడిన కొన్ని కుటుంబాలోళ్ళకు ఇదే సుసమయం అని చెప్పాపెట్టకుండా పోర్షన్లను ఖాళీ చేసారు.

ఇలా సోహన్‌లాల్‌వాడ ఖాళీ అవుతుండగా అరకొరగా మిగిలియున్న కుటుంబాలకు దిగులు కలగసాగింది. ఏదైనా అనాహుతం (ప్రమాదం) జరిగి కట్టడం కూలిపోతే తాము మాత్రమే చచ్చేది ఉందికదా అని భీతిల్లారు.

ఇలా భీతిల్లుతున్నోళ్ళలో బస్తియాంవడి కొడుకు రొజారియో, భయ్యా కొడుకు మురళి కూడా ఉన్నారు. వీళ్ళిద్దరూ ముగ్గురు నలుగురు బ్రోకర్లకు బాడుగ కొంప వెతకమని మొక్కారు. ఒకరిద్దరు బ్రోకర్లు బాడుగ ఇళ్ళను చూపెట్టారు. కంపెనీకి దూరం, బాడుగ ఎక్కువ, ఇల్లు పెద్దదిగా ఉంది అని వేరే వేరే కారణాల నుంచి ఆ కొంపల్ని వద్దనుకొన్నారు. వీళ్ళకు అద్దె కొంప దొరకలేదని మరిక కాలచక్రం దొర్లకుండా ఆగుతదేమి? నోటీసులో ఇచ్చిన మూడు నెలల కాలావధిలో రెండునెలలు గడిచిపోయినవి.

వేరే ఇల్లు దొరకలేదనే వ్యథ రొజారియోకు, మురళికి ఉన్నట్లుగానే బస్తియాంవకు, భయ్యాకు ఉంది. అయితే దాని మీద తాము ఏమి చేయలేము అనే నిస్సహాయ స్థితి వాళ్ళకు గుర్తుంది. ఎక్కువంటే వాడకు వస్తుండే బ్రోకర్లను ఆపి ఈ వృద్ధులు మాట్లాడించేవారు.

"ఔనయ్యా... మా పని జరగలేదుకదా..." అని తమలోని వ్యథను తోడుకొంటున్నారు.

"ఇక్కడే ఈవాడకు సమీపంలోనే... ఎక్కడైనా ఉంటే చూపండయ్యా" అని చెపుతున్నారు.

"మేమైతే ఉత్తిగనే కూర్చోలేదు... మేము చూపించింది మీ పుత్రుల మనోభావంకు నచ్చట్లేదు" అని చెపుతున్నారు బ్రోకర్లు.

"బాడుగ కొంప కూడా మా అనుకూలంకు తగినట్లే ఉండాలి కాదా? వచ్చే జీతాన్నంతా బాడుగకని పోస్తే మరిక ఇల్లు గడిచేది ఎలా?" అంటూ ఆ ఇద్దరు ముసలోళ్ళు పుత్రుల పరంగా నిలబడి మాట్లాడుతున్నారు.

"చూద్దాం...అలాగే చూద్దాం..." అని జవాబు చెప్పి బ్రోకర్లు వెళ్ళిపోతుండేవారు.

ఈ వృద్ధులిద్దరి పరిస్థితి రోజు నుంచి రోజుకు దిగజారి పోసాగింది. మొదట్లో వాడలో పోర్షన్లకు ఉండే అరుగే వాళ్ళ ప్రపంచంగా ఉండేది. అరుగు మీద పరిచిన బొంత వదిలి వాళ్ళు దిగుతుండేది లేదు. సినిమాలలో ఏవేవో పనుల్ని చేసిన బస్తియాంవ ఇప్పుడు నిలబడలేక, నిల్చినా నడవలేక ఇబ్బంది పడుతున్నాడు. ఎప్పుడూ దగ్గు అతడ్ని వేదిస్తుంది. భయ్యా కూడా నలిగాడు. జర్సీ ఆవులను తోలుకొని వెళ్ళి నాలుగు మార్వాడి ఇళ్ళ ముందు పాలుపితికి పోసివస్తుండే అతను ఇప్పుడు కోడలి దురుసు స్వరంకు బెదిరిపోయే స్థితికి చేరుకొన్నాడు.

పుత్రుడికి, కోడలకు, మనమ సంతానంకు తను భారమైయ్యాను అనే భావన వాడలోని పలుపోర్షన్లలో ఉండే వృద్ధ జనం (ముసలోడు ముసలమ్మ)కు ఉన్నట్లుగానే వీరిద్దరిలో అదే భావన ఉంది. ఈ భావనను అరిగించుకొంటూ వాళ్ళు బతికే ప్రయత్నాన్ని చేసారు. తమకున్న ఇప్పటి పరిస్థితి మరింతగా దిగజారేది వద్దని ఆ ఇద్దరూ విచార మంథనం చేసుకొంటుండేవారు.

ఈ మధ్యలో మాహీమ్ చర్చి వెనక సోనాలివాడలో ఒక పోర్షను భయ్యాకొడుకైన మురళికి దొరికినందున అతను సోహన్‌లాల్ వాడనుంచి అక్కడికి స్తళాంతరమైయ్యే గడబిడలో ఉన్నాడు.

భయ్యా మరిక దూరంకు వెళ్తున్నాడనే వేదన బస్తియాంవను పీడించసాగింది. సుమారు ఎన్నో దశాబ్దాల పాటు స్నేహం వారిరువురిలో ఉంది. ఇప్పుడిప్పుడు భయ్యా మరింత చేరువైయ్యాడు. కొడుకు కోడలు ఏదేదో కారణంకు తనను మాటల శూలంతో గుచ్చినప్పుడల్లా భయ్యా "జిందగి అంటే ఇదే బస్తూ... మనం అన్నిట్నీ సహించుకోవాలి' అంటూ తత్వబోధ చేసేవాడు.

విచిత్రం ఏమిటని అంటే ఇదే విధమైన మాటల్ని పలికే సందర్భం బస్తియాంవ నుంచి వస్తుండేది.

"బాక్సింగ్ కదనంలో కుడి చేతిని నా రక్షణకని పెట్టుకొని ఎడం చేతి నుంచే ఎదురున్న యోధుడ్ని కొట్టుతుండేవాడ్ని... అలాగే మన రక్షణ మనకు ముఖ్యం... ఎదురున్న యోధుడు ఎంతగా బలశాలిగా ఉన్నా ఉండనీ... మనం మాత్రం ఓడిపోరాదు..." అంటుండేవాడు బస్తియాంవ.

ఇలా పరస్పరంగా మద్దతుకని నిలబడుతుండే తాము మరిక దూరంగా అయ్యేదెందుకు అని ఇద్దరూ చింతిస్తుండేవారు.

మురళి తన పోర్షన్ ఖాళి చేసాడు.

అతని ఇంటిసామాన్లైన పాత్రలు, పరుపులు, మంచం, బొంత మొదలైన వన్నీ టెంపో మీద చేరినవి. ఆటోలో మురళి తన భార్య, తండ్రి, పిల్లల్ని ఎక్కించుకొని బయల్దేరాడు. ఎంతో దూరమేమి కాదు. సిటిలైట్ సినిమా టాకీసు చెంతనుండే కిరస్తానుల చర్చికి సమీపానే సోనాలివాడ ఉంది.

భయ్యా ఎక్కిన ఆటో కనుమరుగైయ్యే వరకూ బస్తియాంవ కంటి రెప్పకొట్టకనే చూస్తూ కూర్చున్నాడు. ఆ తర్వాత అదెందుకో దగ్గు దూసుకొచ్చింది. గుండెలో ఉండే నరాలన్ని చిట్లి పోయినట్లుగా దగ్గు, కళ్ళలో నీళ్ళు, ఎదలో నెప్పి... ఊపిరి పీల్చేందుకు హైరాణా...

"ఇతనికి ఏమైంది" అని కోడలు వచ్చి చూసి వెళ్ళింది గ్లాసుడు నీళ్ళు ఇవ్వకనే...!

"దేముడా" అని బాక్సర్ తనను తనే ఊరడించుకొన్నాడు.

## 4

ఇప్పుడు సోహన్‌లాల్ వాడ చుట్టూ మౌనం కమ్మింది. ఎన్నో పోర్షన్ల జనం ఖాళి చేసారు. వచ్చేవాళ్ళు వెళ్ళే వాళ్ళ సంఖ్య, పిచ్చాపాటిగా మాట్లాడేవాళ్ళ సంఖ్య బాగా తగ్గిపోయింది. పిల్లల ఆకలి ఏడుపులు, వృద్ధుల దగ్గు, మరెవరివో అరుపులు పెడబొబ్బలు తిట్లు వినబడటలేదు కదా! సోహన్‌లాల్ వాడకు నిత్యం బ్రెడ్డు, కాయగూరలు, ఉప్పు, చింతపండు, మిర్చి, ఐస్‌క్రీం మొదలైన వాట్ని అమ్మేందుకని వచ్చేవాళ్ళ సంఖ్య తగ్గిపోయింది. స్టౌవ్‌రిపేరు, ఎలక్ట్రిక్ రిపేరు, టివి రిపేరు అని అరిచేవాళ్ళు కనబడట్లేదు. వారంలో ఒక రోజు ఠంచనుగా వస్తుండే భిక్షకులూ తాము వచ్చి భిక్ష పొందేదాన్ని నిల్పేసారు. కుక్కలు పిల్లులు వాడవైపు కన్నెత్తి చూడట్లేదు.

ఈ విచిత్ర పరిస్థితి నుంచి బాక్సర్ బస్తియాంవడు మరింత కంగారయ్యాడు. ఎడారిలో దారి తప్పిపోయి నోడిలాగ అతను ఉన్నాడు.

రొజారియోకు ఈ వాడను వదిలేయాల్సిందే అని అన్పించింది.

ప్రభుత్వం ఇచ్చిన కాలావధిలోని రోజు దగ్గర పడసాగింది.

చివరికి విసుగు చెందిన రొజారియో మాహీమ్‌క్రీక్ చెంత ఒక కొంప పట్టుకొన్నాడు. ఒంటరిఇల్లు. రేకుల షెడ్డు. పూర్వం ఏదో ఫ్యాక్టరీగా అది ఉంది. అది మూతబడగా నివాసంకు యోగ్యమన్నట్లుగా దాన్ని మార్చారు. వెనకేమో అరేబియా సముద్రం... ముందేమో కెడల్ రోడ్డు. వెనకనుంచి సముద్రంలోని ఘోష... ముందు నుంచి వాహనాల రోద. ఈ ఇంటికి వరండాగాని, అరుగుగాని లేదు. బస్తియాంవడి బొంత లోపలున్న పెద్ద గదిలో పడేసారు. బస్తియాంకు మొదటిరోజే పిరిపిరి (చిరాకు)గా అయ్యింది. అయితే వేరే దారిలేదా?

ఇక సోహన్‌లాల్ వాడ పూర్తిగా ఖాళీ అయ్యింది.

ఇక దాన్ని డిమాలిష్ చేయండి అంది ప్రభుత్వం.

ఈ పనిని దగ్గరుండి జరిపించాల్సినోడు సోహన్‌లాల్‌కదా! అతనికీ వయస్సైంది. ఇదర్దు కొడుకులు మంచి బిజినెస్సులోనే ఉన్నారు. వాళ్ళకు మొదట్నుంచి ఈ వాడ మీద కన్ను ఉంది.

“పితాజి... ఈ మొత్తం ఏరియాకు ఇదొక దిష్టిబొమ్మలాగ నిలబడింది. వాడను కూలగొట్టండి...’ అని చెపుతుండేవాడు పెద్దకొడుకైన పన్నాలాల్.

“ఔనయ్యా... దాన్ని కూలగొట్టి అక్కడ మరేమి చేస్తావు నువ్వు?” అడిగాడు సోహన్‌లాల్.

“పితాజి... అక్కడ ఒక మంచి రిసార్ట్ కట్టొచ్చు... టూరిజం డిపార్ట్‌మెంట్ నుంచి ఋణం తీసుకొంటే నాలుగు సంవత్సరాలలోనే ఋణం తీరిపోతది” అన్నాడు పన్నాలాల్.

“రిసార్ట్ ఎందుకు? మనమే ఒక కలాశాల ప్రారంభించుదాం... హైస్కూలు, కలాశాల, ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, పాలిటెక్నిక్ మొదలైన వాట్ని తెరిచితే ఒకే సంవత్సరంలో బోలెడంత డబ్బు వస్తది” అన్నాడు సోహన్‌లాల్ చిన్న కొడుకు.

కొడుకులిద్దరూ ఈ మాట పలికింది ఎంతో వెనకటి కాలం నాడు... ముంబైలో కట్టడాలు కూలిపోక ముందే...

ఇప్పుడు పాత భవనాలు కూలిపోతున్నందున డిమాలిషన్ కమిటి వారి కార్యాచరణ పథకం కొనసాగుతుండగా ఆ ఇద్దరు కొడుకులూ ఉత్సాహంగా తిరుగుతున్నదాన్ని చూసిన సోహన్‌లాల్ “చూడండి పుత్రులారా... తొందరపడకండి... ఆ కట్టడం ఇకనూ దృఢంగానే ఉంది. అక్కడిక్కడ కొంచెం రిపేరు చేయిస్తే మళ్ళా

నూరు సంవత్సరాలు నిలబడుతది. ఏదో నాలుగు వందల కుటుంబాలకు ఆశ్రయ తాణంగా అది ఉంది. కొంత మంది బాడుగ ఇస్తున్నారు. కొందరు ఇవ్వట్లేదు. నేను ఎంతో మంది దగ్గర పగడికూడా తీసుకోలేదు. అయినా దాని మీద నేను కురిపించిన డబ్బు వడ్డీతో సహా వచ్చింది... దాన్ని అలాగే ఉండనీయండి... అంత మందికి దాన్నుంచి మేలు కలగనీయండి... పాపం ఆ లేబర్ జనం ఎక్కడికి వెళ్ళగలరు...” అన్నాడు దయామయుడైన సోహన్‌లాల్.

అయితే అతని సుపుత్రులు తండ్రి మాటను వినలేదు.

సోహన్‌లాల్ పెద్ద కొడుకైన పన్నాలాల్ తమ్ముడి చెంత మాట్లాడి... ముందుగా పోర్షన్లలోని జనాన్ని ఖాళి చేయించేది, తర్వాత డిమాలిషన్... అటు తర్వాత చూద్దాం మన ప్రణాళికల్ని... అన్నాడు.

అతనే స్వయంగా డిమాలిషన్ కమిటి వారిని కలిసాడు. వారందరి చేతులకు రెండు మూడు వేల రూపాయలు ముట్టించాడు. వాళ్ళు కట్టడాన్ని పరిశీలించే శాస్త్రంలోని తంతు ముగించారు.

సోహన్‌లాల్ గారి పుత్రుల మనోభిష్ట ప్రకారం వాడ ఖాళి అయ్యింది.

ఇక వాడను కూలగొట్టే దాన్లో సోహన్‌లాల్ కుమారులకు ఉన్న ఆసక్తి, వేరే వాళ్ళెవరికీ దాని మీద ఆసక్తి లేదు కదా!

ప్రభుత్వంకు, కార్పోరేషన్‌కు, డిమాలిష్ కమిటి వారికి ముంబై మహానగరంలో ఇదొకటే ముఖ్య కార్యంగా ఉంది లేదుకదా...! అంతే గాకుండా సర్కారు మరియు సార్వజనికుల జ్ఞాపకశక్తి దుర్బలం అని సమాజ శాస్త్రజ్ఞులు చెపుతుంటారు. ఎన్నెన్నో కొత్త విషయాలు, జ్వలంత సమస్యలు తలెత్తుతుండగా పాత విషయాలు మరుగున పడిపోతుంటవి.

ఇందుచేత సోహన్‌లాల్ వాడలోని డిమాలిషన్ విషయం కొంచెం వెనుకబడింది. ఇదే సమయంలో సోహన్‌లాల్ తన కట్టడంకు ఇంకా వంద సంవత్సరాలు కూడా నిండలేదని దాఖలా పత్రం ఒకదాన్ని వెతికి కోర్టులో దావావేసాడు.

సోహన్‌లాల్ వాడ ఆ ప్రదేశంలో నిర్జనమై ఒక శాశ్వత కట్టడం అన్నట్లుగా అలాగే నిలబడి ఉంది.

ఇందునుంచి ఉగ్రులైన సోహన్‌లాల్ ఇద్దరు పుత్రులు, వారిరువురి కల్పనలు, విచారాలు కార్యరూపం దాల్చనందుకు నాయనే కారణకర్త అయ్యాడని భావించి భార్యల సమేతంగా ఆ వృద్ధ సేఠ్‌జీని వివిధ రీతులలో హింసించసాగారు.

❖ ❖ ❖

భయ్యా సోనాలివాడలో ఇమడలేక పోతున్నాడు.

బాక్సర్ బస్తియాంవ పుత్రుడైన రొజారియో జతగా ఉండలేను అని నిర్ణయించుకొన్నాడు.

మొన్న సోహన్‌లాల్ తన బట్టల మూట మరియు బూరుగదూది పరుపు పట్టుకొని తన పేరున ఉన్న వాడలోని ఇనపగేటును నెట్టి లోపలకు చేరుకొన్నప్పుడు అక్కడెవరో దగ్గుతూ ఆయాస పడుతూ మధ్య మధ్య ఏవేవో మాట్లాడుకొంటున్నారు.

బొంతల్ని రెండు పోర్షన్ల కుండే అరుగుమీద పరుచుకొన్నారు. అక్కడ బట్టల్ని ఆరేసారు. బస్తియాంవ కిరోసిన్ స్టవ్ వెలిగించాడు. భయ్యా చపాతీలను ఒత్తుతున్నాడు.

"అరె భయ్యా... అరె బాక్సర్... మీరు ఇక్కడే ఉన్నారేంటి... నేనూ వచ్చానులే" అని చెప్తూ సోహన్‌లాల్ వాళ్ళ జతగా చేరుకొన్నాడు.

❖ ❖ ❖

వాడ వెనకటిలాగ లేదు. అయితే పూర్తిగా కళాహీనంగానూ అది లేదు.

ఆ కట్టడంలో దగ్గే, విలవిలలాడే, మాట్లాడే, నవ్వే ముగ్గురు ముసలోళ్ళంటూ ఉన్నారులే! ఈ కారణం నుంచే అది చుట్టు ప్రక్కలోళ్ళ గమనాన్ని లాక్కొంటుంది. ఎక్కడైనా కానీయండి జనం ఉన్నారు అంటే ఆ స్థలానికి వేరేదేదో అయిన సొగసు వస్తది. ఘనత వస్తది. కాదా చెప్పండి మీరు? ఒక వేళ మీరు ఎప్పుడైనా కెడల్ రోడ్డు వైపు వెళ్తుంటే ఆ కట్టడాన్ని చూడొచ్చండి.

**మూలకథ రచనా కాలం : 2008**

# దిష్టి అవ్వ – బెణుకు అవ్వ

శివసాగరంలో మరిసంతాన అని అడిగితే ఎవరికీ తెలవదు. ఏదో కొత్తపేరు విన్నట్లుగా జనం ముఖం ముఖం చూసుకొంటారు. మరిసంతాన అనే బదులు దిష్టిఅవ్వ అనో లేక బెణుకు అవ్వ అనో అడిగితేనే 'ఆ... ఆ... గుర్తుండి' అని అంటారు.

మూడు నెలల క్రితం హొన్నావరం నుంచి వచ్చిన ఒకామె 'మరిసంతాన' ఇల్లు ఎక్కడ అని వెతుకుతూ జోసఫ్‌నగర, ఫాతిమానగర అంతా వెతికి వేసారి "బాందేహళ్ళద హసిమడ్లు కూతురు... ఇక్కడి వాడైన కైతాన్ సోజర్‌ను పెళ్ళాడిన ఆమె. పొట్టిగా, ఎర్రగా, ఉంగరాల జుట్టావిడ" అని ఆ వచ్చినావిడ ఎంత మొత్తుకున్నా జనానికి ఆమె ఎవరు అని తెలవనే లేదు. చివరిగా "ఆవిడ మామ గ్రెగరి సోజరు బెణుకులకు నూనెరాసి మర్ధనం చేసేవారు" అని చెప్పగానే "ఓ... మా దిష్టి అవ్వనా... బెణుకు అవ్వనా" అని నిట్టూర్పులు వదిలి ఆవిడ ఇల్లును చూపించారు ఆ వచ్చినామెకు.

బారసాలప్పుడు ఫాదర్ పెట్టిన పేరు మాసిపోయి వేరే పేరు మూలంగా 'మరిసంతాన' దిష్టి అవ్వగా జనప్రియం అయ్యింది.

"పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు, కొత్తగా పెళ్ళైన దంపతులకు, పదిమంది జనం నోళ్ళనుంచి పొగడ్తలు పొందేంత పనులు చేసిన వాళ్ళకు జనం దిష్టి తగుల్తది" అనేది ఈ ప్రాంతంలో ఒక నమ్మకంగా చెలామణి అయ్యింది. చేయి – కాలు సుస్తైంది, నడుం పట్టేసింది... అని అనగానే తక్షణమే దిష్టి అవ్వనుంచి దిష్టి తీయించుకొంటే లేదా నూనెమర్ధనం చేయించుకొంటే సరిపోతది అని జనం చెపుతారు. ఎవరైనా మెడ పట్టేసింది లేదా చేయి, కాలు, నడుం నెప్పుట్టుతున్నవి అని అనగానే దీనికి "అవ్వ దగ్గర రెండు రోజులు నూనెతో తోమించుకోండి, బాగవుతది. బెణుకుకు వేరే ఔషధం లేనే లేదు" అని అంటుంటారు.

ఈ విషయం నుంచే శివసాగరంలోని ఫాతిమానగర్, టౌనులోని మేన్‌బజారు, బ్రాహ్మణ వీధి, లింగాయుతుల బజారు, షెట్టి జనాంగం ఉండే వీధి, వినోబానగర్, జయప్రకాశ్ నగర్... ఇంకా ఇతర చోటుల్నుంచి ఆ దిష్టి అవ్వను తీసుకొని వెళ్ళటానికి వస్తుంటారు బాధలతో ఉన్న జనం.

ఎవరు ఎక్కడి నుంచైనా రాని, ఏ సమయంలోనైనా రాని ఈ అవ్వ పిలిచిన వారి ఇళ్ళకు తప్పకుండా పోతది.

"ఉప్పు, ఎండుమిరపకాయలు, పసుపునీళ్ళు సిద్ధం చేసుకోండి. నేను వస్తున్నా! బెణుకు ఉంటే మర్ధనకు నేనే నూనె తెస్తా. నడవండి" అని హడావుడిగా కాళ్ళకు రబ్బరు చెప్పులు తొడుక్కొని, చీర చెరగును నడుంకు చుట్టుకొని బయలుదేరుతది. ఇదండి ఈవిడ సేవ.

ఈవిడ నుంచి దిష్టి తీయించుకొనేవాళ్ళు, బెణుకు తోమించుకొనేవాళ్ళు అవ్వను ఉత్తచేతులతో పోనీయకుండా ఒకటో, రెండో పదిరూపాయల నోట్లను తమ శక్త్యానుసారం ఇస్తారు. వచ్చిన సమయం చూచి కాఫీ, టిఫిన్, భోజనం ఏర్పాట్లు చేస్తారు. మర్యాదతోనే ఇదంతా చేస్తారు.

దిష్టి అవ్వకు డెబ్బయి సంవత్సరాలు దాటింది. ఆమె యవ్వన కాలంలో చక్కగా లక్షణంగా ఉండేది అంటానికి సాక్ష్యంగా ఇప్పుడు కూడా ఆ పాతకాలం సొగసులు ఆమెనుంచి దూరం కాలేదు. ఆమెకు ఉత్సాహం, ఊపు ఇంకా తగ్గలేదు. దిష్టి తీయించుకోటానికి, బెణుకు తోమించుకోటానికి ఎవరు పిలవటానికి వచ్చినా ఆమె 25 సంవత్సరాల వయసును తిరిగి పొందేది. వీధిలో అవ్వ హడాహుడిగా పోతుంటే ఎవరైనా చూచి 'ఏమిటవ్వా బిజిబిజీగా ఉన్నావు' అని అడిగితే ఆ ప్లీడరుగారి అమ్మాయి మూడునెలల గర్భిణి అంట. ఆమెకు దిష్టి తీయటానికి వెళ్తున్నాను అని అంటూనో లేకపోతే షెట్టిగారి భార్య పడిపోయి నడుం బెణుక్కొట్టుకొంది. మూడు రోజులనుంచి నూనెతో తోమి వేడి నీరు కాపడం చేస్తున్నాను, వెళ్ళి వస్తా అంటూనే నిలబడకుండా చెప్తూ వెళ్ళేది.

ఈ అవ్వ ఇట్లాగే అవసరంగా వెళ్ళే జాగ ఇంకొకటి ఏమిటంటే ఊర్లోని చర్చి. ప్రతి ఆదివారం ఆమె మొదటి పూజ చూడటానికి చర్చికి వెళ్ళాల్సిందే. పెళ్ళైనప్పుడు భర్త తెచ్చిన పట్టుచీరను ట్రంక్‌పెట్టెలోంచి సుతారంగా బయటకు తీస్తది. కలరా ఉండలు ఆ పెట్టెలో వేయడం చేత ఆ చీరకూ భలే మంచిసువాసనలతో అది పాడైపోకుండా ఉంది. ఆ చీరను తెల్లని వస్త్రంలో మడతలతో ఉంచటం వలన అది ఇప్పటికీ కొత్తచీరలాగనే ఉంది. అవ్వ ప్రేమతో ఆ చీరను కట్టుకొని కుచ్చిళ్ళు కాళ్ళదాక వచ్చినవా లేదా, కొంగు సరిగా ఉందా అని జాగ్రత్తగా కట్టుకొంటది. ఆ చీరను కట్టుకొని ఆమె చర్చికి వెళ్తుంటే కలరా ఉండల వాసన గుప్పుమంటూ గుభాళిస్తూ ఉండేవి. చేతిలో జపమాల పట్టుకొని పక్కింటి జూలియాను పిలిచి "నేను చర్చికి వెళ్తున్నా! ఎవరైనా వస్తే కూర్చోమని చెప్పు" అని బయలుదేరేది.

పూజను వినటం, పాప నివేదన, దివ్యప్రసాదం తీసుకోటం, ఈ మూడిటినుంచి ఆమె తప్పించుకోలేదు. పూజ ముగిసేదాక అవ్వ మనసు అక్కడే నిమగ్నమై ఉండేది. క్రీస్తు ప్రభువు మానవలోకంలోని పాపాల్ని పారద్రోలటానికి తానే శిలువమీద ఇనుపమేకులకు వేళ్ళాడేదాన్ని మనస్సులో నింపుకొని ఆమె కూడా బాధను అనుభవించేది. పూజ అయిపోగానే వాళ్ళ వీళ్ళ మాదిరిగా చర్చిముందే లోకాభిరామాయణంకు పోకుండా "అవ్వా ఎట్లాగున ఉన్నారు" అని ఎవరైనా అడిగితే "ప్రభువు దయవలన ఇట్లా ఉన్నా... ఇంక చాలదా" అని జవాబు చెప్పేది. ఇంకెవరైనా ఆమెను మాట్లాడించాలి అని ప్రయత్నించితే "ఉండవే అమ్మా... అక్కడ ఇంటి దగ్గర నాకోసం ఎవరైనా ఎదురుచూస్తూ దారి కాస్తుంటారు. నేను వస్తా" అని హడాహుడి చేసేది. ఈమె దైవభక్తి చర్చిలోనే కాదు ఇంట్లో కూడ ప్రతి సాయంత్రం క్రొవ్వొత్తిని వెలిగించి ప్రార్థన చేస్తది. పడుకోబోయేముందు జపమాల మూలకంగా దేముడ్ని స్తుతించేది. చర్చి గంట మ్రోగగానే ఈవిడ చేతిలోని శిలువ వందనం చేస్తది.

దిష్టి తీసేటప్పుడు పరలోక మంత్రం చదువుతది. బెణుకుల మూలకంగా బాధపడే వాళ్ళకు నూనెరాసే మందును వేళ్ళకు అద్దుకొని బెణుకు ఎక్కడైతే ఉందో అక్కడ శిలువ గుర్తురాసి, ఆ తర్వాత తన పని ప్రారంభించేది.

ఇంతగా శిష్టాచారం వలన ఆమె ఊరందరికీ చిరపరిచితమైంది. ఎవరింట్లోనైనా చావు సంభవిస్తే అవ్వ అక్కడికి పోవాల్సిందే. ఏడుస్తూ కూర్చున్న మంది దగ్గర తనూ కూర్చుని "ఏడవకమ్మా... ఏడవకు... మనమూ శాశ్వతం కాదు" అని ధైర్యం చెప్పేది. ఎవరింట్లోనైనా కాన్పు అయ్యిందంటే అక్కడికి పరిగెత్తేది. "ఓ...ఓ... ఎవర్రా ఈ కొత్తశిశువు? ఎందుకే బుజ్జికన్నా ఏడుపు? బిడ్డకు చనుపాలు పట్టమ్మా? ఆకలేస్తుందేమో? చనుపాలు ఇవ్వు తల్లి" అంటూ బాలింతకు చెప్పేది. బాలింత పక్కనే కూర్చుని పదినిమిషాలు తల నిమిరేది. ఈ మూలకంగా అవ్వకు ఎంత సంతోషమో. ఇటువంటి పనులు అవ్వకు అనేకం.

కొంతకాలం క్రితం తన వీధిలోని వెరోనికా భర్త చనిపోతే అవ్వ ఆ ఇంటిలో ఎనిమిది రోజులు అక్కడే ఉంది. వెరోనికాకు ఎనిమిది మంది సంతానం. వెరోనికా మొగుడు బండరాళ్ళను కొట్టే వృత్తిలో ఉండేవాడు. ప్రతిరోజూ కూలి తీసుకొని సారాయి కొట్టుకు వెళ్ళేవాడు. వెరోనికా అడవిలో కట్టెలు కొట్టి అవి అమ్మి బతుకు సాగించేది. సారాయి మూలంగా యుక్తవయస్సులోనే వెరోనికా భర్త చనిపోయాడు. వెరోనికా మొగుడి శవం మీద పడి గుండెలవిసేలా ఏడ్చింది. "లేమ్మా...లే... ఇట్లా ఏడుస్తుంటే చచ్చినోడు బతికి వస్తాడా. పిల్లలంతా బిక్కచచ్చియున్నారు" అని సాంత్వన

పలుకులు పలికింది అవ్వ. సావుకి వచ్చినోళ్ళంతా వెళ్ళిపోగానే అవ్వ అక్కడే ఉండిపోయింది. పిల్లలందరికి గంజి కాచి తాగించింది. తర్వాత వంటచేసి పిల్లలకు స్నానాలు చేయించింది. పిల్లలు దొడ్డికి కూర్చుంటే వాళ్ళ శరీరాలను శుభ్రం చేసింది. పిల్లలకు వేళకు సరిగా అన్నం తినిపించింది. వెరోనికా ఇంట్లోనే ఉండి, బూబమ్మ బిడ్డకు దిష్టితీసి వచ్చింది. బ్యాంక్ మేనేజర్ ఇద్రూస్ భుజం నొప్పికి నూనెరాసి బెణుకును తగ్గించింది. ఎనిమిదోరోజున వెరోనికా చేతిలో గొడ్డలి, తల చుట్ట ఇచ్చి "వెళ్ళు... నీ పని నువ్వు చేసుకో. నువ్వు కట్టెలు కొట్టి అడవినుంచి తీసుకురాకపోతే నీ పిల్లలు నీ మొగుడిదారే అవుతారు" అని జోరుచేసి తన ఇంటికి వాపస్సె వచ్చేసింది. ఇటువంటి సమాజసేవ పనులు ఆమె పాలికి ఒదిగిపోయినవి. దేముడు ఈ విధంగా తనను సేవలు చెయ్యి అని చెప్పినట్లుగా ఆమె భావించుకొనేది.

దిష్టితీయటం, బెణుకు సరిచేయటం ఈవిడెకు మొదటినుంచి అబ్బిన విద్యేమీ కాదు అది. దైవలీలగా ఆ రెండు పనులు వచ్చినవి.

ఆమె 'హొన్నావరం' హసిమడ్లు లాజర్ కూతురు. ఆవిడ పుట్టింటివారు కొబ్బరి మట్టల్నుంచి ఈనెలు తీసి చీపుర్లను కట్టి బొంబాయికి ఎగుమతి చేసేవారు.

అవ్వ నాయనమ్మ కూడా పిల్లలకి, పెద్దలకి దిష్టి తీసేది. అవ్వ కూడ చిన్నపిల్లగా ఉన్నప్పుడు పొయ్యి దగ్గర కూర్చుని నాయనమ్మతో దిష్టి తీయించుకొనేది. ఇంట్లో వాళ్ళకు తప్పితే పరాయివాళ్ళకు అవ్వ నాయనమ్మ దిష్టి తీసేది కాదు. అవ్వ తన పుట్టింటి నుంచి మెట్టినింటికి వచ్చి 50– 55 సంవత్సరాలు నిండుతున్నవేమో. అవ్వ ఈ ఊరుకు కోడలి పిల్లగా వచ్చినప్పుడు శివసాగరం ఇంత పెద్దదిగా లేదు.

అవ్వ భర్త కైతాన్ సోజరు మేస్త్రీగా ఊరిలోని జనం ముందు పేరు పొందారు. ఇప్పుడున్న శివసాగరంలోని పెద్ద పెద్ద ఇళ్ళన్నిట్నీ కట్టించినోడు కైతాన్ సోజరుగారే. ప్రభుత్వాసుపత్రి, పోస్టాఫీసు, ధర్మసత్రం, పోలీస్‌స్టేషన్, తాలూకాఫీసు మొదలైన బిల్డింగ్‌లను కైతాన్ సోజరుగారు గిరిజనులను పిలిపించుకొని వాళ్ళ సహాయంతో ఇప్పుడున్న సగం నగరాన్ని ఆయనే కట్టించారు. మేస్త్రీ అయిన కైతాన్ సోజరు ఎర్రటి తలపాగ, మెడలో బంగారుగొలుసు, చేతికి దేముడిదారం, నోట్లో ఎప్పుడూ తాంబూలంతో, ఆజానుబాహుడైన గంభీరరూపంతో పని పని అంటూ గడసుధ్వనితో ఎంతో గొప్పగా తిరుగాడేవాడు.

మేస్త్రీ తల్లి–దండ్రులకు ఒక్కడే! తల్లి రోగంతో మంచాన పడటం వలన ఈయన అవ్వను పెళ్ళాడాడు. అవ్వ కోడలిగా ఆ ఇంట్లో కాలుపెట్టి అత్త–మామల అభిమానాన్ని తొందరగానే పొందింది. అవ్వ మామగారికి ఆకుల పసర్లు నుంచి, గింజలనుంచి నూనెతీయటం ఒక సరదా. నడుంనొప్పి, కాలునొప్పి, వెన్నునొప్పి

అని బాధతో వచ్చేవాళ్ళకు అవ్వ మామగారు నూనెను ఉచితంగా ఇచ్చేవాడు. ఎవరైనా బెణుకు నొప్పితో రాలేక ఇబ్బంది పడుతుంటే తనే వెళ్ళి నూనెతో మర్ధన చేసేవాడు. కోడలు (అవ్వ) రాగానే ఆయనకు నూనె తయారుచేసే పని కొంత తగ్గింది. "అమ్మాయి... ఈ నూనెను కాయమ్మా" అంటూ మామగారు అడిగేవారు. కోడలు కూడ మామగారు చెప్పినట్లే చేసేది.

అవ్వ కోడలిగా వచ్చిన ఐదేళ్ళకు అత్తగారు కాలధర్మం చెందారు. అత్త పోయిన మరు సంవత్సరం ఊర్లో ప్లేగు వ్యాధి మూలకంగా మామ కూడా చనిపోయారు. చర్చి వెనకాల బజారులోని ఆ పెద్ద ఇంటిలో అవ్వ మరియు కైతాన్ గారే ఆ ఇంట్లోని జనంగా ఉండేవారు.

ఆ దంపతులకు పిల్లలు కాలేదు. పిల్లలు కలగలేదు అని ఆలోచన చేసే టైమ్‌లేదు కైతాన్‌గారికి. ఒక ఇల్లు కట్టడం అయిపోయిందిలే అనుకోగానే చుట్టుపక్కల ఊళ్ళలోని పెద్ద రైతులు, మోతుబరులు మేస్త్రీ దగ్గరకు వచ్చి "మేస్త్రీగారు మాఇల్లు మీరే కట్టాలి. ఒక సంవత్సరం ఆగమన్నా ఆగుతాము. మీరే ఇల్లు కట్టిపెట్టాలి" అని అభ్యర్థించేవాళ్ళు. కొత్త ఇల్లు కట్టి ముగించటంలో మేస్త్రీకి భలే ఉత్సాహం ఉండటం చేత ఆయన సరే అని ఒప్పుకొనేవాడు. సూర్యోదయం నుంచి చీకటి పడేదాక పని చేయించటం, రాయి, సిమెంట్, ఇసుక తెప్పించటం, కూలీలకు డబ్బు ఇవ్వటం, కూలీల మీద పెత్తనం చెలాయించటం, కేకలు, తిరుగాట... ఇవన్నీ సోజరుగారికి సంతోషాన్ని ఇచ్చేవి. మేస్త్రీకి ఇళ్ళ నిర్మాణం పని తప్పితే ఇంకొక విషయం ఆయన తలలో దూరేదికాదు. ఇంతగా పనులు చేయగా, చేయగా మేస్త్రీ కొంతకాలానికి మెత్తబడ్డాడు. కొంతకాలానికి ఒకటే దగ్గు,జ్వరం అని బాధతో విలవిలలాడాడు. నాకేమి కాలేదు అని సమర్థించుకొనేవాడు. అట్లాగే పనిలో కూరుకుపోయాడు. రోగం ముదిరిపోయి సర్కారి ఆసుపత్రికి తీసుకెళ్ళేటప్పటికే కాలం మీరిపోయింది. దగ్గు నుంచి రక్తం బయటపడటం మొదలైంది."దేముడా ఇదేమి రోగం మా ఆయనకి" అని మరిసంతాన భయపడింది. ఊర్లోని ఫాదర్, చుట్టుపక్కలవాళ్ళు గాబరా పడ్డారు. వైద్యులు చూద్దాం, చేద్దాం అనేవాళ్ళు.

మరే ఊరికైనా తీసుకెళ్దాము అనేది శివసాగరంలో ఏ రోగికి జరగలేదు. మేస్త్రీ కైతాన్ సోజరు ఊర్లోనే చనిపోయాడు. ఆ పెద్ద ఇంట్లో మరిసంతాన ఇప్పుడు ఏకాకి. పుట్టింటినుంచి తోడబుట్టినవాళ్ళు వచ్చారు. ఆమె కోసం కన్నీరు కార్చారు. "చెల్లీ... ఈ ఊరి నీళ్ళ ఋణం తీరింది నీకు. ఇక్కడుండి ఏమి చేస్తావు పుట్టింటికి

వచ్చేయి" అని అడిగారు. మరిసంతాన తోడబుట్టినవాళ్ళ మాటల్ని ఒప్పుకోలేదు. అక్కడికిపోయి వదిన, మరదళ్ళ నడుమ ఉండటానికి ఇష్టం కాలేదు. "ఇప్పుడు నేనున్నది నా ఇల్లే. ఈ మెట్టినూరు నాదే. నేనిక్కడే ఉంటా" అని దృఢంగా చెప్పింది.

అయితే విధి ఇంకోరకంగా అవ్వను ఆట ఆడించింది.

అవ్వ భర్త కైతాన్‌సోజరు తన కాంట్రాక్ట్ పనుల కోసం సిమెంట్, ఇసుక, రాళ్ళు, కలప, కూలీలకు అడ్వాన్స్ కోసం ఇంటిని తనకా పెట్టి బ్యాంక్ నుంచి 5లక్షలు అప్పు తీసుకొన్నాడు. పనులు నిరాటంకంగా సాగిపోతే ఈ అప్పు పెద్ద అప్పేమి కాదు మేస్త్రీకి. ఐతే మేస్త్రీ అనారోగ్యం మూలకంగా సగంలో నిలిచిపోయిన ఇళ్ళనిర్మాణం మరియు మేస్త్రీ ఆరోగ్యం అంతంత మాత్రమే అని తెలుసుకొన్న ఇళ్ళ యజమానులు మేస్త్రీకి రావాల్సిన డబ్బును తొక్కిపట్టటం చేత అప్పు అప్పుగానే మిగిలిపోయింది. మరిసంతానకు భర్త లావాదేవీలు ఏమీ తెలియవు కదా!

భర్త చనిపోగానే బ్యాంక్‌వాళ్ళు ఉన్న ఇల్లును వేలం వేసారు. ఆమె కన్నీరుతో నిస్సహాయకంగా చూస్తూ నిలబడింది. ఆ పెద్దిల్లు 7 లక్షలకు వేలం అయ్యింది. బ్యాంక్ వాళ్ళు తమ బాకి పోను మిగిలిన 2లక్షలు ఆవిడ చేతిలో పెట్టారు. ఈ వచ్చిన డబ్బుతో శివసాగరంలోనే చర్చికి ఇంకొంచెం దూరంలో జూలియా ఇంటికి దగ్గరలో ఒక చిన్న ఇల్లు కొనుక్కొంది. ఉండటానికి ఒక ఇల్లైతే దొరికింది. మరి పూట గడవటానికి? తను కొన్న కొత్త ఇంటిలో చక్కగా చిన్నదైన కూరగాయలతోటను పెంచింది. మామగారు ఆ కాలంలో తయారుచేసిన నూనెకు ఇంకా గిరాకి ఉన్నట్లుగా ఆవిడ దగ్గరకు కొంతమంది నూనె కోసం వచ్చేవారు. ఈమె అదే నూనెను చేసి అమ్మటం మొదలుపెట్టింది.

ఇది ఇలా ఉండగా ఒకసారి సిస్టర్ హైస్కూల్‌లో మెట్లు దిగుతుండగా కాలు జారి క్రింద పడింది. ఒక అడుగూ ముందుకు పడకపోవటం వలన సిస్టర్‌ను మోసుకుపోయి పడుకోబెట్టారు. డాక్టర్ వచ్చి పరీక్ష చేసి "కాలి నరం దెబ్బతింది. కాలు వాచింది" అని మాత్రలు, ఆయింట్‌మెంట్ ఇచ్చాడు. ఎనిమిదిరోజులు గడిచినా, సిస్టర్ కాలు నయం కాలేదు. ఈవిషయం తెల్సిన మరిసంతాన బెణుకు నూనె సీసాను పట్టుకొని కాన్వెంటుకు వెళ్ళింది. సిస్టర్ కాలును తన తొడమీద పెట్టుకొని సీసాలోని నూనెను తన వేళ్ళ కొనలకి అంటించుకొని సిస్టర్ కాలుమీద శిలువ ఆకారాన్ని రాసింది. చేతిలో నూనె పోసుకొని వాపున్న భాగాన్ని క్రిందికే తోమింది. సిస్టర్ హా...హా... అని గోల పెట్టింది. అదే పనిని మూడురోజులూ నూనెతో తోమటం వేడినీళ్ళతో కాపటం చేసింది. నాలుగోరోజున కాలు బాగు అయ్యింది. "మేరీమాతే

నన్ను కాపాడింది. మీరు రాకుంటే ఇట్లాగే పడుకుని చచ్చేదాన్ని" అని సిస్టర్ అవ్వకు కృతజ్ఞతలు చెప్పింది. ఈ సుద్ది వాడవాడలా ప్రసారితమయ్యింది. మామగారు మూలాన చెట్టు ఆకులు, బెరడ్లు, వేర్లు పరిచయం ఉండటాన వాటన్నిటిని ఆమె తెప్పించుకొని నూనె తయారుచేసుకొనేది. ఇప్పుడు ఆ నూనెకు భలే డిమాండ్. బెణుకు నూనెను తయారుచేయటం చేత ఒక పని చేతినిండా దొరికినట్లయింది.

ఇప్పుడు దిష్టి తీయటం గురించి అవ్వకు లభించిన వైనాన్ని తెలుసుకొందాము.

ఒకసారి పక్కింటి "పింజావర లూసియా' కొడుకు ఒకటే ఏడుపు. నిద్రపోడు. ముద్దు ముద్దుగా ఉన్న పిల్లోడు ఎవరెవరో భుజాలు ఎక్కి రోజంతా వీధి వీధిలోని ఇళ్ళకు పోయి వచ్చాడు. రాత్రి పడుకోకుండా ఒకటే గోల, ఏడుపు. ఇది చూచిన అవ్వ "పిల్లోడికి దిష్టి తగిలింది. నేను దిష్టి తీస్తా" అని పిల్లోడ్ని ఎత్తుకొని పొయ్యి ముందు కూర్చొంది. అప్పుడు మరిసంతాన తను చిన్నదానిగా ఉన్నప్పుడు తన నాయనమ్మ తనకు దిష్టి తీసినదంతా గుర్తు పెట్టుకొని నాలుగు ఉప్పురాళ్ళు, రెండు ఎండుమిరపకాయల్ని చేతిలో పెట్టుకొని పిల్లోడివైపు వృత్తాకారంగా చేయిని తిప్పింది. పిల్లోడి నుదురుకు, పొయ్యి ముందున్న భూమికి వాటిని ముట్టించి, నోట్లోంచి గబగబా "పరలోకంలో ఉన్న తండ్రీ...నీ నామానికి స్తోత్రం.." అని పరలోక మంత్రాన్ని పఠించింది. అంతేగాకుండా "కాకి దిష్టి, గుడ్లగూబ దిష్టి, కుక్కదిష్టి, పిల్లిదిష్టి, వాళ్ళ దిష్టి, వీళ్ళ దిష్టి...అన్నీ పోనీ" అని పలికింది. పొయ్యిలో పడ్డ ఉప్పురాళ్ళు చిటపటా మోతలు పుట్టించినవి. మిరపకాయలు కాలి బూడిద అయినవి. అయితే ఘాటువాసన రాలేదు. "చూచారా పిల్లోడికి దిష్టి తగిలింది" అని చెప్పి పొయ్యిలోని మసిని పిల్లోడి బుగ్గలమీద పూసింది.

భయం భయంగా చేసిన పని ఫలించింది. ఆ రాత్రి లూసియా కొడుకు చక్కగా నిద్రపోయాడు.

ఇదైన తర్వాత ఎవరెవరో వాళ్ళ వాళ్ళ పిల్లల్ని ఇంటికి తీసుకురావటం మొదలుపెట్టారు.

నవదంపతులకు, బాలింతలకూ, గర్భిణీలకు దిష్టితీయటం మూలాన మరిసంతానకు పనే పని. ఆమెకు విరామం లేకుండా ఉంది ఇప్పుడు.

ఇట్లా సంవత్సరాలు గడిచిపోతున్నవి. ఇట్లా చేస్తా చేస్తా ఆవిడ వయస్సు ఉడిగిపోయింది. జుట్టు తెల్లబడింది. ముఖం మీద ముడతలు ఏర్పడినవి. ఆమె వయస్సు వాళ్ళు తల్లులుగా, ఆ తరువాత అమ్మమ్మలుగా, నాయనమ్మలుగా పరివర్తనం చెందారు. మరిసంతానకు పిల్లలు కలగలేదు కదా. మరి అమ్మమ్మ అయ్యేదెప్పుడు.

అయినా మరిసంతాన అవ్వ అయ్యింది. దిష్టి అవ్వ – బెణుకు అవ్వ అయ్యింది జనం హృదయాలలో. ఇట్లా సేవ చేయటం, వాళ్ళతో ప్రేమగా అవ్వ అని పిలిపించు కోవటంలో ఆమెకు సంతోషంగానే ఉండేది.

జనం ఆమెను వెతుక్కుంటూ వచ్చేవారు. చర్చికి వెళ్ళింది అని తెలిస్తే ఆమె వచ్చేదాక ఎదురు చూసేవారు. ఆటోనో, కారునో తెచ్చేవారు.

"అవ్వా పాప కిరికిరి చేస్తుంది. మీరు వచ్చి ఒకసారి దిష్టి తీస్తే అంతా మామూలు అవుతది"

"అవ్వా... మా వారు ప్రొద్దునే వాయువిహారానికి (వాకింగ్) వెళ్తుంటే బర్రె పేడమీద కాలుపెట్టి జారిపడ్డారు. కారు తెచ్చా! రండి"

అవ్వ బయలుదేరుతది తక్షణమే.

ఇళ్ళకు పిలిపించుకొన్నోళ్ళు "అవ్వ మనకి ఎంత ఉపకారం చేసింది"అని అనుకొనేవారు. అవ్వ చేతిలో వక్క, తాంబూలం, పదిరూపాయల నోట్లు ఐదు పెడితే వాటిల్లోంచి వక్క, తాంబూలం, ఒక పదిరూపాయల నోటు తీసుకొనేది. వాళ్ళు బలవంతం చేస్తే "చాలయ్యా...చాలు నాకు! నేను ఒక్కదాన్నే. నాకెంత కావాలి" అని వాళ్ళ ప్రేమ కానుకలను తక్కువగానే తీసుకొనేది. ఈ విధంగా ఆమె జనసేవ సాగిపోయేది.

ఇట్లా ఉండగా ఆ ఊరికి ఒక కొత్త ఫాదర్ వచ్చాడు. ఆ యువ ఫాదర్‌కు క్రీస్తు అనుయాయులలో ఇంకా ధర్మజాగృతిని పెంచాలి అనే ఉత్సాహం అతనిలో ఉండేది. ఆ యువ ఫాదర్ ఫాదరీ పట్టా (థియోలాజీ డిగ్రీ) పొంది తీర్థరాజపురంలో సహాయక ఫాదర్‌గా ఉద్యోగం చేసి ప్రమోషన్ పొంది శివసాగరంలో స్వతంత్ర ఫాదర్‌గా అధికారంతో వచ్చాడు. పాత ఫాదర్ ఇక్కడ్నుంచి ట్రాన్స్‌ఫర్ అయ్యేటప్పుడు పట్టణంలోని క్రైస్తవులు ఎవరెవరు ఎంతెంతవారు అని తెలిపి వెళ్ళిపోయారు.

ఆ పాత ఫాదర్ నుంచి ఎవరెవరు చర్చికి రెగ్యులర్‌గా రావటం లేదు? ఎవరు ఫాదర్ విరుద్ధంగా కమ్యూనిస్ట్ భావాలతో మాట్లాడుతారు? ఎవరు దైవభక్తులు? ఎవరు నాస్తికులు మొదలైన సమాచారం ఈ కొత్త ఫాదర్‌కు ఆ పాత ఫాదర్ ఇవ్వడం వలన కొత్తఫాదర్ క్రైస్తవుల ఇంటింటికీ భేటీకి సిద్ధమయ్యాడు.

కొత్త ఫాదర్ దిష్టి అవ్వ ఇంటికి రాగానే అవ్వ అప్పుడు ఇంట్లోనే ఉంది. అంతకు ముందే వకీల్ శరణప్ప గారి మెడను తోమి ఇంటికి వచ్చింది.

"(నెసావం దిమా పద్రాబా)కొంకణి భాషలో ఆశీర్వదించండి ఫాదర్‌గారూ" అని అంటూ ఆ యువ ఫాదర్‌ను నమస్కారాలతో ఇంట్లోకి తీసుకొని వచ్చింది అవ్వ.

ఉన్న ఒకే ఒక కుర్చీలో కూర్చుని ఫాదర్ చుట్టూరా చూచాడు. ఒకటే గది, గోడమీద దేముడి పీఠం. పీఠంలో దేముడి ప్రతిమ. దానిముందు ముంబత్తి స్ట్యాండ్. గోడమీద వేళాంకణీమాత, బాల ఏసు పటం. మేకులకి తగిలించిన జపసరమాల. ఇక చూడటానికి ఏమీలేదు.

ఫాదర్ తన చేతిలోని డైయిరీలో ఉన్న పేజీలను తిరగేస్తూ "మరిసంతాన మీరు పుణ్యవంతులు" అని పలికారు.

భయం భక్తితో 'అలాగా... అలాగా' అంది ఆమె. ఫాదర్‌గారు అంటే ఆమెకు అపారమైన భక్తి. వాళ్ళ మాటలమీద గౌరవం. వీళ్ళంతా దేముడి ప్రతిరూపాలే అనే నమ్మకం ఆమెలో ఉండేది. ధర్మరక్షణను చేసేవాళ్ళు వీళ్ళు. మార్గదర్శనం చూపేవాళ్ళు వీళ్ళు ఈ ఫాదర్లే. ఎర్రటి గుండ్రటి ముఖం, చిన్నగడ్డం, చక్కటి శరీరాకృతి, తీక్షణమైన చూపులు..."ఆ... ఆ... మరిసంతాన పాపికాదు" అని మళ్ళా అనగానే అవ్వ నమస్కారంతో 'ఔనౌను ఫాదర్' అని అంది.

"అంతా సరే..." ఫాదర్ ధ్వని ఎందుకో తీక్షణమైంది.

"అవ్వా ఈ దిష్టి తీసేది ఇకనుంచి ఆపేయాలి. నూనె రాయటం అవైజ్ఞానికమే. ఈ దిష్టి తీయటం ఒక మౌఢ్యం. మొదట దానిని నిలపండి. క్రైస్తవ ధర్మం ఇటువంటి నమ్మకాలను ఎప్పుడూ బలపరచదు."

అవ్వ నిదానంగా తలుపు దగ్గర కూలబడింది. ఇప్పటిదాకా ఎవరూ ఆమెకు చెప్పలేదు. ఆమెకు కూడా ఇది తప్పు అని అనిపించలేదు.

జనం వస్తున్నారు. పిలుస్తున్నారు. తనే వెళ్ళి తన శక్తిమీరి సేవ చేసి వస్తుంది. జనానికి మంచే జరుగుతుంది అని జనమే తనని కలుసుకొని చెప్పేవాళ్ళు. పక్కవాళ్ళకు ఉపకారం చేయటం కూడా జనసేవే అని క్రీస్తుప్రభువు చెప్పాడు కదా. ప్రభువు చెప్పినట్లే తాను చేసాను కదా అని అవ్వ ఇప్పటిదాకా అనుకొనేది.

అయితే ఇప్పుడు... ఇవేంటి? కొత్తమాటలు. ఆమె నాలుక పిడచగట్టింది. ఒంట్లోని రక్తం నీరైంది. 'ఫాదర్...' అని నత్తి నత్తిగా పలికింది.

"జనం నా దగ్గరకు వస్తున్నారు. వాళ్ళకు ఈ రీతిగా సేవ చేస్తా ఉన్నాను. వాళ్ళకు మంచే జరిగింది కదా" ఆమె చెపుతుంటే ఫాదర్ ఆమెను నిలువరించాడు. కొత్త ఫాదర్ డేనియల్‌గారు క్రైస్తవజనం మధ్యలోనే పెరిగి పెద్దోడైన ఈయన, క్రైస్తవులు ధర్మసంప్రదాయం, విశ్వాసం మొదలైన వాటినుంచి దూరంగా ఉండటం చూచాడు. తమ చుట్టూరా ఉన్న బహుసంఖ్యాత జనం (హిందువుల) నీతి, రివాజులను అనుకరించటం మూలాన ఎక్కడో మనవాళ్ళు దారితప్పారు అనేది ఈయన వాదన.

"ఫాదరే దారి తప్పేవాళ్ళను నిర్ధారించాలి. వాళ్ళ ఆచార, విచారాల్ని తనే నిర్ధారించాలి కదా'' అని భావించేవాడు. ప్రభువుకూ, జనానికి తను ఒక లింక్ అని భావించుకొనేవాడు. ఇట్లా అనేక ప్రణాళికలను ఆయన రూపొందించుకొన్నాడు. క్రైస్తవుల నడవడికను సూక్ష్మంగా పరిశీలిస్తుండేవాడు. క్రీస్తు జీవనం నుంచి ఎవరైనా దారి తప్పితే కఠినశబ్దాలతో ధర్మం నుంచి వారిని దూరంగా జారిపోకుండా చూచుకొనేవాడు. పాతాయనతో "మీరు దారి తప్పిన వాళ్ళను ఎందుకు సరిచేయలేకపోయారు" అని అడిగాడు. పాతాయన మృదుస్వభావం కలవాడు. "నేను కఠోరంగా వాళ్ళను నియంత్రించలేదు. మీరు సరిదిద్దండి వాళ్ళను" అని అనుమతి ఇచ్చాడు. దీనితో కొత్త ఫాదర్ హుషారులో ఉన్నాడు. ఊర్లోని క్రైస్తవులు ఊరి మధ్యలోని మారెమ్మ గుడికి పండ్లు, కొబ్బరికాయలు, జంతుబలిని అర్పించేవాళ్ళు. మంత్రతంత్రాలలో ఆసక్తి చూపించేవారు. బ్రాహ్మణ పూజారుల ఇళ్ళకూ వెళ్ళి, లక్ష్మిదేవి కటాక్షం కోసం గుట్టుగా సంప్రదించేవాళ్ళు. ఇవన్నీ బయటకు కనబడనీయకుండా గుట్టుగా చేసేవారు.

అయితే అవ్వ దిష్టి తీయటం, నూనె రాయటం మూలంగా క్రైస్తవులు మరియూ ఇతర ధర్మాలలోని జనంలో తన వైద్యంమూలాన పేరు, ప్రఖ్యాతులు పొందింది. ఉప్పు, మిరపకాయలు, పసుపునీళ్ళ నుంచి దిష్టి తీయటం, పసర్లు, వేర్లు, బెరడ్ల నుంచి నూనె తయారుచేసి బెణుకు పోగొట్టడం ఇదంతా ఏమిటి? అని ఎగిరిపడ్డాడు. మరిసంతాన దైవభక్తురాలే! అయితే అవిశ్వాసాలు, ధర్మవిరోధి అచరణ ఆవిడకు ఎట్లా అబ్బింది?

మరిసంతాన ఇంకేమో చెప్పబోతుంటే ఫాదర్ కోపంతో "అవ్వా నీ వాదన భ్రమ. సైతాన్ ప్రలోభం మూలకంగా డాక్టర్ చేయలేనిది నీవు చేసావు అంతే. సైతాన్ హస్తం నీమీద ప్రయోగం అయ్యింది అని నేను చెపుతున్నా" అని అవ్వతో అన్నాడు. "ఏసు ప్రభువును మనం రక్షకుడు అని స్వీకరించిన పిమ్మట ఈ మూఢ నమ్మకాలకు మనం దాసోహం కాకూడదు. మూఢనమ్మకాలను మనం బలపరచరాదు. దారి తప్పితే ఏసుప్రభువుకూ, దేవమాతకు ద్రోహం చేసినట్లే. మనం క్రైస్తవులం, హిందువుల ఆచారవ్యవహారాల నుంచి దూరంగా ఉండాలి. మనం ఏం చేసినా తర్కంతో చేయాలి. ఎవరో చూచారు తక్షణం దిష్టి తగిలింది అనటం, కొంచెం నూనె రాయగానే వాపు, బెణుకు నొప్పి తగ్గింది అనేది ఆధారరహితమైనది. చుట్టుపక్కలవాళ్ళు నమ్ముతున్నారు కదా అని మనం కూడా నమ్మచ్చా! మనకి, వాళ్ళకి ఏమిటి తేడా?

క్రీస్తు ప్రభువును నమ్ముతున్న మనం ఆ అవిశ్వాస జనం లాగా ప్రవర్తించడం సరికాదు."

దిష్టి అవ్వకు కూర్చున్న జాగా కదిలిపోతే బాగుండేది కదా అని భావించింది. ఇట్లా ఫాదర్ ఎంతోసేపుబోధన చేసి వెళ్ళిపోయాక చర్చినుంచి సాయంకాలం ప్రార్థనా గంట సప్పుడు చెవిలో పడింది. శిలువ వందనం చేస్తూ దేముడి ముందు కొవ్వొత్తిని వెలిగించింది. మరుసటిరోజు సూర్యోదయం కాగానే "అవ్వా మా పిల్లోడికి, అవ్వా నా కాలుకి..."

"లేదయ్యా నేను ఈ పనిని నిలిపేసాను. నాకు శక్తి లేదు. ఈ జీవానికి ఏమి అవసరం లేదు" అని చెప్పింది.

వచ్చినోళ్ళు ఎంతో మొత్తుకొన్నారు. అయినా అవ్వ గడప దాటలేదు.

ఆ తర్వాత అవ్వ క్రమేణ కృశించి, మాటలలో ఉత్సాహం, జీవనంలో కళను పోగొట్టుకొని ఒకరోజు "మేరి మాయె మక్కరాక్ ( కొంకణిభాష) మేరిమాతా నన్ను ఐక్యం  చేసుకో" అని పలుకుతూనే ఊపిర్ని వదిలింది.

ఊర్లో జనానికి అవ్వ మరణవార్త చర్చి గంట మూలకంగా తెలిసింది.

**మూలకథ రచనాకాలం : 2005**

# కాగోడుకు బస్సు వచ్చింది

కాగోడు గ్రామంలోని కిట్టప్ప హొటల్‌లో, వేడి చాయ్‌ను ఆర్చుకొంటూ తాగుతున్న హొంకేరి తిమ్మప్ప హొటల్ ముందుకొచ్చి నిలబడ్డాడు. గజానన సర్వీస్ బస్సు పొగల్ని వదుల్తూ హుంకరించి పోయిందాన్ని చూసి పకపకా నవ్వాడు.

తన పాటికి తను చాయ్ తాగుతున్న కాగోడు ఈరభద్ర, తిమ్మప్ప తాతనుంచి పెద్దగా వచ్చిన నవ్వును చూసి 'అంత నవ్వుకు కారణం ఏమిటి?' అని అడిగాడు.

"పాత కత జ్ఞాపకంకు వచ్చిందిలే... మాకిదంతా ఇంతేలే... పాతదాన్ని నెమరేసుకోటం... నవ్వేది లేకపోతే రోదించేదే కదా..." అంటూ మళ్ళా నవ్వాడు తిమ్మప్ప.

"సంతోషాన్ని పంచుకోవాల్సిందే... అదేమి సంతోషమో చెప్పు... వింటానులే" అని ఉబ్బించాడు ఈరభద్ర.

"ఇప్పుడు కాగోడుకు ఎన్నో సర్వీసు బస్సులు వస్తున్నవి కదా... (గజానన, లక్ష్మి, మంజునాథ, దుర్గాంబ మొదలైనవి)! ఇప్పటికి ఏభై సంవత్సరాల క్రితం ఈ ఊరికి ఒక బస్సు వచ్చేది కాదులే" తిమ్మప్ప సుర్‌మంటూ చాయ్ త్రాగుతూ తన మాటల్ని ముందుకే నడిపించసాగాడు.

"మొదటి దఫా బస్సొచ్చింది జ్ఞాపకానికి వచ్చి నవ్వానులే" అన్నాడు తిమ్మప్ప తాత మరలా.

"మొదటి దఫా బస్సొచ్చింది అనేదాని కన్నా, ఫస్ట్ టైమ్ బస్సు వచ్చింది అనే అనాలి" అంటూ తిమ్మప్ప తాత మదిలో హుషారును ప్రేరేపించాడు ఈరభద్ర.

"సరేలే... మొదటి దఫాను ఫస్ట్ టమ్ అని అంటానులే" అంటూ తిమ్మప్ప మళ్ళా కిసుక్కునే నవ్వాడు

"కాగోడికి బస్సొచ్చింది... నేను దెబ్బల్ని తిన్నది ఒకేసారి జరిగిందిలే" అంటూ ముసలోడు ఎప్పుడో జరిగినదాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు.

"నిజంగానే నువ్వు దెబ్బల్ని తిన్నావా" ఆశ్చర్యంతో అడిగాడు ఈరభద్ర.

ఖాళీ అయిన చాయ్ లోటాను పక్కనబెట్టి ముసలోడు (తిమ్మప్ప) జ్ఞాపకాల దొంతరలో చేతుల్ని తడుముకోసాగాడు.

మొదట సాగరంకు బస్సొచ్చి కొన్ని సంవత్సరాలు అయ్యిందట. కట్టె బొగ్గుతో నడిచే బస్సు అదట. బస్సు వెనకాల పెద్దదైన పీపా ఒకటి ఉండేదట. దానిక్రింద ఒక పొయ్యిలో కణకణలాడే నిప్పుకణాలు. అప్పుడప్పుడు కండక్టరు గాలితిత్తిని ఊదేవాడు. దానికని ఒక తోలుతిత్తి. వెనుక సీట్లలో కూర్చొన్నోళ్ళ వెన్నుకు వేడి తగిలేదట.

బస్సు రావటమే ఒక అద్భుతం. ఎద్దులు లేవు. దున్నలు లేవు. గుర్రాల్లేవు. రబ్బరున్న నాలుగు చక్రాల మీద పరిగెత్తే గొప్ప యంత్రం అది. ముందుకు చొచ్చుకొచ్చిన పెద్దమూతి. పొం... పొం అంటూ దారిలో ఉన్నోళ్ళను అటు ఇటూ బెదురుతో నెట్టేసే హారన్. మూడు మైళ్ళ వరకూ వినిపించే డబడబ శబ్దాలు.

ముందు చక్రాన్ని పట్టుకొని కూర్చుండేటోడు ఒకడు. ఇతనే కృష్ణపరమాత్ముడు. ఇతని కాలిక్రింద, చేతిక్రింద మరేంటో పెట్టుకొనే సాధనాలు. చక్రాన్ని తిప్పుతూనే వాటి జతగా దేనినో ఎత్తి, నొక్కి, గుంజడం, మెలిపెట్టటం... ఏంటేంటో చేస్తుంటే బస్సు శివమెత్తిన నందిలాగ పరిగెత్తుతుండేది. దారి మీదున్న మన్నంతా ఆకాశానికి లేచేది.

బస్సు లేస్తూ, పడ్తూ, లోనుండోళ్ళను ఎత్తి, కుదేసి, కుక్కుతూ నవరస నాట్యాల్ని చేపిస్తూ, కాళ్ళూ, చేతుల కీళ్ళను తేలికజేస్తుండేదట. వెనకాల కండక్టర్, అతను రైట్ ... రైట్ అంటేనే బస్సు పరిగెత్తేది. హోల్డాన్ అంటే నిలిచేది. బస్‌కున్న పీపాలో నీటిని నింపటం, పొయ్యిని ఆరకుండా చూడటం, టాపులో సామానును వేయడం, దించడం ఈ కండక్టరు కార్యక్రమంలో భాగమై ఉండేది.

డ్రైవర్ ప్రక్కన ఒక సీటు. అది ప్రభుత్వ అధికారులకు, సబ్ ఇన్‌స్పెక్టర్లకు, పెద్ద ఖామందుకు, కరణానికి. ఎక్కినోళ్ళంతా అక్కడ ఆ సీటులో కూర్చునేది లేదులే.

దీని వెనకాల ఒక బారు సీటు. అది మహిళలకు, ఆ తర్వాత మూడో వరస విద్యావంతులకు, ఉత్తములకు, మర్యాదస్తులకు.

వెనకాల ఒక తొట్టి, అక్కడ రైతులు, కూలిజనం, గొర్రెలకు, కోళ్ళకు, మేతగడ్డికి, మరిక దేనికైనా అక్కడ ప్రవేశం ఉండేది.

బస్సులోని వెనకాల తొట్టి అని అంటే భూకామందు ఇంటిదారిలో సైడ్ కాలువ లాగ అనుకోవాలి. కామందు పశువులు, కుక్కలు, కౌలుదార్లు, జీతగాళ్ళు... వాళ్ళ పరివారం ఇత్యాది... ఇత్యాది అనే అంతటికీ ఆ వెనక సీట్లో ప్రవేశం ఉండేది. అక్కడే వాళ్ళ మర్యాదకు తగిన జాగ అది.

ఇట్లా ఉండేది ఆ కాలంలోని బస్సు.

చుట్టూ ఇనుపచువ్వలు. చువ్వల్ని పట్టుకొనే కూర్చోవాలి. గాలి, ఎండ, వర్షంనీరు నేరుగా బస్సులోకి వచ్చేవి. వానాకాలంలో బస్సులోని జనంను కాపాడుకొనేందుకు

టార్పాలిన్ పరదాలు. ఇవి బస్సు పరుగెడ్తుంటే ఆ రభసానికి తటపట కొట్టుకొంటూ పరిగెత్తుకొని వస్తున్న అడవి మదపటేనుగును గుర్తుకు తెస్తుండేటట్లుగా ఆ బస్సు చలనం మూలకంగా కలిగేది ఈ అభిప్రాయం.

ఇటువంటి బస్సులు సాగరం నుంచి శివమొగ్గ, శిరసి, హొసనగరంకు తిరిగేందుకు ప్రారంభమైనప్పుడు జనం వీటిలో ప్రయాణం చేసేది ఒక ప్రతిష్ఠకు, మోజుకు, సంతోషానికి, సుఖానికి, శ్రీమంతతనానికి సంకేతంగా భావించుకోసాగారు. పేదోళ్ళలో ఎక్కువమంది కాలినడకనుంచో, ఎద్దులబళ్ళనుంచో ఆలంబనం చేసుకొని ప్రయాణించేవారు. కొంతమంది పేదోళ్ళు బస్సు సమీపంకు పోనేలేదు. కొంతమందికి ఎప్పటి మాదిరిగా పాతకాలంనాటి ప్రయాణమే శ్రేష్ఠం అనే భావన ఉండేదిలే.

అయినా బస్సులు జనప్రియం కాసాగినవి. వాటి ఉపయోగం, అనుకూలం నిధానంగా జనం మెదళ్ళలో చొచ్చుకుపోసాగింది.

ఒకరోజు కాగోడు దొర సాగరంలోని ఒక బస్సు సర్వీసు కంపెని ఆఫీసుకు వెళ్ళాడు. ఈ కంపెని పూర్వం సాగర నుంచి శివమొగ్గకు, శివమొగ్గ నుంచి సాగరంకు వారానికొకసారి తఫాలుగాడిని తిప్పుతుండేది. ఎద్దులబండి, దానిలో తఫాలామూటలు (పోస్ట్) జతగా నలుగురైదుగురు ప్రయాణించేవారు. అది కూడా ముందే నమోదు చేయించుకొని ప్రయాణించాలి. రెండురోజుల ప్రయాణం. ఈ ఎద్దులబండి కంపెనివాళ్ళు బస్సులు భారతదేశంకు దిగుమతి అయినప్పుడు మొదటిగా చేసిన పనేంటంటే ఒక బస్సును తెచ్చుకొన్నారు. కొన్ని నెలలు గడిచేటప్పటికి ఒకటి రెండై, మూడై బస్సుల సంఖ్య పెరగసాగింది.

సాగరం అభివృద్ధికి ఈ కంపెని కారణమైంది. ఊరిలోని శ్రీమంతులు తమకొక వాహన సౌలభ్యం దొరికిందని సంతోషపడ్డారు. శరావతి, భట్కళ, శిరసి, హొసనగర, జోగ మొదలైన ప్రాంతాలకు బస్సులు పోయిరావడం చేయసాగినవి.

కాగోడు జమీందారు దర్పంతోనే కంపెని ఆఫీసులోకి కాలుపెట్టారు. కంపెని మేనేజర్ లేచి నిలబడి... "రండి... రండి" అంటూ స్వాగతించాడు.

దొర ఆ ప్రాంతంలోని అందరికీ పరిచితుడే.

దొర తూకంకు కూర్చున్న కుర్చీ కిర్ మంటుంది.

"నేనొక పని కోసం వచ్చా" అన్నారు దొరవారు.

"ఏమి పనో చెప్పండి స్వామి..."

"మీరిప్పుడు సొరబ, శిరాళకొప్ప, అనవట్టి మొదలైన ఊళ్ళకు బస్సుల్ని వేశారు కదా! కాగోడికి ఎందుకు బస్సును తిప్పరాదూ?" దొర నేరుగాఈ మాటల్ని మేనేజర్ ముందుంచాడు.

"సొరబ, శిరాళకొప్ప, అనవట్టి మంచి ఊళ్ళే. వెనుకటి కాలంలో వాహన సౌకర్యం లేనందుచేత జనం ఎక్కువగా తిరిగేటోళ్ళు కాదు. ఇప్పుడు బస్సుంది అనే కారణంతో ప్రయాణించేది ఎక్కువైంది. అనవట్టికి పోయే బస్సును కాగోడు మార్గం మూలకంగా తిప్పాలి అనే భావించుకొంటే ఆ రాస్తా బాగుగా లేదు. మార్గంలోని చివర్నున్న ఈ ఊరినుంచి నిత్యం ఎంతమంది సాగరంకు వస్తారు? బస్సుకయ్యే మైంటెనెన్స్ ఖర్చు గిట్టాలి కదా!" అని కంపెని మేనేజర్ ఆలోచనలలో మునిగినా, నోరు విప్పి దొరతో ఏమీ అనలేదు.

అయితే కుశాగ్రమతి అయిన దొర మేనేజర్ మనస్సులో ఏముందో అని గ్రహించుకొన్నాడు.

"ప్రయాణికులు అంతగా లేరు అని అనకండి... బస్సు వచ్చిందంటే జనం వచ్చేది ఖాయం... గుర్రంను చూస్తే స్వారీ చేయాలి అనే సామెత ఉంది కదా! నేనంటూ ప్రతిదినం ప్రయాణిస్తాను... మా వారసులు... కోడళ్ళు... కరణపోడు... పటేల్ జనం... ఇంకా మధ్యలో పది పల్లెలు ఉన్నవి కదా! అక్కడి జనం ఆస్పత్రికని వచ్చేటోళ్ళు... కోర్టుకు హాజరైయ్యేటోళ్ళు... పోలీస్ స్టేషన్‌కు తిరిగేటోళ్ళు... జనం వస్తారయ్యా... ఉదయంవేళ ఒకసారి, సాయంకాలం ఒకసారి బస్సును తిప్పండి. మీరు బస్సును త్రిప్పి చూడండి. ఒకవేళ నష్టం వస్తే ఆ తర్వాత పునఃసమీక్ష చేసుకోవచ్చు..." అంతటిని ఉగ్గబట్టి చెప్పి ముగించారు దొర.

"చూద్దాం... దొరగారు" అన్నాడు మేనేజర్.

"పర్మిషన్‌కు అర్జీ పెట్టాలి. దారి ఎట్లా ఉందో చూడాలి. కొత్త మార్గం అంటే కొత్త బస్సునే నడిపించాలి... వేరే సర్వీసోళ్ళు ముున్ముందు పై పోటీకి వస్తారు. ట్రై చేద్దాం"

"చూద్దాం... చేద్దాం... అనొద్దు. మనసు పెట్టండి... కావాలంటే సర్కారుకు నేనూ చెపుతానులే..." అన్నారు దొర.

మేనేజర్ ఆఫీసు ద్వారం వరకూ వచ్చి దొరకు వీడ్కోలు చెప్పాడు.

దొరకు దానిని ఆపాటికే వదిలేందుకు మనసొప్పలేదు.

సాగరంకు వచ్చిన ఆయన వకీలైన జోయిసగార్ని, హోటల్ కిట్టప్పను, బెల్లం అంగడి శేషప్పను, బట్టల అంగడి దుర్గోజిని, రైస్‌మిల్ గోవిందప్పను కలిసి ఈ విషయం మీద చర్చించసాగాడు. అందరికీ తగిన సూచనలను ఇచ్చి దారిని బాగు చేయించేదానికని గ్రామ పంచాయితీకి మార్గ సూచనల్ని ఇవ్వసాగారు.

"మీరు ముందు బస్సును వేయండి" అని చెప్పిరావడం చేయసాగారు దొర.

బస్సంటే దాని అనుకూలతలు ఎన్ని విధాలుగా లాభమో ఆయనకు బాగా తెలుసు. కోడళ్ళు తాలూకా కేంద్రం నుంచి ఈ ఇంటికి రావటం జరిగింది. వాళ్ళకు

అప్పుడప్పుడు పేటకు వెళ్ళి వచ్చేది సర్వసామాన్యమే. సర్కారి ఆసుపత్రికి వైద్యానికని వెళ్ళేది, మనమ సంతానం చదువులకని పట్టణానికని పోయే జరూరత్ ఉందిలే. తనకూ తాలూకాఫీసు, కోర్టు, వకీలుతో పనులు చాలా ఉంటవిలే. అందుకని బస్సు సౌలభ్యం ఉంటే బాగుంటది అనేది ఆయనగారి ఆలోచన.

ఈ వయస్సులో ఎద్దులబండి ప్రయాణం ఇప్పుడు నప్పేది లేదు. వళ్ళంతా నెప్పులు, దఢేల్ దడేల్ అనే సద్దులతో చక్రాల ఘోష... ఎత్తు పల్లాలలో ప్రయాణిస్తుంటే ఒళ్ళంతా నుజ్జు, నుజ్జై ఒకరోజు ప్రయాణం చేస్తే మూడురోజులు అలుపుతో విశ్రాంతికి కారణమైయ్యేది.

ఒక బస్సు వస్తే అరగంటో లేక గంటో అట్లా వెళ్ళి ఇట్లా రావచ్చు. సుఖమే కదా మరి.

దొర ప్రయత్నం ఫలించింది.

ఒకరోజు దొర కంపెనీకి వెళ్ళినప్పుడు "దొరగారు... వచ్చే సోమవారం కాగోడుకు బస్సును నడుపుతాము" అన్నాడు మేనేజర్.

"ఓ...! నాకంటూ సంతోషం భలే అవుతుందిలే" అంటూ దొర మళ్ళా అడిగాడు.

"వచ్చే సోమవారమే కదా"

"ఔనండి. రేపు కొత్త బస్సు వస్తుంది మా సర్వీసుకు. సోమవారం మీ ఊరికి... మీరు అక్కడ చుట్టుపక్కల ఉండే పల్లెలకు విషయాన్ని తెలపండి" అన్నాడు మేనేజర్.

"బస్సు మా ఊరికి వచ్చేది మొదటిసారి కదా.... దానికి భారీగా స్వాగతం దొరుకుతది మా ఊరిలో...నేను మొదటిరోజు దానిలో కూర్చుని కాగోడుకు వెళ్తాను..." అంటూ సంబురపడ్తూ దొర బయల్దేరారు.

కాగోడుకు బస్సు వస్తదనే సమాచారం  కల్‌మనె, గిళిగారు, ఈచలకొప్ప, సణ్ణమనె, మలకుంఠ్లి, చౌడిబీడు, రోసవంతె, కోర్లికొప్ప, మాసూరు, హింభాగిలు, మల్లినమడుగు మొదలైన పల్లెలకూ ముట్టి జనం సంతోషంతో కుప్పిగెంతుల్ని వేసారు. సాగరంకు బస్సు వచ్చినా పల్లెల్లోని జనం సాగరంకు వెళ్ళేది లేనందువలన, ఈ పల్లెలోళ్ళు తమ ఊరి చెంతకే వచ్చే బస్సు గురించి ఆరా తీయసాగారు. అయితే ఇంతవరకూ బస్సును చూసిన భాగ్యం ఈ పల్లెజనంకు లేదు కదా!

బస్సు అనే అద్భుతం తమపల్లెల అంచుకు వస్తది అనేది ఒక రోమాంచనంగా మారింది. దీన్ని ఎక్కేదానికన్నా, దాన్ని చూచేదే ఒక సంభ్రమం అనేటట్లుగా జనం పల్లెల్నుంచి బయటకు రాసాగారు.

దొర ఇంటి ముందున్న దారికి మామిడాకుల తోరణాల్ని కట్టారు. అరటిపిలకల్ని తెచ్చి నిలిపారు. బస్సులో వచ్చే డ్రైవర్, కండక్టరు గార్లకు దొర ఇంటిలో జీడిపప్పుల

ఉప్మా, గసగసాల పాయసం మరియు చాయ్‌ను ఇప్పించే వ్యవస్థను ఏర్పాటుచేసారు. దొరగారి కొడుకులు, కోడళ్ళు, మనుమ సంతానం, పాలేర్లు తమకు కేటాయించిన సరైన జాగాలో కూర్చున్నారు.

పల్లెల జనం కంబళి, చాప, గడ్డి, ఆకుల్ని పరుచుకొని అక్కడక్కడ కూర్చున్నారు. తామే అందరికన్నా ముందే బస్సును చూసేందుకని కొంతమంది చెట్లను ఎక్కారు.

ఇంతకు మునుపే వేరెక్కడో బస్సును చూసినోళ్ళు, బస్సును ఇంతవరకూ చూడనోళ్ళకు బస్సును గురించి చెప్పే అవకాశాల్ని సద్వినియోగం చేసుకోసాగారు.

వెనకాల బొగ్గుల పొయ్యి

గాలి రావటానికి ఒక ఫంకా.

రబ్బరు మరియు గాలితో నింపిన చక్రాలు

చక్రదారి లాగ ఉండే డ్రైవర్

రైట్... రైట్ అని అరిచే కండక్టర్

ఆసన వ్యవస్థ.

ఎద్దులబండి కన్నా నూరురెట్లు వేగంగా చలించే దాని జోరు.

అంతటినీ వర్ణించి చెప్పసాగారు.

ఎంతో దూరం నుంచి బస్సునుంచి వచ్చే శబ్దం వినబడుతుంటే సాగరం దిక్కుకు ముఖాన్ని త్రిప్పుకొని కొంతమంది కూర్చున్నారు.

'వచ్చింది వచ్చింది' అని సంభ్రమాన్ని పుట్టించారు.

ఏదో సుడిగాలి దూరంగా మట్టి గోపురంను నిర్మించితే బస్సు వచ్చిందేమోనని కొంతమంది లేచి నిలబడి గడబిడను సృష్టించారు.

మూడు గంటలైంది... నాలుగు గంటలూ అయ్యింది.

పిల్లలు చాపలమీద, కంబళ్ళమీద నిద్రకు జారారు.

"పడుకో... బస్సు వస్తే ఎమ్మటే లేపుతాను..." అని తల్లులు జోలపాడారు తమ తమ పిల్లలకు.

యువకులు అసహనంతో ఉన్న తమ భాగస్వాములకు సమాధానం చెపుతున్నారు.

"వస్తదో... రాదో..." అనటం చేయసాగారు ఇంకొందరు.

"వచ్చేది ఖాయమేలే... దొరగారే వెళ్ళారు గదా!"

దొర కోడళ్ళు బస్సుకు హారతి ఇవ్వటానికని హారతి పళ్ళెంతో సిద్ధమై నిలబడి యున్నారు.

'కాగోడుకు బస్సు వచ్చిందంటే కాగోడూ పేట లాగానే ఉంటది కదా!' అనే మాటలు ఎవర్నుంచో వినబడసాగాయి.

"ఔనయ్యా...ఇంకా హోటలూ వస్తది. సినిమాహాలు వస్తది... పేటలో ఏమేమి ఉంటవో అవన్నీ మన కాగోడుకూ వస్తవిలే" అన్నారు ఇంకెవరో.

"రానీ... రానీ... బస్సు పేటలోని జనంకు మాత్రమేనా" ఎవడో అనసాగాడు.

"మొదలు రానీయండి... బస్సును ఎక్కటానికి జేబులో కాసులున్నవేమో చూడు తమ్ముడూ... మేమైతే ఉత్తిగనే బస్సును చూసేటోళ్ళమే సుమా... ఎక్కేందుకు అర్హత లేనోళ్ళము" అనే మాటా వినబడింది.

ఇట్లా నానారకాల మాటల నడుమ దఢేల్ దఢేల్ అంటూ గుంతలలో దిగి, ఎక్కుతూ, ఫోం ఫోం హారన్ చేస్తూ, యమ ధూళును రేపుతూ బస్సు రానే వచ్చింది.

జనం గడబిడతో లేచి నిలబడ్డారు.

ముసలోళ్లు భయపడి కంగారుతో చెట్ల, పొదల వెనుకకు జేరారు. ఆడోళ్ళు పిల్లల్ని తమ చంకలలోకి తీసుకొని భద్రంగా అదుముకున్నారు. పత్నులు తమ మొగుళ్ళ వెనుకకు చేరుకొన్నారు. యువతి యువకులు ధైర్యంతో ముందుకు చొచ్చుకొచ్చారు.

కిర్‌మంటూ కీచునాదాన్ని చేసి బస్సు రథవీధిలో నిలిచింది.

మొదటి సీటులో కూర్చున్న దొర డోర్‌ను తెరుచుకొని క్రిందకు దిగి, కుస్తీలో గెలిచిన మల్లయోధుడులాగ, తన గుబురుమీసాల మీద చేతిని పెట్టి అక్కడ నిలబడినోళ్ళ ముఖాల్ని చూసారు.

జనం 'హో... హో...' అంటూ జయఘోషను పెట్టారు.

వెనుక సీటు నుంచి మొదటిగా సర్కారి నర్సమ్మ అలివేలు దిగి తన తెల్లటి చీరను సవరించుకొంటూ కిసుక్కున నవ్వింది. ఆమె వెనుకే ఫారెస్ట్ గార్డ్ మొహిద్దీన్ మూడో భార్య అయిన ఫాతిమాబి దిగింది. వారికీ జనం ఓఓ అంటూ చప్పట్లతో స్వాగతాన్ని చెప్పారు.

రెండో సీటునుంచి కరణంగారు భూకాగితాల కట్టల మూటతో దిగారు. వారికి జతగా వారి కుమారుడు మరియూ కాగుడుకే చెందిన రామాభట్టరు, దుర్గాభట్టరు క్రిందకు దిగారు. అప్పుడూ జనం నుంచి కేకలు, నవ్వులూ, ఈలలు, చప్పట్లు కురిసాయి.

కండక్టరు దిగి నిలబడ్డాడు. ధూళు, దుమ్ముతో నిండిన తన సమవస్త్రాన్ని దులుపుకోసాగాడు.

మళ్ళా ఎవరు దిగుతారో బస్సు నుంచి?

బస్సు వెనుకనున్న డోర్ వైపుకు దృష్టిని పెట్టారు ఊరిజనం.

లోనెవరో ఉన్నారని అన్పించింది జనానికి.

ఎవరు? ఎవరు?

మొదలు ఒక కంబళి బయటకు వచ్చింది. కంబళి వెనుక నుంచి హొంకేరి తిమ్మప్ప దేహాన్ని ముడుచుకొని చెట్ల పొదల వెనుక దాగేందుకని అతను అటు ఇటు చూసాడు.

దొర చూడనే చూసాడు.

"ఎవడ్రా అది భాంచోధ్ నా కొడుకు... పట్టుకోండి ఆ లంజాకొడుకును" అని గర్జించాడు.

బస్సును చూద్దామనే ఆత్రంతో తిమ్మప్ప బస్సు అక్కడికి  వచ్చినప్పుడు దారి అంచున నిలబడ్డాడు.

"వస్తావా... వస్తే ఎక్కు" అన్నాడు కండక్టర్ తిమ్మతో.

తిమ్మ మరో ఉపాయం లేక బస్సును ఆ వైపునుంచి ఎక్కాడు.

దొరకున్న జీతగాళ్ళలో తిమ్మడూ ఒకడిగా ఉన్నాడు. దొర ముందు ఇట్లాగున ఇట్లాగున నడుచుకోవాలి అనే నియమనిబంధనలు ఉండేవి. చెప్పులు వేసుకోకూడదు. బారుపంచె కట్టుకోకూడదు. బండిమీద కూర్చోకూడదు మొదలైన నియమాలు ఉండేవి. అయితే తిమ్మడు దొర ఎక్కిన బస్సును ఎక్కాడు కదా! ఈ భయంతో తిమ్మ ఒక్క గెంతుతో బస్సునుంచి దూకి పారిపోయేటందుకు ప్రయత్నించాడు.

అయితే దొరకు పెద్ద పాలేరైన సిద్ధయ్య గబక్కనే పరిగెత్తికెళ్ళి తిమ్మను పట్టుకున్నాడు.

"వేయండి నాలుగు వేట్లు... లంజాకొడుక్కి" అన్నాడు దొర.

దొరగారి కోడళ్ళు బస్సుకు హారతిని ఇస్తుంటే, తిమ్మ దెబ్బల్ని తింటూ విలవిల లాడాడు.

మరొకసారి నవ్వాడు తిమ్మప్ప తాత.

"ఇప్పుడు కాలం మారిందిలే... బస్సులో ఎవరైనా ప్రయాణించొచ్చులే..."

"అవునవును" అన్నాడు ఈరభద్ర.

కిట్టప్ప హొటల్ ముందు దుర్గాంబ సర్వీస్ బస్సు వచ్చి నిలబడి హారన్‌ను కొడ్తుంది.

**మూలకథ రచనాకాలం : 2006**